శ్రీ మాలోల గ్రంథమాల

ఆరవ పుష్పము



శ్రీమద్వేదాంత దేశిక ప్రణీత

పాదుకా సహస్రమ్



శ్రీ కె.వి. రాఘవాచార్య విరచిత

రమణీయాంధ్ర టీకా తాత్పర్య వ్యాఖ్యా సహితము

సంపుటము - 2

VOLUME - 2

శ్రీ శ్రైనమః

శ్రీవేదాంత దేశిక ప్రణీత

శ్రీ రంగనాథ

పాదుకా సహస్రమ్

శ్రీ కె.వి. రాఘవాచార్య విరచిత

రమణీయాంధ్ర టీకా తాత్పర్య వ్యాఖ్యా సహితము

రెండవ సంపుటము

ప్రచురణ

శ్రీ మాలోల గ్రంథమాల

శ్రీ అహోబిలమఠం, హైదరాబాదు.

శ్రీ వేదాంత దేశిక ప్రణీత
శ్రీరంగనాథ
పాదుకాసహస్రమ్
శ్రీ కె.వి. రాఘవాచార్య విరచిత
రమణీయాంధ్ర టీకా తాత్పర్య వ్యాఖ్యా సహితము
(తెలుగు మరియు నాగరలిపిలో మూలము)

రెండవ సంపుటము

ప్రథమ ముద్రణ 1998

ప్రతులు 1000

ప్రచురణకర్తలు
శ్రీ మాలోల గ్రంథమాల
శ్రీ అహోబిల మఠం, హైదరాబాదు

వెల : రు.100/-

ప్రాప్తిస్థానము
శ్రీ మాలోల గ్రంథమాల
శ్రీ అహోబిల మఠం,
దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ
హైదరాబాదు - 500 013.

లేజర్ కంపోజింగ్
చారీ అండ్ కంపెనీ, చార్లెస్ స్ట్రీట్,
సికింద్రాబాదు.
ముద్రణ
సరస్వతీ ఆఫ్‌సెట్ ప్రింటర్స్
నల్లకుంట, హైదరాబాద్ - 500 044
ఫోన్ : 7612180

Sri Vedanta Desika's
Sri Ranganatha
Paduka Sahasram
with
Telugu Commentary
by
Sri K.V. Raghavacharla
(with Text in Telugu and
Devanagari Scripts)

Vol. 2

First Edition 1998

1000 Copies

Published by
Sri Malola Granthamala
Sri Ahobila Muth
Hyderahad

Price : Rs.100/-

Copies available at

SRI MALOLA GRANTHAMALA
Sri Ahobila Muth
Durgabai Desmukh Colony
Hyderabad - 500 013.
Tel : 7612043
7614110

Laser Composing by
Chary & Company, Charles Street,
Secunderabad.

Printed at
Saraswathi Offset Printers
Nallakunta, Hyderabad - 500 044.
Phone : 7612180

ముందుమాట

శ్రీ అహోబిలమఠం 44వ పట్టమున వేంచేసియుండిన శ్రీ శ్రీవణ్ శఠకోప శ్రీవేదాంతదేశిక యతీన్ద్ర మహాదేశికులవారి మంగళాశాసనముచే 'శ్రీమాలోల గ్రంథమాల' స్థాపించబడినది. దాని పక్షాన ఇప్పటికి 5 గ్రంథములు ప్రచురించబడినవి. వీటిలో శ్రీనిగమాంత మహాదేశికులవారి వ్యాఖ్యానసహిత గ్రంథములు 3 - శ్రీ కామాసికాష్టకము, శ్రీ గరుడ దండకము, శ్రీ పాదుకా సహస్రము మొదటి సంపుటము. ఇప్పుడు దేశికులవారి నాలుగవ ప్రచురణ అయిన 'శ్రీ పాదుకా సహస్రమ్' రెండవ సంపుటము శ్రీ వైష్ణవ సంప్రదాయ నిరతులకు అందజేయగల్గుతున్నందులకు సంతోషిస్తున్నాము.

శ్రీ దేశికులవారి గ్రంథ సముదాయములో పరిమాణమునందును, గుణమునందును తలమానికమైన శ్రీ పాదుకాసహస్రం గత 700 సంవత్సరాలుగా తెలుగు వ్యాఖ్యానమునకు నోచుకోలేదు. విద్వన్మణులైన శ్రీమాన్ కె.వి. రాఘవాచార్యులవారు విశేష శ్రమవహించి, తెలుగు వ్యాఖ్యానమును రచించే సత్కృతికి పూనుకొని, దానిని ప్రచురించే భాగ్యము మాకు కల్పించినందులకు శ్రీవైష్ణవ జగత్తు వారికి ఋణపడి ఉంటుంది.

శ్రీ పాదుకా సహస్రమ్ మొదటి సంపుటమును శ్రీ అహోబిల మఠం 45వ పీఠాధిపతులైన శ్రీ శ్రీవణ్ శఠకోప శ్రీనారాయణ యతీన్ద్ర మహాదేశికులవారి కరకమలములచే 18.2.1996 నాడు శ్రీ అహోబిలమఠం హైదరాబాదులో ఆవిష్కరింపబడినది. ప్రస్తుతం 240 శ్లోకములు, 8 పద్ధతులు కల శ్రీ పాదుకా సహస్రమ్ రెండవ సంపుటమునకు కూడా మంగళాశాసనమును అనుగ్రహించి, తమ కరకమలములతో ఆవిష్కరించి మమ్ము కృతార్థులను చేసినందుకు శ్రీవారికి పాదాభివందనములు సమర్పించుకొంటున్నాము. శ్రీ కె.వి. రాఘవాచార్యులవారి రమణీయాంధ్ర టీకా, తాత్పర్య వ్యాఖ్యానసహితముగా శ్రీ మాలోలుని అనుగ్రహముచే వినమ్ర ప్రణామములతో పాఠకలోకానికి అందజేస్తున్నాము. ఈ విధముగా ఈ రెండు సంపుటములలో 380 శ్లోకములుగల 13 పద్ధతులు ముద్రితములు.

సభలలో శాస్త్రప్రమాణములకై శ్రీ దేశికులవారి సూక్తులను ఉదాహరించక ఉపన్యాసమే చేయని, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ పండితేంద్రులు, శాబ్దిక కేసరి బిరుదాంచితులు, శ్రీమదుభయ వేదాంత ప్రవక్తలు శ్రీమాన్ న.చ. రఘునాథాచార్యస్వామి వారు మాప్రార్థనను మన్నించి, గ్రంథమును సాంతము అద్భుతముగా పరిశీలించి, కవి ప్రతిభా పాటవమును, కావ్య రచనా సందర్భాది విశేష ప్రామాణికతతో రచించిన పీఠిక - పాదుకాసహస్ర ప్రభావము - మొదటి సంపుటములోనే ముద్రింపదగినదైనను, ఆలస్యముగా అందినందున ఈ రెండవ సంపుటములో ముద్రించుచున్నాము. శ్రీమాన్ రఘునాథాచార్యస్వామివారికి సప్రశ్రయ ప్రణామ పూర్వకముగా కృతజ్ఞతల నర్పించుకొంటున్నాము.

పాదుకాసహస్రమ్ మొదటి సంపుటమును, ఈ రెండవ సంపుటమును ముద్రించుటలో విశేష భక్తిశ్రద్ధలు చూపిన శ్రీమాన్ కె. రంగనాథన్ గారికి మాకృతజ్ఞతలు. అళగియశింగరగు శ్రీలక్ష్మీనృసింహస్వామి, ఆస్వామి ప్రధాన అర్చకులై "అళగియశింగరు"గా ప్రస్తుతింపబడే ఆచార్యులు వారిని నిరంతరం అనుగ్రహింతురుగాక అని ప్రార్థించుచున్నాము.

ఈ సంపుటము ప్రచురణకు ఉదార విరాళములు ఇచ్చిన దాతలు సర్వ శ్రీ :

శ్రీ యన్. రాధాకృష్ణారెడ్డి, శ్రీ కె.వి.వి.యస్.యస్. కృష్ణమూర్తి, శ్రీ సి.కె. రావు, శ్రీ యస్. రామచంద్రరావు, శ్రీ కె. వరదరాజన్,

శ్రీ యస్. అరవిందరెడ్డి, ఐ.టి.సి. భద్రాచలం పేపరు బోర్డ్స్ లిమిటెడ్–గారలకు మా కృతజ్ఞతలు

ఈ పుస్తకమును అక్షరకూర్పు గావించిన చారీ అండ్ కంపెనీ యజమానులకు, అందముగా ముద్రించి ఇచ్చిన సరస్వతీ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ సిస్టమ్స్ ప్రై.లి., వారికి, ముఖచిత్రమును గీసి ఇచ్చిన కళాకారుడు శ్రీ జి. శివరామ్‌కు, ఈ గ్రంథముద్రణమునకు అన్ని విధముల సహకరించిన శ్రీ అహోబిల మఠంప్రసిడెంట్ శ్రీమాన్ వి.యస్. రాఘవాచార్యులకు, మేనేజరు పి. శ్రీనివాసాచార్యులకు మా అభినందనలు


ఈ ఉద్గ్రంథము ఇంకా మూడు సంపుటములుగా వెలువడవలసి యున్నది. మూడవ సంపుటము ముద్రణకు సిద్ధముగా ఉన్నది. దానికి కనీసము ఒక లక్ష రూపాయలు కావలసియుండును. భక్తులు ఈ ముద్రణకు ఉదారసహాయము నందచేసిన కృతజ్ఞులము కాగలము.

శ్రీ అహోబిల మఠం,
2-2-20/బి, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కాలనీ,
హైదరాబాదు - 500 013.

శ్రీ మాలోల గ్రంథమాల
సంచాలకుడు : వి.పి. రాఘవాచార్యులు

ఈ రెండవ సంపుటములో పుట





॥ श्रीः॥

श्रीमते श्रीलक्ष्मी नृसिंहपरब्रह्मणे नमः

श्रीमते रामानुजाय नमः

श्रीमते वेदान्तगुरवे नमः

श्रीमते श्रीलक्ष्मी नृसिंह दिव्यपादुका सेवक

श्रीवण् शठकोप श्रीनारायण यतीन्द्र महादेशिकाय नमः

सर्वलोकोज्जीवनार्थम् अवतीर्णैः श्रीमन्निगमान्त महादेशिकैः बहवः ग्रन्थाः अनुगृहीताः । येषु एकैकोपि अनुसन्धीयमानः इह भोगाय, प्रेत्य मोक्षायचालं भवेत् इति महान्तः उद्घोषयन्ति । तेषु च पादुकासहस्राभिधो ग्रन्थः अत्युत्तमः श्रीभगवद्रामानुज सिध्दान्तासाधारणं भागवतशेषत्वं प्रतिपादयन् स्वानुसन्दातृन् श्रीभगवदामानुज सिद्धान्त सारवेदिनः करोतीति सुधियां सार्वभौमाः वदन्ति ॥

सेयं ग्रन्थतल्लजः बहुभिः बह्वीषु भाषासु व्याख्यातः लोकानामनुत्तमं उपकारं आतनोति । परन्तु आन्ध्रभाषायां व्याख्याकरणाय श्री.उवे.के.वि. राघवाचार्या : इति प्रसिद्द विद्वांसं प्रार्थयामासु : । तेनच अतिसरलया आतिरुचिरयाच व्याखयां कृत्वा द्वितीयोभाग : इदानीं प्रकाशयितुं विराजते ।

एवमेतद्द्वारा इतोऽप्यधिकाः लोकोपकारकाः ग्रन्थाः व्याख्येयाः बहवः सन्ति । तानपि व्याख्याय प्रकाश्यं प्रापयन्तु इति भगवन्तं मालोलं संप्रार्थ्याशासते श्रीगुरुसार्वभौमाः । इयं श्रीमालोलग्रन्थमाल अनितरसाध्यं साधयतीति नितरां प्रशंसा अर्हति ॥

इति

श्रीनियमनानुसारेण विज्ञापयिता

श्रीसन्निधिश्रीकार्यम् तैय्यार् वंगीपुरम्

श्रीरङ्गराजाचार्यः

न्यायवेदान्तशिरोमणिः ॥

श्रीमदहोबिलमठम्

(मुखाम) द्वारका.

05.02.1998

పాదుకా సహస్ర ప్రభావము

సర్వతంత్రస్వతంత్రులు, కవితార్కిక కేసరి, వేదాంతాచార్యులు ఇత్యాది అన్వర్థ బిరుదభూషితులైన శ్రీ వేంకటనాథాచార్యులవారిని(వేదాంతదేశికులను) ఎరుంగని వారు సంస్కృత వాఙ్మయవేత్తలలో ఉండరు అని చెప్పుట అతిశయోక్తికాజాలదు. భగవద్రామానుజుల పిదప ·అవతరించిన శ్రీ వైష్ణవ సిద్ధాంత ప్రవర్తకులైన ఆచార్యులలో జ్ఞానానుష్ఠానములను బట్టి, వైరాగ్య సంపత్తిని బట్టి తిరిగి రామానుజులవంటి ప్రాధాన్యము నాక్రమించినవారు వీరొక్కరే యనుట అతివాస్తవము. శతాధిక గ్రంథకర్తలుగా ప్రసిద్ధిగాంచిన వీరి రచనలు శాస్త్రవాఙ్మయమందును, ద్రవిడ సంప్రదాయ వాఙ్మయమందును, సంస్కృత సాహిత్య వాఙ్మయమందును విస్తరించియున్నవి. శాస్త్ర వాఙ్మయములో కొన్ని శ్రీభాష్య గీతా భాష్యాదులపై వ్యాఖ్యాన రూపములు కాగా, మరికొన్ని స్వతంత్రముగా సిద్ధాంత ప్రతిపాదకములైనవి. ఇంక కొన్ని పరసిద్ధాంత ఖండన రూపములైన వాదగ్రంథములు. ఇక సంప్రదాయ విభాగమున ఆళ్వారుల ప్రబంధములవలె కొన్ని ఛందోబద్ధములైన ప్రబంధములు కాగా మరికొన్ని మణి ప్రవాళ భాషలో వాక్యరూపమున కొనసాగిన సంప్రదాయ రహస్య ప్రతిపాదికములైన ప్రబంధములు. సంస్కృత సాహిత్య వాఙ్మయమున ఆలంకారిక శిఖామణియగు అప్పయ్యదీక్షితులచేత వ్యాఖ్యానింపబడిన యాదవాభ్యుదయ మహాకావ్యము, హంససందేశము అనుఖండకావ్యము, సుభాషితనీవి అనబడు ముక్తక శ్లోక గ్రంథము. కృష్ణమిశ్రుని ప్రబోధ చంద్రోదయ నాటకమునకు ప్రతిభటముగా రచింపబడినట్టి పది అంకముల సంకల్ప సూర్యోదయ మహానాటకము వీరి కవితాప్రసక్తిని చాటించు ఉత్తమరచనలు. సంస్కృత స్తోత్రవాఙ్మయమున గూడ దయాశతకము, ప్రాకృత భాషలో అచ్యుతశతకము, యతిరాజసప్తతి, అభీతిస్తవము, రఘువీరగద్యము మొదలైనవి అసంఖ్యాకములు కలవు. ఈ స్తోత్రవాఙ్మయమునందే ప్రాధాన్యమును వహించినది పాదుకాసహస్రము. వర్ణనా వైచిత్రిగల సాహిత్య వాఙ్మయమునందువలె తర్కజటిల శాస్త్రవాఙ్మయమునందు గూడ ఛందోబద్ధమైన రచనను నిరర్గళముగా కొనసాగించుట వీరి ప్రత్యేకత. స్రగ్ధరావృత్తములో కొనసాగిన తత్త్వముక్తాకలాపము, అధికరణసారావళియు ఒక్కొకటి ఐదువందలకు తక్కువగాని శ్లోకములు గలిగియుండుటయే ఇందుకు నిదర్శనము. న్యాయపరిశుద్ధి, సేశ్వర మీమాంస అను మహాగ్రంథములు న్యాయ మీమాంసాశాస్త్రములలో వీరికి గల అఖండ పాండిత్యమునకు నిదర్శనములు. వేద భాష్యకర్తయగు విద్యారణ్యుల వారికి సమకాలికులైన వీరి ప్రతిభావిశేషము ఆవిద్యారణ్యులవారి చేతనే సంభావితమగుటను బట్టి వీరి ప్రతిభావైభవము అనితర సాధారణమైనది అని గ్రహింపవచ్చును. తమ పరిపూర్ణ జీవితమున ప్రతిక్షణమును గూడ శిష్యజనోద్ధరణమునకును సిద్ధాంతప్రచారమునకును ఉపయోగించు అధ్యాత్మ విద్యాప్రవచనములతోను, సద్గ్రంథరచనములతోను, భగవద్భాగవతారాధన రూప నిత్యానుష్ఠాన నిష్ఠతోను గడిపినవీరి ఆచార్యత్వము సర్వలక్షణోపేతమై కృతార్థమైనది.

ఈ మహాచార్యుల అవతారకాలవిశేషము సమకాలీన మహాచార్యులతో కొనసాగిన జీవితోదంతవిశేషము సుప్రసిద్ధమైనందున దానినిచట వివరింపనవసరములేదు. కాని వారి సద్గుణ వైభవము నెరిగించు ఒక శ్లోకమును మాత్రము ఇచట వివరింతుము.

శ్లో॥ సన్మాననా యస్యహి కాలకూటః – సభా భుజంగీ కుణపం తరుణ్యః
స్యాద్రౌరవం రాజగృహమ్ సజీయాత్ – చిరంగురుర్వేంకట నాథనామా ॥

ఈ శ్లోకము వారి జ్ఞానవైరాగ్యములకు, ఆనృశంస్యమునకును అద్దము పట్టును. వారి దృష్టిలో సన్మానము కాలకూట విషమువంటిది. వాదనసభ నల్లత్రాచువంటిది. స్త్రీలు శవమువంటివారు. రాజసభ రౌరవనరకము వంటిది. అట్టి వేకంటనాథాచార్యులకు చిరకాలము మంగళమగుగాక ! అని ఈ శ్లోకమునకర్థము. దీని భావమేమనగా !

1. (సన్మాననాయస్యహికాలకూటః) కాలకూటవిషము అతిభయంకరమైనది. స్పర్శమాత్రముచేతనే ఇతర పదార్థములకు స్వరూపనాశనమును కలిగించునట్టిది. ఈ ఆచార్యులవారికి ఎవరైన సన్మానమును చేయుదమన్నచో అట్టి సన్మానమును వీరు కాలకూట విషమువలె ఆత్మ వినాశక హేతువని భావించి తిరస్కరించెడి వారట. కీర్తికాంక్షతో సన్మానములనపేక్షించుట బ్రాహ్మణోత్తమునికి తగదని ఈ క్రింది మనుస్మృతి శ్లోకము చెప్పుచున్నది.

శ్లో॥ సన్మాననాత్ ద్విజో నిత్యం ఉద్విజేత విషాదివ ।

బ్రాహ్మణుడు సన్మానమన్నచో విషమువంటిదని భావించి భయముతో త్యజించవలెనన్నమాట. సన్మాననాదులు అహంకారవృద్ధికి కారణములుగావున ఆ విధముగా ఇతరులనవమానించుటకు హేతువులగుటచే, ఆత్మ స్వరూప వినాశహేతువులు గనుక త్యాజ్యములని వారి యభిప్రాయము.

2. (సభాభుజంగీ) నలుగురు పండితులు కూడియుండు సభయన్నచో దానిని వీరు నల్లత్రాచును చూచి భయపడినట్లు భావించి దూరముగా పోవువారట. ఇచట సభయనగా – పరస్పర జిగీషతో వాద ప్రతివాదములను చేయు పండితకూటము అని యర్థము. అట్టి సభల జోలికే వీరు పోవువారుకారు. వాదింప లేకనా? పాండిత్యములేకనా? సభలను చూచి వీరెందులకు భయపడుట? అని కొందరికి అనుమానము కలుగవచ్చును. సర్వతంత్ర స్వతంత్రులైన వీరికి వాదమునందు పరాజయము కలుగునేమోనన్న భయము అణుమాత్రమును లేదు. కాని – వాదమందు ఇతర పండితులను ఓడించినపుడు బ్రాహ్మణులైన ఆ శాస్త్రవేత్తలు పరాజితులై అవమానముపాలగుట తథ్యము. అట్లు సభలో ఒకపండితునికి అవమానము కలిగించుట ప్రబల పాపహేతువని శాస్త్రము చెప్పుచున్నది.

శ్లో॥ విప్రంహుంకృత్యతుంకృత్య వాదే నిర్జిత్య దూరతః
శ్మశానే జాయతే వృక్షః కంకగృధ్రాది సేవితః ॥

ఈ శ్లోకమునుబట్టి వాదమునందు ఒక పండితుని ఓడించి అవమానించుట ఘోరపాపమనియు, అట్లు చేసినవాడు శ్మశానములో గ్రద్దలకు రాబందులకు ఆశ్రయమగు వృక్షమై పుట్టుననియు చెప్పబడియున్నది. ఈ దృష్టితోనే ఈ ఆచార్యులవారు వాదసభలను చూచి భయపడుచుండెడివారు, అని భావింపవలెను. జిగీషతో గాక జిజ్ఞాసతో వచ్చి ఎంతమంది ఎన్ని ప్రశ్నలను అడిగినను వారికి శాస్త్రమర్మములను చెప్పుచుండెడివారు. శ్రీరాముని గురించి రామాయణమున **"ఉత్తరోత్తరయుక్తౌ చ వక్తావాచస్పతిర్యథా"** అని వాల్మీకి చెప్పినట్లు ఏదైననొక శాస్త్రవిషయమున పూర్వపక్ష సిద్ధాంత రూపమున ప్రతిభతో యుక్తి ప్రయుక్తులను పైపైన కల్పించి చెప్పుటలో బృహస్పతివంటి ప్రజ్ఞావిశేషమువీరిది. కనుక వాదమునందు పరాజయ ప్రశ్నయే లేదు. బాల్యమందు వీరు హయగ్రీవస్తోత్రమున **"విశేషవిత్ పారిషదేషు"** అను శ్లోకము చెప్పుకున్నట్లు కేసరికి శోరమై స్వచ్ఛంద వాదాహవబద్ధశూరులై విజృంభించిననూ వయఃపరిపాక దశలో వీరు అట్టి సభా ప్రవేశములను సుదూరముగా వర్జించినట్లు 'సభాభుజంగీ' అను ఈ వాక్యమును బట్టి తెలియుచున్నది.

3. (కుణపం తరుణ్యాః) యౌవనము కలిగి సౌందర్యవతులైన స్త్రీలను చూచినపుడు అస్పృశ్యమైన శవమును చూచినట్లు అసహ్యాభావముతో వీరు ఏవగించుకొనెడివారు అనుటను బట్టి వీరి వైరాగ్యమెంతదృఢమైనదో గ్రహింపదగును.

4. (స్యాత్ రౌరవమ్ రాజగృహం) కటిక దారిద్ర్యము ననుభవించుచున్నను సరే ధనసంపాదనకై రాజగృహ ప్రాంగణమున అడుగుపెట్టుట వీరికి ఇష్టముకాలేదు. అది రౌరవనరక ప్రవేశమువంటిది అని ఎంచిరి. అంతేకాని ఒక ధనమదాంధుని ముఖమును చూచుటకుగాని, వాని వద్దచేయి జాచుటకుగాని వీరు ఎప్పుడును ఇచ్ఛగించలేదు. తమ ఈ అయాచితవ్రతమును న్యాసతిలకములోని -

శ్లో॥ దాస్యం లాస్యవతానుమత్య మనసా రంగేశ్వర! త్వత్పదే
నిత్యం కింకరవాణ్యహం, నతుపునఃకుర్యాంకదర్యాశ్రయామ్॥
మీలచ్చక్షుషివేల్లిత భ్రుణి ముహుః దత్తావమానాక్షరే
భీమేకస్యచి దాఢ్యకస్యవదనే భిక్షా విలక్షాందృశమ్॥

అను శ్లోకమునందును, ఈ పాదుకాసహస్రములోనే **"శరణమధిగతస్త్వాం"** అను 965వ శ్లోకమునందును విస్పష్టముగా ప్రకటించుకొనియున్నారు. కనుకనే వీరు విద్యారణ్యులవారిచే సన్మానార్థమై రాజసభకు ఆహ్వానింపబడినప్పుడు దారిద్ర్యముచే కడుపు కాలుచున్ననూ క్షుద్ర బహుమానమున కంగీకరింపక తిరస్కరించిరి. గృహస్థులై యుండికూడ పరమ వైరాగ్య సంపన్నులైన వీరు ధనవిషయమున ఎంతోదూరముగ నుండవలసిన పీఠాధిపతులైన సన్యాసాశ్రమ నిష్ఠులను గురించి, అపారమగు వారి ధనాశను గురించియు సంకల్ప సూర్యోదయ నాటకమునందు :-

శ్లో॥ భిక్షేతి శిష్యజన రక్షణ దక్షిణేతి
శాటీతి శాశ్వత మలోపధి కల్పనేతి ।
గ్రంథోప సంగ్రహణ మూల్యమితి బ్రువాణాః
సన్యాసినోపి దధతే మహతీంధనాయామ్॥

అని నర్మగర్భముగా పరిహసించిరి. ఇట్టి ఆచార్యకులతిలకము అనదగిన వేదాంత దేశికులవారు రచించినదేఈ పాదుకా సహస్ర స్తోత్రము.

ప్రస్తుతము ఇచట మనకు వీరి రచనలలో అత్యుత్తమమైన ఈ పాదుకా సహస్ర స్తోత్రవైభవమే ఆస్వాదనీయమైనది. వీరు చతుర్విధ కవితాధురీణులు అనుటకు ఈ ప్రబంధమొక ఉదాహరణము. వీరిచే ఉపాసితుడై నిత్యదైవముగా నుండిన విద్యాధిదేవతయగు హయగ్రీవమూర్తి శాస్త్రీయ ప్రసంగములయందుగాని, ప్రతిజ్ఞాపూర్వక కావ్యరచనా ప్రసంగములయందుగాని వీరికి అఖండ విజయమును ప్రసాదించెనని పెద్దలు ప్రశంసింతురు. ఇన్ని గంటలలో ఒకే విషయముపై భావపౌనరుక్త్యము లేకుండ నిర్దుష్టమైన పద్ధతిలో అద్భుతమైన గ్రంథమును వెయ్యిశ్లోకములతో రచింపవలెను అను కఠోర నియమ వ్యవస్థను పాటించి పాదుకాసహస్రమును రచించి అనాయాసముగా ప్రతిజ్ఞా మహార్ణవమును దాటి కృతార్థులగుటయు, ఇదే పద్ధతిలో కొన్ని వందల శ్లోకములు గల సంకల్ప సూర్యోదయమను మహానాటకమును పరిమిత సమయములోనే రచించి ప్రదర్శించుటయు అనితర సాధారణమైన వీరి మేధావిలాసమునకు తార్కాణము.

సంస్కృత స్తోత్రవాఙ్మయమున శతకరూపములైన స్తోత్రములు, పంచాశతీరూపమైన స్తోత్రములు అవిర్భవించినవిగాని సహస్రసంఖ్యారూపమున వెలువడిన స్తోత్రములలో ఇదే పాదుకాసహస్రము బహుశః మొదటిది కావచ్చును. లక్ష్మీ సహస్రము, ఉమాసహస్రము, దయాసహస్రము మొదలైన స్తోత్రములు ఆ ఒరవడిలో పిదప ఆవిర్భవించినవే. ఈ సహస్ర సంఖ్యాస్తుతి ద్రవిడ వాఙ్మయమునందు శఠకోపులు అనబడు నమ్మాళ్వారుల తిరువాయ్‌మొళి అను ప్రబంధమునందును పరకాలురు అనబడు తిరుమంగై ఆళ్వారులు ప్రసాదించిన పెరియ తిరుమొళి ప్రబంధమునందును కానవచ్చును. ఐతే ఈ ద్రవిడ సంస్కృత సహస్ర స్తోత్రములు అన్నియు యథావకాశముగా సమయనియమము లేకుండ పూరింపబడినవి కాగా ఈ పాదుకాసహస్రము నిర్ణీత సమయములోనే ఆశుధారగా అద్భుతముగా పూరింపబడుట దీని వైశిష్ట్యము.

ఈ స్తోత్రావతరణమునకు గల సందర్భము :-

వీరు తమ జన్మప్రాంతమైన కాంచీమండలమును వదలి శ్రీరంగమునందలి పరమ భాగవతోత్తములచే ఆహ్వానింపబడి ఆ దివ్యక్షేత్రముననే నిత్యనివాసము నేర్పరచుకొని వేంచేసియున్న సమయమున వీరి కవితావైభవమును వీరు రచించిన ఇతర సోత్రములను ఆస్వాదించిన పండితోత్తములు సగౌరవముగా శ్రీరంగనాథుని దివ్య పాదుకలను గూర్చి స్తోత్రమును రచింపుమని ప్రార్థింపగా వీరు దీనిని రచించినట్లు తెలియవచ్చుచున్నది. అపుడు ఆ క్షేత్రమునగల

మరికొందరు పండితకవులు కూడ వీరివలె స్తోత్రరచనకు ఉద్యమించియుందురు. శ్రీదేశికుల వారితో ఈవిషయమున పోటీపడు విధముగా ఆకవులలోఉత్కంఠ ఏర్పడియుండును. అందు ఇతరకవులు తమ స్తోత్రరచనకు రంగనాథుని పాదకమలములను విషయముగా స్వీకరింపగా ఈ వేదాంత దేశికులవారు శఠకోపరూపమైన రంగనాథపాదుకలను స్తోత్ర విషయముగా స్వీకరించిరి. శ్రీదేశికులకును ఇతరకవులకును ఏర్పడిన స్పర్థావిషయమున వీరి చరిత్రను గురించిన గ్రంథములలో భిన్నాభిప్రాయములు కనబడుచున్నవి.

'వేదాంతాచార్య విజయము అను చంపూకావ్యమున, ఆశుకవితాధురీణడగు ఒక కవి వచ్చి "కవితార్కిక సింహ" బిరుదముగల నీవు నాతో సమానముగా నిర్దుష్ట పద్యరచనా ధోరణిని ప్రదర్శింపగలవా?"అని అడిగినపుడు ఈ ఆచార్యులవారును సరేనని అంగీకరించి "సాయంకాలమున ఆరాధన సమయమందు శ్రీరంగమందిరమునకు వచ్చి చేరు పండితుల బృందము యొక్క సమక్షముననే మనమిద్దరమును వారి ఆదేశమునకు కట్టుబడి మన కవితా ప్రదర్శనము చేయుదము" అని చెప్పి ఆ ఆశుకవితోపాటు ఆలయమునకు వెళ్లిరి. అపుడు అచ్చటి పండితులు వీరిద్దరి అభిప్రాయము నెరిగి" ఈరాత్రి తెల్లవారుసరికి రంగనాథపాదుకా విషయమున ఎవరు వెయ్యి పద్యములుగల స్తోత్రమును రచించిసమర్పింతురో వారు 'కవివాది సింహ' బిరుదమునకు తగినవారుగా నిర్ణయింపబడుదురు. ఇది రంగనాథుని ఆదేశము" అని సెలవిచ్చిరి. పిదప వీరిద్దరును తమ తమ ఇండ్లకు చేరి రచనను సాగించిరి. మరుసటి ఉదయము ఈ ఆచార్యులవారు స్నానసంధ్యాదులను పూర్తిచేసుకొని శిష్యులతో కలసి శ్రీరంగమందిరమునకు వచ్చి పెద్దల ముంధర తమ పాదుకా సహస్రస్తోత్రమును వినిపించిరి. అపుడు ప్రతివాది యగుకవిగూడ అచటికే తెంచి పండితులచే ప్రశంసింపబడుచున్న వారి కవితావైభవమును తానుగూడ నాస్వాదించి గర్వరహితుడై వినయముతోను లజ్జతోను నమస్కరించి తాను రచించిన శ్లోకములు సహస్రసంఖ్యను చేరక కొద్ది మాత్రమైనందునను నీరసములైనందునను వాటిని ప్రకటించకుండనే, అజ్ఞానముచే కలిగిన తన అపరాధమును క్షమింపుమని వీరిని ప్రార్థించెను. ఇట్లు ఈ వేదాంతాచార్య విజయ చంపూగ్రంథమున, పోటీకి వచ్చిన ఆ ఆశుకవి యొక్క ఊరుగాని పేరుగాని ఏమియు తెలుపబడలేదు. ఆకవి ఎవడో 'కశ్చన' అన్నట్లు అనాదరముచే అతనిపేరు ఇందు ఉట్టంకింపబడి యుండక పోవచ్చును.

ఇట్లుండగా ఆంధ్రదేశమునందు శ్రీవైష్ణవసంప్రదాయ చరిత్రగ్రంథముగా ప్రసిద్ధినొందిన 'ఆచార్య సూక్తి ముక్తావళి' యను ప్రబంధమునందు చివరిదగు ఆరవ ఉల్లాసమునందు 195 వ పద్యము మొదలుకొని ఈ పాదుకా సహస్ర స్తోత్రావతార కథను ఏడెనిమిది పద్యములలోను ఒక గద్యములోను గ్రంథకర్తయగు నంబూరి కేశవాచార్యులు సంగ్రహముగా వివరించియున్నాడు. అందలి సారమిది :- జగదాచార్యులు అనగా లోకాచార్యులు అను నామధేయముగల గురువర్యుడు ఒకనాడు శ్రీరంగనాథ దేవాలయమున ఈ వేంకటనాథార్యగురుని చూచి మనమిద్దరమును శ్రీరంగనాథుని పాదపద్మవైభవమును వేయిశ్లోకములతో స్రగ్ధరాముఖ్యవృత్తగతిని చెప్పుదము రమ్మని ఆహ్వానించెను. అప్పుడు వెంకటనాధగురువర్యుడు "స్వామీ! దేవరవారు భగవత్పాదపద్మ ప్రభావమును గంభీర వృత్తములలో వర్ణింపుడు. ఈ

దాసుడు (అనగానేను) భగవత్పాదుకా ప్రభావమును గూర్చి ఈ రాత్రి వ్రాసెదను" అని విన్నవించెను. సరేనని లోకాచార్యులు తమ గృహమునకేగి ఏకాంతమున భగవత్పాద వైభవమును తెలుపు ఐదువందల పద్యములను తెల్లవారుసరికి రచించెను. ఇక ఈ వేంకటనాథ గురువర్యుడు తన ఇంటికి వచ్చి ప్రసాద స్వీకారానంతరము నిదురించెను. అపుడు శ్రీరంగనాథుడే తన ప్రధానార్చకుడగు కేశవ సూరి రూపమున వచ్చి నిదురించిన కవితార్కిక సింహుని తట్టిలేపి "ఊరక నిదురించుచుంటివేమి? పూర్వరాత్రిగడచి అపరరాత్రి వచ్చినది. నేను వ్రాసెదను. నీవు వెంటనే పాదుకాస్తుతిని వేయి పద్యములలో చెప్పుము" అని ప్రేరేపింపగా కవితార్కికకేసరియగు వేంకటనాథుడు మూడు ముక్కాలు ఘడియలో ఈ స్తోత్రము రచింపగా కేశవసూరి రూపమున వచ్చినరంగనాథుడు దానిని తాళపత్రములపై వ్రాసెను. ఉత్తరక్షణమున ఆకేశవ వర్యుడంతర్ధానమయ్యెను. అపుడు వేంకటనాథకవియే ఆశ్చర్యపడి రంగనాథుడే ఆస్వామి రూపమున వచ్చి వ్రాసెనని భావించి ఉషఃకాలమున బయలుదేరి కావేరిలో తీర్థమాడి అనుష్ఠానాదులను తీర్చుకొని వెంటనే లోకాచార్యుని వద్దకు వచ్చి సాష్టాంగ నమస్కారము చేసి వారికి తమ పాదుకాసహస్ర స్తోత్రమును సమగ్రముగా చూపి వినిపించెను. అపుడే లోకాచార్యుడు తమ స్తోత్రమును సగమే పూర్తిచేసినందులకు మనస్సున సంకోచము నొందెను. అపుడా జగదాచార్యుని మన స్సంకోచమును గుర్తించిన వేదాంతాచార్యుడు తానుస్తుతించిన భగవత్పాదుకలు శఠకోపనామమును కలిగియుండుట చేతను, శఠకోపనామముగల నమ్మాళ్వారులే భగవత్పాదుకా రూపమున ఆవిర్భవించినట్లు సంప్రదాయముండుట చేతను ఆ శఠకోపమునీంద్రుని దివ్యసహస్రగాథావైభవమును ఎరింగి వ్యాఖ్యానించు ఈ లోకాచార్యులు శాంతుడగు భాగవతోత్తముడుగనుక ఈయన మనస్సులోని సంకోచమును తొలగించెదనని ఎంచి సాష్టాంగముగా నమస్కరించెను. నమస్కరించుటయేగాక

శ్లో॥ సూతే సూకరయువతిః సుతశత మత్యంత దుర్భగం ఝటితి
కరిణీ చిరాయసూతే సకల మహీపాల లాలితం కలభమ్॥

అనుపద్యమును ఆశువుగా చెప్పి "మహాత్మా! అవిచారిత రమణీయమైన మదీయ పాదుకా సహస్రము మీరు రచించిన భగవత్పాదారవింద స్తుతిరూపమగు పంచశత శ్లోక ఘటితమైన రసవత్తర ప్రబంధముతో సాటియగునా?" అని సవినయముగా విన్నవించెను. అపుడు జగద్గురుండును ఈ వేంకటనాథకవీంద్రుని భాగవతనిష్ఠకు ఆశ్చర్యమంది సంతోషించి కౌగిలజేర్చుకొని "వత్సా! నీవు రామానుజ విజయధ్వజ భూతుండవై తత్సిద్ధాంతనిర్ధారణ సార్వభౌముండవై వేయి హాయనములుజీవింపు" మని మంగళాశాసనముచేసెను.

ఆచార్యసూక్తి ముక్తావళిలోగల ఈ కథా సందర్భమును బట్టి కవితా స్పర్థతో వచ్చిన ఆ రెండవకవి లోకాచార్యులని నామనిర్దేశమును బట్టి తెలియుచున్నది. వీరిద్దరిలో లోకాచార్యులు వయోవృద్ధులనియు వేదాంతాచార్యులు చిన్నవయసు వారనియు, లోకాచార్యులకు వేదాంతదేశికులు వినయపూర్వకముగా ప్రణామమునాచరించి విన్నవించుటను బట్టియు, వారు వీరికి మంగళాశాసనమును చేయుటను బట్టియు, వీరిద్దరి మధ్య జరిగిన ఈ స్పర్థలో ఇతర పండితుల

ప్రమేయమేమియును చెప్పకుండుటను బట్టియు పరస్పరము ఈ ఆచార్యద్వయమే ఉల్లాసముగా తమకవితావైభవమును పరీక్షించుకొనుటకై ఇట్లు ప్రవర్తించియుందురని గ్రహింపవలసి యున్నది. ఈ ఆంధ్ర ప్రబంధములో ఒకరుకేవలము భగవత్పాదకమలములనే స్తుతించుట మరియొకరు పాదుకలను స్తుతించుట అను విషయ భేదము చూపించబడినది. వాస్తవమునకు లోకాచార్యులకును వేదాంతదేశికుల వారికిని ఈ స్పర్ధ ఏర్పడినట్లు విశ్వసించుటకు కారణము కానరాదు. లోకాచార్యులవారు రచించినట్లు చెప్పబడు ఆ శ్రీ విష్ణుపాదకమల స్తుతి ఈనాడెచ్చటను కానరాదు. అంతేగాక ఆ లోకాచార్యులు అసలు సంస్కృతముననే శ్లోకరూపముననగాని వాక్యరూపమున గాని ఏ ఒక్క గ్రంథమును గూడ రచించినట్లు లేదు. ద్రవిడ భాషలో అష్టాదశరహస్యములు అను సూత్రప్రాయమగు గ్రంథములను రచించినట్లేయున్నది. ఇట్లు సంస్కృత భాషలో అసలే ఏ రచననుగూడ సాగింపని లోకాచార్యులు దేశికులతోపోటీ పడిరని చెప్పుట కల్పితకథయే గాని విశ్వసనీయముకాదు. ఈ ఆచార్యవర్యులిద్దరకును అనంతర కాలమందేర్పడిన శ్రీవైష్ణవ సంప్రదాయ శాఖాభేదమునకు చెందినవారు స్వాచార్యోత్కర్షను చెప్పుకొనుటకై లోకాచార్యులవారి ప్రస్తావనను ఈ కథలో ఇరికించి ప్రచారము చేసియుందురు. ఆ కథను కొంత నమ్మిన నంబూరికేశవాచార్యుడు తన ఆంధ్రకావ్యములో ఇరువురు ఆచార్యులకును గౌరవభంగము లేకుండునట్లు సవరించి ఈ కథను వ్రాసియుండును. కనుకనిది విశ్వసనీయము కాజాలదు. ఈ లోకాచార్యులుగాని వీరి తమ్ములైన అళహియ మణవాళప్పెరుమాళ్ నాయనార్ అనబడువారుగాని సంస్కృతమున అసలు ఏ గ్రంథమును గూడ రచించియుండలేదు. కనీసము ఒక శ్లోకము గూడ వీరి రచన యన్నట్లు ఎచ్చటను కానరాదు. వారు ద్రవిడ సంప్రదాయ ప్రబంధరచయితలు అనుట లోక ప్రసిద్ధము. వీరి సంప్రదాయ గ్రంథములలోను శ్రీ వేదాంత దేశికులవారి ద్రవిడ సంప్రదాయ గ్రంథములలోను కనబడు శాస్త్రప్రమాణ వాక్యములను గురించి అక్కడక్కడ ఏర్పడిన సమన్వయ భేదములను పురస్కరించుకొని అర్వాచీనులగు కొందరు ద్వేషవైషమ్యములను పెంచుకొని అభూతకల్పనలను చేయుట చరిత్రలో కానవచ్చును. సామరస్యమును సహనమును గూడ కోల్పోయి కల్పించిన ఇట్టి వార్తలను మనము ప్రక్కకునెట్టి ఈపాదుకా సహస్ర మందలి కొన్ని సూక్తులను వ్యాఖ్యానకర్తయగు భరద్వాజ శ్రీనివాసాచార్యులవారి కొన్ని వివరణ వాక్యములను అంతరంగ సాక్ష్యముగా గుర్తించి స్తోత్రావతరణ పరమార్థమును నిర్ణయింపవచ్చును.

ఈ స్తోత్రమునకు చివర వెయ్యి మూడవ శ్లోకమున స్పష్టముగా తమతోపాటు మరికొందరు భక్తిమంతులైన కవులు గూడ పాదుకాస్తోత్రమును చేసినట్లు వీరే చెప్పుచున్నారు. గుణగ్రహణ పారీణులైన ఆ పెద్దలు నాపై తమ ఆదరపూర్వకమైన కటాక్షములను ప్రసరింపజేయుదురు గాక! అని వినయపూర్వకముగా వీరిచే ప్రార్థింపబడుచున్నది. దీనిని బట్టి తమవలెనే పాదుకాస్తుతిని రచించిన ఆ పండితులపై వీరికి జిగీషారూపమైన స్పర్ధలేదనియు, వీరిచే తాను సాదరముగా ప్రశంసింపబడుటయే తమకు ప్రయోజనమనియు నిరూపింపబడినది ఆ శ్లోకమిది.

శ్లో॥ యేనామ భక్తినియతాః కవయో మదన్యే
మాతః! స్తువంతి మధు సూదన పాదుకే! త్వాం ।
లప్స్యే గుణాంశ వినివేశిత మానసానాం
తేషా మహం సబహు మాన విలోకితాని ॥

ఇట్లుండగా నాదపద్ధతిలో గల ఒక శ్లోకమున వీరు **"సయూథ్యకలహాయితం"** అని ప్రయోగించుటచేత ఈ స్తోత్రరత్నమందు ఇతరకవులతో వీరికి స్పర్ధ ఏర్పడినట్లు సూచితమగుచున్నది అని కొందరు చెప్పుదురు. కావచ్చును. కాని ఈ స్పర్ధ ఇతరకవి పరాజయము కొరకై న కలహము మాత్రము కాదని నిర్ణయింపదగును. ఈ స్పర్థలో అన్వయించిన ఆ ఇతర కవులను గూర్చి వీరే **"భక్తి నియతాః"** అని అనన్య భక్తులనుగా కీర్తించుటచేతను వారుగుణగ్రహణ పారీణులు అనుటచేతను వారి ప్రశంసలను తానపేక్షించుటచేతను ఇది ఇతర పరాజయ పర్యవసాయి కలహము వంటిదికాదని స్పష్టమై నది. ఇట్టి సయూథ్య కలహమును సూచించు ఆ శ్లోకము ఇపుడు గమనింపదగినది.

శ్లో॥ తవాంబ! కిలఖేలతాం గతివశేన గర్భాశ్మనాం
రమారమణపాదుకే! కిమపిమంజుభిఃశింజితైః
పదస్తుతి విధాయిభిః త్వదనుభావ సిద్ధాంతిభిః
సయూథ్య కలహాయితం శ్రుతి శతం సమాపద్యతే॥

నిజమునకు ఈ శ్లోకమున చెప్పబడిన స్పర్ధారూపమై న సయూథ్యకలహము కవులమధ్యన ఏర్పడినది కాదు. శ్రుతిశతమునకు అనగా వేదసముదాయమునకు పాదుకాగర్భిత వివిధ రత్న శింజారవములతో నేర్పడినది. రంగనాధుడు ఈపాదుకలతో సంచరించుచున్నపుడు ఏర్పడిన శ్రుతి మనోహరములై న రత్నశింజారవములు రంగనాథపాదుకా వై భవమును ఘోషించుచున్నట్లున్నవి. మధురములై న వేదశబ్దములు గూడ భగవత్పాద మహిమను ఘోషించుచున్నవి. పాదకమలవై భవమును పాదుకావై భవమునుప్రస్తుతించుటలో ఈ రెండును మేముగొప్ప, కాదు మేము గొప్ప అని కలహించుకొనుచున్నట్లున్నవి. ఒకరు కొన్ని యుక్తులతో ఒక విషయమున పూర్వపక్షమును చెప్పగా మరియొకరు అందులకు వ్యతిరేకయుక్తులను చూపి సిద్ధాంతమును ప్రతిపాదింతురు. అట్టి వాద ప్రతివాద ప్రక్రియ శ్రుతులకును ఈ పాదుకానాదములకును ఏర్పడినది అని ఈ అంశము ఇచట శ్రీ వేదాంత దేశికులవారిచే ఉత్ప్రేక్షారూపమున కల్పితమై నది. ఇదియే ఇచట ఉత్ప్రేక్షితమై న సయూథ్యకలహము.

ఇచట ప్రయోగింపబడిన సయూథ్య కలహ పదముచేతను, వెనుక ఉదాహరింపబడిన "యేనామభక్తినియతాః కవయో మదన్యే" అనుశ్లోకము చేతను ఈసహస్రశ్లోకస్తుతి రచనాస్పర్ధ ఇద్దరు ముగ్గురు కవుల మధ్య ఏర్పడినట్లు భావించిననూ, ఇది ఎదుటివారిని జయించుటకును అహంకారముతో తమ గొప్పతనమును ప్రకటించుకొనుటకును

ఏర్పడిన కలహమువంటిది కాదని వెనుకనే నిరూపించి యున్నాము. ఇదియొక సాత్త్విక కలహము. భగవత్ కైంకర్యరూప పాదుకాస్తుతిలో నేను ఎక్కువ గుణములను వర్ణించవలెను- నేను ఎక్కువ గుణములను వర్ణించవలెను - అను అహమహమిక వంటిది. రాజసమైన కలహము పరిత్యాజ్యముకాని, వినయ పూర్వకముగా చేయు ఈ స్పర్థ పరిగ్రాహ్యమే అని పెద్దలందరు. కనుకనే శ్రీ శఠకోపమునీంద్రులు (నమ్మాళ్వార్లు) తాము ప్రసాదించిన తిరువాయ్ మొళి. ప్రబంధమున నాలుగవ శతకములోని రెండవదశకమున నాలుగవ పాశురమందు – నిర్దుష్టములైన భగవత్కల్యాణగుణములలో ఒక్కొక్క దానిని ఆస్వాదించుచున్న పరమపదములోని నిత్యసూరులుకూడ తమకు ఇష్టమైన ఆ ఒక్క గుణములలోని విశేషమును చెప్పుచూ, ఓహో! ఇది చాల గొప్పగుణము. ఇతర గుణములేవియు ఇత గొప్పవి కావు; అని కొందరు ప్రశంసించుచుందురు. మరికొందరు తాము భావించు గుణమే గొప్పదనియు ఘోషించుచుందురు. వీరి మధ్య జరిగిన ఈసంవాదముచే ఘనముగా ప్రశంసింపబడిన అసంఖ్యాకములైన మహాగుణము లుకలవాడు పరమాత్మయని **"కోదిలవణ్పుకళ్. కొందు శమయికళ్ – పేత ఙ్గళ్ శొల్లిపితత్తుం పిరాన్ పరన్"** అను ఈ ఆళ్వారుల సూక్తిచే ప్రతిపాదితమైనది. ఎవరికి వారే తామనుభవించు భగవద్గుణములను గూర్చి చేయు ప్రశంసావాక్యములు క్షుద్రమైన కలహమునందు పర్యవసానము నొందక సర్వజ్ఞులైన నిత్యసూరులను గూడ అంతగా ఆకర్షించు ప్రభావముకలవి ఆ భగవద్గుణములు అని వాటి ప్రభావాతిశయమును ఘనముగా కీర్తించుటలోనే పర్యవసించును. అట్టిదే ఇచట పాదుకాస్తుతి పరముగా ఏర్పడిన ఈ కవీశ్వరుల స్పర్ధగూడ అని గ్రహింపదగును.

ఇందులకు మరియొక ఉదాహరణము. విష్ణుచిత్తులు అనబడు పెరియాళ్వార్లు తాము ప్రసాదించిన ప్రబంధమున మూడవ శతకమునందలి తొమ్మిదవ దశకమున స్పర్థారూపమైన ఇట్టి సన్నివేశమునే చమత్కారముగా సమకూర్చిరి. వారికి కృష్ణగుణములను రామగుణములను గూడ ఘనముగా వర్ణింపవలెనని భావన కలిగినది. అదియు వేరు వేరు దశకములలోగాక ఒకే దశకమున ఒక పాశురముతో కృష్ణుని ఘనతను మరియొక పాశురముతో రాముని వైభవమును తిరిగి కృష్ణుని ఘనతను మరల రాముని వైభవమును ఇట్లు పదిపాశురములు కొనసాగినవి. ఒక ప్రక్కన కృష్ణ భక్తురాలగు గోపిక తన భావమును తెలుపును. ఆ వెంటనే అందుకొని రామ భక్తురాలగు మరియొక కవయిత్రి రామగుణములను ఉగ్గడించును. ఇట్లు ఇద్దరు భక్తుల గోష్ఠిని విడివిడిగా నేర్పరచి వారు కీర్తించినట్లు తాదాత్మ్యభావనతో పెరియాళ్వారులే వర్ణించిరి. వివాహాది మహోత్సవములలో స్త్రీలు వేరు వేరు గుంపులుగా చేరి చెమ్మచెక్కలాడుతూ పాటలు పాడుట నాట్యమాడుట అను సన్నివేశములను లోకములో మనముచూచున్నాము. కోలాటములు మొదలైనవి ఇట్టివే ఉదాహరణకు కృష్ణభక్తురాలు "ఎన్నాతన్ తేవిక్కు" అను పాశురమున- కృష్ణుడు సత్యభామతో కలిసి స్వర్గమునకు వెళ్లినపుడు అచట ఇంద్రుడు శచీదేవియు వారిని ఘనముగా సత్కరించిరి. వీరు భూలోకమునకు చెందిన వారను భావముతో శచీదేవీ పారిజాత పుష్పహారమును సత్యమభామ కర్పించనందున ఆమె అలిగి కృష్ణునితో చెప్పగా కృష్ణుడు ఏకముగా గరుత్మంతుని ఆదేశించి స్వర్గములోని పారిజాతవృక్షమునే పెకలించుకొని, ఎదిరించిన ఇంద్రునిగూడ ఓడించి భూమికి తెచ్చిన మహాపరాక్రమశాలి అని వర్ణించినది. ఇక రెండవ రామభక్తురాలు "ఎన్ విల్ పలికణ్ణు" అను పాశురమున

– ధనుర్భంగవార్తను విన్న పరశురాముడు రామునిపై రోషముతో వచ్చి "నా వైష్ణవ ధనుస్సును ఎక్కుపెట్టుము. నీ పరాక్రమమును గుర్తించెదను. లేనిచో నిన్ను అంతము చేయుదును"అని సవాలును విసరగా మా శ్రీరాముడు అతని ధనుస్సును తీసుకొని ఎక్కుపెట్టి అతని అహంకారముతోపాటు తపస్సు చే సాధించుకొన్న అతని సద్గతిని కూడ భంగపరచినాడు. ఇట్టి జగదేక ధనుర్ధరుడు రాముడేతప్ప మరెవరును లేరు" అని కీర్తించుచు పాడినది. ఇట్లే ఉత్సాహముతో పై పది పాశురములలో కొనసాగిన ఈ రామకృష్ణ భక్తవర్గముల భగవద్గుణ వర్ణన స్పర్ధ భక్తులకు పరమభోగ్యమైనది. ఇట్టిదే ఈ భగవత్ పాద – పాదుకా రచన స్పర్ధ. దీనికి ఫలము భగవద్గుణవైభవ ప్రకటనమేగాని జయాపజయములుకావు. కనుకనే దేశికులవారును ఆ ఇతర కవీంద్రుల సాదర కటాక్షములు తమకు కావలెనని అపేక్షించిరి. ఇట్లే స్తోత్రారంభమున గూడ పదవశ్లోకమున ప్రతి భావ్యుత్పత్తులు సంపూర్ణముగా కలిగిన మహాకవులెందరో కర్ణామృతముగా నిన్ను స్తుతించుచున్నారు. (స్తువంతి త్వాం సంతః) అని చెప్పుచు " నేను అల్పుడను. ఏమేమో జల్పించుచున్ననూ, అందు గుణముండునట్లు నీవే అనుగ్రహింపవలెనని పాదుకను గూర్చి ప్రార్థించిరి. ఇట్లు నైచ్యాను సంధాన పూర్వకముగా ఉపక్రమోపసంహారములలో ప్రకటించుకొన్నవీరు తోటి భాగవతుల విషయమున జిగీషతో ప్రవర్తింపక భగవద్భాగవత ఆదేశమును శిరసావహించి దానిని నెరవేర్చుటయే పరమ ప్రయోజనముగా భావించిరి.

ఇక ఈ సహస్రస్తోత్ర రచనమునందు వీరికి ఇతర కవులకును ఏర్పడిన స్పర్ధలో ఇన్ని గంటలలోగా అనియో ఒక్కరాత్రిలోగా అనియో స్తోత్రరచనకు కాలపరిమితి ఏర్పరచుకొనబడినట్లు ఈ పాదుకా సహస్ర స్తోత్రమున ఆద్యంతములలోగాని మధ్యలోగాని స్పష్టముగు సూచన చేయబడి యుండలేదు. ఈ స్తోత్రమును రచింపుమని సగౌరవముగా శఠకోప ప్రసాదాదులను ఇచ్చి పెద్దలు తమను ఆదేశించినట్లు చెప్పబడెను గాని ఇందులకై కాలపరిమితి నిర్ణయించినట్లు స్తోత్రమందు ఎచ్చటనూ తెలుపబడలేదు. ఈ విషయమునే వ్యాఖ్యానకర్తయగు భరద్వాజ శ్రీనివాసాచార్యులవారు1006వ శ్లోకమునకు వ్యాఖ్యానమున "అత్రపురా శ్రీరంగనాథః అర్చక ముఖేన ఆచార్య శిరసి శ్రీ శఠకోపం నిక్షిప్య పాదుకా సహస్రమ్ ప్రణయేతి సబహుమానం అభ్యనుజ్ఞాతవాన్– ఇతి సంప్రదాయః" అని వ్రాసెను ఆ శ్లోకమందుగాని ఆ వ్యాఖ్యాన వాక్యములోగాని సమయ పరిమితి నిర్ణయము కానరాదు. అతి శీఘ్రముగా ముందుగానే ఎవ్వరు రచింపగలుగుదురో వారికి " కవితార్కిక సింహ" బిరుదము ఇవ్వబడునని నిర్ణయమై యుండును. ఇట్లుండగా ఈ ఆచార్యులవారి చరిత్రమును వర్ణించు వేదాన్తాచార్య విజయ చంపూగ్రన్థమున గాని ఆచార్యసూక్తి ముక్తావళి మొదలైన గ్రన్థములలో గాని ఒక్క రాత్రిలోగా స్తోత్రము రచింపవలెనని సమయ నిర్ణయము చేయబడినట్లు చెప్పుట ఆచార్యుల వారి యొక్క ప్రతిభా వైభవ ప్రశంసారూపమేనని గ్రహింపదగును. నిజమునకు ఆచార్యులవారి ప్రతిభాపాటవము అంతటిదేగాని అందు అనుమానించుటకు ఎంతమాత్రము ఆస్కారములేదు. కనుకనే వారు స్తోత్రారంభమున 18వశ్లోకమున "అపారకరుణాంబుధేః తవఖలు ప్రసాదాత్ అహం విధాతు మపి శక్నుయాం శత సహస్రికాం సంహితాం". "తల్లీ !నీ అనుగ్రహమున్నచో ఒక్కవెయ్యి శ్లోకములేమి లెక్క? నూరు వేల శ్లోకములను (లక్ష) గూడ వ్రాయగలను"అని గంభీరముగ చెప్పుకొన్నారు.

ఇచట కొందరు ఒక్కరాత్రి సమయములోనే ఈ స్తోత్రనిర్మాణము జరిగెననుటకు ఇందలి 19వ శ్లోకమును ప్రమాణముగా చూపుదురు. ఆ శ్లోకమిది.

శ్లో॥ అనుకృత నిజనాదాం సూక్తిమాపాదయంతీ
మనసివచసిచత్వం సావధానామమస్యాః ।
నిశమయతి యథాఽసౌ నిద్రయాదూర ముక్తః
పరిషదిసహలక్ష్మ్యా పాదుకే! రంగనాథః ।

ఓ పాదుకా! రంగనాథుడు నిద్రనుగూడవీడి నా ఈ స్తోత్రమును లక్ష్మీదేవితోకలిసి సభాభవనమునందు ఉల్లాసముతో వినగలుగునట్లు ఆయనహృదయమును రంజింపజేయగలరీతిలో ఈ స్తోత్రమును ఆవిర్భవింపజేయుము, అని దీని అర్థము. రాత్రిసమయమునగూడ నిద్రాపరవశుడుగాకుండ ఆయన వినగలిగినంత మధురముగా ఈ స్తోత్రము ఉండవలెను . పాదుకలో కూర్చబడిన రత్నముల మధురనాదమువలె ఈ స్తోత్రము ఆయనకు ఇంపుగా నుండవలెను. అట్లు నీవే అనుగ్రహింపుము అని ప్రార్థించుట చేత తమ ఈరచన రాత్రిపూటనే జరిగినట్లును,వీరు ఆశుధారారూపముగా చెప్పుచుండగా సభలోని వారితోపాటు ఆ రాత్రియే రంగనాథుడు విన్నట్లును సూచితమగుచున్నది గదా! అని కొందరి అభిప్రాయము. కాని వేదాన్తాచార్య విజయ చంపూగ్రస్థమునందును ఆచార్యసూక్తి ముక్తావళిలోను రంగనాథుని ఆజ్ఞనుపొంది వీరు తమ గృహమునకు వెళ్లి అచటనే దీనిని రచించి మరునాడు పగలు ఆలయమున పండిత సభలో దీనిని వినిపించినట్లు చెప్పబడుటచేత ఆలయములోనే ఇది ఆశువుగా చెప్పబడినదికాదని తెలియుచున్నది. ఇక ఈ శ్లోకమున గూడా "నిద్రయా దూరముక్తః" అను పదములచేత రాత్రి సమయమే రచనాకాలమని గ్రహింపనవసరములేదు. స్తోత్రమునందు రసములేనిచో శ్రవణ కుతూహలము పెరగనందున రంగనాథుడు కునికిపాట్లు పడకుండునట్లు రసవంతమైన రచనను ప్రసాదింపుమని అర్థముకావచ్చును. "అ స్వప్నాః అమృతాన్ధసః" అన్నట్లు నిద్రకే అవకాశము లేని స్వామికి 'నిద్రకలుగకుండునట్లు' అని సంభావించుట కూడ తగదు గదా అర్చావతారమున మౌనముద్రాదీక్షితుడై యుండుస్వామి నిద్రితునివలె వర్తించుటచే, అట్టి స్థితినివీడి ఉల్లాసముతో స్వామి వినవలెనని వీరి ఆకాంక్షమాత్రమే. "పశ్యత్య చక్షుఃస శ్రుణోత్యకర్ణః" అన్నట్లును "శుచిశ్రవాః" అన్నట్లును ఇక్కడనే కాదు ఆయన మరెక్కడనున్నను దీనిని వినగలడు. కాని పరిషత్తులోనే వినిపించవలెనను వీరి కోరికచే సభాస్థానము నలంకరించినస్వామి భాగవతగోష్ఠితోపాటు అర్చామూర్తిగనే దీనిని వినును. ఇట్టి సమయము సభతో పాటు ఆయనకును నిద్ర ఆవరింపకుండునట్లు అని చమత్కారముగా కవిచే ఉత్ప్రేక్షింపబడినది. కనుక ఈ శ్లోకము శ్రవణకాలికమగు రాత్రిసమయమును తెలుపునుగాని రచనాకాలము ఆ రాత్రియే అని తెలుపదు.

పైగా వెయ్యి శ్లోకములను అనర్గళముగా వీరు ప్రసాదించుచున్నపుడు అదే సమయమున గంటములను పుచ్చుకొని శిష్యులో అనుచరులో తాళపత్రములపై అన్నింటినీ లిఖించిరి అనుటకూడ అసంభావ్యమైన విషయమే

హయగ్రీవానుగ్రహ సంపన్నులైన ఆ స్వామి వారిలో ఆశువుగా చెప్పగలిగిన అంతటి ప్రభావముండవచ్చును గాని లేఖకులలో దానినంతటినీ అతి వేగముగా పత్రారూఢమొనర్చగలిగిన శక్తి కలిగియుండుట అనూహ్యమే కదా! కనుక వీరు చెప్పుచూ పోవుటకు అధిక సంఖ్యలో శిష్యులు కూడా అపుడే వేగముగా వ్రాయుటకును కొంత కాలవిలంబము పట్టియుండును. ఇట్లు పరిశీలించినపుడు తక్కిన కవులకంటె శ్రీదేశికులవారుసాధ్యమైనంత తొందరలో తమ స్తోత్రమును పూర్తిచేసి పండితులముందుంచిరనియు, ఈవేగమును ఇతర కవులు అందుకొనలేకపోయినరనియు గ్రహించుట ఉచితము.

ఇట్లు అనతికాలముననే ఈపాదుకాసహస్రస్తోత్రమునకుపక్రమించి ముగించిన శ్రీదేశికులవారు ఈపాదుకలే శఠకోపమునీంద్ర రూపమున అవతరించి ద్రవిడ వేదమనబడు దివ్య ప్రబంధములను ఆవిర్భవింపజేసినట్లును, ఆప్రబంధములే సంస్కృత వేదములకంటే భగద్వైభవ ప్రతిపాదనమునందు అగ్రగణనీయములైనట్లును రెండవది యగు సమాఖ్యాపద్ధతిలో ఈ క్రింది శ్లోకమున చెప్పియున్నారు.

శ్లో॥ వింధ్యస్తంభాత్ అవిహత గతేః విష్వగా చాంత సింధోః
కుంభీసూనోః అసురకబలగ్రాసినస్స్వైర భాషా।
నిత్యంజాతా శఠరిపు తనోః నిష్పతంతీ ముఖాత్తే
ప్రాచీనానాం శ్రుతి పరిషదాం పాదుకే! పూర్వగణ్యా॥

దీనిభావమిది : శ్రీ శఠకోపమునీంద్రులను రంగనాథపాదుకా రూపముగా సంభావించుట సంప్రదాయము. కనుకనే పాదుకలను నమ్మాళ్వారుల ముఖ్య నామధేయమగు శఠకోప పదముతో వ్యవహరించుట జరుగుచున్నది. భగవత్పాదుకలే శఠకోప రూపమున అవతరించి ద్రవిడ దివ్య ప్రబంధమును ప్రసాదించినవి. అవి సంస్కృత భాషలో గాక మహామహిమ సంపన్నుడగు అగస్త్య మహర్షి వ్యాకరణ నిర్మాణ పూర్వకముగా సంస్కరించిన ద్రవిడ భాషలో ఆవిర్భవించినవి. వీటిని రామాయణాదులవలె వేదోప బృంహణములైన ఇతిహాస పురాణముల కోటిలో చేర్చుటకు వీలులేదు. కఠ, కౌథుమ, విశ్వామిత్రాది మహర్షుల ముఖములనుండి ఆవిర్భవించిన వేదముల స్థాయినే వీటికి పరిగణింపవలెను. ఆయా మహర్షులు ఆ వేదశాఖలకు ప్రవచన కర్తలు మాత్రమేగాని సాక్షాద్రచయితలు కానందున అవి అపౌరుషేయములు, నిత్యములు ఐనట్లే ఈ ప్రబంధములు గూడ ఆళ్వారుల ముఖము నుండి అవతరించినవైనను అపౌరుషేయములు వేదములవలెనే నిత్యములు అని భావింపదగును. ఇట్టి ప్రబంధముల నవతరింపజేయుట పాదుకా ప్రభావమేనని భావము. ఈ విషయమును "నిత్యంజాతా" అనుపదములు సూచించుచున్నవి. "పూర్వగణ్యా" అనుపదముచే బోధితమైన శ్రేష్ఠత్వము ఆ ప్రబంధములకు ఎట్టిది అనగా - వేదములు భగవత్స్వరూపమును ప్రకటింపచేయుటలో కొన్ని నియమములను శాస్త్రీయ న్యాయములను ఆధారముగా చేసుకొని యుండును. ఈ ప్రబంధమున కట్టినియమ నిబంధనలు లేకుండుట ఒక విశేషము. మరియు భగవంతుని వీధ్యుత్సవమునందు వీటిని ముందు భాగమున గోష్ఠిలో

అనుసంధించుటయును సంస్కృత వేదములను వెనుక భాగమున అనుసంధించుటయును సంప్రదాయ సిద్ధమై యుండుటచే ఇది మరియొక వైశిష్ట్యము. ఈ దివ్యప్రబంధములకు "నిత్యం జాతా" అను పదములచే బోధింపబడిన నిత్యత్వము ఎట్టిది? అను విషయమున, వేదములవలె స్వరూప నిత్యత్వమే అనియు – కాదు– ప్రవాహరూప నిత్యత్వమే అనియు రెండు పక్షములు సంప్రదాయభేదముచే ఆవిర్భవించినవి. అవి అంతముఖ్యమైనవి, ప్రయోజనవంతమైన చర్చకు తగినవి కూడా కాదు. కనుక ఆ ప్రస్తావన ఇచట అనవసరము. కాని ఈ దేశిక శ్లోకమును బట్టియే దివ్య ప్రబంధములకు వేద సమప్రాధాన్యము, కొన్ని అంశములలో ప్రత్యేకత కూడా సూచింపబడి యుండుట ముఖ్యాంశము.

పాదుకా సహస్రము ఉత్తమ కావ్యమే

అలంకారికులు కావ్యమును ఉత్తమ మధ్యమ అధమ భేదములతో త్రివిధముగా విభజింతురు. వాచ్యార్థమునకంటె వ్యంగ్యార్థము ఎక్కువగా భాసించే కావ్యములనే ఉత్తమ కావ్యమని వివరణ ఇస్తారు. వాచ్యవ్యంగ్యములు రెంటికినీ సమప్రాధాన్యమున్నపుడు మధ్యమ కావ్యమనీ, వ్యంగ్యము పూర్తిగా అప్రధానమై వాచ్యచమత్కృతియే ఉన్నపుడు అధమ కావ్యమనీ, ఈ విభాగానికి తాత్పర్యము. దేశికులవారి ఈ రచన ఉత్తమ కావ్యమే అనటానికి ఒక్క శ్లోకమును మాత్రం ఉదాహరించి వివరిస్తాము. స్థాలీపులాకన్యాయమును బట్టి ఒక్క మెతుకును పట్టి చూస్తే చాలును గదా! నిర్వేద పద్ధతిలో ఈ క్రింది శ్లోకము చిట్టచివరిది. క్రమసంఖ్యలో 970వది.

శ్లో॥ పాషాణ కల్పమంతే పరిచిత గౌతమ పరిగ్రహన్యాయాత్ ।
పతిపదపరి చరణార్హం పరిణమయ ముకుంద పాదరక్షిణి ! మామ్ ॥

ఉత్తమకవి తన రచనలో ప్రతి పదమును సావధానదృష్టితో ప్రయోగిస్తాడు. ప్రకృతానికి ఉపయోగించని వ్యర్థపదము ఒక్కటిగూడ అతని రచనలో ఉండదు అనుటకు ఈ శ్లోకమే ఉదాహరణము. మొదట దీని వాచ్యార్థమును వివరించుకొని పిదప విశేషార్థములను పరిశీలించుకుందాము.

ముకుందపాదరక్షిణి : భగవంతుని పాదములకు రక్షణ కల్పించే ఓ పాదుకా !

అంతే : మరణ సమయములో

పాషాణ కల్పం : శరీరేంద్రియములేమియు పనిచేయక రాతివలె పడియున్న

మాం : నాకు

పరిచిత : పాద సంబంధ రూపమగు పరిచయము నొందిన

గౌతమ పరిగ్రహన్యాయాత్ : గౌతముని భార్యయగు అహల్యను అనుగ్రహించిన విధముగా

పతిపద పరిచరణ అర్హం : స్వామి యొక్క పాద పరిచర్యకు తగినట్లుగా

పరిణమయ : మార్పును కలిగించుము.

ఇదిపైకి స్ఫురించే వాచ్యార్థము. గౌతమ మహర్షి యొక్క భార్యయైన అహల్య తాను చేసిన **అపచార విశేషము చేత** భర్తృ శాపమునకు గురియై పాషాణ రూపమును పొందినది. ఆ భర్తయే కొంతకాలమునకు శ్రీరాముడు ఈ ప్రాంతమునకు రాగలడని ఆయన యొక్క పాదరజ స్పర్శచేత తిరిగి నీకు నిజరూప ప్రాప్తికలుగుతుందని అంతవరకు శిలగా పడియుండుమని శాపవిమోచన సమయాన్ని కూడా తెలిపియున్నాడు. విశ్వామిత్రుని వెంట రాముడు గౌతమాశ్రమానికి వెళ్లినపుడు ఆయనయొక్క పాదస్పర్శచేత ఆమెకు నిజరూపమేర్పడి అపచారదోషపరిహారమునొంది పవిత్రురాలై తిరిగి యథావిధిగా పతిసేవాపరాయణురాలైనది. పతివ్రతకు కావలసినది పతిసేవాభాగ్యమే కదా ! ఈ కథ రామాయణ బాలకాండమందున్నది. వాల్మీకి ఇచట గౌతమ శాపముచే శిలారూపము నొందినట్టు చెప్పక అదృశ్యమైనట్లు మాత్రమే చెప్పినాడు గాని పురాణాంతరములలో శిలారూపమునొందినట్లే చెప్పబడియున్నది. ఈ విషయము లోక ప్రసిద్ధము కూడ. గౌతమపత్నియగు ఆ అహల్య రామపాద సంసర్గరూపమగు పరిచయమునుబట్టి తిరిగి సహజమగు తన నిజ స్వరూపము నొంది పవిత్ర భక్తితో పతిసేవాపరాయణురాలైనట్లు నన్నుకూడ 'పతిం విశ్వస్య' అని శ్రుతిలో చెప్పబడిన విశ్వపతియగు పరమాత్మయొక్క పదసేవకు శాశ్వతమగు అర్హతను పొందునట్లుగా (అనగా మోక్షమును పొందునట్లుగా) అనుగ్రహింపుమని అహల్యా చరిత్రను నిదర్శనముగా చూపి దేశికులవారు తమ ప్రార్థననూ విన్నవించుకున్నారు. ఇది మధురమైన ఉపమాలంకారము. అహల్య పాషాణ స్థితిని పొందినది. నేను కూడా అంత్యకాలములో "తతస్తం మ్రియమాణంతు కాష్ఠ పాషాణ సన్నిభం"అని చెప్పబడినట్లు పాషాణము వలె విచేతనుడనై పడియుండవచ్చును. ఇట్టిస్థితిలో నీకు శరణాగతి చేసియున్న నన్ను స్మరించుకొని అనుగ్రహించే భారం నీదేసుమా అని దీని అభిప్రాయము. సాధనాంతరనిష్ఠులకు అంత్యకాలములో భగవత్‌స్మృతి అవసరమనిన్నీ ప్రపన్నులకు అంతిమస్మృతి అవసరం లేదనీ సంప్రదాయ రహస్యము ఇచట సూచితమగుచున్నది. ఈశావాస్యోపనిషత్తులోని పదిహేడవమంత్రమున "ఓం క్రతోస్మర కృతంస్మర" అనే వాక్యంకూడా ఈ విషయమునే స్ఫురింపజేస్తున్నది. శాపవశంచేత నిజరూపమును కోల్పోయిన అహల్యకు తిరిగి భగవత్పాద సంస్పర్శవలన నిజస్వరూపమావిర్భవించినట్లు, శాపమువలె అవశ్యానుభావ్యమైన ప్రకృతి సంసర్గం చేత నిజస్వరూపమును పూర్తిగా కోల్పోయి అచేతన ప్రాయుడనైన నాకు తిరిగి ఛాందోగ్యోపనిషత్తులో చెప్పబడినట్లు ప్రకృతి బంధము తొలగిపోయిన పిదప భగవత్ సేవకు అర్హమైన 'అపహతపాప్మ' త్వాది స్వాభావిక గుణాష్టకావిర్భావం కలగాలి అనే వేదాంత రహస్యమిచట గర్భితమై యున్నది. దీనికంతటికీ తగినట్లు శ్లోకములో ముకుంద పదము ప్రయోగింపబడియున్నది. ముకుం- మోక్షం- దదాతీతి ముకుందః - అనే వ్యుత్పత్తిని బట్టి మోక్షప్రదానశక్తి శ్రీమన్నారాయణునికే చెల్లునని ఆయన యొక్క శ్రీపాదముల నాశ్రయించిన నీవు నా ప్రార్థనము మన్నించుమనిన్నీ సందర్భానుగుణంగా ఇచట ముకుందపదమే ప్రయోగించబడినది. ఇది ఉపమాలంకార శోభితమైన వాచ్యార్థము.

ఇచట దేశికులవారు "గౌతమ"పదమును "పాషాణకల్ప" పదమును ప్రయోగించి మరి యొక వ్యంగ్యార్థమును కూడా భాసింపజేస్తున్నారు. వీరు 'కవి తార్కిక సింహ' బిరుద భూషితులు గదా! సర్వతంత్ర స్వతంత్ర బిరుదముకూడ

వీరికి ఉన్ననూ తర్క శాస్త్రమందు అసాధారణ పాండిత్యము వీరికి కలదని సూచితమగుచున్నది. ఆ తర్క శాస్త్రమునకు రచయిత గౌతమ మహర్షియే గదా! దానికే న్యాయ శాస్త్రమని గూడ పేరు. అర్వాచీన వ్యాఖ్యాన కారులచే ఉపనిషత్సిద్ధాంతమునకు వ్యతిరేకముగా వ్యాఖ్యానింపబడిన ఆ న్యాయశాస్త్రమును వేదాంత సిద్ధాంతానుగుణముగా వీరు పరిష్కరించుచూ 'న్యాయ పరిశుద్ధి' అను గ్రంథమును రచించియుండుట సుప్రసిద్ధము. గౌతమీయమగు ఈ న్యాయశాస్త్రప్రకారము "పాషాణ కల్పో మోక్షః" అను విషయము గూడ సుప్రసిద్ధమే. "దుఃఖ జన్మప్రవృత్తి - అపవర్గః" అను న్యాయ సూత్రప్రకారము 'అపవర్గము' అనబడు మోక్షము సర్వదుఃఖ ధ్వంస రూపము; అని నిర్వచనము చెప్పబడినది. జీవునికి కలుగు దుఃఖములన్నియు అనాది జన్మ సంబంధముచే ఏర్పడుచున్నందున అట్టి జన్మములకు రాహిత్యము పూర్తిగా ఏర్పడి ఆత్మకు దుఃఖ ధ్వంసముకలుగుటయే మోక్షము కాని వేరే ఒక మహాసుఖమేదియోవచ్చుటకాదు. "భారాపగమే అహం సుఖీ సంవృత్తః"అన్నట్లు ఎండలో ఎంతో దూరమునుండి బరువును మోసుకొని వచ్చుచున్న వ్యక్తి ఒక చెట్టునీడలో బరువును దించుకొని 'ఇప్పుడు నాకెంతో సుఖముగానున్న'దని చెప్పుకొనుచున్నాడు. వాస్తవమునకు అపుడు ఇంద్రియానుభవజన్యమైన సుఖమేదియులేకున్నను, ఎండలో బరువును మోయుట యను మహాదుఃఖము పోవుటయే సుఖముగా వ్యవహరింపబడినట్లు, జీవునికి గూడ జన్మ సంబంధముచే నేర్పడు తాపత్రయ రూపదుఃఖపరంపరకు ఆత్యంతిక విధ్వంసము కలిగినపుడు అట్టి స్థితినే మోక్షమని ఈ తర్కశాస్త్రమున నిర్వచింపబడినది. ఇట్టి మోక్షదశలో జీవుని స్థితి ఎట్లుండును? అను ప్రశ్న కలుగవచ్చును. భౌతిక దేహసంబంధము పూర్తిగా తొలగిపోయినందున జ్ఞానోత్పత్తి హేతువగు శరీరేంద్రియములు తొలగిపోయినందున ఆ దశలో జీవాత్మ యొక్క స్థితి అచేతనమగు పాషాణమువలె ఉండుటయే గనుక " పాషాణ కల్పోమోక్షః" అని వ్యవహారమేర్పడినది. వేదాంతులు చెప్పినట్లు ఆత్మకు జ్ఞానము స్వాభావిక నిత్యధర్మము కాదు. శరీరేంద్రియ సంబంధమును బట్టి ఆత్మకు ఆగంతుక ధర్మమే చైతన్యము గనుక సహజముగా ఆత్మ స్వరూపము అచేతనమే అగును గదా! ఆస్థితి కలుగుటయే 'పాషాణ కల్ప' మనుట. ఇక మరల దుఃఖ సంబంధమేర్పడదుగనుక అదే ఆనందరూపమనుట. కనుకనే "ఆగన్తుకచైతన్య గుణయోగీ ఆత్మా"అని వారి సిద్ధాంతము.

ఈ దృష్టితో శ్లోకమును పరామర్శింపగా తమకు సుపరిచితమైన గౌతమ ప్రతిపాదితమైన న్యాయశాస్త్ర ప్రకారము నాకు అంత్యకాలమునందు ఆపాషాణ కల్పమను మోక్షము లభించినను లభించును గాక! అని "పరిచిత గౌతమ పరిగ్రహ న్యాయాత్ అంతే పాషాణ కల్పం మాం" అను ఈ పదవిన్యాసముచే సూచితమైన వ్యంగ్యార్థము. ఐతే ఈ పాషాణ కల్ప మోక్షమునే శ్రీవైష్ణవోత్తములగు వీరపేక్షించు చున్నారా? అను సందేహము కలుగవచ్చును. దానికి సమాధానముగా "పతి పద పరిచరణార్హం పరిణమయ" అను వాక్యము ఆవిర్భవించినది. ఇష్టము లేకున్ననూ పరమత సిద్ధాంత విషయమును తాత్కాలికముగా నొప్పుకొని తన వాదమును వినిపించుట ఒక శాస్త్ర పద్ధతి కలదు. దీనినే 'అనభ్యుపగమ్య' వాదము అందురు. ఒకవేళనాకు ఆ తర్క శాస్త్రోక్త ప్రకారము అంత్యకాలమున పాషాణ కల్పస్థితి ఏర్పడినను సరే ! అంగీకరింతును. కాని, ఆ స్థితి కూడ భగవత్పాద పరిచరణార్హమై పరిణమించవలెను అని ప్రార్థించుట ఇచట విశేషము. భగవత్సన్నిధానమున

నేను కదలని రాయిగా స్థిరముగా పడియుండి కూడ భగవద్దివ్యముఖారవింద సేవను పొందగలిగి యున్నచో అదియే నాకు మహానందమగు మోక్షము. దానిని నాకు ప్రసాదింపుమని చమత్కారముగా ఇచ్చట భగవత్పాదుకలను గూర్చి ప్రార్థించుచున్నారు.

అచేతనమగు శిలగా పడియుండుట ఏమి? అట్టి దశలో కూడ భగవన్ముఖారవింద దర్శనానందము కలుగుట ఏమి? ఇది పరస్పర విరుద్ధము కదా! ఇట్లెవరైనను కోరుకొందురా? అను ఆక్షేపమొకటి ఇపుడు కలుగవచ్చును. ఇట్టి కోరిక సమంజసమే అనుటకు పరమభక్తులగు దివ్యసూరులలో (ఆళ్వారులలో) ఒకరైన శ్రీకులశేఖరులవారి మధుర సూక్తియే ఇచట ప్రమాణముగా నిదర్శనీయము. "పడియాయ్క్కిడన్దు ఉన్ పవళవాయ్ కాణ్బేనే" అని ఆకులశేఖరులు తమ ద్రవిడ ప్రబంధమున చెప్పుకొనియున్నారు. వేంకటాచలమునందు భగవదాలయమున స్వామి వేంచేసియుండు గర్భ మండపమునకు ముందున్న ముఖద్వారమున (పడియాయ్ క్కిడన్దు) నేను రాతికడపనై పడియుండి (ఉన్ పవళ వాయ్ కాణ్బేనే) చిగురువలె వికసించిన చిరునవ్వుతో నలరారు నీ ముఖపద్మమును దర్శించెదను గాక! అని వారి దివ్యసూక్తికి అర్థము. కడప వలె పడియుండుట అచేతనస్థితి. అందులో కూడ ముఖారవింద దర్శన అభిలాషను ప్రకటించుకొనుట ఒక ప్రత్యేకత. స్థావర శరీరమైననేమి? జంగమశరీరమైనచో తిరిగి భగవంతునికి దూరమైపోవు స్థితి ఏర్పడును. అంతకంటె ఈ స్థావర జన్మమే మేలు. అదియును భగవత్సన్నిధిలోనే ఐనచో ఇక కావలసినదేమున్నది. "పతిపద పరిచరణార్థం" అనుపదముచే ఈ వేదాంత దేశికుల వారు కోరిన కోరికయు ఇట్టిదే. ఇట్లు ఈ శ్లోకమున వాచ్యార్థముగా 'పరిగ్రహ' శబ్దమునకు భార్య అని అర్థమును స్వీకరించినపుడు పాషాణకల్పమైన గౌతమపత్ని తిరిగి పతిసేవాభాగ్యమును పొందుట అను విషయమును ప్రతిపాదించుటయు, గౌతమునిచే పరిగ్రహింపబడిన అనగా ప్రతిపాదితమైన న్యాయశాస్త్రప్రకారము పాషాణ కల్పరూప మోక్షార్థమును వ్యంజనపద్ధతిలో బోధించి దానికి సంప్రదాయార్థమును జోడించుటయును భావుకుల హృదయములలో భాసించుచున్నందున ఇది ఉత్తమ కావ్యమనుటలో ఎట్టి సందేహమును లేదు. ఇట్టి భావగాంభీర్యమును ఇందలి శ్లోకములన్నింటిలోను విజ్ఞానులైన సహృదయులు గ్రహింపవచ్చును.

ఈ స్తోత్రమునకు శ్రీ భరద్వాజ శ్రీనివాసాచార్యుల వారు వ్రాసిన సంస్కృత వ్యాఖ్యానమొకటి ప్రాచీనమైనది కలదు. పంచకావ్యములపై మల్లినాథుని వ్యాఖ్యానమువలె ఈ వ్యాఖ్య అన్యూనానతి రిక్తమై కావ్యాలంకార లక్షణ సమన్వయమును చూపుచు అవసరమైన చోట్లలో శ్రీ వైష్ణవ సంప్రదాయమునకు చెందిన విశేషములను గూడ ఆవిష్కరించుచూ కొనసాగినది. మరికొన్ని ప్రాచీన వ్యాఖ్యాసములు సంస్కృతమునగాని ద్రవిడ భాషలోగాని ఉన్నవేమో! అవి నాదృష్టికి రాలేదు. ఇటీవలికాలమున కొందరు సంస్కృత ద్రవిడ భాషలలోనూ, టిప్పణీ రూపమునను, ప్రతిపదార్థ వివరణ రూపముగ కూడ వ్యాఖ్యలను ప్రకటించియున్నారు. శ్రీ దేశికులవారిపై గౌరవముతో తమ తమ ప్రతిభా విలాసములను బట్టి ప్రాచీన శ్రీనివాసాచార్య వ్యాఖ్యలలో లేని అపూర్వ సమన్వయములను గూడ ఈ అర్వాచీన

వ్యాఖ్యాతలు చూపియున్నారు. ఒకరిదృష్టిలో తెలియని నిగూఢములైన అర్థవిశేషములు మరికొందరికి భాసించవచ్చును. అవి ప్రమాణ బద్ధములైనంతవరకు పరిగ్రాహ్యములే.

కాని కొందరు వ్యాఖ్యానకర్తలు అతిగా తమ పాండిత్యమును ప్రదర్శింపదలచి ఒక్కొక్క అంశముననే ఐదారు విధములుగా వ్యాఖ్యానించుట జరుగుచుండును. సూక్ష్మదృష్టితో పరిశీలించినపుడు ఆయర్థములలో కొన్ని ప్రామాణికతను కోల్పోవచ్చును. అత్యంత ప్రామాణికులు అనబడు ప్రాచీన వ్యాఖ్యానకర్తలలో కూడ కొన్ని లోపములున్నట్లు తెలిపి తనకంటె పూర్వులైన ఆ వ్యాఖ్యానకర్తలను నిరసించినమల్లినాథాదులు కూడ కొన్నిచోట్లలో పప్పులోకాలు వేసిరని విమర్శకులు వేలెత్తి చూపియున్నారు. ఇపుడు ఆ సందర్భములనన్నింటిని ఇచ నుదాహరించుట అప్రస్తుతమే. కాని ప్రకృత గ్రంథమునకు చెందిన ఒక వ్యాఖ్యానమునందలి విషయమును పరిశీలించినపుడు మా దృష్టికి వచ్చిన ఒక అంశమును ఇచట సంగ్రహముగా నిరూపించుట అవసరమేనని భావింతును.

ఈ స్తోత్రమునందలి మొదటి శ్లోకమే అద్భుత భావబంధురమైనది.

శ్లో॥ సంతః శ్రీరంగ పృథ్వీశ చరణత్రాణ శేఖరాః

జయంతి భువన త్రాణ పదపంకజరేణవః ॥

శ్రీరంగనాధుని పాదుకలను స్తుతింప నారంభించిన దేశికులవారు వాటిని శిరసావహించి ధన్యులైన భాగవతోత్తములకు 'జయన్తి' అని ఇందు మంగళమును పలుకుచున్నారు. ఆ పాదుకల స్పర్శముచే పరమ పవిత్రులనుగా తెలిపి వారి పాదపద్మరేణువులు కూడ లోకములను పవిత్రము చేయగలవు అని ప్రశంసించుచూ, పరంపరాగతమగు ఇట్టి పవిత్రతకు మూలకారణమైన పాదుకా ప్రభావమును ఈ శ్లోకమున శ్రీదేశికులవారు ఉగ్గడించినారు. భగవద్దాస్యమునకంటె తద్దాసదాసచరమావధి దాస్యము శ్రీ వైష్ణవ సంప్రదాయానుసారము పరమప్రాప్యముగనుక శ్రీరంగనాథునికంటె ఆయన యొక్క పాదుకలు, వాటికంటె వాటిని శిరసావహించిన సత్పురుషులు, వారికంటె వారి పదపద్మరేణువులు మాకు పరమప్రాప్యమైనవి అని దేశికులవారు ఇందు తమ చరమావధి దాస్య రసికతను ప్రకటించుకున్నారు. సర్వతంత్ర స్వతంత్రులైన ఆ స్వామివారి అఖండ ప్రతిభావిశేషమెక్కడ? అట్టి వారిలో కూడ ఈ చరమావధి దాస్య భావన ఎక్కడ?

అహంకారహేతువైన ప్రతిభాసమున్నతి వీరిలో తద్విరుద్ధముగా స్వచ్ఛమైన భాగవత విధేయతా సంపత్తిని ఆవిష్కరించుట ఆశ్చర్యావహము.

ఇచట శ్రీరంగ పృథ్వీశుడు అనగా రంగనాధుడు. అని యర్థము. ఆక్షేత్రము యొక్క పవిత్రతను సూచించునది శ్రీరంగపదము. పృథ్వీశపదము పృథ్వీ+ఈశ ఆ క్షేత్ర ప్రాంతమేరకు అధీశుడైన రంగనాథునికి వాచకము. ఇది వాస్తవమైన అర్థము. ఇట్లుండగా ఇచట శ్రీ శబ్దము పృథ్వీ శబ్దము కనబడుటవలన వారిద్దరితోపాటు నీళాదేవి యొక్క సాన్నిధ్యము కూడ ఇచట ఉన్నట్లు అభ్యూహించి శ్రీ (రంగ) పృథ్వీ శబ్దములనడుమనున్న రంగపదమును నీళాదేవికి వాచకముగా ముడిపెట్టి కొందరు వ్యాఖ్యానించుట ఎబ్బెట్టుగా కనిపించును. అర్థము మంచిదే. అందు దోషములేదు. కాని ఆ నీళాదేవి అను అర్థమును మధ్యనున్న రంగపదము ఎట్లు బోధించగలదు! అన్నదే విమర్శనీయాంశము. అచట నీళాదేవిని బోధించనిచో వచ్చిన నష్టమేమియు లేదు. పరాశర భట్టరువారుకూడ " పద్మాధాత్రీ కరాభ్యాం పరిచిత చరణం రంగరాజం భజేహం" అను శ్లోకఖండమున నీళాదేవిని ప్రస్తావించలేదు. అట్లే శ్రీరంగరాజస్తవ పూర్వశతకమున 122వ. శ్లోకములో "శ్రీరంగేశయ జంఘే శ్రీభూమ్యామర్శహర్ష కంటకితే" అను చోట శ్రీ భూమీ శబ్దములనే ప్రయోగించి నీళాదేవిని విడిచిరి. ఒకవేళ ఇచట నీళాదేవి ప్రస్తావనను చెప్పుకొనుటలో తప్పులేదు కదా! అనుకున్ననూ ఆ నీళాదేవికి శ్రీ భూ అమ్మవారలకు తరువాతనే స్థానముగాని మధ్యలో స్థానము ఎచ్చటనూ కానరాదు. కనుకనే భగవద్రామానుజాలును శరణాగతి గద్యమున " శ్రీ వల్లభ"అన్న తరువాత "ఏవం భూత భూమి నీళానాయక!" అని ప్రయోగించిరి. మరియు ' శ్రీ భూనీళాసమేత' అనియే సాంప్రదాయకుల అనుసంధానక్రమము. కనుక శ్రీ పృథ్వీ పదములకు నడుమ ఈ క్రమమును తప్పి రంగపదముచే నీళాదేవిని బోధించినట్లు వ్యాఖ్యానించుట అసహజము. పైగా ఇట్లు నీళాదేవిని కలిపి ఆ శ్రీరంగ పృథ్వీశపదమునకు అర్థమును ప్రతిపాదించుటకు వారు చూపిన ఉపపత్తి కూడ సరియైనది కాదు.

ఇందులకు వారు చూపిన ఉపపత్తి ఏమనగా "నీలే ముహ్యతి కింకరోమి మహితైః క్రీతోస్మి తేవిభ్రమైః ఇత్యుక్తరీత్యా విభ్రమాధిక నీళాగ్రహణాత్ నాట్యస్థాన పరేణ రంగపదేన నాట్య విభ్రమముఖేన - - - శ్రీ నీళా భూమి సమేత భగవత్పదమ్", ఇత్యాది. నాట్య ప్రదర్శనమును చేయుస్థానమునకు 'రంగము' అని వ్యవహారము కలదుగనుక, ఆ

రంగస్థలముననాట్య విభ్రమములను అనగా విలాసములను ప్రదర్శింతురు గనుక, "నీళే ముహ్యతి - క్రీతోస్మితే విభ్రమైః అను శ్లోకమున చెప్పబడినట్లు నీళాదేవి తన విభ్రమములతో స్వామినివశీకరించినది గనుక ఇట్టి విభ్రమవతియైన నీళాదేవిని విభ్రమ ప్రదర్శన స్థానమైన 'రంగ' పదముతో బోధింపవచ్చును అని ఈ నవీన వ్యాఖ్యాతల యొక్క అభిప్రాయము. బలాత్కారముగా ఆకర్షింపబడిన ఈ యర్థము వాస్తవమునకు పొసగదు. ఈ విభ్రమములు నీళాదేవిలోనేకాదు లక్ష్మీదేవిలో కూడనున్నట్లు "నమః శ్రీరంగనాయక్యై యద్భ్రూవిభ్రమ భేదతః" అను శ్లోకముచే పరాశర భట్టరువారు తెలుపుచున్నారు. కనుక ఆమెను గూడ రంగపదము చేత ఏల గ్రహింపరాదు? కనుక వారు తెలిపిన యుక్తి సరికాదు.

అసలు వారు ప్రమాణముగా చూపిన శ్లోకమునకు వారనుకున్న అర్థమే కాదు. అందు చెప్పబడిన ఆ విభ్రమములు నీళాదేవికి చెందినవి కావు. (మహి) భూదేవికి చెందినవి అని గ్రహింపవలెను. ఆ శ్లోకమెక్కడిదో పరామర్శించువారికి ఈ పరమార్థము గోచరమగును. "యతిరాజ విజయ" నాటకమున నాందీ శ్లోకమున మధ్యలో వారుదాహరించిన ఈశ్లోక ఖండమున్నది. ఆ శ్లోక మిదిగో

శ్లో॥ పద్మే త్వన్నయనే స్మరామి సతతం, భావో భవత్కుంతలే
నీలే ముహ్యతి, కింకరోమి మహితైః క్రీతోస్మితే విభ్రమైః ।
ఇత్యుత్స్వప్నవచోనిశమ్య సరుషా నిర్భర్త్సితోరాధయా
కృష్ణః తత్పరమేవ తద్వ్యపదిశన్ క్రీడావిటః పాతువః ॥

రాధతో కలిసి ఏకశయ్యపై రతి ప్రశాంతుడైన కృష్ణుడు చిరునిద్రలో కలవచ్చి ఇట్లా కలవరిస్తున్నాడు. "పద్మే ! త్వత్ నయనేస్మరామి" ఓ లక్ష్మి ! అందమైన నీ కనులనే సదానామనస్సులో తలంచుకుంటుంటాను. మరి కొంత సేపటికి "సతతం భావో భవత్కుంతలే నీలే! ముహ్యతి" ఓ నీళా! నా మనస్సు నీకురుల అందానికి పరవశమై పోయినది. "కింకరోమిమహి! తైః క్రీతోస్మితే విభ్రమైః" ఓ భూదేవీ! నీలీలావిలాసాలకు అమ్ముడుపోయిన నేను నీ సేవనే చేస్తుంటాను. - అని ఇట్లు శ్రీ భూనీళాదేవులను గూర్చి వారి సొయగములు గుర్తుకురాగా కృష్ణుడు కలవరిస్తుంటే ప్రక్కనే ఉన్న రాధ ప్రణయరోషంతో ఆయనను లేపి "నన్ను కాదని నీవు ఆ ఇతర నాయికలను అంతగా ప్రేమిస్తున్నావా? ఐతే

నా వద్ద నుండి వెళ్లిపొమ్మ"ని బెదరించినది. అపుడు నిద్రమబ్బునుండి తేరుకొన్న కృష్ణుడు తన తప్పును గుర్తించి తాను ఏమన్నాడో ఆ మాటలనే తిరిగి ఆమెతో అనిపించి, "ఈ మూడు వాక్యములున్నూ నిన్ను గూర్చియే నేను అన్నాను సుమా! భ్రమతో నీవెందుకు కోపగించుకుంటున్నావు?" అని ఆ మాటలకు అర్థము మార్చి ఆమెకే అన్వయించి చెప్పినాడట. ఇపుడు పద్మే, నీళే, మహి అన్న మూడు పదాలున్నూ ఆ ఇతర దివ్య మహిషులను సంబోధించే పదములుకావు. 'పద్మేనయనే' పద్మాల వంటి నీ నేత్రాలను, 'నీలే భవత్కుంతలే' నల్లని నీకురులను, 'మహితైః(ఏకపదం) విభ్రమైః' మెచ్చదగిన నీ విలాసములను, అని అర్థము మార్చివేయబడింది. ఇదే నిజం కావచ్చునని ఆ పిచ్చిరాధిక తనకోపాన్ని దిగమ్రింగి తిరిగి ఆ కృష్ణునితో శృంగారంలో పడిపోయింది. అట్టి మాయదారి కృష్ణుడు మిమ్ము బ్రోచుగాక! అని దీని తాత్పర్యము. అందమైన ఈ శ్లోకాన్ని అప్పయ్య దీక్షితులున్నూ తన కువలయానందంలో ఉదాహరించియున్నాడు.

ఈ శ్లోకంలోని "నీళే ముహ్యతి"అనే దగ్గర నుండి "తేవిభ్రమైః" అనేంతవరకు ఉదాహరించి ఆ విలాసములు నీళాదేవికే అనుకొని, విలాసప్రదర్శనకు ఆస్థానమైన 'రంగ' శబ్దాన్ని నీళాదేవికి స్మారకముగా ముడిపెట్టి శ్రీ రంగ- పృథ్వీ అను దేశిక శ్లోకంలోని మూడు పదాలను శ్రీ నీళా భూవాచకములుగా సమన్వయమును ప్రతిపాదించుట పూర్తిగా అసంబద్ధమే. ఇట్లుఏవేవో భావస్ఫురణలో కొత్త పోకడలు కనిపెట్టినామని చెప్పుకొని క్రొందరు అనుచితము అస్వరసము ఐన వ్యాఖ్యలను చేయటం అప్రామాణికమని సహృదయులు గ్రహించగలరు. "పద్మే! త్వన్నయనే" అన్న శ్లోకమెక్కడిదో సందర్భ సమన్వయము లెట్టివోగూడ గుర్తించక ఆంధ్రవ్యాఖ్యానకర్తయైన శ్రీమాన్ కే.వి. రాఘవాచార్యుల వారు కూడ ఆ అర్వాచీన సంస్కృతవ్యాఖ్యలోని అంశాన్ని అట్లనే అనువదించి పొరబడినట్లున్నారు. దేశికులవంటి మహాకవుల సూక్తులకు వివరణ యిచ్చేటప్పుడు వ్యాఖ్యాతలకు ఎంతో జాగ్రత్త అవసరము గదా! ఐనా ఎంత జాగ్రత్తపడినా మల్లినాథాదులకే తప్పని ఇట్టి ప్రమాదాలను గూర్చి ఎవరైనా సహృదయులు ప్రబోధించినపుడు స్వీకరించుటయే ఉత్తమ లక్షణం.

ఆయా గ్రంథములలో ప్రతిపాద్య అవాంతర విషయభేదమునుబట్టి అధ్యాయభేదములు ఏర్పడినట్లు ఈ స్తోత్రంలో కూడా దేశికులు పద్ధతి అనే పేరుతో ముప్పదిరెండు విభాగములను వర్గీకరించియున్నారు. ప్రతిపాద్య విషయమునుబట్టి ప్రస్తావన పద్ధతి, సమాఖ్యాపద్ధతి ఇత్యాది నామకరణాలను గూడ ఆ విభాగాలకు తామే కల్పించిపెట్టియున్నారు. వాటిని ఒక క్రమపద్ధతిలో పెట్టుటలోగల విశేషాలను పరస్పర సంగతిని వ్యాఖ్యానంలో

పాఠకులు గ్రహించగలరు. ముప్పది రెండు అనే సంఖ్యలో గల విశేషమేమిటో చర్చనీయాంశమే. ఉపనిషత్తులలో పరబ్రహ్మోపాసన పద్ధతులు ముప్పదిరెండుగా బ్రహ్మసూత్రభాష్యాలలో ద్వాత్రింశత్ బ్రహ్మవిద్యలు అని పరిగణింపబడి యున్నవి. సద్విద్య, దహరవిద్య, ఆనందమయ విద్య, అంతరాదిత్య విద్య, భూమవిద్య, వైశ్వానరవిద్య ఇత్యాదులు ఉపనిషత్తులలో ప్రసిద్ధములు. ఆ బ్రహ్మ విద్యలు ముప్పది రెండును బ్రహ్మసాక్షాత్కార సాధనములై నట్లు పాదుకలపై కూర్చబడిన ఈ ముప్పదిరెండు పద్ధతులు బ్రహ్మతత్త్వ నిరూపకములే అనే పరమార్థాన్ని నిరూపించుటకే ఈ సంఖ్యలో పద్ధతులను శ్రీదేశికులవారు మార్చియుండవచ్చును. వ్యాస ప్రణీతములైన బ్రహ్మసూత్రములు నాలుగు అధ్యాయములుగాను ఒక్కొక్క అధ్యాయములో నాలుగు పాదములుగాను మొత్తము మీద నాలుగు నాలుగు పదహారు పాదములుగా గుర్తింపబడినందున రెండు పాదుకలకును ప్రత్యేకముగా ఆషోడశపాదసంఖ్యను వర్తింపచేసినపుడు విస్తరపద్ధతిలో ముప్పది రెండు కావచ్చును. మరియు దేశికులవారు మణిప్రవాళ భాషలో రచించిన సంప్రదాయ గ్రంథములు ద్వాత్రింశద్రహస్యములు అనుపేరుతో ప్రసిద్ధములై యున్నవి. ఆ సంఖ్యపై గల ప్రత్యేక అభినివేశముతో ఈ పద్ధతులను కూడా వారు కూర్చియుందురు. మొదట ఇన్ని పద్ధతులను కూర్చవలెను అని సంఖ్యను నిర్ణయించుకున్న పిదప ఆ పద్ధతులకు విషయములను, వాటిని బట్టి నామకరణములను ఏర్పరచుకొనియుందురు. ఈ మహాగ్రంథమునకు తెలుగులో ప్రతిపదార్థమును సాంప్రదాయిక విశేషములను వివరిస్తూ వ్యాఖ్యానంరావటం ఇదంప్రథమం. ఎన్నో విషయాలను సంగ్రహించి తదేక నిష్ఠతో ఆంధ్రవ్యాఖ్యానమును ప్రసాదించిన శ్రీమాన్ కే.వెంకట రాఘవాచార్యుల వారును ఈవివరణ గ్రంథప్రకటనకు చేయూత నిచ్చిన హైదరాబాదులోని శ్రీ మదహోబిలమఠ నిర్వాహకవర్గమువారును అత్యంత ప్రశంసనీయులు.

1 - 3 - 1996

ఇట్లు విన్నవించు విధేయుడు

శ్రీ.న.చ. రఘునాథాచార్యుడు

సత్సంప్రదాయ పరిరక్షణ సభాధ్యక్షుడు

వరంగల్.

శ్రీ రంగనాథ దివ్యమణి పాదుకాభ్యాంనమః
శ్రీమతే రామానుజాయనమః
శ్రీ మన్నిగమాన్తమహాదేశికాయనమః

శ్రీ రంగనాథ పాదుకాసహస్రమ్

6. అధికార పరిగ్రహ పద్ధతి

141. అధీష్టే పాదుకా సామే యస్యా స్సాకేత వాసిభిః ।
అన్వయ వ్యతిరేకాభ్యా మన్వమీయత వైభవమ్ ॥ –1.

అర్థం :– యస్యాః = ఏ పాదుక యొక్క; వైభవం = ఐశ్వర్యం; సాకేత వాసిభిః = అయోధ్యా నగర పౌరులచేత; అన్వయ వ్యతిరేకాభ్యాం = అన్వయ వ్యతిరేక వ్యాప్తిగల మాటల చేత; అన్వమీయత = ఊహించి చెప్పబడిందో; సా = ఆ; పాదుకా = పాదుకాదేవి; మే = నాకు; అధి + ఈష్టే = అధీశ్వరి అవుతుంది.

తాత్పర్యం :– సాకేత నగర వాసులు అన్వయ వ్యతిరేక వాక్యాలచేత దేని వైభవాన్ని ఊహించి చెప్పినారో ఆ పాదుకాదేవియే నాకు అధీశ్వరి.

రమణీయ వ్యాఖ్య :– పాదుకాదేవియే కోసల దేశాధీశ్వరి.

భరతుడు తల్లులను అయోధ్యలో ప్రవేశింపజేసి, తాను రథమెక్కి నంది గ్రామానికి వెళ్ళి వెంటనే పాదుకలను తలమీద ధరించి

"ఛత్రం ధారయత క్షిప్ర మార్యపాదావిమౌ మతౌ ।
ఆభ్యాం రాజ్యేస్థితో ధర్మః పాదుకాభ్యాం గురోర్మమ ॥"

'ఇవి పూజ్యుడైన రాముని పాదాలు. త్వరగా ఛత్రం పట్టండి. నా గురువైన రాముని ఈ పాదుకలచేత రాజ్యంలో ధర్మస్థాపన జరుగుతుంది' అని మహాజనులతో చెప్పినాడు. రాముడు ఒక్కడే పూజ్యుడు. ఈ రామ పాదుకలు రెండూ శ్రేష్ఠమైనవే. కాబట్టి, రాముని కంటె పాదుకల (కు) అధికారం అధికమని అర్థం. అభిషేక పద్ధతి కంటె ముందు కోసల దేశాధికారాన్ని పాదుకాదేవి పరిగ్రహించినప్పటి గుణాలను దేశికులు స్తుతించారు.

రాముడు ఇక్కడున్న సమయంకంటె ముందుగానీ, తర్వాతగానీ అంత సుభిక్షం లేదన్నమాట నిర్ద్వంద్వం. అందుకు కారణం రాముడా? పాదుకా దేవియా? వైభవమంతా పాదుకాదేవిదే అని పౌరులు భావించారు. సాకేతనగర వాసుల ఆలోచనలన్నీ అక్షరాలా నిజమవుతాయి.

మానవ జీవితంలో అనుమాన ప్రమాణమే అధికంగా ఉపయోగపడుతుంది.

ప్రత్యక్షం, అనుమానం, ఉపమానం, శబ్దం – ఆప్తవాక్యం – అని ప్రమాణాలు నాలుగు రకాలు. అందులో చక్షుస్సంయోగ సన్నికర్షం కలిగిన ప్రత్యక్ష ప్రమాణాన్ని అందరూ అంగీకరిస్తారు. పరోక్షంలో ఉన్నవాటిని మంచి యుక్తుల చేతనూ, తగిన హేతువుల చేతనూ గ్రహింపజేసేది అనుమాన ప్రమాణం. 'అనుమానం' అంటే 'కార్యాన్నిబట్టి కారణాన్ని ఊహించడం'. ఇది 'ప్రమ'యే కాని 'భ్రమ' కాదు. యథార్థమైనదాన్ని 'ప్రమ' అనీ, యథార్థం కానిదాన్ని 'భ్రమ' అంటారు. 'ప్రమ'కు 'కరణం' ప్రమాణం. 'కరణ' మంటే కార్యజనకమైన వ్యాపారంతో కూడిన ముఖ్య కారణం. వాస్తవంగా సర్వ వ్యవహారాలకు కారణమైన జ్ఞానమే బుద్ధి. బుద్ధిమంతులు అర్థం తెలిస్తేగానీ వాక్యాన్ని వాడలేరు. వాన కురిస్తే పంటలు పండుతాయి. కురియకుంటే పండవు. ఈ రెండు – అన్వయం, వ్యతిరేక – వాక్యాల్లోనూ వానయే కారణం కదా!

అనుమానం సిద్ధించడానికి వాడే వాక్యంలో కారణం అన్వయవ్యాప్తినీ, వ్యతిరేక వ్యాప్తినీ కలిగి ఉంటుంది.

1. అన్వయ వ్యాప్తి :– హేతువుండే చోట సాధ్యముండే వ్యాప్తి. రామునికి పాదుకలతో సంబంధమున్నందువల్ల రాముడు విభువు అయ్యాడు.

2. వ్యతిరేక వ్యాప్తి :– సాధ్యాభావానికీ, హేత్వభావానికీ అయిన వ్యాప్తి. పాదుకా సంబంధం లేనందున రాముడు విభుడు కాలేదు.

పాదుకలతో సంబంధం తొలగిన వెంటనే రాముడు దండకారణ్యవాసి అయ్యాడని భావం. పాదుకా సాన్నిధ్యమేర్పడినందువల్ల భరతుడు విభుడయ్యాడు కదా!

ప్రభుత్వం మాత్రం పాదుకానిష్ఠమే. దాసెనపువ్వు ఉన్నచోట స్ఫటికశిల ఉంటే ఆ పువ్వు వన్నె – ఎరుపు రంగు – స్ఫటికశిలను కూడా సంక్రమిస్తుంది కదా! అట్లే పాదుకాదేవి సాన్నిహిత్యం కలవారికి విభుత్వం ఏర్పడుతుంది. అన్వయ, వ్యతిరేక దర్శులైన సాకేత పౌరులు 'పాదుకాదేవి వైభవం సాంసిద్ధికం' అని నిప్పులాంటి నిజాన్ని ఊహించి నిర్ణయించారు.

అనుమాన ప్రమాణాన్ని ఆస్వాదించే రసికులు తార్కికులు. కవితార్కిక కేసరియైన నిగమాంత దేశికులకు కూడా కోసల దేశాధీశ్వరియైన పాదుకాదేవియే ఉపాస్య దేవత.

ప్రేయోఽలంకారంచే అనుప్రాణితమైన అనుమానాలంకారం. అనుష్టుబ్ఛందస్సు.

142. మోచితస్థిరచరా నయత్నతః
కోసలాన్ జనపదా నుపాస్మహే ।
యేషు కాంశ్చన బభూవ వత్సరాన్
దైవతం దనుజవైరి పాదుకా । –2

అర్థం :– యేషు = ఏ దేశాలయందు; దనుజవైరి పాదుకా = రాక్షసులకు విరోధియైన రాముని పాదుక; కాన్+చన = కొన్ని; వత్సరాన్ = ఏండ్లు; దైవతం = దేవతగా (ఆరాధనీయగా) బభూవ = ఉండెనో; అయత్నతః = ఏ ప్రయత్నం లేకయే; మోచిత, స్థిర, చరాన్ = మోక్షమీయబడిన స్థావర జంగమాలుగల; కోసలాన్, జనపదాన్ = కోసల దేశాలను; ఉపాస్మహే = ఉపాసిస్తాం.

తా॥ కర్మజ్ఞానాది సాధనానుష్ఠానమేమీలేకయే నిస్సంసారులుగా జేయబడిన స్థావరజంగమాలుగల కోసల దేశాలను ధ్యానిస్తాం. ఎందుకు? అంటే, శ్రీరాముని పాదుక కొన్ని ఏండ్లు కోసల జనపదాల్లో పూజింపబడింది.

వ్యాఖ్య :– పాదుకాదేవిని ఆరాధించిన కోసల జనపదాలు ఆదరణీయాలు.

కోసల ప్రాంతాల్లోని చేతనాచేతనాలకు పాదుకాదేవిని ఆరాధించే అవకాశం కలిగింది. తత్ఫలితంగా అచ్చటి చరాచరాలకు అంతమందు మోక్షం లభించింది. స్థిరచరాల మోక్షప్రాప్తికి పాదుకాదేవి పద్నాలుగేండ్లు కోసల రాజ్యాన్ని పాలించడమే కారణం. భగవంతుని మహిమగానీ ఆజ్ఞగానీ ఈ ఫలప్రాప్తికి కారణం కాదు. భగవంతుని ఇతర అవతారాల్లో ఇట్టి ఫలప్రాప్తి కలుగలేదు కదా!

రాక్షసాంతకుడైన శ్రీరాముని పాదుకా సేవ లభించడం అసాధారణ విషయం. పాదుకోపాసన వల్ల పురుషోత్త మునికి ఉత్సాహ శక్తి పెరుగుతుంది. తద్వారా దుష్టశిక్షణ, శిష్టరక్షణ జరిగి ధర్మసంస్థాపన ఏర్పడుతుంది. కోసల దేశంలో స్థూల ప్రకృతిగా కనబడే చెట్టు-గుట్ట, పశువు-పక్షి, స్త్రీ-పురుషుడు-అందరూ సూక్ష్మ ప్రకృతిచే విలక్షణమైన వారే. **"నోత్తనోస్మిలేవ్"** - అన్నట్లు వారు ఏ తపస్సు చేయలేదు. ఏ యోగమూ అభ్యసించలేదు. కర్మజ్ఞానాదిసాధనాలను క్లేశ భూయిష్ఠంగా వారు అనుష్ఠించనూ లేదు. ఏ యత్నం చేయకున్నా కోసలులు సంసారబంధ విముక్తులయ్యారు. వారి దృష్టిలో సంసారం నిస్సారమయిపోయింది. దనుజ వైరిచరణ రక్షిణిని తమ అధీశ్వరిగా కొలువడమే తమకు 'శ్రీరామ రక్ష'యని దృఢాధ్యవ సాయంతో పద్నాలుగేండ్లు పాదుకారాధన చేశారు. వారు పరమ భాగవతోత్తములు కదా!

భగవంతుని ఆశ్రయించిన వారికి శాస్త్రవిహితమైన విధులను పాలించడమూ, నిషేధాలను నిరసించడమూ ఆవశ్యకం. భాగవతులను ఆశ్రయించిన వారికి మాత్రం శాస్త్రోక్త విధి నిషేధపాలనలో లోపమున్నా భాగవత బలం వల్లనే పురుషార్థం ప్రాప్తిస్తుంది.

'భాగవతాభిమానం వినామోక్షోపాయం నాస్తి' అన్నట్లు మోక్ష సాధన సామగ్రి లేని అకించనులకు పరమ భాగవత సేవయే ముక్తికి కారణమవుతుంది. కాబట్టి, భగవదు పాసనకంటె కోసల జనపదోపాసన మోక్షహేతువని దేశికుల ఆశయం. కావ్యలింగాలంకారం.

రథోద్ధతా వృత్తం.

143. సామ్రాజ్య సంపదివ దాసజనోచితా త్వం
రామేణ సత్యవచసా భరతాయ దత్తా ।
స త్వాం నివేశ్య చరణావని! భద్ర పీఠే
పృథ్వీం బుభోజ, బుభుజే చ యశో విభూతిమ్ ॥ – 3.

అర్థం :– హే చరణావని = ఓ పాదుకాదేవీ! దాసజన + ఉచితా = భక్తజనులకు సేవింపయోగ్యవైన; త్వం = నీవు; దాసజనోచితా = భృత్యజనులకు అనుభవింపయోగ్యమైన; సామ్రాజ్యసంపత్, ఇవ = అఖండ రాజ్యలక్ష్మివలె; సత్య వచసా = సత్యవాక్కుగల; రామేణ = శ్రీరామునిచేత; భరతాయ = భరతుని (కోసం)కి; దత్తా = ఇవ్వబడినావు; సః = ఆ భరతుడు; త్వాం = నిన్ను; భద్ర పీఠే = సింహాసనమందు; నివేశ్య = ఉంచి; పృథ్వీం = భూమిని; బుభోజ = పాలించెను. యశః + విభూతిం, చ = కీర్తి సంపత్తునూ; బుభు జే = అనుభవించాడు.

తా॥ ఓ పాదుకాదేవీ! భక్త జనులు సేవించడానికి యోగ్యవైన నీవు, భృత్య జనులు అనుభవించడానికి యోగ్యమైన సామ్రాజ్య సంపదలాగా, సత్యవచస్కుడైన శ్రీరామునిచే భరతునికి ఇవ్వబడినావు. ఆ భరతుడు నిన్ను సింహాసనమందు అధిష్ఠింపజేసి భూమిని పాలించాడు, కీర్తి సంపదనూ అనుభవించాడు.

వ్యాఖ్య :– పాదుకను సేవిస్తూ, భరతుడు సామ్రాజ్యాన్ని రక్షించాడు, కీర్తిని గడించాడు.

పాదుకా దేవి దాస జనోచితమైన సామ్రాజ్య సంపత్తులా ఉంది. పాదుకాసేవ చేసే భాగ్యం, దాసదాసీ జనులకు లభిస్తుంది. ఆ సేవయే భృత్యజనానికి **'ఉణ్ణుంశోఱు పరుగు నీరుమ్'** అన్నట్లూ ధారకపోషక భోగ్యంగా ఉంటుంది.

సామ్రాజ్యానికి ధనకనక ధాన్యాద్యైశ్వర్యమూ ఉంటుంది. సామ్రాజ్య నిర్వహణానికి ఎందరో భృత్యులు ఉద్యోగాలు చేస్తారు. ఉద్యోగానికి తగినట్లు సంబలంగా సామ్రాజ్య సంపదనూ అనుభవిస్తారు.

భరతుడు రాజ్యమేలుతాడని పాదుకలనిచ్చిన శ్రీరాముని మాట అసత్యంకాలేదు. రాముడు పాదుకలను భరతునికి ఇచ్చి, కైకేయి కోరికనూ, దశరథుని వరప్రదానాన్నీ, భరతుని దాసత్వ దీక్షనూ నెరవేర్చాడు.

జనక మహారాజువలె విషయలంపటుడుకాని భరతుడు పాదుకా దేవిని ప్రాభవ వైభవాలతో సింహాసనంపైన అధిష్ఠింపజేశాడు. భాగవతోత్తముడు ఏదీ తనది కాదనే భావంతో ప్రవర్తిస్తాడు కదా! భరతుడు పాదుకా ప్రతినిధిగా ఉండి

పృథివిని పాలించాడు. పాదుకా సామ్రాజ్యసంపదను సేవాభావంతో, సంరక్షించాడు. కేవలం కీర్తి రూపమైన సంపదను మాత్రం అనుభవించాడు భరతుడు.

'తస్య నామ మహద్యశః' (శ్రుతి) శ్రియఃపతికే గొప్ప యశస్సు అని పేరు. భరతుడు భగవన్నామ మహిమనే అనుభవించాడు. కాబట్టి,

"న సర్వే భ్రాతర స్తాత భవంతి భరతోపమాః" –

తమ్ములందరు భరతునితో సమానులుకారు, అని శ్రీరామునిచే కీర్తింపబడినవాడు భరతుడు.

'భుజోఽనవనే' – 'భుజ పాలనాభ్య వహారయోః' – అనే 'భుజ్' ధాతువు రక్షణార్థకంగా 'పరస్మైపది'లోనూ, అనుభవార్థకంగా 'ఆత్మనేపది'లోనూ ప్రయోగింపబడుతుంది.

'బుభోజ' – ఇది పరస్మైపది భూతే లిట్ ప్రథమ పురుషైకవచనం.

'బుభుజే' – ఇది ఆత్మనేపది భూతే లిట్ ప్రథమ పురుషైకవచనం.

విశేషమేమి? అంటే, పరిపాలన పరార్థమనీ, యశోవిభూత్యనుభవం ఆత్మార్థమనీ, కవికేసరి భరతుని శీల సంపదను **'తిఙ్గంత'** రూపంతోనే సముచ్చయంగా చిత్రించాడు.

ఉపమా రూపక సముచ్చయాలంకారాల సంసృష్టి ఉక్తి వైచిత్రి. వసంత తిలకా వృత్తం.

144. భోగా ననన్య మనసాం మణిపాదుకే । త్వం
పుష్ణాసి హంత భజతా మనుషంగసిద్ధాన్ ।
తేనైవ నూన మభవ ద్భరతస్య సాధో
రప్రార్థితం తదిహ రాజ్య మవర్జనీయమ్ । – 4.

అర్థం :– హే మణిపాదుకే = ఓ రత్నపాదుకా! త్వం = నీవు; అనన్య మనసాం = నీ కంటె వేరే విషయాలపైన మనస్సును నిల్పనట్టి; భజతాం = ఆశ్రితులకు; అనుషంగ సిద్ధాన్ = ముఖ్య ఫలమైన ముక్తినేకాక, వారు ఆపేక్షించకున్నా నీవు కలుగజేసే; భోగాన్ = సుఖానుభవాలను; పుష్ణాసి = వృద్ధి చేస్తావు; హంత = ఆహా! (ఎంతకృపయో నీకు), తేన, ఏవ = అందుచేతనే; సాధోః = సుజనుడైన; భరతస్య = భరతునికి; అప్రార్థితం = కోరబడని; **తత్** = ఆ కోసల దేశమని ప్రసిద్ధమైన; రాజ్యం = రాజ్యం, ఇహ = ఈ లోకమందు; **అవర్జనీయం** = వదులుకోరానిదిగా; **అభవత్** = ఆయెను, నూనం = నిశ్చయం.

తా। ఓ మణిపాదుకా! నిన్ను ఉపాసించే భక్తులకు నీవు అనుషంగికంగా సిద్ధించే భోగాలను వృద్ధిపరుస్తావు. ఆశ్చర్యమే! ఆ కారణంవల్లనే సుజనుడైన భరతునికి అయాచితమైన రాజ్యం నిశ్చయంగా అవర్జనీయమయింది.

వ్యాఖ్య :– పాదుకాదేవి ఆశ్రితులకు సుఖానుభవాన్ని కలిగిస్తుంది.

పాదుకా దేవి, వేరేచింతలేక తననే ఆశ్రయించిన భక్తులకు, అయాచిత ఫలాన్ని తన సామర్థ్యంచేత కలిగిస్తుంది. ఆశ్రితులు ఇష్టంలేక వదులదలచుకున్నా,వదులుకోరాని ఐహికా ముష్మిక సుఖాలను పెంపొందిస్తుంది.

రామన్నదే రాజ్యమని రామపాదులకనాశ్రయించి అనన్య మనస్సుతో ఉపాసించే భరతుడు స్వయంగా కోరకున్నా, వీరభోజ్యమైన రాజ్యాన్ని భరతునికి సిద్ధింపజేసింది పాదుకాదేవి. అన్నమాటను మీరని సాధుశీలుడైన భరతునికి పద్నాలుగేండ్ల దాకా సిద్ధించిన రాజ్యం, త్యజింపరానిదై పరిపాలింపవలసి వచ్చింది.

"నిన్నై యే తాన్ వేండి నీళ్ శెల్వంవేండా తాన్ తన్నైయే తాన్ వేండుం శెల్వం పోల్" (5–9).

'పరమ పురుషార్థభూతుడైన శ్రియఃపతినే వేడుకొని, గొప్ప సంపదను ఆశింపనివానికి తానే అవసరాన్ని చూచి ఐశ్వర్యంలా నిలుస్తాడు" అని కులశేఖరాళ్వారన్నట్లు, పాదుకాదేవి సుఖభోగాలను ప్రసాదిస్తుంది.

"శరీరారోగ్యమర్థాంశ్చ భోగాంశ్చైవానుషంగికాన్ ।
దదాతి ధ్యాయినాం పుంసా మపవర్గ ప్రదోహరిః ।"

భగవంతుడు తనను ధ్యానించే భక్తులకు యాదృచ్ఛికంగాగాక, అవసరాలకు అనుకూలించే పాడి పంటలనూ, వాటిని అనుభవించడానికి తగిన దేహారోగ్యాన్ని ప్రసాదించి, దేహావసానదశలో మోక్షఫలాన్ని కూడా కృపజేస్తాడు.

'ఫలమత ఉపపత్తేః' అని ఫలాధికరణంలో శ్రీవేదవ్యాస భగవానుడు, జీవునికి సుకృత దుష్కృతాలకు తగిన సుఖదుఃఖ రూపఫలాన్ని ప్రసాదించేవాడు శ్రీమన్నారాయణుడు అని సూత్రీకరించాడు.

ఆశ్చర్యమేమి? అంటే, పాదుకాదేవి అజ్ఞాత నిగ్రహ. కాబట్టి, ఆశ్రితులకు దేవి సుఖభోగాలనే కలిగిస్తుంది.

'వాత్సల్య నిర్భరతయా జననీ కుమారం
స్తన్యేన వర్ధయతి దష్టపయోధరాఽపి ।(గోదాస్తుతి. 27)

పసి నిసుగు పాలుత్రాగుతూ కోరపంటితో చంటిని నొక్కి గంటుపెట్టినా, తల్లి విసుగుపడదు. సరికదా! పైగా కోరినా కోరకున్నా పట్టిని చేరదీసి పట్టి పట్టి పాలిచ్చి నిమ్మకు నీరెత్తినట్లు పెంచుతుంది. నిజంగా, మాతృ వాత్సల్యానికి మాటలు చాలవుకదా!

అనర్ఘమణియున్నచోట అఖిల సంపదలు దినదినమూ అభివృద్ధిచెందుతాయి. మణిమయి పాదుకా సామ్రాజ్యంలో నిత్యం పెరిగే సంపదలతో ప్రజలను సుఖపెట్టే భరతునికి రాజ్యభోగం వర్జనీయం కాదు కదా!

పాదుక ఆశ్రితులకు ఆనుషంగిక ఫలాన్ని కలిగించే కారణంచేత భరతుని ఆనుషంగిక భోగాన్ని సమర్థించడం కావ్యలింగాలంకార లక్షణం. వసంతతిలకా వృత్తం.

145. రామప్రయాణ జనితం వ్యపనీయశోకం
రత్నాసనే స్థితవతీ మణిపాదరక్షే !
పృథ్వీం నిజేన యశసా విహితోత్తరీయా
మేకాత పత్ర తిలకాం భవతీ వితేనే I – 5.

అర్థం :– హే మణి పాదరక్షే = ఓ రత్నపాదుకా! రత్నాసనే = సింహాసన మందు; స్థితవతీ = ఆసీనవైన; భవతీ = నీవు; రామప్రయాణ జనితం = రమణుడు/రాముడు అడవికి వెళ్ళడంచేత కలిగిన; శోకం = దుఃఖాన్ని; వ్యపనీయ = పోగొట్టి; పృథ్వీం = భూదేవిని/సఖిని; నిజేన = స్వీయ; యశసా = కీర్తిచేత; విహిత + ఉత్తరీయాం = చేయబడిన ఉత్తరీయం కలదానిగా; ఏక + ఆత పత్ర, తిలకాం = ముఖ్యమైన ఛత్రమనే బొట్టుకలదానిగా; వితేనే = చేశావు.

తా I ఓ మణి పాదుకా! నీవు రత్న సింహాసనమందు ఆసీనవై పుడమి పడతికి రమణుడైన రాముని ప్రయాణం వల్ల కలిగిన శోకాన్ని తొలగించి, స్వీయకీర్తి చేత పైటను అలంకరింపజేశావు. ఏకచ్ఛత్రమనే తిలకం కలదానిగానూ చేశావు.

వ్యాఖ్య :– పాదుకాదేవి కీర్తిమతియై ఏకచ్ఛత్రంగా రాజ్యమేలింది.

పాదుకాదేవి రత్నపీఠమందు అధిష్ఠించగానే అభిరామమైన పాలనా సామర్థ్యంవల్ల లోకోత్తర కీర్తి వ్యాపించింది. ప్రజలకు రాముని వనవాసం వల్ల కలిగిన శోకమూ తొలగింది. సామ్రాజ్యం ఏకచ్ఛత్రాధిపత్యంగా విరాజమానమయింది.

రాజులు భూనాయకులు కదా! నాయకుడు దేశాంతరంపోతే నాయిక మంచి వలువలు ధరించదు. విరహ బాధచే అలంకారాన్ని ఆదరించదు. మగవారికన్నా మగువలకు సాటివారిపైన సానుభూతి మిన్న. మట్టిలాగా మణికూడా ద్రవ్య విశేషమే కాబట్టి మణిపాదుక తోటి సఖియైన భూనాయిక దైన్యాన్ని నివారింపజేసింది.

దిక్కులకు వ్యాపించేది యశస్సు. ఉత్తర కాయాన్ని ఆచ్ఛాదించేది ఉత్తరీయం. **"సంవ్యాన ముత్తరీయం స్యాత్" (అమరం).**

పాదుకాదేవి తన కీర్తియనే సంవ్యానంచేత భూమిని ఆచ్ఛాదిపంజేసింది. సామ్రాజ్య సూచకమైన ఛత్రం భూమికి అద్వితీయమైన మెరుగు. కాబట్టి, పాదుకాదేవి ఏకాతపత్రమనే తిలకంచేత భూదేవిని అలంకరింపజేసింది. పాదుకాదేవి పరిపాలన భూమికి సింగారమే కదా!

రూపకాలంకారం. వసంత తిలకావృత్తం.

146. రామాజ్ఞయా పరవతీ పరిగృహ్య రాజ్యం
రత్నాసనం రఘుకులోచిత మాశ్రయంతీ ।
శుద్ధాంపదావని! పునర్భవతీ వితేనే
స్వాతంత్ర్య లేశ కలుషాం భరతస్యకీర్తిమ్ । –6.

అర్థం :– హే పదావని = ఓ పాదుకా! రామ + ఆజ్ఞయా = శ్రీరాముని ఆజ్ఞచేత; పరవతీ = పరాధీనవై ; భవతీ = నీవు; రాజ్యం = రాజ్యాన్ని; పరిగృహ్య = స్వీకరించి; రఘుకుల + ఉచితం = రఘువంశయోగ్యమైన; రత్న + ఆసనం = సింహాసనాన్ని; ఆశ్రయంతీ = ఆశ్రయిస్తూ, స్వాతంత్ర్య లేశ కలుషాం = ('నేను రాజును కాను' అని స్వతంత్రుడుగా పలికినందున) కొంచెం మలినమైన; భరతస్య = భరతునియొక్క, కీర్తిం = యశస్సును; పునః = మళ్ళీ; శుద్ధాం = స్వచ్ఛంగా; వితేనే = చేశావు.

తా। ఓ పాదుకాదేవీ! రాముని ఆజ్ఞచేత పరాధీనవై రాజ్యాన్ని పరిగ్రహించి రఘువంశ యోగ్యమైన రత్న సింహాసనాన్ని ఆశ్రయించిన నీవు, స్వాతంత్ర్యం వల్ల కొద్దిగా కళంకితమైన భరతుని కీర్తిని మళ్ళీ పరిశుద్ధం చేశావు.

వ్యాఖ్య :– పాదుకాదేవి భరతునికి పారతంత్ర్య హాని కలుగనీయలేదు.

శ్రీరాముడు అయోధ్యలో నున్నంతవరకు భరతుని కీర్తికి కళంక మంటలేదు. తల్లితండ్రుల ప్రవర్తన వల్ల రామునికి వనవాసం, భరతునికి రాజ్య పరిగ్రహస్థితి దాపురించింది.

"ఉత్తిష్ఠ శేషే కిం రాజన్" కైకేయి భరతుణ్ని "పడుకున్నావేమి? లెమ్ము రాజా!" అని సంబోధించింది. పరిస్థితినిబట్టి, ప్రజలందరు భరతుణ్ని 'మమ్మేలుకోవయ్యా, రాజా!' అని ప్రార్థించారు. భరతుడు స్వతంత్రుడని లోకం కీర్తించింది. భరతుడు, తన కీర్తి కలుషితమయిందని తెలిసి "నాహం రాజా" - నేను రాజును కాను, పరాధీనుణ్ని' - అని విన్నవించుకున్నాడు. శేషభూతుడైన భరతుడు, తనను పరుడైన - సర్వశేషియైన - శ్రీరామునికి అర్పించుకొని, అతనికే రాజ్యపాలనా సామర్థ్యాతిశయాన్ని సమకూర్చ తలచాడు. శ్రీరాముని పాదాలను పట్టుకొని భరతుడు, **"ఇదం రాజ్యం మహాప్రాజ్ఞ స్థాపయ ప్రతిపద్య హి"**

'ఓ రామా! నీవు మహాప్రాజ్ఞుడవు. నేను అశక్తుడను. నీవు అడవిలోనే ఉండి రాజ్యాన్ని కూడా పొంది పరిపాలించు'మనీ ప్రార్థించాడు.

తల్లిదండ్రులిచ్చినా, రాముడు చెప్పినా, రాజ్యాన్ని స్వీకరించక పెద్దలమాటను మీరి, స్వాతంత్ర్య నివృత్తి కోసం పాటుపడిన రీతియే భరతుడు స్వీకరించిన స్వాతంత్ర్యలేశం. కాని ఇది దోషం కాదు. పారతంత్ర్య పోషకమే.

'దాసస్య ప్రసాదం కర్తుమర్హసి' – 'దాసుణ్ని అనుగ్రహించు'మని భరతుడు దాస నామాన్నే స్వీకరించాడు. స్వామి తన పాదుకలను ప్రసాదించాడు. రామాజ్ఞ బలీయమని పాదుకాదేవి రాజ్యాన్ని పరిగ్రహించి రత్న సింహాసన మధిష్ఠించింది.

రఘువంశంలో పుట్టినా భరతుడు తమ్ముడైనంత మాత్రాన రాజ్యాన్ని స్వీకరించలేదే! ఇక రఘువంశంలో జనించని నేను రాజ్యాధికారాన్ని ఎలా స్వీకరిస్తాను? అని పాదుక స్వతంత్రించి పలికితే, భరతుని స్వాతంత్ర్యం సర్వ నింద్యమయ్యేది. అలా పలుకనందువల్ల పాదుకకు కీర్తి కలిగింది. రామపాదుకలను పురస్కరించుకొని రాజ్యాన్ని సంరక్షించడం వల్ల భరతుని కీర్తి పరిశుద్ధమయింది.

భరతుని కీర్తి పూర్వం స్వచ్ఛమయిందే. తర్వాత కొద్ది స్వాతంత్ర్యం చేత మలినమయినా, పాదుకాదేవి మహిమ వల్ల స్వగుణభూత శుద్ధిని మళ్ళీ పొందినదనడం వల్ల పూర్వరూపాలంకారం. వసంత తిలకా వృత్తం.

147. పౌలస్త్య వీర వదన స్తబకావసానాత్
పుష్పాణి దండకవనేష్వప చేతుమిచ్ఛోః ।
రక్షాధురం ధృతవతీ మణిపాదుకే! త్వం
రామస్య మైథిల సుతా సహితే ప్రచారే । –7.

అర్థం :– హే మణిపాదుకే = ఓ రత్నపాదుకా! పౌలస్త్య–నాత్ పౌలస్త్య వీర = వీరుడైన రావణుని యొక్క; వదన స్తబక = ముఖ పంక్తియనే పూలగుత్తి యొక్క; అవసానాత్ = అంతం వరకు, దండకవనేషు = దండకారణ్యాల్లో; పుష్పాణి = పూలను; (రాక్షసుల తలలను) అపచేతుం = కోయడానికి, ఇచ్ఛోః = కోరునట్టి; రామస్య = రాముని యొక్క; మైథిల సుతా సహితే = జానకితో కూడిన; ప్రచారే = సంచార(కాల) మందు; త్వం = నీవు; రక్షాధురం = రాజ్య రక్షణ భారాన్ని; ధృతవతీ = ధరించిన దానవు.

తా॥ ఓ మణిపాదుకా! రావణుని కంఠపంక్తి అనే పుష్పగుచ్ఛం పూర్తి అయ్యేదాక దండకారణ్యాల్లో (ఆజాతి) పూవులను కోయగోరే రాముడు జానకీ సహితుడై సంచరిస్తుంటే, నీవు ఆయన రాజ్యపాలన భారాన్ని భరించావు.

వ్యాఖ్య :– పాదుకాదేవి రాజ్య స్వీకారం, దివ్య దంపతుల విహార సంతోష కారణం.

కర్మ జ్ఞానానుష్ఠాన పరుడైన జనక మహారాజు కూతురు శ్రీరాముని ధర్మపత్ని. జానకీ జాని అరణ్యంలో సంచరించినా, దేవ పూజాదీక్షాపరుడు. దేవతల కోరిక నీడేర్చేదాక రాముడు రాజ్య రక్షణ భారాన్ని వహించలేడు. గృహస్థాశ్రముడైన రాముడు దేవపూజను పత్నీసహితుడై చేయడం విధి విహితం. దేవ పూజకై రాముడు పుష్పాపచయనం చేయాలి.

"వజ్రాదపి కఠోరాణి మృదూని కుసుమాదపి ।
లోకోత్తరాణాంచేతాంసి కోనుజానాతుమర్హతి ।"

వజ్రంకంటె కఠోరంగానూ, పువ్వుకంటె మెత్తగానూ ఉండే లోకోత్తరుల హృదయాలు ఎవరికి తెలియవన్నాడు భవభూతి.

పులస్త్యబ్రహ్మకు పౌత్రుడు, విశ్రవోబ్రహ్మకు కైకసియందు జన్మించిన జ్యేష్ఠపుత్రుడు రావణుడు. పంక్తి కంఠుని కంఠపంక్తి ఒక స్తబకం. ప్రధానమైన రావణ వదనస్తబకాన్ని పూర్తిగా కోసే ఆశయంతో దండకారణ్యాల్లో అసురజాతికి చెందిన ఖరదూషణాదుల తలలనే పూలన్నీ కోయాలనుకున్నాడు. ఉపద్రవాలను నివారించినేగాని రాజ్యపాలన సుకరం కాదు. రావణుడు మహావీరుడు. అయినా మనుజాధీశుడైన శ్రీరాముడు దనుజాధీశుని శిరోలుంఠనం పుష్పాపచయంలాగా, అకుంఠితమైన అవతారలీలగా చేస్తాడు. కాబట్టి, పాదుకాదేవి రాముని రాజ్యరక్షణభారాన్ని వహిస్తుంటే బయటలోకకంటకుల కంఠాలను దునిమి విశ్వకల్యాణాన్ని విస్తరింపజేయడం రామరాజజు ధర్మం. రూపక, ప్రేయోఽలంకారాల సంసృష్టి. వసంత తిలకావృత్తం.

148. పాదావని! ప్రచల చామర బృందమధ్యే
భద్రాసనాస్తరగతా భవతీ విరేజే ।
ఆకీర్ణ దివ్యసలిలే కటకే సుమేరో
రంభోజినీవ కలహాయిత హంసయూథా ॥ –8.

అర్థం :– హే పాదావని = ఓ పాదుకా! ప్రచల చామర బృందమధ్యే = బాగా వీచబడే చామర సముదాయాల నడుమ; భద్ర + ఆసన + ఆస్తర, గతా = సింహాసనం మీద పరచబడిన పట్టు వస్త్రంపైనున్న; భవతీ = నీవు; ఆకీర్ణ దివ్య సలిలే = వ్యాపించిన దేవ నదీజలంగల; సుమేరోః = బంగారు కొండయొక్క; కటకే = మధ్య కక్ష్యయందు; కలహాయిత, హంస యూథా = పరస్పరం జగడమాడుతున్న హంసలగుంపుగల; అంభోజినీ, ఇవ = తామర తీగలా; విరేజే = ప్రకాశించావు.

తా। ఓ పాదుకాదేవీ! కదలాడే చామరాల నడుమ భద్రాసనం మీద పరచబడిన పట్టుబట్ట మీద ఆసీనవైన నీవు, అంతటా వ్యాప్తమైన దివ్యగంగా జలం కలిగిన బంగారు కొండచరియ యందు కలహించే అంచలుగల అంభోజినిలాగా ప్రకాశించావు.

వ్యాఖ్య :– పాదుకాదేవి కమలినీ సదృశంగా విరాజిల్లే వర్ణన.

రెండువైపుల పరిచారకులు వీచే తెల్లని చామరాలు కలహించుకుంటున్న హంసల్లాగా ఉంటే, రత్న సింహాసనం రత్నసాను పర్వత కక్ష్యరీతిగా శోభిస్తున్నది.

"మేరుః సుమేరు ర్హేమాద్రి రత్నసానుః సురాలయః" – (అమరం)

భద్రాసనం మీదను, చుట్టూ తెల్లని పట్టు ఆస్తరణం హేమాద్రి కటి ప్రదేశాన, చుట్టూ వ్యాపించి ఉన్న ఆకాశ గంగా సలిలంగా మిలమిలలాడుతున్నది. పాదుకాదేవి పద్మినిలాగా ప్రకాశిస్తున్నది.

ఆసనాస్తరణ పాదుకా చామరాలకూ, సుమేరు కటక దివ్య సలిలాంభోజినీ హంసలకూ బింబ ప్రతిబింబ భావం నిర్దిష్టం. ఇది యథాసంఖ్యాలంకారం. పాదుకకు అంభోజినీ సాదృశ్యం ఉపమాలంకారం.

నేలకూ, నింగికీ సాదృశ్య కల్పన కవి సమయం. ప్రేక్షకులకు ఆశ్చర్యం. పాదుక భువిలో విరాజమాన అయితే, అంభోజిని దివిలో బ్రాజమానగా ఉక్తి వైచిత్రి. వసంత తిలకావృత్తం.

149. మాన్యే రఘూద్వహపదే మణిపాదుకే! త్వాం
విన్యస్య విగ్రహవతీమివ రాజ్యలక్ష్మీమ్ ।
ఆలోల మక్షవలయీ భరతో జటావా
నాలంబ్య చామర మనన్యమనాః సిషేవే ॥ -9.

అర్థం :- హే మణిపాదుకే = ఓ రత్నపాదుకా! అక్షవలయీ = తామర పూసల మాల కలిగిన; జటావాన్ = జడ దారియైన; భరతః = భరతుడు; త్వాం = నిన్ను; మాన్యే = గౌరవింపదగిన; రఘూద్వహపదే = శ్రీరాముని సింహాసనమందు; విగ్రహవతీం = మూర్తిమతియైన; రాజ్యలక్ష్మీం, ఇవ = రాజ్యలక్ష్మిని వలె; విన్యస్య = ఉంచి; ఆలోలం = ఇటు, అటు చలించే; చామరం = వాలవ్యజనాన్ని; ఆలంబ్య = పట్టుకొని; అనన్యమనాః = ఇతర విషయాల పైన మనస్సును పెట్టకుండా; సిషేవే = సేవించెను.

తా॥ ఓ మణిపాదుకా! జపమాలను త్రిప్పుతూ జడలను ధరించిన భరతుడు, శ్రీరాముని స్థానమందు మూర్తీభవించిన రాజ్యలక్ష్మినివలె నిన్ను ప్రవేశపెట్టి వింజామరాన్ని వీచుతూ నీయందే చిత్తముంచి సేవించాడు.

వ్యాఖ్య :- భరతుడు పాదుకాదేవిని నిశ్చలచిత్తంతో సేవించే వర్ణన.

భరతునికి దారేషణ, ధనేషణ, పుత్రేషణ అనే ఈ షణత్రయంలేదు. కాబట్టి జడలను ధరించాడు. పాదుకా దేవిని శ్రీరాముని సింహాసనమందు అధిష్ఠింపజేశాడు. పరమ శోభతో పాదుక సాక్షాత్తు రాజ్యలక్ష్మి రూపం పొందినట్లుంది. పాదుక శ్రీరామునిదే. రాజ్యలక్ష్మి కూడా శ్రీరామునిదే. కాబట్టి పాదుకా జపం చేస్తూ - మంత్రాన్ని పునశ్చరణజేస్తూ - ఆత్మనివేదనతో వింజామరాన్ని వీచే కైంకర్యపరుడు భరతుడు. వాఙ్మనఃకాయాలతో పాదుకాదేవిని ఉపాసించేవాడు భరతుడు.

పూర్వార్ధం ఉత్ప్రేక్ష. ఉత్తరార్ధం సమాసోక్తి. వసంత తిలక.

150. ప్రాప్తే దివం దశరథే భరతే విలక్షే
పర్యాకులేషు పరముత్తర కోసలేషు ।
త్వం చే దుపేక్షితవతీ క ఇవా భవిష్య
ద్గోపాయితుం గుహ సఖస్య విభోః పదంతత్ ॥ –10.

అర్థం :– ఓ పాదుకా! దశరథే = దశరథుడు; దివం = స్వర్గాన్ని; ప్రాప్తే = పొందినప్పుడు; భరతే = భరతుడు; విలక్షే = వెలుగుపడినప్పుడు; ఉత్తర కోసలేషు = ఉత్తర కోసల దేశవాసులు; పరం = మిక్కిలి; పర్యాకులేషు = కలత చెంది నప్పుడు; త్వం = నీవు; ఉపేక్షితవతీ, చేత్ = ఆదరించక ఊరకున్నచో; గుహ సఖస్య = గుహుని మిత్రుడైన; విభోః = శ్రీరామ ప్రభువు యొక్క; తత్ = ఆ, ప్రసిద్ధమైన; పదం = స్థానాన్ని; గోపాయితుం = కాపాడడానికి; కః, ఇవ = ఎవడైనా; అభవిష్యత్ = ఉండేవాడా?

తా॥ దశరథుడు దివంగతుడయ్యాడు. భరతుడు రాజ్యపాలనయందు వేడుక లేనివాడయ్యాడు; ఉత్తర కోసలులు మిక్కిలి ఆందోళన చెందుతున్నారు. ఓ పాదుకా! ఈ సమయంలో నీవు ఉపేక్షిస్తే, గుహుని సఖుడైన శ్రీరామ ప్రభువు యొక్క పదరక్షణ కోసం ఎవరుండేవారు?

వ్యాఖ్య :– పాదుకాదేవి ఆపన్న రక్షకురాలు.

ఇంగుదీ వృక్షం క్రింద రథం దిగి విశ్రమించదలచుకున్న శ్రీరాముణ్ని నిషాదాధిపతియైన గుహుడు వచ్చి ఆలింగనం చేసుకొన్నాడు.

"యథాఽయోధ్యా తథే యంతే రామ । కింకరవాణితే ।"

'ఓరామ! అయోధ్యలాగా ఈ ప్రాంతమంతా నీ అధీనమే. సకల సేవచేయడానికి సిద్ధంగా ఉన్నాను.' అని గుహుడు సమస్త పదార్థాలను రామునికర్పించాడు.

"అర్చితాశ్చైవ హృష్టాశ్చ భవతా సర్వధావయమ్ ।
పద్భ్యా మభిగమాచ్చైవ స్నేహసందర్శనేనచ" ।(అయో–50 స. 41)

'మా వద్దకు నీవు దూరభారమనుకొనక నడచివచ్చి స్నేహం కనబరచడం వల్లనే, సమస్త పదార్థాలతో మమ్మ సత్కరించినంత సంతృప్తి మాకు కలిగింది' అంటూ రాముడు గుహునితో కరచాలనం చేస్తూ సంభాషించాడు. శ్రీరాముడు నియమబద్ధుడై, లక్ష్మణుడు తెచ్చిన ఉదకాన్ని పానంచేసి కుశాస్తరణం పైన సీతతో పాటు శయనించాడు. లక్ష్మణుడు ధనుష్పాణియై సీతారాముల రక్షణ కోసం జాగ్రతతో ఉండగా, గుహుడు సేనాసమేతుడై లక్ష్మణున్నీ ఒక కంట

కనిపెడుతూ, సీతారాముల నిద్రకు భంగంకలుగకుండారేయెల్ల కాపలా ఉన్న మిత్రుడు గుహుడు. సీతారామ లక్ష్మణులను నావలో ఎక్కించుకొని గంగదాటి దక్షిణ తీరాన ప్రవేశ పెట్టిన పరమ సఖుడు గుహుడు.

నవ విధభక్తిలో సఖ్యభక్తికి ప్రతీక గుహుని స్నేహం. భరతుణ్ని కూడా అనుమానించి, యథార్థం తెలిసిన పిమ్మట, అప్రయత్నంగా ప్రాప్తమైన రాజ్యాన్ని చేతులారా వదలుకుంటున్న నీ కీర్తి శాశ్వతమయింది కదా! **'శాశ్వతీ ఖలు తే కీర్తిః'** అని ప్రశంసించిన పరమభాగవతోత్తముడు గుహుడు.

సీతారాముల శయన స్థలాన్నీ, రాలిన కనకభూషణ కణాలనూ చూపి భరతుని మనోదార్ఢ్యాన్ని ఇనుమడింప జేసిన ఇంగితజ్ఞుడు గుహుడు.

"అద్య ప్రభృతి భూమౌతు శయిష్యేఽహంతృణేషువా ।
ఫలమూలాశనోనిత్యం జటాచీరాణి ధారయన్ ।" (అయో. 88 స. 26)

'నేటి నుంచి నేలమీదగానీ, గరుక మీదగానీ పడుకుంటాను. జటావల్కలాలను ధరిస్తూ ఫలమూలాలను భుజిస్తాను' - అని 'నిరంజనః పరమంసామ్యముపైతి' అనే శ్రుతిరీతిగా, రామునితో సమాన రూపాన్నిదాల్చి, భరతుడు పాదుకార్చకుడుకావడానికి ముఖ్య కారకుడు గుహుడు. ఆర్తుల నాదుకున్న ఆటవిక సఖుడు గుహుడు.

దశరథుడు ఊర్ధ్వలోకానికేగిన తర్వాత భరతుడు విస్మితుడైనప్పుడు, పౌరులు భయభ్రాంతులవుతుంటే ఇక రాజ్యాన్ని రక్షించేవారేరీ! పాదుకాదేవికి మాత్రమే రామ పదాన్ని పరిగ్రహించి రక్షించే అధికారం ఉంది. రామపాద రక్షణయే ప్రధాన మనుకునే పాదుక, సంకటస్థితిలో ఉన్న రాముని గొప్ప ఆస్థానాన్ని రక్షించడానికి ఆదరంతో అపేక్షించడం ప్రజల భాగ్యమే.

సంభావనాలంకారం. వసంత తిలకా వృత్తం.

151. భ్రాతుర్య దంబ! విరహాద్భరతే విషణ్ణే
దాక్షిణ్య మాశ్రితవతీ మణిపాదుకే ! త్వమ్ ।
ఆసీ దశేష జగతాంశ్రవణా మృతం త
ద్వాచాలకాహళసహం బిరుదం తదాతే । –11.

అర్థం :– హే అంబ! మణిపాదుకే = ఓ జననీ! రత్నపాదుకా! భ్రాతుః = అగ్రజుని యొక్క; విరహాత్ = ఎడబాటు వల్ల; విషణ్ణే = దుఃఖితుడైన; భరతే = భరతుని విషయమై ; దాక్షిణ్యం = ఔదార్యాన్ని; త్వం = నీవు; యత్ = ఏదైతే; ఆశ్రితవతీ = వహించ కలిగితివో; తత్ = అది; తదా = అధికార పదవిని పొందినప్పుడు; అశేషజగతాం = సకల

లోకాలకు; శ్రవణ + అమృతం = వీనులవిందైన; వాచాల కాహళసహం = ధ్వనించే కాహళ (తిరుచిహ్నల/సహనాయ్) వాద్యానికి తగిన; తే = నీ యొక్క; బిరుదం = అసాధారణ చిహ్నంగా; ఆసీత్ = ఉండెను.

తా॥ ఓ జననీ, మణిపాదుకా! అన్నగారి యెడబాటువల్ల దుఃఖితుడైన భరతుని విషయమై నీవు దాక్షిణ్యం వహించితివనేది యేదో అది అధికార పరిగ్రహ సమయంలో సమస్త లోకాలకు కర్ణామృతమైన శబ్దించే కాహళ ధ్వనికి తగిన బిరుదంగా ఉండింది.

వ్యాఖ్య :– పాదుకాదేవి దాక్షిణ్యవతి, అని లోకులు బాకాలు ఊది చాటారు.

అదిపాదుకాదేవి సకల జన మనోనయనానందకరంగా అధికారాన్ని పరిగ్రహించిన సమయం. కాబట్టి లోకులు చెవులకు చవులూరించే రీతిగా ప్రశంసించారు. 'బిరుదం' అంటే అసాధారణోత్కర్షావహ చిహ్నం కదా!

శ్రీరాముని వియోగంవల్ల కోసల దేశవాసులేకాదు, అయత్న లబ్ధ రాజ్యాన్నికూడా జారవిడచికొని, ఆ రాజ్య రక్షణ దక్షుడు జ్యేష్ఠభ్రాతయే కాని తానుకాడనీ, భ్రాతృవియోగం తనకూ, పౌరులకూ దుస్సహమనీ, భరతుడూ దుఃఖించాడు. రాముడు యమనియమాలుకలవాడు కాబట్టి అడవికే పోతానన్నాడు. పాదుకాదేవి మాత్రం విషణ్ణులను జూచి ప్రసన్నయై అయోధ్యకు తిరిగి వచ్చింది. అధికారాన్ని చేపట్టింది. అఖిల జనావళిని ఆనందాబ్ధి విలోల వీచికల విహరింపజేసింది. పాదుకా హృదయం ఎంత సారళ్యం కలదో! **"దక్షిణే సరళో దారా"** (అమరం).

చిన్న–పెద్ద, జ్ఞాని–అజ్ఞాని అని చూడక, అందరియందు సమానమైన ప్రేమతో వర్తించే గుణం 'దాక్షిణ్యం', 'అంబ' అనుమాట దాక్షిణ్యం కల వ్యక్తికి సార్థకమవుతుంది.

'పాదుకాదేవి దాక్షిణ్యవతి' అంటూ సకల జనులు వీథుల్లోనూ ఉత్సాహం ఉరకలువేయగా ధ్వనియంత్రం (Loud Speaker) ద్వారా శ్రుతిపేయంగా బిరుదును ప్రకటించారు.

ఉదాత్తాలంకారం. వసంత తిలకా వృత్తం.

152. రాజ్యం తదా దశరథా దను రామతఃప్రాక్
బిభ్రాణయా చరణరక్షిణి! వీతఖేదమ్ ।
తుల్యాధికార భజనేన బభూవ ధన్యో
వంశ స్త్వయాంబ! మనువంశ మహీపతీనామ్ । –12.

అర్థం :– హే అంబ! చరణ రక్షిణి = ఓ తల్లీ! పాదుకా! తదా = అప్పుడు, దశరథాత్, అను = దశరథుని కంటె తర్వాత; రామతః, ప్రాక్ = రామునికంటె ముందు; రాజ్యం = రాజ్యాన్ని; వీతఖేదం = పోగొట్టబడిన శోకం కలదిగా; బిభ్రాణయా

= భరించిన; త్వయా = నీచేత; తుల్య + అధికార, భజనేన = సమాన పదవిని పొందడంతో; మనువంశ మహీపతీనాం = మనువంశ భూపతులయొక్క; వంశః = వంశం; ధన్యః = భాగ్యంకలదిగా; బభూవ = ఆయెను.

తా॥ అమ్మా! ఓ పాదుకా! దశరథుని తర్వాత రామునికంటె ముందు రాజ్యాన్ని బాధానివారకంగా భరించిన నీవు ఏకరాజ్య ప్రభుత్వాన్ని పాలించడం వల్ల వైవస్వత మనువంశ మహారాజుల వంశం ధన్యమయింది.

వ్యాఖ్య :- పాదుకా రాజ్యపాలనం మనువంశ సుకృతం.

శ్రీరంగనాథుడు మనువంశమహీ పాలకుల కారాధ్యదైవం.

"ఇక్ష్వాకూణాంకులధనమిదం" అని కదా! ఆభాణకం. మను మహారాజ వంశీయులు ఏకచ్ఛత్రాధిపత్యంగా రాజ్యమేలినారు. రాజ్యమన్యాక్రాంతం కాలేదు. మనువంశ ప్రభావం స్వతఃసిద్ధం.

"యే యథా మాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహం"

'నన్నెవరెలాగా సేవిస్తే, వారిని నేనలాగే సేవిస్తాను' అని భగవంతుని ఉపదేశం. రామాయణం లక్ష్య గ్రంథమయితే, భగవద్గీత లక్షణగ్రంథంకదా! ప్రపన్నులైన ఆపన్నులు వీత శోకులై సకల సంపన్నులవడం 'ధాతుః ప్రసాదం' - శ్రీరంగనాథ పరబ్రహ్మ యొక్క అనుగ్రహమే.

దశరథుడు లేడాయె. రాముడు రాడాయె. భరతుడు కైకొనడాయె. రాజ్యమంతా శోకగ్రస్తమయినప్పుడు మనువంశ మహీపతులతో సమానంగా తత్కులధనమైన శ్రీరంగనాథుని పాదరక్షిణి అధికారాన్ని పరిగ్రహించింది. రాజ్య భారాన్ని వహించి ప్రజలకు ఈతి బాధలు కలుగకుండా, అద్వితీయప్రాభవ వైభవాలతో ప్రజలను కన్నతల్లిలాగా కాపాడింది. శ్రీరాముని పట్టాభిషేక పర్యంతం పాదుకా రాజ్యమే. కాబట్టి ఒకే ప్రభుత్వ పాలన జరిగింది. పాదుకా సన్నిధానంవల్ల మనువంశ మెల్ల ధన్యమయింది.

'సుకృతీ పుణ్యవాన్ ధన్యః' (అమరం)

స్వతః సిద్ధమైన మనువంశ ప్రభావానికి పాదుకా సన్నిధానం చేత ఉత్కర్ష కలిగిందనడం అనుగుణాలంకార లక్షణం. వసంత తిలకావృత్తం.

153. వర్షాణి తాని వృషలో న తపాంసి తేపే
బాలో న కశ్చిదపి మృత్యువశంజగామ ।
రాజ్యే తవాంబ! రఘు పుంగవ పాదరక్షే !
నైవా పరం ప్రతి విధేయ మభూత్ప్ర సక్తమ్ । - 13.

అర్థం :— హే అంబ! రఘు పుంగవ పాదరక్షే = అమ్మా! ఓ రామపాదుకా! తవ = నీ యొక్క; రాజ్యే = రాజ్యమందు; తాని = ఆ; వర్షాణి = పద్నాలుగేండ్లు; వృషలః = శూద్రుడు; తపాంసి = తపస్సులను; న, తేపే = తపించలేదు. బాలః = బాలుడు; కశ్చిత్, అపి = ఒక్కడు కూడా; మృత్యువశం = యమునికి అధీనుడై; న, జగామ = వెళ్ళలేదు; ప్రతి విధేయం = పరిహారం చేయదగిన; అపరం = మరొకటేదియు, న, ఏవ, ప్రసక్తం, అభూత్ = కలుగనేలేదు.

తా॥ అమ్మా! ఓ రామపాదుకా! పద్నాలుగేండ్లు నీవు రాజ్యమేలుతుంటే, శూద్రుడు తపస్సు చేయలేదు. బాలుడెవ్వడూ చావలేదు. అంతేకాదు, నిరసింపదగిన మరొక ప్రసక్తియే కలుగలేదు.

వ్యాఖ్య :— పాదుకా రాజ్యం రామరాజ్యం కంటె ఉత్కృష్టమయింది.

పాదుకా రాజ్యంలో వేలెత్తిచూపే సంఘటనలే జరుగలేదు. పద్నాలుగేండ్ల తర్వాత రాముడు రాజ్యమేలినాడు. రామరాజ్యంలో సర్వం సుసంపన్నంగానే ఉండింది.

"న పర్య దేవయన్ విధవా నచవ్యాళకృతం భయమ్ ।
నవ్యాధిజం భయం వాఽపి రామేరాజ్యం ప్రశాసతి ।"

రామరాజ్యంలో భార్య జీవించి ఉండగా, భర్త చావలేదు. అంటే పత్నికి వైధవ్య దుఃఖంలేదు. ప్రజలకు చోర మృగరోగ భయమూ లేదు. తండ్రులకు కొడుకుల ప్రేతకార్యాలను చేసే గతిపట్టలేదు. అందరు స్వధర్మ నిర్వహణా సక్తులై యుండిరి. కాని ఒకనాడు,

"అప్రాప్త యౌవనంబాలం పంచవర్ష సహస్రకమ్ ।
అకాలేకాలమాపన్నం మమదుఃఖాయ పుత్రక ।" (ఉ.రా. 73 స. 5)

"కుమారా! పడుచుతనం పొడసూపని పదమూడేండ్ల పదినెలల ఇరువై దినాల బాలుడవు నీవు. నాకు పుత్ర శోకం కలిగించడానికే నీవు అకాల మరణం చెందావు" – అంటూ, ఒక బాపనయ్య ఒకగానొక పుత్రుని శవాన్ని రాజ ద్వారం ముందువేసి దుఃఖింపసాగాడు.

(**'సహస్ర సంవత్సరం సత్రముపాసీత'** – అనే విధి వాక్యంలో సంవత్సరం, దినవాచకంగా సూచితం. కాబట్టి ఇక్కడ 5000 దినసంఖ్య.)

"రామస్య దుష్కృతం కించిన్మహదస్తి న సంశయః ।
యథా హి విషయస్థానాం బాలానాం మృత్యురాగతః" । (ఉ.రా. 73-10).

'రాముని రాజ్యంలో బాలురకు చావు మూడుతున్నదంటే, నిస్సంశయంగా కొద్దిగనో, గొప్పగనో దోషం రామునిదే' – అని విలపిస్తూ రాజదోషముని దూషించాడు ఆ బాపనయ్య.

యుగ ధర్మాన్ని అనుసరించకపోతే అది అధర్మమవుతుంది.

'భవిష్యచ్ఛూద్రయోన్యాం హి తపశ్చర్యా కలౌయుగే'

రాబోయే కలియుగంలో తపస్సుచేసే శూద్రుడు ద్వాపరయుగంలో చేసినా అది అధర్మమే. ఇక ఇప్పుడు - త్రేతాయుగంలోనే చేస్తే చెప్పేదేముంది?

"అద్యతప్యతి దుర్బుద్ధి స్తేనబాల వధోహ్యయమ్ ।
యో హ్యధర్మమకార్యం వా విషయే పార్థివస్యతు" । (ఉ. 74-29)

ఎవడో దుష్టబుద్ధిగల శూద్రుడు ఈకాలంలో గొప్ప తపస్సు చేస్తున్నందువల్ల ఈ బాలుడు మృత్యువాత పడ్డాడు. ఏ రాజు పాలించే దేశంలో అధర్మం, అకార్యం జరిగినా అది రాజ దోషమే అవుతుంది, అని నారదుడు చెప్పాడు.

శ్రీరాముడు పుష్పకవిమానం మీద దక్షిణ దిశకు పయనించి దండకారణ్యంలో శంబూక మునిని పరామర్శించాడు. నీవేల తపస్సు చేస్తున్నావని అడిగాడు.

"శూద్ర యోన్యాం ప్రజాతోఽస్మితప ఉగ్రం సమాస్థితః ।
దేవత్వం ప్రార్థయే రామ! స శరీరో మహాయశః" । (ఉ.రా. 76-2)

"ఓ మహా యశస్వీ! రామ! నేను శూద్రుడను. ఈ శరీరంతోనే స్వర్గానికి పోవడానికి ఉగ్ర తపస్సు చేస్తున్నా" నన్నాడు.

నీటిలోని చేపలు గట్టున పడితే బ్రతుకవు కదా! పార్థివ శరీరం జ్యోతిర్మయమైన దేవలోకంలో మనజాలదు. దశరథునిలాంటి దివ్యాంశసంజాతులైన మహాపురుషులు కూడా దేవతల అనుమతివల్ల స్వర్గానికి వెళ్ళినా మర్త్యలోకానికి తిరిగివచ్చారు. కాబట్టి, శ్రీరాముడు శంబూకుని వధించి, స్వర్గానికి పంపాడు. అధర్మాన్ని నిరసించాడు.

"తస్మిన్ముహూర్తే బాలోఽసౌజీవేన సమయుజ్యత" (76-15) శంబూకుడు దివంగతుడు కాగానే బాలుడు జీవించాడు.

అపరం :- రాముడు రాజ్యమేలగా రాక్షస బాధలూ కలిగినాయి. మధు కుంభీనస అనే దంపతులకు పుట్టిన లవణా సురుడు చ్యవనాది ఋషులను బాధింపసాగాడు. వాని దుండగాలను భరించలేని మునుల మాట విని రాముడు, శత్రుఘ్నుణ్ణి సైన్యంతో పాటు మధుపురానికి పంపి లవణాసురుణ్ణి చంపించాడు. మధుపురం మధురానగరంగా నిర్మితమయింది.

ఈ పాదుకా రాజ్యంలో మాత్రం ఎలాంటి అధర్మ ప్రసక్తియే లేదు. ఉదాత్తాలంకారం. రామరాజ్యంకంటె పాదుకా రాజ్యం ఉత్కృష్టమయినదని వ్యతిరేకాలంకారంచేత అలంకార ధ్వని. **'అప మృత్యు వశం'** అనే పాఠాంతరానికి 'అకాల మృత్యువుకు అధీనం' అని అర్థం.

బాలుని మరణానికి వృషలుని తపశ్చర్యయే కారణం. కాబట్టి, ప్రథమ పాదం కారణంగా, ద్వితీయపాదం కార్యంగా శ్లోక రచన సాగింది. వసంత తిలకా వృత్తం.

154. విశ్వం త్వ దాశ్రిత పదాంబుజ సంభవాయాం
యస్యాం ప్రతిష్ఠితమిదం మణిపాద రక్షే !
ఆసీదనన్య శరణా సమయే యథావత్
సాఽపి త్వయా వసుమతీ విహిత ప్రతిష్ఠా ! –14.

అర్థం :– హే మణిపాదరక్షే = ఓ రత్నపాదుకా! ఇదం = ఈ, విశ్వం = ప్రాకృత ప్రపంచం; త్వత్ + ఆశ్రిత పదాంబుజ సంభవాయాం = నీచే ఆశ్రయింపబడిన చరణ కమలం నుంచి జనించిన; యస్యాం = ఏ భూమియందు; ప్రతిష్ఠితం = ఆధారపడియుందో; సమయే = (రామవనవాస) సమయమందు; అనన్య శరణా = వేరేగతిలేని; సా = ఆ, వసుమతీ, అపి = భూమికూడా; త్వయా = నీచేత; యథావత్ = ఎప్పటిలాగా (తగినట్లు) విహిత ప్రతిష్ఠా = ప్రతిష్ఠింపబడినదై ; ఆసీత్ = ఉండెను.

తా॥ ఓ మణిపాదుకా! ఈ సమస్త ప్రపంచం నీవు ఆశ్రయించిన పాదకమలం నుంచి జనించిన దానియందు ప్రతిష్ఠితమై ఉంది. రాముడు అడవికి వెళ్ళేసరికి నీకన్న వేరే దిక్కులేని ఆ భూమి కూడా నీచేత యథాప్రకారం స్థితి కలదయింది.

వ్యాఖ్య :– పాదుకాదేవి భూమిని విశ్వానికి ఆధారభూతగా ప్రతిష్ఠించింది.

సమస్త ప్రపంచానికి వసుమతియే ఆధారం. పంచభూతాత్మక ద్రవ్యమంతా భూమియందే ఇమిడి ఉంది. కాబట్టి, భూమికి 'వసుమతి' నామం అన్వర్థకం. ఆ వసుమతి భగవత్పాద సంభూత. **'పద్భ్యాంభూమిః'** (శ్రుతి) **'భూః పాదౌ యస్య'** (స్మృతి) జగచ్ఛరీరుడైన విరాడ్పురుషునికి భూమిపాదస్థానీయగా శ్రుతి స్మృతులు చెబుతున్నాయి. భూమికీ భగవత్పాదాలకూ జన్య జనక సంబంధముంది.

తల్లి, తండ్రి, రక్షకుడు, చెలికాడు, గురువు, దైవం, పతి – వీరిని మగువకు ఏడుగడగా చెబుతారు. వసుమతికి రాముడే ఏడుగడ. రాముడు అడవికి పోయిన సమయాన వసుమతి అనన్యగతిక అయింది. అట్టి వసుమతిని హరిచరణ త్రాణ పరాయణయైన పాదుకాదేవి పాలించింది.

యథావత్ :– పూర్వం ఆదిశేషుని రూపంచేత భూమిని స్థిరంగా నిలిపిన పాదుక, మళ్ళీ పాదుకారూపంచేత కూడా భూమిని స్థిరంగా నిలిపింది.

రామచంద్రస్వామి చరణ సంబంధం కలిగిన పాదుకా సంబంధంవల్ల వసుమతికి విశ్వాధారంగాఉండే స్థితి ఎప్పటివలె స్థిరంగానే ఉంది. వసుమతి సర్వదా లబ్ధప్రతిష్ఠయే.

గృహీతముక్త రీత్యా - పట్టి విడిచిన చందాన - చెప్పినందువల్ల, ఇది ఏకా వళ్యలంకారం. వసంత తిలకా వృత్తం.

155. ప్రాయేణ రామవిరహ వ్యథితా తదానీ
ముత్సంగ మాశ్రితవతీ తవ రాజ్యలక్ష్మీః ।
తా మేవ దేవి! నను జీవయితుం జలార్ద్రా
మంగీచకార భవతీ భరతోపనీతామ్ ॥ -15.

అర్థం :- హేదేవి = ఓ పాదుకాదేవీ! రామ విరహ వ్యథితా = శ్రీరాముని ఎడబాటువల్ల వివశయైన; రాజ్యలక్ష్మీః = రాజ్యలక్ష్మి; తదానీం = అప్పుడు; ప్రాయేణ = బహుశః; తవ = నీయొక్క; ఉత్సంగం = ఒడిని; ఆశ్రితవతీ = ఆశ్రయించింది. తాం = ఆ రాజ్యలక్ష్మిని; జీవయితుం, ఏవ నను = బ్రతికించడానికే కాదా; భవతీ = నీవు; భరత + ఉపనీతాం = భరతునిచే తేబడిన; జలార్ద్రాం = నీటిచే తడిపిన వట్టివేర్ల విసనకర్రను; అంగీచకార = సమ్మతించావు.

తా। ఓ పాదుకాదేవీ! శ్రీరాముని వియోగంవల్ల వివశయైన రాజ్యలక్ష్మి అప్పుడు నీ యొడిలో పడిపోయినందు ననే కాబోలు ఆమెను జీవింపజేయడానికే నీవు భరతుడు తెచ్చిన జలార్ద్రాన్ని అంగీకరించావు.

వ్యాఖ్య :- పాదుకాదేవి పరమకారుణ్యం ఉత్ప్రేక్షితం.

రాముడు అడవికి వెళ్ళగానే రామ వియోగాన్ని భరించలేక రాజ్యలక్ష్మి స్మృతి తప్పి పాదుకాదేవి ఒడిలో పడిపోయింది. నాయకుని విరహాన్ని సహించని నాయిక ఒక నెచ్చెలి యొడిలో తెలివితప్పి పడిపోవడం రాసిక్య లక్షణం. దగ్గర ఉన్న చెలులు మోహితయైన నాయికకు శీతలోపచారాలుచేస్తూ పలుపాట్లు పడుతారు.

'విస్మయా మంత్రణే నను' (అమరం) 'మన్యే శంకే ధ్రువం ప్రాయో నూన మిత్యేవ మాదిభిః । ఉత్ప్రేక్షా వ్యజ్యతే శబ్దైరివ శబ్దోఽపితాదృశః' । 'ప్రాయః, ఇవ, ధ్రువం, నూనం' - మొదలైన పదాలచే ఉత్ప్రేక్షించడం గమనీయం.

'జలార్ద్ర' మంటే సువాసనగల వట్టివేళ్ళచే నిర్మింపబడి, నీటితో తడుపుతూ చల్లనిగాలిని వీచడానికి ఉపయోగించే సాధనం - విసనకర్ర.

"ధవిత్రం తాళవృంతంస్యా దుత్క్షేపో వ్యజనంచతత్ । జలార్ద్రాస్యా జ్జలేనార్ద్రం" - (వైజయంతి)

రాజ్యలక్ష్మిని బ్రతికించడం కోసం భరతుడు తెచ్చిన జలార్ద్రంతో శీతలోపచారం చేయడానికి పాదుకాదేవి సమ్మతించింది.

పాదుకా పరమైన రాజ్యలక్ష్మి భరతుని ద్వారా చైతన్యవతిగా శోభిస్తుందని సారాంశం. వసంత తిలకా వృత్తం.

156. వీర వ్రత ప్రణయిని ప్రథమే రఘూణాం
ప్రాప్తే చిరాయ భరతే వ్రత మాసిధారమ్ ।
త్యక్త్వా పదావని! తదా వివిధా న్విహారా
నేకాసికా వ్రత మపూర్వ మవర్తయస్త్వమ్ । –16.

అర్థం :– హే పదావని = ఓ పాదుకాదేవీ! రఘూణాం = రఘు వంశీయుల్లో; ప్రథమే = శ్రేష్ఠుడైన శ్రీరాముడు; వీర వ్రత ప్రణయిని = (పితృవాక్య పాలన మనే) వీరవ్రతమందు ప్రీతికలవాడు కాగా; భరతే = భరతుడు; చిరాయ = చాలా కాలం; ఆసిధారం = కత్తుల అంచులకు సంబంధించిన; (తీక్ష్ణమైన) వ్రతం = నియమాన్ని; ప్రాప్తే = పొందినవాడు కాగా; తదా = అప్పుడు; త్వం = నీవు; వివిధాన్ = పలు రకాల; విహారాన్ = విలాసపు నడకలను; త్యక్త్వా = త్యజించి; అపూర్వం = ఇంతకు ముందు అనుష్ఠించని; ఏక + ఆసికా వ్రతం = ఒక కత్తి మీద కదలక ఉండే నియమాన్ని; అవర్తయః = పాటించావు.

తా। ఓ పాదుకాదేవీ! రఘువంశీయులలో శ్రేష్ఠుడైన శ్రీరాముడు యుద్ధోత్సాహులకు సంబంధించిన వ్రతాన్ని ఇష్టపడగా; భరతుడు అసిధార వ్రతాన్ని పాటించే వాడై ఉండగా, అప్పుడు నీవు వివిధ విహారాలను వదులుకొని పూర్వ మనుష్ఠింపబడని ఏకాసికా వ్రతాన్ని చలించక పాటించావు.

వ్యాఖ్య :– పాదుకా వ్రతం రామ భరతుల వ్రతాల కన్న శ్రేష్ఠమయింది.

రఘువంశంలో జన్మించిన రాజులందరు వీరపురుషులే. వారు రాజ్యాన్ని పాలిస్తూ, శత్రువీరులను నిరసించారు. కానీ, శ్రీరాముడు పితృవాక్య పాలన కోసం రాజ్యాన్ని త్యజించి, అడవులకేగి, పగతురను తెగనరుకక తిరిగి రాలేననే యుద్ధోత్సాహనియమాన్ని పాటించాడు. కాబట్టి రఘు వంశీయులలో రాముడు శ్రేష్ఠుడు.

'వీరు'డంటే రెండు కాళ్ళు ఒక్కచోట పెట్టే తీరిక లేకుండా వివిధ గతులతో శత్రువుల నెదుర్కొని పోరాడే వ్యక్తి, అని ఒక అర్థం. గత్యర్థకమైన 'అజ' ధాతువుకు 'వీ' ఆదేశమై, ఉణాదిసూత్రంచే 'రక' ప్రత్యయంచేర్చగా వీరశబ్దం నిష్పన్నం.

వినా ఈర్తే = వీరః. పక్షి గమనుడని మరొక అర్థం. గరుడగమనుడైన శ్రీమహావిష్ణువు దేవతలకిచ్చిన మాటను పాటించే నియమంతో రక్షః శిక్షాదక్షుడుగా అవతరించినవాడు రాముడు.

'విష్ణుర్వై ప్రథమః' అని శ్రుతి. 'ప్రథమ' శబ్దప్రయోగం వల్ల శ్రేష్ఠుడనే అర్థమేకాక, ఆది దేవుడే రాముడన్న అర్థమూ గోచరిస్తుంది.

'రామో విరామః' అని పేర్కొంటూ, **'వీరఃశక్తిమతాం శ్రేష్ఠః'** అని భీష్ముడూ స్తుతించాడు.

కత్తుల అంచు మీద నడిచే వృత్తితో జీవించే వ్యక్తి సుశిక్షితుడై నందువల్ల సావధానుడై నడిచే రీతిగా, అయత్న లబ్ధ రాజ్యాన్ని పరిత్యజించి సర్వదా పారతంత్ర్యంతో జీవిస్తూ, దృఢా ధ్యవసాయం వల్ల దాస్య వృత్తి నియమాన్ని పాటించిన వాడు భరతుడు.

రామ భరతులు మొదటి నుంచి తమ తమ నియమాలను సక్రమంగా అనుష్ఠిస్తున్నవారే. కానీ పాదుకాదేవి పాటించే వ్రతం అపూర్వం. పాదుకలకు ఎల్లప్పుడు విలాసంగా సంచరించడమే నియమం. ఇప్పుడు పాదుకాదేవి తన సంచార నియమాన్ని త్యజించి, అధికారాన్ని పరిగ్రహించి, ఎన్నడూ అలవాటులేని, ఒక్క కత్తి అంచుపైన ఇటూ – అటూ కదలక నిలచి ఉండే రీతిగా, పద్నాలుగేండ్లు అచంచలస్థితి రూపమైన నియమాన్ని పాటిస్తున్నది. కాబట్టి పాదుకాదేవి యొక్క ఏకాసికావ్రతం అపూర్వమన్నారు దేశికుల వారు.

నమ్మాళ్వారు చింతచెట్టు క్రింద చిరకాలం నిశ్చలంగా కూర్చున్న స్థితి ధ్వనిస్తుందీ శ్లోకంలో.

వ్యతిరేకాలంకారం. వసంత తిలకా వృత్తం.

157. కాకుత్స్థ పాద విరహ ప్రతిపన్న మౌనాం
నిష్పందతా ముపగతాం మణిపాదరక్షే !
ఆశ్వాస యన్నివ ముహు ర్భరతస్తదానీం
శీతై రవీజయత చామర మారుతైస్త్వామ్ I –17.

అర్థం :– హే మణి పాదరక్షే = ఓ రత్నపాదుకా! కాకుత్స్థ = మౌనాం I కాకుత్స్థపాద = శ్రీరాముని చరణాల యొక్క / పూజ్యుడైన శ్రీరాముని యొక్క; విరహ = ఎడబాటుచేత; ప్రతిపన్న = పొందిన; మౌనాం = మౌనంగల; నిష్పందతాం = నిశ్చలభావాన్ని; ఉపగతాం = పొందియున్న; త్వాం = నిన్ను; ముహుః = మాటిమాటికి; ఆశ్వాసయన్, ఇవ = సమాధానపరుస్తున్నాడన్నట్లున్న; భరతః = భరతుడు; తదానీం = అప్పుడు; శీతైః = చల్లని; చామర మారుతైః = వింజామరాల గాలులచేత; అవీజయత = వీచెను.

తా| ఓ మణిపాదుకా! శ్రీరాముని పాదాలయొక్క (పూజ్యుడైన శ్రీరాముని) వియోగం వల్ల మౌనం వహించి స్పందించకుండా ఉన్న నీకు సేదదీర్చేలాగా భరతుడు చామరాలతో చల్లని గాలులను వీచాడు.

వ్యాఖ్య :– భరతుడు పాదుకాదేవికి ఉపచరిస్తున్నట్లు ఉత్ప్రేక్షితం.

దేవరాజు ప్రార్థించడం వల్ల కకుత్స్థుడు, ఇంద్రుణ్ని ఎద్దుగాచేసి దాని మూపుమీద ఎక్కి రాక్షసులను జయించిన మహా పరాక్రమవంతుడు. ఇతని మొదటి పేరు 'పురంజయుడు'. కకుత్స్థుని వంశంలో జన్మించినవాడు కాబట్టి శ్రీరాముడు కాకుత్స్థుడు. పాద శబ్దం పూజ్యార్థకం. రాముడుపాదుకలను ధరించి సంచరిస్తున్నప్పుడు మణులు

కదులుతూ ధ్వనిస్తుండేవి. రామపాదా సక్తయైన పాదుకకు రామచరణ వియోగం కలిగింది. తత్ఫలితంగా, పాదుక రాజ్యాధికారాన్ని పరిగ్రహించినా, మంత్రాలోచన చేయకుండా ఒక్కచోటనే, చలించక నిశ్శబ్దంగా ఉంది.

భరతుడు, పాదుకారాధకుడు కాబట్టి రామపాద విరహం వల్ల కలిగిన ఆయాసాన్ని తొలగించి రాజ్యతంత్రం నడపడానికి తగినట్లు పన్నీట తడిపిన చామరాలను వీచుతూ, పాదుకాదేవికి చల్లనిగాలిని ప్రసరింపజేశాడు. భరతుడు వింజామర వీచి ఉపచారం చేయడం, చరణ వియోగం వల్ల స్పందించక మౌనంగా ఉన్న పాదుకాదేవిని ఓదార్చుతున్నట్లున్నది.. వసంత తిలకావృత్తం.

158. యత్ర క్వచి ద్విహరతోఽపి పదారవిందం
రక్ష్యం మయా రఘుపతే రితిభావయంత్యా ।
నిశ్శేష మేవ సహసా మణిపాదరక్షే!
నిష్కంటకం జగదిదం విదధే భవత్యా । –18.

అర్థం :– హే మణిపాదరక్షే = ఓ రత్నపాదుకా! యత్ర, క్వచిత్ = ఎక్కడనైనా, విహరతం, అపి = సంచిరించిననూ; రఘుపతేః = శ్రీరామునియొక్క; పదారవిందం = చరణకమలం; మయా = నాచేత; రక్ష్యం = కాపాడ దగినది; ఇతి = అని; భావయంత్యా = తలంచే; భవత్యా = నీ చేత; ఇదం = ఈ; జగత్ = లోకం; నిశ్శేషం, ఏవ = సంపూర్ణం గానే; సహసా = శ్రీఘ్రంగా; నిష్కంటకం = కంటకరహితంగా (ముండ్లు, శత్రువులు లేకుండా) విదధే = చేయబడింది.

తా। ఓ మణిపాదుకా! శ్రీరామచంద్రస్వామి ఎక్కడ విహరించినా, ఆయన చరణకమలాలను 'నేను రక్షించ వలసిందే' అని చింతిస్తున్న నీవు ఈ లోకాన్ని వెంటనే నిశ్శేషంగా నిష్కంటకం చేశావు.

వ్యాఖ్య :– పాదుకాదేవి అధికారాన్ని పరిగ్రహించడం వల్ల జగత్తు నిష్కంటకమయిందని శ్లేషతో ఉత్ప్రేక్షితం.

శ్రీరాముడు అయోధ్యలో ఉన్నా, అడవిలో సంచరించినా పాదుకాదేవికి స్వామి పాదారవిందాలను కాపాడే చింత స్వాభావికం.

"సూచ్యగ్రే క్షుద్ర శత్రౌ చ రోమహర్షేచ కంటకః" (అమరం).

'కంటక' శబ్దానికి ముల్లు, పగవాడు, గగుర్పాటు – అని నానార్థాలున్నాయి. రామపాద సంసర్గంతో సంచరిస్తున్నప్పుడు, పాదుక పాదతలాలకు – అరికాళ్ళకు – ముల్లునాటకుండా కాపాడుతుండేది. అప్పుడు (క్వచిత్) ఎక్కడో ఒక్కచోట కంటకముఖభంగం చేస్తుండేది. అధికారం చేబట్టిన తర్వాత చారుల ద్వారా విషయం తెలుసుకొని మంత్రాలోచన చేయడం మొదలైన పాదుకా ప్రాభవవైభవాలవల్ల, రాజ్యంలో క్షుద్ర శత్రువులందరూ నిరాకృతులయ్యారు.

శ్రీరాముని పాదారవిందాలను సంతతం స్మరించడంవల్ల, తాను ఒకేచోట నిశ్చల స్థితిలో ఉన్నా, సంకల్ప బలంతో సర్వత్ర నిష్కంటకం చేసి, భగవత్పదం వలె రాజ్యపదాన్నీ కాపాడుతున్నది. నిఖిల జగత్తు నిశ్శేషంగా నిష్కంటకమవడానికి స్వామి చరణారవిందాలను సతతం సంస్మరించడమే హేతువు. వసంత తిలకా వృత్తం.

159. రామంత్వయా విరహితం భరతం చ తేన
త్రాతుం పదావని ! తదా యదభూత్ ప్రతీతమ్ ।
రామా నుజస్య తవచాంబ! జగత్సమస్తం
జాగర్తి తేన ఖలు జాగరణ వ్రతేన । –19.

అర్థం :– హే అంబ! పదావని = ఓ తల్లీ! పాదావనీ! త్వయా = నీచేత; విరహితం = ఎడబాసిన; రామం = శ్రీరాముణ్ని; తేన = ఆ రామునిచేత; విరహితం = ఎడబాటు చెందిన; భరతం, చ = భరతుణ్ని కూడా; త్రాతుం = రక్షించడం కోసం; రామానుజస్య = లక్ష్మణునికి; తవ, చ = నీకు కూడా; తదా = అప్పుడు యత్ = ఏ నియమం; ప్రతీతం = ప్రసిద్ధం; అభూత్ = అయిందో; తేన = ఆ; జాగరణ వ్రతేన, ఖలు = జాగరణ వ్రతం చేతకదా! సమస్తం, జగత్ = మొత్తం లోకం; జాగర్తి = మేలు కుంది. (ఉపద్రవమేమి లేకుండా సుఖంగా ఉంది.)

తా॥ అమ్మా! పాదుకా! నీచే విరహితుడైన రాముని రక్షణార్థం లక్ష్మణుడూ, రామునిచే విరహితుడైన భరతుని రక్షణార్థం నీవూ, జాగరణ చేశారనేది ప్రసిద్ధమే. మీ ఇద్దరి జాగరణ వ్రతం వల్ల, ప్రపంచమంతా మెలకువతో ఉంది.

వ్యాఖ్య :– లక్ష్మణుడూ, పాదుక జాగరణ చేయడంవల్ల ప్రపంచమంతా సుభిక్షంగా ఉంది.

శ్రీరాముడు పాదుకలను భరతునికి ఇచ్చాడు. కాబట్టి పాదుకా విరహితుడైన రాముణ్ని లక్ష్మణుడు కనురెప్ప వాల్చకుండా కాపాడాడు.

"అహంసర్వం కరిష్యామి జాగ్రతః స్వపతశ్చతే" అన్నట్లు జాగరణ వ్రతాన్ని స్వీకరించిన లక్ష్మణుడు, పాదుకా త్యాగానంతరం జాగరణ తీవ్రతరం చేశాడు.

"తం జాగ్రత మదంభేన భ్రాతురర్థాయ లక్ష్మణమ్". లక్ష్మణుడు నిద్రపోకుండా రాముణ్ని నిష్కపటుడై కాపాడినాడని వాల్మీకి సూక్తి. పాదుకాదేవి అధికారాన్ని చేబట్టి, రామునిచే విరహితుడై నిద్రపోకుండా నిరీక్షించే భరతుని రక్షణార్థం మెలకువతో ప్రవర్తించింది. తక్కిన రాజుల్లాగా అంతఃపురానికి గానీ, కార్యాంతరానికిగానీ వెళ్ళే ప్రసక్తియే లేని పాదుకా దేవి రేయింబవలు సింహాసనం మీద ఏకాసికావ్రతంగా ఉండి ఆధిపత్యాన్ని నిర్వహించింది. **"నియమో వ్రతమస్త్రీస్యాత్"** (అమరం).

"యదా సదేవో జాగర్తి తదేదం చేష్టతే జగత్" సర్వేశ్వరుని జాగ్రదవస్థలోనే జగద్వ్యాపారం కలుగుతుంది – అన్నట్లు దేవజాగరణలాగా, పాదుకా జాగరణం కూడా సర్వ ప్రవృత్తి హేతువు. ఈ శ్లోకం పాదుకా రామానుజుల – ఇద్దరి

– జాగరణ వ్రత కారణం చేత సకల జగత్తు బాధారహితంగా ఉండిందనడం వాక్యార్థ హేతుక కావ్యలింగాలంకారం. ఎన్నడో జరిగిన జగజ్జాగరణం ఇప్పటికీ వర్తిస్తున్నదని చెప్పడం భావికాలంకార లక్షణం. వసంత తిలకా వృత్తం.

160. అంతః పురే పరిజనైః సమయోపయాతై
రభ్యర్చితా భవసి యా వినయోప పన్నైః ।
సా కోసలేశ్వర పదావని! భూ పతీనాం
సంఘట్టనం మకుట పంక్తిభి రన్వభూస్త్వమ్ । –20.

అర్థం :– హే కోసలేశ్వర పదావని = ఓ రామపాదుకా! యా = ఏ నీవు; అంతఃపురే = అంతఃపురమందు; సమయ + ఉపయాతైః = ఆయా సమయాల్లో వచ్చిన; వినయ + ఉప పన్నైః = వినయంతో కూడిన; పరిజనైః = పరిచారిక జనులచేత; అభ్యర్చితా = సుకుమారంగా పూజింపబడుతూ; భవసి = ఉన్నావో; సా = అట్టి, (సుకుమార తనువు గల) త్వం = నీవు; భూపతీనాం = రాజులయొక్క; మకుట పంక్తిభిః = కిరీట శ్రేణులచేత; సంఘట్టనం = ఒత్తిడిని; అన్వభూః = అనుభవించావు.

తా। ఓ కోసలేశ్వర పదావనీ! అంతఃపురంలోకి ఆయా సమయాల్లో వచ్చే వినయ విధేయతలు కలిగిన పరిచారికలచే పూజింపబడే నీవు రాజుల కిరీట సముదాయాలచే కలిగే రాపిడినీ అనుభవించావు.

వ్యాఖ్య :– సుకుమార దేహంగలపాదుకాదేవి, రాజుల కిరీటాల ఒరపిడిని కూడా ఓర్చుకునే వర్ణన.

సుకుమారమైన ఆకృతి కలిగిన పాదుకాదేవికి అంతఃపుర పరిచారజనులు నియమిత సమయానికి వచ్చి భయ భక్తులతో మృదువుగా షోడశోపచార పూజను చేస్తుంటారు. రాజ్యాధికారాన్ని పరిగ్రహించిన పాదుకాదేవికి పేరోలగంలో బారులు దీరి నిలిచియున్న రాజులు ఒకరి తర్వాత ఒకరు వచ్చి నమస్కరిస్తుంటారు. రాజులు ధరించిన రత్న కిరీటాలు పాదుకలకు ఒరసికొన్నందువల్ల బాధగానే ఉంటుంది. సౌకుమార్యం మొరటుతనాన్ని సహించదుకదా! జాగరణ వ్రతం కష్టమైనా లక్ష్మణునికి ఇష్టమైనట్లే, పాదుకాదేవికి జగద్రక్షణార్థం బహు కిరీట సంఘట్టనం ఇష్టమే.

విషమాలంకారం, వసంత తిలకా వృత్తం.

161. ప్రాప్యాధికార ముచితం భువనస్య గుప్త్యై
భద్రాసనం భరతవందిత మాశ్రయంత్యా ।
మధ్యేఽవ తీర్ణమివ మాధవ పాదరక్షే!
మాతస్త్వయాఽపి మనువంశ మహీపతీనామ్ । –21.

అర్థం :– హే మాతః! మాధవపాదరక్షే = అమ్మా! విష్ణుపాదుకా! భువనస్య = లోకం యొక్క; గుప్త్యై = రక్షణ కోసం; ఉచితం = తగిన; అధికారం = అధికారాన్ని; ప్రాప్య = పొంది; భరతవందితం = భరతుని చేసేవింపబడిన; భద్రాసనం = సింహాసనాన్ని; త్వయా, అపి = నీవుకూడా; ఆశ్రయం త్వా = ఆశ్రయిస్తుండగా; మను వంశ మహీపతీనాం = మను వంశ మహారాజులయొక్క; మధ్యే = నడుమ, అవతీర్ణం, ఇవ = అవతరించినట్లే ఉంది.

తా॥ తల్లీ! విష్ణుపాదుకా! జగద్రక్షణార్థం యోగ్యమైన అధికారాన్నిపొంది భరతుడుకొనియాడే సింహాసన మధిష్ఠించిన నీవు కూడా మనువంశ మహీపతుల మధ్య అవతరించినట్లే ఉంది.

వ్యాఖ్య :– పాదుక లోక రక్షణ కోసం మనువంశ మహీపతుల మధ్య అవతరించిందని ఉత్ప్రేక్షితం.

"అధిరోహర్యపాదాభ్యాం" అని భరతుని ప్రార్థనను అనుసరించి పాదుక సమస్త జగత్తుకు యోగ క్షేమాలను కలిగించే యోగ్యతను – అధికృత అధికారాన్ని – శ్రీరామచంద్రస్వామి చరణ సత్తావల్ల పొందకలిగింది. రాజ్యమేల దగిన భరతుడు బహుధాప్రస్తుతించే భద్రాసనాన్ని పాదుక అధిష్ఠించింది. మను వంశంలో జన్మించి రాజ్యమేలిన శ్లాఘ్యశీలురైన ఐక్ష్వాకుల మధ్యన శ్రీ మహావిష్ణువు రాముడుగా అవతరించాడు.

మాధవుడే మను వంశ మహారాజుల మధ్య అవతరించగా, మాతయైన పాదుకాదేవి ఆ వంశంలో అవతరించడం అనుచితంకాదు. ఆనువంశికమే కదా! కాబట్టి, పాదుక రాజ్యాధికారాన్ని పరిగ్రహించడం సముచితమే.

'రాజ్యంతదా' (152) శ్లోకంలో, పాదుకా తుల్యాధికార యోగంవల్ల మనువంశం సుకృతమయిందని వర్ణితం. ఈ శ్లోకం మనువంశ మహీపతుల మధ్య శ్రీ మహావిష్ణువు అవతరించినట్లే, పాదుక అవతరించినట్లు సుశ్లోకిస్తుంది. కాబట్టి పునరుక్తి లేదు, కాదని స్పష్టం. వసంత తిలక.

162. రాజాసనే రఘుకులోద్వహ పాదరక్షే!
నీరాజనం సమభవ త్సమయోచితంతే ।
శ్లాఘావశేన బహుశః పరిఘూర్ణితాభిః
సామంత మౌళి మణి మంగళ దీపికాభిః । –22.

అర్థం :– హే రఘుకుల + ఉద్వహ, పాదరక్షే = రఘుకులశ్రేష్ఠుడైన ఓ రాముని పాదుకా! శ్లాఘావశేన = కీర్తించిన కారణం చేత; బహుశః = చాలసార్లు; పరిఘూర్ణితాభిః = చుట్టుతిరిగిన; సామంత మౌళిమణి మంగళ దీపికాభిః = సన్నిహిత దేశాధిపతుల కిరీటాల్లోని మణులు అనే మంగళ దీపాలచేత; తే = నీకు; రాజాసనే = సింహాసనమందు; సమయ + ఉచితం = కాలానికి తగిన; నీరాజనం = ఆరతి; సమభవత్ = సమకూరెను.

తా| ఓ రామ పాదుకా! నిన్ను కీర్తించడంవల్ల పదే పదే పరిభ్రమించే సామంతరాజుల కిరీటాల యందున్న మణిమయ మంగళదీపాలచేత సింహాసనం దగ్గర నీకు కాలానుగుణమైన నీరాజనం సమకూరింది.

వ్యాఖ్య :– సామంతరాజుల మౌళి మణిదీపికలే పాదుకాదేవికి నీరాజనాలయ్యాయి, అని రూపక సంకీర్ణంగా ఉత్ప్రేక్షితం.

పాదుకాదేవి సింహాసన మధిష్ఠించి అధికారాన్ని పరిగ్రహించినప్పుడు ఆమె కల్యాణగుణాలను అందరూ ప్రశంసించారు. గుణాలను కీర్తించడంవల్ల సింహాసనం ముందు రెండు వైపుల బారులు దీరి నిలిచియున్న రాజులు మెచ్చుకుంటూ పదే పదే తలలూపారు. రాజుల తలల మీద కిరీటాలున్నాయి. కిరీటాల్లో పొదుగబడిన మణులు తలలూపినా కొలది, వివిధ కోణాల నుంచి కాంతులనెగజిమ్ముతూ మంగళారతుల్లాగా రూపొందాయి. ఈ సన్నివేశం మాణిక్య దీపాలతో సింహాసనాధిష్ఠితయైన పాదుకాదేవికి నీరాజన మొసగినట్లు సంభావింపబడింది. వసంత తిలకా వృత్తం.

163. పృథ్వీ పతీనాం యుగపత్కిరీటాః
ప్రత్యర్థినాం ప్రాణితు మర్థినాంచ।
ప్రాపు స్తదా రాఘవ పాదరక్షే!
త్వదీయ మాస్థానిక పాద పీఠమ్ । – 23.

అర్థం :– హే రాఘవ పాదరక్షే = ఓ రామపాదుకా! తదా = నీ పరిపాలనమప్పుడు; ప్రత్యర్థినాం = శత్రువుల యొక్క; కిరీటాః = కిరీటాలు; ప్రాణితుం = బ్రతుకడానికి; అర్థినాం = కోరిన; పృథ్వీపతీనాం = రాజుల యొక్క; కిరీటాః, చ = కిరీటాలు కూడా, యుగపత్ = ఏకకాలమందు; త్వదీయం = నీదైన; ఆస్థానిక పాదపీఠం = సింహాసనం క్రింద కాళ్ళు పెట్టుకోవడానికి ఉండే పీఠాన్ని; ప్రాపుః = పొందినాయి.

తా| ఓ రాఘవ పాదుకా! శత్రురాజుల కిరీటాలూ, జీవింపగోరే రాజుల కిరీటాలూ ఒకేసారి నీ అధికార కాలంలోనే పాదపీఠాన్ని చేరుకున్నాయి.

వ్యాఖ్య :– అనుకూల, ప్రతికూల రాజుల కిరీటాలకు పాద పీఠ ప్రాప్తిని సహోక్తిగా వర్ణించే శ్లోకం.

దేశకాల పాత్రాలనుబట్టి ఎంతవారికైనా మిత్రులూ, శత్రువులూ ఉండడం లోక వ్యవహారం. పొగడేవారు మిత్రులైతే, తెగడేవారు శత్రువులవుతారు. రాజనీతిలో మిత్ర శత్రుత్వాలు విచారణీయాలు.

"స్యాతా మమిత్రౌ మిత్రేచ సహజ ప్రాకృతా వపి" (మాఘకావ్యం 2 - 36)

సహజ, ప్రాకృత, కృత్రిమ భేదంతో మిత్రులైనా, శత్రువులైనా మూడు విధాలుగా ఉంటారు.

మిత్రులు :– మేనత్త మేనమామ కొడుకులు 'సహజమిత్రులు'. పొరుగు దేశానికి పొరుగున ఉన్న దేశాధిపతులు ప్రాకృత మిత్రులు. సామదానాద్యుపాయాలతోనూ, ఉపకార కార్యాలతోనూ మైత్రి ఏర్పడితే 'కృత్రిమ మిత్రు'లవుతారు.

శత్రువులు :– కన్న తండ్రి తోబుట్టువులు, వారి కుమారులు, 'సహజ శత్రువులు'. పొరుగుదేశాల రాజులు 'ప్రాకృత శత్రువులు'. అపకారం చేసిన, చేయబడిన రాజులు 'కృత్రిమ శత్రువులు'.

మిత్రులైనా అపకార కృత్యంతో శత్రువులుగానూ, శత్రువులైనా ఉపకారం చేసి మిత్రులుగానూ మారే అవకాశం ఉండడం, రాజనీతిజ్ఞులకు తెలియనిది కాదు.

పాదుక సింహాసనం మీద ఉండగా, పాద పీఠంతో పనియేమి? అంటే ఇతరులకు అది బలిపీఠం. బలి అంటే పూజ.

పాదుకాధిపత్యంలో భరతుడు పగరాజులను జయించి వారి కిరీటాలనుపాదపీఠం వద్ద నిక్షేపించాడు. ఇక బ్రతుకగోరే రాజులు పాదపీఠం వద్ద ప్రాణభిక్ష కోసం తమ కిరీటాలను పెట్టి ప్రణతులయ్యారు. వాస్తవంగా, శత్రువులవైనా, మిత్రులవైనా రాజుల కిరీటాలన్నీ ఒక్కసారి కలిసి పాదపీఠాన్ని చేరుకోవడం జనరంజకం. ఉపజాతి వృత్తం.

164. ప్రణమ్య రంగేశ్వర పాదరక్షే!
దూరోపనీతై రుపదా విశేషైః ।
సభాజయంతిస్మ తదా సభాయా
ముచ్చైస్తరా ముత్తరకోసలాస్త్వామ్ । –24.

అర్థం :– హే రంగేశ్వర పాదరక్షే = ఓ రంగనాథపాదుకా! తదా = నీవు సింహాన మధిష్ఠించినప్పుడు; సభాయాం = సభయందు; ఉత్తర కోసలాః = ఉత్తర కోసల దేశవాసులు; త్వాం = నిన్ను (నీకు) ప్రణమ్య = ప్రణమిల్లి; దూర + ఉపనీతైః = దూరం నుంచి తేబడిన; ఉపదా విశేషైః = విచిత్ర కానుకలచేత; ఉచ్చైస్తరాం = చాల వేడుకతో (ఘనంగా) సభాజయంతి, స్మ = సత్కరించారు.

తా। ఓ రంగపతి పాదుకా! నీవు రాజ్యమేలుతున్నప్పుడు ఉత్తర కోసల దేశీయులు సభలో నీకు నమ్రులై దూరదూర దేశాల నుంచి తెచ్చిన రకరకాల ఉపహార ద్రవ్యాలను కడు వేడుకతో సమర్పించి నిన్ను సత్కరించారు.

వ్యాఖ్య :– పౌరులు పాదుకాదేవిని ఘనంగా సత్కరించే వర్ణన.

కోసల దేశవాసులు దూరదూర దేశాల్లోకి పోయి, కని విని ఎరుగని వింత పదార్థాలను సమకూర్చుకొని తెచ్చారు. ఆ విచిత్ర ద్రవ్య సముదాయాన్ని పాదుకాదేవి కొల్వుదీరి ఉన్నప్పుడు పౌరులు వైభవంగా ప్రదర్శించి వేడుకతో కానుక లర్పించుకున్నారు. **'సభాజ ప్రీతి దర్శనే'** – అని ధాత్వర్థం. ఉదాత్తాలంకారం. ఉపజాతి వృత్తం.

165. అపావృత ద్వార మయంత్రితాశ్వం
రంగేశ పాదావని! పూర్వ మాసీత్ ।
త్వయా యదృచ్ఛా సుఖసుప్తపాంథం
రామే వనస్థేఽపి పదం రఘూణామ్ ॥ –25.

అర్థం :– హే రంగేశ పాదావని = ఓ రంగనాథ పాదుకా! పూర్వం = మునుపు (దశరథుని మరణానంతరం) రఘూణాం = రఘు వంశరాజుల యొక్క; పదం = స్థానం; (రాజ్యం) అపావృతద్వారం = తెరచిన తలుపులు కలదిగానూ, అయంత్రిత + అశ్వం = నియమింపబడని గుర్రాలు కలదిగానూ; ఆసీత్ = ఉండెను; రామే = రాముడు; వనస్థే, అపి = అడవిలో ఉన్ననూ; త్వయా = నీచేత; యదృచ్ఛా సుఖ సుప్త పాంథం = ఇష్టమున్నచోట సుఖంగా నిద్రించే బాటసారులు కలదిగా; ఆసీత్ = ఉండెను.

తా॥ ఓ రంగేశ పాదుకా! రాముడడివికి వెళ్ళిన తర్వాత దశరథుడు దివంగతుడు కాగానే కోసల రాజ్యం సువ్యవస్థతో లేకుండెను. ద్వారాలు తెరచినవి తెరచినట్లే ఉండెను. అశ్వాలను నియమించే వారులేకుండిరి. నీ ప్రభుత్వం మాత్రం రాముడు అడవిలో ఉన్నా, బాటసారులు స్వేచ్ఛగా, సుఖంగా నిద్రపోవునట్లుండెను.

వ్యాఖ్య :– పాదుకా పరిపాలన వికృత వ్యవస్థను తొలగించి, పూర్వ వైభవాన్ని నిలిపింది.

దశరథుని మరణం తర్వాత పాదుకాదేవి అధికారాన్ని పరిగ్రహించక ముందు,రామ వనవాసం వల్ల కోసల రాజ్యం శోకగ్రస్తమై అరాజకంగా ఉండింది. జనులు భయగ్రస్తులైరి. ఉద్యోగులు తమను తాము కాపాడుకునే యత్నంలో వ్యగ్రులై రాజకార్యాలను నిర్వహించకుండిరి. తత్ఫలితంగా నగరంలో తెరచియున్న ద్వారాలను మూసివేసే వారు– ప్రతీహారులు – లేకుండిరి. **'స్త్రీ ద్వా ర్ద్వారం ప్రతీహారః'** (అమరం).

అశ్వాలను రథాలకు పూన్చు వారుగానీ, నియమంగా బంధించేవారు గానీ లేకుండిరి. అంటే, ఉద్యోగులున్నా, తమ విధులను నిర్వహించే ప్రవృత్తి వారిలో లోపించింది. జనులు నిర్భయంగా పయనించలేకుండిరి. అంతా అస్తవ్యస్తంగా ఉండేది.

పాదుకాదేవి పరిపాలనలో సువ్యవస్థ ఏర్పడింది. రాముడు అడవిలో ఉన్నా, అయోధ్యావాసులకు ఎలాంటి భయం లేదు. ఉద్యోగులు సక్రమంగా విధులను సకాలంలో నిర్వహించేవారు. చోరక్రూర భయాలు లేవు. కాబట్టి పథికులు ఎక్కడ, ఎప్పుడు నిద్రవస్తే అక్కడనే సుఖంగా గుండెమీద చేయివేసికొని, నిబ్బరంగా నిద్రపోయేవారు. పాదుకా పాలనా వ్యవస్థ పూర్వ వైభవాన్ని సుస్థిరం చేసింది.

పూర్వరూపాలంకారం. ఉపజాతి వృత్తం.

166. అనన్య భక్తిర్మణి పాదుకే! త్వా
మభ్యర్చయన్ దాశరథి ర్ ద్వితీయః ।
వికల్ప్యమానః ప్రథమేన కీర్త్యా
వంద్యః స్వయం వ్యోమ సదాం బభూవ ॥ –26.

అర్థం :– హే మణిపాదుకే = ఓ రత్న పాదుకా! అనన్య భక్తిః = నీయందే భక్తికలవాడై ; త్వాం = నిన్ను; అభ్యర్చయన్ = పూజిస్తూ; కీర్త్యా = గుణాల వ్యాప్తిచేత; ప్రథమేన = దశరథుని మొదటి పుత్రుడైన రామునితో; వికల్ప్యమానః = విశిష్టుడుగా గ్రహింపబడిన; ద్వితీయః = రెండవవాడైన; దాశరథిః =దశరథ పుత్రుడు (భరతుడు) స్వయం = తానే; వ్యోమసదాం = దేవతలకు; వంద్యః = నమస్కరించ దగినవాడుగా; బభూవ = ఉండెను.

తా॥ ఓ మణిపాదుకా! నీయందే భక్తి కలవాడై నిన్ను పూజిస్తూ, కీర్తిచే మొదటి దాశరథితో సమానుడుగా తెలియబడిన రెండవ దాశరథి స్వయంగా దేవతలకు వందనీయుడయ్యాడు.

వ్యాఖ్య :– పాదుకార్చనవల్ల భరతునికి కలిగిన మహాఫలాన్ని కీర్తించే శ్లోకం.

దశరథునికి ముగ్గురు భార్యలయందు నలుగురు కుమారులు జన్మించారు. పెద్ద భార్య కౌసల్య యందు మొదట రాముడు జన్మించాడు. మూడవ భార్య కైకేయి యందు భరతుడు ఉదయించాడు. తర్వాత రెండవ భార్య సుమిత్ర యందు లక్ష్మణుడు, శత్రుఘ్నుడూ కవలలుగా పుట్టారు. దశరథపుత్రులు దాశరథులు. దశరథుని సంతానోత్పత్తి క్రమాన్నిబట్టి, ద్వితీయ దాశరథి భరతుడు. భరతుని కన్నతల్లి కైకేయి 'మధ్యమాంబ' అని కూడా వ్యవహరింపబడింది. **"కైకేయీచ సుమధ్యమా"** – అని పద్మపురాణంలోనూ కలదు.

"భరతో నామకైకేయ్యాం జజ్ఞే సత్య పరాక్రమః ।
సాక్షా ద్విష్ణో శ్చతుర్భాగః సర్వైస్సముదితో గుణైః" । (రా.బా. 18 స.)

రాముడవతరించిన మరునాడు కైకేయి భరతుణ్ని ప్రసవించింది.

"సాక్షాత్ విష్ణోః – వైకుంఠవాసినః చతుర్థాంశః చతురస్య అంశః అష్టమ భాగ ఇత్యర్థః" తని శ్లోకి.

రామావతారానికి కారణభూతమైన పాయసంలోని నాల్గవభాగాన భరతుడవతరించాడు. అంటే, రామునిలోని నాల్గవ భాగాన లేదా శ్రీమహావిష్ణువులోని ఎనిమిదవ భాగాన ఇతడు జన్మించాడు.

సాక్షాత్ పదానికి 'రాముని వెంటనే' అనీ, రామునిలోని గుణ సౌందర్యాలు సూచింపడుతున్నవనీ వ్యాఖ్యాతలు సూచించారు.

పునర్వసు నక్షత్రం తర్వాతది పుష్యమీ నక్షత్రం. రాముని తర్వాతివాడే అయినా భరతుని జనన సమయంలో గ్రహాలేవీ మారలేదు. లగ్నం మాత్రం మారింది. రామునిది కర్కాటక లగ్నం కాగా, భరతునిది మీనలగ్నమయింది. చంద్రుడు కర్కాటక రాశియందే ఉండగా, గురుక్షేత్రమైన మీనరాశి యందు జన్మించిన భరతుడు నిర్మలచిత్తుడూ, సద్గుణ గరిష్ఠుడూ అయ్యాడు.

"పుష్యేజాతస్తు భరతో మీనలగ్నే ప్రసన్నధీః" అన్నాడు వాల్మీకి.

భరతుని భక్తి అనన్యమైనది. పరమ భక్తులు దేవతాంతర, సాధనాంతర, ఫలాంతర రహితులై శ్రియఃపతి శ్రీచరణాలనే శరణంగా వరిస్తారు. వీరు ఆకారత్రయ సంపన్నులు - పారతంత్ర్య జ్ఞానం కలవారు.

1. **అనన్యార్హ శేషత్వం :-** పరమాత్మునికే తప్ప ఇతరులకు చెందిన వాడనుకాను, అనే బుద్ధి.

2. **అనన్య శరణత్వం :-** శ్రియఃపతియే తప్ప ఇతరమైనదేదీ ఉపాయం - సాధనం - రక్షకం కాదు, అనే భావన.

3. **అనన్య భోగ్యత్వం :-** భగవదనుభవమే తప్ప వేరే ఏదీ రుచించని ధిషణ.

ఈ ఆకారత్రయ సంపత్తికలవారే పరమ భాగవతోత్తములు. వీరు భగవంతుణ్ణి పూజించినట్లే భాగవతోత్తములనూ పూజిస్తారు. 'భాగవతార్చన భగవదర్చన కన్న మిన్న' - అని భగవద్రామానుజుల చరమోపదేశం.

"న సర్వేభ్రాతరస్తాత! భవంతి భరతోపమాః" - అన్నదమ్ములందరు భరతునితో సమానులుకారు; అని శ్రీరాముడు భరతునికి తన కంటెను అతిశయాన్ని కల్పించాడు.

"నిరంజనః పరమం సామ్యముపైతి" - పరబ్రహ్మోపాసకుడు భగవంతునితో సామ్యాన్ని పొందుతాడని ఉపనిషద్వాణి.

దేవతలు భగవంతునిచే నియమింపబడిన తమ తమ పనులను భగవంతునికి **భయపడి నిర్వర్తిస్తుంటారు** కదా!

భీషా స్మాద్వాతఃపవతే, భీషోదేతి సూర్యః ।
భీషా స్మాదగ్నిశ్చేంద్రశ్చ, మృత్యుర్ధావతి పంచమ ఇతి । (ఆనందవల్లి)

అలాగే, భాగవతోత్తముల పట్ల దేవతలు వినయవిధేయతలతో ప్రవర్తిస్తారు.

"ద్రవంతిదైత్యాః ప్రణమంతి దేవతాః ।
న శ్యంతి రక్షాంస్యపయాంతి చారయః ।
యత్కీర్తనాత్ సోఽద్భుతరూపకేసరీ ।
మమాస్తు మాంగల్య వివృద్ధయే హరిః" । (వి.ధ. 43-28.)

'పరమభక్తుడు చేసే పరమ పురుషుని సంకీర్తనం వల్ల దైత్యులు పారిపోతారు. దేవతలతనికి నమస్కరిస్తారు. రాక్షసులు నశిస్తారు. శత్రువులు తొలగిపోతారు' అని భాగవత ప్రభావాన్ని 'విష్ణుధర్మం' వివరించింది. 'కీర్తి' అంటే గుణప్రథ. రామునికి ఉన్నగుణాలే భరతునికీ ఉన్నాయి. రాముడు ఏలదగిన రాజ్యాన్ని తాను పొందడానికి అశక్తుడనని భరతుడు చిత్రకూటాశ్రమంలో శరణాగతుడయ్యాడు. తత్ఫలితంగా భరతునికి శ్రీరామ పాదుకలసేవ లభించింది. అతడు ద్వితీయుడే అయినా, గుణవ్యాప్తిచే అద్వితీయుడయ్యాడు. దేవతలతనికి నమస్కరించడానికి వేరే కారణం లేదు, శ్రీరామచంద్రమూర్తి ఆజ్ఞకు వశవర్తులైనట్లే, రామునితో సమాన దశను పొందినవాడని భరతుణ్ని భక్తితో సేవిస్తూ, పాదుకాధిపత్యంలో భరతుని శాసనానికి నిర్జరులుకూడా భయజర్జరితులై ప్రణమిల్లినారు. కావ్యలింగాలంకారం. ఉపజాతి వృత్తం.

167. అరణ్యయోగ్యం పదమ స్పృశం తీ
రామస్య రాజార్హ పదే నివిష్టా ।
ఆస్థాన నిత్యాసికయా నిరాస్థః
స్వర్గౌకసాంస్వైరగతే ర్విఘాతమ్ । –27.

అర్థం :– ఓ పాదుకాదేవీ! రామస్య = రామునియొక్క; అరణ్యయోగ్యం = అడవిలో సంచరింపదగిన; పదం = పాదాన్ని; అస్పృశంతీ = స్పృశింపకుండా; రాజార్హపదే = రాజుకు యోగ్యమైన సింహాసనమందు; నివిష్టా = అమరి యుండి; ఆస్థాన నిత్య + ఆసిక యా = సభయందు ఎల్లప్పుడు కూర్చోవడం చేత (నిత్యకృత్యంచేత) స్వర్గ + ఓకసాం = ద్యుస్థానవాసులైన దేవతలయొక్క; స్వైర గతేః = స్వచ్ఛంద సంచారానికి; విఘాతం = ఆటంకాన్ని, నిరాస్థః = తొలగించావు.

తా। ఓ పాదుకా! వనంలో సంచరించదగిన రాముని చరణాలను స్పృశించక సింహాసనాధిష్ఠితవై నీవు నిత్యం సభా కార్యక్రమాలను నిర్వహించడం చేత దేవతల స్వేచ్ఛాగమనానికి కలిగే ప్రతిబంధకాన్ని తొలగించావు.

వ్యాఖ్య :– పాదుక సింహాసన మధిష్ఠించి రాక్షసుల దుండగాలను అణచివేసింది.

ఇంద్రాగ్ని వరుణ వాయు సూర్య చంద్రాది దేవతలు రావణాసురుని భయం వల్ల స్వేచ్ఛగా సంచరించడం లేదు. పాదుకాదేవి రాజ్యాధికారాన్ని స్వీకరించకపోతే రాముని అరణ్య సంచారానికి భంగం వాటిల్లేది. తత్ఫలితంగా దేవతల స్వేచ్ఛాగమనం సాగక, ధర్మాచరణ లోపంవల్ల వారికి ఆహారమైన హవిస్సు లభించకపోయేది. కాబట్టి, రాముడు రావణ వధ పర్యంతం అరణ్యంలో సంచరించడం ఎంత ప్రధానమైనదో, రామచరణ స్పర్శలేని పాదుక రాజసింహాసనం మీద ప్రవేశించి ప్రజాపాలన చేయడం అంత ప్రధానమైనది. పాదుక రాజాస్థానంలో ఉండి నిత్యం ధర్మలోపం కాకుండా రాజ కార్యాలను నిర్వహించడంవల్ల, దేవతల స్వచ్ఛంద సంచారాన్ని విఘాతపరచే రాక్షసులను రాముడు సంహరించే అవకాశం కలిగింది.

పాదుకా రూపమైన ఆళ్వార్లనూ, ఆచార్యులనూ ఆరాధించి, భగవత్సామ్రాజ్యమనే సాధర్మ్యాన్ని పొందిన భరతుడు **"అస్మై దేవాబలిమావహంతి"** అని శ్రుతిపలికినట్లు దేవతలచే వందనీయుడయ్యాడు.

కేవలం సింహాసనమధిష్టించి, తన పరిపాలనా సామర్థ్యంచేత దేవతలకు రాక్షసులవల్ల కలిగే ప్రతిబంధకాలను తొలగించిన పాదుకాదేవి అమర వంద్య అయింది. అరణ్యంలో సంచరించి సాధించదగినదేవతా గమన ప్రతిబంధక నిరసనాన్ని పాదుకాదేవి కూర్చున్నచోటు నుంచేసాధించినట్లు వర్ణించడం విభావనాలంకారం. రామపాద మహిమకన్న పాదుకా మహిమ మిన్న, అని వ్యంగ్యం. ఉపజాతి వృత్తం.

168. రాజాసనేచే ద్భవతీ నిషణ్ణా
రంగేశ పాదావని! తన్నచిత్రమ్ ।
యత్రాధి రూఢాః క్రమశః పురా త్వా
ముత్తంసయంతే రఘు సార్వభౌమాః । – 28.

అర్థం :– హే రంగేశ పాదావని = ఓ రంగేశ పాదుకా! భవతీ = నీవు; రాజాసనే = రాజులకు యోగ్యమైన సింహాసన మందు; నిషణ్ణా = కూర్చున్నావు, చేత్ = అయితే; తత్ = అది; న, చిత్రం = ఆశ్చర్యం కాదు. యత్ర = ఏ సింహాసన మందు; క్రమశః = వరుసగా; అధిరూఢాః = అధిష్ఠితులైన; రఘుసార్వభౌమాః = రఘువంశ మహారాజులు; త్వాం = నిన్ను; పురా = పూర్వమే; ఉత్తంసయంతే = శిరోభూషణంగా ధరించారో.

తా॥ ఓ రంగేశ పాదుకా! సింహాసనం మీద నీవు కూర్చున్నావనే విషయం చిత్రమేమీకాదు. ఎందుకంటే, ఆ సింహాసనాన్ని అధిష్ఠించిన రఘువంశ సార్వభౌములందరు ఒకరి తర్వాత మరొకరు నిన్ను పూర్వం శిరసా వహించారు.

వ్యాఖ్య :– పాదుకాదేవి సింహాసన మధిష్ఠించడం వింతకాదని వర్ణితం.

'రంగేశ పాదావని' ఈ శ్లోకానికి ప్రాణపదం. ఇక్ష్వాకు మహారాజు యొక్క తపఃఫలంగా రఘువంశ మహారాజులకు శ్రీరంగనాథుడు ఇలువేల్పు అయ్యాడు. నాటి నుంచి ఆనుపూర్వికంగా సింహాసనాధిరూఢులైన సార్వభౌములందరు శ్రీరంగేశ్వరుణ్ని ఆరాధించి, స్వామి పాదుకలను తలమీద ధరించిన వారే.

"సహపత్న్యా విశాలాక్ష్యా నారాయణ ముపాగమత్"

దశరథుడు తనకు పట్టాభిషేకం చేయబోయేనాడు, సీతమ్మతో పాటు శ్రీరాముడు కూడా శ్రీమన్నారాయణుని అర్చారూపమైన శ్రీరంగనాథుణ్ని ఉపాసించాడన్న విషయం రామాయణంలో ప్రసిద్ధమే కదా!

తత్, న, చిత్రమ్ :- గద్దెనెక్కిన రాజుల నెత్తిమీదికెక్కిన పాదుకాదేవి, గద్దెమీదికెక్కి కూర్చుంటే అచ్చెరువెందుకు? ఈనాడు భరతుడూ పాదుకలను నెత్తికెక్కించుకున్నాడు. భోగశాలికాక, భరతుడు త్యాగశీలియై తనను గోప్త్రిగా వరించి నమ్ముకుంటే, పాదుకాదేవి లోకాల యోగక్షేమాలకోసం భద్రాసనాధినేత్రిగా వ్యవహరించడంలో అక్కజం ఒక్కింత లేదని దేశికులు వక్కాణించారు.

ప్రాకృత రూపమందే మధురకవి యాళ్వారుచే ఆశ్రయింపబడిన 'నమ్మాళ్వార్'ను అప్రాకృతరూపమందు శ్రీమన్నాథమునులు ఆచార్యునిగా స్వీకరించడంలో ఆశ్చర్యమేముంది? ఇది కైముతిక న్యాయసిద్ధమే.

కావ్యార్థాపత్త్యలంకారం, ఇంద్రవజ్రా వృత్తం.

169. భద్రాసనంచే త్పరివృత్త మాసీత్
దేవి! క్షణం దక్షిణతో ముఖంతే ।
కథం భవేత్కాంచన పాదరక్షే !
రామస్య రక్షో మృగయావిహారః ।-29.

అర్థం :- హేదేవి! కాంచన పాదరక్షే = ఓ చాంపేయ పాదుకాదేవీ! తే = నీ యొక్క; భద్రాసనం = సింహాసనం; క్షణం = త్రుటికాలం; దక్షిణతః, ముఖం = దక్షిణాభిముఖంగా; పరివృత్తం = మారినదై ; ఆసీత్, చేత్ = ఉండెనేని; (అరాజకంగా మారినట్లైతే) రామస్య = రామునికి; రక్షస్ + మృగయా విహారః = రాక్షసులను వేటాడడం; కథం = ఎలా? భవేత్ = అయ్యేది?

తా॥ ఓ బంగారు పాదుకాదేవీ! నీ సింహాసనం క్షణకాలం దక్షిణాభిముఖంగా (అరాజకంగా) మారినట్లైతే రామునికి రాక్షసులను వేటాడడం ఎలా సాగేది?

వ్యాఖ్య :- పాదుకాదేవి భద్రాసనమందుండడంవల్ల, రాముడు రాక్షసులను వేటాడగలిగాడని సంభావితం.

మొదట పాదుకలు దక్షిణాభిముఖంగా ఉండిన మాట సత్యమే. రామునిచే భరతునికి దత్తంకాగా, అవి ఉత్తరాభి ముఖంగా వచ్చి సింహాసనం మీద స్థిరంగా నిలిచాయి. సింహాసనం ఏ దిక్కు ఉన్నా శాసకుడు అన్ని దిక్కులను చూడవలసిందే కదా!

సీతాదేవిలాగా రాముని వెంట వెళ్ళితే, కోసల రాజ్యం అరాజకం అయ్యేది. కానీ, పాదుకాదేవి రామాజ్ఞను పాటించి పౌరులను వాత్సల్య నిర్భరతతో లాలించి పాలిస్తున్నది.

'ఏమండీ! తాపసులను కాపాడండి, కానీ ఈ ధనుర్బాణాలను ధరించి, రాక్షసులను చంపడం మనకెందుకండి?' అని సీతమ్మ వాత్సల్యగుణంతో ప్రశ్నించి, వాల్లభ్యంతో విధేయునిగా చేసి, రాముడు రాక్షసులను స్వేచ్ఛగా వేటాడకుండా, అతనికి అడ్డుతగులుతుండేది. ఇక కాంచనమయియైన పాదుక కూడా రామునికి అభిముఖియైతే, అతని ఆఖేటక్రీడ కొనసాగకపోయేది. కాబట్టి పాదుకాదేవి భగవత్ప్రవృత్తికి విరుద్ధంగా ఉండే స్వప్రవృత్తిని నివర్తించుకొని, స్వామి ఆనతిని పాటించి, భద్రాసనమందుండి రాముణ్ణి యథేచ్ఛగా సంచరింపచేసింది. పాదుకనిరతిశయ ప్రతాపం కలదని ధ్వని. సంభావనాలంకారం. ఉపజాతి వృత్తం.

170. యావత్త్వయా రాఘవపాదరక్షే!
జిగీషితా రాక్షస రాజధానీ ।
మాలేవ తావల్లులితా మదాంధై
రుద్యానశాఖా మృగయూథపైస్తే ॥ –30.

అర్థం :– హే రాఘవ పాదరక్షే = ఓ రామ పాదుకా! రాక్షస రాజధానీ = లంకానగరం; త్వయా = నీచేత; యావత్ = ఎప్పుడైతే; జిగీషితా = జయింపగోరబడిందో; తావత్ = అంతలోనే; మద + అంధైః = మిక్కిలి గర్విష్ఠులైన ; తే = నీ యొక్క; ఉద్యానశాఖా మృగ యూథపైః = తోటలోని వానర వీరులచేత; మాలా, ఇవ= పూలదండవలె; లులితా = తెంపివేయబడింది.

తా॥ ఓ రాఘవ పాదుకా! నీవు రాక్షస రాజధానియైన లంకానగరాన్ని జయింపదలచినంతలోనే మదాంధులైన నీ ఉద్యానవనవానరులు మాలికను తెంపినట్లే ఛిన్నాభిన్నం చేశారు.

వ్యాఖ్య :–పాదుకాదేవి సంకల్పం అమోఘం, అని ఉత్ప్రేక్షితం.

కిష్కింధ ఇక్ష్వాకుల రాజ్యంలో ఒక ఉద్యానవనం లాంటిది. అది కోతులకు ఉనికి పట్టు. వానరులు చాల బలవంతులు, కాని చపలులు, క్రమశిక్షణ లేనివారు. అయినా, తమ కిష్టమైన కార్యాన్ని సాధించేవారు. ఏదైనా ఒక పని చేయతగిందా? చేయరానిదా? అన్న విచక్షణ లేనివారు. కాబట్టి, కపివరులు మదాంధులు.

వసిష్ఠుని శిష్యులైన రామలక్ష్మణులు హనుమత్సుగ్రీవులతో కలిసిన తర్వాత వనచరులలో ఒక సంఘటితశక్తి ఏర్పడింది.

"ఇక్ష్వాకూణా మియంభూమిః సశైల వనకాననా।
మృగపక్షి మనుష్యాణాం నిగ్రహ ప్రగ్రహా వపి ।"

ఇది రాముడన్నమాట.

అకలంకమైన లంకానగరం రావణాసురుని రాజధాని. పాదుకాదేవికి లంకను జయించాలన్న ఇచ్ఛ జనించింది. పాదుకా సత్య సంకల్పం వల్ల శాఖామృగాలన్నీ వినయ విధేయతలు కలవయినాయి. రాముని ఆజ్ఞకు బద్ధులై సుగ్రీవాంగద హనుమదాది వానర ప్రకాండులు, ఘుమఘుమ పరిమళించే రంగురంగుల పూలతో అందంగా కూర్చబడిన మాలికను తెంపివేసినట్లే, లంకా నగరాన్ని అవలీలగా నేలమట్టం చేశారు.

పాదుకా జిగీషచేత లంకోపద్రవ వర్ణన - చపలాతిశయోక్త్యలంకారం. 'మాలికవలె లంకలులిత' అనడం ఉపమాలంకారం. సుగ్రీవాదులను ఉద్యానవన వానరులనడం, ఉత్ప్రేక్ష. ఉపజాతి వృత్తం.

171. మహీక్షితాం రాఘవ పాదరక్షే!
భద్రాసనస్థాం భవతీం స్పృశంతః ।
పూర్వం తథాత్వే నియతేఽపిభూయః ।
కల్యాణతా మానశిరే కిరీటాః ॥ –31.

అర్థం :– హే రాఘవ పాదరక్షే = ఓ రామ పాదుకా! భద్రాసనస్థాం = సింహాసనమందున్న; భవతీం = నిన్ను; స్పృశంతః = స్పృశిస్తున్న; (నీకు ప్రణమిల్లుతున్న) మహీక్షితాం = రాజుల యొక్క; కిరీటాః = మకుటాలు; పూర్వం = మునుపే; తథాత్వే = అట్లు (బంగారువిగా) ఉండడం; నియతే, అపి = స్వభావమే అయి నప్పటికీ, భూయః = మళ్ళీ; (ప్రణమిల్లిన తర్వాత) కల్యాణతాం = సువర్ణాత్వాన్ని/శుభత్వాన్ని, ఆనశిరే = పొందినాయి.

తా॥ ఓ రాఘవ పాదుకా! భద్రాసనాధిష్ఠితవైన నీకు నమస్కరించే రాజుల కిరీటాలు పూర్వం బంగారువే అయినా, నమస్కరించిన తర్వాత మిక్కిలి కల్యాణశోభను పొందాయి.

వ్యాఖ్య :– పాదుకా సంబంధంవల్ల రాజమకుటాలకు మాంగల్య శోభ హెచ్చింది.

సింహాసనాసీనులకు రాజులు నమస్కరించడం వారికి మనస్కరించినక్రియ. పాదుకాదేవికి మోకరిల్లక ముందే రాజులవి కల్యాణ కిరీటాలు. 'కల్యాణ'మంటే బంగారం, మంగళం అని అర్థ ద్వయం. పాదుకాదేవికి నమస్కరించిన సువర్ణ

కిరీటాలకు పాదుకా స్పర్శవల్ల మాంగల్యం శోభించింది. సర్వదా ఆత్మలకు శేషత్వం స్వరూపం. వాటికి అపహతపాప్మత్వాది గుణాష్టపద ధర్మం ఫలించినప్పుడు కల్యాణశోభ హెచ్చుతుంది.

కల్యాణ వస్తువులకు పాదుకా స్పర్శవల్ల ప్రాక్సిద్ధమైన కల్యాణగుణం ఉత్కర్ష చెందింది - అనడం, అను గుణాలంకార లక్షణం. ఉపజాతి వృత్తం.

172. అనిచ్ఛతః పాండర మాతపత్రం
పిత్రా వితీర్ణం మణిపాదరక్షే!
ఆసీ త్త్వదర్థం విధృతేన తేన
ఛాయా సమగ్రా భరతస్య మౌళౌ I –32.

అర్థం = హే మణిపాదరక్షే = ఓ రత్న పాదుకా! పిత్రా = తండ్రిచేత; వితీర్ణం = దత్తమైన; పాండరం = తెల్లని; ఆత పత్రం = గొడుగును; అనిచ్ఛతః = ఇష్టపడని; భరతస్య = భరతునియొక్క; మౌళౌ = తలమీద; త్వత్ + అర్థం = నీ కోసం; విధృతేన = పట్టుకొనబడిన; తేన = ఆ శ్వేతచ్ఛత్రంచేత; సమగ్రా = పూర్ణమైన; ఛాయా = నీడ/శోభ; ఆసీత్ = ఉండెను.

తా॥ ఓ మణిపాదుకా! తండ్రి దశరథునిచే దత్తమైన శ్వేతచ్ఛత్రాన్ని ఇష్టపడని భరతుని శిరస్సున, నీకోసం ధరింపబడిన శ్వేతచ్ఛత్రం నిండునీడగా, పర్యాప్తమైన పరమశోభగా ఉండింది.

వ్యాఖ్య :– పాదుక కోసం పట్టిన శ్వేతచ్ఛత్రం భరతునికి శోభనిచ్చిందని వర్ణన.

'కేకయమహారాజు తన కూతురు కడుపున పుట్టినవానికి పట్టం కట్టాలి' అని అంటే, ఆ మాట నంగీకరించి దశరథుడు కైకేయిని వివాహమాడినాడు. దశరథుడు ఒకప్పుడు శంబరాసురునితో యుద్ధం చేస్తుండగా, వెంట ఉన్న కైకేయి తోడ్పడి పతికి విజయాన్ని చేకూర్చింది. దశరథుడు సంతోషంతో రెండు వరాలిస్తానన్నాడు. కొన్నాళ్ళకు మందర దుష్టబుద్ధిచే ప్రేరితయై రామ వనవాసాన్ని, భరతునికి పట్టాభిషేకాన్ని కైకేయి, ఆ రెండు వరాలుగా దశరథుణ్ని కోరింది. తత్ఫలితంగా పితృదత్తమైన శ్వేతచ్ఛత్రం తన కిష్టంలేదని భరతుడు రామపాదుకలకు పట్టంగట్టి శ్వేతచ్ఛత్రం పట్టాడు. అయినా భరతుని తలమీద ఆశ్వేతచ్ఛత్రఛాయ పర్యాప్తంగా వ్యాపించింది. **"ఛాయాత్వనాతపే కాంతౌ"** (విశ్వ.ని.)

భగవత్కైంకర్యం కోసం ఆవిర్భవించిన స్వరూపాలచేతనే జీవులకు సమగ్ర వైభవం సంభవిస్తుంది. తాను నివారించిన ఛత్రం, తనకు ఛాయను వ్యాపింపజేసిందనడం 'అసంగతి'రలంకారం', ఉపజాతి వృత్తం.

'పాండర' శబ్దం శుభ్రార్థకం. 'పాండుర' శబ్దం సితపీత సంయోగ రూపార్థకం. యాదవాభ్యుదయం. 2-50 శ్లో. అప్పయ దీక్షితుల వ్యాఖ్య.

173. పాదుకే! రఘుపతౌ యదృచ్ఛయా
ప్రస్థితే వన విహార కౌతుకాత్ ।
ఆధిరాజ్యమధిగమ్య తే యువా
మక్షతం వసుమతీ మరక్షతమ్ ॥ -33.

అర్థం :- హే పాదుకే = ఓ పాదుకలారా! రఘుపతౌ = శ్రీరాముడు; యదృచ్ఛయా = స్వేచ్ఛగా; వనవిహారకౌతుకాత్ = అడవిలో సంచరించే ఉత్సాహం వల్ల; ప్రస్థితే = పయనించగా; తే = (భరతునిచేత తేబడిన) ఆ; యువాం = మీరు (జత) ఆధిరాజ్యం = సామ్రాజ్యాన్ని, అధిగమ్య = పొంది; వసుమతీం = భూమిని; అక్షతం = బాధనొందని రీతిగా; అరక్షతం = కాపాడితిరి.

తా॥ ఓ పాదుకలారా! శ్రీరాముడు స్వేచ్ఛగా అరణ్యంలో సంచరించే కుతూహలంవల్ల పయనించగా, మీరు సామ్రాజ్యాన్ని పొంది భూమిని అప్రతిహతంగా రక్షించారు.

వ్యాఖ్య :- పాదుకా ప్రభుత్వం ప్రజలకు సుఖదాయకం.

ఇట 'పాదుకే' పదం సంబోధన ప్రథమా ద్వివచనాంతంగా ప్రయుక్తం. శ్రీరామచంద్రస్వామి నిశ్చింతగా అరణ్యంలో సంచరించడానికి వెళ్లాడు. ఆ రాముని ప్రార్థించి చిత్రకూటాశ్రమం నుంచి భరతుడు తెచ్చిన పాదుకలు కోసల దేశ సామ్రాజ్యాధికారాన్ని పరిగ్రహించి ప్రాభవ వైభవాలతో ప్రజల మనస్సు గాయపడకుండా, ఆయ వ్యయాలకు లోపం కలుగకుండా రాజ్యసంరక్షణ చేశాయి. పూర్వ రూపాలంకారం. రథోద్ధతా వృత్తం.

174. రఘువీర పదానుషంగ మాత్రాత్
పరిబర్హేషు నివేశితాయది త్వమ్ ।
అధికారదినే కథం పునస్తే
పరివారాస్తవ పాదుకే! బభూవుః ॥ -34.

అర్థం :- హే పాదుకే = ఓ పాదుకా! రఘువీర పద + అనుషంగ మాత్రాత్; శ్రీరాముని పాద (స్థాన) సంబంధం వల్లనే; త్వం = నీవు; పరిబర్హేషు = పరికరాల్లో; నివేశితా = ప్రవేశింపబడినావు, యది = అయితే; అధికారదినే = ఆధిపత్య కాలమందు; తే = అవి; (పరికరాలు) తవ = నీకు; పునః = మళ్ళీ; కథం = ఎట్లు, పరివారాః = పరిజనాలుగా; బభూవుః = అయినాయి? కథం, పునః బభూవుః = ఎలాగో అయినాయి.

తా॥ ఓ పాదుకా! శ్రీరాముని పాద (స్థాన) సంబంధంవల్లనే ఛత్రచామరాది పరికరాల్లో నీవూ ఒక్కటిగా భావింపబడుతుంటే, నీ ఆధిపత్యకాలంలో ఆ పరికరాలన్నీ ఎలాగో నీ పరివారాలుగానే అయ్యాయి.

వ్యాఖ్య :– పరికరాల్లో ఒక్కటైన పాదుకకు, తక్కినవి పరివారాలు అయ్యాయి.

రాజలాంఛనాలైన సింహాసనం, ఛత్ర చామరాదులు శ్రీరాముని పాద (స్థాన) సంబంధం కలిగిన పాదుకకు పరివారంగా భావింపబడడం సర్వసాధారణం. 'పరిబర్హ' పదం చేతనాచేతనాలకు సాధారణపదం అంటే, ఛత్ర చామరాదులూ, ఆ పరికరాలతో ఉపచారం చేసే పరిజనులూ అని అర్థవంతమైన పదం. పరికరాల్లోనే చేరిన పాదుకకు తక్కినవి పరివారాలెలా అవుతాయి? అంటే, గుణాల పారార్థ్యం వల్లనే కదా!

సింహాసన మధిష్ఠించిన వ్యక్తి చేతనుడే, అయితే, అతనికి ఛత్రచామరాదులను పట్టే వారూచేతనులేకదా! చేతనత్వంగానీ అచేతనత్వంగానీ సమానమే అయినా, గుణమహిమచే సింహాసనం మీద ఆసీనుడైన వ్యక్తికి తక్కిన వ్యక్తులు పరిచారకులుగానూ, పరిజనులుగానూ భావింపబడుతారు.

"గుణానాంచ పరార్థత్వా దసంబంధః సమత్వాత్స్యాత్" - అనే న్యాయాన్నిబట్టి, గుణాల పారార్థ్యం వల్ల **'భగవత్పాదుకాభ్యాంనమః'** అంటాం. ఆధారశక్త్యాది పాఠంలో పరికరాలకూ, పరిజనాలకూ వేర్వేరు పద్ధతి చెప్పబడింది. కాబట్టి, సింహాసనాధిష్ఠితయైన పాదుకాదేవికి, రామపాదంతోనూ, స్థానంతోనూ సంబంధమున్నందున ఛత్రచామరాది పరిబర్హాలతో (పరిచ్ఛదాలతో) సామ్యం ఉండదు. అవి పాదుకా పరివారాలుగా భావింపబడుతాయి. సరభావనాలంకారం. ఔపచ్ఛందసికం.

175. పురుషార్థ చతుష్టయార్థినీనాం
పరిషత్తే మహితా వసిష్ఠ ముఖ్యైః ।
క్రయ విక్రయ పత్తనం ప్రజానా
మభవ త్కాంచన పాదుకే! తదానీమ్ ॥ –35.

అర్థం :– హే కాంచన పాదుకే = ఓ బంగారు పాదుకా! తదానీం = నీరాజ్య పాలనమప్పుడు; వసిష్ఠముఖ్యైః = వసిష్ఠుడు మొదలైన వారిచే; మహితా = పూజింపబడిన; (గౌరవింపబడిన) తే = నీయొక్క; పరిషత్ = సభ; పురుషార్థ చతుష్టయ + అర్థినీనాం = నాలుగు పురుషార్థాలను (ధర్మార్థ కామమోక్షాలను) కోరే; ప్రజానాం = జనులకు; క్రయ విక్రయ పత్తనం = కొనడానికి అమ్మడానికి తగిన పెద్ద వ్యాపారస్థలం; అభవత్ = ఆయెను.

తా॥ ఓ కాంచన పాదుకా! నీ ఆధిపత్యకాలంలో వసిష్ఠాది మహర్షులచే పూజింపబడిన నీ పరిషత్తు చతుర్విధ పురుషార్థాలనుకోరే ప్రజలకు క్రయ విక్రయ నగరంగా పరిణమించింది.

వ్యాఖ్య :- పాదుకాదేవి సకల పురుషార్థాలను ప్రసాదించే వర్ణన.

పాదుక అధికారం వహించక ముందు వసిష్ఠ వామదేవాదులు పురుషార్థాలను బోధించే విద్వద్గోష్ఠి. పాదుకా పాలనలో మునులచే మంత్రులచే గౌరవింపబడుతూ, సత్కారాలను స్వీకరిస్తూ, పురుషార్థాలను ప్రదానంచేస్తూ లోక మాన్యంగా ఉంది. విద్వత్పరిషత్తులో మాన్యులకూ, సామాన్యులకూ ధర్మం, అర్థం, కామం, మోక్షం అనే నాలుగు పురుషార్థాలలో ఎవరికి ఏది కావాలంటే, అది లభించేది.

జనులు పట్టణంలో సంతకేగి ఏ వస్తువులనైనా అమ్ముకుంటారు, కొనుక్కుంటారు కదా! పురుషులచే కోరబడేవి పురుషార్థాలు. పూర్వం పరిషత్తు వరకే పరిమితంకాగా, పాదుకా పరిపాలనలో నగరమంతా పరుషార్థ వ్యవహారంచే ప్రసిద్ధి పొందింది. ప్రజలు ప్రాయశ్చిత్తాలను అనుష్ఠించి, పాపాలను త్యాగం చేశారు. పురుషార్థాలను సాధించారు.

ప్రాక్తన రాజ పరిషత్తుకంటె పాదుకా పరిషత్తు పురుషార్థపరులైన జనులచే పరిపూర్ణమై వెలసింది. కాబట్టి పరిషత్తునగరంగా పరిణమించింది. సకల పురుషార్థ ప్రదాతయైన భగవంతునితో పాదుకకు సామ్యం వ్యంగ్యం. పరిణామాలంకారం, ఔపచ్ఛందసికం.

176. మనుజత్వ తిరోహితేన శక్యే
వపుషైకేన విరోధినాం నిరాసే
అభజత్ భరతాదిభేద మీశ
స్స్వయ మారాధయితుంపదావని! త్వామ్ I –36.

అర్థం :- హే పదావని = ఓ పాదుకా! మనుజత్వ తిరోహితేన = మానవ రూపంచేత ఆచ్ఛాదింపబడిన; ఏకేన = (ముఖ్యమైన) ఒక్క; వపుషా = శరీరం చేత; విరోధినాం = శత్రువులయొక్క; నిరాసే = సంహారం; శక్యే = సాధ్యమవుతుండగా; ఈశః = భగవంతుడు; స్వయం = తానే; త్వాం = నిన్ను; ఆరాధయితుం = పూజించడానికి; భరత + ఆది భేదం = భరతుడు మొదలైన (వేర్వేరు రూపాల) భేదాన్ని; అభజత్ = పొందెను.

తా॥ ఓ పాదుకాదేవీ! మనుష్యభావమావరించిన ఒక్కశరీరంతో విరోధుల నిరసనం శక్యమవుతున్నప్పటికీ, సర్వ నియంతయైన భగవంతుడు నిన్ను స్వయంగా ఆరాధించడం కోసం భరత లక్ష్మణ శత్రుఘ్నరూప భేదాన్ని పొందాడు.

వ్యాఖ్య :- పాదుకార్చన కోసం భగవంతుడు భరతాది రూపాలను ధరించాడని ఉత్ప్రేక్షితం.

భగవంతుడు అవాప్త సమస్తకాముడు. సమస్త చేతనాచేతన ప్రపంచాన్ని నియమించే శాసనుడు. మానవత్వంచే ఆచ్ఛాదింపబడిన రాముడుగా అవతరించిన అప్రాకృతమూర్తి. తానొక్కడే రావణాది దుష్టరాక్షసులను సంహరించే సమర్థుడు కదా! అయితే తానే, తన అంశలచే భరత లక్ష్మణ శత్రుఘ్న నామరూపాలతో అవతరించాడెందుకు?

'అజాయ మానో బహుధా విజాయతే' శ్రుతి రీత్యా, కర్మబంధమైన జన్మలేని భగవంతుడు తన సంకల్పంచేతనే అనేక రూపాలుగా అవతరిస్తాడు. **'పరాఽస్య శక్తి ర్వివిధైవ శ్రూయతే'** స్వామి శక్తి నానా విధాలుగా ఉంటుందని శ్రుతి.

దశరథుడు తనకు నలుగురు పుత్రులు కావాలని కోరలేదు. అయినా, శ్రీరంగనాథుడే లోకకంటకులను సంహరించడానికి శ్రీరాముడుగా అవతరించాడు. తన పాదుకలను పూజించడానికి భరత లక్ష్మణ శత్రుఘ్నులుగా రూప భేదాన్ని కల్పించుకొన్నాడు. భరతుడు శత్రుఘ్నునితో పాటు భగవత్పాదుకలను నేరుగా ఆరాధించాడు. లక్ష్మణుడు శేషభూతుడు. శేషాంశసంభూతుడు. నిరంతరంకైంకర్యంచేసే స్వరూప దాస్యమూ, గుణ దాస్యమూ కలవాడు. ఆదిశేషుని రూపాంతరమే పాదుకా స్వరూపం.

"స్వతను మపి వ వందే లక్ష్మణః శేషభూతః". లక్ష్మణుడు తన రూపమేయైన పాదుకా స్వరూపానికి నమస్కరించాడు కూడ.

భగవత్సేవామాధుర్యం నిరతిశయం కదా!

'ఆరాధించే భాగ్యం నాకు లేకపోయెకదా!' అని భగవంతుడు కూడా ఆశపడే భోగ్యత కలది భగవదారాధన. ఇలా శ్రియఃపతిచేతనూ గౌరవింపబడే మహిమగల పాదుకాదేవి అధికారాన్ని పరిగ్రహించడం ప్రజలభాగ్యమే. ఔపచ్ఛందసికం.

177. మగధాంగ కళింగ.వంగ ముఖ్యాన్
విమతాన్ రంధ్ర గవేషిణః ససైన్యాన్ ।
రఘు పుంగవ పాదుకే! విజిగ్యే
భరతః శాసన ముద్వహన్భవత్యాః । –37.

అర్థం :– హే రఘుపుంగవ పాదుకే = ఓ శ్రీరామ పాదుకా! భరతః = భరతుడు; భవత్యాః = నీ యొక్క; శాసనం = ఆజ్ఞను; ఉద్వహన్=(శిరసా) వహిస్తూ; రంధ్రగవేషిణః =(ఉపద్రవంకోసం) అవకాశాన్ని వెదకే శీలంగల; మగధ, అంగ, కళింగ, వంగ, ముఖ్యాన్= మగధాంగ కళింగ వంగ దేశాధిపతులు మొదలైన; ససైన్యాన్ = సైన్యాలతో కూడియున్న; విమతాన్ = శత్రువులను; విజిగ్యే = జయించాడు.

తా। ఓ రఘు పుంగవ పాదుకా! భరతుడు నీ ఆజ్ఞను పాటిస్తూ, ఉపద్రవాన్ని కలిగించడం కోసం అవకాశాని కెదిరి చూస్తున్న, సేనాసహితులైన, మగధాంగ కళింగ దేశాధిపతులైన ముఖ్య శత్రువులను గెలిచాడు.

వ్యాఖ్య :- పాదుకాభిప్రాయానుసారం భరతుడు శత్రువులను జయించాడు.

రాజులకు మంత్రి, సేనాపతి మొదలైన పరిజనులు చేసే రీతిగా పాదుకాదేవి సంకల్పాన్నిబట్టి భరతుడు చేసే కైంకర్యం కూడా ఒకరకమైన పాదుకారాధనయే. పాదుకా సంకల్పపూర్వకమైన శక్తిని పొందిన భరతుడు, ఉపద్రవాలను సృష్టింపదలచి అవకాశం కోసం ప్రతీక్షిస్తూ సైన్యాలను సమాయత్తం చేసుకున్న ఆయా దేశాధిపతులైన శత్రువులను జయించాడు.

విమతాన్ :- "ఇలంగత్తిట్ట పురాణత్తరుం శమణరుంశాక్కియరుమ్,
వలిందువాతుశెయ్ వీర్‌కళుంమత్తునుందెయ్‌వము
మాగినిన్దాన్" (తి.వా.మొ. 4-10-5.)

లింగపురాణం మొదలైన తామస పురాణాలను, వేద బాహ్యస్మృతులను ప్రమాణంగా భావించి వాదించేవారు, జైనులు, బౌద్ధులు, పాశుపతులు, వైశేషికులునూ, వారు ధ్యానించే దేవతాంతరాలు కూడా శ్రీమన్నారాయణుని శరీరం లాంటివారే. పరమతాలను నిరసించి, 'పొలిందునిన్దపిరాన్' నిరుపాధిక ఐశ్వర్యం ప్రసిద్ధమవుతున్నట్లు నిలిచియున్న సర్వేశ్వరుని అనుభవించిన నమ్మాళ్వార్ల అనుగ్రహాన్ని పొంది శ్రీమన్నాథమునులు న్యాయశాస్త్రాది ప్రవచనాలచేత అక్కడక్కడున్న పరమతాలనెల్ల ఖండించి, ఆ మతస్థులను తీర్చిదిద్దిన విషయాన్నీ స్ఫురింపజేశారు దేశికులు.

పరికరాలంకారం. ఔపచ్ఛందసికం.

178. అనితర వహనీయం మంత్రి ముఖ్యైర్యదాత
త్వయి వినిహిత మాసీ త్సూర్య వంశాధిరాజ్యమ్ ।
రఘుపతి పదరక్షే! రత్నపీఠే తదానీం
శ్రియమివదదృశు స్త్వాం సాదరం లోకపాలాః । -38.

అర్థం :- హే రఘుపతి పద రక్షే = ఓ రాఘవ పాదుకా! అనితర వహనీయం = ఇతరులచే వహింపరాని; తత్ = ఆ, ప్రసిద్ధమైన; సూర్యవంశ + ఆధిరాజ్యం = సూర్యవంశం యొక్క సామ్రాజ్యం; మంత్రిముఖ్యైః =(సుమంత్రాది) ప్రధాన మంత్రులచేత; యదా = ఎప్పుడు; త్వయి = నీయందు; వినిహితం = ఉంచబడినదై ; ఆసీత్ = అయిందో; తదానీం = అప్పుడు; లోకపాలాః =(ఇంద్రాది) లోకపాలురు; రత్నపీఠే = సింహాసనమందు; త్వాం = నిన్ను; శ్రియం, ఇవ = లక్ష్మినివలె, సాదరం = భయభక్తులతో; దదృశుః = దర్శనం చేసుకున్నారు.

తా॥ ఓ రాఘవ పాదుకా! ఇతరులెవ్వరూ వహింప నలవికాని సూర్యవంశ సార్వభౌమత్వాన్ని మంత్రులలో ముఖ్యులైనవారు నీయందు వహింపజేశారు. అప్పుడు లోకపాలకులు రత్నపీఠమందు అధివసించిన లక్ష్మీదేవిని సేవించినట్లు నిన్ను సేవించుకున్నారు.

వ్యాఖ్య :– పాదుక సార్వభౌమత్వాన్ని వహించినప్పుడు దిక్పాలకులు సేవించారు.

రాజులు లోకపాలాంశ సంభూతులని శాస్త్రప్రోక్తం. దేవరాజైన ఇంద్రుడు ప్రాగ్దిశాధిపతి. తేజోధిపతియైన జాతవేదుడు ఆగ్నేయదిఙ్మూలాధిపతి. ధర్మాధిపతియైన యముడు దక్షిణదిగధిపతి. రక్షోధిపతియైన నిర్‌ఋతి నైర్‌ఋతిదిఙ్మూలాధిపతి. జలాధిపతియైన వరుణుడు పశ్చిమదిక్పాలకుడు. ప్రాణాధిపతియైన పవనుడు వాయవ్య మూల పాలకుడు. ధనాధిపతియైన కుబేరుడు ఉత్తరదిక్పాలకుడు. పశుపతియైన శంకరుడు ఈశాన్య మూలాధిపతి. ఈ లోక పాలురెనమండుగురూ దేవతలే.

దుర్వాస ముని శాపం వల్ల తమ పదవుల నుంచి విడిపోయిన దేవతలు క్షీరసాగరం నుంచి ఉద్భవించిన శ్రీ మహాలక్ష్మిని రత్నపీఠమందు అధిష్ఠింపజేసి దిగ్గజాలు అభిషేకించగా నయభయాలతో సేవించుకున్నారు.

"శ్రియంలోకే దేవజుష్టా ముదారామ్" - శ్రుతి.

"బ్రహ్మేశాది సురవ్రజస్సదయితః త్వద్దాసదాసీగణః" – చతుర్ముఖ, పంచముఖ, షణ్ముఖ, శతమఖ ముఖ నిఖిల బర్హిర్ముఖులూ, వారి పత్నులూ లక్ష్మీదేవికి సకలోపచారాలు చేసే దాస దాసీ జనులనియామునాచార్య స్తుతి.

సుమంత్రుడు మంత్రాంగాన్ని భద్రంగా నిర్వహిస్తున్న మంత్రులలో ముఖ్యుడు. కులగురువైన వసిష్ఠ మహర్షి ధర్మాధర్మ నిర్ణేత. కాబట్టి, సుమంత్రుడూ, వసిష్ఠుడూ మొదలైన ప్రముఖులు, ఐశ్వర్య వీర్య తేజశ్శాలురైన వారే నిర్వహింపదగిన సూర్యవంశ సార్వభౌమకృత్యాన్ని పాదుకాదేవికి నిక్షేపంలా అర్పించారు. అప్పుడు రత్నపీఠాధిష్ఠితయైన లక్ష్మీదేవియో అన్నట్లు శోభిస్తున్న పాదుకాదేవిని లోకపాలురందరు భయభక్తులతో సందర్శించారు.

నాకాది లోకపాలకులే పాదుకాదేవిని సేవించారంటే, మర్త్యలోక పాలకులమాటేమి? ఈలోక మాలోక మేలోక మేలే వారైనా పాదుకాదేవిని సందర్శించి సకలైశ్వర్యవంతులవుతుంటారు.

'శ్రియమివ' అనడం వల్ల స్మృత్యలంకారసహితో శ్లేషాలంకారం. మాలినీ వృత్తం.

179. పరిహృత దండకాధ్వ గమనం పదరక్షిణీత
త్పరిణత విశ్వసంప దుదయం యువయోర్ద్వితయమ్ ।
రఘుపతి భద్రపీఠ మధిరుహ్య తదా విదధే
వ్యపగతవైరి భూప నిలయం వసుధా వలయమ్ ॥ –39.

అర్థం :– (హే పాదుకే = ఓ పాదుకలారా!) పరిహృత దండక + అధ్వ గమనం = వదలిన దండకారణ్య మార్గ సంచారంగల; పదరక్షిణీ = అయోధ్యాస్థానాన్ని రక్షించే స్వభావం గల భరతుని విషయమై; పరిణత విశ్వసంపత్ +

ఉదయం = పండిన సమస్త సంపదల వృద్ధికి కారణమైన; తత్ = ఆ, ప్రసిద్ధమైన, యువయోః = మీ యొక్క; ద్వితయం = జత; తదా = (అప్పుడు) అధికార స్వీకార సమయాన; రఘుపతి రత్నపీఠం = శ్రీరాముని సింహాసనాన్ని; అధిరుహ్య = అధిరోహించి; వసుధావలయం = భూ మండలాన్ని; వ్యపగత వైరిభూప నిలయం = తొలగింపబడిన శత్రురాజుల నివాసం కలదానిగా; విదధే = చేసింది.

తా॥ ఓ పాదుకలారా! అధికార పరిగ్రహణ వేళ దండకారణ్య మార్గ సంచారాన్ని వదలిన, అయోధ్యాస్థాన రక్షణ శీలుడైన భరతునిపట్ల సమస్త సంపదల వృద్ధిని ఫలింపజేసిన ప్రసిద్ధమైన మీ జత, రఘుపతి భద్ర పీఠాన్ని అధిరోహించి, భూ మండలాన్ని శత్రురాజులకు నిలువ నీడలేనట్లుగా చేసింది.

వ్యాఖ్య :— పాదుకా ద్వయం శత్రువులను నిరసించి, యోగక్షేమాలను కల్పించింది.

'పాదుకాద్వితయమ్' కర్తృపదం. శ్రీరామచంద్రస్వామితో దండకారణ్యంలో సంచరించక పాదుకాయుగళం అయోధ్యకు వచ్చింది. పాదుకాదేవ్యాజ్ఞచేత రాజ్యాస్థాన రక్షణ శీలం కలిగిన భరతుని విషయమై సర్వసంపదలను బాగా ఫలింపజేసింది. భద్ర పీఠాధిష్ఠితయై పగవారిని కూడూ, గూడూ లేకుండా నష్టపరచి, భూచక్రాన్ని జనరంజకంగా త్రిప్పింది. పౌరులు సుఖంగా జీవించారు.

ప్రేయోఽలంకారం. నర్కుటక వృత్తం.

180. ప్రాప్తోదయా తదానీం కిమపితమస్తన్నిరాకరోద్భవతీ ।
తనురివ మనుకులజనుషాం ప్రసవిత్రీరత్నపాదుకే! సవితుః ॥ –40.

అర్థం :— హే రత్నపాదుకే = ఓ మణిపాదుకా! తదానీం = అధికార పరిగ్రహణ సమయాన; ప్రాప్త + ఉదయా = పొందిన ఉదయ పర్వతంగల; మనుకుల జనుషాం = మను వంశమందు జనించిన ఇక్ష్వాకులకు; ప్రసవిత్రీ = మూలకారణమైన; సవితుః = సూర్యుని యొక్క; తనుః, ఇవ = మూర్తి (సావిత్రి) వలె; ప్రాప్త + ఉదయా = పొందిన రాజ్యాభివృద్ధి కల; భవతీ = నీవు; మనుకులజనుషాం = మనుజులకు; ప్రసవిత్రీ = హితాన్ని ప్రేరేపించే; సవితుః = సృష్టికర్తయైన భగవంతుని యొక్క; తనుః, ఇవ = విగ్రహంవలె; కిం, అపి = అనిర్వచనీయమైన; తత్ = ఆ, ప్రసిద్ధమైన; తమః = చీకటిని/వ్యాకులతను; నిరాకరోత్ = తొలగించావు.

తా॥ ఓ రత్నపాదుకా! అధికారాన్ని చేబట్టినప్పుడు అభ్యుదయాన్ని కలిగించిన నీవు, ఉదయాచలాన్ని పొంది మనువంశ మహారాజులకు మూలకారణమైన సూర్యుని మూర్తిలాగా/మనుష్యులకు చైతన్యాన్ని ప్రసాదించి హితాన్ని ప్రేరేపించే జగత్స్రష్ట యొక్క ఆకృతిలాగా, అనిర్వచనీయమైన చీకటిని/తమోగుణాన్ని తొలగించావు.

వ్యాఖ్య :- పాదుకాదేవి సూర్యబింబంలాగా మనుజుల తమస్సును నివారించింది.

మనువు తండ్రియైన సూర్యమూర్తి తన వంశంలో కలిగిన అరాజకపు చీకటిని తొలగింప వచ్చినట్లు ప్రకాశిస్తున్నది పాదుక. ఉదయభానుమూర్తి లోకులకు చైతన్యాన్ని కలిగిస్తుంది. చీకటిని చీల్చివేసి మానవులను నిద్ర నుంచి మేల్కొలిపి, కార్యోన్ముఖులను చేస్తుంది. పాదుక సావిత్రిగానూ, గాయత్రిగానూ భాసిస్తున్నది.

'ఉదయః పూర్వ పర్వతః' (అమరం) 'తను' శబ్దం స్త్రీ వాచకం.

మను వంశంలో జనించిన రాజులకు తత్త్వహిత పురుషార్థాలను కలిగిస్తూ, తమోగుణాన్ని తొలగించి, రజోగుణప్రేరణచేత కర్తవ్య పరాయణులనుచేసి, సత్వగుణాధిక్యంతో, తనను అర్చించడంవల్ల, వారి పాపపుంజాన్ని పంచ బంగాళంచేసి, నిత్యకల్యాణం పచ్చతోరణంగా వారిని అభ్యుదయపరచే శ్రీరంగనాథుని అర్చామూర్తిలాగా పాదావని ప్రకాశిస్తున్నది. **"ఆభ్యాం రాజ్యేస్థితో ధర్మః"** - పాదుకలవల్ల రాజ్యంలో ధర్మం స్థిరంగా ఉంటుందన్న భరతుని మాటను సార్థకం చేసింది పాదుకాదేవి. ఆర్యావృత్తభేదమైన ఈ శ్లోకం శ్లిష్ట పదభూయిష్ఠం, ఉపమాలంకార సజ్జితం.

అధికార పరిగ్రహ పద్ధతి సమాప్తం.

7. అభిషేక పద్ధతి

181. పాహినః పాదుకే! యస్యా విధాస్యన్నభిషేచనమ్ ।
ఆభిషేచనికం భాండం చక్రేరామః ప్రదక్షిణమ్ ॥ –1.

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకాదేవీ! యస్యాః = ఎవరికి; అభిషేచనం = పట్టాభిషేకాన్ని; విధాస్యన్ = చేయగోరిన వాడై ; ఆభిషేచనికం = పట్టాభిషేకం కోసం సమకూర్చిన; భాండం = పూర్ణకుంభం మొదలైన సామగ్రికి; రామః = శ్రీరాముడు; ప్రదక్షిణం = ప్రదక్షిణను, చక్రే = చేసెనో; (ఆ, నీవు) నః = మమ్ములను; పాహి = రక్షింపుము.

తా। ఓ పాదుకాదేవీ! నీకు పట్టాభిషేకం చేయగోరుతూ రాముడు అభిషేక సామగ్రి చుట్టూ ప్రదక్షిణం చేశాడు.

వ్యాఖ్య :– శ్రీరాముడు పట్టాభిషేక సామగ్రికి ప్రదక్షిణం చేశాడు.

అధికార పరిగ్రహం కంటె ముందే జరగవలసిన కార్యం పట్టాభిషేకం. శ్రీరాముడు మొదట, తర్వాత భరతుడు, రాజ్యాన్ని త్యజించారు. పరిస్థితిని బట్టి పాదుకాదేవి మొదట అధికారాన్ని పరిగ్రహించింది. సింహాసనమందున్న పాదుకాదేవి ఉదయాచల మందున్న సూర్యమూర్తివలె భాసిస్తుందని సూచిస్తూ అధికార పరిగ్రహ పద్ధతి ముగిసింది.

భద్రాసనాధిష్ఠిత పాదుకాదేవికి అభిషేక పద్ధతి పాటింపబడుతున్నది. శ్రీరాముడు, తండ్రి అనుమతిని పొంది, కౌసల్య–తల్లి–తో ఆశీస్సులు పొందడానికీ, సీతమ్మను సమ్మతింపజేయడానికీ, కైకేయి భవనం నుంచి లక్ష్మణుడు అనుసరింపగా బయటకు వచ్చాడు. దారిలో తనకు పట్టాభిషేకం చేయడానికి సిద్ధపరచిన మంగళ ద్రవ్య సామగ్రి కనబడింది.

"ఆభిషేచనికంభాండంకృత్వా రామః ప్రదక్షిణమ్ ।
శనైర్జగామ సాపేక్షో దృష్టిం తత్రా విచాలయన్" । (అయో. 19 స. 31 శ్లో.)

"శ్రీరాముడు ఉద్దేశంతోనే మంగళ ద్రవ్య సామగ్రి నుంచి చూపులను చలింపజేయక అభిషేక ద్రవ్య భాండం చుట్టూ మెల్లగా ప్రదక్షణం చేసి వెళ్ళాడు".

"శనై, సాపేక్షః, దృష్టింతత్రా విలోచయన్" శబ్దాలు ధ్వనిగర్భితాలు. ధర్మశాస్త్రరీత్యా మంగళద్రవ్యాలను గౌరవించాలి కాబట్టి రాముడు ప్రదక్షిణంచేశాడని వ్యాఖ్యాతలు వివరించారు. వేదాంత దేశికులు మాత్రం వాల్మీకి రచనా సౌందర్యాన్ని , శ్రీరాముని గాంభీర్యాన్నీ తమనిస్తుల ప్రతిభతో మన మస్తిష్కంలోకి సరసంగా చేరవేస్తున్నారు. అభిషేక సామగ్రి దశరథుని కోరిక రీతిగా తనకోసం కాదనీ, కైకేయి అభిలాషకు అనుగుణంగా భరతుని కోసమూ కాదనీ, కేవలం

పాదుకా పట్టాభిషేకానికే ఉపయోగపడుతుందనీ, సముచితంగా ఉపయోగపడాలనే సాపేక్షతో శ్రీరాముడు, తనను రాజ్యం నుంచి తప్పించినా తన ముఖ వర్చస్సులో మార్పు కలుగకుండా, పూర్ణకుంభేత్యాది ద్రవ్యభాండం మీద నిశ్చలమైన కృపాకటాక్షాన్ని ప్రసరింపజేస్తూ, దాని చుట్టూ గౌరవంగా ప్రదక్షిణం చేశాడు. రాముని సత్య సంకల్ప హేతువు చేత పాదుకా మహిమ అనితర సాధారణమని దేశికులు 'పాహినః పాదుకే' అని ప్రస్తుతిస్తూ ఈ పద్ధతిని ప్రారంభించారు. హేతూత్ప్రేక్ష. అనుష్టుబ్ఛందం.

182. రాఘవస్య చరణౌ పదావని!
ప్రేక్షితుం త్వ దభిషేక మీషతుః!
అభిషేచనిక భాండ సన్నిధౌ
యత్ప్రదక్షిణ గతి శ్శనైర్యయౌ॥ – 2

అర్థం :– హే పదావని = ఓ పాదుకా! యత్ = ఎందువలన; అభిషేచనిక భాండసన్నిధౌ = పట్టాభిషేకార్థమైన సామగ్రి సమీపంలో; ప్రదక్షిణ గతిః = ప్రదక్షిణంగా నడక సాగించిన రాముడు; శనైః = మెల్లగా; యయౌ = వెళ్ళెనో, (తత్ = ఆకారణం) రాఘవస్య = శ్రీరాముని యొక్క; చరణౌ = పాదాలు; త్వత్ + అభిషేకం = నీ పట్టాభిషేకాన్ని; ప్రేక్షితుం = చూడడానికి; ఈషతుః = కోరినాయి.

తా॥ ఓ పాదుకా! అభిషేకం కోసం కూర్చబడిన సామగ్రి వద్ద రాముడు ప్రదక్షిణంచేస్తున్నప్పుడు మెల్లగా నడవడానికి కారణమేమి? అంటే, శ్రీరాముని పాదాలు నీ పట్టాభిషేకాన్ని చూడగోరినాయి.

వ్యాఖ్య :– రాముడు నెమ్మదిగా చేసిన ప్రదక్షిణగతిని సమర్థించే శ్లోకం.

కైకేయీ భవనం నుంచి కౌసల్యా భవనానికి వెళ్ళడానికి వేగం పుంజుకున్న శ్రీరాముని చరణాలు అభిషేకార్థమున్న సామగ్రి సన్నిధిలో వేగాన్ని తగ్గించాయి. పాదుకా పట్టాభిషేకాన్ని చూచే భాగ్యం కలుగకున్నా, అభిషేకానికి ఉపయోగపడే మంగళ ద్రవ్యాలనైనా కన్నారచూచి, మనసార తృప్తి చెందాలని శ్రీ చరణాలు అభిలషించాయి.

"పదే పదాంతరం కుర్యాత్ కరౌ చలనవర్జితౌ।
వాచిస్తోత్రం హృదిధ్యానం చతురంగం ప్రదక్షిణమ్।"

"సంపూర్ణ ప్రసవా నారీ, పయః పూర్ణం ఘటం యథా।
ఉద్వహంతీశనైర్యాయాత్, తద్వత్కుర్యాత్ ప్రదక్షిణమ్॥"

మెల్లగా ఒక అడుగులో మరొక అడుగువేస్తూ, చేతులూపకుండా ప్రబ్బతి పట్టుకొని, నోటితో స్తుతిస్తూ, మనసులో ధ్యేయమూర్తిని ధ్యానిస్తూ, (ఈ నాలుగు అంశాలను పాటిస్తూ) ప్రదక్షిణం చేయాలి.

నిండు నీటికుండను తొలకకుండా ఎత్తుకొని నిండుగర్భిణి మెల్లగా నడిచేరీతిగా ప్రదక్షిణం చేయాలని 'శ్రీరంగమాహాత్మ్యం'లో చెప్పబడింది.

శ్రీరాముడు చరణాలకోరిక నీడేర్చడం కోసం వలసినంత సమయాన్ని వినియోగించి అభిషేచనికభాండానికి ప్రదక్షిణం చేశాడు. కావ్యలింగాలంకారం. రథోద్ధతా వృత్తం.

183. మూర్ధాభిషిక్తైర్నియమేన వాహ్యౌ
విచింత్యనూనం రఘునాథపాదౌ।
రత్నాసనస్థాం మణిపాదుకే! త్వాం
రామానుజన్మా భరతోఽభ్యషించత్॥ - 3

అర్థం :– హే మణిపాదుకే = ఓ రత్నపాదుకా! రఘునాథపాదౌ = రాముని పాదాలు; నియమేన = విధిగా; మూర్ధాభిషిక్తైః = మంత్రపూతమైన తీర్థోదకాలచే శిరః స్నాతులైనవారిచే; వాహ్యౌ = వహింపదగినవి; (ఇతి = అని) విచింత్య = పరామర్శించి; రామ + అనుజన్మా = రాముని తోబుట్టువైన; భరతః = భరతుడు; రత్న + ఆసనస్థాం = రత్నసింహాసనమందున్న; త్వాం = నిన్ను; అభ్యషించత్ = అభిషేకించెను; నూనం = నిశ్చయం.

తా॥ ఓ మణిపాదుకా! రాముని పాదాలు శాస్త్రోక్తరీతిగా మూర్ధాభిషిక్తులైన వ్యక్తులచే వహింపదగినవి అని విచారించి శ్రీరామునితోడ బుట్టిన భరతుడు మణిమయసింహాసనమందున్న నీకు నిశ్చయంగా పట్టాభిషేకం చేశాడు.

వ్యాఖ్య :– భరతుడు పాదుకాభిషేకం చేయడానికి హేతువు ఉత్ప్రేక్షితం.

శ్రీరామచంద్రస్వామి పాదాలను మంత్రపఠనం చేత పవిత్రమైన తీర్థోదకాలచే అభిషేకింపబడిన వ్యక్తులే శిరసావహింపదగినవారు. శ్రీరామునితోడ బుట్టినందువల్ల అభిషిక్తుడుకాకున్ననూ భరతుడు రామపాదాలను తలధరింప యోగ్యుడే. ఇతర రాజులందరు అభిషిక్తులైన వారే రామచరణాలను శిరసా వహించినట్లు కనబడుతుంది. శిరఃస్నానం చేయని అపరిశుద్ధులచే రామచరణాలు వహింపతగవు.

పాదుకలు సర్వదా వ్యభిచరించకుండా శ్రీరాముని పాదాలను శిరసా ధరిస్తుంటాయి. రామ చరణాలను తలదాల్చిన వారు పట్టాభిషేకానికి యోగ్యులవుతారు.

ఈ రెండు విషయాలను రామానుజన్ముడు చక్కగా పరామర్శించి పాదుకలను రత్నసింహాసనమందు అధిష్ఠింపజేశాడు. లక్షణంగా పాదుకలకు పట్టాభిషేకమూ చేశాడు.

రెండవ విషయం మనకు తెలియును కానీ మొదటి విషయం రామానుజన్మునికే తెలియునుకదా! ఉపజాతివృత్తం.

184. భ్రాతుర్నియోగేఽప్యని వర్తమానం
రాజ్యాభిషేకంచ పరిత్యజంతమ్।
రామానుజౌతౌ ననుపారతంత్ర్యా
దుభావుభాభ్యాం భవతీజిగాయ । – 4

అర్థం :– హే పాదుకాదేవీ! భ్రాతుః = అన్నగారి (రాముని) యొక్క; నియోగే, అపి = (ప్రేరణ) ఆజ్ఞ పట్లకూడా; అనివర్తమానం = తిరిగిపోనట్టి; రాజ్య + అభిషేకం = రాజ్యపాలన కోసం పట్టాభిషేకాన్ని; పరిత్యజంతం = మాను కున్నట్టి; తౌ = ఆ; ఉభౌ = ఇద్దరు; రామ + అనుజౌ = రాముని తమ్ములైన లక్ష్మణ భరతులను; భవతీ = నీవు; పారతంత్ర్యాత్ = పరతంత్రవైనకారణంగా; ఉభాభ్యాం = రెండు పనులను చేయడం చేత; జిగాయ, నను = జయించావు సుమా!

తా। ఓయి పాదుకా! అన్నగారైన రాముడు ప్రేరేపించినా, అయోధ్యకు తిరిగిపోనట్టి లక్ష్మణస్వామినీ, రాజ్య పట్టాభిషేకాన్ని వదలుకున్న భరతస్వామినీ – రామునితోబుట్టులైన వారిద్దరినీ – పారతంత్ర్యం వల్ల నీవు రెండు కార్యాలను ఆచరించడంచేత గెలిచావు.

వ్యాఖ్య :– భరతాభిషిక్తయైన పాదుకను స్తుతించే శ్లోకం.

లక్ష్మణునికంటెనూ, భరతునికంటెనూ పాదుకాదేవి రామాజ్ఞనుపాటించి శ్లాఘ్యతమయైన పరతంత్రురాలని విశదమవుతున్నది. పరుని మాట మీరకుండా పాటిస్తే, పారతంత్ర్యం సిద్ధిస్తుంది. గంగను దాటి సుమంత్రుణ్ణీ గుహుణ్ణీ వెనుకకు పంపిన తర్వాత సీతారామలక్ష్మణులు ఒక చెట్టుక్రింద మొదటి రాత్రి గడుపసాగారు. శ్రీరాముడారాత్రి తమ్మునితో అంటాడు –

"మాస్మ మత్కారణాద్దేవీ సుమిత్రా దుఃఖమా వసేత్।
అయోధ్యామిత ఏవ త్వం కాల్యే ప్రవిశ లక్ష్మణ!

అహమేకో గమిష్యామి సీతయాసహదండకాన్
అనాథాయాహి నాథస్త్వం కౌసల్యాయాభవిష్యసి"।

(అయోధ్యా 53స. 16, 17)

"నాకారణంగా తల్లి సుమిత్ర దుఃఖ పడరాదు తమ్ముడూ! నేనొక్కడనే సీతతో పాటు దండకారణ్యాల్లోకి వెళ్ళుతాను. లక్ష్మణా! దిక్కులేని తల్లికౌసల్యను కూడా నీవుకాపాడుకోగలవు. కాబట్టి, నీ విక్కడినుంచే తెల్లవారే వరకు అయోధ్యకు చేరబొమ్మ" అని రాముడు ప్రేరణచేసినా లక్ష్మణుడు పెడచెవిన పెట్టాడు.

'స్వర్గం వాఽపిత్వయావినా', 'నీవు లేక నేను స్వర్గాన్నైనా చూడగోర' నన్నాడు. రామాజ్ఞను ఉల్లంఘించాడు.

ఇక, భరతుడు చిత్రకూటగిరి దగ్గరికి వచ్చినప్పుడు,

"త్వం రాజా భరత! భవ స్వయం నరాణామ్।
వన్యా నా మహమపి రాజరాణ్మృగాణామ్"। (అయో. 107-17)

"తమ్ముడూ! పూర్వం మన తండ్రినీ తల్లిని మాతామహుని ముందు రాజ్యశుల్కంగా వివాహమాడినాడు. దైవాసుర సంగ్రామంలో తండ్రి దశరథుడు సంతోషించి యిచ్చిన రెండువరాలను కైకేయి కోరడం వల్ల నలుగురు కుమారులం కలిసి మనతండ్రిని సత్యవంతుణ్ణి చేద్దాం. నీవు జనరంజకుడవైన రాజావు. వన్యమృగాలకు రాజును నేను. కాబట్టి, సంతోషంగా నీవు అయోధ్యకు పోయి పట్టాభిషిక్తుడవగుము." అని రాముడు భరతునితో అన్నాడు.

కర్షకులు పర్జన్యునిలాగా, కోసలవాసులు నిన్నేకోరుతున్నారన్నయ్యా! లోక పరిపాలనాసామర్థ్యం కలిగిన నీవే రాజ్యపాలన చేయాలి. ఆ మహారాజ్యాన్ని పాలించే ఉత్సాహ ప్రభుశక్తులు నాకు లేవని హఠం చేశాడు భరతుడు.

ఉభాభ్యాం ఉభౌజిగాయ :– రెండు విషయాలచేత ఇద్దరిని గెలిచింది. రామాజ్ఞచేత అయోధ్యకు వచ్చి, పట్టాభిషేకం చేసుకొనిరామానుజులనిద్దరినీ అపకృష్టుల చేసి, పాదుకాదేవి పారతంత్ర్య నిష్ఠచే అధిగమించింది. పదార్థ హేతుకకావ్యలింగాలంకారం. ఉపజాతివృత్తం.

185. నివేశ్య రంగేశ్వర పాదరక్షే!
భద్రాసనే సాదర మభ్యషించత్।
వశీ వసిష్ఠో మనువంశజానాం
మహీ క్షితాం వంశపురోహితస్త్వామ్। – 5

అర్థం :– హే రంగేశ్వరపాదరక్షే = ఓ రంగనాథపాదుకా! వశీ = ఇంద్రియాలు తన వశమందున్నవాడూ; మనువంశ జానాం = మనువంశ మందుజనించిన; మహీక్షితాం = రాజులకు; వంశ పురోహితః = కులగురువైన; వసిష్ఠః = వసిష్ఠ మహర్షి; త్వాం = నిన్ను; భద్రాసనే = సింహాసన మందు; నివేశ్య = ఉంచి, సాదరం = భక్తితో; అభ్యషించత్ = అభిషేకించెను.

తా॥ ఓ రంగేశ్వరపాదుకా! జితేంద్రియుడూ, మనువంశ మహారాజులకు వంశపురోహితుడూ అయిన వసిష్ఠుడు నిన్ను సింహాసనమందు అధిష్ఠింపజేసి ఆదరంగా అభిషేకించాడు.

వ్యాఖ్య :– వసిష్ఠుడు పాదుకా పట్టాభిషేకాన్ని జరిపించాడు.

'క్షి నివాసగత్యోః' అనే ధాత్వర్థాన్ని బట్టి **'మహ్యాంక్షియంతి'** ఇతి మహీక్షితః = దివ్య చరిత్రకలిగిన భూలోకవాసులు అని అర్థమిచ్చే శబ్దమిది.

మనువంశ మహీక్షితులకు కులగురువు వసిష్ఠుడు. మనువంశ మహారాజులకెందరికో తరతరాలనుంచి పట్టాభిషేకం జరుపుతున్న ఆ వంశపురోహితుడు పరదేవతా పారమార్థ్యంకల మహాజ్ఞాని.

'వశీ':– మోదఖేదాలకు పొంగక, క్రుంగక – అర్థకామాలకు లోబడక, ఇంద్రియాలను తన అదుపులో ఉంచుకున్న మహర్షి వసిష్ఠుడు. బహుకాలజీవియూ, జితేంద్రియుడూ అయిన వసిష్ఠుడు రామునికేకాక అతనికంటె పూర్వులైన రాజులకూ ఉపాధ్యాయుడు. ఆయా కార్యాల్లో తన విధిని తాను నియమబద్ధంగా నిర్వహించిన ఉదాత్తచరితుడు వసిష్ఠుడు.

'సాదరం':– శ్రీరంగనాథుని పాదుకలకూ, శ్రీరామపాదుకలకూ భేదమెరుగని, అభేదాధ్యవసాయంగల బ్రహ్మర్షి వసిష్ఠుడు గౌరవం, ఆనందం, ఉత్సాహం ముప్పిరిగొనగా పాదుకా పట్టాభిషేకం నిర్వహించాడు.

పాదుకా వర్ణనకు అంగంగా మహాపురుషచరిత్ర వర్ణితం. ఉదాత్తాలంకారం. ఉపజాతి వృత్తం.

186. కృతాభిషేకా భవతీ యథావత్ రంగేశపాదావని! రత్నపీఠే।
గంగానిపాతస్నపితాం సుమేరో రధిత్యకాభూమి మధశ్చకార॥ – 6.

అర్థం :– హే రంగేశపాదావని = ఓ రంగపతి పాదుకా! రత్నపీఠే = రత్నసింహాసనమందు; యథావత్ = యోగ్యతకు తగినట్లు; కృత + అభిషేకా = చేయబడిన పట్టాభిషేకంగల; భవతీ = నీవు; గంగా నిపాత, స్నపితాం = గంగాజల పతనం చేత, తడుపబడిన; సుమేరోః = బంగారుకొండయొక్క; అధిత్యకా భూమిం = ఊర్ధ్వ భూభాగాన్ని; అధశ్చకార = క్రిందుచేశావు.

తా॥ ఓ రంగేశపాదుకా! రత్న పీఠమందు సముచితంగా అభిషిక్తవైన నీవు గంగాజలపతనం చేత తడిసిన మేరు పర్వతం యొక్క మీది భూభాగాన్ని అనాదరించావు.

వ్యాఖ్య :– అభిషిక్త పాదుకా సౌందర్యం మేరు శిఖర సౌందర్యాన్నిమించింది.

పవిత్ర సలిలంతో సమంత్రకంగా అభిషేకింపబడడం గౌరవం. హేమాద్రి శిఖర భాగం మీద గంగాజలం దొర్లిపడడం లాఘవం.

"మేరుస్సు మేరుర్హేమాద్రి రత్నసానుః సురాలయః" – (అమరం)
"ఉపత్యకాద్రే రాసన్నా భూమి రూర్ధ్వ మధిత్యకా" – (అమరం)

రత్న పీఠం ఉపమేయం. రత్నసాను పర్వతం ఉపమానం.

అభిషేకానికి గంగా నిపాతం సామ్యం. బంగారు పాదుకలకు బంగారు కొండ నెత్తమ్మితో పోలిక. పాదుక, ఊర్ధ్వ భాగాన్ని అధఃకరించింది.

పాదుక యెదుట బంగారుకొండకొమ్ము వెలవెల బోయింది. 'ఉపమ'ను చులుకన చేయడం ఒకరుచి. అది ప్రతీపాలంకార లక్షణం. ఉపజాతి వృత్తం.

187. వసిష్ఠ ముఖ్యై ర్విహితాభిషేకాం
రాజ్యాసనే రామనివేశ యోగ్యే।
తుష్టావ రంగేశ్వర పాదరక్షే!
ప్రాచేతసస్త్వాం ప్రథమః కవీనామ్। – 7

అర్థం :– హే రంగేశ్వర పాదరక్షే = ఓ శ్రీరంగనాథపాదుకా! రామనివేశయోగ్యే = రాముడు కూర్చుండదగిన; రాజ్యాసనే = సింహాసనమందు; వసిష్ఠముఖ్యైః = వసిష్ఠుడు మొదలైనవారిచే; విహిత + అభిషేకాం = చేయబడిన పట్టాభిషేకం గల; త్వాం = నిన్ను; కవీనాం = కవులలో; ప్రథమః = ఆద్యుడైన; ప్రాచేతసః = వాల్మీకి మహర్షి; తుష్టావ = స్తుతించాడు.

తా॥ ఓ రంగేశ్వరపాదుకా! శ్రీరాముడు కూర్చుండదగిన సింహాసనమందు వసిష్ఠాది మునులచే అభిషిక్తవైన నిన్ను కవులలో ఆద్యుడైన వాల్మీకి స్తుతించాడు.

వ్యాఖ్య :– అభిషిక్త పాదుకాదేవి ఆదికవిచేత స్తుతింపబడింది.

పట్టాభిషిక్తులను అభినందించడం మర్యాద. శ్రీరాముడధిష్ఠింపయోగ్యమైన సింహాసనమందు పాదుకాదేవిని అధిష్ఠింపజేసి వసిష్ఠుడు, జాబాలి మొదలైన ఋషులు పట్టాభిషేకం చేశారు. మొట్టమొదట, ఆదికావ్యమైన రామాయణంలో

'పాదుకే హేమ భూషితే' – 'యోగక్షేమం విధాస్యతః' – 'పాదుకాగ్ర్యాభిషేచనమ్' అని పాదుకాస్తుతి చేసినవాడు వాల్మీకి. విష్ణుపారమ్యాన్ని ప్రశంసించి, ప్రఖ్యాత పరచిన ప్రాచేతసుని – వాల్మీకి – కంటె మించిన రామభక్తుడు లేడు. ప్రాచీన సార్వభౌములకన్న అధికంగా ఆర్ష ప్రశంస పొందిన గౌరవం పాదుకాదేవికి లభించింది. ప్రేయోఽలంకారం. ఉపజాతి వృత్తం.

188. రక్షో వధార్థం మణిపాదరక్షే!
రామాత్మనో రంగపతేః ప్రవాసే।
రక్షో పకారాద్భవతీ వితేనే
రాజన్వతీం కోసల రాజధానీమ్॥ – 8.

అర్థం :– హే మణిపాదరక్షే = ఓ రత్నపాదుకా! రక్షస్ + వధార్థం = రాక్షసులను వధించడం కోసం, రామ + ఆత్మనః = రామరూపుడైన; రంగపతేః = శ్రీరంగనాథుని యొక్క; ప్రవాసే = వనవాసమప్పుడు; భవతీ = నీవు; రక్షా + ఉపకారాత్ = రాజ్యరక్షణమనే ఉపకారబుద్ధివల్ల; (రక్షస్ + అపకారాత్ = రాక్షసులకు అపకారంచేసే ఆశయం వల్ల;) కోసలరాజధానీం = అయోధ్యానగరిని; రాజన్వతీం = ఉత్తమరాజు కలదానిగా; వితేనే = చేశావు.

తా॥ ఓ మణిపాదుకా! రాముని రూపంగా ఉన్న శ్రీరంగపతి రాక్షసులను సంహరించడం కోసం అరణ్యంలో సంచరించగా, నీవు 'రక్షించవలెను' అనే ఉపకారబుద్ధిచేత కోసల రాజధానియైన అయోధ్యానగరిని శోభన రాజుకలదానిగా చేశావు.

వ్యాఖ్య :– వికృత రూపమొందిన అయోధ్యానగరిని పాదుకాదేవి, స్వరూపంతో శోభింపజేసింది.

ఇక్ష్వాకురాజు కాలం నుంచి అయోధ్యలో ఇలువేల్పుగా ఉన్న శ్రీరంగపతియే శ్రీరాముని రూపంగా అవతరించాడు. రామునికి రంగపతికి భేదం లేదు. రాక్షసాంతకుడు శ్రీరంగపతి. శ్రీరాముడు రాక్షసవధ కోసం అయోధ్యను విడిచి అడవిలో సంచరించసాగాడు. అయోధ్య అరాజకమయింది.

"ఉపద్రుత మిదం సర్వమనాలంబ మనాయకమ్" (రా. 48స. 15)

రాముడులేని రాజ్యమంతా నిరాధారమై, అనాయకమై ఉపద్రవం పాలైనది.

"తిమిరేణాభిలిప్తేవసా తదా నగరీబభౌ" (34)

అధ్యయనంలేక, అగ్నులు జ్వలింపక, అయోధ్యనిండా చీకటి క్రమ్మింది.

"ఉపశాంత వణి కృణ్యా నష్టహర్షానిరాశ్రయా।
అయోధ్యానగరీ చాసీ న్నష్టతార మివాంబరమ్॥" (35)

అంగళ్ళు లేక, నిరాశ్రయమై ఆనందమేకానరాని అయోధ్య చుక్కలులేని ఆకాశంలాగా ఉంది.

"తదాహ్య యోధ్యానగరీ బభూవసా, మహార్ణవ స్సంక్షిపితో దకో యథా॥" (37) నృత్తగీత వాద్యహీనమైన అయోధ్యానగరం నీరింకిపోయిన నీరధిలాగా నిస్తేజమయింది.

పాదుక సింహాసన మధిష్ఠించి రాజశాసనం చేయగా, అయోధ్య రాజన్వతి అయింది. రాముని కృత్యం రక్షోవధ. పాదుకా కృత్యం రక్షోపకారం. దుర్జనులను వధించడమే సుజనులకు చేసే ఉపకారం. నల్పొడం కంటె నిల్పొడం మెరుగు.

"సురాజ్ఞి దేశే రాజన్వాన్ స్యాత్తతోఽన్యత్రరాజవాన్" (అమరం) పాదుకా పరిపాలన వల్ల అయోధ్య పూర్వం వలె స్వగుణశోభను, సురాజశోభను పొంది విరాజిల్లింది. పూర్వరూపాలంకారం. ఇంద్ర వజ్రా వృత్తం.

189. ప్రాప్తాభిషేకా మణిపాదరక్షే!
ప్రతాపముగ్రం ప్రతిపద్యమానా।
శశాస పృథ్వీం భవతీ యథావత్
సాకేత సింహాసన సార్వభౌమీ॥ – 9.

అర్థం :– హే మణిపాదరక్షే = ఓ రత్నపాదుకా! ప్రాప్త + అభిషేకా = పొందబడిన పట్టాభిషేకంగల; సాకేత సింహాసన సార్వభౌమీ = అయోధ్యాసింహాసనమందు అఖండ భూమండలేశ్వరివైన; భవతీ = నీవు; ఉగ్రం = ప్రచండమైన; ప్రతాపం = (పగతురకు భయం కలిగించే,) ప్రతాపాన్ని; ప్రతిపద్యమానా = పొందుతూ; పృథ్వీం = భూమిని; (రాజ్యాన్ని) యథావత్ = యోగ్యంగా; శశాస = ర (శి) క్షించావు.

తా॥ ఓ మణిపాదుకా! అయోధ్యానగర సింహాసన మధిష్ఠించడం వల్ల సర్వభూమికి నియామకమైన పట్టాభిషేకం పొంది ప్రచండ ప్రతాపాన్ని ప్రతిపాదిస్తూ నీవు సముచితంగా శాసించావు.

వ్యాఖ్య :– పాదుకాదేవి దుష్టనిగ్రహంగా రాజ్యాన్ని రక్షించే వర్ణన.

పాదుకాదేవి శిష్టరక్షణ కోసం దుష్ట శిక్షణ చేసి ధర్మస్థాపన చేయడం ప్రశంసనీయం. అవక్రవిక్రమోపేతులైన అవనీశులు దిగ్విజయయాత్రచేస్తూ శత్రువులను వధించడమో, వశపరచుకోవడమో విధిగా చేస్తారు. కాని పాదుకాదేవి మాత్రం ఉన్నచోటనే ఉండి, సార్వభౌమత్వాన్ని చక్కగా నిర్వహించింది. కాబట్టి, ప్రసిద్ధ సార్వభౌముల శాసకత్వంకంటె పాదుకాదేవి శాసకత్వం విలక్షణమైనదని ధ్వని, ఉపజాతి వృత్తం.

190. దశాననాదీన్ మణిపాదరక్షే!
జిగీషతో దాశరథే ర్వియోగాత్ ।
జాతోపతాపా త్వయిసంప్రయుక్తై
స్తీర్థోదకై రుచ్ఛ్వసితాధరిత్రీ । – 10.

అర్థం :– హే మణిపాదరక్షే = ఓ మణిపాదుకా! దశ + ఆనన + ఆదీన్ = పదిమొగాలుగల రావణుడు మొదలగువారిని; జిగీషతః = జయింపగోరే; దాశరథేః = శ్రీరామునియొక్క; వియోగాత్ = ఎడబాటువల్ల; జాత + ఉపతాపా = కలిగినతాపంగల; ధరిత్రీ = భూమి; త్వయి = నీయందు; సంప్రయుక్తైః = ప్రయోగింపబడిన; తీర్థ + ఉదకైః = పవిత్ర జలాలచేత; ఉచ్ఛ్వసితా = ఊపిరిపీల్చుకుంది.

తా॥ ఓ రత్నపాదుకా! శ్రీరామునికి రావణాదులను జయించే కోరిక కలిగింది. రాముని ఎడబాటువల్ల భూమికి తాపంకలిగింది. నీ అభిషేకానికి ఉపయోగించిన పవిత్ర జలాలచేత పృథ్వీతాపం తీరింది.

వ్యాఖ్య :– అభిషిక్త పాదుకా తీర్థోదకం వల్ల ధరిత్రిప్రాణాలను ధరించింది.

దాశరథి దశాననాది నిశాచరులను జయింపగోరికాననకేగాడు. భూనాయకుడైన రాముణ్ణి కానలేక భూసతి ఆర్తితో తాపపడింది. నాయకుని వియోగంవల్ల తపించే నాయికను 'విప్రలబ్ధ' అంటారు. తాపోపశమనం కోసం శీతలోపచారం చేయడం పరిపాటి.

పాదుకా పట్టాభిషేకం చేసిన పవిత్రశీతలోదకాలవల్ల భూనాయికతాపం తీరింది. ఆర్ద్రీభూతయైన భూనాయిక పాదుకా తీర్థం సేవించడంవల్ల తేరుకొని ఊపిరితీసుకోగలిగింది. ప్రజలందరు సుఖపడ్డారు. జాతోపతాపాః– ఈ విశేషణం వల్ల ధరిత్రి విప్రలబ్ధనాయిక – అప్రకృత – గాగమ్యమవుతుంది. ఇది సమాసోక్తి లక్షణం. ఉపజాతి వృత్తం.

191. అధ్యాసితం మనుముఖైః క్రమశోనరేంద్రై
రారోప్య దేవి! భవతీం తపనీయపీఠమ్।
రాజ్యాభిషేక మనఘం మణిపాదరక్షే!
రామోచితం తవ వశం భరతో వితేనే॥ – 11.

అర్థం :– హే దేవి! మణిపాదరక్షే = ఓ రత్నపాదుకాదేవీ! మనుముఖైః = మనుమహారాజు మొదలైన; నరేంద్రైః = రాజులచేత; క్రమశః = పరంపరగా; అధ్యాసితం = అధిష్ఠింపబడిన; తపనీయ పీఠం = బంగారుసింహాసనమందు; భవతీం = నిన్ను; ఆరోప్య = ఆరోహింపజేసి; రామ + ఉచితం = శ్రీరామునికియోగ్యమైన; రాజ్య + అభిషేకం = పట్టాభిషేకాన్ని; భరతః = భరతుడు; అనఘం = వ్యసన రహితంగా; తవ = నీకు; వశం = అధీనం; వితేనే = చేశాడు.

తా|| ఓ మణిపాదుకాదేవీ! వైవస్వతమను మహారాజు మొదలైన రాజుల చేత పరంపరగా అధిష్ఠింపబడిన బంగారు సింహాసనమందు నిన్ను అధిష్ఠింపజేసి రామునికి యోగ్యమైన రాజ్యాభిషేకాన్ని దోషరహిత మగునట్లు భరతుడు నీయధీనం చేశాడు.

వ్యాఖ్య :– రామోచితాభిషేకం పాదుకాదేవికి జరుపడం వల్ల దోషరహితమయింది.

పాదుకాభిషేక విషయంలో భరతుని పాత్రనూతనాంశంతో చిత్రితం. వైవస్వతమనువు మొదలుకొని మనువంశంలో తండ్రి తర్వాత పెద్దకుమారుడు సాకేత సింహాసన మధిష్ఠించే ఆచారముంది. కాబట్టి దశరథుని తర్వాత రాజ్యాభిషేకం రామునికే యోగ్యం, కాని ప్రబల కారణం వల్ల అది భరతాభిషేచనంగా పరిణమించింది. ఒకవేళ, భరతుడు ఉద్వేగంతో సింహాసనమాక్రమించి పట్టాభిషిక్తుడే అయితే, వంశాచారం మారిపోయి, నాటినుంచి క్రమభంగదోషం ప్రాకిపోయేది. భరతుడు అఘం లేశమైనా అంటుకోని రీతిగా పాదుకా దేవిని రత్న పీఠమందు అధిష్ఠింపజేశాడు. అనఘమేక్రమంగా ఆచరింపబడింది. రామునికి చేయదగిన పట్టాభిషేకాన్ని రామపాదుకలకే చేసి భరతుడు రాజ్యాన్ని పాదుకాధీనం చేశాడు. పాదుకాభిషేకం రామాభిషేకమే కాబట్టి పౌరులకు వ్యసనమూ, భరతునికి దోషమూ తొలగిపోయింది.

ఒక్కచోట చేయవలసిన కార్యం మరొక్కచోటచేస్తే, అది 'అసంగతి' అలంకారం. వసంత తిలకావృత్తం.

192. స్నేహేనదేవి! భవతీం విషయేఽభిషించన్
ద్విస్సప్త సంఖ్య భువనోదర దీపరేఖామ్|
జాతం రఘూద్వహ దివాకర విప్రయోగా
దంధం తమిస్ర మహరద్భరతః ప్రజానామ్|| – 12

అర్థం :– హే దేవి = ఓ పాదుకాదేవీ! భరతః = భరతుడు; ద్విస్సప్త – ఖాం| ద్విః = రెండుతో గుణించిన; సప్త = ఏడు; సంఖ్య = అంకెగల (పద్నాలుగు) భువన = లోకాల యొక్క; ఉదర = మధ్యన; దీపరేఖాం = దీపకళికవైన, భవతీం = నిన్ను; స్నేహేన = భక్తి/నూనెతో; విషయే = దేశమందు/ప్రమిదయందు; అభిషించన్ = అభిషేకిస్తూ/తడిపి వెలిగిస్తూ; రఘు – గాత్ రఘు + ఉద్వహ = రఘువంశశ్రేష్ఠుడైన శ్రీరాముడు అనే; దివాకర = సూర్యుని యొక్క; విప్రయోగాత్ = ఎడబాటువల్ల/ దర్శనం లేనందువల్ల; ప్రజానాం = ప్రజలకు; జాతం = కలిగిన; అంధం, తమిస్రం = గొప్పశోకాన్ని/కటిక చీకటిని; అహరత్ = పోగొట్టెను.

తా|| ఓ పాదుకాదేవీ! భరతుడు చతుర్దశభువనాల నడుమ దీపరేఖవైన నిన్ను భక్తితో (నూనెతో) దేశమందు (ప్రమిదయందు) అభిషేకిస్తూ (తడిపి వెలిగిస్తూ) రామదివాకరుని ఎడబాటువల్ల జనులకు కలిగిన దుఃఖాన్ని (గాడాంధకారాన్ని) తొలగించాడు.

వ్యాఖ్య :- భరతుడు ప్రపంచ జనావళికి సహకరించిన విషయం వర్ణితం.

సూర్య దర్శనం లేనప్పుడు చీకటి వ్యాపిస్తుంది. ప్రమిదలో నూనె పోసి దీపాన్ని వెలిగించి చీకటిని తొలగించడం లోక జ్ఞత.

రాముడే సూర్యుడు. భరతుని భక్తియే తైలం. భూ లోకం ప్రమిద. ప్రజల వ్యసనమే తమిస్రం. పాదుక దీపరేఖ.

రాముడు అడవికి వెళ్ళడం వల్ల ప్రజలకు దుఃఖం కలిగింది. భరతుడు పాదుకాదేవిని అభిషేకించడంవల్ల ప్రజల దుఃఖం తొలగింది. సప్తాశ్వుడు సూర్యుడు. సప్త జిహ్వుడు అగ్నిహోత్రుడు.

"దినాంతే౽హితం తేజ స్సవిత్రేవహంతాశనః" (కాళిదాస సూక్తి)

సాయంకాలమందు సూర్యుడు తన తేజస్సును అగ్నియందు సంక్రమింపజేస్తాడు కాబట్టి రాత్రిపూట అగ్నికి తేజస్సు అధికమవుతుంది.

'సప్' ధాతువుకు 'గౌరవించడం, అతుక్కొనియుండడం' అని అర్థం **'ద్వి స్సప్త సంఖ్యాభువనోదరం'** అంటే భూలోకం. భూలోకానికి క్రింద ఉన్న లోకాలు ఏడు. అతలం, వితలం, సుతలం, తలాతలం, రసాతలం, మహాతలం, పాతాళం.

భూలోకం, భువర్లోకం, స్వర్లోకం, మహర్లోకం, జనలోకం, తపోలోకం, సత్యలోకం. ఇవి ఊర్ధ్వలోకాలు. పద్నాలుగు లోకాలకు భూలోకం సుమధ్యమం.

'దేహళీదీపన్యాయం' గా అంటే, కడపమీద పెట్టిన దీపంలోపల వెలుపల వెలుగునిచ్చినట్లు, రామహరి విప్రయోగం వల్ల ప్రపంచ జనావళికి ఆవరించిన తమస్సును హరించేలాగా భరత స్నేహం చతుర్దశలోకాల మధ్యదేశాన పాదుకా దీపరేఖను వెలిగించింది.

భరతుడు రామానుజుడు. కృష్ణుడూ రామానుజుడే. మరొక రామానుజుడు ప్రసిద్ధ ఆచార్యుడే.

"నిరాకృతవతీ దయే! నిగమసౌధ దీపశ్రియా
విపశ్చిద విగీతయా జగతి గీతయాంధం తమః" (89)

'దయాశతకం' భగవద్గీతను 'నిగమసౌధ దీపశ్రీ'గా కీర్తించింది. శ్రీ కృష్ణభగవానుడు భగవద్గీత అనే వేదాంత దీపకాంతిచే ప్రపంచంలోని గాఢాంధకారాన్ని తొలగించాడు.

"శమితో దయ శంకరాది గర్వః, స్వబలాదుద్ధృతయాదవ ప్రకాశః అవరోపితవాన్శ్రుతే రపార్థాన్, ననురామా వరజః స ఏష భూయః"

'యతిరాజసప్తతి' లోని (13వ) శ్లోకానికి 'సంగీత సాహిత్యకళానిధి' శ్రీమాన్ న.చ. కృష్ణమాచార్యులవారి ఆంధ్రానువాదాన్ని ఆస్వాదించండి.

'తొలగగజేసె శంకరుడు తొల్లిగ గల్గినవారి గర్వమున్, బలమున నుద్ధరించె బ్రతిభావిభవమ్మున యాదవ ప్రభన్ జెలగి, యపార్థమున్ శ్రుతికి జెందని రీతి యొనర్చె వహ్వారే! తలపగ రామ సోదరుడితండతడేకద వేయి మారులున్'।

"యతిక్ష్మాభృద్దీపం" (యతిరాజసప్తతి 56) యతిరాజులే స్వయంగా పరస్నేహం - పరభక్తి -తో మంగళ దీపమై ప్రకాశించారు.

అన్ని రామానుజ దీపాలే. కవితార్కిక కేసరి దీపత్రయాన్ని కృపచేసి, మన ఆనందం మహార్ణవమై మించి అంబరాన్ని చుంబించేలాగా చేశాడు.

శ్లేష రూపకాలతో సంకీర్ణమైన పరిణామాలంకారం. వసంత తిలక.

193. హస్తాపచేయ పురుషార్థ ఫలప్రసూతే
ర్మూలం పదావని! ముకుంద మహీరుహస్త్వమ్।
ఛాయా విశేషమదిశ ద్యదసౌ ప్రజానా
మావర్జితైస్త్వయి శుభైరభిషేక తోయైః ॥ –13.

అర్థం :– హే పదావని = ఓ పాదుకాదేవి! త్వం = నీవు; హస్త + అపచేయం = చేతులచే తెంపుకోదగిన; పురుషార్థ ఫల ప్రసూతేః = పురుషార్థాలు అనే ఫలాలను ఉత్పత్తిచేసే; ముకుంద మహీరుహః = ముకుందుడనే వృక్షం యొక్క; మూలం = వేరువు; యత్ = ఎందుకంటే; అసౌ = ఈ ముకుంద వృక్షం; త్వయి = నీయందు; ఆవర్జితైః = కురిపించిన; శుభైః = మంగళకరమైన; అభిషేక తోయైః = అభిషేక జలాలతో; ప్రజానాం = జనులకు; ఛాయా విశేషం = చల్లని నీడనూ, శోభనూ; అదిశత్ = ఇచ్చింది.

తా॥ ఓ పదావనీ! చేతులచే తెంపుకోదగిన పురుషార్థ ఫలాలనిచ్చే ముకుంద వృక్షానికి మూలం నీవు. కాబట్టి, ముకుంద వృక్షం నీకు ధారవోసిన శుభాభిషేక జలాలతో ప్రజలకు చల్లని నీడనూ, కాంతి సమృద్ధినీ కలిగించింది.

వ్యాఖ్య :– పాదుకాభిషేకం వల్ల ప్రజలకు నూతనోత్తేజం కలిగింది.

పురుషులు ప్రయత్నించి పొందదగిన ఫలాలుపురుషార్థాలు. ధర్మం, అర్థం, కామం, మోక్షం అనే చతుర్విధ ఫలాలు హస్తాపచేయాలు. 'మహీరుట్' అంటే భూమియందు మొలచిన చెట్టు. తరుమూలంలో నీరుపోస్తే వేరు తడుస్తుంది. 'మూలం' పుష్టిగా ఉంటే 'సాలం' మూడు.పూవులూ, ఆరుకాయలుగా వృద్ధిచెందుతుంది. వేరుకు నీరు పోస్తే

తరువు తన పచ్చని ఆకులతో ఆతపాన్ని అడ్డుకొని, తన నాశ్రయించినవారికి చల్లని నీడనిస్తుంది. పాదపచ్ఛాయలో విశ్రమిస్తే వర్చస్సు కలుగుతుంది.

ముకుందుడు ముక్తైశ్వర్యాన్ని ఇచ్చే పరమాత్ముడు. ముకుందుడే వృక్షం. **"వృక్ష ఇవస్తబ్ధో దివి తిష్ఠత్యేకః".** శ్రుతి కూడా భగవంతుణ్ని చెట్టుగా చెప్పింది. "వరుణో వారుణో వృక్షః" – భగవంతునికి వృక్ష నామముంది. ముకుందుడు రాముడుగా భూమిపైన అవతరించాడు. ఆ ముకుంద మహీరుహానికి మూలం పాదుకాదేవి. పవిత్ర జలాలతో పాదుకను అభిషేకించగా శ్రీరామ పాదపంతన శాఖలయందు పురుషార్థ ఫలాలను ప్రజల చేతికి అందేరీతిగా ఉత్పత్తి చేసింది.

"రూఢా వృషా చలపతేః పాదే ముఖకాంతిపత్రలచ్ఛాయా।
కరుణే! సుఖయసి వినతాన్ కటాక్ష విటపైః కరాపచేయ ఫలైః" । (19.)

దయ ఊటలూరే స్థానం భగవత్పాదం. శ్రీనివాసుని పాదమనే పర్వతచరియలో పుట్టిన చెట్టు, సాష్టాంగ నమస్కారం చేసే భక్తులకు ముఖకాంతి అనే దట్టని ఆకులేర్పడి నీడనిస్తూ, కటాక్షశాఖలచే హస్తాపచేయ ఫలాలనిచ్చి వారిని సుఖింపజేస్తుంది. దయాదేవి మహిమచేత భక్తులకు సర్వేశ్వరుడు అపేక్షిత ఫలాలను అనుగ్రహిస్తాడన్నది దయా శతకం.

"ఫలమత ఉప పత్తేః" ఫలప్రదాత భగవంతుడే, అన్నది బ్రహ్మసూత్రం. కాబట్టి, పాదుకాభిషేక వార్తతో ఆనంద భరితుడైన శ్రీరాముడు ప్రజలకు సకల పురుషార్థ ఫలాలను ప్రసాదించాడు. దండకారణ్యంలో తపోధనులనూ కృతార్థులను చేశాడు.

పురుషార్థ ఫలజనక వృక్షంగా శ్రీరాముణ్ని, తన్మూలంగా పాదుకను వర్ణించడం ఉత్ప్రేక్షాలంకారం. ఈ అర్థాన్నే 'ఛాయా' శబ్ద శ్లేషగల ఉత్తరార్థంతో సమర్థించడం వల్ల శ్లేషానుప్రాణిత కావ్యలింగాలంకారం, వసన్తతిలక.

194. అహ్నాయ రామ విరహాత్పరిఖిన్న వృత్తే
రాశ్వాసనాయ భవతీ మణిపాదరక్షే।
తీర్థాభిషేక మపదిశ్య వసుంధరాయా
శ్చక్రే తదా సముచితం శిశిరోపచారమ్ ॥ –14.

అర్థం :– హే మణిపాద రక్షే = ఓ మణి పాదుకా! భవతీ = నీవు; రామ విరహాత్ = శ్రీరాముని ఎడబాటువల్ల; పరిఖిన్న వృత్తేః = మిక్కిలి పరితపిస్తుండిన; వసుంధరాయాః = భూమిని; ఆశ్వాసనాయ = ఓదార్చడం కోసం; తదా = అప్పుడు; తీర్థ + అభిషేకం = పవిత్ర జలాభిషేకాన్ని; అపదిశ్య = వ్యాజంగా చేసుకొని; సముచితం = చాల యోగ్యమైన; శిశిర + ఉపచారం = శీతలోపచారాన్ని; అహ్నాయ = శీఘ్రంగా; చక్రే = చేశావు.

తా॥ ఓ రత్న పాదుకా! నీవు శ్రీరాముని ఎడబాటువల్ల ఖేదతాపంతో బాధపడుతున్న వసుంధరను ఓదార్చడం కోసం తీర్థాభిషేకాన్ని సాకు పెట్టుకొని, తాపకాలోచితమైన శైత్యోపచారాన్ని త్వరగా చేశావు.

వ్యాఖ్య :– వసుంధర తాపాన్ని తీర్చడమే పాదుకాభిషేకోద్దేశ్యమని వర్ణితం.

శ్రీరాముడడవికేగగానే లోకమంతా తాపజనకమైన చింతాగ్నిచే బాధపడసాగింది. 'వసుంధర' అంటే చరాచర వస్తు సముదాయాన్ని ధరించిన భూమి అని వ్యుత్పత్త్యర్థం. ఇక్కడ వసుంధర – మానవీకరణం గమనీయం. అభిషేక జలం భూమిమీద వానజల్లులాగా పడిదాని తాపాన్ని ఆర్పివేసింది. పట్టాభిషేక సమయంలో పవిత్ర జలాలు ఖేద తప్త వసుంధరకు శైత్యోపచారంగా ఉపయుక్తమయ్యాయి.

పాదుకలను జలాలతో అభిషేకించడం ఒక మిష. రామ విరహం వల్ల తపించిపోతున్న వసుంధరకు జలసేచనంతో శీతలోపచారం చేయడమే పాదుకా ప్రథానోద్దేశ్యం. ఖిన్నలోకం రామునికి ప్రత్యామ్నాయంగా, రామపాదుకాభిషేకంతో ముత్సంపన్నమయింది.

సమాసోక్తి కైతవాపహ్నుత్యలంకారంతో సంకీర్ణం. వసన్త తిలక.

195. మాలిన్యమాశ్రితవతీ మణిపాదరక్షే !
పంకేన కేకయసుతా కలహోత్థితేన ।
శుద్ధింపరా మధిజగామ వసుంధరేయం
త్వత్తః క్షణాన్నిపతితైరభిషేకతోయైః ॥ –15.

అర్థం :– హే మణిపాద రక్షే = ఓ రత్నపాదుకా! కేకయసుతా కలహ + ఉత్థితేన = కైకేయి యొక్క జగడంవల్ల కలిగిన; పంకేన = బురద (పాపం) చేత; మాలిన్యం = మురికిని (అపవిత్రతను) ఆశ్రితవతీ = పొందిన; ఇయం = ఈ; వసుంధరా = భూమి; త్వత్తః = నీ మీది నుంచి; నిపతితైః = జారిన; అభిషేకతోయైః = అభిషేక జలాలచేత; క్షణాత్ = త్రుటిలో; పరాం = మిక్కిలి; శుద్ధిం = శుభ్రతను (పవిత్రతను) అధిజగామ = పొందింది.

తా॥ ఓ రత్నపాదుకా! కైకేయి జగడంవల్ల కలిగిన పంకంచేత మాలిన్యాన్ని పొందిన ఈ వసుంధర నీ మీది నుంచి జారిపడిన అభిషేకజలాలతో క్షణంలో పరిశుద్ధురాలయింది.

వ్యాఖ్య :– పాదుకాభిషేక జలాలచే వసుంధర పరిశుద్ధురాలయింది.

ప్రఖ్యాతిపొందిన అయోధ్యానగరినీ, తత్పాలకులనూ కైకేయి అలుకవల్ల లేచిన దుమారం కళంకితం చేసింది. కైక వసుంధర మీద బురద జల్లింది. కోసల రాజ్యం ధూళి ధూసరితమయింది. నీరు దుమ్మును అణచివేస్తుంది. పాపాన్ని

క్షాళనం చేస్తుంది. కైకేయి కుచేష్టవల్ల కలిగిన పాప పంకిలాన్నిపవిత్రమైన పాదుకాభిషేక సలిలమే క్షణంలో క్షాళనం చేయగలిగింది.

"పంకః కర్దమ పాపయోః". "మలో౽స్త్రీ పాపవిట్కిట్టాని". (నిఘంటు) పాదుక సేవ్యసేవక భావాన్ని స్థిరంగా నిల్పి, వసుంధరను పరిశుద్ధంగా ఉంచగలిగింది. ఉత్ప్రేక్షాలంకారం, వసంత తిలకా వృత్తం.

196. ఆవర్జితం మునిగణేన జగద్విభూత్యై
తోయం పదావని! తదా త్వయి మంత్రపూతమ్ ।
మూలావసేక సలిలం నిగమద్రుమాణాం
శాపోదకం చసమభూత్ క్షణదాచరాణామ్ ॥ –16.

అర్థం :– హే పదావని = ఓ పాదుకా! తదా = అప్పుడు; జగత్ + విభూత్యై = లోక క్షేమం కోసం; మునిగణేన = ఋషిగణం చేత; త్వయి = నీయందు; ఆవర్జితం = ధారపోసిన; మంత్రపూతం = మంత్రాలచే పరిశుద్ధమైన; తోయం = ఉదకం; నిగమద్రుమాణాం = వేదాలనే చెట్లయొక్క; మూల + అవసేక సలిలం = పాదులయందు పోసిన జలంగానూ; క్షణదా చరాణాంచ = రాత్రించరులకు మాత్రం; శాప + ఉదకం = శాపజలంగానూ; సమభూత్ = ఆయెను.

తా॥ ఓ పాదుకాదేవీ! ఋషులు జగద్వికాసం కోసం నీయందు ధారవోసిన మంత్రపూత జలం, వేద పాదపాల పాదుల్లోపోసిన ఉదకంగానూ, రాక్షసులకు మాత్రం శాపోదకంగానూ సంభవించింది.

వ్యాఖ్య :– పాదుకాభిషేక జలం ధర్మ విజయానికీ, అధర్మ నాశనానికీ సహకరించిందని ఉల్లేఖించే శ్లోకం.

వసిష్ఠాది ఋషులు విశ్వశ్రేయస్సు కోసం వేదానువాకాలచే అభిమంత్రించిన జలంతో పాదుకాభిషేచనం చేశారు. వృక్షమూలంలో నీరుపోస్తే వృక్షం శాఖోపశాఖలతో నిత్యప్రత్యగ్రంగా వృద్ధిచెందుతుంది. వేద ప్రతిపాద్యుడైన శ్రీరామచంద్రుని పాదుకాయుగళమే వేద వృక్షమూలం. వేదమంత్రాలచేత అభిమంత్రిత జలాభిషేచనం వల్ల కలిగిన ఫలం రెండు రకాల ప్రభావాన్ని పాడనూపింది. శిష్ట రక్షణ, దుష్ట శిక్షణ. వర్ణాశ్రమాచారపరులు వేదాధ్యయనాధ్యాపనాదులతోస్వధర్మ పరాయణులయ్యారు. విరాధాది నిశాచరులు నశించారు.

193 వ శ్లోకం, ఈ 196వ శ్లోకం, చెట్టు పాదులో నీరు పోసినట్లు, వర్ణించినా, ఉక్తివైచిత్రి విలక్షణంగా ఉంది. వేదం ధర్మమూలం కదా! ఉల్లేఖాలంకారం. వసంత తిలకా వృత్తం.

197. విప్రోషితే రఘుపతౌ భవతీ యథార్హం
మాన్యే పదేస్థితి మతీ మనువంశజానామ్ ।
ఆత్మన్య థర్వనిపుణైః ప్రహితైః ప్రజానా
మశ్రూణ్యపాస్య దభిషేక జలప్రవాహైః । –17.

అర్థం :– ఓ పాదుకా! రఘుపతౌ= శ్రీరాముడు; విప్రోషితే = వనవాసానికి వెళ్ళగా; మనువంశజానాం = మనువంశ (రా)జుల యొక్క; మాన్యే = గౌరవమైన; పదే = స్థానమందు, యథార్హం = తగినట్లుగా; స్థితిమతీ = ఉండగలిగిన; భవతీ=నీవు; అధర్వనిపుణైః=అధర్వవేద విద్వాంసులచే; ఆత్మని=,నీయందు; ప్రహితైః=సమర్పింపబడిన; అభిషేక జల ప్రవాహైః= అభిషేకోదక ప్రవాహాలచే; ప్రజానాం = జనుల యొక్క; అశ్రూణి = కన్నీళ్ళను; అపాస్యత్ = తొలగించావు.

తా। ఓ పాదుకాదేవీ! రఘురాముడు వన గమనం చేయగా మనువంశజుల మాన్యమైన సింహాసనాన్ని యోగ్యంగా అధిష్ఠించిన నీవు, అధర్వవేద పారీణులు నీయందు' అభిషేకించిన జలధారలతో ప్రజల కన్నీళ్ళను తుడిచి కడిగి వేశావు.

వ్యాఖ్య :– పాదుకాదేవి, తన అభిషేక తీర్థంచేత ప్రజల శోకాన్ని అపనయించే వర్ణన.

మను వంశజుల సింహాసనం మహనీయమైనది. రఘురాముడధిష్ఠించవలసిన సింహాసనమది. కుటుంబంలో రెచ్చిన పరిస్థితులవల్ల రాముడు వనవాసానికేగగా, పాదుకాదేవి సముచితంగా ఆ సింహాసనమధిష్ఠించింది.

వసిష్ఠాది మహర్షులు అధర్వవేదనిపుణులు. కాబట్టి వారే పాదుకాపట్టాభిషేకాన్ని జరిపించారు. తత్ఫలితంగా, రాముని వనవాస గమనం వల్ల ప్రజలకు కలిగిన దుఃఖం బిక్కపోయింది.

ఏడ్చేవారి కన్నులను వారి స్నేహితులే కదా పరిశుద్ధజలంతో కడిగి వేస్తారు! ఖిన్నులైన అయోధ్యావాసుల కన్నులను మాత్రమే తుడిచి కడుగలేదు. పాదుకాభిషేకజలం కోసల దేశవాసుల దేహతాపాన్ని తీర్చేలాగా, దేహాలు అవగాహించేలాగా ప్రవహించింది.

"శంనో దేవీరభీష్టయ ఆపోభవంతు పీతయే। శంయోరభి స్రవంతునః" । ఇత్యాది అధర్వ వేద మంత్రపూతజలం దుఃఖ నివారకమే కాక సుఖదాయకమై అభీష్టసిద్ధిని కలిగిస్తుంది.

పాదుకాభిషేకజలాన్ని బహుళ ప్రయోజకంగా వర్ణించడం, దేశికుల అనల్ప కల్పనా చాతుర్యానికి అభివ్యంజకం.

ఉత్ప్రేక్షాలంకారం, వసంత తిలకా వృత్తం.

**198. ప్రాయో విశోషితరసా పతి విప్రయోగాత్
పర్యాకులీకృత సముద్ర పయోధరాగౌః
అంబ! త్వదీయ మభిషేక పయః పిబంతీ
ధేనుర్బ భూవజగతాం ధనధాన్యదోగ్ధ్రీ I –18.**

అర్థం :– హే అంబ = ఓ తల్లీ! పాదుకా! పతి విప్రయోగాత్ = పాలకుడైన రాముని ఎడబాటువల్ల; విశోషిత రసా = రాగహీనయైనది/నీరసించినది, కావున; ప్రాయః = తరచుగా; పర్యాకులీకృత సముద్ర పయోధరా = క్షుబ్ధ సముద్రాలే స్తనాలుగాగల/క్షోభించిన సముద్రాలు, మేఘాలుగల, గౌః = భూమి అనే ఆవు; త్వదీయం = నీ సంబంధమైన; అభిషేక పయః = అభిషేక జలాన్ని, పిబంతీ = త్రాగుతూ; జగతాం = లోకాలకు; ధనధాన్యదోగ్ధ్రీ = ధనధాన్యాలను కురిపించే; ధేనుః = పాడియావుగా; బభూవ = అయెను.

తా॥ ఓ అమ్మా! పాదుకా! జగత్పతియైన శ్రీరామచంద్రుని ఎడబాటువల్ల రాగహీనయై నీరసించింది కాబట్టి శుష్కించిన సముద్రాలు పయోధరాలుగా గల భూమి అనే ఆవు, నీ అభిషేక పయస్సును పానంచేస్తూ లోకాలకు ధనధాన్యాలను కురిపించే ధేనువుగా వెలసింది.

వ్యాఖ్య :– నీరసించిన భూమి అనే ఆవు పాదుకాభిషేక పయస్సును పానంచేసి సరస ధేనువయింది.

"భూమిర్ధేనుర్ధరణీ లోకధారిణీ" – భూమిని పాడియావు అన్నది వేదం. నాలుగు దిక్కుల్లో ఉన్న సముద్రాలే భూమి అనే ఆవు పొదుగులోని నాలుగు సిరలు. **"పయోధరీభూత చతుస్సముద్రాం, జుగోపగోరూపధరామివోర్వీమ్"** 'నాలుగు సముద్రాలు నాలుగు స్తనాలై గోరూపాన్ని ధరించిన భూమిని వలె, దిలీప మహారాజు నందినీ ధేనువును రక్షించాడు' అని కాళిదాసు వర్ణన.

"తదా హ్యయోధ్యా నగరీ బభూవసా మహార్ణవ స్సంక్షిపితోదకోయథా" I

'రామచంద్రుడడవికి పోగానే నిరానందయైన అయోధ్య, నీరింకిన నీరధిలాగా నీరసించింది'. అన్నాడు వాల్మీకి భగవానుడు.

భూపతిని ఎడబాసిన భూదేవి నిరాశ్రయ అయింది. ప్రేమానురాగాలతో చూచేవాడు లేనందున నీరసించింది. భూమిలో ద్రవం లేదు. నీరులేదు. **"రసో రాగే ద్రవేఽపిచ"**. (అమరం)

భూకాంత పయోధరాలు, అంటే సముద్రాల్లో నీరెండిపోయింది. నీరింకిన సముద్రాలచేత మేఘాలు కూడా చీకాకు పడినాయి.

"అపివృక్షాః పరిమ్లానాః స పుష్పాంకురకోరకాః" (రామాయణం)

'చిగుళ్ళు, మొగ్గలు, పువ్వులతోపాటు చెట్లు వాడిపోయి పోయాయి' అంటే భూమి ఎద బీటలుబారి ఎంత ఎండిపోయిందో, గుండె ఎంత బండబారిందో కదా!

భూమియే ఆవుకదా! ఆవు పుష్టిగా ఉంటే పాడి సమృద్ధిగా ఉంటుంది. ప్రీతితో కాచే కాపరి - గోపాలకుడు - కానరానందున ఆవు బక్కచిక్కి డొక్క తేలి ఉంది. పాదుగు ఈడ్చుకపోయింది. సిరలు నాలుగూ శుష్కించాయి.

ఇట్టి నీరస స్థితిలో, పాదుకా పట్టాభిషేకం జరిగింది. మంత్రపూతమైన అభిషేకజలం నేల నాలుగు చెరలా ప్రవహించింది. గోవు (భూమి, ఆవు) పాదుకాభిషేక జలాన్ని పుష్టిగా త్రాగింది. తత్ఫలితంగా, ఆవు చియ్యబట్టి కుండ పాదుగుతో నిండుగా శోభించే పాడియావై పాలను చేపినట్లే, భూమి అనంతరసయై ధనధాన్య సంపదలకు నెలవయింది.

'భాన్వంతి రత్నాని మహౌషధీశ్చ' - మహాకవి అన్నట్లు రాజ్యం ధనధాన్య సంపన్నమయింది. రాముడు అయోధ్యకు తిరిగి వచ్చినప్పుడు రామునితో భరతుడు 'ధనం, ధాన్యాగారం, సైన్యం అంతా మీ ప్రతాపం వల్ల పదిరెట్లు వృద్ధి అయింది' అని విన్నవించాడు. **"భవతస్తే జసా సర్వం కృతం దశగుణం మయా"**. 'రాముని తేజస్సు' అంటే 'పాదుకా రాజ్యం' అని భరతుని భావం కాబోలు. గోవు యొక్క ధన ధాన్యదోహనానికి పయఃపానమే హేతువుకదా! హేతూత్ప్రేక్ష. వసన్త తిలకావృత్తం.

199. వృత్తే యథావ దభిషేక విధౌ బభాసే
పశ్చాత్తవాంబ! భరతేన ధృతఃకిరీటః ।
ఆకస్మిక స్వకుల విప్లవశాంతిహర్షాత్
ప్రాప్తస్త్విషా మివపతి ర్మణిపాదుకే! త్వామ్ । -19.

అర్థం :- హే అంబ! మణి పాదుకే = ఓ జననీ! మణిపాదుకా! అభిషేక విధౌ = అభిషేక విధానం; యథావత్ = శాస్త్రోక్తంగా; వృత్తే = జరుగగా; తవ = నీ యొక్క; పశ్చాత్ = వెనుక (ఉండి) భరతేన = భరతుని చేత; ధృతః = ధరింప జేసిన; కిరీటః = రాజమకుటం; ఆకస్మిక - హర్షాత్। ఆకస్మిక = అకస్మాత్తుగా కలిగిన; స్వకుల విప్లవ = తన వంశోపద్రవం యొక్క; శాంతి = శాంతించడంచేత కలిగిన; హర్షాత్ = సంతోషంవల్ల; త్వాం = నిన్ను; ప్రాప్తః = చేరవచ్చిన; త్విషాంపతిః, ఇవ = కాంతులకు దొర అయిన సూర్యుడో అన్నట్లు; బభాసే = ప్రకాశించింది.

తా ॥ ఓ తల్లీ! మణిపాదుకా! నీ అభిషేక విధానం సలక్షణంగా జరిగిన వెంటనే నీ వెనుక నిలిచి భరతుడు నీకు సమర్పించిన కిరీటం, హఠాత్తుగా సంభవించిన తన వంశంలోని ఉపద్రవంశాంతించడం వలని సంతోషంవల్ల నిన్ను దర్శింపవచ్చిన సూర్యుడో అన్నట్లు భాసించింది.

వ్యాఖ్య :– పాదుక కిరీటాన్ని ధరించగనే అధిక ప్రతాపంతో భాసించింది.

శ్రీరాముడు రాజ్యాన్ని విడిచి విపినంలో ప్రవేశించాడు. రాజమకుటాన్ని ధరించడానికి భరతుడు అంగీకరించ లేదు. మహోన్నత ప్రాభవ వైభవాలు గల సూర్య వంశీయులు పాలించే దేశంలో అకస్మాత్తుగా విప్లవం సంభవించింది. ఇట్టి అరాజకమైన దేశంలోకి పాదుకాదేవి అడుగుపెట్టింది. ఉపద్రవం ఊరడిల్లింది.

"తతస్తు భరతః శ్రీమాన్ అభిషిచ్యార్యపాదుకే". (రామాయణం)

భరతుడు పాదుకలకు పట్టాభిషేకాన్ని శాస్త్ర ప్రకారంగా జరిపి రాజకిరీటాన్ని ధరింపజేశాడు. పాదుక అధిక తేజస్విని అయింది.

పాదుకకు కిరీటధారణ మంటే, కిరీటాన్ని దర్శింపజేసి తత్సన్నిధిలో సమర్పించాడన్నమాట. పాదుకాభిషే కోత్సవ దర్శనానికెందరో మహానుభావులేతెంచారు. తన వంశంలోని ఉపద్రవాన్ని శాంతింపజేసిన పాదుక విషయమై సూర్యభగవానుని కంటె అధికంగా సంతోషించే వాడెవడు? త్విషాంపతియే పాదుకా సన్నిధికేతెంచి దుర్నిరీక్ష్యమాణ సహస్ర కిరణాలతో కిరీట స్వరూపంగా భాసించినట్లు కవి ఉత్ప్రేక్షించాడు.

"ప్రతాపోత్తపనోయథా" – అన్నట్లు ప్రకృతి రంజనియైన పాదుక, కిరీటధారణం చేత అధిక ప్రతాపశాలిని అయింది. స్వరూపోత్ప్రేక్ష. వసంతతిలకా వృత్తం.

200. మనువంశ పురోహితేన మంత్రై
రభి మంత్ర్య త్వయి పాదుకే! ప్రయుక్తమ్ ।
అభిషేక జలం క్షణేన రాజ్ఞాం
శమయా మాస సముత్థితాన్ ప్రతాపాన్ ॥ –20.

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకా! మనువంశ పురోహితేన = మనువంశ పురోహితుడైన వసిష్ఠ మహర్షిచే; త్వయి = నీయందు; మంత్రైః = మంత్రాలచేత; అభిమంత్ర్య = సంస్కరించి; ప్రయుక్తం = ప్రయోగింపబడిన; అభిషేక జలం = అభిషేకించిన ఉదకం; సముత్థితాన్ = చెలరేగిన; రాజ్ఞాం = రాజుల యొక్క; ప్రతాపాన్ = ప్రతాపాలనే అగ్ని జ్వాలలను; క్షణేన = క్షణకాలంలో, శమయామాస = శాంతింపజేసెను.

తా। ఓ పాదుకాదేవీ! వసిష్ఠ మహర్షి నీ మీద వేద మంత్రాల చేత సంస్కరించి ప్రయోగించిన అభిషేకజలం, శత్రురాజులలో ఉద్భవించిన ప్రతాపాగ్ని జ్వాలలను ఆర్పివేసింది.

వ్యాఖ్య :– పాదుకాభిషేకజలం శత్రురాజుల ప్రతాపాగ్ని జ్వాలలను చల్లార్పింది.

శుద్ధి చేయడం, పోషించడం లాంటి నీటి ముఖ్య గుణాల్లో రెచ్చిన మంటలను చల్లార్చడం ఒకటి. పాదుకా మహిమవల్ల సూర్యవంశోపద్రవం శాంతించింది. దేశంలో అరాజకస్థితి ఏర్పడినప్పుడు విరోధులైన రాజులు ప్రతాపవంతులయ్యారు. వారి ప్రతాప జ్వాలలు చెలరేగి నెగడుతున్నాయి.

విశ్వశ్రేయస్కాముడూ, మనువంశ పురోహితుడూ అయిన వసిష్ఠుడు వేద మంత్రాలచే అభిమంత్రించిన జలాన్ని అభిషేకానికి ప్రయోగించాడు. ఆ పవిత్రాభిషేక తీర్థం అభీష్ట సిద్ధికి తోడ్పడింది.

పాదుకాభిషేకం జరుగగానే విరోధుల ప్రతాపం అణగారింది. విశేషమేమి? అంటే, భూమి మీద వ్యాపించిన పగతుర ప్రతాపాలనే అగ్ని నెగళ్ళను పాదుకాభిషేక జలం క్షణంలో మళ్ళీ చెలరేగకుండా నశింపజేసింది.

ఉజ్జ్వల ప్రతాప శమనశక్తి అభిమంత్రించిన వసిష్ఠునిదా? మంత్రపూత జలానిదా? లేక అభిషిక్తయైన పాదుకాదేవిదా? అని సంశయింపరాదు. ప్రతాపశమన క్రియకు హేతువు వసిష్ఠుడభిమంత్రించి ఉపయోగించిన పాదుకాభిషేకజలమే (కర్తృపదం) కదా! శ్లేష సంకీర్ణరూపకంచే అనుప్రాణితమైన ఉత్ప్రేక్షాలంకారం. ఔపచ్ఛందసికం.

201. పాదపాదుపహృతా రఘూద్వహా
దాలవాలమివ పీఠ మాశ్రితా ।
అభ్యషేచి భవతీ తపోధనైః
పారిజాత లతికేవ పాదుకే । –21.

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకా! పాదపాత్, ఇవ = వృక్షంలాంటి, రఘూద్వహాత్ = శ్రీరాముని వద్దనుంచి, ఉపహృతా = తీసుకరాబడిన; ఆలవాలం, ఇవ = పాదులాంటి; పీఠం = సింహాసనాన్ని; ఆశ్రితా = అధిష్ఠించిన; భవతీ = నీవు; తపోధనైః = ఋషులచేత; పారిజాత లతికా, ఇవ = పారిజాతశాఖలాగా; అభ్యషేచి = అభిషేకింపబడినావు.

తా। ఓ పాదుకా! పారిజాత వృక్షంలాగా ఉన్న శ్రీరాముని (వద్ద) నుంచి తేబడినట్టి, పాదులాగా ఉన్న సింహాసన మధిష్ఠించిన నీవు ఋషులచేత పారిజాతపు కొమ్మలాగా అభిషేకింపబడినావు.

వ్యాఖ్య : పాదుక పారిజాతలతికవలె అభిషేకింపబడింది.

వసిష్ఠాది మహర్షులు శ్రీరామచంద్రస్వామి దగ్గరి నుంచి పాదుకలను తెచ్చారు. రాముడధిష్ఠించే పీఠం మీద పాదుకలనునిక్షేపించి పట్టాభిషేకం చేశారు.

తపోధనులకు తమ ఆశ్రమవాటికల్లో చెట్లను నాటి నీరుపోసి పోషించే ఆచారముంది. సర్వభూతహితైషులైన ఋషులు లోక కల్యాణంకోసం తపోవనంలో మందార, పారిజాతాది దేవతా వృక్షాలను పెంచుతారు. 'పాదప' శబ్దం సాభిప్రాయం.

రాముడు పారిజాత వృక్ష సదృశుడు. రఘూద్వహుడధిష్ఠించే సింహాసనం ఆలవాల సదృశమయింది. 'లతికే' అంటే చిన్న కొమ్మ, **'సమేశాఖాలతే'** - (అమరం)

పారిజాత వృక్షానికి రెండు రెమ్మలతో సర్వ ఫలప్రదంగా శోభించే చిన్నకొమ్మతో సమానమైనది పాదుక. పారిజాతం కోరికల నీడేరుస్తుంది. శ్రీరామచంద్రస్వామి తపోధనుల వాంఛలను నెరవేరుస్తాడు. పాదుచేసి కొమ్మను సముచితంగా నాటి నీరుపోస్తే క్రమంగా పాదపమై వికసిస్తుంది. అడవిలో శోభించే పారిజాత తరువు నుంచి తెచ్చిన పారిజాత లతికనే ఋషిగణం అయోధ్యలోని ఆలవాలంలో (సింహాసనంమీద) భద్రంగా ఉంచి అభిషేచనం చేయడం వల్ల ఆగర్భ శత్రువులైనా, పరస్పరం ప్రేమానురాగాలతో మెలగుతూ సమాజ కల్యాణానికి కారణభూతులవుతారు, అయ్యారు. ఉపమాలంకారం. రథోద్ధత.

202. అలఘుభి రభిషేక వ్యా పృతై రంబుభిస్తే
దిన కరకులదైన్యం పాదుకే! క్షాళయిష్యన్ ।
సఖలు కమలయోనే స్సూనురాధత్త మంత్రే
ష్వధిక నియమయోగాం శక్తి మాథర్వణేషు । –22.

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకాదేవీ! తే = నీ యొక్క; అభిషేక వ్యాప్నతైః = అభిషేకానికి ఉపయోగపడిన; అలఘుభిః = గౌరవమైన, అంబుభిః = జలాల చేత; దినకరకులదైన్యం = సూర్య వంశానికి కలిగిన దీన స్థితిని (పంకాన్ని), క్షాళయిష్యన్ = కడిగి పోగొట్టదలచిన వాడై ; సః = ఆ; కమలయోనేః = బ్రహ్మయొక్క; సూనుః = పుత్రుడైన వసిష్ఠ మహర్షి; ఆథర్వణేషు = అథర్వ సంజ్ఞక ఋషి సంబంధమైన వేద మంత్రాలయందలి; అధిక నియమ యోగాం = బహు నియమాల వల్ల కలిగే; శక్తిం = శక్తిని; ఆధత్త, ఖలు = సంపాదించి పెట్టాడు కదా!

తా॥ ఓ పాదుకాదేవీ! ప్రసిద్ధుడూ, కమలాసనుడూ అయిన వసిష్ఠ మహర్షి మంత్రాహిత గౌరవశక్తియుక్తమైన నీ అభిషేకానికి ఉపయోగింపబడిన జలాలచేత సూర్యవంశ దైన్యాన్ని క్షాళనం చేయదలచిన వాడై అథర్వణ వేద మంత్రాల యందలి అధిక నియమాలను పాటించడంవల్ల కలిగే శక్తిని సంపాదించాడు కదా.

వ్యాఖ్య :– పాదుకలనభిషేకించే యోగ్యత సిద్ధించడానికి వసిష్ఠుడు అథర్వవేద మంత్రశక్తిని సంపాదించాడు.

వసిష్ఠుడు కమల యోనిసూనుడు. అంటే, బ్రహ్మకుమారుడు. కమలాపతి తన నాభి కమలం నుంచి బ్రహ్మను సృష్టించి, వేదాలను నేర్పాడు.

"యోబ్రహ్మాణం విదధాతి పూర్వం
యోవై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై" శ్రుతి.

వసిష్ఠ మహర్షి తండ్రియైన బ్రహ్మ వద్దనే వేదాల నభ్యసించాడు. కమలం పంకజం కావచ్చు. కాని పంకజం కమలం మాత్రం కాకపోవచ్చు. కమలం పంకజమయినా, దినకరుని పాదస్పర్శచే సహస్రపత్రంగా వికసితమవుతుంది. కమల వికాసానికి కారకుడైన సూర్యుని వంశంలో దైన్యం సంభవిస్తే, కమలయోనిసూనుడు దైన్యాన్ని నివారించడానికి మనసార శ్రద్ధ వహించి, వర్ణస్వరాలతో కూడిన వేద మంత్రాలను చక్కగా అభ్యసించి, పునశ్చరణజేసి తగిన యోగ్యతను సంపాదించాడు.

బ్రహ్మపుత్రుడు, ఇతరులు సాధారణంగా అనుష్ఠించలేని బ్రహ్మచర్య దీక్షతో క్షారలవణ వర్జనాది కఠిన నియమాలనుపాటించి, అథర్వర్షి సంబంధ వేదమంత్రాలను అధ్యయనమూ, జపమూ చేయడం వల్ల అతనికి మంత్ర సిద్ధి కలిగింది. ఆర్జిత మంత్రశక్తిచేత అభిమంత్రింపబడిన జలాలతో పాదుకలను అభిషేకించడంవల్ల ఇనకుల కాలుష్యం క్షాళితమయింది.

దినకర మండల మధ్యవర్తియైన శ్రీమన్నారాయణుడే శ్రీరాముడై అవతరించగా, ఆయన పాదుకలను దినకర కుల గురువు అభిషేకించడం దినకర కుల హర్షహేతువయింది. ఇది ఉత్ప్రేక్ష.

అభిషేకానికి 'స్నపనం, సంప్రోక్షణ' అని రెండు ప్రక్రియలున్నాయి. అందులో, లోకోత్తరమునిచే స్నపన ప్రక్రియా పూర్వకంగా పాదుక ఆరాధింపబడిందని ధ్వని. మాలినీ వృత్తం.

203. దినకర కులజానాం దేవి! పృథ్వీపతీనాం
నిరుపధి మధికారం ప్రాప్నువత్యాం భవత్యామ్ ।
అజనిషత సమస్తాః పాదుకే! తావకీన
స్నపన సలిలయోగాన్నిమ్నగా స్తుంగభద్రాః ॥ –23.

అర్థం :– హే దేవి! పాదుకే = ఓ పాదుకాదేవీ! దినకరకులజానాం = సూర్యవంశమందు జన్మించిన; పృథ్వీపతీనాం = రాజులయొక్క; నిరుపధిం = స్వాభావికమైన; అధికారం = అధికారాన్ని; భవత్యాం = నీవు; ప్రాప్నువత్యాం = పొంద గలిగినప్పుడు; తావకీన స్నపన సలిల యోగాత్ = నీ పట్టాభిషేక జల సంబంధంవల్ల; సమస్తాః = అన్ని; నిమ్నగాః = నదులు; తుంగభద్రాః = తుంగభద్ర అనే పేరుగల నదులుగా; /వృద్ధిపొంది మంగళ ప్రదాలుగా; అజనిషత = అయ్యాయి.

తా। ఓ పాదుకాదేవీ! సూర్యవంశంలో జన్మించిన భూపతులకు సహజమైన ప్రభుత్వాన్ని నీవు పొందగలిగావు. నీ అభిషేకోదకయోగం వల్ల నదులన్నీ తుంగభద్రలే అయ్యాయి.

వ్యాఖ్య :– పాదుకా స్నపన సలిలయోగం వల్ల సర్వత్ర తీర్థసంపత్తు పెరిగింది.

సూర్యవంశ సంజాతులైన రాజులకు ప్రభుత్వాధికారాన్ని చేపట్టడం నిరుపాధికం. అంటే, ఒకరి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడినది కాదు. కేవలం నిజగుణ గణప్రకాశం వల్ల ప్రభుత్వం సంక్రమించడం సహజం. ఆ రాజులకు స్వాభావికమైన ప్రభుత్వాన్ని పాదుకాదేవి పొందగలిగింది. పాదుకాభిషేకం జరిగింది. అనేక నియమాల ననుష్ఠించడం వల్ల కలిగిన మంత్రబలం చేత అభిషిక్త సలిలం అధికశక్తి సంపన్నమయింది. తత్ఫలితంగా, నదులన్నీ తుంగభద్రలయ్యాయి.

తుంగభద్ర ఒక నిమ్నగ, అంటే నది. 'నీరు పల్ల మెరుగు, నిజము దైవమెరుగు' – అని సామెత. నూరుల జన్మనూ, ఏరుల జన్మనూ తెలిసికోవడం కష్టమని విజ్ఞుల మాట.

'తుంగ' మంటే ఎత్తు, **'భద్ర'** మంటే మంగళం. **'శివం భద్రం కల్యాణం మంగళం శుభమ్'** (అమరం)

వంతకు పారే ఏరు ఎత్తు – మిట్ట –కు పారడం పొసగని మాట. విరోధమిది. మంత్రశక్తియుక్తమైన అభిషిక్త పాదుకా సలిలం నేల నాలుగుచెరలకు ప్రసరించింది. పల్లానికి పారే వాగులన్నీ, అభిషిక్త సలిలం తమలో కలియగానే వాటినీటి పరిమాణంపెరిగి మహోత్తుంగలై, ప్రజల యోగక్షేమాలను వహించే పుణ్యనదులయ్యాయి. శ్లిష్టమైన అర్థం వల్ల విరోధం పరిహృతం.

పృథ్వీపాలనాధికార ప్రాప్తిచే పాదుక శోభించింది. పాదుకా స్నపన సలిల ప్రాప్తిచే నిమ్నగలు తుంగభద్రలై విశేషంగా భాసించాయి. విరోధాభాసాలంకారం. మాలినీ వృత్తం.

204. తవ విధివ దుపాత్తే సార్వభౌ మాభిషేకే
భరత సమయవిద్భిః పాదుకే! మంత్రి ముఖ్యైః ।
త్వదవధినిజకర్మస్థాయినీనాం ప్రజానాం
ప్రథమ యుగ విశేషాః ప్రాదురాసన్ విచిత్రాః ॥ –24.

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకా! భరత సమయవిద్భిః = భరతుని సిద్ధాంతం తెలిసిన; మంత్రి ముఖ్యైః = ప్రధాన మంత్రులచేత; తవ = నీ యొక్క; సార్వభౌమ + అభిషేకే = సార్వభౌమపదవిని అధిష్ఠించే అభిషేకం; విధివత్ = శాస్త్ర ప్రకారం; ఉపాత్తే = జరుగుతున్నప్పుడు; త్వత్ + అవధి, నిజ కర్మస్థాయినీనాం = నిన్నే చరమసీమగా ఉద్దేశించిన, తమ వర్ణాశ్రమ ధర్మాలయందు నిల్చియున్న; ప్రజానాం = జనులకు; విచిత్రాః = పలురకాలైన/ఆశ్చర్యకరమైన; ప్రథమయుగ విశేషాః = కృతయుగంలోని ధర్మాలు; ప్రాదురాసన్ = ఉదయించాయి (కలిగాయి).

తా॥ ఓ పాదుకాదేవీ! భరతుని ఆశయం తెలిసిన మంత్రివరులచే నీకు సార్వభౌమత్వద్యోతకమైన అభిషేకం యథావిధి జరుపబడగా, నిజకర్మల ననుష్ఠించి నీకు సమర్పించే ప్రజలకు విచిత్రాలైన, కృతయుగ సంబంధమైన విశేష ఫలాలు కలిగాయి.

వ్యాఖ్య :- పాదుకాదేవిని కొలిచిన ప్రజలకు ధర్మసమృద్ధి కలిగింది.

భరతుడు భగవత్పాదుకలకు పట్టంకడుతాడని మంత్రి ముఖ్యులకు గోచరించింది. 'మంత్రి' అంటే మంత్రం కలవాడని అర్థం. 'మంత్ర' శబ్దానికి మత్వర్థీయమైన 'ఇని' ప్రత్యయం వల్ల 'మంత్రి' రూపమేర్పడుతుంది. శరణాగతి మంత్రమెరిగినవారిలో అగ్రేసరులని 'మంత్రిముఖ్య'లన్న పదానికి అర్థం. భరతుని అభిప్రాయమెరిగిన 'మంత్రి పుంగవులు' రహస్యాన్ని సదస్యం చేశారు. శాస్త్రోచితంగా పాదుకా పట్టాభిషేకం జరిపారు. రాముడు తిరిగి వచ్చునంతవరకు పాదుకారాజ్యం వర్ధిల్లుగాక, అని ఆశాసించారు.

ప్రజలందరు పాదుకాదేవిపట్ల శేషిత్వభావంతో వర్తించారు. తమతమ వర్ణాశ్రమోచితమైన నిత్యనైమిత్తిక కర్మల ననుష్ఠించి స్వామిత్వా ధ్యవసాయంతో 'పాదుకార్పణమస్తు' అని త్రివిధరూపమైన – కర్తృత్వ, కర్మ, కర్మఫల – త్యాగం చేశారు. ప్రజలు శేషభూతులై మెలగుతూ, భగవత్కైంకర్యం భాగవత కైంకర్యపర్యంతం ఆచరిస్తూ, రాజ రాజకీయాభి వృద్ధి పరమైన కామ్యకర్మలనూ అనుష్ఠిస్తూ పాదుకారాజ్యం ప్రసిద్ధిపొందుగాక, అని మంగళాశాసనం చేశారు.

వకుళభూషణ సంప్రదాయ ప్రవర్తకులై 'పొలిగ పొలిగ'అని శ్రీవైష్ణవ సమృద్ధికై మంగళాశాసనంచేస్తూ, సారతమ కైంకర్యకోటిలో నివిష్టులయ్యారు. తత్ఫలితంగా, దేశం సత్య, శౌచ, దయాది కార్తయుగ ధర్మ సమృద్ధితో సంపన్నమయింది.

భగవదారాధన మాతృభాషతో చేస్తే చాలును, వేదమంత్రాలతో చేయడమెందుకు? అని వేదాధ్యయన విషయమై ఆయాభాషాభిమానులు ఆదరాన్ని తగ్గించుకోరాదు. ఆర్ష సంపదను గౌరవిస్తే ఋషి ఋణం తీరుతుంది. వైదిక మంతా దైవికం. భరతుడు రాముణ్ని మనసా విడువనట్లే, లోకంలో వైదికాన్ని ఎప్పుడూ విడువరాదు. భగవద్భాగవతసేవను వేదమంత్రాధ్యయనంతో చేస్తే, కలియుగంలోనూ కృతయుగానికి సంబంధించిన శ్లాఘ్యతమ ధర్మ ఫలాలు విశేషంగా లభిస్తాయి. నాయకులు ప్రజానురాగాన్ని పొందుతారు. పౌరులు పరస్పరం ప్రేమతో వ్యవహరిస్తారు. ఒకటేమిటి? చిత్ర విచిత్రమైన ఫలోదయంతో దేశం సుభిక్షంగా ఉంటుంది. పాదుకారాధనవల్ల నానా విధ ఫలోదయ మవుతంది.

ధర్మసమృద్ధి వర్ణనం ఉదాత్తాలంకార లక్షణం, మాలినీ వృత్తం.

205. అవసిత రిపుశబ్దా నన్వభూస్త్వం తదానీం
రఘుపతి పదరక్షే! లబ్ధరాజ్యాభిషేకా ।
చలిత భుజలతానాం చామరగ్రాహిణీనాం
మణివలయ వినాదైర్మేదురాన్ మంత్రఘోషాన్ । –25.

అర్థం :– హే రఘుపతి పదరక్షే = ఓ రామ పాదుకా! తదానీం = అప్పుడు; లబ్ధరాజ్యాభిషేకా = పొందబడిన రాజ్యాభిషేకం గల; త్వం = నీవు; చలిత భుజలతానాం = తీగెల వంటి కదలాడే బాహువులుగల; చామరగ్రాహిణీనాం = చామరాలను పట్టుకున్న (వీచే) పరిచారికల యొక్క; మణి వలయ వినాదైః = రత్నకంకణాల ధ్వనులచే; మే దురాన్ = సాంద్రమైన; అవసితరిపుశబ్దాన్ = అణగార్చిన పగతురపేరూ/ఆర్భాటమూగల; మంత్రఘోషాన్ = వేద మంత్రనాదాలను; అన్వభూః = అనుభవించావు.

తా। ఓ రామపాదుకా! అప్పుడు రాజ్యాభిషేకాన్ని పొందిన నీవు కదిలే తీగెల లాంటి చేతులు గల చామర గ్రాహిణులైన పరిచారికల మణిమయ కంకణాల ధ్వనులచే దట్టమైన, పగతుర ఆర్భాటాలను శమింపజేసిన వేద మంత్రాల నాదాలను అనుభవించావు.

వ్యాఖ్య:– పాదుకాభిషేకమప్పటి వేదమంత్ర ఘోష శత్రు శబ్దాన్ని శాంతింపజేసిందని ఉదాత్త వర్ణన.

రఘునాథుని పాదుకలకు పట్టాభిషేకం జరుగుతుండగనే రాజ్యమనఘమయి రాజిల్లింది. తీగబోణులు వీచే వింజామరాలవల్ల వారి కరమణి కంకణాల ఖణఖణాత్కారధ్వనులు వాయులీనమై వేదమంత్ర స్వర నాదాలనుసాంద్రంగా, శ్రావ్యంగా చేశాయి. ప్రాభవ వైభవాలతో హృదయా వర్జకంగా ఘోషించే వేద మంత్ర స్ఫుటనాదం శాత్రవార్భాటాలను అణచివేసింది. ద్వేషం నశించింది. శత్రు శబ్దమేలేదు.

'రిపు' రపలపవ్యక్తాయాంవాచి' అపకీర్తిని పలికే వాడు రిపువు.

మణిమయ కంకణ ధ్వనులూ, వేదమంత్రధ్వనులూ (ఈ రెండూ) మించి, మూడవదైన శత్రుప్రలాప ధ్వనులను ముంచివేసి, సర్వత్ర సంతోషాన్ని కలిగించాయి. ముఖ్యంగా, పాదుకారాజ్యం వేదనాద విలసితమని దేశికుల వాగ్విలాసం. ప్రేయోఽలంకారం. మాలినీ వృత్తం.

206. సముచిత మభిషేకం పాదుకే! ప్రాప్నువత్యాం
త్వయి వినిపతితానాం దేవి! తీర్థోదకానామ్ ।
ధ్వని రనుగత మంత్ర స్స్పదతాం కోసలానాం
శమయితు మలమాసీ త్సంకులా నార్తనాదాన్ । –26.

అర్థం :– హే దేవి! పాదుకే = ఓ పాదుకాదేవీ! సముచితం = యోగ్యమైన; అభిషేకం = అభిషేకాన్ని; ప్రాప్నువత్యాం = పొందగలిగిన, త్వయి = నీ యందు; వినిపతితానాం = ధారగా పడిన; తీర్థ + ఉదకానాం = పుణ్యనదీజలాల యొక్క; ధ్వనిః = ధ్వని; అనుగత మంత్రః = అనుసరింబడిన వేద మంత్రాలు కలదై ; సీదతాం = దుఃఖితులైన; కోసలానాం = కోసల దేశవాసుల యొక్క; సంకులాన్ = పరస్పర పరాహతమైన; ఆర్తనాదాన్ = ఆర్త ధ్వనులను; శమయితుం = పోగొట్టడానికి; అలం = చాలినదై ; ఆసీత్ = ఉండెను.

తా॥ ఓ పాదుకాదేవీ! శాస్త్రోచితంగా అభిషేకాన్ని పొందిన నీయందు ధారగాపడిన పుణ్య నదీజలాల ధ్వని, వేద మంత్రాలనాహరించినదై దుఃఖితులైన కోసల దేశీయుల సంకులదీన విలాపాలను శమింపజేయ సమర్థమయింది.

వ్యాఖ్య :– పాదుకాభిషేక తీర్థోదకాల ధ్వని కోసలుల ఆర్తనాదాలను శమింపజేసిందని ఉత్ప్రేక్షితం.

పవిత్ర గంగా నద్యాది తీర్థోదకాలు జనుల పాపతాపాలను పరిహరింపజేస్తాయి. ఆజలాలచేత పాదుకాదేవి అభిషేకింపబడింది. వేదమంత్రోచ్చారణవల్ల కలిగిన శబ్దశక్తిని ధారాపాతంగా అభిషేకించే తీర్థోదకాల గలగల ధ్వని తనలో కలుపుకొన్నది. తత్ఫలితంగా, అభిషేక తీర్థోదకాల ధ్వనికి ఎనలేని శక్తి కలిగింది కాబట్టి, దశరథుని కాలగతివల్లనూ, రాముని ఎడబాటువల్లనూ కలిగిన కోసల దేశవాసుల ఆర్తనాదాలను శాంతింప జేసింది.

'అథ సంకుల క్లిష్టే పరస్పర పరాహతే'. (అమరం)

అభిషేకజలాలగలగలనాదం, మంత్రాల మనోజ్ఞనాదం ఒండొంటితో కలిసి, కోసల వాసుల సంకులమైన ఆర్తనాదాన్ని అణచివేసి, ఆనందవర్ధనంగా ప్రసరించడం కవితా చమత్కారం. మాలినీ వృత్తం.

207. దివిషదనువిధేయం దేవి! రాజ్యాభిషేకం
భరత ఇవ యది త్వం పాదుకే! నాన్వమంస్థాః ।
కథమివ రఘువీరః కల్పయే దల్పయత్న
స్త్రి చతుర శరపాతై స్తాదృశం దేవకార్యమ్ । –27.

అర్థం :– హే దేవి! పాదుకే = ఓ పాదుకాదేవీ! దివిషత్ + అనువిధేయం = దేవతలచే అనుమోదించదగిన; రాజ్య + అభిషేకం = రాజ్య పట్టాభిషేకాన్ని; భరతః, ఇవ = భరతునివలె; త్వం = నీవు; న + అన్వమంస్థాః, యది = అంగీకరించకున్నచో; రఘువీరః = శ్రీరాముడు; అల్పయత్నః = కొద్దియత్నం కలవాడై ; త్రి చతుర శరపాతైః = మూడో, నాలుగో బాణాలు వేయడం చేత; తాదృశం = అలాంటి; (ప్రసిద్ధమైన) దేవకార్యం = దేవతల కార్యాన్ని; కథం, ఇవ = ఏ విధంగానైనా, కల్పయేత్ = చేసేవాడా?

తా॥ ఓ పాదుకాదేవీ! దేవతలచే ఆమోదనీయమైన రాజ్యాభిషేకాన్ని భరతునివలె నీవు అంగీకరించకుంటే రఘువీరుడు, కొద్దిపాటి యత్నంకలవాడై మూడో నాలుగో బాణపాతాలచేత రాక్షసవధ రూపమైన దేవతల కార్యాన్ని ఎలా నెరవేర్చేవాడు?

వ్యాఖ్య :– పాదుకాదేవి అంగీకారంవల్ల దేవతల కార్యం సులభంగా నిర్వహింపబడింది.

కోసల దేశవాసులేకాదు, నాకలోకవాసులు కూడా పాదుకా పట్టాభిషేకాన్ని ఆమోదించారు. దేవతల ప్రార్థన వల్ల రావణ వధ చేయడానికే శ్రీమహావిష్ణువు శ్రీరాముడుగా అవతరించాడు. శ్రీరాముడు వనవాసం చేయడం, భరతునికి పట్టం కట్టడం కైకేయి వరప్రభావం. శ్రీరాముడు అడవికేగాడు కాని భరతుడు పట్టంకట్టుకోనని పట్టు పట్టాడు. రాజ్య మరాజకమయింది.

ఈ సంకటస్థితిలో పాదుకాదేవికి పట్టంకట్టితే, ఇటు రాజ్యరక్షణ, అటు రావణవధ రెండు కార్యాలు నెరవేరడం సంభవమే, అని దేవతలు పాదుకా పట్టాభిషేకం చేయాలని ఇష్టపడ్డారు. పాదుకాభిషేకం కాగానే శ్రీరామునికి ఉత్సాహశక్తి పెరిగింది.

ఒకవేళ పాదుకాదేవి భరతునివలె పట్టాభిషేకానికి ఇష్టపడకపోతే, దేవకార్య నిర్వహణార్థం రాముడు చాలా ఆయాస పడేవాడు. దేవతల కోరిక ప్రకారం పాదుకాదేవి రాజ్యాభిషేకానికి అంగీకరించింది. రాజ్యరక్షణ చక్కగా సాగింది. శ్రీరామునికి రావణ సంహారం పిల్లలాటలాగా సులభమయింది.

'తాదృశం' – అలాంటిది. దేవతలు ప్రతీక్షించిన ఖరాది వధ కోసం ఒకటి, ఇంద్రజిత్ కుంభకర్ణాది వధ కోసం ఒకటి, రావణ వధ కోసం ఒకటి. ఇలా మూడు శరపాతాలు. వాలివధను లెక్కించడంవల్ల నాల్గవ శరపాతం. రావణుడు జగదేకవీరుడే. అయినా శ్రీరాముడు అనాయాసంగా రావణున్ని సంహరించడం లాంటి ప్రసిద్ధ దేవకార్యాన్ని నిర్విఘ్నంగా నిర్వహించడం, పాదుకాదేవి రాజ్యాభిషేకానికి సమ్మతించడం వల్లనే సాధ్యమయిందని కవిరాడ్వ్యాఖ్యాకం.

సంభావనాలంకారం. మాలినీ వృత్తం.

208. కతిచన పదపద్మ స్పర్శసౌఖ్యం త్యజంతీ
వ్రతమతుల మధా స్త్వం వత్సరాన్ సావధానా ।
రఘుపతి పదరక్షే ! రాక్షసై స్త్రాసితానాం
రణరణక విముక్తం యేన రాజ్యం సురాణామ్ ॥ –28.

అర్థం :– హే రఘుపతి పదరక్షే = ఓ రామపాదుకా! పదపద్మ స్పర్శ సౌఖ్యం = (శ్రీరాముని) పద్మసదృశపాదాల స్పర్శ వల్ల కలిగే సౌఖ్యాన్ని; కతిచన = కొన్ని; వత్సరాన్ = ఏండ్లు; త్యజంతీ = విడిచివేస్తూ; సావధానా = అప్రమత్తవై ; త్వం = నీవు; అతులం = సాటిలేని; వ్రతం = నోమును; అధాః = అనుష్ఠించావు,యేన = ఏ వ్రతం చేత; రాక్షసైః = రాక్షసుల

చేత; త్రాసితానాం = భయపెట్టబడిన; సురాణాం = దేవతలయొక్క; రాజ్యం = రాజ్యం; రణరణక విముక్తం = భయం నుంచి నివృత్తి చెందిందో.

తా॥ ఓ రఘునాథ పాదుకా! నీవు శ్రీరాముని పాదస్పర్శవల్ల కలిగే సుఖానుభూతిని కొన్ని ఏండ్లు త్యజిస్తూ సావధానవై అనుపమవ్రతాన్ని అనుష్ఠించావు. ఆవ్రతానుష్ఠానం వల్ల రాక్షసులచే భయపెట్టబడిన దేవతల రాజ్యం భయాందోళనచే విముక్తమయింది.

వ్యాఖ్య:- పాదుకాదేవి వ్రతమహిమవల్ల దేవతలకు శ్రేయస్సు కలిగింది.

తాననుభవించే సుఖభోగాలను త్రికరణశుద్ధిగా వదలుకోవడం త్యాగం. ఒకరి త్యాగనిరతివల్ల ఎందరికో స్థితిగతులు చక్కబడుతాయి. రామచంద్రస్వామి రాజ్యాన్ని త్యజించాడు. రామపాదుకలూ స్వీయసౌఖ్యాన్ని త్యజించాయి. రాముని పద – స్థాన – రక్షణ చేసే యోగ్యత పాదుకాదేవికి స్వాభావికం. అయినా, కొన్ని ఏండ్లు పాదుకాదేవి అప్రమత్తయై అసాధారణ నియమాన్ని పాటించింది. శైత్య సౌరభ సౌకుమార్యాలున్న పద్మాల్లాంటి శ్రీరామపాదాల స్పర్శవల్ల కలిగే ఆనందాన్ని త్యజించడమే పాదుకాదేవి పాటించిన అసామాన్య వ్రతం.

తాను కష్టాలను సహించియైనా నిలింపుల కార్యాన్ని నిర్వర్తించాలనుకున్నది. సీతాదేవి పదిమాసాలే సుఖాన్ని త్యజిస్తే, పాదుకాదేవి పద్నాలుగు వత్సరాల వరకు స్వసుఖాన్ని త్యజించింది. కాబట్టి, పాదుకావ్రతం అసదృశం.

'రణ రణక' శబ్దం దేవతల రాజ్యానికి దండెత్తి వచ్చిన నిశాచరుల నిరంతర బిభీషికలనూ, ఆర్భాటాలనూ గోచరింపచేస్తుంది. మాతృమూర్తి తన సంతానం భద్రంగా ఉండాలని ఉపవాసాది నియమాలతో నోములనూ, వ్రతాలనూ ఆచరిస్తుందికదా! అలాగే పాదుకాదేవి పద్నాలుగు వత్సరాలు నిజ సుఖత్యాగరూపమైన నిస్తులవ్రత దీక్షనుపాటించి, నరులే కాదు, సురలు కూడా అసురుల భయం లేకుండా సకల భోగభాగ్యాలను అనుభవించేలాగా చేసింది.

శ్రీ శఠకోప దివ్యసూరి విశ్వశ్రేయస్సుకోసం తిరువాయ్‌మొళిని (సహస్రగీతిని) అనుగ్రహించే వరకు శ్రియఃపతి పాదపద్మ స్పర్శజనిత సౌఖ్యత్యాగ నిరతులయ్యారన్న సంగతి వ్యంగ్య విలసితం.

స్వాభావిక విషయానికి వ్రతత్వాన్ని సంభావించడంవల్ల ఉత్ప్రేక్షాలంకారం. వ్రతానుష్ఠానం చేత రక్షణ విషయమై సావధాన రూపమైన ఆశయ మహత్వాన్ని ద్యోతకం చేయడం వల్ల ఉదాత్తాలంకార ధ్వని.

మాలినీ వృత్తం.

209. అధర్వోపజ్ఞంతే విధివ దభిషేకం విదధతాం
వసిష్ఠాదీ నామప్యు పచిత చమత్కార భరయా।
త్వదాస్థాన్యా రంగక్షితిరమణ పాదావని! తదా
లఘు యస్యోజాతా రఘు పరిషదాహెూ పురుషికాః ॥ –29.

అర్థం :– హే రంగక్షితిరమణ పాదావని = ఓ శ్రీరంగ పృథ్వీశ పాదుకా! తదా = అప్పుడు; తే = నీకు; అధర్వ + ఉపజ్ఞం = అధర్వర్షి మొదట దర్శించిన; విధివత్ = వైదిక విధానంగా; అభిషేకం = పట్టాభిషేకాన్ని; విదధతాం = చేసిన; వసిష్ఠ + ఆదీనాం, అపి = వసిష్ఠుడు మొదలైన వారికి కూడా; ఉపచిత చమత్కార భరయా = మిక్కిలి ఆశ్చర్యాన్ని కలిగించిన; త్వత్ + ఆస్థాన్యా = నీ పరిషత్తుచే; రఘు పరిషత్ + ఆహెూ పురుషికాః = రఘుకుల పరిషత్తుల దర్పదంభాలు; లఘీయస్యః, జాతాః = మిక్కిలి చులకన వయ్యాయి.

తా॥ ఓ రంగక్షితి రమణ పాదుకా! అభిషేక సమయాన అధర్వర్షి ప్రథమంగా దర్శించిన వేదం చెప్పిన రీతిగా నీకు అభిషేకం చేసిన వసిష్ఠాది ఋషులకు కూడా ఆశ్చర్యాతిశయాన్ని కలిగించిన నీ పరిషత్తుచే రఘువంశ పరిషత్తుల దర్పం, దంభం కడు చులకనవయ్యాయి.

వ్యాఖ్య :– పాదుకా స్థాన వైభవం పూర్వపు రఘువంశ రాజుల ఆస్థాన వైభవాలను అధిగమించింది.

అధర్వర్షి ప్రథమంగా దర్శించిన వేదానికి అధర్వవేదమని పేరు. ఋగ్యజు సామవేదాలకు 'త్రయి' అని పేరు. అధర్వ వేదంతో చతుర్వేదాలని ప్రసిద్ధి. అధర్వవేదోక్త రీతిగా రఘుకుల గురువైన వసిష్ఠుడు, ఇంక వామదేవ జాబాలి ఋష్యాదులు పాదుకాభిషేకం చేశారు. వేదమంత్ర శక్తివల్ల ఫలం – తీర్థసంపద, ప్రజానురాగం, ప్రత్యర్థిక్షయం, కోసల దేశ సర్వార్తిశమనం, ఇత్యాది యోగక్షేమం – సద్యోజాతమయింది. వసిష్ఠాది ఋషిగణం రఘువంశంలోని పూర్వరాజుల సభా ప్రాభవ వైభవాలను దర్శించినదే కాబట్టి వాటి కంటె పాదుకా సభా వైభవం ఇంత అతిశయించిందేమి? అని ఆశ్చర్య పడింది.

రఘు పరిషత్తు రాముని అభిషేకం నిలిచిపోవడం వల్ల 'లఘు పరిషత్తు' అయింది. (రలయో రభేదమిది).

పాదుకా తేజోమాత్ర మూలకమైన ఆస్థాన వైభవం కాబట్టి ఋషులకూ విస్మయనీయమయింది. రామ పరిషత్తు లఘు వయింది. పూర్వరాజపరిషత్తులు లఘుతరమయ్యాయి.

వసిష్ఠ పరాశర పారాశర్యాది వేదాంత పరిషత్తులకంటె వకుళ భూషణ మూలకమైన శ్రీనాథముని సంప్రదాయ పరిషత్తు అతిశయించిందని వ్యంగ్యం. **"ఆహెూ పురుషికా దర్పాత్ యాస్యాత్సంభావనాత్మని"** – (అమరం)

"మాతర్మైథిలి! రాక్షసీస్త్వయితదైవార్ద్రాపరాధాస్త్వయా

రక్షంత్యా పవనాత్మజాల్లఘుతరా రామస్య గోష్ఠీకృతా" । – (శ్రీగుణ రత్నకోశం)

శరణుపొందని, తనను పీడించిన రాక్షస స్త్రీలను కూడా రక్షించిన సీతాదేవి యొక్క ఆకస్మికక్షాంతి, శరణు పొందినవారిని రక్షించిన శ్రీరాముని గోష్ఠికంటె మించిందని శ్రీపరాశరభట్టరన్నారు.

పాదుకా పరిషద్వైఖరి తత్పూర్వరాజపరిషత్తుల అహంభావాన్ని లాఘవపరచిందని దేశికులన్నారు. ప్రతీపాలంకారం. శిఖరిణీవృత్తం.

210. అభిషేచయతు సరామః పదేన వాస్పృశతుపాదుకే! భవతీమ్ ।
అవిశేషితమహిమాత్వం క్వావిశేషః క్షమాసమేతానామ్ । –30.

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకాదేవీ! సః = ఆ; రామః = శ్రీరాముడు; భవతీం = నిన్ను; అభిషేచయతు = అభిషేకించుగాక; వా = లేదా; పదేన = చరణంచేత; స్పృశతు = స్పృశించు (ధరించు) గాక; త్వం = నీవు; అవిశేషిత, మహిమా = నిర్వికార మహిమకలదానవు, క్షమాసమేతానాం = ఓర్పు/భూమితో కూడియున్న వారికి; క్వ, వా, విశేషః = మార్పు ఎక్కడిది?

తా। ఓ పాదుకాదేవీ! ఆ రామభద్రుడు నిన్ను అభిషేకించినా లేదా తన పాదాలకు ధరించినా నీ మహిమ మారదు. క్షమాసమేతులకు వికారముండదు కదా!

వ్యాఖ్య :– క్షమాసమేతయైన పాదుకాదేవి నిర్వికారమహిమ కలది.

శ్రీరాముడు పాదుకాదేవిని సింహాసనమధిష్ఠింపజేసి తలకు కిరీటం తొడిగినా దేవికి మోదం లేదు. కాళ్ళతో త్రొక్కినా ఖేదం లేదు. సింహాసన మందున్నా శాసకురాలుగా భూమి (రాజ్యం)తో సంబంధముంది. రాముడు అడుగులకు తొడుక్కుంటే పుడమిమీద నడకకోసమే కదా! నిరంతరం క్షమాసమేతకాబట్టి పాదుకా మహిమకు ఉత్కర్షాపకర్షాలు లేవు. ఉండవు.

నేల విడిచి నింగిలో పయనించే గరుడ విహంగానికి, భోజ్యమైన 'సుముఖుడు' అనే భుజంగాన్ని కాపాడిన భగవంతునిపై అలిగినప్పుడు, అఖర్వగర్వం భంగమయింది కదా!

క్షమ (ఓర్పు/భూమితో సంబంధం) కలవారికి ఉన్న చెన్ను తరుగదు. పాదుకా మాహాత్మ్యం వికారరహితం.

"యస్సర్వత్రా నభిస్నేహః తత్తత్ప్రాప్యసుఖాసుఖమ్ ।

నాభినందతి నద్వేష్టి" - (భ.గీత)

సర్వత్ర స్నేహం అంటే రాగద్వేషాలు లేనివాడు సుఖదుఃఖాలను పొందినా మోదఖేదాల నొందడని శ్రీభగవాను వాచ.

"మునియార్ తుయరంగళ్ ముందిలుమ్
ఇన్బంగళ్ మొయ్త్తిడినుమ్ కనియార్ మనమ్" - (రా. నూత్తందాది)

యతిరాజులనాశ్రయించిన మహనీయులు కష్టాలు మీదబడినా, మనస్సులోనైనా నొచ్చుకోరు. సుఖాలు కలిసి వచ్చినా సంతోషాన్ని పెచ్చనీయరు, అని తిరువరంగత్తముదనార్ సూక్తి.

తర్వాతి పద్ధతిలో పాదుకాదేవికి కలిగే రామచరణ ప్రాప్తిని ఈ శ్లోకం సూచిస్తున్నది.

క్షమాసమేతులకు విశేషమేముంటుంది? అని, సామాన్య వాక్యంతో విశేషవాక్యాన్ని సమర్థించే అర్థాంతరన్యాసాలంకారం. ఆర్యాగీతి.

అభిషేక పద్ధతి సమాప్తం.

8. నిర్యాతనా పద్ధతి

211. అభిషేకో త్సవాత్తస్మాద్యస్యా నిర్యాతనోత్సవః ।
అత్యరిచ్యత తాంవందే భవ్యాంభరత దేవతామ్ । –1.

అర్థం :– యస్యాః = ఏ పాదుకాదేవి యొక్క; నిర్యాతన + ఉత్సవః = న్యాసప్రత్యర్పణోత్సవం; తస్మాత్ = ఆ, (ప్రసిద్ధమైన); అభిషేక + ఉత్సవాత్ = పట్టాభిషేకోత్సవంకంటె; అత్యరిచ్యత = అతిశయిందో; తాం = ఆ, భవ్యాం = మంగళకరమైన; భరతదేవతాం = భరతుని ఉపాస్యదేవతయైన పాదుకాదేవికి; వందే = నమస్కరిస్తున్నాను.

తా। పాదుకాన్యాసప్రత్యర్పణోత్సవం ప్రసిద్ధమైన పట్టాభిషేకోత్సవం కంటె అతిశయించింది. భవ్యయైన భరతుని ఆరాధ్యదేవతకు వందనం.

వ్యాఖ్య :– పాదుకాభిషేకం కంటె పాదుకాన్యాస ప్రత్యర్పణోత్సవం సర్వజనానందావహమయింది.

"పాదుకేచాస్యరాజ్యాయ న్యాసందత్వా పునఃపునః" – అన్నట్లు శ్రీరాముడు తన పాదుకలను భరతుని వద్ద రాజ్యం కోసం న్యాసంగా నిక్షేపించాడు. భరతుడు పాదుకలకు పట్టంకట్టి నిత్యం భక్తితో అర్చన చేశాడు. పద్నాలుగేండ్లకు శ్రీరాముడయోధ్యకు తిరిగి వచ్చాడు. న్యాసంగా ఉంచబడిన పాదుకలను భరతుడు రామునికి అర్పించాడు.

"సాధు నిర్యాత్యతాం సీతారామాయేతి పునః పునః"। ఇత్యాది ప్రయోగాన్నిబట్టి 'నిర్యాతన' మంటె ప్రత్యర్పణం. అర్పించదగిన దాన్ని అర్పించకుంటె యమయాతనతో సమానమైన బాధకలుగుతుంది. నిర్యాతన మందు ఆ బాధ ఉండదు.

"నిర్యాతనం వైరశుద్ధౌ దానే న్యాసార్పణేఽపిచ" – (అమరం)

ఒకరిచ్చిన ద్రవ్యాన్ని కాపాడి తిరిగి ఎవరిది వారికి అర్పించడమే నిర్యాతనం. న్యాస ప్రత్యర్పణోత్సవం రాజ్యాభిషేకోత్సవం కన్న చాలా ఆనందరకమయింది. రాజ్య శాసనాన్ని వదలి పునఃరాముని పాదాలతో సంగమించడమే పాదుకాదేవికి పరమానందమయింది. రామ భరత లక్ష్మణులు జడదారులై వల్కలాలను కట్టి భోగమనుభవించకపోవడం ప్రజలకు చాల బాధ కలిగింది. ప్రత్యర్పణం వల్ల అన్నదమ్ములు వన్యవేషాలను వదలడం అందరికి నిశ్చింత అయింది. కాబట్టి ఈ ఉత్సవం అభిషేకోత్సవాన్ని అతిశయించింది.

భరతునికి ఆరాధ్య దేవతయై, సర్వలోక యోగక్షేమకరయైన పాదుకాదేవికి అభివందన మాచరిస్తూ, దేశికులు నిర్యాతనా పద్ధతిని ఆరంభిస్తున్నారు.

ప్రేయోఽలంకారం. అనుష్టుబ్ఛందం.

212. ఉపాస్య వర్షాణి చతుర్దశ త్వా
ముత్తారికా ముత్తరకోసలస్థాః ।
సనందనాద్యై రపి దుర్విగాహం
సాంతానికం లోక మవాపు రగ్ర్యమ్ । –2.

అర్థం :– ఓ పాదుకా! ఉత్తర కోసల స్థాః = ఉత్తర కోసల దేశమందున్న (స్థావరజంగమాలు) వారు; ఉత్తారికాం = తరింప జేసే (పురుషార్థసిద్ధికి ఉపాయ భూతమైన) త్వాం = నిన్ను; చతుర్దశ = పద్నాలుగు; వర్షాణి = సంవత్సరాలు; ఉపాస్య = ఉపాసించి; సనందన + ఆద్యైః, అపి = బ్రహ్మర్షియైన సనందనుడు మొదలగువారిచేతనూ; దుర్విగాహం = ప్రవేశింప రాని; సాంతానికం = 'సాంతానిక' మనే; అగ్ర్యం = శ్రేష్ఠమైన; లోకం = లోకాన్ని; అవాపుః = పొందినారు.

తా॥ ఉత్తర కోసల దేశమందున్నవారు తరింపజేసే యోగ్యతగల నిన్ను పదునాలుగేండ్లు ఆరాధించి, సనందనాది బ్రహ్మర్షులచేతనూ ప్రవేశింపరాని 'సాంతానిక' మనే ఉత్తమలోకాన్ని పొందినారు.

వ్యాఖ్య :– సాకేత వాసులకు సాంతానిక లోకప్రాప్తి పాదుకోపాసన ఫలమే.

అధికార పరిగ్రహ పద్ధతిలోని రెండవ శ్లోకాభిప్రాయాన్ని ఈ శ్లోకం విశదీకరిస్తున్నది. భగవంతుని ఉపాసించడ మంటే భగవత్పాదసేవనమే. పాదసేవ అంటే భగవంతుడు ధరించిన పాదుకలను ఉపాసించడమని తాత్పర్యం. పాదుకా దేవి ఉత్తారిక. భక్తి ప్రపత్తులతో తనను అర్చించిన వారికి ధర్మార్థకామాలనే త్రివర్గ ఫలాలను ఇహలోకంలో అనుభవింప జేయడమేకాక, అంత్యదశలో అపవర్గమనే మోక్షఫలాన్నీ ప్రసాదించి పునర్జన్మ లేకుండా చేస్తుంది. సంసారం నుంచి విముక్తుడైన జీవుడు శాశ్వతమైన ఆనందాన్ని పొందే లోకం 'సాంతానికం'.

భరతునికి మాత్రమేకాదు, కోసల దేశవాసులందరికీ పాదుక ఉపాస్య దేవతయే. తననే కాక దేశస్థులందరినీ రక్షించడానికే భరతుడు శరణాగతి చేశాడు. పద్నాలుగేండ్లు పాదుకాదేవిని ఆరాధించారు ప్రజలు. శ్రీరాముని పట్టాభిషేక మయిన తర్వాత కూడా కోసలులు శ్రీరామ పాదుకనే ముఖ్య దేవతగా కొలిచారు.

సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతులనే వారు బ్రహ్మపుత్రులు. మహాయోగులు. బ్రహ్మర్షులు. వీరు పదకొండువేల సంవత్సరాలు రామోపాసనచేసినా సాంతానికలోకాన్ని పొందలేకపోయారు. భగవత్పాదోపాసన, అంతకంటే భగవత్పాదావన్యుపాసనకు ఉత్తరోత్కర్ష ఉండడంవల్ల **"యమేవైష వృణుతే తేనలభ్యః"** – అనే శ్రుతిరీత్యా, రామానుగ్రహాన్ని కోసలులు పొందగలిగారు. శ్రీరామచంద్రస్వామి తన నిర్యాణకాలంలో కోసల దేశవాసులను –స్థిరచరాలను– అనుగ్రహించి, తనతోపాటు పునరావృత్తిరహితమైన పరమపదానికి తీసుకపోయాడు; అని రామాయణం (ఉత్తరకాండ) వెల్లడిస్తుంది.

పాదుకోపాసనవల్ల సాకేతవాసులకు సాంతానికలోకప్రాప్తి, అని దేశికులు ఉదాత్తంగా వర్ణించారు. ఉపజాతి వృత్తం.

213. పాదావని! ప్రత్యయితో హనూమాన్
సీతామివ త్వాం చిరవిప్రయుక్తామ్ ।
ప్రణమ్య పౌలస్త్యరిపో రుదంతం
విజ్ఞాపయామాస వినీతవేషః ॥ -3.

అర్థం :- హే పాదావని = ఓ పాదుకాదేవీ! ప్రత్యయితః = నమ్మదగిన వాడైన; హనూమాన్ = హనుమంతుడు; చిరవిప్రయుక్తాం = చాలకాలం ఎడబాసియున్న; త్వాం = నీకు; సీతాం, ఇవ = సీతకువలె; ప్రణమ్య = నమస్కరించి; వినీతవేషః = వినయరూపుడై ; పౌలస్త్యరిపోః = రావణ వైరియైన శ్రీరామునియొక్క; ఉదంతం = వృత్తాంతాన్ని; విజ్ఞాపయామాస = విన్నపంచేసెను.

తా॥ ఓ పాదుకాదేవీ! ఆప్తుడైన హనుమంతుడు శ్రీరామునిచే చిరకాలం ఎడబాసిన నీకు సీతాదేవికివలె ప్రణమిల్లి రావణవధ రూపమైన శ్రీరాముని వృత్తాంతాన్ని విన్నవించాడు.

వ్యాఖ్య :- హనుమంతుని ఆప్త వాక్యం సీతాదేవికివలె పాదుకాదేవికి హర్షాన్ని కలిగించింది.

శ్రీరాముడు రావణవధానంతరం అయోధ్యకు పుష్పకవిమానంపై తిరిగివస్తూ దారిలో, భరద్వాజాశ్రమంలో ఆగాడు. భరతుని వద్దకు వెళ్ళి తన వృత్తాంతమంతా తెల్పుమనిచెప్పి, ముందుగా హనుమంతుణ్ని అయోధ్యకు పంపాడు రాముడు. భరతునికి రావణవధ రూపవార్తనూ, రాముడు క్షేమంగా అయోధ్యకు తిరిగి వస్తున్నాడన్న ఉదంతాన్నీ విన్నవించాడు.

భరతుడు సర్వదా పాదుకా సన్నిధిలోనే ఉండడంవల్ల సందేశహారియైన హనుమంతుడు, పూర్వం సీతమ్మకు రాముని విజయవార్తను వినయవిధేయతలతో విన్నవించినట్లే, పాదుకాదేవికి కూడా విన్నవించాడు.

"ఆప్త ప్రత్యయితౌ సమౌ" - (అమరం) హనుమంతుడాప్తుడు.

"పాదుకే తే పురస్కృత్య శాసంతం వైవసుంధరామ్" । అన్నట్లు పూజ్య పాదుకలను ముందుంచుకొని రాజ్యమేలుతున్న భరతుణ్ణి చూచాడు హనుమంతుడు. మహాభక్తుడైన భరతుడు పూజించే పాదుకాదేవి యొక్క రాజ్యాన్ని హనుమంతుడు అవశ్యంగా చూడాలనే ఆశయంతోనే శ్రీరాముడతణ్ణి పంపాడు.

'చిర విప్రయుక్తామ్' - సీతాదేవి శ్రీరాముణ్ని ఎడబాసి రావణుని చెరలోనున్న కాలం పది నెలలు మాత్రమే. పాదుకాదేవి పద్నాలుగేండ్లు రాముణ్ని ఎడబాసింది. కాబట్టి, సీతాదేవికంటె పాదుకాదేవికి మిక్కిలి చక్కని అశ్వాస - ఓదార్పు - అవసరమని సూచితం.

"ఏతి జీవంత మానందో నరం వర్షశతాదపి" - అన్నట్లు హనుమంతుని (ఆప్త) వాక్యం విన్న తర్వాత, నూరేండ్ల కైనా 'బ్రతికియుండిన శుభములు బడయవచ్చు'నని సీతగానీ, భరతుడుగానీ ఆశ్చర్యపడినట్లు పాదుకాదేవి కూడా ఎంతో సంతోషపడింది. పాదుకా ప్రభావం వల్ల రాముడు నిర్వర్తించిన సర్వ విషయాలను - పద్నాలుగేండ్లకు పద్నాలుగు శ్లోకాల్లో - హనుమంతుడు విజ్ఞాపన చేసినట్లు దేశికుల రచన సాగింది. ఉపమాలంకారం. ఉపజాతివృత్తం.

214. తవాభిషేకాన్మణి పాదరక్షే !
మూలే నిషేకాదివ వృద్ధియోగ్యాత్ ।
జహుస్తదేవ త్రిదశాంగనా నాం
ప్రమ్లానతాం పత్రలతాంకురాణి ॥ -4.

అర్థం :- హే మణి పాదరక్షే = ఓ రత్నపాదుకా! త్రిదశ + అంగనానాం = దేవతా స్త్రీలయొక్క; పత్రలతాంకురాణి = అంకురాల వలె ఉన్న ఆకులు తీగలు; వృద్ధి యోగ్యాత్ = ఐశ్వర్యానికి/పెరుగడానికి యోగ్యమైన; మూలే = పాదులో; నిషేకాత్, ఇవ = నీరు పోసినట్లున్న; తవ = నీ యొక్క; అభిషేకాత్ = పట్టాభిషేకంవల్ల; తదా, ఏవ = ఆక్షణాననే; ప్రమ్లానతాం = తిరోహితత్వాన్ని/వాడిపోవడాన్ని; జహుః = వదలినాయి.

తా॥ ఓ మణిపాదుకా! దేవతా స్త్రీలు తమ దేహం మీద అందంగా అలంకరించుకున్న పత్రలతాంకురాలు వృద్ధికి తగిన, పాదులో నీరు పోసినట్లున్న నీ అభిషేకం వల్ల సద్యస్కాలాననే ప్రమ్లానతను పరిత్యజించాయి.

వ్యాఖ్య :-పాదుకాభిషేక ఫలితంగా త్రిదశాంగనల భయాందోళనలు తొలగిపోయాయి.

చెట్ల మొక్కల మొదళ్ళలో - పాదుల్లో - నీరుపోస్తే మొక్కలు, ఆకులు, తీగెలు వాడిపోకుండా వృద్ధి చెందుతాయి. త్రిదశాంగనలు ముప్పదేండ్ల వయస్సుతో అవయవసౌష్ఠవం కలిగి ఉంటారు.

పత్రలతాంకురాణి :- కళాకౌశలం కలవారిచే దేవాంగనల భుజాలు, ఉరోజాలు, కంఠం, కపోలాలు మొదలైన అవయవాల మీద మొక్కలవలె ఉండే ఆకులు, తీగలు రేఖా మాత్రంగాచిత్రింపబడి అందం చిందుతుంటాయి. ఇవి ఐశ్వర్యవృద్ధికి సంకేతం.

"భుజశిఖర స్తనమండల కపోల కంఠేషు విరచితా కుశలైః ।
అను లేపనేన రేఖా నిగద్యతే పత్ర వల్లీతి" । (హలాయుధ నిఘం.)

రావణాసురుని భయంవల్ల దేవాంగనలు దేహాలంకరణ చేసుకోలేదు. ఏనాడో చిత్రించిన మకరికాది పత్రవల్లులు రంగులు చెదరివాడిపోయాయి.

పాదుకాభిషేకం జరిగిన మరుక్షణాన సురలోక సుగాత్రులకు సౌమనస్యమేర్పడింది. జలసేచనంవల్ల మొక్కలు వాడుతనం - మ్లానత - మటు మాయమై ఆకులు, తీగలు నిగనిగలాడినట్లే, దేవాంగనల అవయవాల మీద వన్నె చిన్నెలతో చిత్రించబడిన పత్రలతాంకురాలు పాదుకాభిషేకం వల్ల సొగసుగా ఉన్నాయి, అని హనుమంతుడు విన్నవిస్తూ, పాదుకా దేవిని స్తుతిస్తున్నాడు.

దేశికుల ప్రాకృతిక చిత్రోపమాకల్పనలోనూ త్రిదశత్వం అనల్పం, అజరామరం. 'పత్రలతాంకుర' పదం సమాస శాస్త్రాన్ని బట్టి వాచకలుప్తోపమ. ఉపమాలంకారం, ఉపజాతివృత్తం.

215. సర్వత స్త్వదభిషేక వాసరే

సమ్యగుద్ధృత సమస్త కంటకే।

రాఘవస్య విపినేషు పాదుకే !

యత్రకామగమతా వ్యవస్థితా ॥ -5.

అర్థం :- హే పాదుకే = ఓ పాదుకా! త్వత్ + అభిషేక వాసరే = నీ పట్టాభిషేక దినం; సర్వతః = అంతట (రాజ్యం లోనూ, అడవుల్లోనూ) సమ్యక్ + ఉద్ధృతసమస్త కంటకే = బాగా అణచివేయబడిన సమస్త కంటకాలు (శత్రువులు, ముండ్లు) కలదికాగా; రామస్య = శ్రీరామునికి; విపినేషు = అరణ్యాల్లో; యత్ర, కామ, గమతా = ఇష్టమున్నచోటికి పోవడం; వ్యవస్థితా = ఏర్పడింది.

తా॥ ఓ పాదుకా! నీ అభిషేక దినం దేశంలోనూ, అడవుల్లోనూ సమస్త కంటకాలు తలెత్తకుండా చేయబడు తుంటే, శ్రీరామునికి అడవుల్లో స్వేచ్ఛాసంచారం బాధ లేకుండా సాగింది.

వ్యాఖ్య :- పాదుకాభిషేకం వల్ల శ్రీరాముడు నిష్కంటకంగా పయనించాడు.

పాదుకాభిషేకమయినప్పుడే సమస్తకంటకాలు సమసిపోయాయి. పాదుక(ల)కు ముండ్లను అణచివేయడం స్వాభావికం. రాజ్యంలో విరోధులు తలెత్తుకొని నిలువలేదు. కాబట్టి శ్రీరాముడు నిశ్చింతగా అరణ్యాల్లో పోదలచుకున్న చోటికి ఏ బాధ లేకుండా సాగిపోయాడు.

(యత్ర, కామః, గమః యస్య సః = యత్రకామగమః, యత్రకామగమస్య భావః = యత్రకామగమతా, అవ్యయఘటిత త్రిపదబహువ్రీహి సమాసపదమిది.)

'కంటక' శబ్దానికి ముల్లు, క్షుద్ర శత్రువు, గగుర్పాటు, అని నానార్థాలున్నాయి.

"సూచ్యగ్రే క్షుద్రశత్రౌచరోమహర్షేచకంటకః" - (అమరం)

భగవంతునికి కామగమనం ఒక లీల. **'లోకవత్తులీలాకైవల్యమ్'** అని బ్రహ్మసూత్రం.

"అప్రమేయోఽనియోజ్యశ్చ యత్రకామగతో వశీ ।
మోదతే భగవాన్ భూతైర్బాలః క్రీడనకైరివ" ।

'అప్రమేయుడైన భగవంతుడు ఎవరి ప్రేరణ లేకుండా సర్వత్ర స్వేచ్ఛగా సంచరిస్తూ, బాలుడు ఆటబొమ్మలతో ఆనందించేలాగా, సర్వప్రాణులతో ఆనందిస్తుంటాడు' అని వేదాంత శాస్త్రం.

శ్రీరాముని కామగమన వ్యవస్థ పాదుకా ప్రభావమని పావని స్తుతి.

భగవంతుని స్వేచ్ఛా గమనం, కంటక శబ్దశ్లేషచే అధ్యవసితమైన కంటకోద్ధరణ హేతువుగా ఉత్ప్రేక్షితం. రథోద్ధతా వృత్తం.

216. కిం చతుర్దశభి రేవ వత్సరై
ర్నిత్యమేవ మణిపాదుకే! యువామ్ ।
పాదయో స్త్రిభువనాధిరాజయో
ర్యౌవ రాజ్యమధిగచ్ఛతం స్వయమ్ । **–6.**

అర్థం :– హే మణిపాదుకే = ఓ రత్న పాదుకలారా! చతుర్దశభిః = పద్నాలుగు; వత్సరైః, ఏవ, కిం = ఏండ్లచే మాత్రమేమి? పాదయోః =(శ్రీరామప్రభు) పాదాలు; త్రిభువన + అధిరాజయోః = మూడులోకాలకు సార్వభౌమత్వం వహిస్తుండగా; నిత్యం, ఏవ = ఎల్లప్పుడు కూడా, యువాం = మీరు, యౌవరాజ్యం = యువరాజ పదవిని; స్వయం = స్వయంగా; అధిగచ్ఛతం = పొందుతుంటారుగాక.

తా। ఓ మణిమయ పాదుకలారా! పద్నాలుగేండ్లు మాత్రమే ఏమిటి? శ్రీరాముని పాదాలు మూడు లోకాలకు సార్వభౌమత్వం వహిస్తుంటే మీరునిత్యమూ యువరాజ భావాన్ని స్వయంగా పొందెదరుగాక.

వ్యాఖ్యః– శ్రీరాముని పాదపీఠం మీద పాదుకాదేవి యువరాజ ధర్మాన్ని నిర్వహించే వర్ణన.

శ్రీరాముడు రావణవధ తర్వాత అయోధ్యకు తిరిగి వస్తున్నాడనే సంతోషవార్తను హనుమంతుడు విన్నవించే సందర్భాన పాదుకారాజ్య శాసనకాలం అంతమవుతున్నదనడం అమంగళం అనే అభిప్రాయంతో, పాదుకా పరిపాలన పద్నాలుగేండ్లు మాత్రమే కాదు, అని ఉత్కంఠభరితమైన భావదీప్తిని కలిగించాడు.

శ్రీరాముని పట్టాభిషేకానంతరం ఆయన పాదాలు స్వర్గమర్త్యపాతాళ లోకాలను రక్షించే సామర్థ్యంతో సార్వభౌమత్వాన్ని వహిస్తుంటాయి. పాదాలను ఎల్లకాలం విడువకుండా రక్షించే పాదుకలు పాదపీఠమందు యువరాజ ధర్మాన్ని నిర్వర్తిస్తాయి.

'పాదుకాయౌవరాజ్య' మంటే పాదాలు ఎక్కడెక్కడ సంచరిస్తుంటే అక్కడక్కడ వాటికి సహాయంగా ఉండి రాజ్య కార్యకలాపాలను నిర్వహిస్తుంటాయి, అని తాత్పర్యం.

'యువాం' - యుష్మచ్ఛబ్ద ప్రథమాద్వివచనాంతం. కర్తృపదం.

'అధిగచ్ఛతం' - అధిపూర్వక, 'గమ్' ధాతువు, విధిలోట్, మధ్యమ పురుష ద్వివచనం.

ఆక్షేపాలంకారం. రథోద్ధతా వృత్తం.

217. రామస్య రాక్షస వధ త్వరితస్య కాలే
పాదావని! ప్రకటయన్నివ పార్ష్ణి గుప్తిమ్ ।
ఆచిత్రకూట మధిగమ్య శశంస వార్తా
మవ్యాహత త్వదభిషేక మృదంగనాదః ॥ -7.

అర్థం :- హే పాదావని = ఓ పాదుకా! అవ్యాహత, త్వత్, అభిషేక, మృదంగనాదః = అడ్డులేని నీ అభిషేకమందలి మద్దెల మ్రోత; రాక్షస వధత్వరితస్య = రక్కసుల వధ కోసం వేగిరపడుతున్న, రామస్య = శ్రీరామునికి; కాలే = (దండకారణ్యం లోకి ప్రవేశింపదగిన) సమయమందు; పార్ష్ణిగుప్తిం = వెనుక దేశరక్షణను, ప్రకటయన్, ఇవ = తెల్పుతున్నదో అన్నట్లు; ఆ చిత్రకూటం = చిత్రకూటం వరకు; అధిగమ్య = వ్యాపించి; వార్తాం = వృత్తాంతాన్ని; శశంస = తెలిపెను.

తా॥ ఓ పాదుకాదేవీ! అప్రతిబంధకమైన నీ అభిషేకమప్పటి మృదంగవాద్యాల ధ్వని దండకారణ్య గమన కాలాన అసురుల ఉసురుదీయ తొందరపడుతున్న శ్రీరామునికి, వెనుకదేశ రక్షణను వెల్లడిస్తున్నట్లే చిత్రకూటం దాకా వ్యాపించి, వార్తను తెలిపింది.

వ్యాఖ్య:- పాదుకాభిషేకోత్సవ మంగళవాద్య ధ్వని శ్రీరామునికి ఉత్సాహాన్ని కల్పించే వర్ణన.

శ్రీరాముడు కైకేయి తృప్తిపడడానికి, దశరథుడు సత్యసంధుడు కావడానికి అడవికేగినాడు. శరణాగతుడైన భరతునికి పాదుకా ప్రదానం చేసి, దేశరక్షణ, ప్రజాపాలన విషయమై అపారచింతకలవాడైనా, ధీరోదాత్తుడు కాబట్టి శ్రీరాముడు దండకారణ్యంలో ప్రవేశిస్తూ దేవకార్యమైన రాక్షస వధకోసం త్వరపడుతున్నాడు. ఆ సందర్భంలోనే, పాదుకా పట్టాభిషేకోత్సవార్థం మ్రోగిన మృదంగవాద్యాల ధ్వని విశేషంగా చిత్రకూటాద్రి వరకు వ్యాపించింది. అది రామునికి ఒక మంగళకరమైన వార్త, అయిందన్నాడు మారుతి.

"నిరాటంకంగా ఇక్కడ పాదుకలకు రాజ్యాభిషేకం జరిగింది. దేశ రక్షణకై చింతించ అవసరం లేదు. పాదుకాదేవి అప్రమత్తగా దేశాన్ని, ప్రజలనూ రక్షిస్తుందని నమ్మండి. రాక్షస సంహారం కోసం ముందడుగువేయండి. వెనక నుంచి దాడి

జరుగుతుందేమో అని సందేహించరాదు. పృష్ఠ దేశరక్షణలో సైన్యం సర్వసన్నద్ధమయింది. కాబట్టి, దేవకార్యాన్ని నిశ్శంకంగా నిర్వహించడానికి వేగిరపడండి" అని ప్రోత్సాహకరమైన వార్తను మృదంగనాదం ప్రకటిస్తున్నట్లు అభివ్యాప్తమయింది. స్వరూపోత్ప్రేక్ష. వసంత తిలక.

218. భద్రాణి దేవి! జగతాం ప్రతిపాదయిష్యన్
ప్రాగేవ యేన భవతీం భరతోఽభ్యషించత్ ।
మన్యే కపీశ్వర విభీషణయో ర్యథావత్
సంతన్యతేస్మ తత ఏవ కిలాభిషేకః ॥ –8.

అర్థం :– హేదేవి = ఓ పాదుకాదేవీ! జగతాం = లోకాలకు; భద్రాణి = శుభాలను; ప్రతిపాదయిష్యన్ = కలిగింపగోరుతూ; భరతః = భరతుడు; యేన = ఏకారణంచేత; భవతీం = నిన్ను; ప్రాక్; ఏవ = (రామునికంటె) ముందే; అభ్యషించత్ = అభిషేకించాడో; తతః, ఏవ, కిల = అందువల్లనేకదా! కపీశ్వర, విభీషణయోః = సుగ్రీవునికి, విభీషణునికి; అభిషేకం = పట్టాభిషేకం; యథావత్ = తగినట్లు; సంతన్యతే, స్మ = వృద్ధిచెందింది. మన్యే = అనుకుంటాను.

తా॥ ఓ పాదుకాదేవీ! లోకాలకు యోగక్షేమాలను ఆపాదింపగోరుతూ భరతుడు ఏకారణంచేత ముందే, నీకు పట్టాభిషేకం చేశాడో, ఆ కారణం వల్లనే కదా! సుగ్రీవ విభీషణుల అభిషేకం సముచితంగా జరిగింది, అనుకుంటాను.

వ్యాఖ్య :– పాదుకాభిషేక ఫలితం సుగ్రీవ విభీషణుల అభిషేకంగా విస్తరించిందని ఉత్ప్రేక్షితం.

జగద్ధితాన్ని అభిలషిస్తూ భరతుడు పాదుకలకు పట్టం కట్టాడు. తత్ఫలితంగా, సుగ్రీవ విభీషణుల పట్టాభిషేకోత్సవం జరిగింది. భరతుడు రాముని తమ్ముడు; సుగ్రీవుడు వాలి తమ్ముడు. విభీషణుడు రావణుని తమ్ముడు. భరతుడు – మొదటి తమ్ముడు – పాదుకలకు పట్టంకట్టితే, లక్ష్మణుడు – మరో తమ్ముడు – సుగ్రీవ విభీషణులకు పట్టం కట్టాడు. పాదుకాభిషేకమే కీశాసురేశుల పట్టాభిషేకాలకు నాంది. నరలోకంలో పాదుకలకు, వానరలోకంలో సుగ్రీవునికి, రాక్షసలోకంలో విభీషణునికి అభిషేకాల పరంపర ఉత్తరోత్తరంగా వృద్ధిపొందింది. వసంత తిలకా వృత్తం.

219. సంభిద్యమాన తమసా సరయూపనీతై
స్సంవర్ధిత స్తవ శుభై రభిషేక తోయైః ।
మన్యేబభూవ జలధి ర్మణిపాదరక్షే ।
రామాస్త్ర పావక శిఖాభిరశోషణీయః । –9.

అర్థం :— హే మణిపాదరక్షే = ఓ రత్న పాదుకా! సంభిద్య – నీతైః। సంభిద్యమాన = ఒండొంటితో కలిసిన, తమసా సరయూ = తమసా సరయూ నదులచేత; **ఉపనీతైః** = తీసుకరాబడిన; తవ = నీయొక్క; **శుభైః** = మంగళకరమైన; అభిషేకతోయైః = అభిషేక జలాలచేత, సంవర్ధితః = వృద్ధిజెందిన; జలధిః = సముద్రం; రామాస్త్ర – **శిఖాభిః**। రామ = రామునియొక్క; అస్త్రపావక = ఆగ్నేయాస్త్రం యొక్క; **శిఖాభిః** = జ్వాలలచేత; **అశోషణీయః** = శుష్కింప రానిదిగా; బభూవ = ఆయెను, అని, మన్యే = భావిస్తున్నాను.

తా। ఓ. మణిపాదుకా! అన్యోన్యంగా కలిసిన తమసా సరయూ నదులు తీసుకవచ్చిన నీ శుభాభిషేక జలాలతో వృద్ధిపొందిన సముద్రం, శ్రీరాముని ఆగ్నేయాస్త్ర జ్వాలలచే శుష్కింపరానిదయిందంటాను.

వ్యాఖ్య :— పాదుకాభిషేక తీర్థం కలియడంవల్ల రాముని ఆగ్నేయాస్త్ర జ్వాలలు సముద్రానికి హాని చేయలేదని ఉత్ప్రేక్షితం.

విభీషణుడు శరణాగతిచేసి చేరిన తర్వాత, శ్రీరాముడు సముద్రుని ముందు ప్రాయోపవేశం చేశాడు. కాని సముద్రుడు ప్రసన్నుడు కాలేదు. వెంటనే శ్రీరాముడు ఉగ్రుడై,

"చాపమానయసౌమిత్రే! శరానాశీవిషోపమాన్" (రామాయణం)

'లక్ష్మణా! ధనస్సునూ, త్రాచుపాముల్లాంటి బాణాలనూ తెమ్మ' అని ఆజ్ఞాపించాడు. సముద్రాన్ని శుష్కింపజేస్తే, **'పద్భ్యాం యాంతు ప్లవంగమాః'** వానరులు నడిచిపోవచ్చు అని తలచాడు. కాని, అంతలోనే సముద్రుడు విధేయుడై వచ్చి చెప్పిన రీతిగా వారధి కట్టబడింది. అందరులంకకు చేరినారన్న కథాసందర్భమిది.

"పారావార పయోవిశోషణ కలాపారీణ కాలానల
జ్వాలాజాల విహారహారి విశిఖ వ్యాపారఘోరక్రమః" ప్రళయకాలాగ్ని జ్వాలల నెగజిమ్మే బాణప్రయోగంతో గంభీరాంభోధిని శోషింపజేయ బూనినవాడు రామభద్రుడు అని 'దశావతారస్తోత్రం' చేశారు దేశికులు.

సగర పుత్రుల ప్రయత్నం చేత సాగరమేర్పడింది. పరస్పరంగా కలిసిన తమసా సరయూనదుల మార్గంగా పవిత్రమైన పాదుకాభిషేక తీర్థం సముద్రంలోకి చేరడంవల్ల సముద్రజలం బాగా పెరిగింది. కాబట్టి, సముద్రజలం రాముని ఆగ్నేయాస్త్రానికి గురియైనా, ఇంకిపోలేదు.

'జాహ్నవ్యాస్త్వ విదూరతః' – తమసా నది గంగకు దగ్గర ఉన్నదనీ, **'సరయ్వాః సంగమే శుభే'** – సరయూనదికి గంగా సంగమం కలదనీ 'రామాయణం వల్ల తెలుస్తుంది. 'సంభిద్యమాన' – అనడంవల్ల తమసా సరయూ నదుల సంగమమో, ఈ రెండింటికి సముద్ర సంగమమో, లేదా ఈ రెండు గంగతో సంగమించి కడలిలో చేరడమో పరిశీలనార్హమే. పాదుకాభిషేక తీర్థ మహిమ రామాస్త్రం చేత సముద్రాన్ని ఎండగట్ట నీయలేదని హనుమంతుని విన్నపం. వసంత తిలక.

220. పాదావని! త్వ దభిషేచన మంగళార్థం
భేరీశతం భృశమతాడ్యత యత్ప్రతీతైః ।
ఆకర్ణ్య తస్య సహసా తుములంనినాదం
లంకా కవాటనయనాని నిమీలితాని । –10.

అర్థం :– హే పాదావని = ఓ పాదుకా! ప్రతీతైః = (వాద్యవాదన పటుత్వంచే) ప్రసిద్ధులైన వారిచే; త్వత్ + అభిషేచన, మంగళార్థం = నీ అభిషేకమనే శుభకార్యం కోసం; యత్ = ఏ; భేరీశతం = వంద భేరీల వాద్యం; భృశం = మిక్కిలి; అతాడ్యత = మ్రోగింప (కొట్ట) బడిందో; తస్య = ఆ భేరీశతం యొక్క; తుములం = దట్టమైన; నినాదం = ధ్వనిని; ఆకర్ణ్య = విని; సహసా = శీఘ్రంగా; లంకా కవాట నయనాని = లంకాపురీ ద్వారాలనే కండ్లు; నిమీలితాని = మూసుకో బడినాయి.

తా॥ ఓ పాదుకా! వాద్యవాదన కళానిపుణులచే నీ అభిషేకానికి మంగళార్థంగా ఏ వంద భేరీల వాద్యం బాగా మ్రోగింపబడిందో, ఆ నిబిడమైన భేరీ వాద్య ధ్వనిని విన్నవెంటనే లంకా నగరీ కవాటాలనే కన్నులు మూసుకోబడినాయి.

వ్యాఖ్య :– పాదుకాభిషేకమప్పటి మంగళ భేరీ ఘోషణ మసహ్యమైనందున, లంకాపురి భయపడి ద్వారాలను మూసుకున్నట్లు వర్ణితం.

లంకానగరి ఒక నారీమణిగా మానవీకరింపబడింది. లంకా కవాటాలు నయనాలుగా రూపింపబడినాయి. కర్ణ కఠోరమైన ధ్వనిని విని భయపడిన వ్యక్తికి, సహజంగా కలిగే ప్రతిచర్య (Reaction) కన్నులు మూతబడడం. అలాగే, పాదుకాభిషేకోత్సవమందు మంగళార్థంగా మ్రోగిన అనేక భేరీ వాద్యాల ధ్వని దుర్భరమైనందువల్ల, లంకాపురి అనే స్త్రీ తన మీద దాడి జరుగుతుందని భయకంపితయై, తన ముఖ్యద్వారాలనే కన్నులను మూసుకున్నది.

పాదుకాభిషేకం వలని లాభాలను కొన్నింటిని వివరిస్తూ, పాదుకాభిషేకమందలి భేరీశత వాద్య ధ్వని, లంకాపురికి అమంగళసూచకంగా ధ్వనించిందన్నాడు మారుతి.

సమాసోక్తి, రూపకాలంకారాలతో సంకీర్ణమైన ఉత్ప్రేక్ష. వసంత తిలకా వృత్తం.

221. తాపోద్గమ స్త్వదభిషేక జలప్రవాహై
రుత్సారితస్త్వరిత ముత్తరకోసలేభ్యః ।
లేభే చిరాయ రఘు పుంగవ పాదరక్షే !
లంకా వరోధ సుదృశాం హృదయేషు వాసమ్ । –11.

అర్థం :– హే రఘు పుంగవ పాదరక్షే = ఓ శ్రీరామ పాదుకా! త్వత్ + అభిషేక జలప్రవాహైః = నీ అభిషేకోదక ప్రవాహాల చేత; ఉత్తర కోసలేభ్యః = ఉత్తర కోసల దేశీయుల నుంచి; త్వరితం = త్వరగా; ఉత్సారితః = లేచిపోయిన; తాప +

ఉద్గమః = తాపవృద్ధి; లంకా + అవరోధ సుదృశాం = లంకా నగరంలోని అంతఃపుర స్త్రీల యొక్క; హృదయేషు = గుండెల్లో; చిరాయ = చాలాకాలం; వాసం = వసతిని; లేభే = పొందెను.

తా|| ఓ రామపాదుకా! నీ యభిషేకజల ప్రవాహాలచేత; ఉత్తర కోసలుల నుంచి త్వరగా నిరస్తమైన అధిక తాపం లంకానగరిలోని అంతఃపురకాంతల హృదయాల్లో చిరకాలం వసించింది.

వ్యాఖ్య :— పాదుకాభిషేకోదకాలు త్రోసివేసిన కోసలుల మనస్తాపం లంకా నగరిలోని అంతఃపురకాంతల గుండెల్లో కాపురం పెట్టింది.

పాదుకాభిషేకోత్సవ భేరీనాదం వల్ల లంకానగరవాసుల కళ్ళు భయంతో మూతబడ్డాయి, అని గత శ్లోకం వివరించింది. ఈ శ్లోకం, కళ్ళు మూసుకపోయిన క్రాల్గంటుల గుండెలు మండుతున్నాయని ఉత్ప్రేక్షిస్తున్నది.

మంటలనార్పే సామర్థ్యమున్న పదార్థాల్లో జలం ముఖ్యమయింది. పదార్థానికి నాశనం లేదుకదా! రామ వనవాసం వల్ల ఉత్తర కోసలులకు **ఉదయించిన** హృదయతాపాన్ని పాదుకాభిషేక జలప్రవాహాలు తరిమివేశాయి. ఉత్తర కోసల భూముల్లోంచి అతివేగంగా నెట్టబడిన తాపం, లంకానగరంలో రావణాంతఃపురకాంతల హృదయాల్లో తలదాచు కొని చాలాకాలం నిలిచి ఉంది.

పాదుకాభిషేక ప్రభావం వల్ల లంకానగర స్త్రీలకు మనస్తాపం పెరిగి, చిరకాలం వారు బాధపడినారని హనుమంతుడు తెల్పినాడు.

స్వరూపోత్ప్రేక్ష. వసంత తిలకా వృత్తం.

222. ఆవర్జితం విధి విదా మణి పాదరక్షే !
పద్మాసన ప్రియసుతేన పురోహితేన ।
ఆసీన్నిదాన మభిషేక జలం త్వదీయం
నక్తంచర ప్రణయినీ నయనోదకానామ్ ॥ –12.

అర్థం :— హే మణిపాదరక్షే = ఓ రత్నపాదుకా! విధివిదా = అభిషేక విధాయక శాస్త్రజ్ఞుడైన; పురోహితేన = పురోహితుడైన; పద్మాసనప్రియసుతేన = నలువకు ముద్దు పట్టియైన వసిష్ఠ మహర్షిచేత; ఆవర్జితం = ధారవోయబడిన; త్వదీయం = నీదైన; అభిషేక జలం = అభిషేకోదకం; నక్తంచర ప్రణయినీ నయన + ఉదకానాం = నిశాచరులైన రావణాదుల ప్రియురాండ్ర కన్నీళ్ళకు; నిదానం = మూలకారణంగా; ఆసీత్ = ఉండెను.

తా :— ఓ మణిపాదుకా! అభిషేక ప్రక్రియ బాగా తెలిసిన పురోహితుడూ, నలువకు ముద్దు బిడ్డడూ అయిన వసిష్ఠమహర్షి ధారవోసిన నీ అభిషేక సలిలం, రావణాది రాత్రించరుల ప్రియురాండ్ర కన్నీళ్ళకు కారణమయింది.

వ్యాఖ్య :— పాదుకాభిషేక జలం రాక్షసాంగనల కన్నీళ్ళకు కారణం.

వేద శాస్త్రాల్లో చెప్పబడిన అభిషేచన క్రమపద్ధతులన్నీ చక్కగా తెలిసినవాడు వసిష్ఠుడు. పరమేష్ఠికి ప్రియ పుత్రుడు. దేవకార్య నిర్వాహకులైన సూర్యవంశపు రాజులకు పురోహితుడు. కాబట్టి బ్రహ్మర్షి వసిష్ఠుడు 'ధర్మం వర్ధిల్లాలి, అధర్మం నశించాలి' అనే సంకల్పంతో అభిమంత్రించిన జలాలచే పాదుకాభిషేకం చేశాడు. ఆ అభిషేక జలమే లంకలో నున్న రాక్షసస్త్రీలు కన్నీరుమున్నీరుగా ఏడ్వడానికి కారణమయింది. **"నిదానం త్వాదికారణమ్"** - (అమరం).

"నూనం రాక్షస కన్యానాం రుదంతీనాంగృహే గృహే ।
శ్రోష్యామి నచిరాదేవ దుఃఖార్తానామిహ ధ్వనిమ్ "।

దయామయియైన సీతాదేవి కూడా తన చుట్టూ కాపలా ఉన్న రాక్షసాంగనలు పీడించిన బాధకోర్వజాలక "కొద్ది కాలంలోనే లంకలో ఇంటింటా రాక్షస వనితలు దుఃఖార్తులై బాధపడుతు బావురుమని ఏడ్చే ధ్వనిని వినగల"నని బలవంతంగా పలికింది.

సీతాదేవి హఠాత్తుగా పలికిన ఈ మాటలను హనుమంతుడు అశోకవనంలో విన్నాడు కదా!

ఇక్కడ పాదుకాదేవిని సంబోధించి, ఆమెను వసిష్ఠుడభిషేకించిన జలమే నక్తంచర స్త్రీల అశ్రుధారలకు దారి తీసిందనీ, వీరులందరు దివంగతులైనందున వారి పత్నులు దుఃఖించారని, లంకా నగరం పాడైన తర్వాత హనుమంతుడా వార్తను తెలిపాడు.

ఉత్ప్రేక్షాలంకారం, వసంత తిలకా వృత్తం.

223. దేవి! త్వయా స్నపన సంపది సంశ్రితాయాం
దగ్ధే పురే దశముఖస్య వలీముఖేన ।
ఆసీ త్తతః ప్రభృతి విశ్వజన ప్రతీత
మద్భ్యోఽగ్ని రిత్యవి తథం వచనం మునీనామ్ ॥ –13.

అర్థం :– హే దేవి = ఓ పాదుకాదేవీ! త్వయా = నీచేత; స్నపన సంపది = అభిషేక సంపద; సంశ్రితాయాం = పొందబడగా; దశముఖస్య = రావణుని యొక్క; పురే = పట్టణం; వలీముఖేన = కోతిచేత; దగ్ధే = కాల్చబడగా; తతః ప్రభృతి = అప్పటి నుంచి; 'అద్భ్యః, అగ్నిః' ఇతి = నీటినుంచి నిప్పు (జనించును) అని; మునీనాం = ఋషుల యొక్క; అవితథం = అమోఘమైన (సత్యమైన); వచనం = మాట; విశ్వజనప్రతీతం = సర్వజన ప్రసిద్ధమై; ఆసీత్ = ఉండెను.

తా॥ ఓ పాదుకాదేవీ! నీ అభిషేక వైభవం తర్వాత దశముఖుని రాజధాని కోతిచే దగ్ధమయినప్పటి నుంచి 'నీటి నుంచి నిప్పు పుట్టును' అన్న మునుల సత్యవాక్కు విశ్వజన ప్రసిద్ధమయింది.

వ్యాఖ్య :– పాదుకా స్నపన సంపద లంకా దహనానికి కారణమని ఉత్ప్రేక్షితం.

సాధారణంగా నీటి వాకచే నీరు వృద్ధి అవుతుంది. కాని ఈ శ్లోకం నీటి నుంచి నిప్పు పుట్టుతుందని కీర్తిస్తుంది. నీటికే కారణం కాక పాదుకాభిషేక జలం అగ్నికి కూడా కారణం.

"అగ్నేరాపః" - (తై. ఉపనిషత్) 'అగ్ని నీటికి జనకస్థానం' అని సృష్టి పరిణామక్రమాన్ని వివరించింది. **"తదపోఽసృజత, తస్మాద్యత్రక్వచనశోచతి, స్వేదతేవా పురుషః, తేజస ఏవతద్ధ్యాపో జాయంతే"** (ఛాం. ఉప.) (6 అ. 2 ఖం. 3)

దేహతాపంచేత వ్యక్తికి చెమట పుట్టునన్న లక్ష్యాన్ని ఛాందోగ్యోపనిషత్తు ప్రదర్శించింది. అయితే, శ్రుతి కంటె ఇక్కడ స్మృతియే ప్రమాణం.

వ్యాస మహాభారతంలో (సంభవపర్వం) దుర్యోధనుడు ద్రోణుని గూర్చి చెప్పిన మాట ఇలా ఉంది.

"అద్భ్యోఽగ్నిర్బ్రహ్మణః క్షత్ర మశ్మనో లోహముత్థితం ।
తేషాం సర్వగతం తేజః స్వాసు యోనిషు శామ్యతి" ।

'నీటినుంచి అగ్ని, బ్రహ్మతేజస్సు నుంచి క్షత్రియ ప్రతాపం, శిలనుంచి లోహం ఉత్పన్నమై, అంతటా వ్యాపించిన వాటి ప్రతాపం వాటి జనకస్థానంలోనే శమిస్తుంది'.

నీరు అగ్నినాశకమేకాదు, అగ్నికి ఉత్పత్తిస్థాన మనీ స్మృతి తెల్పుతున్నది. మరొక్కచోట **"సలిలా దుత్థితో వహ్నిర్యేన దగ్ధం చరాచరమ్ ।"**

నీటి నుంచి పుట్టిన నిప్పు స్థావరజంగమాత్మకమైన ప్రపంచాన్ని దహించింది, అన్న వాక్యమూ ప్రామాణికం.

'అద్భ్యోఽగ్నిస్తే జసస్తో' - అనే శ్లోకం (తత్త్వముక్తాకలాపం)లో, ఇది వ్యష్టిసృష్టి విషయమని ఆచార్యుల వారు చెప్పారు.

మేఘం నుంచి మెరుపు పుట్టడమూ, నీటి నుంచి విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయడమూ లోకంలో నేడు చూస్తున్నాం కదా!

కాబట్టి, పాదుకాభిషేక సలిలజన్యమైన అగ్ని లంకను దహించిన ప్రక్రియ వల్ల 'అగ్ని జలం నుంచి జనించు' నన్న వ్యాసాది మునులు చెప్పిన మాట సత్యమే, అని నాటి నుంచి సకల జనులు నమ్మినారు. మునుల వచనం విశ్వ జనీనం కావడానికి పాదుకాభిషేక సలిలం నుంచి జనించిన తేజస్సు లంకను దహించడమే తార్కాణం.

లంకను దగ్ధం చేసింది తానే, అయినా 'వలీ ముఖునిచే దశముఖపురం దగ్ధమయింది' అని హనుమంతుడు పాదుకాదేవికి విన్నవించడం వినీతుని లక్షణం. పాదుకాభిషేకం, లంకాదహనం, ఈ రెండు ప్రక్రియలను కారణ కార్య రూపంగా ఉత్ప్రేక్షించి, మునుల మాట అమోఘమని వర్ణించడంవల్ల నిరుక్త్యలంకారం. వసంత తిలకా వృత్తం.

224. ఆయోధ్యకై స్త్వదభిషేక సమిద్ధ హర్షై
రా ధ్మాపితాః శ్రుతిసుఖం ననుతే తదానీమ్ ।
రామస్య రాక్షస శిరో లవనేఽప్యశామ్య
న్యే షాం ధ్వని ర్విజయశంఖరవో బభూవ ॥ –14.

అర్థం :– నను = ఓ పాదుకాదేవీ! తదానీం = అభిషేకమప్పుడు; తే = అవి (శంఖాలు) త్వత్ + అభిషేక, సమిద్ధ హర్షైః = నీ అభిషేకం చేత; అతిశయించిన ఆనందంగల; ఆయోధ్యకైః = అయోధ్యానగర జనులచే, శ్రుతి సుఖం = వీనుల విందుగా; ఆధ్మాపితాః = ఊదబడినాయి. యేషాం = ఏ శంఖాలయొక్క; ధ్వనిః = నాదం; రాక్షస శిరస్ + లవనే, అపి = రాక్షసుల (రావణుని) తలలను కోసే విషయంలోనూ, అశామ్యన్ = శాంతించక; రామస్య = శ్రీరాముని యొక్క; విజయశంఖరవః = విజయకాలమందలి శంఖధ్వనిగా; బభూవ = అయిందో.

తా। ఓయి పాదుకా! నీ అభిషేకంతో ఆనందమతిశయించిన అయోధ్యాపౌరులు శంఖాలను శ్రవణ సుభగంగా పూరించారు. ఆ శంఖాల ధ్వని రాక్షసుల తలలను తెగకోసే సమయంలోనూ శమించక, శ్రీరాముని విజయాన్ని సూచించే శంఖారావమయింది.

వ్యాఖ్య :– పాదుకాభిషేకం నాటి శంఖారవం శ్రీరాముని విజయం దాకా కొనసాగింది.

అయోధ్యావాసులు పాదుకాభిషేకోత్సవంలో హర్షాతిరేకంతో పూరించిన శంఖధ్వని పద్నాలుగేండ్ల దాకా కొనసాగింది. శ్రీరాముని బాణాలు రాక్షసుల తలలనూ, రావణాసురుని పదితలలనూ తెగవేసినప్పుడు కూడా ఆ శంఖధ్వని శమించక, లంకలో ఇంకా వినిపిస్తూనే ఉంది. శంఖాలు కూడా జలజాలే కదా! చివరకు ఆ శంఖారవం శ్రీరామభద్రుని విజయాన్ని ప్రకటించింది. ఉత్ప్రేక్షాలంకారం. వసంతతిలకా వృత్తం.

225. ప్రథయితు మభిషేకం పాదుకే! తావకీనం
దురిత శమన దక్షే దుందుభౌ తాడ్యమానే ।
సపది పరిగృహీతం సాధ్వసం దేవి! నూనం
దశ వదన వధూనాం దక్షిణైర్నేత్ర కోశైః ॥ –15.

అర్థం :– హేదేవి, పాదుకే = ఓ పాదుకాదేవీ! తావకీనం = నీదైన; అభిషేకం = పట్టాభిషేకాన్ని; ప్రథయితుం = ప్రఖ్యాతి చేయడానికి; దురిత శమన దక్షే = అరిష్టాలను తొలగింప సమర్థమైన; దుందుభౌ = నగార; (భేరి); తాడ్యమానే = కొట్ట (మోగింప) బడగా; సపది = వెంటనే; దశ వదన వధూనాం = రావణుని పత్నుల యొక్క; దక్షిణైః = కుడివైన; నేత్రకోశైః = కంటి రెప్పల చేత; సాధ్వసం = భయం; పరిగృహీతం = పట్టుకొనబడింది. నూనం = నిశ్చయం.

తా॥ ఓ పాదుకాదేవీ! నీ అభిషేకోత్సవాన్ని ప్రకటించడానికి అరిష్టాలను తొలగింప సమర్థమైన దుందుభిని ప్రయోగించగా, రావణుని పడతులకు కుడికన్నులదరడంవల్ల నిశ్చయంగా వెంటనే అతిభయం పట్టుకుంది.

వ్యాఖ్య :– హనుమంతుడు శంఖరవం తర్వాత దుందుభిఘోషను వర్ణించాడు.

పాదుకాభిషేకోత్సవాన్ని ప్రకటించడానికి దండోరా వేయడం ఆచారం. దగ్గర, దూరంగా ఉన్నవాళ్ళకు విషయం తెలిసిపోతుంది. దుందుభిఘోష లంక దాకా వ్యాపించింది. విరోధులకు వణుకుపుట్టింది. రావణుని ముద్దియలు దద్దరిల్లిపోయారు. వారి కుడికన్నులు స్పందించాయి. దుర్భరమైన దురవస్థ దాపురిస్తుందని వారు భయపడ్డారు.

స్త్రీలకు కుడికన్ను, పురుషులకు ఎడమకన్ను అదిరితే, అది అశుభ సూచకం.

రామసుగ్రీవులకు సఖ్యమేర్పడినప్పుడు సీతమ్మకు, వాలికి, రావణునికి ఎడమకన్ను అదిరిందని కిష్కింధకాండలో వాల్మీకి వచించాడు.

"సీతా కపీంద్ర క్షణదాచరాణాం, రాజీవహేమజ్వలనోపమాని ।
సుగ్రీవ రామప్రణయప్రసంగే, వామాని నేత్రాణి సమం స్ఫురంతి ॥ (5 స. 32)

'కోశ' శబ్దానికి 'కత్తి ఒర' అని అర్థం. (కత్తిని కప్పిదాని పదును భద్రపరచే వస్తువు)

'నేత్రకోశం' :– కన్నును కప్పే రెప్ప అని లక్షణార్థం.

దుందుభి వాద్యఘోష చెవిని పడగానే, రావణవధూ జనానికి భయంతో కుడికన్ను దాని రెప్పతో కటకట పడింది. అక్షిస్పందనమయిందని స్పష్టం.

హేతూత్ప్రేక్ష. మాలినీ వృత్తం.

226. రఘుపతి పదరక్షే! రత్నపీఠే యదా త్వా
మఖిల భువన మాన్యా మభ్యషించ ద్వసిష్ఠః ।
దశముఖ మహిషీభిర్దేవి! బాష్పాయితాభి
స్స్తనయుగ మభిషేక్తుం తత్క్షణాదన్వమంస్థాః ॥ –16.

అర్థం :– హేదేవి! రఘుపతి పదరక్షే = ఓ రాఘవ పాదుకాదేవీ! వసిష్ఠః = వసిష్ఠమహర్షి; యదా = ఎప్పుడు; అఖిల భువన మాన్యాం = సమస్త లోకాలచే పూజింపదగిన; త్వాం = నిన్ను; రత్నపీఠే = రత్న సింహాసనమందు; అభ్యషించత్ = అభిషేకించినాడో; తత్క్షణాత్ = వెనువెంటనే; బాష్పాయితాభిః = కన్నీళ్ళుకార్చే; దశముఖ మహిషీభిః = రావణుని పత్నులచేత; స్తనయుగం =(వారి) చనుదోయి; అభిషేక్తుం = అభిషేకింపబడడానికి; అన్వమంస్థాః = అనుమతించావు.

తా॥ ఓ రామపాదుకాదేవీ! వసిష్ఠ మహర్షి ఎప్పుడు సకలలోకాలచే పూజించదగిన నిన్ను రత్నపీఠమందు అభిషేకించాడో, ఆ క్షణాననే కన్నీళ్ళుకార్చే రావణుని పత్నులు తమ చనుదోయిని అభిషేకించడానికి అనుమతించావు.

వ్యాఖ్య :– అభిషిక్త పాదుకాదేవి వేరొక అభిషేకానికి అనుమతించింది.

స్త్రీలకు కుడికన్ను అదరడం దౌర్భాగ్యసూచకం. అది రావణుని ప్రాణాంతకంగా పర్యవసించింది. పత్నుల అంగాంగ సౌందర్య దిదృక్షతో ఏకముఖంగా శోభించే దశముఖాలు మొండెంనుంచి వేర్వేరై దశదిశల చెదరిపడి మట్టికరుస్తుంటే, ఇక సౌభాగ్యాన్ని అనుభవించే దశలేని రావణుని భార్యలు దుఃఖార్తలై చనుగట్ల మీది నుంచి దొర్లిపడే లాగా కన్నీళ్ళు కారుస్తున్నారు. **"యుగ్మంతు యుగళం యుగం"** (అమరం).

పాదుకా పట్టాభిషేకం అఖిల భువనమాన్యంగా వసిష్ఠులచే జరుపబడింది. అది సుగ్రీవ, విభీషణుల పట్టాభిషేకానికి కారణమయిందని ఇతః పూర్వమే వర్ణితం. అందరి ముద్దుముచ్చట్లు తీర్చే శాసకురాలు కాబట్టి, పాదుకాదేవి అభ్యుదయం సర్వతోముఖంగా జరుగాలని ఆలోచించి, వేరొక అభిషేకానికి అనుమతించింది. ఆంతరింగిక సమావేశంలో, ముఖ్య విషయమైనందున, దశముఖుని పొలతుకలు తమ అశ్రుధారలచే తమస్తన యుగళాన్ని అభిషేకించే శాసనాన్ని ప్రకటించింది. హేతూత్ప్రేక్ష. మాలినీ వృత్తం.

227. రామాస్త్రాణి నిమిత్తమాత్రమిహతే లబ్ధాభిషేకా స్వయం
రక్షస్తత్ క్షపయాంచకార భవతీ భద్రాసనస్థాయినీ।
యద్దోష్ణ మతివేల దర్పదవథుజ్వాలోష్మలానాం తదా
నిష్పిష్టైః కలధౌతశైల శిఖరైః కర్పూరచూర్ణాయితమ్ ॥ –17.

అర్థం :– ఓ పాదుకా! ఇహ = రావణున్ని చంపే కార్యమందు, తే = నీకు; రామ + అస్త్రాణి = శ్రీరాముని అస్త్రాలు; నిమిత్తమాత్రం = సాధారణ కారణమే; లబ్ధ + అభిషేకా = పొందబడిన అభిషేకంగల; భవతీ = నీవు; భద్ర + ఆసన, స్థాయినీ = సింహాసనమందున్నదానవై ;అతివేల – లానాం / అతివేల = హద్దుమీరిన; దర్ప = గర్వంవల్ల కల్గిన, దవథు, జ్వాలా = అగ్నిజ్వాలచేత; ఊష్మలానాం = వేడి ఎక్కిన; యత్ + దోష్ణాం = ఏ రాక్షసుని భుజాలకు; తదా = కైలాసాన్ని ఢీకొన్నప్పుడు; నిష్పిష్టైః = పిండిగాజేయబడిన; కలధౌతశైల శిఖరైః = కైలాస పర్వత శిఖరాలచే; కర్పూర చూర్ణాయితం = కర్పూరపు పొడిగా చేయబడినవో; తత్ = ఆ, రక్షః = రాక్షసుణ్ణి; స్వయం = స్వయంగా; క్షపయాంచకార = నశింపజేశావు.

తా॥ ఓ పాదుకాదేవీ! రావణ సంహార విషయంలో నీకు రాముని అస్త్రాలు నిమిత్త మాత్రంగా ఉన్నాయి. అభిషిక్తవైన నీవు సింహాసనాధిష్ఠితవై హద్దులేని దర్పాగ్ని జ్వాలచే వేడెక్కిన ఎవని బాహువులకు పిండిగా జేయబడిన కైలాసగిరి శిఖరాలు కర్పూరపుపొడిలాగా అయినవో, ఆ రావణాసురుణ్ణి స్వయంగా అణచివేశావు.

వ్యాఖ్య :– పాదుకాదేవి సంకల్పం వల్ల రావణుడు నశించాడు.

రావణుని భుజగర్వం అఖర్వం. కలధౌతమంటె వెండి. రావణుడు వెండికొండకు శృంగభంగం చేసి, బండలను పిండిచేశాడు. దర్పం దావాగ్నిలాగా రగిలింది. రావణుని దర్పోష్ణోగ్రతలో రజితగిరి శిఖరాలు గరగర కరిగి రజిత భస్మంగా మారాయి.

"భుజ బాహూ ప్రవేష్టోదోః". "కూటోఽస్త్రీ శిఖరం శృంగం" (అమరం)

దృఢమైన రావణుని భుజాలకు వెండి కొండ కొమ్ముల పిండి కర్పూరచూర్ణం లాగా అంటుకొని వెలిగింది. భుజాలకు కర్పూరచూర్ణం చల్లడం గౌరవ సూచకం.

"కర్పూరః పావక స్పృష్టః సౌరభం లభతేతరామ్".

కర్పూరం అగ్నిస్పర్శతో వెలిగి పరిమళిస్తుంది. **'దర్పోదంభోఽభిమానశ్చ'** అని భగవద్గీత ఆసురగుణాల్లో దర్పం ప్రధానమయిందని కీర్తించింది.

అసుర సంపత్తైన దర్పదావాగ్నిలో కలధౌత శైల శిఖరాలు కర్పూరచూర్ణమై వెలిగినప్పుడు రావణాసురుని భుజకీర్తి ప్రపంచంలో వాసికెక్కింది.

ఈ శ్లోకంలో ఉత్తరార్ధం రావణుని మహిమను ప్రకటిస్తుంది.

'నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్!' అని శ్రీకృష్ణభగవానుడు పార్థునితో –

'నీవు కేవలం పరికరంగా, కారణమాత్రుడవై ఉండు'మని బోధించాడు కదా!

రాముని అస్త్రాలు నిమిత్తమాత్రంగా ఉన్నాయి. పాదుకా సంకల్పమే శాసనం కాబట్టి, రాముని అస్త్రాలు ఆమె శాసనాన్ని అమోఘంగా నెరవేర్చాయని హనుమంతుని విన్నపం.

రావణుని సంహారమయిన తర్వాత శ్రీరామప్రభువు అయోధ్యకు తిరిగి వస్తున్నాడని ఇంతవరకు హనుమంతుడు విజ్ఞాపన చేశాడు.

పాదుకా మాహాత్మ్యం కోసం రామాస్త్ర ప్రధానకారణ భావాన్ని నిగరణంచేయడం వల్ల అపహ్నవాలంకారం. పాదుకా ప్రశంస ఉదాత్తాలంకారం. శార్దూల విక్రీడిత వృత్తం.

228. శ్రుత్వైవం హనుమన్ముఖాద్రఘుపతేః ప్రత్యాగతిం తత్క్షణా
దాసీద ద్భరతానువర్తనవశా దారూఢ కుంభస్థలామ్ ।
కాలోన్నిద్ర కదుష్ణ దానమదిరా మాద్యద్ద్విరేఫ ధ్వని
శ్లాఘా చాటుభి రస్తుతేవ భవతీం శత్రుం జయఃకుంజరః ॥ –18.

అర్థం :– ఓ పాదుకా! ఏవం = ఇట్లు (నాల్గవ శ్లోకం - తవాభిషేకాత్ - నుంచి, పదిహేడవ శ్లోకం - కర్పూర చూర్ణాయితమ్ - వరకు చెప్పిన విధంగా) హనుమత్ + ముఖాత్ = హనుమంతుని నోటినుంచి; రఘుపతేః = శ్రీరాముని యొక్క; ప్రత్యాగతిం = తిరిగి రాకడను; శ్రుత్వా = విని; తత్క్షణాత్ = ఆ క్షణాననే; ఆసీదత్ + భరత + అనువర్తన వశాత్ = సమీపించబోయే భరతుణ్ని అనుసరించే కారణంగా; ఆరూఢ కుంభస్థలాం = ఎక్కబడిన గజమస్తకంగల; భవతీం = నిన్ను; శత్రుంజయః = 'శత్రుంజయ' మనే; కుంజరః = ఏనుగు; కాలో - చాటుభిః/కాల = రాముని ఆగమన సమయాన; ఉన్నిద్ర = స్రవించిన; కదుష్ణ = ఇంచుక వేడిమిగల; దాన = మదజలమనే; మదిరా = మధువుచే; మాద్యత్ = మదించిన; ద్విరేఫ = భ్రమరాలయొక్క; ధ్వని = ఝుంకారనాదమనే; శ్లాఘా = పొగడ్తతోకూడిన; చాటుభిః = చమత్కార ప్రియోక్తులచేత; అస్తుత, ఇవ = స్తుతించింది అన్నట్లుండెను.

తా॥ ఓ పాదుకాదేవీ! శత్రుంజయమనే గజం హనుమంతుడు రాముని రాకడను గూర్చి చెప్పినదంతా విన్నది. రాముని దగ్గరికి చేరబోయే భరతునితో కూడి వెళ్ళాలని తన కుంభస్థలమందు ఆరూఢవైన నిన్ను, రాముడు వచ్చే సమయాన, ఉద్భవించిన వేడి మదజల మనే మధువుచే మదించిన తుమ్మెదల మ్రోత అనే ప్రశంసతో కూడిన ప్రియోక్తులచే స్తుతించిందో అన్నట్లు అనుకరించింది.

వ్యాఖ్య :– శత్రుంజయకుంజరం 'హనుమద్వచనం యుక్తమే' అని స్తుతించింది.

హనుమంతుడు (పద్నాలుగు శ్లోకాల్లో) చెప్పిన విషయమంతా సత్యమే, అని శత్రుంజయమనే రాజ్యభద్ర గజం పొగడిందని దేశికులు ఉత్ప్రేక్షించారు.

పాదుకాదేవి, భరతుడు రాముని ఆగమనవార్తను విన్నారు. వెంటనే రాముని సన్నిధికి వెళ్ళడానికి బయల్దేరిన భరతుణ్ణి అనువర్తించడానికి పాదుకాదేవి శత్రుంజయ కుంజరాన్ని అధిరోహించింది.

రామునిరాకను విన్న శత్రుంజయకు సంతోషం మితిమీరింది. తత్ఫలితంగా గజగండస్థలాల్లోంచి మదజలధారలు స్రవించాయి. ఇంచుక వేడితో పరిమళభరితమైన గజమద జలధారలను బారులుదీరి వచ్చిన బంభరాలు మధురంగా ఆస్వాదించాయి. కాబట్టి, మత్తెక్కిన తుమ్మెదలు కమ్మని ఝుంకారనాదం చేశాయి. చంచరీకాలు జుమ్మని మ్రోత పెట్టకుండా సంచరించలేవు కదా!

భ్రమర ఝుంకార నాదమే, శత్రుంజయగజం పాదుకాదేవిని చాటూక్తులతో ప్రశంసించిన స్తుతిగా ఉత్ప్రేక్షితం.

భరతుడు రామపాదుకలతో బయల్దేరినాడన్నది కథాంశం.

ఈ శ్లోకాలరచనలో, రామదాసుని యత్నం, ఆచార్యులే దైవ సందేశాన్ని వినిపించి దైవ సన్నిధికి జీవుణ్ణి చేర్చే యత్నంగా అనురణిస్తుంది. శార్దూల విక్రీడిత వృత్తం.

**229. ప్రత్యాగతస్య భవతీ మవలోక్య భర్తుః
పాదారవింద సవిధే భరతోపనీతామ్ ।
పూర్వాభిషేక విభవాభ్యుచితాం సపర్యాం
మధ్యేసతా మకృత మైథిల రాజకన్యా । –19.**

అర్థం :– ఓ పాదుకా! మైథిల రాజకన్యా = సీతాదేవి; ప్రత్యాగతస్య = తిరిగి వచ్చిన; భర్తుః = పతియొక్క; పాదారవింద సవిధే = అరవింద సదృశమైన పాదాల సమీపాన; భరత + ఉపనీతాం = భరతునిచే తీసుకొని రాబడిన; భవతీం = నిన్ను; అవలోక్య = చూచి; పూర్వాభిషేక విభవాభ్యుచితాం = మొదట జరిగిన పట్టాభిషేక వైభవానికి తగిన; సపర్యాం = మర్యాదను; సతాం = వసిష్ఠాది సత్పురుషుల యొక్క; మధ్యే = నడుమ; అకృత = చేసెను.

తా। ఓ పాదుకాదేవీ! సీతాదేవి వనవాసం నుంచి తిరిగి వచ్చిన తన పతి యొక్క పాదారవిందాల దగ్గరికి భరతునిచే తేబడిన నిన్నుజూచి, మొదట అభిషేకం వలన కలిగిన ఐశ్వర్యానికి అనుగుణమైన ఉపచారాది మర్యాదను వసిష్ఠాది సత్పురుషుల మధ్యన చేసింది.

వ్యాఖ్య :– పాదుకాదేవి పట్ల సీతాదేవి కున్న ప్రేమ ప్రదర్శితం.

కర్మజ్ఞాన నిష్ఠాగరిష్ఠుడైన జనక మహారాజు కూతురు సీతాదేవి ధర్మసూక్ష్మాన్ని సముచితంగాపాటించింది. భరతుడు ఏనుగు మీద పాదుకలను తెచ్చి శ్రీరాముని పాదారవింద సన్నిధిలో సమర్పింప వస్తున్నాడు. పద్నాలుగేండ్ల క్రితం ప్రప్రథమంగా పాదుకాదేవికే పట్టాభిషేకం జరిగింది. అభిషిక్త కాలక్రమాన్నిబట్టి, సామ్రాజ్య పాలనా వైభవాన్నిబట్టి పాదుకాదేవి యోగ్యతను సీతమ్మ గమనించింది. అవతారాల్లో ధర్మమాచరించి చూపడం స్వాభావికం కాబట్టి, వసిష్ఠ వామదేవాది సజ్జనులు చుట్టు ఆవరించి చూస్తుండగాసీతమ్మ పాదుకాదేవిని వందనాది సత్కారాలతో గౌరవించింది. పాదుకా దేవి సీతాదేవికంటె వరీయసి. ప్రేయోఽలంకారం, వసంత తిలక.

**230. సంప్రేక్ష్య మైథిల సుతా మణిపాదరక్షే!
ప్రత్యుద్గతస్య భవతీం భరతస్యమౌళౌ ।
నిర్దిశ్యసానిభృత మంజలినా పురస్తాత్
తారాదికాః ప్రియసఖీ రశిషత్ ప్రణంతుమ్ ॥ –20.**

అర్థం :– హేమణిపాదరక్షే = ఓ రత్నపాదుకా! మైథిల సుతా = సీతాదేవి; ప్రత్యుద్గతస్య = (స్వామిని) ఎదుర్కొనడానికి వచ్చిన; భరతస్య = భరతుని యొక్క; మౌళౌ = శిరస్సునందు; భవతీం = నిన్ను; సంప్రేక్ష్య = చూచి; సా = ఆ సీతమ్మ; నిభృతం = నిండుగా; అంజలినా = ప్రబ్బతి (మొగడ్చిన చేతుల)తో; పురస్తాత్ = ముందే, నిర్దిశ్య = చూపి; తారా + ఆదికాః = తార, మొదలైన; ప్రియసఖీః = ప్రియమైన సఖియలను; ప్రణంతుం = నమస్కరించడానికి; అశిషత్ = అనుశాసించెను.

తా॥ ఓ మణిపాదుకా! సీతాదేవి రామునికి స్వాగతం చెప్పడానికి వచ్చిన భరతుని తలమీద నిన్నుజూచి, ఆమె మొదట నిబ్బరంగా అంజలితో నిర్దేశించి తార, రుమ మొదలైన ప్రియసఖురాండ్రను నమస్కరించడానికి అనుశాసించింది.

వ్యాఖ్య :– సీతాదేవి తోడి సకియలకు పాదుకాదేవికి నమస్కరించే రీతిని బోధించింది.

భరతుడు ఏనుగుమీద తెచ్చిన పాదుకలను తన తలమీద ధరించి శ్రీరామునికి స్వాగతం చెప్పడానికి వస్తున్నాడు. సీతాదేవి పాదుకాదేవికి తాను చేసిన సత్కారాచరణకు తృప్తిపడక, తనతో కూడి వచ్చిన ప్రియ సఖురాండ్రను కూడా నమస్కరించుమని కోరింది. సీత సఖియలకు మాటలతో చెప్పలేదు. అంజలి ఘటిస్తే అనుగ్రహం లభిస్తుంది.

"అంజలిః పరమా ముద్రా క్షిప్రందేవ ప్రసాదినీ".

సీతాదేవి మొదట పాదుకలవైపు సకియల దృష్టిని ఆకర్షించి, తాను అంజలి ఘటించి, తానాచరించి ఇతరులు ఆచరించడానికి ప్రదర్శించింది. తారాది సఖియలు పాదుకాదేవికి అంజలి ఘటించారు.

ఉపదేశంకంటె నిర్దేశం మేలుకదా! నిర్దేశించడమంటే లక్ష్యసాధన కోసం తర్జని - చూపుడు వేలు -తో సూచించడం. సీతాదేవి తర్జనితోకాక అంజలితో నిర్దేశించింది.

మాన్యులను తర్జనితో చూపరాదన్న ఆచార నియమాన్ని దేశికులు సీతాదేవి ఆచరణతో మనకు ప్రబోధిస్తున్నారు.

"యద్యదాచరతిశ్రేష్ఠస్త త్తదేవేతరోజనః" - (భ.గీత.)

పెద్దల ఆచరణను పిన్నలు అనుకరిస్తారు కదా! తాను ఆచరించి ఇతరులను ఆచరింపజేయడం అనుశాసనం. ఇది సత్సంప్రదాయం.

ప్రేయోఽలంకారం. వసంత తిలకా వృత్తం.

231. తుల్యేఽపి దేవి! రఘువీర పదాశ్రయత్వే
పూర్వాభిషేక మధిగమ్య గరీయసీ త్వమ్ ।
తేనైవ ఖల్వభజతాం మణిపాదరక్షే!
రక్షః ప్లవంగమపతీ భవతీం స్వమూర్ధ్నా ॥ –21.

అర్థం :– హే దేవి! మణిపాదరక్షే = ఓ రత్నపాదుకాదేవీ! రఘువీర పద + ఆశ్రయత్వే = శ్రీరాముని పాదాలను (స్థానాన్ని) ఆశ్రయించడంలో; తుల్యే, అపి = సమానులే అయినప్పటికీ; పూర్వ + అభిషేకం = మొదట పట్టాభిషేకాన్ని; అధిగమ్య = పొంది; త్వం = నీవు; గరీయసీ = గురుతరవైనావు; తేన, ఏవ, ఖలు = అందుచేతనే కదా! రక్షః ప్లవంగమపతీ = రాక్షస వానరాధిపతులు; భవతీం = నిన్ను; స్వమూర్ధ్నా = తమ శిరస్సుచేత; అభజతాం = సేవించిరి.

తా॥ ఓ పాదుకాదేవీ! శ్రీరామ పదాశ్రయ విషయంలో సమానులే అయినా, మొదట పట్టాభిషేకాన్ని పొంది నీవు గురుతరవయ్యావు. అందుచేతనే కదా విభీషణ సుగ్రీవులు తమ తలవంచి నిన్ను భజించారు.

వ్యాఖ్య :- విభీషణ సుగ్రీవులు పాదుకాదేవిని శిరసా భజించేఔచిత్య వర్ణన.

విభీషణుడు, సుగ్రీవుడు ఇర్వురు పట్టాభిషిక్తులైన రాజులు. తుల్యాధికారులు పాదుకాదేవి ముందు తలవంచడం విరోధంగా స్ఫురిస్తుంది. ద్వితీయ పాదం, పాదుకయే అద్వితీయ అనడానికి హేతువును ప్రదర్శించి విరోధాన్ని పరిహరిస్తున్నది.

రాక్షస వానరాధిపతులకంటె పూర్వమే పాదుకా పట్టాభిషేకం జరిగింది. **'మన్యేకపీశ్వర విభీషణయోర్యథావత్'** - (8వ శ్లోకం)

పాదుకానుగ్రహ ఫలితంగా సుగ్రీవ విభీషణులకు ఉత్తరోత్తర పట్టాభిషేకం జరిగిందని విశదపరచిందికదా!

రఘువీర పదాశ్రయత్వం :- (పదం = స్థానం, చరణం, శ్లిష్టపదం)

రఘువీరుల సింహాసనాన్ని అధిష్ఠించడం, శ్రీరాముని చరణాలను సర్వదా సేవించడం పాదుకాదేవికి నైసర్గికం.

సుగ్రీవుడు, విభీషణుడు, ఇద్దరూ శరణార్థులై శ్రీరాముని పాదాలను ఆశ్రయించి, ఆయన కృపచేత రాజ్యాధిపతులయ్యారు. వైష్ణవులందరు **"వైష్ణవో వైష్ణవం దృష్ట్వా దండవత్ ప్రణమేత్భువి"** - అన్నట్లు మరొక విష్ణుభక్తుని ముందు ప్రణతులర్పించకుండా మనలేరు. కాబట్టి, పాదుకాదేవి పట్టాభిషిక్తులై కిరీటధారులైన విభీషణ సుగ్రీవులకంటె శ్రేయసి, గరీయసి.

తేనైవ :- పాదుకాభిషేకానికి కారణభూతుడైన భరతునిచేతనే రాక్షస వానరాధిపతుల తలలమీద 'శఠారి' సమర్పింపబడగా, వారిర్వురూ పాదుకాదేవితో సమానమైన అధికారం కలవారే అయినా, నతశిరస్కులై పాదుకాదేవిని భజించారు.

అనుకూల సంకల్పం, ప్రతికూల వర్జనం, ఇత్యాది షడ్విధమైన పూర్ణ శరణాగతికి తార్కాణం విభీషణుడు. అర్థార్థియై శ్రీరామచరణాలను ఆశ్రయించినవాడు సుగ్రీవుడు. రఘువీర పదాశ్రయత్వంలో విభీషణుడు వరీయుడు, సుగ్రీవుడు కనీయుడు. కాబట్టి, 'రక్షః ప్లవంగమపతి' శబ్దరచన గమనీయం.

శ్లేషాను ప్రాణిత కావ్యలింగాలంకారం. వసంత తిలకా వృత్తం.

232. నిర్వృత్త రాక్షసచమూ మృగయా విహారో
రంగేశ్వరః సఖలు రాఘవ వంశగోప్తా ।
వంశక్రమాదుపనతం పదమాదదానో
మాన్యం పునస్త్వయిపదం నిదధే స్వకీయమ్ । –22.

అర్థం :– ఓ పాదుకా! సః = ఆ, (రామునిగా అవతీర్ణుడైన), రఘువంశ గోప్తా = రఘువంశ సంరక్షకుడైన; రంగేశ్వరః, ఖలు = శ్రీరంగనాథుడే కదా! నిర్వృత్త రాక్షస చమూ మృగయా విహారః = ముగింపబడిన రాక్షస సైన్యాలను వేటాడడం కలవాడై, వంశక్రమాత్ = వంశపరంపరగా, ఉపనతం = చెందిన; పదం = సింహాసనాన్ని; ఆదదానః = స్వీకరించినవాడై ; మాన్యం = గౌరవింపదగిన; స్వకీయం = తనదైన; పదం = చరణాన్ని; పునః = మళ్ళీ; త్వయి = నీయందు; నిదధే = అర్పించెను.

తా। ఓ పాదుకాదేవీ! శ్రీరామునిగా అవతరించి రఘువంశ రక్షకుడూ, రాక్షస సైన్యాల వేటను నిర్వర్తించిన వాడూ సాక్షాత్ శ్రీరంగనాథుడే కదా! అతడు వంశపరంపరగాచెందిన సింహాసనాన్ని స్వీకరించి, పూజ్యమైన తన పాదాలను నీయందు ధరింపచేశాడు.

వ్యాఖ్య :– శ్రీరాముడు పాదుకలను ధరించాడని వర్ణితం.

(అభిషేక పద్ధతిలో 8వ శ్లోకం) పాదుకాదేవి రాఘవ రాజధానిని రాజన్వతిగా చేసిందన్న విషయం గమనీయం. రఘువంశ సంరక్షణార్థం శ్రీరంగేశుడే రాముడుగా అవతరించాడు. పాడిపంటలను పాడుచేసే మృగాలను వేటాడడం రాజధర్మం. అలాగే లోకాలను దౌర్జన్యంతో కలవరపరచే రాక్షసులను సంహరించడం భూత భవ్య భవత్ప్రభు ధర్మం.

శ్రీరాముడు దేవకార్యాన్ని నిర్వర్తించి వచ్చిన వెంటనే ఒక పదాన్ని స్వీకరించాడు, తన పదాన్ని పాదుకాదేవికి పునర్దత్తం చేశాడు. పద్నాలుగేండ్లు పాలించిన పాదుకాదేవి నుంచి కులక్రమాగతమైన కోసల రాజ్య సింహాసనాన్ని శ్రీరాముడు స్వీకరించి, పాదుకాదేవికి అభీష్టమైన తన చరణాలను మళ్ళీ ధరించడానికి అర్పించాడు.

"పదం వ్యవసితత్రాణ స్థాన లక్ష్మాంఘ్రివస్తు షు" – (నిఘంటువు)

వంశపరంపరగా చెందిన దాన్ని ఇతరులకు అర్పించడం ఆక్షేపణీయం. కాని స్వకీయమైన (ప)దాన్ని అర్పించడం అనౌచిత్యం కాదుకదా! ఇది ఇచ్చి పుచ్చుకునే వ్యవహారం కాదు. వంశమర్యాదను కాపాడుకోవడానికి స్వేచ్ఛతో నిర్వహించిన పరివర్తన. శ్రీరంగరాజు సంకల్పమనీ, రాజ్యభారమంగీకరించి, తన మాన్యచరణాలను అర్పించడం వల్ల, ధన్యులలో పాదుక మూర్ధన్య, అనీ కావ్య శిల్ప సౌందర్యం.

శ్లేషోత్థిత పూర్వరూపాలంకారం. వసంత తిలకా వృత్తం.

233. త త్తాదృశో శ్చరణయోః ప్రణిపత్యభర్తుః
పౌరాస్త్వయా విధృతయోఃప్రతి పన్నసత్త్వాః ।
ప్రాప్తాభిషేక విభవామపి పాదుకే! త్వా
మానందబాష్పసలిలైః పునరభ్యషించన్ ॥ –23.

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకా! త్వయా = నీ చేత; విధృతయోః = ధరింపడిన, తత్ + తాదృశోః = మనస్సుకు, మాటలకు స్వరూప ప్రకాశాలు గోచరించని; భర్తుః = ప్రభువు యొక్క; చరణయోః = పాదాలయందు; పౌరాః = పుర జనులు; ప్రణిపత్య = నమస్కరించి; ప్రతిపన్నసత్త్వాః = పొందబడిన పూజ్యత్వ అధ్యవసాయంకలవారై; త్వాం = నిన్ను; ప్రాప్త + అభిషేక, విభవాం, అపి = పొందబడిన అభిషేక సంపదకల దానవై ననూ; పునః = మళ్ళీ; ఆనంద బాష్ప సలిలైః = ఆనందంతోకార్చిన కన్నీళ్ళచేత; అభ్యషించన్ = అభిషేకించారు.

తా॥ ఓ పాదుకాదేవీ! అయోధ్యానగరవాసులు నీవు ధరించిన అవాఙ్మనస గోచరమైన స్వరూప ప్రకాశాలు కల ప్రభుపాదాలకు నమస్కరించి, సత్త్వాన్ని పొందినవారై అభిషేక వైభవం కలదానివైనా నిన్ను ఆనందాశ్రువుల చేత మరోసారి అభిషేకించారు.

వ్యాఖ్య :– పౌరులు పాదుకలను ధరించిన ప్రభు పాదాలకు శిరసా నమస్కరించారు.

భగవత్పాద మహిమ మనసుకుగానీ, మాటలకుగానీ తెలియదుకదా! శ్రీరామచంద్రస్వామి పాదాలు పాదుకలచే పునః అలంకరింపబడ్డాయి. ఆ దృశ్యాన్ని తిలకించిన పౌరులకు దృఢమైన అధ్యవసాయమేర్పడి పూజ్యభావం హెచ్చింది.
"ద్రవ్యాను వ్యవసాయేషు సత్త్వమ్" – (అమరం)

సాధారణ పదప్రాప్తియందునూ, అసాధారణ మాన్యపద (చరణ) ప్రాప్తియందునూ పాదుకాభిషేకం సంపన్న మయింది. పౌరులు ప్రభుపాదాలపై తలలు మోపి ప్రణమిల్లి, ఆనందబాష్పజలాలచే అభిషేకం చేశారు.

అనుగుణాలంకారం. వసంతతిలకా వృత్తం.

234. మా తస్త్వయైవ సమయే విషమేఽపి సమ్య
గ్రాజన్వతీం వసుమతీ మవ లోక్య రామః ।
సంజీవనాయ భరతస్య సమగ్రభక్తేః
సత్య ప్రతిశ్రవతయైవ చకార రాజ్యమ్ ॥ –24.

అర్థం :– హే మాతః = ఓజననీ! పాదుకా! విషమే = సంకటమైన; సమయే, అపి = సమయంలోనూ, వసుమతీం = భూమిని; త్వయా ఏవ = నీ చేతనే; రాజన్వతీం = ఉత్తమ రాజుకలదానిగా; సమ్యక్ = బాగా; అవలోక్య = చూచి;

రామః = శ్రీరాముడు; సమగ్ర భక్తేః = పూర్ణభక్తి కలిగిన; భరతస్య = భరతునియొక్క; సత్యప్రతిశ్రవతయా, ఏవ = సత్యమైన ప్రతిజ్ఞా కారణంచేతనే, సంజీవనాయ = (భరతుణ్ణి) బతికించడంకోసం; రాజ్యం = రాజ్యాన్ని; చకార = చేసెను.

తా|| ఓ తల్లీ పాదుకా! విషమ సమయానకూడా నీ చేత భూమిని శోభన రాజయుక్తగా **బాగా** అవలోకించి, పూర్ణ భక్తి కలిగిన భరతుణ్ణి సత్య ప్రతిజ్ఞా భావంతో బతికించడానికే రాముడు రాజ్యమేలాడు.

వ్యాఖ్య :– శ్రీరాముడు భరతుణ్ణి జీవింపజేయడానికి రాజ్యాన్ని గ్రహించాడు.

సంకట సమయంలోనూ, పాదుకా రాజ్యం ధనధాన్య సమృద్ధిచే పేరు ప్రతిష్ఠలు పొందింది. **'భవతస్తేజసా సర్వంకృతం'**. ఆ రాముని తేజస్సుచే – పాదుకా శక్తిచే రాజ్యకోశాగారాలన్నీ నిండి, దేశం **శాంతి** భద్రతలతో సుభిక్షంగా ఉన్నదనీ భరతుడు శ్రీరామునితో విన్నవించాడు. కాబట్టి, శ్రీరాముడు కోసల వసుమతి, 'రాజన్వతి' అని సమ్యక్పరిశీలన చేశాడు.

'సురాజ్ఞి దేశే రాజన్వాన్ స్యాత్, తతోఽన్యత్ర రాజవాన్' (అమరం)

రాజుచే సామాన్యంగా పాలింపబడే దేశాన్ని 'రాజవంత' మంటారు. ప్రజారంజకుడైన రాజుచే న్యాయంగా పాలింపబడే దేశాన్ని 'రాజన్వంత' మంటారు. పాదుకారాజ్యశోభను గమనించిన రామునికి రాజ్యాన్ని గ్రహించే అవసరమే లేదు. అయినా, రాజరికాన్ని రాముడెందుకు అంగీకరించాడో ఉత్తరార్థం వెల్లడిస్తుంది.

భరతుడు చిత్రకూటాశ్రమానికి సపరివారంగా వచ్చి శరణాగతిచేస్తే రాముడు పితృాజ్ఞా ప్రకారం పద్నాలుగు వత్సరాల వనవాసానంతరం అయోధ్యకు వచ్చి రాజ్యపాలనచేస్తానని వాగ్దానం చేశాడు.

భరతుడు, **"నద్రక్ష్యామి యదిత్వాంతు ప్రవేక్ష్యామి హుతాశనమ్"** – రాముడన్నమాట రీతిగా వచ్చి తనకు కనబడకుంటే అగ్నిప్రవేశం చేస్తానన్నాడు.

వాస్తవంగా, భరతుడు ఈ యత్నం చేయకుండా ఉండడానికే, హనుమంతుణ్ణి పంపి, తన విజయవార్తనూ, ప్రత్యాగమనవార్తనూ భరతునికి తెలియజేయుమన్నాడు శ్రీరాముడు. భక్తి భరితుడైన భరతుని బొందిలో ప్రాణాన్ని నిల్పడానికే, ప్రతిజ్ఞ సత్యం కావాలనే కోరికతో రాముడయోధ్యకు తిరిగివచ్చి, **'భ్రాత్రా సహభవిష్యామి పృథివ్యాః పతిరుత్తమః'** అన్నట్లు పాదుకలను ధరించి, రాజ్యాన్ని కూడా స్వీకరించాడు. ప్రేయోఽలంకారం. వసన్త తిలక.

235. పాదావని! ప్రతిగతస్య పురీ మయోధ్యాం
పౌలస్త్య హంతు రభిషేక జలార్ద్ర మూర్తేః ।
అంసే యథార్థ మధివాస్య నిజైర్యశోభిః
కస్తూరికేవ విహితా వసుధా త్వయైవ । –25.

అర్థం :- హే పాదావని = ఓ పాదుకా! అయోధ్యాం, పురీం = అయోధ్యా నగరానికి; ప్రత్యాగతస్య = తిరిగి వచ్చిన అభిషేకజల + ఆర్ద్ర మూర్తేః = అభిషేక జలంచేత తడిసిన మేనుగల; పౌలస్త్య హంతుః = రావణ సంహర్తయైన శ్రీరాముని యొక్క; అంసే = భుజమందు; త్వయా, ఏవ = నీ చేతనే; నిజైః, యశోభిః = స్వీయకీర్తులచేత; యథా + అర్థం = తగు రీతిగా; అధివాస్య = పరిమళింపజేసి, వసుధా = భూమి; కస్తూరికా; ఇవ = కస్తూరి (తిలకం)లాగా; నిహితా = ఉంచబడింది.

తా॥ ఓ చరణావనీ! సాకేతనగరికి తిరిగివచ్చిన, అభిషేకోదకంచేత తడిసిన శరీరం గల రావణ హంతయొక్క భుజశిఖరాన నీ చేతనే స్వీయకీర్తులతో తగినట్లు పరిమళింపజేసి, భూమి కస్తూరీ తిలకంగా ఉంచబడింది.

వ్యాఖ్య :- శ్రీరాముడు పట్టాభిషిక్తుడై, రాజ్యభారాన్ని వహించే వర్ణన.

పాదుకాదేవి తన పరిపాలనలో, రాముని ప్రాభవ వైభవాలకనుగుణంగా రాజ్యం వన్నెకెక్కి వాసి గాంచాలని యత్నించింది. పాదుకాదేవి కీర్తిప్రతిష్ఠలచే భూమి పరిమళించింది. అంతేకాదు, శ్రీరాముడెక్కడెక్కడ సంచరించాడో అక్కడక్కడ అతని కీర్తి చేతను భూమి సువాసితమయింది. వ్యక్తి గొప్పతనానికి తగినట్లు వస్తువునతనికి అర్పించడంలో కజ్ఞత.

శ్రీరాముడు సత్యధర్మపరాక్రముడు. పౌలస్త్యహంత చారిత్రక పురుషుడు. ఆ మర్యాదా పురుషోత్తమునికి అభిషేకమయిన వెంటనే అలంకారంచేయబడింది. స్వీయకీర్తులచేత పరిమళించిన వసుధను - రాజ్యాన్ని - పాదుకాదేవి రాముని భుజం మీద కస్తూరీ తిలకంలాగా నిక్షేపించింది.

కస్తూరి వాసన కలది. పృథివి గంధవతి. కస్తూరి నల్లగా ఉంటుంది. **'యత్కృష్ణం తదన్నస్య'** శ్రుతిరీత్యా భూమి కూడా నల్లనిది. రాజుకు కస్తూరి బొట్టు పెట్టడం **"కల్పితః క్షమాభృతాం నాథః కస్తూరీ స్థాసకైరివ"** (యాదవాభ్యుదయం. 22.125) అని వర్ణితం.

శ్రీరంగనాథుని తిరుముఖ మండలం కస్తూరీ తిలకం చేత విరాజిల్లుతుంటుంది. తురకల అలజడితో శ్రీపరాశర భట్టరు నిర్బంధంగా శ్రీరంగం నుంచి వెళ్ళిపోతూ, శ్రీరంగనాథస్వామిని తిరిగి కలుసుకునే తాపంతో **'కస్తూరీ కలితోర్ధ్వ పుండ్ర తిలకం'** అని సుశ్లోకించారు.

భూభారం భుజ విలసితం కాబట్టి రాముడు కస్తూరీ రేఖలాగారాజ్యభారాన్ని అవలీలగా, అలంకారంగా ధరించాడు. రాముడు రాజదండం ధరించాడని స్మారితం.

ప్రేయసి ఎంతబరువును మోపినా,,అది అలంకారంగానే ఉంటుందికదా! రాజ్యాన్ని రామునికి యథార్థంగా సమర్పించే విషయంలో పాదుకా నైపుణ్యాన్ని దేశికులు అద్భుతంగా చిత్రించారు.

స్వరూపోత్ప్రేక్ష. వసంత తిలక.

236. యాఽసౌచతుర్దశసమాః పతివిప్రయుక్తా
విశ్వంభరా భగవతీ విధృతాభవత్యా ।
విన్యస్యతాం రఘుపతే ర్భుజశైల శృంగే
భూయోఽపి తేన సహితాం భవతీబభార ॥ –26.

అర్థం :– ఓ పాదుకా! పతి విప్రయుక్తా = భర్త (రాముడు)తో ఎడబాసిన; భగవతీ = పూజనీయయైన; యా = ఏ; అసౌ = ఈ; విశ్వం భరా = భూమి; చతుర్దశ సమాః = పదానాలుగేండ్లు; భవత్యా = నీచేత; విధృతా = ధరింపబడిందో; తాం = ఆ భూమినే; రఘుపతేః = శ్రీరాముని యొక్క; భుజశైలశృంగే = భుజ మనే గిరి శిఖరమందు; విన్యస్య = నిక్షేపించి; భూయః, అపి = మళ్ళీ; తేన, సహితాం = ఆయనతోకూడియున్న దాన్ని; భవతీ = నీవు; బభార = భరించావు.

తా। ఓ పాదుకాదేవీ! పతినెడబాసిన పూజ్య విశ్వంభరను నీవు పద్నాలుగేండ్లు భరించావు. శ్రీరాముని భుజమనే పర్వత శిఖరమందు ఆ విశ్వంభరను ఉంచి కూడా మళ్ళీ అతనితోపాటు ఉన్న దాన్ని భరించావు.

వ్యాఖ్య :– పాదుకాదేవి విశ్రాంతి నెరుగదని వర్ణితం.

పదునాలుగేండ్లు పతినెడబాసిన భూదేవిని గౌరవంగా పాదుకాదేవి భరించి శ్రీరామునిభుజం మీద నిక్షేపించింది. కాబట్టి శ్రీరాముని భుజం భూభృచ్ఛిఖరమయింది. రాజ్య రక్షణ లేకున్నా రామరాజు పాదాలను రక్షించడం పాదుకాదేవికి స్వాభావికమేకదా! రామునితోపాటు మళ్ళీ భూమిని పాదుక భరించక తప్పలేదు. విశేషమేమంటే; పాదుకాదేవి రెట్టింపు భారాన్ని వహించినా ఆయాసపడక ఆనందంగా ఉంది. ఆధారాధిక్య వర్ణనవల్ల అధికాలంకారం. వసంత తిలక.

237. నిస్తీర్ణ దుఃఖ జలధే రనఘస్యదేవి!
త్వ త్సంప్రయుక్త రఘునాథపదాన్వయేన ।
సద్యః సనందనముఖైరపి దుర్నిరీక్ష్యా
సామ్రాజ్య సంపదపరా భరతస్యజజ్ఞే ॥ –27.

అర్థం :– హేదేవి = ఓ పాదుకాదేవీ! నిస్తీర్ణ దుఃఖజలధేః = దాటబడిన దుఃఖసముద్రంగల; అనఘస్య = పాపరహితుడైన; భరతస్య = భరతునికి; త్వత్ + సంప్రయుక్త, రఘునాథ పద + అన్వయేన = నీతో చేర్చబడిన శ్రీరాముని (సంస్థాన) పాదాల సంబంధంచేత; సనందన ముఖైః, అపి = సనందనాది యోగులచేత కూడా; దుర్నిరీక్ష్యా =చూడనలవికాని; అపరా = మరొక విధమైన; సామ్రాజ్య సంపత్ = (కైంకర్య) సామ్రాజ్య సంపత్తు; సద్యః = తత్కాలాననే, జజ్ఞే = కలిగెను.

తా। ఓ పాదుకాదేవీ! దుఃఖసముద్రాన్ని తరించి అనఘుడైన భరతునికి నీతో కూడియున్న రఘుకుల సంస్థాన/ శ్రీరామచరణ సంబంధంచేత సనందనాది యోగులచేతనూ చూడ శక్యంకాని మరొక సామ్రాజ్య సంపత్తు కలిగింది.

వ్యాఖ్య :- భరతునికి సామ్రాజ్య సంపద పెరిగింది.

పాపిష్ఠుడనైన నేను ఈ అపార దుఃఖ సముద్రాన్ని దాటేదెట్లా? స్వామీ! దాటకపోతే నీ పాదసేవ చేసేదెట్లా? ఎలాగైనా ఈ పాపాత్ముణ్ణి కడదేర్చు. "పాపిష్ఠః కథమహమితో దుఃఖజలధే రపారాదుత్తీర్ణస్తవ పరిచరేయం చరణయోః". అని శ్రీయామునాచార్యులు స్తుతించారు.

కైకేయి వరంవల్ల వచ్చిన రాజ్యభోగం 'నాపాపమే' అని భరతుడు దుఃఖపడ్డాడు. పాదుకాదేవికి పట్టంకట్టి ఆరాధించడం వల్ల అఘం విరిగి అనఘుడయ్యాడు. పాదుకకు మాత్రమే కింకరుడైన భరతుడు సామ్రాజ్యాన్ని నడిపి సార్వభౌముడుగా ప్రకాశించాడు. అయోధ్యకు తిరిగి వచ్చిన రామునికి రాజ్యమర్పించి సంసార దుఃఖసముద్రాన్ని లంఘించాడు. భరతుడు యువరాజు అయ్యాడు. శేషత్వానికి సార్వభౌముడయ్యాడు. పాదుకలతో పాటు ఆ రాముని పాదాలకూ కింకరుడయ్యాడు. కాబట్టి, పూర్ణమూర్తిని ఆరాధించడంవల్ల భరతునికి కైంకర్య సామ్రాజ్య సంపద వృద్ధి చెందింది.

ముక్త పురుషులకు అపహత పాప్మత్వాది గుణాలు ఆవిర్భవించడంవల్ల వారు పరమపదంలో తమకిష్టమైన రూపాన్ని పొంది భగవత్కైంకర్యానికి పాత్రులవుతారు."కామాన్నీ కామరూప్యను సంచరన్" అనే ఉపనిషద్వాక్య రీతిగాసంసార సాగరపారంగతులైన పరిశుద్ధాత్ములకు ఏ సంపద లభిస్తుందో, ఆమోక్ష సామ్రాజ్య సంపద భరతునికి లభించింది.

ఒకప్పుడు సత్త్వగుణం భ్రష్టమై ద్వారపాలకులను కామానుజులై శపించడంవల్ల సనకసనందనాదియోగులు కూడా కన్నెత్తి చూడజాలని మోక్ష సామ్రాజ్యం, దుర్లభమైన మానవ జన్మ లభించిన వారికి స్పృహణీయమైన కింకరత్వాధి రాజ్యం భరతుని అధీనమయింది. పాదుకాదేవి రాజ్యాన్ని విడిచి రామపాద సేవచేస్తే, రామునితో పాటు మళ్ళీ రాజ్యాన్ని పొందింది. భరతుడు రామునికి రాజ్యాన్ని అర్పిస్తే, అతనికి పూర్ణపురుష సేవా సామ్రాజ్యంసంపన్నమయింది. రాముడు రాజుకాగానే అందరూ ఇతోధికంగా లాభపడ్డారు. భరతునికి యౌవరాజ్యం ముక్తపురుషకైంకర్య తుల్యమయింది. సమాసోక్తి సంకీర్ణమైన అతిశయోక్తి. వసంత తిలక.

238. నిర్గత్య దేవి! భరతాంజలి పద్మమధ్యాత్
భూయః సమాగతవతీ పురుషోత్తమేన ।
పద్మేవ భద్రమఖిలం మణిపాదరక్షే!
ప్రాదుశ్చకార భవతీ జగతాంత్రయాణామ్ ॥ -28.

అర్థం :- హే దేవి, మణిపాదరక్షే = ఓ రత్నపాదుకాదేవీ! భరత + అంజలి పద్మమధ్యాత్ = భరతుని యొక్క పద్మ సదృశమైన దోసిలి నడిమి నుంచి; నిర్గత్య = బయటపడి; భూయః = మళ్ళీ; పురుషోత్తమేన = శ్రీరామునితో; సమాగతవతీ = చేరిన; భవతీ = నీవు; పద్మా, ఇవ = లక్ష్మీదేవివలె; త్రయాణాం, జగతాం = మూడులోకాలకు; అఖిలం = సకలమైన; భద్రం = శుభాన్ని; ప్రాదుశ్చకార = కలుగజేశావు.

తా॥ ఓ దేవీ! రత్నపాదుకా! పద్మంతో సమానమైన భరతుని అంజలి మధ్యనుంచి లేచి పురుషోత్తమునితో మళ్ళీ కలిసిన నీవు, పద్మాదేవిలాగా ముజ్జగాలకు సకల శ్రేయస్సును కలిగించావు.

వ్యాఖ్య :- శ్రీరామునితో చేరిన పాదుకాదేవి పద్మాదేవివలె లోకశ్రేయస్సు నావిష్కరించింది.

లక్ష్మీదేవి భృగువంశమందు జనించి విష్ణువును వరించింది. **"లక్ష్మీః పద్మాలయా పద్మా"** - (అమరం) దుర్వాస మహర్షి శాపంవల్ల లక్ష్మి అంతర్ధానమయింది. సముద్రమథనమప్పుడు దేవతలందరూ చూస్తుండగా లక్ష్మి పద్మం నుంచి ఆవిర్భవించి మళ్ళీ విష్ణుమూర్తి వక్షఃస్థలాన్ని ఆశ్రయించింది.

"పశ్యతాం సర్వదేవానాం యయౌ వక్షస్థలం హరేః" - (వి.పు)

ఇంద్రుని రాజ్యంతోపాటు లక్ష్మి మూడు లోకాలకు సకల క్షేమాన్ని కల్పించింది. శుకపురిలోని పద్మ సరస్సులో పద్మం నుంచి జనించిన పద్మాదేవి, శ్రీనివాసుణ్ని సర్వలోక కల్యాణం కోసం వివాహమాడింది.

'ఆనృశంస్య మనుక్రోశః' - 'రాఘవంశోభయంత్యే తేషడ్గుణాః పురుషోత్తమమ్' - అన్నట్లు, శ్రీరాముడు షాడ్గుణ్య పూర్ణుడైన పురుషోత్తముడే.

విశదగుణ సముద్రుడైన భరతుడు పాలకడలి. ఆయన అంజలియే పద్మం. పద్మంలో నుంచి నిర్గమించిన పద్మయే పాదుక.

భరతుడు పాదుకలను దోసిలితో పట్టుకొని శ్రీరాముని పాదాలకు అలంకరింపజేశాడు. పాదుకాదేవి, పురుషోత్తముణ్ని ఆశ్రయించిన లక్ష్మివలె, రామచంద్రస్వామిని ఆశ్రయించి విశ్వశ్రేయస్సును ఆవిష్కరించింది. ఉపమాలంకారం. వసంత తిలకా వృత్తం.

239. రఘుపతి మధిరోప్యస్వోచితే రత్నపీఠే
ప్రగుణమభజథా స్త్వం పాదుకే! పాదపీఠమ్ ।
తదపి బహుమతిస్తే తాదృశీ నిత్యమాసీత్
క్వనుఖలు మహితానాం కల్ప్యతే తారతమ్యమ్ । -29.

అర్థం :- హే పాదుకే = ఓ పాదుకాదేవీ! త్వం = నీవు; రఘుపతిం = శ్రీరామ ప్రభువును; స్వ + ఉచితే = తనకు తగిన; రత్న పీఠే = సింహాసనంమీద; అధిరోప్య = అధిష్ఠింపజేసి; పాదపీఠం = చరణపీఠాన్ని, ప్రగుణం = శ్రేష్ఠంగా; అభజథాః = ఆశ్రయించావు; తత్ + అపి = అట్లైనా; నిత్యం = ఎల్లప్పుడు; తాదృశీ = భద్రపీఠాధిరోహణ సదృశమైన; బహుమతిః = గౌరవం; తే = నీకు; ఆసీత్ = ఉండెను; మహితానాం = గొప్ప గుణాలుకలవారికి; తారతమ్యం = (ఉచ్చనీచ స్థితి) తరతమభేదం; క్వ,ను,ఖలు = ఎచ్చోటనైనా; కల్ప్యతే = కల్పింపబడునా?

తా॥ ఓ పాదుకాదేవీ! శ్రీరామ ప్రభువును తనకు యోగ్యమైన సింహాసనంపైన అధిష్ఠింపజేసి నీవు పాదపీఠాన్ని గుణాత్మకంగా పొందావు. అట్లైనా, నీ గౌరవం ఎల్లప్పుడు అలాగే ఉంది. మాన్యులకు ఎక్కడనయినా ఉత్కర్షాపకర్ష వ్యవస్థ కల్పింపబడుతుందా?

వ్యాఖ్య :- పాదుకాదేవి గౌరవం శాశ్వతంగా నిల్చియుంటుంది.

శ్రీరాముడు సింహాసనం మీద కూర్చున్నాడు. పాదుకాదేవి సింహాసనానికి క్రింద ఉండే పాదపీఠం మీద కూర్చుంది. తత్ఫలితంగా, పాదుకకు ఏమైనా గౌరవం తగ్గిందా? తగ్గలేదు. సింహాసనాసీనయైనా, పాదపీఠాసీనయైనా పాదుకా స్వరూప స్వభావాలనుబట్టి, ఆమెకున్న గౌరవం ఒక్కరీతిగానే ఉంటుంది.

లోకారాధ్యులకు ఎక్కడున్నా గౌరవంలో తరతమ భేదముండదు. 'సీతాదేవి, రూపగుణ విభవాలనుబట్టి ఎక్కడున్నా శీలవతియే' - అని (హంస సందేశంలో) హంసతో శ్రీరాముడంటాడు. అలాగే, రూప గుణసంపదతో ఏ పదవియందున్నా, పాదుకా మహిమకు తారతమ్యం లేదు, కలుగదు.

సామాన్య విషయంతో విశేషాన్ని సమర్థించే అర్థాంతరన్యాసాలంకారం. మాలినీ వృత్తం.

240. అనువృత్త రామభావః
శంకే నిర్విష్ట చక్రవర్తి పదామ్ ।
అధునాఽపి రంగనాథః
స చమత్కారం పదేన భజతిత్వామ్ ॥ –30.

అర్థం :– ఓ పాదుకా! అనువృత్త రామభావః = అనువర్తింపబడిన రాముడనే భావంకల; రంగనాథః = శ్రీరంగనాథుడు; నిర్విష్ట చక్రవర్తి పదాం = అనుభవింపబడిన సార్వభౌమస్థానం గల; త్వాం = నిన్ను; అధునా, అపి = ఇప్పుడుకూడా; పదేన = పాదం/స్థానం చేత; సచమత్కారం = అందంగా; భజతి = సేవిస్తున్నాడు; (గౌరవంగా ధరిస్తాడు) అని; శంకే = ఊహిస్తున్నాను.

తా॥ ఓ పాదుకాదేవీ! తాను రాముడనే భావంతో వర్తించే రంగనాథుడు చక్రవర్తి స్థానాన్ని అలంకరించిన నిన్ను ఇప్పటికీ పాదాలచే/స్థానంచే గౌరవిస్తూ ధరిస్తున్నాడని భావిస్తాను.

వ్యాఖ్య :- శ్రీరంగనాథుడు నేటికీ పాదుకలను చమత్కారంగా ధరిస్తాడు.

శ్రీరంగనాథుడు తాను రాముడనే భావాన్నీ నేటికీ విస్మరించలేదు. సార్వభౌమ పదవిని అధిష్ఠించినదనే గౌరవభావంతో ఆయనపాదుకల ముందు కొంచెం వంగిచూచి వాటిని ధరిస్తాడు. పాదరక్షలను నతశిరస్కులు కాకుండా ఎవ్వరూ ధరింపజాలని ప్రక్రియలో భావగాంభీర్యం సచమత్కారం.

నిజంగా దివ్యదేశాల్లో ఏ ఉత్సవమూర్తికి కూడా పాదాలకు పాదుకలున్నట్లు కనబడవు. పాదుకలను సమర్పించే విధానంగా ఆరాధన జరుగుతుంది.

అహోబిలక్షేత్రంలో శ్రీ లక్ష్మీనృసింహస్వామి శ్రీమదళగియ శింగరుతో ఊరేగింపు ఉత్సవానికి బయల్దేరినప్పుడు, ఒక్కచరణానికే పాదరక్షను ధరించినట్లు దర్శనమిస్తాడు.

నాల్గవ పద్ధతి నుంచి ఈ పద్ధతి దాకా, 5 పద్ధతుల్లో, రామాయణంలోని శ్రీరామపాదుకల వైభవం నైక విధంగా వర్ణితం. ఉత్ప్రేక్షాలంకారం. ఆర్యాభేదం.

నిర్యాతనా పద్ధతి సమాప్తం.

9. వంది వైతాళిక పద్ధతి

241. నమస్తే పాదుకే పుంసాం సంసారార్ణవ సేతవే ।
యదారోహస్య వేదాంతా వంది వైతాళికాః స్వయమ్ । – 1.

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకాదేవీ! యత్ + ఆరోహస్య = దేనినెక్కడానికి; వేదాంతాః = వేదాంతశాస్త్రాలు; స్వయం = తామే, వంది, వైతాళికాః = స్తుతి పాఠకులుగానూ, సమయాన్ని సూచించే వ్యక్తులుగానూ అయినవో; పుంసాం = జనులకు; సంసార + అర్ణవసేతవే = భవసాగర (తరణం కోసం) సేతువైన; తే = నీ (కొర)కు; నమః = నమస్కారం.

తా। ఓ పాదుకా! జనులకు సంసారసాగర తరణం కోసం సేతువైన నీకు నమస్కారం. నిన్ను శ్రీరంగనాథుడు ఆరోహించడానికి వేదాంతశాస్త్రాలు స్వయంగా స్తుతి పాఠకులుగానూ, ప్రబోధకులుగానూ పరిణమిస్తున్నాయి.

వ్యాఖ్య :– శ్రీ రంగపతి పాదుకారోహణం చేయడానికి వేదాంతాలు వంది వైతాళికులైన వర్ణన.

వేదాంతాలు అంటే ఉపనిషత్తులు, పాంచరాత్రాగమాలు భగవంతుణ్ణి సంసార సముద్రతరణైక సేతువుగా వర్ణించాయి. **"విశుద్ధానాంవాచాం వృషశిఖరి నాథః స్తుతిపదమ్"** (దయా శతకం 68).

భగవంతుణ్ని స్తుతించే వారికి మోక్షద్వారం తెరువబడి ఉంటుంది.

'విముక్త్యేకద్వారం విఘటిత కవాటం ప్రణయినామ్' అని స్తుతించే కారణం వివరింపబడింది. సంసారమనే పారావారం దుస్తరం కాబట్టి జీవులు సుఖంగా దాటడానికి అనువైన ఆనకట్టగా పాదుకాదేవిని స్తుతించారు దేశికులు.**'అఖిల ధర్మసేతు పదవీ'** - అని దయాదేవి పరంగా స్తుతింపబడింది. భగవచ్చరణారవిందాలను భజించడమే సంసారంలో ఉన్నసారం.

స్తుతించే వారిని 'వందిమాగధు'లంటారు. **'వందినః స్తుతి పాఠకాః'** (అమరం) నిద్రనుంచి మేల్కొలిపే వారినీ, కార్యాన్నీ, వేళనూ జ్ఞాపకంచేస్తూ ప్రబోధించే వారిని 'వైతాళికులంటారు. **"వైతాళికా బోధకరాః"** (అమరం)

'యాదవాభ్యుదయ' మహాకావ్యంలో పందొమ్మిదవ సర్గను 'సుప్రభాతం'గా రచించారు శ్రీ వేదాంత దేశికులు.

వేదాలకు వందిత్వం కూడా రామాయణమే ప్రవచిస్తుంది. వంది వైతాళిక కృత్యాన్ని సుమంత్రుడొక్కడే చేశాడు.

"యథా నందతితేజస్వీ సాగరో భాస్కరోదయే।
ప్రీతః ప్రీతేన మనసా తథా నందయ నః స్వతః" ।

....

"బుధ్యస్వ నరశార్దూల కురుకార్యమనంతరమ్।
వేదాఃసహాంగవిద్యాశ్చ యథాహ్యాత్మభువం విభుమ్।
బ్రహ్మాణం బోధయంత్యద్య తథా త్వాంబోధయామ్యహమ్" ।

ఒక అలంకార మంటపం నుంచి మరొక మంటపానికి వెళ్ళే శ్రీరంగనాథుడు పాదుకలను ధరించే ఆయా సమయాలను సూచిస్తూ, స్తుతించడానికి వేదాంతశాస్త్రాలు వంది వైతాళికుల కృత్యాన్ని నిర్వహిస్తున్నాయి.

పూర్వార్ధంలో ప్రేయోఽలంకారం. ఉత్తరార్ధం పరిణామాలంకారం. అనుష్టుబ్ఛందం.

242. ఉచిత ముపచరిష్యన్ రంగనాథ! ప్రభాతే
విధి శివసనకాద్యాన్ బాహ్యకక్ష్యానిరుద్ధాన్।
చరణకమలసేవా సౌఖ్యసామ్రాజ్య భాజాం
ప్రథమ విహితభాగాం పాదుకా మాద్రియేథాః ।-2.

అర్థం :– హే రంగనాథ = ఓ శ్రీరంగనాథా! బాహ్యకక్ష్యా నిరుద్ధాన్= బయటి ప్రాంగణంలోనే ఆపి యుంచబడిన; విధి శివసనక + ఆద్యాన్ = బ్రహ్మ, రుద్రుడు, సనకుడు మొదలైనవారిని; ఉచితం = యోగ్యంగా; ప్రభాతే = ఉషఃకాలమందు; ఉప, చరిష్యన్= సమీపించి కటాక్షింపగోరినవాడవై ; చరణకమల సేవాసౌఖ్య సామ్రాజ్యభాజాం =(నీ) పాదకమలసేవ వలన కలిగే సుఖమనే సామ్రాజ్యాన్ని పొందే వారిలో; ప్రథమ విహిత భాగాం = అగ్రస్థానాన్ని పొందదగిన; పాదుకాం = పాదుకాదేవిని; ఆద్రియేథాః = ఆదరించుము.

తా। ఓ రంగనాథా! బయటిప్రాకార ప్రాంగణంలో నిల్పబడిన బ్రహ్మ, శివుడు, సనకాదులను ప్రాతః కాలమందు సముచితంగా ఉపచరింపగోరినవాడవై కమల సదృశ చరణాలవల్ల కలిగే సుఖమనే సామ్రాజ్యాన్ని పొందేవారిలో మొదటి స్థానం కల్పింపబడిన పాదుకాదేవిని ఆదరించవయ్యా!

వ్యాఖ్య :– వైతాళికులు ఉదయాన దర్శింప వచ్చిన దేవతలను సత్కరించడానికి పాదుకలను ధరించుమని శ్రీరంగపతిని ప్రబోధించే వర్ణన.

అది ఉషఃకాలం. చతుర్ముఖుడు, చంద్రశేఖరుడు, బ్రహ్మర్షులైన సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతులు స్వామి దర్శనార్థం వచ్చారు. అయితే విష్వక్సేనుడు వారిని ఆలయంలోనికి రానీయక 'స్వామియే వేంచేసి కటాక్షిస్తా'డని బయటనే ఆపివేశాడు.

'అరువరైయనైయ ఏన్ కోయిల్ మున్నివరో' అనీ, **'ఎంబెరుమానున్ కోయిలిల్‌వాశల్'** అని 'స్వామీ! మీ ఆలయం ముందు దేవతలెందరోవచ్చి గుమిగూడియున్నారు, అని 'భక్తాంఘ్రిరేణువు' పూర్వమే 'తిరుప్పళ్ళియెళుచ్చి' (సుప్రభాతం) పాడినారు.

ఆలయం నుంచి బయటకు నడిచి రావడానికి స్వామి పాదుకలను ధరించడం అత్యావశ్యకం.

సుకుమారశైత్యసౌరభాలతో శోభించే కమలాల్లాంటివి భగవంతుని పాదాలు. స్వామిచరణాలను స్పృశిస్తూ సుఖ సామ్రాజ్యాన్నిపొందే శ్రీదేవి మొదలైన దేవేరుల్లోప్రథమస్థానం పాదుకాదేవిదే. కాబట్టి, శ్రీరంగేశుడు స్వయంగా, బయట నిల్చిన దేవతలందరికి దర్శనమీయడానికి మొదట పాదుకలను ఆదరపూర్వకంగా ధరించే వేళను సూచిస్తూ వంది వైతాళికులు ప్రభాతకాలంలో ప్రబోధించారు.

ఉదాత్తాలంకారం. మాలినీ వృత్తం.

243. పద్మాజుష్టం భజతుచరణం పాదుకా లబ్ధవారా
ప్రత్యాసన్నాస్తవ పరిజనాః ప్రాతరాస్థానయోగ్యాః ।
అర్ధోన్మేషాదధిక సుభగా మర్ధనిద్రా నుషంగాం
నాభీపద్మే తవనయనయో ర్నాథ! పశ్యంతుశోభామ్ ।-3.

అర్థం :– హేనాథ = ఓ ప్రభూ! లబ్ధవారా = పర్యాయంగా అవసరాన్ని పొందిన; పాదుకా = పాదుకాదేవి; పద్మాజుష్టం = లక్ష్మీదేవిచే సేవింపబడిన; చరణం = పాదాన్ని; భజతు = సేవించుగాక, ప్రత్యాసన్నాః = దగ్గరికివచ్చిన; ప్రాతః, ఆస్థాన యోగ్యాః = ప్రభాతగోష్ఠికి తగిన; తవ = నీయొక్క; పరిజనాః = పరిచారకులు; అర్ధ + ఉన్మేషాత్ = సగం తెరువడం వల్ల; అధికసుభగాం = కడుసొబగైన; అర్ధనిద్రా + అనుషంగాం = సగం నిద్రచే సంబంధంకల; తవ = నీ యొక్క; నయనయోః = కన్నుల యొక్క; శోభాం = కాంతిని; నాభీపద్మే = పొక్కిలి తామరయందు, పశ్యంతు = చూతురుగాక.

తా। ఓ రంగనాథా! పర్యాయంగా అవకాశం పొందిన పాదుకాదేవి, లక్ష్మీదేవి సేవించిన నీ పాదాలను సేవించుగాక. ప్రాతఃకాలగోష్ఠికి యోగ్యులైన పరిచారకులు నీ సన్నిధికి చేరినవారై అర్ధవికాసంవల్ల అధికరమణీయమై, సగం నిద్రతో వర్తించే కన్నులకాంతిని నీ నాభికమలమందు చూతురుగాక.

వ్యాఖ్య :– శ్రీరంగనాథుని నయన రామణీయకతను శ్లాఘించే శ్లోకం.

అరుణోదయకాలమిది. రాత్రి స్వామి నిద్రిస్తున్నప్పుడు లక్ష్మీదేవి స్వామి చరణాలను సంవహనంచేస్తూ కమనీయంగా సేవిస్తుంది. తెల్లవారగనే స్వామి పాదసేవచేసే అవకాశం పాదుకాదేవికి కలుగుతుంది.

'స్వామీ! పడకనుంచి లేచి పాదుకలను ధరించండి' అని ప్రథమపాదం కీర్తించింది.

ప్రాతఃకాలాన ఓలగంలో అంతరంగిక కింకరులువచ్చి అద్దాన్ని, ఆవును, మంగళద్రవ్యాలను స్వామికి దర్శింప చేస్తారు. అప్పుడు ఆ పరిచారకులు శ్రీరంగనాథుని అరవిరిసిన నేత్రశోభను ఆనందంగా సేవిస్తారు.

భగవంతుడు నిద్రనుంచి మేల్కొని మెల్లగా కన్నులను తెరుస్తుంటే చూచే ఆనందానుభూతి గోదాదేవి మలోచనాలకు అందమైన ఆలోచనలను ఆవిష్కరింపచేసింది.

"కింకిణి వాయ్చ్చెయ్ద తామరైపూప్పోలే
శెంగణ్ శిఱిచ్చిరిదే ఎమ్మేల్ వీళి యాచో". (తిరుప్పావై)

చిన్నగజ్జె, నడుమ సన్నని గీతలాగా తెరచి ఉంటుంది. దానిలోపల గుండ్రని గులకరాయి జారిపడకుండా కంటికి కొద్దిగా కనబడుతుంటుంది. గజ్జెలోపల ఆ రాయి అటూ ఇటూ కదలుతుంటే కిణికిణి సవ్వడి అవుతుంది. భగవంతుడు నిద్ర పూర్తిగా తొలగక మెల్లగా కన్నులు తెరుస్తున్నప్పుడు, కనుగ్రుడ్లు కొద్దిగాకనబడుతూ, కింకిణిలా ఉంటాయి. కనురెప్పలు సగం తెరిచే సరికి, కన్నులు అరుణిమతో అరవిరిసిన తామరపూవులాగా కనబడుతాయి.

"చక్షుషీ చంద్ర సూర్యౌ" (శ్రుతి) **'చంద్ర సూర్యౌచనేత్రే'** (స్మృతి)

"తింగళుమాదిత్తియనుం ఎళుందార్పోల్" (తిరుప్పావై)

భగవంతుని నేత్రాలు సూర్యచంద్రులే. ఆయన నేత్రకాంతి తన నాభీకమలమందు ప్రసరిస్తుంది. అరవిరిసిన కన్నులు, రవిచంద్రులు ఏకకాలంలో ఉదయిస్తున్నట్లుంటాయి. రవికిరణ శోభచే వికసించడానికీ, చంద్రకిరణకాంతిచే సంకోచించడానికీ, భగవంతుని నాభీ పద్మం ప్రయత్నిస్తూ ఉంటుంది. తత్ఫలితంగా, కుట్మల కుసుమాల మధ్య దశను అనుభవిస్తూ, నాభీ పద్మం, భగవన్నేత్ర సౌందర్యానికి ప్రతీకయై దర్శనీయంగా ఉంటుంది.

పర్యాయోక్త్యలంకారం, నిదర్శనాలంకారం సంకీర్ణం. మందాక్రాంతావృత్తం.

244. ఉప నమతి ముహూర్తంశేష సిద్ధాంత సిద్ధం
తదిహచరణ రక్షా రంగనాథ! త్వయైషా ।
మృదుపద మధిరూఢా మంజుభిః శింజితైస్స్వై
రుపదిశతు జనానా ముత్సవారంభవార్తామ్ । -4.

అర్థం :- హే రంగనాథ = ఓ రంగనాయకా! శేష సిద్ధాంత సిద్ధం = ఆదిశేషుని చేత గర్గ ఋషికి ఉపదేశింపబడిన జ్యోతిశ్శాస్త్ర సిద్ధమైన; ముహూర్తం = శుభసమయం; ఉపనమతి = సమీపిస్తున్నది, తత్ = అందువల్ల; ఇహ = ఇప్పుడు, ఏషా = ఈ; చరణ రక్షా = పాదుక; త్వయా = నీచేత; మృదుపదం = మృదువైన చరణం, అధిరూఢా = అధిరోహింప జేయబడినదై ; మంజుభిః = ఇంపైన; స్వైః = స్వీయ; శింజితైః = భూషణధ్వనులచేత; జనానాం = ప్రజలకు; ఉత్సవ + ఆరంభవార్తాం = ఉత్సవం ప్రారంభమయ్యే సమాచారాన్ని; ఉపదిశతు = సూచించుగాక.

తా| ఓ రంగనాథా! ఆదిశేషుని సిద్ధాంతమందు తెల్పబడిన ముహూర్తం సమీపిస్తున్నది. కాబట్టి, ఇప్పుడు ఈ పాదుక నీచే మృదువైన పాదాలు మోపబడినదై తన మంజులమైన భూషణధ్వనులచేత లోకులకు ఉత్సవమారంభ మవుతున్న వృత్తాంతాన్ని తెలియజేయుగాక.

వ్యాఖ్య :– ఆస్థాన మంటపం నుంచి పాదుకలను ధరించి ఉత్సవం కోసం వాహనమంటపానికి వేంచేయ వలసిందని విన్నపం.

నిత్యోత్సవం, వారోత్సవం, పక్షోత్సవం, మాసోత్సవం, అయనోత్సవం, సంవత్సరోత్సవం, అని భగవదుత్సవాలు శ్రీరంగంలో విశేషంగా జరుగుతాయి. నిత్యోత్సవంలో ఉషఃకాలగోష్ఠిపూర్వ శ్లోకంలో వర్ణితం. ఉషఃకాలంలోనే సాత్త్విక కాలం, ఉద్యోగకాలమనీ వేళాభేద ముంటుంది. ఒక్కొక్క కార్యాన్ని నిర్వహించడం కోసం శుభసమయాన్ని తెలిపే శాస్త్రాన్ని జ్యోతిశ్శాస్త్రమంటారు. 'ముహూర్త' మంటే రెండు ఘడియలు – 48 నిమిషాలు.

జ్యోతిశ్శాస్త్ర సిద్ధాంతకర్త ఆదిశేషుడు. గర్గ మహర్షి ఆదిశేషుని వద్ద శుశ్రూషచేసి గ్రహ నక్షత్ర స్థితిగతులనూ, సంచార ఫలాలనూ తెలిపే జ్యోతిశ్శాస్త్రాన్ని అధ్యయనం చేశాడు. 'ఉషః ప్రశంసతేగర్గః' – అనే వాక్యాన్నిబట్టి గర్గర్షి ఉషఃకాలంలో వేళా విశేషాలనుప్రశంసించాడని తెలుస్తుంది.

"యమారాధ్య పురాణర్షిర్గర్గో జ్యోతీంషి తత్త్వతః |
జ్ఞాతవాన్ సకలం యచ్చ నిమిత్త పఠితం ఫలమ్" | – (విష్ణుపురాణం)

శ్రీరంగరాజు ఈ శుభకరమైన ఉద్యోగవేళలో తన సుకుమార చరణాలకు పాదుకలను ధరించి విలాసంగా వాహన మంటపం వరకు సంచరిస్తుంటే, మంజులమైన పాదుకామణిభూషణ నాదాలు జనులకు వీనుల విందుజేయగా, వారు ఉత్సవం ఆరంభమవుతున్నదని భక్తితో సేవించడానికి వస్తారు.

పాదుకాశింజితం జనులనాహ్వానించడం ఉత్ప్రేక్షాలంకారం. ఇది ప్రేయోఽలంకారంతో సంకీర్ణం. మాలినీ వృత్తం.

245. రంగాధీశ! మరుద్గణస్య మకుటాదామ్నాయబృందస్య వా
ప్రత్యానీయ సమర్పితా విధిముఖై ర్వారక్రమాదాగతైః |
వాహారోహణ సంభృతం శ్రమభరం సమ్యగ్వినేతుంక్షమా
లీలాసంచరణ ప్రియా స్పృశతుతే పాదాంబుజం పాదుకా || –5.

అర్థం :– హే రంగాధీశ = ఓ రంగరాజా! వారక్రమాత్ = వంతులరీతిగా, ఆగతైః = వచ్చిన; విధి ముఖైః = బ్రహ్మాదుల చేత; మరుత్ + గణస్య = దేవతల బృందం యొక్కగానీ; ఆమ్నాయబృంద స్యవా = వేద పురుషుల సమూహం యొక్క గానీ; మకుటాత్ = శిరస్సు నుంచి; ప్రత్యానీయ = తిరిగి తెచ్చి; సమర్పితా = సమర్పించబడిన; వాహ + ఆరోహణ,

సంభృతం = వాహన మెక్కి సంచరించడం చేతగలిగిన; శ్రమభరం = ఆయాసాతిశయాన్ని; సమ్యక్ = బాగుగా; వినేతుం = తొలగించడానికి; క్షమా = నేర్పుగల; లీలా సంచరణ, ప్రియా = విలాస గతిచే (నీకు) ఇష్టం గల; పాదుకా = పాదుకాదేవి; తే = నీ యొక్క; పాద + అంబుజం = చరణకమలాన్ని; స్పృశతు = స్పృశించు (ధరించు)గాక.

తా॥ ఓ రంగ ప్రభూ! వంతులరీతిగా వచ్చిన బ్రహ్మాద్యర్చకుల చేత దేవతాబృందం యొక్క, వేదమూర్తుల గణం యొక్క శిరస్సున ఉంచి తిరిగి సమర్పింపబడిన, వాహనారోహణం వల్ల కలిగిన బడలికను బాగా పోగొట్టే నేర్పు, ఓర్పు కలిగిన, విలాసగమనానికి నీకు ప్రియమైన పాదుకాదేవి నీ పాదకమలాలను స్పృశించుగాక.

వ్యాఖ్య :– వీథ్యుత్సవానంతరం ఆస్థాన మంటపానికి వేంచేసే సంగవకాల సూచక విజ్ఞాపన.

ప్రభాతకాలం దాటింది. అనేక వీథుల్లో వాహనం మీద సంచరించి వచ్చి వాహన మంటపం నుంచి శ్రీరంగ నాయకుడు సంగవకాలంలో ఆస్థాన మంటపంలోకి ప్రవేశిస్తాడు. కలియుగ వైకుంఠమే శ్రీరంగమందిరం కాబట్టి, బ్రహ్మ రుద్రాది దేవగణమూ, వేద పురుషబృందమూ ఉత్సవ సేవలో పాల్గొంటారు. వారు వంతుల ప్రకారం వచ్చి, భగవంతుణ్ని అర్చిస్తారు కాబట్టి భగవదనుగ్రహంగా పాదుక(ల)ను - శఠారిని - వారి శిరస్సులపైన సమర్పించి అర్చకులు తిరిగి భగవత్పాదాలకు అలంకరింపజేస్తారు.

బ్రహ్మ రుద్రాదులు చేసే ఉత్సవంలో శ్రీరంగనాథుడు గరుడవాహనుడై ఊర్ధ్వలోకాలకు వెళ్ళినప్పుడు, అక్కడ దేవతల తలల మీద శఠారిని ఆ ఉత్సవ ధర్మకర్త సమర్పించి తిరిగి దేవదేవునిపాదపద్మాలకు అలకంరింపజేస్తాడన్న అర్థం, 'మరుద్గణస్య మకుటాద్వా' రచనవల్ల ప్రతీయమానమవుతుంది.

మానవార్చకులు చేసే ఉత్సవంలో - స్వామి ఊరేగింపులో సేవకు ముందు, వెనుక ద్రావిడ, సంస్కృత వేదపారాయణంచేసే వ్యక్తులకు, వాహన మంటపంలోకి స్వామి వేంచేసిన తరువాత వేదవిద్యా గౌరవార్థం, వారి శిరఃప్రదేశాన శ్రీ శఠారిసమర్పణ పూర్వకమైన భగవదనుగ్రహ విధానాన్ని కల్పించి, అర్చకులు తిరిగి స్వామి చరణకమలాలకు పాదుకలను సమర్పిస్తారన్న అర్థం 'ఆమ్నాయ బృందస్య మకుటాద్వా' రచనవల్ల తెలుస్తుంది.

'ముఱై యా ల్వణంగ' అనే తిరుమంగై యాళ్వారు సూక్తి ప్రకారం, నియమంతో ఒకరి తర్వాత మరొకరు వచ్చి స్వామిని సేవించే భక్తుల తలలమీద క్రమంగా శఠారిని సమర్పించి, మళ్ళీ భగవత్పాదారవిందాలకు పాదుకలను అలంక రింపజేయడం ఆచారమని విశదమవుతుంది.

శ్రీరంగభూపతి గరుడాది వాహనాల మీద శీఘ్రంగా పయనించడం వల్ల, కుదుపుల వల్ల కలిగిన శరీరాయాసాన్ని పాదుకాదేవి తన విలాసగమనంతో పూర్తిగా నివారింపజేస్తుంది. కాబట్టి స్వామి ఇష్టపడి పాదుకలను ధరించే సంగవకాలమిది.

"దినాదౌ ప్రాహ్ణపూర్వా హ్ణౌతతః సంగత సంగవౌ" - (వైజయంతి)

ప్రయాణం చేసి వచ్చిన పతి, శ్రమనివారకంగా ప్రేమతో పాదసంవహనం చేసే భాగ్యాన్ని సతికి కల్పించే వ్యంజన వల్ల, ఇది సమాసోక్త్యలంకారం.

శార్దూల విక్రీడిత వృత్తం.

246. వృత్తం క్రమేణ బహుధా నియుతం విధీనా
మర్ధం ద్వితీయ మిద మంకురితం తవాహ్నః।
నీళాసఖీభిరుపనీయ నివేశ్యమానా
మంక్తుం ప్రభో! త్వరయతే మణిపాదుకా త్వామ్ । –6.

అర్థం :– హే ప్రభో = ఓ ప్రభూ! విధీనాం = చతుర్ముఖుల యొక్క; నియుతం = లక్ష సంఖ్య; క్రమేణ = వరుసగా; బహుధా = అనేక విధంగా; వృత్తం = గడిచింది. తవ = నీ యొక్క; అహ్నః = దినం యొక్క; ద్వితీయం = రెండవ; అర్థం = సగం; ఇదం = ఇదో; అంకురితం = ఆరంభమయింది. నీళాసఖీభిః = నీళాదేవివెచ్చెలులచే; ఉపనీయ = తీసుక వచ్చి; నివేశ్యమానా = సమీపాన సమర్పింపబడుతున్న; మణిపాదుకా = రత్నపాదుకాదేవి; త్వాం = నిన్ను; మంక్తుం = స్నానానికి; త్వరయతే = తొందరపెడుతున్నది.

తా। ఓ రంగప్రభూ! బ్రహ్మల సంఖ్య లక్షక్రమంగా బహువిధంగా గడిచింది. నీ దినమానానికి అహస్సులో రెండవ భాగమారంభమయింది. నీళాదేవి సకియలు తెచ్చి నీ సన్నిధిలో సమర్పిస్తున్న మణిపాదుక నిన్ను స్నానానికి త్వరపెడుతున్నది.

వ్యాఖ్య :– శ్రీరంగనాథుని మధ్యాహ్నకాలసేవను వర్ణించే శ్లోకం.

ఉదయం నుంచి అనేక ఉపచారాలు (విధులు) జరిగినాయి. ఇప్పుడు మధ్యాహ్నకాలం దాటి అపరాహ్ణం ఆరంభమవుతున్నది. అహః ప్రమాణాన్ని ప్రాహ్ణం, పరాహ్ణం అని రెండు భాగాలుగా లెక్కిస్తారు. ఇది సామాన్యంగా ప్రథమ పాదార్థం. ద్వితీయపాదార్థాన్నిబట్టి విశేషార్థం వివరింపబడింది.

'చతుర్యుగ సహస్రాద్వౌ బ్రహ్మకల్పస్తు తౌన్నణామ్' – (అమరం)

మానవుల కాలమానప్రకారం చతుర్యుగాలు ఒక్క వేయిసార్లు తిరిగితే చతుర్ముఖబ్రహ్మకు పగలు, మరొక్క వేయిసార్లు తిరిగితే రాత్రి అవుతుంది. బ్రహ్మకున్న అహోరాత్రాల లెక్కయే ఇలా ఉంటే, బ్రహ్మను కన్నతండ్రి – భగవంతుని– కి దినమానం ఎంత ఉంటుందో? అది అనంతం. **'నతత్ర సూర్యోభాతి, న చంద్రతారకం'** (శ్రుతి) వైకుంఠంలో రవి చంద్రతారకల ప్రకాశమే లేనప్పుడు, కాలమానమెలా సాధ్యం?

'నాహస్తస్య నవిశానిత్యస్య పరమాత్మనః' - అన్నట్లు శాశ్వతంగా ఉండే పరమాత్మునికి పగలు లేదు, రాత్రి లేదు. అయినా, అర్చించే వారు - ప్రకృతి మండలవాసులైన బ్రహ్మాదులు - కాలానికి కట్టుబడినవారే కదా! వారి భావంతో కాలాన్ని లెక్కించడం సంబంధాతిశయోక్త్యలంకారం. (అయుతం = పదివేలు. నియుతం = నూరువేలు).

'తవాహ్నః' - అహః ప్రమాణంలో సగంకాలం భగవంతునికి ఉపచారాలతోనే గడిచింది. ఈ ప్రాహ్ణంలోనే లక్షల కొద్దిచతుర్ముఖ బ్రహ్మలు పుట్టారు, గిట్టారు. ఇక ద్వితీయార్థం ఆరంభమయింది.

ఈ సమయంలో శ్రీరంగపతికి తిరుమంజనోత్సవం జరుగుతుంది. శ్రీదేవి, భూదేవి ఆస్థానంలో ప్రభువు కిరుప్రక్కల ఆసీనలైనందున అంతఃపురకార్యాలను నీళాదేవి నిర్వహిస్తుంది. నీళ చెలికత్తెలు తెచ్చి సమర్పించిన పాదుకలను స్వామి ధరించి ఆస్థానమంటపం నుంచి తిరుమంజన మంటపంలోకి త్వరగా ప్రవేశించే సమయమయిందని ప్రార్థన. పాదుకాదేవి త్వరపెట్టడం, హేతూత్ప్రేక్ష. వసంతతిలకా వృత్తం.

247. దివ్యాప్సరోభి రుపదర్శిత దీపవర్గే
రంగాధిరాజ! సుభగే రజనీ ముఖేఽస్మిన్ ।
సంరక్షిణీ చరణయోస్స విలాస వృత్తి
ర్నీరాజనాసన మసౌ నయతు స్వయం త్వామ్ । -7.

అర్థం :- హే రంగ + అధిరాజ = ఓ శ్రీరంగేశ్వరా! దివ్య + అప్సరోభిః = అప్రాకృతలైన అప్సరలచే; ఉపదర్శిత దీపవర్గే = దగ్గరగా ఎత్తిచూపబడే దీపాల పంక్తిగల; సుభగే = మనోజ్ఞమైన; అస్మిన్ = ఈ (రవి అస్తమించే); రజనీముఖే = సాయంకాలమందు, అసౌ = ఈ; (ఎదుటనున్న); చరణయోః = పాదాలయొక్క; సంరక్షిణీ = రక్షకురాలైన పాదుకాదేవి; స విలాసవృత్తిః = లీలతో కూడిన నడకకలదై ; త్వాం = నిన్ను; స్వయం = తానే; నీరాజన + ఆసనం = ఆరతిని ఇచ్చే మంటపంలోని పీఠానికి; నయతు = తీసికొనిపోవుగాక.

తా। ఓ శ్రీరంగరాజా! దివ్యాప్సరలచే దీపసముదాయం ఉపచారంగా ఎత్తిచూపబడే మనోజ్ఞమైన ఈ ప్రదోషకాలంలో పాదాలను చక్కగా కాపాడే ఈ పాదుకాదేవి, విలాసగమనంతో తానే నిన్ను నీరాజన పీఠమున్న మంటపంలోకి తీసుకపోతుంది.

వ్యాఖ్య :- శ్రీ రంగనాథుని ప్రదోషకాల సేవ వర్ణితం.

అది మలి సంజ. దీపారాధన సమయం. అప్రాకృత శరీరలైన అప్సరలు స్వయంగా తేజోమూర్తులు. స్వామి సన్నిధిలో అచ్చరలేమలు నాలుగేసి అంతస్థులుగానున్న చెమ్మెల్లో గుండ్రంగా అనేక దీపాలను వెలిగించి, అన్నివైపులా బారులుదీరి నిలిచి, తమ చేతుల్లో పట్టుకున్న మంగళ దీప సముదాయాలతో ఉపచారంగా చేసే నీరాజనోత్సవం నేత్ర పర్వంగా ఉంటుంది.

పాదుకాదేవి సహజంగా అతిలోకసుందరి. ఆమె నడకల రాజహంస. స్వామి పాదాలకు ఏదోషమంటకుండా పాదుకాదేవి, ఒయ్యారి నడకతో రాజలాంచనంగానీరాజనోత్సవం జరిగే 'తిరువందిక్కాప్పు' మంటపంలోకి తీసుకొనిపోయి పీఠం మీద సముచితంగాస్వామిని ఆసీనుణ్ని చేస్తుంది.

స్వామి తిరువందిక్కాప్పు మంటపానికి ఊరేగుతూ వస్తుంటే, ప్రతి వీథిచివర సుమంగళులు స్వామికి మంగళారతులనర్పించే దృశ్యం అతిరమణీయం. వీథ్యుత్సవంతో స్వామి దక్షిణ ద్వారం చేరుకొని తిరువందిక్కాప్పు మంటపానికి వేంచేస్తాడు.

రత్నపీఠమందు ఆసీనుడైన స్వామికి నీరాజనాలు సమర్పిస్తుంటే, కర్పూర ఆరతులు వెలుగుతూ పరిమళాలను గుభాళిస్తున్నాయి. దివ్యమంగళ విగ్రహ సౌందర్యం, అంగాంగం ప్రత్యేకంగానూ అపృథక్కుగానూ, దర్శనీయమై చూపరుల హృదయాన్ని కర్పూరగుళికలాగాకరిగించి స్వామికి అర్పింపజేస్తుంది. '**ప్రదోషోరజనీ ముఖం**' (అమరం).

"**అందియంబోదిదువాకు మళకనే – కాప్పిడవారాయ్**" (పెరియాళ్వార్ తిరుమొళి) శ్రీ విష్ణుచిత్తుడు తనను యశోదామాతృమూర్తిగా భావించుకొని శ్రీకృష్ణునితో "సాయంకాలమయింది. ఇంట్లోకి వచ్చి ఆరతిగై కొనవయ్యా" – అని, దృష్టి దోషనివారణార్థం రక్షాదీక్ష వ్యాజంతో మంగళాశాసనం చేశాడు.

'శ్రీరంగరాజ చరితం' అనే బాణ కావ్యంలో ఒక మహాకవి నీరాజనాన్ని గూర్చి రచించిన శ్లోకం అనుసంధేయం.

"ఉద్యన్మర్దల తాళకాహళరవై రుద్దామవందిస్తవైః
నీ రంధ్రాంజలి సంపుటాంచితకరా న్నీరాజనం పశ్యతః ।
చంచ చ్చామర మధ్యగస్య భవత శ్ఛత్రశ్రియా సంవృతం
వక్త్రాంభోజ ముదారహాస మసకృ ద్దృష్ట్వాఽప్యతృప్తా సుతా" ।

దేశికులు వసంతతిలకా వృత్తంలో (దేవాంగనల దీపవర్గ ప్రదర్శనం, పాదుకా లీలాగమనం) కల్పించిన అక్షర నీరాజన చిత్రం అత్యద్భుతం.

ఒక సాధ్వీమణి భర్తను నీరాజనార్థం పీటమీద కూర్చుండపెడుతున్న భావమభివ్యక్తమైనందున, ఇది సమాసోక్త్యలంకారం.

248. ఆస నాదుచిత మాసనాంతరం
రంగనాథ! యదిగంతు మీహసే।
సంనతేన విధినా సమర్పితాం
స ప్రసాద మధిరోహపాదుకామ్ । –8.

అర్థం :– హే రంగనాథ = ఓ రంగేశ్వరా! ఆసనాత్ = ఆసనం నుంచి; ఉచితం = యుక్తమైన; ఆసన + అంతరం = మరొక ఆసనానికి; గంతుం = పోవడానికి; ఈహసే, యది = కోరుతున్నట్లైతే; సంనతేన = మిక్కిలి నమ్రుడైన; విధినా = చతుర్ముఖుని చేత; సమర్పితాం = సమర్పించబడిన; పాదుకాం = పాదుక(ల)ను; సప్రసాదం = కృపతో; అధిరోహ = అధిరోహించుము.

తా॥ శ్రీరంగప్రభూ! ఒక ఆసనం నుంచి తగిన మరొక ఆసనం మీదికి వేంచేయదలచుకుంటే, నమ్రుడైన బ్రహ్మ సమర్పించిన పాదుకలను పరమకృపతో అధిరోహించుము.

వ్యాఖ్య :– ప్రతి ఆసనమంటపానికి పాదుకలను ధరించి వేంచేయాలని ప్రార్థన.

సాయంతనానంతరం శ్రీరంగప్రభువు స్నానాలంకారాది నానా విధాసనాలను ఉత్తరోత్తరంగా అధిష్ఠించడానికి పోదలచనూవచ్చు. అయితే, నలువస్వామిని ఆరాధించి, వినీతుడై సమర్పించిన పాదుకలను స్వామి పరమకృపతో ధరించి, తనకు ఇష్టమైన ఆసనాన్ని అలంకరించవలెనని విజ్ఞాపన.

ప్రేయోఽలంకారం. రథోద్ధతా వృత్తం.

249. పరిజన వనితాభిః ప్రేషితః ప్రాంజలిస్త్వాం
ప్రణమతి మదనోఽయం దేవ! శుద్ధాంతదాసః ।
ఫణిపతి శయనీయం ప్రాపయిత్రీ సలీలం
పదకమల మియం తేపాదుకా పర్యుపాస్తామ్ । –9.

అర్థం :– హే దేవ = ఓ క్రీడాపరాయణా! పరిజన వనితాభిః = పరిచారిక స్త్రీలచే; ప్రేషితః = పంపబడిన; శుద్ధాంతదాసః = అంతఃపుర సేవకుడైన; అయం = ఈ; మదనః = మన్మథుడు; ప్రాంజలిః = అంజలిబద్ధుడై ; త్వాం = నీకు; ప్రణమతి = నమస్కరిస్తున్నాడు. ఫణిపతి శయనీయం = శేషశయ్యకు; ప్రాపయిత్రీ = చేర్చే; ఇయం = ఈ; పాదుకా = పాదుకాదేవి; తే = నీయొక్క; పదకమలం = చరణ సరోజాన్ని; పరి + ఉప + ఆస్తాం = ఉపాసించుగాక.

తా॥ ఓ దేవా! శుద్ధాంత పరిచారికలచే ప్రేరితుడై అంతఃపుర దాసుడైన ఈ మన్మథుడు కేల్మోడ్చి నీకు నమస్కరిస్తున్నాడు. శేషతల్పానికి ఉల్లాసంగా చేర్చే ఈ పాదుక నీ పాదకమలాన్ని భజించుగాక.

వ్యాఖ్యః– శేష పర్యంకాసన మలంకరించుమనే మన్మథుని ప్రార్థనను, పాదుకలను ధరించి మన్నించాలని విన్నపం.

శృంగారం రాజ్యమేలే కాలమిది. అలరులవిల్కాడు అనన్యజుడై అంతటా చెలరేగుతాడు కానీ, అంతఃపురంలో మాత్రం కింకరుడు. దేవేరుల అభిప్రాయమెరిగిన చెలికత్తెలు మదనుణ్ణి స్వామి సన్నిధికి పంపించారు. వీరు ఏ దేవి పరిచారికలో శ్లోకం వివరించ(డం) లేదు. ఆరవ శ్లోక ప్రకారం నీళాదేవి పరిచారికలని గమనీయం. "దేవ్యస్సహస్రం తథా" – అన్నట్లు భూనీళా ద్యచ్యుతవల్లభలందరూ శ్రీదేవికి అవయవభూతలే.

ప్రాకృత పురుషులవలె పచ్చ విల్తుని తండ్రి శ్రీరంగనాథుడు కామవశ్యుడు కాలేడు. అతడు సాక్షాన్మన్మథ మన్మథుడు. కాబట్టి, మదనుడు స్వామికి దోసిలొగ్గి, నమస్కరించి, దేవేరులతో సహ శేషపర్యంకాసన ప్రాప్తికి సమయమాసన్నమయిందని విన్నవిస్తున్నాడు. మన్మథుని ప్రార్థన, పాదుకాసేవను ప్రభువు అంగీకరిస్తేగాని నెరవేరదు. పాదుకాదేవి రంగనాథుని అడుగులకు మడుగులొత్తుతూ కార్యభారంవల్ల కలిగిన బడలికను సడలించే ఒయ్యారపు నడకతో సెజ్జకు చేర్చే ఒజ్జబంతి. కాబట్టి ప్రభువు పాదుకలను ధరించాలని వందివైతాళికులు స్తుతించారు. పర్యాయోక్త్యలంకారం. మాలినీ వృత్తం.

250. ఇతి నిగమ వందివచసా సమయేసమయే గృహీత సంకేతః ।
అభిసరతి రంగనాథః ప్రతిపదభోగాయ పాదుకే! భవతీమ్ । – 10.

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకాదేవీ! రంగనాథః = శ్రీరంగనాథుడు; ఇతి = ఈ విధంగా; నిగమ వంది వచసా = వేదాలనే వందివైతాళికుల విన్నపంచేత; సమయే సమయే = ప్రతి సమయంలో; గృహీత సంకేతః = గ్రహింపబడిన సూచనకలవాడై; ప్రతిపద భోగాయ = అడుగడుగున/క్షణక్షణం సుఖ మనుభవించడం కోసం; భవతీం = నిన్ను; అభిసరతి = చేరుకుంటాడు.

తా। ఓ పాదుకాదేవీ! శ్రీరంగనాథుడు ఇలా వేదాలనే వంది వైతాళికుల విజ్ఞప్తిచే ఆయా వేళల్లో సూచనను గ్రహించినవాడై, పదే పదే సుఖానుభవం కోసం నీవున్నచోటికి తానే వస్తాడు.

వ్యాఖ్య :– శ్రీ రంగనాథునికి పాదుకాదేవియే ప్రియతమ నాయికగా కవిస్తుతి.

ఈ పద్ధతిలో రెండు – ఆద్యంత – శ్లోకాలే పాదుకను సంబోధించాయి. మధ్యనున్న ఎనిమిది శ్లోకాలచే శ్రీరంగనాథుడు సంబోధితుడయ్యాడు.

వంది వైతాళికులు ఆస్థానంలో ప్రతి సమయాన విన్నవించిన సూచనను పాటిస్తూ కర్తవ్య నిర్వహణార్థం, ఒక మంటపం నుంచి వేరొక మంటపానికి; ఇలా క్రమంగా అనేక మంటపాలకు పోదలచినప్పుడు శ్రీరంగరాజు పాదుకలను ధరించి స్థానచలనం చేయడం నిత్యవ్యవహారం.

సంకేతస్థలం, ఎట్టిదయినా, ఎక్కడున్నా ప్రభువు యొక్క ప్రత్యంఘ్రి పాదుకాజన్య సుఖాన్ని ప్రతిక్షణం అనుభవిస్తుంటుంది. కాబట్టి శ్రీరంగనాథుడు, స్థానపరివర్తన సమయాల్లో పాదుకా సాహచర్యం కోరుతూ, తానే ఆమె ఉన్న చోటికి చేరుకుంటాడు.

"నిగమ వంది వచసా" – 'అంజిరైయ మడనారాయ్' మొదలుకొని, శ్రీ పరాంకుశనాయకి యొక్క దూతల వార్తలు విని, ఆమెతో తర్వాతి పద్ధతిలో చెప్పబోయే రీతిగా, సర్వేశ్వరుడు సంశ్లేషించడానికి వచ్చే సంగతి సూచితం.

సంకేతస్థలానికి నాయకుని అభిసరణమూ, తద్వారా పాదుకాప్రేయసీ భావమూ ధ్వనించడంవల్ల, సమాసోక్త్యలంకారం. ఆర్యావృత్తం.

వైతాళిక పద్ధతి సమాప్తం.

10. శృంగార పద్ధతి

251. శౌరేః శృంగార చేష్టానాం ప్రసూతిం పాదుకాం భజే।
యామేషభుంక్తే శుద్ధాంతా త్పూర్వం పశ్చా దపిప్రభుః । -1.

అర్థం :- శౌరేః = శ్రీరంగనాయకుని యొక్క; శృంగార చేష్టానాం= సింగారపు చేష్టలకు, ప్రసూతిం = కారణభూతయైన; యాం = ఏ దేవిని; ఏషః = ఈ; ప్రభుః = సర్వసమర్థుడు; శుద్ధాంతాత్= అంతఃపురంకంటె; పూర్వం = మొదట; పశ్చాత్, అపి = తర్వాతనూ; భుంక్తే = అనుభవిస్తాడో; (తాం = అట్టి;) పాదుకాం = పాదుకాదేవిని; భజే = సేవిస్తాను.

తా॥ శ్రీరంగనాయకునికి శృంగారభావాలనుకలిగించే ఏ వల్లభను అంతఃపుర భోగంకంటె ముందు, తర్వాతనూ ఈ ప్రభువు అనుభవిస్తాడో, ఆ పాదుకాదేవిని భజిస్తాను.

వ్యాఖ్య :- శ్రీరంగనాథుడు అంతఃపురగమనా గమన సమయంలో పాదుకలను ధరించి సంచరించే వర్ణన.

ఈ పద్ధతిలో పాదుకా శ్రీరంగేశుల హృద్యవ్యాపారాలను దాంపత్య శృంగారంగా కవి స్తుతిస్తున్నాడు. మన్మథుని ప్రార్థనచేత పాదుకలను ధరించి అంతఃపురంలో ప్రవేశించిన ప్రభువు వంతులరీతిగా దేవేరులతో పరస్పరంగా శృంగారభోగవిలాస చేష్టలను అనుభవించడం సాధారణ విషయం. **"శృంగార చేష్టావివిధాబభూవుః".** మహాకవి అన్నట్లు విభావానుభావ సంచార భావాది విలాసాలు అనేకం కదా!

స్వీయ, స్వాధీన పతిక అని రెండు రకాల నాయికలలో **'తత్రస్వీయాచరిగ్రహాత్'** అనే లక్షణం వల్ల, కట్టుకున్నది స్వీయ నాయిక.

"స్నేహాత్ ప్రియా వినాభూతా స్వాధీన పతికామతా". ప్రేమతో ప్రియుణ్ణి విడనాడక పట్టుకొని తిరుగడం స్వాధీన పతిక లక్షణం.తన దర్శన స్పర్శలతో కలిగించే విలాసగతికి అనుగుణంగా తాళాయమాన మంజునాదాలతో నాయకుణ్ణి శృంగారకేళీ విలాసాలకుపురికొల్పే పాదుకాదేవితో, అంతఃపురంలో వంతుల ప్రకారం అనుభవించే పట్టంపు రాణుల భోగానికి పూర్వోత్తరకాలాల్లోనూ, అన్యోన్యసౌఖ్యాన్ని అనుభవించడం అసాధారణం. (ప్రభుః) సమర్థుడైన నాయకునికే తగును కదా!

శృంగంలాగా చొచ్చుకపోయే లక్షణలక్షితుడైనశౌరి, రాణులందరిపట్ల హెచ్చుతగ్గులు లేని మక్కువతో ఒక్కరీతిగా ప్రవర్తించే 'దక్షిణ నాయకుడు'. **'తుల్యోఽనేకత్ర దక్షిణః'** అని కదా లక్షణం. పాదుకారంగపతుల వాల్లభ్యం అన్యోన్య రతిజన్య విలాసాలతో కూడింది. కాబట్టి ఇది సంభోగ శృంగారం.,

"అనుకూలౌ విషేవేతే యత్రాన్యోన్యం విలాసినౌ ।
దర్శన స్పర్శనాదిని స సంభోగ ఉదాహృతః" ।

సమాసోక్త్యలంకారం, అనుష్టుబ్ఛందం.

252. ప్రణత త్రిదశేంద్ర మౌళి మాలా
మకరందార్ద్ర పరాగ పంకిలేన ।
అనులింపతి పాదుకే! స్వయంత్వా
మనురూపేణ పదేన రంగనాథః ॥ –2.

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకాదేవీ! రంగనాథః = శ్రీరంగనాథుడు, ప్రణత – పంకిలేన। ప్రణత = నమస్కరించిన; త్రిదశ + ఇంద్ర = దేవలోకనాయకుల యొక్క; మౌళి = తలలయందలి; మాలా = పూలహారాల యొక్క; మకరంద = పూదేనెయందు; ఆర్ద్ర = తడిసిన; పరాగ = పుప్పొడిచేత; పంకిలేన = అంటియున్న; అనురూపేణ = తగిన; పదేన = చరణంచేత/ప్రయత్నంచేత; త్వాం = నీకు; స్వయం = తానే; అనులింపతి = పూస్తాడు.

తా। ఓ పాదుకాదేవీ! శ్రీరంగనాథుడు నమస్కరించిన బ్రహ్మాదిదేవతల తలలపైని పూలమాలికల్లోని మకరందంచే తడిసిన పూలధూళితో పంకిలమైన యోగ్యంగా లేపనం చేసే పాదాలచేత/ప్రేమతో నీకు తానే పూస్తాడు.

వ్యాఖ్య :– శ్రీరంగనాథుడు పాదుకాదేవికి చందన లేపనం చేసే వర్ణన.

శృంగార చేష్టల్లో చందన చర్చ ముఖ్యమయింది. గంధం ఉద్దీపక వస్తువు. భోగ్యపదార్థం. దేవలోకంలోని బ్రహ్మాది దేవతలు తమ తలల మీద కమ్మని పూల మాలికలనుధరిస్తారు, దేవదేవుని పాదాలమీద తలను ఆనించి నమస్కరిస్తుంటారు. పాదాలమీద పూలధూళిరాలింది. పూదేనె కురిసింది. పూలధూళి, పూదేనె రెండు ఒండొంటితో కలిసి పంకిలమైంది స్వామి పాదయుగళం. పంకం కలది పంకిలం కదా! పాదాలచే పాదుకలు ధరింపబడినప్పుడు తడిసిన పుప్పొడి వాటికి విశేషంగా అంటుకుంది.

"ఏకాయత్తోఽనుకూలః స్యాత్" అనే లక్షణం వల్ల, అనుకూలనాయకుడు స్వీయనాయికకు ప్రేమతో చందన లేపనం చేసినట్లు వర్ణించడం, స్వరూపోత్ప్రేక్ష. చందనం చేతులతో పూయతగింది. పాదుకలకు కుడి, ఎడమ పాదాలే గంధం పూయడం అనురూపం. ఇది సమాలంకార లక్షణం ఔపచ్ఛందసికం.

253. అవదాత హిమాంశుకానుషక్తం
పదరక్షే! త్వయిరంగిణః కదాచిత్ ।
కిమ పి స్థిత మద్వితీయ మాల్యం
విరళావస్థిత మౌక్తికం స్మరామి ॥ –3.

అర్థం :— హే పదరక్షే = ఓ పాదుకాదేవీ! కదా చిత్ = ఒకానొక సమయాన (స్నానమప్పుడు) అవదాత – షక్తం/అవదాత = తెల్లని; హిమ = చల్లని; అంశుక = వస్త్రంతో (గ్రీష్మర్తువులో శైత్యోపచారం కోసం పన్నీట తడిపిన వస్త్రంతో) అనుషక్తం = కూడిన; విరళ + అవస్థిత, మౌక్తికం = దూర దూరంగా ఉన్న ముత్యాలుగల; అద్వితీయమాల్యం = రెండవ మాలికలేని; త్వయి = నీయందు; రంగిణః = శ్రీరంగపతి యొక్క; కిం, అపి, స్థితం = అనిర్వాచ్యమైన ఉనికిని; స్మరామి = తలుస్తాను.

తా। ఓ పాదుకాదేవీ! ఒకప్పుడు తెల్లని చల్లని వస్త్రంతో కూడిన, ఒండొంటితో కలియక విరళంగా ఉన్న ముత్యాలుగల ఒకే ఒక మాలిక కలిగిన, నీయందు అనిరాచ్యమైన శ్రీరంగపతి నిలకడను స్మరిస్తున్నాను.

వ్యాఖ్య :— శ్రీ రంగపతి, పాదుకాదేవి మీద నిల్చిన స్నిగ్ధముగ్ధ స్థితి వర్ణన.

పాదుకా శ్రీరంగపతుల సంగమస్థితిని ఈ శ్లోకం వివరిస్తున్నది. మూర్తి మీద తెల్లని, చల్లని వస్త్రముంది. సంభోగానురూపమైన వేషం ఇది. వేసవిలో తాపోపశమనార్థం పన్నీట తడిపిన చల్లని తెల్లని వస్త్రాన్ని ధరించడం స్మారితం. ఒకే ఒక ముత్యాల మాలిక శరీరం మీద ధరింపబడింది. ఇది అక్కడక్కడ పొటమరించిన చెమటబొట్లని లక్షణార్థం. **'కదాచిత్, కిమపి'** అనడంవల్ల రతిప్రతీయమానమవుతుంది. ఈ మంజుల మోహన ముగ్ధస్థితి దర్శించవలసిందే కాని, వర్ణింపనలవికానిది.

'కిమివహి మధురాణాం మండనం నాకృతీనామ్' – రమణీయాకృతులకు అలంకారంగా ఉండని వస్తువులేదు' అన్నాడు కాళిదాసు.

వస్త్రభూషణ మాల్యాదులను స్వల్పంగా ధరించిన దివ్యమంగళమూర్తి శృంగార విలాసం 'విచ్ఛిత్తి' యే కదా!

"రమ్యాణామప్యలం కారకుసుమాలేపవాససాం।
అనాదరేణ స్వల్పానాంన్యాసో విచ్ఛిత్తి రిష్యతే। అని లక్షణం.

ప్రేయోఽలంకారం, ఔపచ్ఛందసికం.

254. అసహాయ గృహీత రంగనాథా
మవరోధాంగణసీమ్ని పాదుకే! త్వామ్।
సుదృశః స్వయ మర్చయంతి దూరా
దవతం సోత్పల వాసితై రపాంగైః। –4.

అర్థం :— హే పాదుకే = ఓ పాదుకాదేవీ! అసహాయ, గృహీత, రంగనాథాం = ఒంటరిగా గ్రహింపబడిన శ్రీరంగనాథుడు గల; త్వాం = నిన్ను; అవరోధ + అంగణసీమ్ని = అంతఃపురప్రాంగణ స్థలమందు; సుదృశః = సులోచనలైన దేవేరులు;

అవతంస + ఉత్పల, వాసితైః = చెవులకు అలంకరింపబడిన, నల్లకలువపూలచే వాసనగొల్పే; అపాంగైః = క్రీగంటి చూపులచేత; దూరాత్ = దూరం నుంచి; స్వయం = తామే; అర్చయంతి = అర్చిస్తుంటారు.

తా|| ఓ పాదుకాదేవీ! అంతఃపుర ప్రాంగణ ప్రదేశమందు శ్రీరంగనాథుణ్ని ఒంటరిగా తీసుకవచ్చిన నిన్ను, మహిషీమణులు కర్ణభూషితాలైన నల్లకలువలచే సుగంధితాలైన కడగంటిచూపులచే దూరం నుంచి స్వయంగా సమ్మానిస్తుంటారు.

వ్యాఖ్యః- భాగధేయ అయిన పాదుకాదేవిని దేవేరులు సమ్మానించే వర్ణన.

శ్రీరంగ ప్రభువు పాదుకా ద్వితీయుడై అంతఃపురంలోని ముంగిట్లోకి ప్రవేశించాడు. శ్రీ భూనీళాదులు 'స్వామిని వాల్లభ్యంతో నిత్యాసక్తుని గావించి, గుత్తాధిపత్యం వహించి ఏకాంతంగా అనుభవించేకాంత కదా! వాస్తవంగా పాదుకాదేవి చాలా సౌభాగ్యవతి' అని ఈసు కాసంతైనా కనబడని కడగంటి చూపులతో గౌరవించారు.

'నీలోత్పలాని నారీణాం నయనానీవ రేజిరే' సాధారణంగానారీమణుల నయనాలు నల్లకలువల్లాగా శోభిస్తాయి. అంతఃపురకాంతలకు చెరపకు చేరెడేసి కళ్ళున్నాయి. చెవులకు నల్లని కలువలను భూషణంగా ధరించారు కాబట్టి వారి నేత్రాంచలాలు కమ్మని కలువపూల వాసనను పులుముకున్నాయి. ఉమ్మడిగా అనుభవించతగిన వాడని భావించి, శ్రీరంగపతిని అంతఃపురానికి తీసుకువస్తున్నదని శ్రీ దేవ్యాదులు పాదుకాదేవిని కటాక్షిస్తూ, కృతజ్ఞతతో సమ్మానించారు. చూపులను అర్చించే పూవులుగా సంభావించడం ఉత్ప్రేక్ష. సుదృశః సాభిప్రాయం కాబట్టి పరికరాలంకారం. ఔపచ్ఛందసికం.

255. ని ర్విశ్య మానమపి నూతన సన్నివేశం
కైవల్య కల్పిత విభూషణ కాయకాంతిమ్।
కాలేషు నిర్విశసి రంగయువానమేకా
శృంగార నిత్యరసికం మణిపాదరక్షే ॥ –5.

అర్థం :– హే మణిపాదరక్షే = ఓ రత్నపాదుకా! నిర్విశ్యమానం, అపి = అనుభవిస్తున్నప్పటికీ; నూతన సన్నివేశం = కొత్తదనం కలిగించే దివ్యావయవ సౌష్ఠవంగల; కైవల్య-కాంతిం । కైవల్య = కేవలం భూషణాలు లేకున్నా; కల్పిత విభూషణ = భూషణాలున్నట్లు కల్పింపబడిన; కాయ, కాంతిం = శరీర శోభగల; శృంగార నిత్యరసికం = శృంగార రసమందు ఎల్లప్పుడు రుచి మరిగిన; రంగయువానం = రంగవిమానమందున్న పడుచువాణ్ని; ఏకా = ఒక్కతెవే; కాలేషు = ఏకాంత సమయాల్లోనూ, రతి సుఖసమయాల్లోనూ; నిర్విశసి = అనుభవిస్తుంటావు.

తా|| ఓ మణిపాదుకా! నీవు అనుభవిస్తున్న కొత్త సన్నివేశంగల, నగలు లేకున్నా నగలు పెట్టుకున్నట్లు శరీర శోభకలిగిన, శృంగార భోగాలపట్ల నిత్యాసక్తుడైన శ్రీరంగయువకుణ్ని సర్వకాలాల్లోనూ ఒక్కదానవే అనుభవిస్తుంటావు.

వ్యాఖ్య :– పాదుకాదేవి రంగపతిని అనన్యార్హునిగా అనుభవించే వర్ణన.

సర్వేశ్వరుని స్వరూప రూపగుణానుభవ వైభవం నిత్యనూతనం.

"క్షణే క్షణే యన్నవతాముపైతి, తదేవరూపం రమణీయతాయాః" - చూచినాకొద్దీ చూడబుద్ధి పుట్టేలాగా, ప్రతిక్షణం కొత్తదనం గోచరించడమే సౌందర్య రూపలక్షణం, అన్నాడు మాఘకవి.

"అనవధిక విభూతిం హస్తిశైలేశ్వరం త్వా, మనుదిన మనిమేషైర్లోచనై ర్నిర్విశేయమ్" - (వరదరాజ పంచాశత్), ఒక్క రెప్పపాటు కాలంలో కలిగే అనుభవ నష్టాన్ని ఓర్చుకోవడం దుర్భరమని, స్వామి సౌందర్యాన్ని రెప్పలార్పకుండా భక్తులు ప్రతిదినమూ దర్శిస్తారు.

'శ్రీకృష్ణుని ముఖ సౌందర్యాన్ని చూడగోరే కన్నులకు రెప్పలెందుకు కల్పించాడో' అని గోపికలు సృష్టికర్తను ఆడిపోసుకున్నారు.

పతి ప్రేమతో సతిని పదే పదే ఆలింగనం చేసుకుంటున్న సందర్భంలో నడుమ కలిగే తడవు - ఎడమూ ప్రేమను పెంచుతుందికదా!

భగవత్పాద, పాదుకా సంశ్లేషకు మధ్యన విరామంగానీ, ఎడంగానీ ఉండనే ఉండదు. పాదుకాదేవి విశ్లేషలేని సంశ్లేషను అనుభవిస్తున్నప్పటికీ, రంగనాథుని సన్నివేశం నిత్యప్రత్యగ్రమే. ప్రతి అనుభవం ఇదివరకు అనుభవించని రీతిగా - కొంగ్రొత్తగా - ఉంటుంది.

'సన్నివేశ' పదం, ఒక అవయవం మరొక అవయవానికి ఆభరణమై దివ్యమైన అంగసౌష్ఠవాన్నీ, సౌందర్యాన్నీ తెల్పుతుంది.

"రూపసంహననం లక్ష్మీం సౌకుమార్యం సువేషతామ్" - (రామాయణం)

నైగనిగ్యం, మసృణత, మార్దవం కలిసి రాశిపోసినట్లున్న శ్రీరాముని రూపరామణీయకతను చూచి దండకారణ్యంలోని ఋషులడెందాలు అందంగా కందళించాయి. దేశికుల దృష్టిలో ఈ 'సన్నివేశం' నూతనంగా ఉంది అని శబ్దరచనాచణత్వం తేటపరుస్తుంది.

సువేషత - పరస్పరాభరణమైన ప్రత్యంగ సౌష్ఠవం, సౌకుమార్యం - కాయం, లక్ష్మి - కాయకాంతి. రూప సంహననం - సన్నివేశంలో ఇమిడి ఉంది.

కైవల్యకల్పిత విభూషణ కాయకాంతిః- అవయవాలే ఆభరణాలుగా కల్పితాలు. వస్తుతః, ఆభరణాలే లేవు. మూర్తీభవించిన సౌందర్యమే శ్రీరంగపతి. **"సర్వ భూషణ భూషార్హః"**. శ్రీరాముడు నగలకే నగగా వెలిగే వన్నెలాడు, అన్నాడు ఆంజనేయుడు. **"భూషాయుధైరధిగతం నిజకాంతిహేతోః"** (దేవనాయక పంచాశత్) ఆభరణాలు, ఆయుధాలు తమకు వన్నె ఎక్కువై, వాసికెక్కాలనే ఆశయంతో భగవంతుని అవయవాలను అలంకరించాయట.

శృంగార నిత్య రసికుడు శ్రీరంగ నాయకుడు. నివృత్తి ధర్మనిష్ఠా వశ్యకతగల మోక్షేచ్ఛతో బ్రహ్మరుద్రాదులు శృంగారరాసిక్యాన్ని సర్వకాలాల్లో పొందలేరు. **'శృంగారో విష్ణుదేవత్యః' – 'శృంగారస్య ప్రభుర్విష్ణుః'** - శృంగారాభిమాన దేవత విష్ణుమూర్తియే, అన్నది భరతశాస్త్రం.

శృంగార తత్త్వమే రంగమందున్న యువకుణ్ని ఆశ్రయించి, రాసిక్యానికి పరిపూర్ణత్వాన్ని సంపాదించుకున్నది. ఒక స్త్రీభోగకాలమందు నాథుని పరిస్థితిని మరొక స్త్రీ అనుభవించజాలదు. ఏకాంతంగా భగవత్పాదసంశ్లేషతో ఒక విధమైన భోగాన్ని అనుభవించడమేకాక, అంతఃపురంలో తనను వీడి పాపరేని సెజ్జపైన పట్టపురాణులతో శృంగార క్రీడలు జరుపుతున్న కాలంలోనూ పాదుకాదేవి, భగవత్సన్నిధిలోనే ఉండి అపూర్వభోగాన్ని అనుభవిస్తుంది. సమస్త కళల సమాహార స్వరూపుడైన శ్రీరంగనాయకునితో నైక విధశృంగార భోగాలను అనుభవించే అదృష్టవతి పాదుకాదేవి.

రత్యాసక్తిగల నాయికను సూచిస్తున్న ఈ శ్లోకం సమాసోక్త్యలంకార సజ్జితం. వసంత తిలకా వృత్తం.

256. నిద్రాయితస్య కమితు ర్మణిపాదుకే! త్వం
పర్యంకికా పరిసరం ప్రతిపద్యమానా।
శ్వాసానిల ప్రచలితేన భజస్యభీక్ష్ణ
నాభీ సరోజరజసా నవమంగరాగమ్ । –6.

అర్థం :– హే మణిపాదుకే = ఓ రత్నపాదుకా! నిద్రాయితస్య = నిద్రాళువైన; కమితుః = కాంతునియొక్క; పర్యంకికా పరిసరం = శయ్య దగ్గర; ప్రతి పద్యమానా = ఆశ్రయించియున్న; త్వం = నీవు; శ్వాస + అనిల, ప్రచలితేన = నిట్టూర్పుల గాలిచే రెపరెపలాడి వ్యాపించిన; నాభీ సరోజరజసా = పొక్కిలి తామర పుప్పొడిచే; అభీక్ష్ణం = పదే పదే; నవం = కొత్తదైన; అంగరాగం = గంధపుపూతను; భజసి = పొందుతున్నావు.

తా। ఓ మణిపాదుకా! నిద్రిస్తున్న పతి యొక్క పర్యంకం పక్కన ఉన్న నీవు ఆయన ముఖశ్వాసలచే చలించిన నాభీకమల పరాగంతో నూతనమైన అంగరాగాన్ని పొందుతున్నావు.

వ్యాఖ్య :– శ్రీరంగపతి నిద్రిస్తున్నా పాదుకా భోగం ప్రశంసితం.

పాదుకాదేవి, నిద్రిస్తున్న శ్రీరంగనాయకుని సెజ్జను సమీపిస్తూ సౌందర్యాన్ని సేవిస్తుంటే, ఆయన ముఖోద్గత శ్వాస వాయువులచే నాభీపద్మ దళాలు చలించి, మాటిమాటికి దానిలోని సురభిళధూళి పైన పడడం వల్ల నవాంగరాగాన్ని అనుభవిస్తుంది.

శ్రీరంగపతి నిద్రలో కూడా ప్రేయసి మీద సింగారాన్ని ఎలా ఒలకపోస్తాడో 'గోదాస్తుతి' లోనూ గోచరిస్తుంది.

"నిద్రాళునాఽపి నియతం నిహితాః కటాక్షాః". (11 శ్లో.)

నిద్రలో కూడా స్వామి కడగంటిచూపులు దక్షిణదిశకున్న గోదానాయకిపైననే కుదురుకొన్నాయట.

కేళిసదనం, లోకి వచ్చి, అంగరాగాద్యలంకారంతో శోభించే నాయిక 'వాసక సజ్జిక'. **"యా వల్లభా గమా యాఽధ్యామండయే దంశుకాదిభిః । ఆత్మానం కేళిసదనం సాస్యాద్వాసక సజ్జికా" ।-**

ఉత్ప్రేక్షాలంకారం. వసంతతిలకా వృత్తం.

257. శయితవతి రజన్యాం పాదుకే! రంగబంధౌ
చరణకమల పార్శ్వే సాదరం వర్తసే త్వమ్ ।
ఫణిపతి శయనీయా దుత్థితస్య ప్రభాతే
ప్రథమ నయనపాతం పావనం ప్రాప్తుకామా । -7.

అర్థం:- హే పాదుకే = ఓ పాదుకాదేవీ! రజన్యాం = రాత్రియందు; రంగబంధౌ = శ్రీరంగపతి; శయితవతి = పవళించగా; త్వం = నీవు; ప్రభాతే= ప్రాతఃకాలమందు; ఫణిపతి శయనీయాత్ = శేషతల్పంనుంచి; ఉత్థితస్య = లేచిన వానియొక్క; పావనం = పరిశుద్ధికి కారణమైన; ప్రథమ నయన పాతం = మొదటి కనుచూపు పడడాన్ని; ప్రాప్తు కామా = పొందగోరుతూ; చరణకమల పార్శ్వే = పాదకమలాల పక్కన; సాదరం = ప్రేమతో, వర్తసే = ఉంటావు.

తా। ఓ పాదుకాదేవీ! రాత్రి రంగపతి పవళించగా, నీవు ప్రభాత సమయంలో శేష పర్యంకం నుంచి లేచిన వాని యొక్క పరిశుద్ధి హేతువైన ప్రథమ కటాక్షాన్ని పొందగోరుతూ పాదపద్మాల సన్నిధిలో ఆదరంతో ఉంటావు.

వ్యాఖ్య:- పాదుకా పాతివ్రత్యాన్ని ఉగ్గడించే శ్లోకం.

శ్రీమంతులు రాత్రి పాన్పుపక్కన పాదరక్షలను విడిచి నిద్రించడం, ప్రొద్దున లేచిన వెంటనే వాటిని చూచి ధరించడం లోకంలో పరిపాటి.

శ్రీరంగనాథుడు శేషశయ్యపైన నిద్రిస్తే, పాదుకాదేవి ఆశయ్యకు దగ్గర ఉండి రాత్రి అంతా గడుపుతుంది. శ్రీదేవ్యాది మహిషీమణులెందరున్నా ప్రభాత కాలంలో సెజ్జనుంచి మేల్కొన్న పతి తననే మొట్టమొదట కటాక్షించాలనే ప్రబల కాంక్షతో సెజ్జ పక్కననే వేచి ఉంటుంది పాదుకాదేవి.

ప్రథమనయనపాతం ఎంత పావనం చేస్తుందో గోదాదేవి ప్రబోధించింది.

"అంగణిరండుం కొండ్రెంగల్‌మేల్ నోక్కుదియేల్, ఎంగళుమేల్‌శాప మిళిందు" - (తిరుప్పావై)

ప్రభాతకాలంలో సర్వేశ్వరుడు అందమైన తన రెండు కన్నులను మెల్లగా విప్పుతూ ఎవరిని కటాక్షిస్తే, వారిని పట్టుకొని పీడిస్తున్న పాపం, శాపం విడిపోతుంది. వారు పరిశుద్ధాత్ములవుతారు.

పతి కంటె ముందు లేచి, పతిసేవచేయడానికి ఎదిరిచూస్తూ, పతిలేచి తననే మొదట చూచే భాగ్యాన్ని నోచుకోవడానికి అతని పాదాలకడ వేచి ఉండడం పతివ్రతామతల్లికా లక్షణం.

శ్రీకృష్ణుడు తన పాదాలకడ వేచియున్న పార్థుణ్ని ప్రథమంగా కటాక్షించడం, తలగడ కూర్చున్న సుయోధనుణ్ని తలత్రిప్పి చూడడం - మహాభారత చరిత్రలో భగవత్కటాక్ష పక్షపాతం - ప్రసిద్ధం కదా!

దేవేరులందరుండగా, నాయకుడు మేల్కొన్న క్షణంలో ఎవరిని మొదట చూడగోరితే అది ఉత్తమ నాయిక. అట్టిదే పాదుకాదేవి.

ఉత్ప్రేక్షాలంకారం. మాలినీ వృత్తం.

258. చరణకమల సంగా ద్రంగనాథస్య నిత్యం
నిగమ పరిమళం త్వం పాదుకే! నిర్వమంతీ ।
నియత మతిశయానా వర్తసే సావరోధం
హృదయ మధివసంతీం మాలికాంవైజయంతీమ్ ।-8.

అర్థం :- హే పాదుకే = ఓ పాదుకా! నిత్యం = ఎల్లప్పుడు; రంగనాథస్య = శ్రీరంగరాజుయొక్క; చరణ కమల సంగాత్ = కమల సదృశ చరణాలతో చేరి యుండడవల్ల; నిగమ పరిమళం = వేద సౌరభాన్ని/నాగరికతా వాసనను; నిర్వమంతీ = వెళ్ళగ్రక్కుతున్న; స + అవరోధం =(లక్ష్మిసంబంధంచే) అంతఃపురంతో కూడిన; హృదయం = వక్షస్థలాన్ని; అధివసంతీం = అధిష్ఠించిన; వైజయంతీం, మాలికాం = వనమాలను, అతిశయానా = అతిక్రమించినదానవై / మించిశయనించే దానవై ; వర్తసే = ఉంటావు, నియతం = నిశ్చయం.

తా॥ ఓ పాదుకాదేవీ! శ్రీరంగనాథుని పాదపద్మసహవాసం వల్ల నిత్యం వేదపరిమళాన్ని/నాగరికతా సౌరభాన్ని వెళ్ళగ్రక్కుతూ, నీవు అంతఃపురంతో కూడియున్న హృదయాన్ని అధివసించిన వైజయంతిని అతిశయించి ఉంటావు. ధ్రువం.

వ్యాఖ్య :- వైజయంతి కంటె పాదుకాదేవి వరీయసి.

శ్రియఃపతి వక్షఃస్థలంలో లక్ష్మీదేవి నివసిస్తుంది. ఆచోటనే వైజయంతి లలితంగా తారాడుతుంది. భగవంతుని ఎదలో గళం నుంచి పాదయుగళం దాకా వ్రేలాడే పూలదండకు 'వనమాల' అనీ 'వైజయంతి' అని పేరు.

"ఆపాద పద్మం యామాలా వనమాలేతిసా మతా" ।

పూవుల్లో శ్రేష్ఠమైనది కమలం. అది సౌందర్య సౌకుమార్య సౌగంధ్యాలచే ఆకర్షణీయమైనది. ప్రాకృత కమలాలకు హ్రాసవికాసాలుంటాయి. కానీ, భగవచ్చరణ కమలాలు మాత్రం నిత్యం వికాసంగా శోభిస్తుంటాయి. శ్రీరంగరాజు నిద్రలో ఉన్నా, మేల్కొని ఉన్నా గరీయ, కనీయ స్థాన భేదమెరుగక, నిత్యం పాదకమలాలను సామ్యాకృతితో ఆశ్రయించే సౌశీల్యవతి పాదుకాదేవి. వేదప్రతిపాదితాలు భగవత్పాదాలు.

"విష్ణోః పదే పరమే మధ్వ ఉత్సః". "తుయరటుశుడ రడి".

శ్రుతిసాగరుని చరణకమలాలు వేదనాదామోదితాలు.

"వేలాతీతశ్రుతి పరిమళం" - (భగవద్ధ్యానసోపానం) "ఆమోదితో ఒపినిగమై ర్విభురంఘ్రియుగ్మే" (గోదాస్తుతి)

నాయకుని పాదకమలాల సాహచర్యం వల్ల పాదుకాదేవికి పరిమళం అబ్బుతుంది. అది రాపిడిచేత ఏర్పడినందున పలుదిక్కుల ప్రాకుతుంది. నగరంలో పతితోపాటు తిరిగే పాదుక వస్త్రభూషణ సుగంధ ద్రవ్య లేపనాదుల సంస్కారంతో నాగరికతనూ విస్తృతం చేస్తుంది.

కమలా సంబంధం **(కమల + అసంబంధం)** వల్ల నిగమ పరిమళాలను నిర్వమనం చేసే వైభవం పాదుకకున్నట్లు వైజయంతికి లేదు.

వైజయంతిది లక్ష్మీకౌస్తుభ ముక్తాహారాలచే సావరోధం. పాదుకాదేవిది అన్యులచే అనవరుద్ధం. వారక్రమంగా భోగాన్ని అనుభవించే వైజయంతిని మించి, అతిశయించే భోగభాగ్యవతి పాదుకాదేవి.

"యత్రక్వాపి స్థిత మపి సఖే! త్రాస హీనం మహిమ్నా". ఆత్మసామర్థ్యం వల్ల ఏచోట నయినా నిర్భయంగా మనగల్గడం పురుషార్థ సాధక లక్షణం.

"గోదే! భవ త్యధరితాఖిలు వైజయంతీ"। (గోదాస్తుతి). వైజయంతి కన్న గోదాస్థాయి మిన్న అని వర్ణితం. లక్ష్మీ సంపన్న అయినా, ప్రతి నాయిక కాబట్టి, వైజయంతి తృప్తిలేనిది. వేదనాదభరితమైన సంచారం చేత శ్రియఃపతికి తృప్తి కలిగించే పాదుకాదేవి అందరికీ శిరోధార్య అయిన అన్నుమిన్న. సమాసోక్త్యలంకారం. మాలినీవృత్తం.

259. ఉపనిషదబలాభి ర్నిత్యముత్తంసనీయం
కి మపి జలధి కన్యా హస్త సంవాహనార్హమ్ ।
తవతు చరణరక్షే! దేవి! లీలారవిందం
చరణ సరసిజం తచ్చారు చాణూరహంతుః । -9.

అర్థం :- దేవి! హేచరణ రక్షే = ఓ పాదుకాదేవీ! ఉపనిషత్ + అబలాభిః = ఉపనిషత్తులనే కాంతలచేత; నిత్యం = ఎల్లప్పుడు; ఉత్తంసనీయం = శిరోభూషణీయమైన; జలధికన్యా హస్త సంవాహన + అర్హం = కడలి కూతురు చేతులతో

ఒత్తదగిన; కిం, అపి = అనిర్వచనీయమైన; తత్ = ఆ ప్రసిద్ధమైన; చాణూరహంతుః = చాణూరుణ్ని చంపిన శ్రీకృష్ణునియొక్క; చారు = అందమైన; చరణ సరసిజం = పాదకమలం; తవ, తు = నీకు మాత్రం; లీలా + అరవిందం = విలాసంగా చేత త్రిప్పదగిన తామరపూవయింది.

తా॥ ఓ పాదుకాదేవీ! ఉపనిషద్వనితలచే శిరస్సున భూషింపదగిన, లక్ష్మి హస్తాలతో ఒత్తదగిన, అనిర్వచనీయమైన ఆ శ్రీకృష్ణుని చారు చరణకమలం నీకు మాత్రం లీలారవిందమయింది.

వ్యాఖ్యః– భగవంతునికి పాదుకా పారవశ్యం సర్వాతిశాయి.

వేద శిఖలనే ఉపనిషత్తులంటారు. ఉపనిషత్కాంతలు భగవంతుణ్ని సర్వగంధుడని తలమానికంగా ధరిస్తారు.

"తుంగైరకృత్రిమగిరః స్వయముత్తమాంగైః, యం సర్వగంధ ఇతి సాదర ముద్వహంతి". (గోదాస్తుతి) భగవత్పాదాలు ఉపనిషత్ప్రతిపాదితాలు.

కాఠిన్యానికి తావేలేని కడలికి ముద్దు పట్టియైన లక్ష్మి, నిజహస్తాలచే మెత్తగా నొత్తదగినవి భగవచ్చరణాలు. బాల్యంలోనే, కంసుడు పన్నిన ధనుర్యాగంలో చాణూరుడనే మల్లుణ్ని చతికిలపడవేసి చావదొక్కిన పరాక్రమంకలవి శ్రీకృష్ణుని పాదాలు. ఎన్నో యోగ్యతలు కలిగిన స్వామి చారుచరణాలు వజ్రంకంటె కఠోరంగానూ, కుసుమంకంటె సుకుమారంగానూ అలరారేవికదా! అనిర్వచనీయమైన భగవత్పాద కమలం పాదుకాదేవికి మాత్రం యథేష్టవినియోగార్హమైన లీలారవిందం. ప్రేయోఽలంకారం. మాలినీ వృత్తం.

260. అఖిలాంతః పురవారేష్వనేకవారం పదావని! స్వైరమ్ ।
అనుభవతి రంగనాథో విహరవిక్రాంతి సహచరీం భవతీమ్ ॥ –10.

అర్థం :– హే పదావని = ఓ పాదుకాదేవీ! రంగనాథః = శ్రీరంగనాథుడు; విహార–చరీం |విహార = లీలా సంచార మందు; విక్రాంతి = పరాక్రమమందు, సహచరీం = తోడకూడి చరించే; భవతీం = నిన్ను; అఖిల + అంతఃపుర వారేషు = సకలాంతః పుర స్త్రీల భోగకాలాల్లోనూ, అనేకవారం = పలుసార్లు; స్వైరం = స్వేచ్ఛగా; అనుభవతి = అనుభవిస్తాడు.

తా॥ ఓ పాదుకా! శ్రీరంగనాథుడు, విహార విక్రాంతి సమయాల్లో తోడకూడి నడిచే నిన్ను శ్రీభూనీళల భోగవేళల్లోనూ పలుసార్లు ఇష్టప్రకారం అనుభవిస్తాడు.

వ్యాఖ్య :– పాదుకాదేవి, వాల్లభ్యాతిశయ విశిష్ట నాయిక.

శుద్ధాంతకాంతల భోగానుభవం సావధి – సమయనియమం కలది. శృంగార కేళిలోనూ, శూరులను మార్కొనేపోరులోనూ పదే పదే అనుసరించడంవల్ల పాదుకాదేవి భోగానుభవం నిరవధి. 'శౌరి, చాణూరహంత' శబ్ద రచన భగవదవతారాల్లో శృంగారభోగానుభవాల పట్ల శ్రీకృష్ణుడే కీర్తిమంతుడని తెల్పుతుంది. పరికరాలంకారం. ఆర్యాగీతి.

శృంగార పద్ధతి సమాప్తం.

11. సంచార పద్ధతి

261. అగ్రతస్తే గమిష్యామి మృద్నంతీకుశకంటకాన్ ।
ఇతి సీతాఽపి యద్వృత్తిమియేష ప్రణమామితామ్ ॥ –1

అర్థం :– కుశకంటకాన్ = దర్భలనూ, ముండ్లనూ; మృద్నంతీ = మర్దిస్తూ; తే = నీకు; అగ్రతః = ముందు; గమిష్యామి = నడువగలను; ఇతి = అని; సీతా, అపి = సీతాదేవి కూడా; యత్ + వృత్తిం = ఎవరి పనిని; ఇయేష = కోరిందో; తాం = ఆ పాదుకను గూర్చి; ప్రణమామి = నమస్కరిస్తున్నాను.

తా। "ఆర్యపుత్రా! కుశకంటకాలను మర్దిస్తూ నీ ముందు నడుస్తాను", అని సీతమ్మ కూడా ఏ పాదుకల వృత్తిని చేయకోరిందో, ఆ పాదుకాదేవికి ప్రణామములు.

వ్యాఖ్య:– పాదుకావృత్తి సీతాదేవికి ఆదర్శమయింది.

శ్రీరంగనాథుడు పాదుకలను ధరించి స్వైరవిహారం చేసే ఈ పద్ధతి శ్రీమద్రామాయణం నుంచి ఉద్ధృతమైన శ్లోక ఉత్తరార్ధంతో ప్రారబ్ధం.

"యదిత్వం ప్రస్థితోదుర్గం వనమద్యైవ రాఘవ ।
అగ్రతస్తే గమిష్యామి మృద్నంతీ కుశకంటకాన్" ।

సీతమ్మ రామునితో "ఈవేళనే నీవు దుర్గమారణ్యానికి ప్రయాణమయితే, దారిలో నీ మెత్తని అడుగులకు ఒత్తుకపోయి నొప్పి కలిగించే కుశకంటకాలను నేలలో నలుగద్రొక్కుతూ, నీకంటె ముందు నడుస్తాను, స్వామీ" – అని ప్రార్థించింది.

లక్ష్మీదేవి అవతారమైన సీత భూజాత. కుశలు అంటె దర్భలు, పవిత్రమైనవి. కాని వాటి అంచులు, మొనలు పదునుగా, వాడిగా (బాకులాగా) ఉంటాయి. కంటకాలు సుఖాన్ని ఆటంకపరచే ముండ్లు. కుశల వలె పవిత్ర వేషధారులైన క్రూర రాక్షసులు"పుణ్యజను" లేకదా! సాధు మృగవేషి మారీచుడు; సన్యాసి వేషధారి రావణుడు. ఈ రక్కసుల తలలు ఇలపైన టక్కున రాలి నలిగే కోరిక నీడేర్చుకోవడానికి, భూజాత పాదుకా పద్ధతినే అవలంబించింది.

అగ్రతః :– అడుగుపెట్టిన వెంటనే నలిగే (Grinding) ధ్వనిని అనుకరించ ఉచ్చారణ కల నుడుగు ఇది. 'హాసీతా!' అనే శబ్దంతో ధ్వన్యనుకరణ రహస్యాన్ని, మర్దించే మర్మాన్ని, మొట్టమొదట సదస్యం చేసినవాడే మారీచుడు కదా! అకార వాచ్యుడైన భగవంతుడే అడుగు పెట్టేవాడు. అయినా, నేలమీద అగ్రతః (ముందు) ఆనేది పాదుకాదేవియే. కాబట్టి, జంగమ మంగళదీప రేఖ ఉత్తరవాక్యమే ఈ పద్ధతికి అగ్రతః వెలిగింది.

పాదుక అని చెప్పక, కంటకమర్దన వ్యాపార పర్యాయంగా చెప్పడంవల్ల, అలంకారం పర్యాయోక్తం. అనుష్టుబ్ఛందం.

262. శరదశ్శత మంబ! పాదుకే! స్యాం
సమయాహూత పితామహ స్తుతాని ।
మణిమంటపికాసురంగభర్తు
స్త్వదధీనాని గతాగతాని పశ్యన్ । –2.

అర్థం :– హే అంబ! పాదుకే = అమ్మా! ఓ పాదుకా! మణి మంటపికాసు = రత్నమండపాలయందు; సమయ + ఆహూత, పితామహ, స్తుతాని = ఉత్సవవేళలో పిలువబడిన చతుర్ముఖ బ్రహ్మచే స్తుతింపబడిన; త్వత్ + అధీనాని = నీ వశమున ఉన్న; రంగభర్తుః = శ్రీ రంగరాజు యొక్క; గత + ఆగతాని = రాకపోకలను; శతం = నూరు; శరదః = ఏండ్లు; పశ్యన్ = చూస్తూ; స్యాం = ఉందునుగాక.

తా। అమ్మా! ఓ పాదుకా! రత్నమండపాల్లో ఉత్సవ సమయమందు ఆహ్వానింపబడిన బ్రహ్మకొనియాడే నీ అధీనమందున్న శ్రీరంగేశుని గతాగతరూప సంచారాలను నూరేండ్లు దర్శిస్తూ ఉంటాను.

వ్యాఖ్య :– పాదుకా లీలాసంచారాన్ని సేవిస్తూ దీర్ఘాయుష్కుడై ఉండాలని కవి ఆశయం.

'బ్రహ్మదేవానాం' శ్రుతిరీత్యా, దేవతలందరిలో చతుర్వదనుడు ప్రముఖుడు. ఉత్సవారంభంలో శాస్త్ర ప్రకారం 'దేవతాహ్వానం' చేస్తారు. ఉత్సవంలో ఒక మంటపం నుంచి మరొక మంటపంలోకి వృషభగతి, వ్యాఘ్రగతి, గజగతి, సింహగతి, అనే చతుర్గతులతో అర్చారూపియైన శ్రీరంగనాథుని గమనాగమన సౌందర్యాన్ని ప్రదర్శించే కౌశలం పాదుకాయత్తం. బ్రహ్మాదిదేవతలు సర్వేశ్వరుని వివిధగతులను వేనోళ్ళ ప్రశంసిస్తుంటారు. పాదుకాధీనమైన శ్రీరంగనాయకుని సంచార వైభవాన్ని కల్పాయుష్కులైన బ్రహ్మాదులు చిరకాలం సేవించగలుగుతారు, కాని మానవులు సేవించడానికి తమకు ఆయుష్యం చాలదేమో అనుకోవడం సహజమే.

"సంవత్సరో వత్సరోఽబ్దో హాయనోఽస్త్రీ శరత్ సమాః". (అమరం)

"పశ్యేమ శరదశ్శతం, జీవేమ శరదశ్శతం" – అని ద్విజులు నిత్యం సూర్యోపస్థానం చేస్తుంటారు.

"కుర్వన్నేవే హ కర్మాణి జిజీవిషేచ్ఛతగ్ం సమాః". ఈశావాస్యోపనిషత్తు ఆయా వర్ణాశ్రమ ధర్మాలను భగవదారాధన రూపంగా అనుష్ఠిస్తూ వందసంవత్సరాలు జీవించాలని బోధిస్తుంది. వేదాంత దేశికులు పాదుకాధీనమైన అర్చాగతాగతారూప సంచారాలను పూర్ణాయుష్కులై సేవించడమే జీవనప్రయోజనమని దృఢాధ్యవసాయంతో ప్రార్థించారు. వాస్తవంగా, దీర్ఘాయుష్మంతులై సేవించారు.

'కరీశ! పశ్యేమ పరః శతం సమాః' - అని శ్రీ వత్సాంక మిశ్రులు కంచి వరదరాజస్వామిని స్తుతించారు.,

'శ్రీరంగే శరదశ్శతం తత ఇతః పశ్యేమ లక్ష్మీసఖమ్' - అని శ్రీ పరాశరభట్టరు శ్రీరంగరాజస్తవం చేశారు.

భగవద్గమన వ్యాపారం పాదుకాధీనం, అనే ఒక ఐతిహ్యంగమనీయం. తెరుళుందూర్ ఆండవన్ స్వామి శ్రీరంగం నుంచి ఒకప్పుడు కుంభకోణం పోయి నివాసంచేశాడు. ఆయన శ్రీరంగం నుంచి సేవా వాహకులను రప్పించి కుంభకోణంలో భగవత్సేవకు నియోగించాడు. ఆవాహకులు దేవదేవుని ఒయ్యారి నడకలను చూపించి, భక్తులను ఆనంద జలధి వీచికలలో నోలలాడించే చతురులు. కానీ, కుంభకోణంలో స్వామి వాహకత్వాన్ని నిర్వహించినా, వాహకులు ఆండవన్స్వామిని మెప్పించలేకపోయారు.

అప్పుడు, ఆండవన్స్వామి వాహకుల నాయకునితో 'ఏమయ్యా! ఒయ్యారి నడకను ఆకర్షణీయంగా ఎందుకు ప్రదర్శించలేదు? అని ప్రశ్నించాడు. 'స్వామీ! శ్రీరంగనాయకుని చారుతర గమనాన్ని సాగించే వారం మేమే, అని మీరనుకుంటున్నారు. కానీ, ఆ రంగేశుని గమన భంగులన్నీ పాదుకాధీనమేనండీ!' అని వాహక నాయకుడు సమాధాన మిచ్చాడు. అప్పుడు ఆండవన్స్వామి, 'అద్భుతం! ఈ విషయం నాకూ తెలిసికోదగినదే అయింది' అని ఆశ్చర్యపడినారట.

"త్వ ద ధీనాని గతా గతాని" - అంటూ, జీవించినంతకాలం శ్రీరంగనాథుని వివిధ గతుల సోయగాన్ని రెప్పవాల్చకుండా సేవిస్తుండాలి, అని మనను ప్రోత్సహిస్తూ శ్రీమదాచార్యులవారు ఉపదేశిస్తున్నారు.

ప్రేయోஉలంకారం. ఔపచ్ఛందసికం.

263. త్వ దధీన పరిక్రమో ముకుంద
స్తద ధీన స్తవ పాదుకే! విహారః ।
ఇతరేతర పారతంత్ర్య మిత్థం
యువయోస్సిద్ధ మనన్య తంత్రభూమ్నోః । -3.

అర్థం :- హే పాదుకే = ఓ పాదుకాదేవీ! ముకుందః = ముక్తి నిచ్చే భగవంతుడు; త్వత్ + అధీన, పరిక్రమః = నీకు అధీనమైన నడకకలవాడు; తవ = నీ యొక్క; విహారః = నడక; తత్ + అధీనః = ఆ ముకుందునికి అధీనమయింది. అనన్యతంత్ర, భూమ్నోః = ఇతరులకు అధీనంకాని (స్వతంత్ర) మహిమకల; యువయోః = మీ ఇద్దరికీ; ఇతర + ఇతర, పారతంత్ర్యం = పరస్పరం పరాధీనమై ఉండడం; ఇత్థం = ఇలా; సిద్ధం = ఏర్పడింది.

తా॥ ఓ పాదుకాదేవీ! ముకుందుని సంచారం నీయధీనమందున్నది. నీ సంచారం ముకుందుని యధీనమందు న్నది. వేరే ఎవరికి అధీనంకాని (స్వతంత్ర) మహిమకలిగిన మీ ఇర్వురికి, అన్యోన్య పరాధీనత ఇలా సహజమయింది.

వ్యాఖ్య :- పాదుకారంగనాథుల పరస్పరచ్ఛందోనువర్తనం యుక్తమే.

పాదుకలు లేకుండా ప్రభువు సంచరించడు కాబట్టి శ్రీరంగరాజు సంచారం పాదుకాయత్తం. ప్రభువు ఇష్టపడినప్పుడే పాదుకలను ధరిస్తాడు. కాబట్టి పాదుకా సంచలనం రంగధాముని కోరికపైన ఆధారపడింది. పాదుకా శ్రీరంగేశులు స్వతంత్రులు. వారిద్దరూ ఒండొరుల ఇష్టప్రకారం సంచరిస్తారు. గమన విషయంలో వారు పరస్పరాధీనులు.

స్వతంత్రులకు పారతంత్ర్యం, అనడం విరోధం. 'ఇత్థం సిద్ధం' - శేషిశేషభూతులకు, ఒకరి కోరికనుబట్టి మరొకరు అనువర్తించడం ఆగమశాస్త్ర విహితం, అనడం విరోధాభాసం.

పరస్పరోపకార వర్ణనవల్ల వారికి వారే సాటి అనే అన్యోన్యాలంకారానికి విరోధాభాసాలంకారం అంగమవడం వల్ల సంకరాలంకారం. ఔపచ్ఛందసికం.

264. రజసా తమసాచ దుష్టసత్త్వే
గహనే చేతసి మామకే ముకుందః ।
ఉచితం మృగయా విహారమిచ్ఛన్
భవతీ మాదృత పాదుకే! పదాభ్యామ్ । -4.

అర్థం :- హే పాదుకే = ఓ పాదుకా! రజసా = ధూళితో, తమసా, చ = చీకటితోనూ; దుష్టసత్త్వే = హింసించే జంతువులు గల; చేతసి = చేతోరూపమైన, మామకే = మమతగల; గహనే = అడవియందు; ఉచితం = తగినట్లు; మృగయా విహారం = వేటాడడాన్ని; ఇచ్ఛన్ = కోరుతూ;

రజసా = రజోగుణంచేత; తమసా, చ = తమోగుణం చేతనూ; దుష్టసత్త్వే = చెడిన సత్వగుణంగల; గహనే = సూక్ష్మార్థాన్ని గ్రహించలేని; మామకే = నాదైన; చేతసి = మనస్సునందు; ఉచితం = రజస్తమోగుణాలను అణచేరీతిగా; మృగయా విహారం = వేట అనే క్రీడను; ఇచ్ఛన్ = కోరుతూ; ముకుందః = ముకుందుడు; పదాభ్యాం = చరణాలచేత; భవతీం = నిన్ను; ఆదృత = ఆదరించాడు.

తా॥ ఓ పాదుకాదేవీ! మోక్ష ఫలదాతయైన శ్రీరంగధాముడు, హింసించే మృగాలు కలిగి చేతోరూపమైన మమతతోకూడిన; ధూళిచే, చీకటిచేతనూ ప్రవేశించరాని అడవియందు సముచితంగా వేటాడకోరుతూ -

రజస్తమోగుణాలచే సత్వగుణం చెడిపోయి దురవగాహమైన నా చిత్తమందు రజస్తమోగుణాలను అణచివేసే రీతిగా వేట అనే క్రీడను కోరుతూ, నిన్ను పాదాలచే ధరింప ఆదరిస్తాడు.

వ్యాఖ్య:- వేటాడగోరే రంగరాజు పాదుకలను ధరించే వర్ణన.

ప్రభువులు, వినోదంకోసమో, వ్యసనంవల్లనో, మృగాలబాధ నుంచి ప్రజలను రక్షించడానికో వేటాడకోరడం సాధారణం. శ్రీరంగరాజు కూడా వేటాడుతాడు. అడవిలో చెత్త, దుమ్ము, దట్టమైన చెట్లతో కూడిన చీకటి వ్యాపించి ఉంటుంది. 'ఇది నారాజ్యంలోనిదే' అనే మమతతో, ప్రవేశించరాని అడవిలో సంచరించే క్రూరమృగాలను వేటాడపోదలచినప్పుడు శ్రీరంగప్రభువుకు పాదాలకు ధరించే పాదుకలపట్ల ఆదరం కలుగుతుంది. ఇదొక అర్థం.

మనస్సు ఒక అడవి. గహనం. ప్రవేశించరాని తావు **"గహనం కాననం వనం'– 'కలిలంగహనం సమే"**. (అమరం)

పాలలో పెరుగును తోడువేస్తే, అటుపాలుగాకుండా ఇటు పెరుగుకాకుండా ఉండే మధ్య దశ 'కలిలం'. సత్త్వగుణం, రజస్తమోగుణాలతో కలుషితమై, కలిలావస్థలో ఉన్న మనస్సు సూక్ష్మార్థాన్ని గ్రహించజాలదు.

"శుద్ధైనైకేన మనసాగ్రాహ్యః" - (శ్రీభాష్యం) **"మన్మనాభవ"** – (భగవద్గీత)

ఇత్యాది వేదాంతబోధను పెడచెవినిపెట్టి, 'నేను, నాది' అనే అహంకారమమకారాలతో కూడిన మనస్సు భగవంతునికి ప్రవేశించరానిది.

"సత్త్వం విశుద్ధం వసుదేవశబ్దితం" –(భాగవతం) అన్నట్లు శుద్ధసత్త్వగుణం కలిగిన మనస్సు మాత్రం భగవంతుడు ప్రవేశించి ప్రకాశించడానికి యోగ్యమవుతుంది.

"సంసారతంత్ర వాహిత్వాత్ రక్షాపేక్షాంప్రతీక్షతే" – సంసార భారాన్ని వహించేవాడు కాబట్టి భగవంతుడు "రక్షించు భద్రాత్మకా!" అని జీవుడెప్పుడు కోరుతాడో? అని ఎదురుచూస్తుంటాడు.

"యమేవైషవృణుతే తేన లభ్యః". (ఉపనిషత్) "అయ్యో! చెడిపోయినాడుకదా! వాణ్ని రక్షిస్తాను" అని ఎవని మీద భగవంతునికి నిర్హేతుకమైన కృప కలుగుతుందో వాని గహనమైన హృదయంలో ప్రవేశించి రజస్తమోగుణాలను తొలగించి, శుద్ధసత్త్వునిజేసి మోక్షఫలాన్ని ప్రసాదించేవాడు ముకుందుడు. భగవత్పాదసేవయే మోక్షం.

జీవుణ్ని తన పాదసేవకు యోగ్యునిగా చేయ సంకల్పించి, రజస్తమోరూప మృగహననం కోసం వేటాడకోరగానే, శ్రియఃపతి తన పాదాలకు ఆదరంతో పాదుకలను ధరించి జీవుని హృదయంలో ప్రవేశిస్తాడని కవి హృదయం.

ఈ శ్లోకం శ్లేషరూపకోత్ప్రేక్షాలంకారాలతో సంకీర్ణం. ఔపచ్ఛందసికం.

265. క్షమయా జగతామపి త్రయాణా
మవనే దేవి! పదావని! త్వ యైవ ।
అభిగమ్యతమోఽపి సంశ్రితానా
మభిగంతా భవతి స్వయం ముకుందః ॥ –5.

అర్థం :– హేదేవి! పదావని = ఓ పాదుకాదేవీ! ముకుందః = ముకుందుడు/నిధి; సంశ్రితానాం = సేవకులకు; అభిగమ్యతమః, అపి = ప్రాప్యతముడైననూ; త్రయాణాం = మూడు; జగతాం, అపి = లోకాలయొక్కయు; అవనే = రక్షణమందు; క్షమయా = శక్తి ఉన్న; త్వయా, ఏవ = నీచేతనే; స్వయం = తాను; అభిగంతా = (సేవకుల దగ్గరికి) పోయేవాడుగా; భవతి = అవుతున్నాడు.

తా॥ ఓ పాదుకాదేవీ! ముకుందుడు ఆశ్రితులకు మిక్కిలి చేరదగినవాడు. అయినా, మూడు లోకాలను రక్షించే సామర్థ్యమున్న నీతోనే తాను ఆశ్రితుల దగ్గరికి చేరబోయే వాడవుతున్నాడు.

వ్యాఖ్య:– అభిగమ్యతముడైన శ్రీరంగేశుడు పాదుకాశక్తిచేత అభిగంత అవుతాడని, వ్యాఘాతాలంకృత శ్లోకం.

క్రమంగా 'ముకుంద' శబ్దం ప్రయుక్తమైన మూడవ శ్లోకమిది. **'ముకుంద కుందనీలాశ్చ'** (అమరం) ముకుంద మనేది ఒక నిధి. **'న రత్నమన్విష్యతి మృగ్యతేహితత్'**. నిధి వెదకదు, వెదకబడుతుంది కదా! కాబట్టి, ముకుందుడు నిధివలె దుర్లభుడు. శ్రీనాథా, శ్రీరంగనాథా, అని ఆర్తితో ప్రార్థిస్తూ భక్తులచే చేరబోదగిన భగవంతుడు, మూడు లోకాలను సంరక్షించే ఓర్పూ, నేర్పూ కలిగిన పాదుకా మహిమచేత భక్తులకెదురుగా తానే వెళుతాడు. పాదుకాభక్తులకు, తాము నిలిచినచోటనే, నిధి లభిస్తుంది. అభిగమ్యుడు అభిగంత అవుతాడు.

పాదుకలను ధరించిన శ్రీరంగపతి వీథుల్లో అన్వేషిస్తూపోయి భక్తులకు తన దర్శనాన్ని అనుగ్రహిస్తాడు. అభిగంతృత్వానికి పాదుకాశక్తియే ముఖ్య కారణం.

"అధృష్యత్వం ధృత్వా కమితు రభిగమ్యత్వ జననీంశ్రియమ్" –

శ్రియఃపతి వక్షస్స్థమను నిరంతరం అలంకరిస్తున్న లక్ష్మీదేవి మహిమవల్ల భక్తులకు సులభుడవుతాడు, అని దేశికుల 'న్యాయ తిలకం'.

"హరిమంజలినాఽవ్యధృష్యమ్, ఆకస్మికో య మభిగమ్యయతి ప్రజానా మంబ! త్వదీయ కరుణా పరిణామ ఏవ".

భూదేవి చేతనుల పక్షంచేరి, భక్తులు వచ్చేవరకు వేచి యుండక వారిని అన్వేషిస్తూ వెళ్ళడానికి స్వామిని ప్రోద్బలకం చేస్తుందని కవికేసరి 'భూస్తుతి'.

జగత్త్రయ సంరక్షిణియైన పాదుకాదేవికి క్షమాగుణం సహజమని ఈ శ్లోకముఖాన తిలకితం.

సర్వేశ్వరుడు లక్ష్మీదేవి చేత 'అభిగమ్యుడు', భూదేవి చేత 'అభిగమ్యతరు'డు, నీళాదేవి చేత 'అభిగమ్యతము'డు అయ్యాడన్న విషయాన్ని దయాశతకంలోని (6, 7 మరియు 8) శ్లోకాల వల్ల గమనించవచ్చు.

పాదుకాదేవి ఇంకొక్క అడుగు ముందుకు వేసింది. అభిగమ్యతముణ్ని అభిగంతునిగా మార్చివేసింది. పాదుకా సామర్థ్యం వల్ల భగవంతుడు విపన్నులనుప్రపన్నులుగా చేసే ఆర్తితో వెళ్ళడానికి అలవాటుపడ్డాడు. కాబట్టి, **"ఉపస్థేయై రుపస్థితః"** తాను వెళ్ళి క్షేమసమాచారం తెలుసుకోదగిన ఋషులే తన దగ్గరికి వచ్చారు. అయ్యో! **"హ్రీరేషామమాతులా"** ఇది నాకు కడు సిగ్గుచేటుకదా! అని శ్రీరాముడు సీతమ్మ యెదుట ఒప్పుకున్నాడు.

"**जगत् हुए छत्तीस रामचरण छः तीन**". తులసీదాసు సూక్తి. 36ను 63వ అంకెగా చేసినట్లు, దుర్లభమైన భగవద్దర్శనాన్ని సులభంగాజేసిన ప్రశంసనీయభంగిమ 'పాదుకాక్షమ'. ఔపచ్ఛందసికం.

266. శిరసా భవతీం దధాతి కశ్చిత్
విధృతః కోఽపి పదస్పృశా భవత్యా ।
ఉభయో ర్మధువైరి పాదరక్షే!
త్వదధీనాం గతి మామనంతి సంతః ॥ –6.

అర్థం :– హే మధువైరి పాదరక్షే= ఓ భగవత్పాదుకా! కశ్చిత్ = ఒకడు; శిరసా = తలచేత; భవతీం = నిన్ను; దధాతి = ధరిస్తాడు; కః, అపి = ఒకానొకడు; పదస్పృశా = కాళ్ళుపట్టుకునే; భవత్యా = నీచేత; విధృతః = ధరింపబడుతాడు. ఉభయోః = ఇద్దరియొక్క; గతిం = గతి;(ముక్తి, నడక). త్వత్ + అధీనాం = నీవల్లకలిగేదిగా; సంతః = సజ్జనులు, ఆమనంతి = భావిస్తుంటారు.

తా॥ ఓ మధువైరి పాదుకా! ఒకడు నిన్ను శిరస్సున ధరిస్తాడు. ఒకానొకనిచే నీవు పాదాలకు ధరింపబడు తావు. సజ్జనులు, ఇద్దరి గతి నీ అధీనమనే భావిస్తుంటారు.

వ్యాఖ్య:– రక్షక, రక్షితుల గతి పాదుకాధీనమని వర్ణితం.

ప్రాప్యం, సంచారం అనీ 'గతి' శబ్దానికి అర్థద్వయం. సుకృతాత్ముడు శ్రీరంగనాథుని పాదుకలను శిరసా వహించి ముక్తిని పొందుతాడు. శ్రీరంగనాథుడు పాదుకలను ధరించి లీలా విహారం చేస్తాడు. భక్తుడు పాదుకలను తలమీద పెట్టుకుని, ఆస్థానమంటపానికి వేంచేయనున్న శ్రీరంగనాథునికి సమర్పిస్తే, స్వామి తన పాదాలకు వాటిని ధరించి సంచరించే సందర్భం ఇది. **'సంతమేనంతతో విదుః'** అని ఉపనిషత్తు ప్రకటించే సత్పురుషులు మహానుభావులు కాబట్టి, భగవంతుని గతికీ, భక్తుల గతికీ పాదుకానుగ్రహమే కారణమని నిర్ణయించేవారు.

ఉభయులగతి పాదుకాధీనమనే ధర్మైక్యం వల్ల ఇది 'తుల్యయోగి'తాలంకారం. ఔపచ్ఛందసికం.

267. స్పృశతః శిరసా పదేనచ త్వాం
గతి ముద్దిశ్య ముకుంద పాదుకే! ద్వౌ।
అవరోహతి పశ్చిమః పదా త్స్వా
దధిరోహ త్యనఘస్తదేవ పూర్వః ॥ –7.

అర్థం :– హే ముకుంద పాదుకే = ఓ ముకుందపాదుకా! ద్వౌ = ఇద్దరు; (భక్తుడు, భగవంతుడు) గతిం = ముక్తిని/ సంచారాన్ని; ఉద్దిశ్య = అపేక్షించి; త్వాం, నిన్ను; శిరసా = తలచేత; పదేన, చ = పాదంచేతనూ; స్పృశతః = ధరిస్తారు. పశ్చిమః = తర్వాతి వాడు (భగవంతుడు); స్వాత్ = తనదైన; పదాత్ = స్థానం నుంచి; అవరోహతి = దిగుతాడు. పూర్వః = మొదటివాడు (భక్తుడు); అనఘః = పరిశుద్ధుడై ; (పాపరహితుడై) తత్ + ఏవ = దాన్నే (పరమపదాన్నే) అధిరోహతి = ఎక్కుతాడు.

తా॥ ఓ మోక్షదాత పాదుకా! జీవుడూ, దేవుడూ ఇద్దరు గతిని అపేక్షించి నిన్ను (క్రమంగా) శిరస్సుచే, పాదాలచేతనూ ధరిస్తారు. అయితే, రెండవాడు తన పదవినుంచి దిగుతాడు. మొదటివాడు పాపరహితుడై తన పదవినే ఎక్కుతాడు.

వ్యాఖ్య :– 'గతి' కోసం పాదుకలనుధరించే ఇద్దరికి కలిగే 'స్థితి' వర్ణితం.

గత శ్లోక భావమే కొనసాగుతున్నది.

జీవుడు ఉత్తమగతిని పొందే కోసం భగవత్పాదుకలను శిరసా వహిస్తాడు. దేవుడు సంచారార్థమై పాదుకలను పాదాలకు ధరిస్తాడు. రెండవవాడు తన పదవి (సింహాసనం) నుంచి దిగుతాడు. మొదటివాడు (జీవుడు) భగవత్పాదుకలను శిరసా వహించినందువల్ల, అతనికి పరమపదం లభిస్తుంది. గతివల్లనే స్థితి ఏర్పడుతుంది. పాదుకలను శిరసా వహించిన భక్తుని పూర్వాఘాలు, దూదిమీద అగ్గిపడినట్లు నశిస్తాయి. ఉత్తరాఘాలు తామరాకుమీద నిల్చిన నీటివలె అతనిని అంటుకోలేవు. కాబట్టి జీవుడు అనఘుడవుతాడు, అర్చిరాది మార్గంగా పరమపదాన్ని అధిరోహిస్తాడు. ఈ స్థితిని **'స్వస్వరూపావిర్భావ'** మంటారు. పాదుకలను ధరించే ఉద్దేశ్యం సమానమే. స్థానభేదం వల్ల గతి మారింది. "అవరోహణం' – 'అధిరోహణం" వ్యతిరేకపదాలు కదా!

అగ్నిది తేజస్స్వరూపం కాబట్టి, ఇష్టమున్నా, లేకున్నా ముట్టుకుంటే కాలడం దాని స్వరూప నిరూపక ధర్మం.

పాదుకాదేవిని పాదాలతో తాకడం అగౌరవం. అమర్యాదగా ప్రవర్తించేవాడు తన పదవి నుంచి దిగిపోవడమూ, నెత్తినెక్కించుకొని గౌరవించేవాడు ఉన్నత పదవిని అధిష్ఠించడమూ స్వరూప నిరూపక ధర్మమే కదా!

జీవుడు ప్రకృతి బద్ధుడుకాక పూర్వం, సహజంగా, జ్ఞానానందామల స్వరూపుడు. సంసారి అయిన తర్వాత చేసిన పనులనుబట్టి, పుణ్యపాపాలు చుట్టుకున్నా, శ్రద్ధాభక్తి సమన్వితుడై శ్రీ శఠారిని శిరోభూషణంగా ధరిస్తే, అపహత పాప్మత్వాది గుణాష్టక విశిష్టుడై తన పూర్వ స్వరూపాన్ని పొందుతాడు. పరమవ్యోమాన్ని నిచ్చెననెక్కినట్లు ఎక్కి చేరుకుంటాడు.

పదవిని అధిరోహించిన వానికి ప్రాథమ్యం. కాబట్టి భక్తుడు 'పూర్వుడు' అయ్యాడు. పదవి నుంచి దిగినవాడు 'పశ్చిముడు' వెనుక వాడయ్యాడు. దేశికులవారు భగవంతుని పట్ల 'నహినిందాన్యా'యాన పాదుకా ప్రశంస చేసినట్లు ప్రతీయమానమవుతుంది.

'గతి, పద' శబ్దాల్లో శ్లేష. 'గతి ముద్దిశ్య'లో తుల్యయోగిత. 'అవరోహతి', 'అధిరోహతి' అనడం వ్యతిరేకం. భక్తుని, భగవంతుని స్వరూప నిరూపక ధర్మాన్ని పర్యాయంగా వర్ణించడంవల్ల పర్యాయోక్తి. ఇవి అంగాంగిభావంతో ఉండడం 'సంకరాలంకారం'. ఔపచ్ఛందసికం.

268. సమయేష్వపదిశ్య జైత్రయాత్రాం
వివిధాంతఃపుర వాగురా వ్యతీతః ।
నియతం మణిపాదుకే! భవత్యా
రమతే వర్త్మని రంగసార్వభౌమః । –8.

అర్థం :– హే మణిపాదుకే = ఓ రత్నపాదుకా! రంగసార్వభౌమః = శ్రీరంగ చక్రవర్తి; సమయేషు = ఆయాకాలాల్లో; జైత్రయాత్రాం = విజయంకోసం చేసే పయనాన్ని; అపదిశ్య = సాకుచెప్పి; వివిధ + అంతఃపుర, వాగురా, వ్యతీతః = అనేక అంతఃపుర మహిళలు అనే వలలను, దాటినవాడై ; వర్త్మని = దారిలో; భవత్యా = నీతోడ; రమతే = క్రీడిస్తాడు. నియతం = నిశ్చయం.

తా॥ ఓ మణిపాదుకా! సార్వభౌముడైన శ్రీరంగేశుడు అప్పుడప్పుడు విజయయాత్రా వ్యాజంతో వలల వంటి అంతఃపురాలను గడచిపోయి, దారిలో నీతోడ రమిస్తాడన్నది నిశ్చయం.

వ్యాఖ్య :– విజయయాత్రా మిషతో బయట పడిన రంగరాజు పాదుకతో రమించే వర్ణన.

గత శ్లోకంలో ప్రభువు పాదుకాదేవి పట్ల మర్యాదలేకుండా ప్రవర్తించాడని ధ్వనింపజేసినందువల్ల కవితార్కిక సింహుడు క్షమాపణ వేడుకున్నట్లు, ఈ శ్లోకంలో, భగవంతునికి శ్రీ భూనీళలకంటెను కడుప్రేయసి, పాదుకాదేవి, అని సమాసోక్తిగా వర్ణించాడు.

'వాగురామృగబంధినీ' (అమరం) మృగాలను బంధించడానికి గట్టి త్రాళ్ళతో అల్లబడిన 'ఉచ్చు'ను 'వాగుర' అంటారు. అంతఃపురస్త్రీలకు బయటరాకుండా ప్రతిబంధక నియమాలుండడం చేత అంతఃపురాలకు వాగురలతో సామ్యం. శ్రీ భూనీళా మహిషీమణుల శుద్ధాంతాలకు, వంతులరీతిగా, స్వామి నియమాలను పాటిస్తూ వెళ్ళుతుంటాడు. శుద్ధాంతకాంతలు అమిత విభ్రమవిలాస వీచికలలోనోలలాడించినా, సార్వభౌమునికి అపరిమితానందాన్ని కలిగించే పాదుకాదేవితో వినోదంగా కాలక్షేపం చేయాలన్న చింతయే అధికం. కాని ఆచింత తీరేదెలా?

శ్రీ భూనీళలు మాత్రం సామాన్యలా? సార్వభౌముడైతేనేమి? ఆవలిస్తే పేగులు లెక్క పెడుతుంటారుకదా! అందుకే స్వామి ఒక పన్నాగం పన్నినాడు.

సంకల్ప మాత్రంలో శత్రుహనన సామర్థ్యమున్నా, రక్కసులను జయించడానికి బయల్దేరుతున్నాననే సాకు చెప్పి, శ్రీరంగపతి అంతఃపురకాంతల నుంచి తప్పించుకొని బయటపడుతాడు. ఒక్కసారి కాదుసుమా! ఇలా ఎన్నో సార్లు నమ్మించి, జైత్రయాత్రా మిషతో ఉచ్చుత్రాళ్ళలాంటి అనేకాంతఃపుర నియమాలను ఉల్లంఘించి, పాదుకాదేవితో పాటు బయల్దేరి, బయట సార్వభౌముని మర్యాదకు అనుగుణమైన అంగరంగభోగాలతో ఆనందింపజేసే ఈ ఒయ్యారితో సయ్యాటలాడడం స్వామికి సరదాగా ఉంటుంది.

సార్వభౌమునికి తగిన జైత్రయాత్రను సాకుగా చెప్పడం, సాపహ్నవం. పాదుకతో బహిర్గమనం క్రీడార్థమే అనడం, ఉత్ప్రేక్షాలంకారం.

శ్రీభూమ్యాదులకంటె భగవంతునికి కడు ప్రేయసి పాదుక, అని తోచడంవల్ల సమాసోక్తి. ఉత్ప్రేక్ష సమాసోక్త్యపహ్నవాలచే సంకీర్ణం.

ఔపచ్ఛందసికం.

269. నిజ సంహనన ప్రసక్త లాస్యం
చరతి త్వా మధిరుహ్య రంగనాథః।
పదరక్షిణి! పావనత్వ మాస్తాం
రసికా స్వాద మతః పరం నవిద్మః। –9.

అర్థం :– హే పదరక్షిణి = ఓ పాదుకా! రంగనాథః = శ్రీరంగేశుడు; త్వాం = నిన్ను; అధిరుహ్య = అధిరోహించి; నిజ సంహనన ప్రసక్తలాస్యం = తన శరీరమందు కలిగిన శృంగారనాట్యంగా; చరతి = నడుస్తాడు. పావనత్వం = పరిశుద్ధి కలుగడం; ఆస్తాం = ఉండుగాక; అతఃపరం = దీనికన్న మించిన; రసిక + ఆస్వాదం = భావుకుల ఆస్వాదనను; న, విద్మః = ఎరుంగము.

తా| ఓ పాదుకాదేవీ! శ్రీరంగనాయకుడు నిన్ను అధిరోహించి తన విగ్రహమందు కలిగిన లాస్యంగా సంచరిస్తాడు. పావనత్వం ఉండుగాక. ఇంతకన్న మించిన రసికుల ఆస్వాదనను మేమెరుగము.

వ్యాఖ్య :– పాదుకలను ధరించిన శ్రీ రంగేశుని లాస్య సంచారం ప్రేక్షణీయం.

సకల జనులకు ఆనంద జనకమైన శృంగార నృత్యం, – లాస్యం; తాండవం ఆరభటి నాట్యాలకు వ్యతిరేక మయినది. సాధారణంగా, లోకంలో దంపతుల శృంగార విహారాన్ని చూడడం పాపహేతువు. కానీ నట పరివృఢుడైన శ్రీరంగనాయకుని పాదుకాధీనమైన లాస్య సంచారం ప్రేక్షకులకు పరిశుద్ధి హేతువు. సకల పాపాలను సర్వమంగళం చేసే పావనత్వం అటు ఉండనీయండి.

శ్రీరంగనాయకుడు పాదుకలను ధరించి సంచరిస్తుంటే, ఆయన స్ఫురద్రూపమందు ఉద్భూతమైన అద్భుత లాస్య దర్శనంకన్న రసికశిఖామణులకు వేరే ఆస్వాదయోగ్యమైన దేముంటుంది? ఉంటే, అది భావుకుడైన కవికి మాత్రం తెలియదట. **"గాత్రం వపుః సంహననం"** (అమరం)

భగవంతుని లాస్యాన్ని దర్శించడం ప్రధానం. దానివల్ల ఆపాతతః, పావనత్వం, మన ఆనందం రెండూ కలుగుతాయి.

"కించిత్తాండవగంధి సంహననకం నిర్వ్యాజ మందస్మితమ్" – శ్రీ పరాశరభట్టరు కూడాపావనత్వాన్ని ఉపేక్షించి, తాండవ నృత్యంతో కూడిన శ్రీరంగనాయకుని దివ్యమంగళ విగ్రహాన్ని నూరేండ్లు సేవించాలని 'శ్రీరంగరాజస్తవం' చేశారు.

నిజసంహనన ప్రసక్తలాస్యాన్ని దర్శించి, భావుకతతో రసాస్వాదన చేయడమే తప్ప వేరే గతి తెలియనంత మైమరపుతో ఉండాలని, శ్రీ వేదాంతదేశికులు 'రంగనాథ పాదుకాస్తవం' చేశారు.

పావనత్వంపైన అనాదరం, రసికాస్వాదనమే అభీప్సితం, అని వర్ణించడం 'ఆక్షేపాలంకార' లక్షణం. ఔపచ్ఛందసికం.

270. పదయో రనయోః పరస్య పుంస
స్త దనుగ్రాహ్య విహార పద్ధతే ర్వా ।
శిరసో మణిపాదుకే! శ్రుతీనాం
మనసోవా మమ భూషణం త్వమేకా । –10.

అర్థం :– హే మణిపాదుకే = ఓ రత్నపాదుకా! ఏకా = ఒక్కతెవే అయిన; త్వం = నీవు; పరస్య = పరముడైన; పుంసః = పురుషునియొక్క; అనయోః = ఈ, (సేవింపబడే) పదయోః = పాదాలకా? వా = లేదా; తత్ + అనుగ్రాహ్య, విహార

పద్ధతేః, వా = ఆయన పాదాలచే, అనుగ్రహింపదగిన, సంచార మార్గానికా? శ్రుతీనాం, శిరసః; వా = వేదాంతానికా? మమ = (ధ్యానించే) నా యొక్క; మనసః; వా = మనస్సుకా?; భూషణం = ఆభరణం.

తా॥ ఓ రత్నపాదుకా! నీవు ఒక్కతెవే పరమ పురుషుని పాదాల తొడవువో, లేక ఆయన పాదాలచే అనుగ్రహింపదగిన లీలా సంచార మార్గానికి అలంకారమవో, ఉపనిషదాభరణమవో, లేదా? సర్వదాధ్యానించే నా మనస్సుకు భూషణమువా?

వ్యాఖ్య :– ఒక్క పాదుకాదేవి పలుతావుల భూషణమై ఎలా శోభిస్తుందని సందేహించి ప్రశ్నించే శ్లోకం.

వీథ్యుత్సవంలో, పాదుకల వల్ల భగవత్పాదాలకు కలిగిన శోభాధిక్యాన్ని దేశికులు గమనించి, పరమపురుషుని చరణాలకు పాదుకాదేవి అమూల్యాభరణం కదా! అని భావించారు. తర్వాత భగవంతుడు సంచరించే మార్గమంతా ప్రకాశమానమవుతుంటే, మణిపాదుకయే మార్గానికి అనర్ఘమైన అలంకారమై శోభిస్తుంది, అనుకున్నారు. పదం పడి, భగవత్సేవా సన్నిధానంలో వేదనాదం వీనులవిందుగా ఉంటే, మణి పాదుక శ్రుతి సీమంతినీ చూడామణి, అని ధ్యానించారు. ధ్యానరతిలో కవిడెందం ఆనందవారాశియందు తేలియాడుతుంటే, పాదుకాదేవియే తన మనస్సును రంజింపజేసే రత్నభూషణంగా గోచరించింది.

తన్మయమైన కవి హృదయం తత్త్వాన్వేషణకై యత్నించే సరికి సందిగ్ధావస్థను అనుభవిస్తున్నది. పాదుక, మణిమయి అనే మాట సత్యమే కాని ఒక్కతే నాలుగుచోట్ల నగగా వెలుగడం ఎలా సంభవం? ఈ నాల్గింటిలో దేనికి ఆభరణమో చెప్పి, సందేహాన్ని తీర్చుమనే ప్రశ్నల పారంపర్య రచన ఇది.

మాయవరం సమీపంలో ఉన్న 'శిరుప్పులియూరు'లో 'అరుణాకడలముదు' అనే పేర వెలిసిన భగవంతుని రూపసౌందర్యం 'తిరుమాలిరుంజోలై'లోని 'సుందరబాహు' స్వామిని ఆళ్వారుకు స్మరింపజేసింది.

తిరుమంగై యాళ్వారు 'అరుణాకడలముదు' స్వామిని ప్రశ్నించిన తీరు ఇట్టిదే. "స్వామీ! నాలుగు వేదాల్లో ఉన్నావా? బ్రాహ్మణులు యజ్ఞంచేసే 'శిరుప్పులియూరు' మందిరంలో శయనిస్తున్నావా? లేక, భక్తుల హృదయాల్లో వెలసియున్నావా? తెలియశక్యం కాకుండా ఉంది" – అని భగవంతుడు 'సర్వవ్యాపి' అనకుండా, చివరలో "ఉన్దడియార్ పినత్తాయో" అని పాశురం ముగిసింది.

భగవంతుడు భక్తుల హృదయాల్లో వెలసి ఉంటాడని భక్తకవులు చెప్పినా, 'గోదాస్తుతి'లో చెప్పినట్లు "న్యూనాధికత్వ సమతా" విషయమే సిద్ధాంతం.

పాశురం కంటె 'కూరత్తాళ్వాన్ 'అస్పృష్టచింతాపదం' అని శ్రీ వరదరాజస్వామి కర్ణాభరణ సౌందర్యాన్ని స్తుతించిన శ్లోకానికి అతి సన్నిహితంగా ఉంది దేశికుల శ్లోకం.

"కరీశా! నీ కర్ణాభరణాలు నీ చెవులకు భూషణాలా? నీ భుజాలకా? భుజాలను లాలించే శిరోజాలకా? అని సందేహిస్తూ, "మానసస్య మమవాపరికర్మ" అవి నామనోభూషణాలు కావా? అని ప్రశ్నించాడు.

ముఖ్యంగా, ధ్యాన విషయీభూత పాదుకాదేవి.

సందేహాలంకారం. ఔపచ్ఛందసికం.

271. కృపయా మధువైరి పాదరక్షే !
కఠినే చేతసి మామకే విహర్తుమ్ ।
మకుటేషు దివౌకసాం విధత్తే
భవతీ రత్నవిసంస్థులేషు యోగ్యామ్ । –11.

అర్థం :– హే మధువైరి పాదరక్షే = ఓ మధువైరి పాదుకా! కృపయా = దయతో; మామకే = (మమతగల) నాదైన; కఠినే = కఠినమైన; చేతసి =మనస్సునందు; విహర్తుం = సంచరించడానికి; భవతీ = నీవు; రత్న విసంస్థులేషు = రత్నాలచే కరడు, మొరడైన; దివౌకసాం = దేవతల యొక్క; మకుటేషు = కిరీటాలయందు; యోగ్యాం = అభ్యాసాన్ని; విధత్తే = చేస్తుంటావు.

తా। ఓ పాదుకా! నీవు కఠినమైన నా మనస్సున దయతో సంచరించడానికి రత్నాలచే ఒడుదొడుకులుగా ఉన్నదేవతల కిరీటాల మీద అభ్యాసం చేస్తుంటావు.

వ్యాఖ్య :– తన భక్తుల చిత్తమందు విహరించే పాదుకా నైపుణ్యం వర్ణితం.

సుకుమారులు చెత్త, చెదారం, కల్లు ముల్లు, రాయిరప్పలతో నిండిన నేలమీద నడవడం కష్టమే. నడవాలని పట్టుదల ఉంటే, అప్పుడప్పుడు విషమస్థలాల్లో నడిచే అభ్యాసం చేసి రాటుతేరి ఉంటారు.

సత్త్వగుణాధిక్యం గల చిత్తంచెత్తగా ఉండక, మెత్తగా ఆర్ద్రంగా ఉంటుంది. రజస్తమోగుణ భరితమైన మనస్సు కఠినంగా, అడుగుపెట్టరాకుండా ఉంటుంది. మమతాహంకృతులచే మలినమైన మనస్సులో అతి సుకుమారమైన భగవత్పాదాలను పరిరక్షించే పాదుకాదేవి ఎలా సంచరిస్తుంది?

రాక్షసులు, దేవతలు జ్ఞాతులు. రజస్తమోగుణ భూయిష్ఠులైన రాక్షసులు తేనె పూసిన కత్తిలాగాఉంటారు. దేవతలతో సాటిగా సంచరిస్తూ, వారి ప్రక్కలో బల్లెంగా ప్రవర్తిస్తుంటారు. కాబట్టి, దేవతలు మధువైరి పాదాలను ఆశ్రయించి, పాదుకలను శిరసావహిస్తారు.

మకుటాలు ముకురంలాగా ముద్దుగా ప్రకాశించినా, అడుగిడితే అసిలాగా కస్సుమని కోసుకపోయే పలు కోణాలుగల రాళ్ళతో, రత్నాలతో పసిడిమీద ఎగుడుదిగుడుగా పొసగబడి ఉంటాయి. అయినా, దివౌకసుల కిరీటాల

మీద సంచరించే అభ్యాసం చేసి, కఠినాతి కఠినమైన చిత్తాలలోనూ సంచరించే నేర్పుతో, తననుఆశ్రయించినవారిని రక్షించుకునే దక్షురాలు పాదుకాదేవి. **"యోగ్యా గుణనికాఽభ్యాసః"** (అమరం)

పాదుకా కృప అపారమైనది కదా! ఉత్ప్రేక్షాలంకారం. ఔపచ్ఛందసికం.

272. చరణద్వయ మర్భకస్యశౌరేః
శరదంభోరుహ చాతురీధురీణమ్ ।
శకటాసుర తాడనేఽపి గుప్తం
తవ శక్త్యాకిల పాదుకే! తదాసీత్ । –12.

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకా! అర్భకస్య = పసికందు అయిన; శౌరేః = శూరవంశమందు అవతీర్ణుడైన శ్రీకృష్ణుని యొక్క; శరత్ - ధురీణం/శరత్ = శరదృతువునందలి; అంభోరుహ = కమలాలయొక్క; చాతురీ = కమనీయతను; ధురీణం = పూర్ణంగా వహించిన; తత్ = ఆ (పైకి చాచబడిన) చరణద్వయం = పాద యుగ్మం; శకట + అసుర, తాడనే; అపి = శకటాసురుణ్ని తన్నినప్పుడు కూడా; తవ = నీ యొక్క; శక్త్యా, కిల = శక్తిచేతనే కదా! గుప్తం, ఆసీత్ = రక్షింపబడింది.

తా :– ఓ పాదుకా! శిశువుగా ఉన్న శ్రీ కృష్ణుని శరత్కాల కమలాల సౌందర్యాన్ని వహించిన పాదయుగళం, శకట రూపంలో ఉన్న రక్కసుణ్ని తన్నినప్పుడు కూడా నీ ప్రభావంచేతనే కదా కాపాడబడింది.

వ్యాఖ్య :– శకటాసురభంజనుని పాదద్వయికి కాఠిన్యాన్ని కలిగించిన పాదుకా శక్తి వర్ణితం.

కాఠిన్యాన్ని సహించే నేర్పుకలదే కాదు పాదుకాదేవి, అత్యంత సుకుమార వస్తువులకు కాఠిన్య శక్తిని కలిగించే స్వభావం కూడా కలది.

"రుదన్‌స్తనార్థీ చరణా వుదక్షిపత్" (భాగవతం) నెల నిండని శిశువు శ్రీకృష్ణుడు, చనుపాల కోసం ఏడుస్తూ, శరత్కాల కమల సదృశపాదాలను పైకి ఎత్తాడు. కంసుని పంపున బండిరూపంలో వచ్చిన రక్కసుడు శ్రీకృష్ణుణ్ని చంప యత్నించాడు. శిశువు ఎగురవేస్తున్న చిన్నపాదపద్మాల తాకిడికి శకటం శకలాలై పడిపోయింది. వెన్న, పాలు, పెరుగు ఉన్న భాండాలన్నీ బద్దలయ్యాయి.

"విధ్వస్త నానారస కుప్యభాజనం, వ్యత్యస్త చక్రాక్ష విభిన్నకూబరమ్"

ఇరుసు విరిగింది. బండి చక్రాలు ముక్కలై, అస్తవ్యస్తంగా క్రిందపడ్డాయి. రక్కసుణ్ని బొక్కలు విరుగతన్నినా, బాలుని చరణాంభోజాలు మొక్కవోలేదు. అర్భకుని పాదాలను సంశ్లేషించి, పాదుకాదేవి తన కాఠిన్య శక్తిని ఆధానం చేయడం వల్ల దుర్భంజనుడైన శకటాసురుడు భంజితుడయ్యాడు. ఉత్ప్రేక్ష. ఔపచ్ఛందసికం.

273. ఉత్తస్థుషో రంగశయస్య శేషా
దాస్థాన సింహాసన మారురుక్షోః ।
మధ్యేనిశాంతం మణిపాదుకే! త్వాం
లీలా పదన్యాస సఖీం ప్రపద్యే । –13.

అర్థం :– హే మణిపాదుకే = ఓ రత్నపాదుకా! శేషాత్ = శేషశయ్య నుంచి; ఉత్తస్థుషః = లేచిన; ఆస్థాన సింహాసనం = సభా మంటపంలోని సింహాసనాన్ని; ఆరురుక్షోః = అధిష్ఠింపగోరే; రంగశయస్య = శ్రీరంగశాయికి, మధ్యే నిశాంతం = మందిరం నడుమ; లీలా పదన్యాస సఖీం = విలాసంగా సంచరించడానికి తోడ్పడే; త్వాం = నిన్ను; ప్రపద్యే = సేవిస్తున్నాను.

తా॥ ఓ మణిపాదుకా ! శేషతల్పం నుంచి లేచి ఆస్థాన సింహాసనాన్ని ఆరోహింపగోరే శ్రీరంగశాయికి మందిరం నడుమ విలాసంగా సంచరించడం కోసం సహాయపడే నిన్ను ప్రపత్తి చేస్తున్నాను.

వ్యాఖ్య :– పాదుకా విశిష్ట సంచారాన్ని ధ్యానించే శ్లోకం.

ప్రాతఃకాలాన సెజ్జ నుంచి లేచి పేరోలగంలోని సింహపీఠాన్ని ఆరోహించే శ్రీరంగరాజుకు మందిరంలో ఎందరో అంతరంగికులు సేవచేయడం ఆశ్చర్యం కాదు.

"అందామవాళ్ముడి శంగాళినూలారముళ" – (తి.వా.మొళి)

పరంధాముని కిరీటం, శంఖ చక్రాద్యాభరణాలు, ముక్తాహారం, యజ్ఞోపవీతం, పాదుకలు ఇత్యాది పరికరాలన్నీ **"చిన్మయైఃస్వప్రకాశైః"** స్వయంగాప్రకాశించే చేతనామయరూపాలు.

"నిశాంతవస్త్య సదన భవనాగారమందిరం". (అమరం)

(నిశాంతస్య మధ్యే = మధ్యే నిశాంతం. అవ్యయీభావ సమాస పదం)

పాదుకాదేవి ఆంతరింగిక సేవలో ఆరితేరింది. కాబట్టి, శ్రీరంగాయతన మధ్య ప్రదేశంలో నాయకుని లీలా సంచారానికి సహాయభూతయైన పాదుకాదేవి, వేదాంతదేశికులకు ప్రాతఃస్మరణీయ. ప్రేయోఽలంకారం.

సఖీ శబ్దానికి ఆంతరంగిక సేవ సాభిప్రాయం. పరికరాలంకారం. ఇంద్ర వజ్రావృత్తం.

274. ప్రాప్తాధికారాః పతయః ప్రజానా
ముత్తంసి తా ముత్తమపాదుకే! త్వామ్ ।
రంగేశితుః స్వైర విహార కాలే
సంయోజయం త్యంఘ్రి సరోజయుగ్మే । –14.

అర్థం :– హే ఉత్తమ పాదుకే = ఓ పురుషోత్తముని పాదుకా! (సర్వోత్తమ పాదుకా!) **ప్రాప్త + అధికారాః** = లబ్ధాధిపత్యం గల; ప్రజానాం, పతయః = బ్రహ్మేంద్రాది ప్రజాపతులు; **ఉత్తం సితాం** = శిరోభూషణంగా ధరించిన; త్వాం = నిన్ను; రంగ + **ఈశితుః** = శ్రీరంగనాథుని యొక్క; స్వైర విహారకాలే = స్వేచ్ఛగా సంచరించబోయే సమయంలో; అంఘ్రి సరోజయుగ్మే = పద్మ సదృశ పాద ద్వయ మందు; సంయోజయంతి = సమకూర్చుతారు.

తా॥ ఓ పురుషోత్తముని పాదుకా! అధికారాలు పొందిన బ్రహ్మేంద్రాది ప్రజాపతులు శిరోభూషణంగా ధరించిన నిన్ను శ్రీరంగేశుని స్వేచ్ఛా సంచార సమయంలో చరణసరోజయుగళ మందు సమకూర్చుతారు.

వ్యాఖ్య :– ప్రజాపతులు పాదుకలను శ్రీరంగేశునికి సమర్పించే వర్ణన.

భగవత్పాదుకానుగ్రహం వల్ల ఆధిపత్యాన్ని పొందిన బ్రహ్మ, దక్షుడు మొదలైన ప్రజాపతులు పాదుకలను తమ శిరస్సున అలంకారంగా ధరిస్తారు. తత్ఫలితంగా, వారు తమ విధులను ప్రజారంజకంగా నిర్వహించకలుగుతారు. **"ఉత్తమన్ పేర్పాడి"** (తిరుప్పావై) **"ఉత్తమః పురుషస్త్వన్యః"** (భ.గీత) బ్రహ్మాది ప్రజాపతులచే పూజింపదగిన పురుషోత్తముడు శ్రీరంగనాథుడు. భగవదారాధనలో పాదుకా సమర్పణ ఒక ప్రక్రియ.

శ్రీరంగనాథుడు యథేచ్ఛగా సంచరించదలచినప్పుడు బ్రహ్మాదులు పాదుకలను శిరసా వహించి, ప్రభు చరణార వింద ద్వయికి స్వయంగా జతపరుస్తారు. 'ఉత్తమ' పదంలాగా 'పాదుక' త్రివర్ణక. సర్వోత్తమయైన పాదుకాదేవికి ప్రజాపతులు కృతజ్ఞులై ప్రవర్తిస్తారు.

ప్రేయోఽలంకారం. ఇంద్రవజ్రావృత్తం.

275. త్వయాఽనుబద్ధాం మణిపాదరక్షే!
లీలాగతిం రంగశయస్యపుంసః ।
నిశామయంతో నపున ర్భజంతే
సంసార కాంతార గతాగతాని । –15.

అర్థం :– హే మణిపాదరక్షే = ఓ రత్నపాదుకా! త్వయా = నీచేత; అనుబద్ధాం = కల్పింపబడిన; రంగశయస్య = రంగ (విమాన)మందు శయనించిన; పుంసః = పురుషునియొక్క; లీలాగతిం = క్రీడా సంచారాన్ని; నిశామయంతః = చూచే జనులు; పునః = మళ్ళీ, సంసార కాంతార గత + ఆగతాని = సంసారమనే అడవిలోకి పోవడం, రావడం (జనన మరణాలను) న, భజంతే = పొందరు.

తా॥ ఓ మణిపాదుకా! నీవు కల్పించిన శ్రీరంగశాయి విలాస సంచారాన్ని చూచే జనులకు మళ్ళీ సంసార రూపకాంతారంలోకి రాకపోకలుండవు.

వ్యాఖ్య :– పాదుకావిశిష్ట భగవత్సంచారాన్ని దర్శించిన జనులకు పునర్జన్మ లేదు.

సంసారం దుర్గమారణ్యం. ఇందులో పుడుతున్నాం. ప్రారబ్ధకర్మ ఫలాన్ని అనుభవిస్తూ దారి, తెన్ను తెలియక ఎన్నో కష్టసుఖాలు పడుతున్నాం. చివరకు చస్తున్నాం. ఈ సంసారం భగవంతుని లీలా విభూతి. నిత్య విభూతి నుంచి లీలా విభూతిలోకి వచ్చి అర్చారూపంగా వెలసిన భగవంతుడు పాదుకలను ధరించి వినోదంగా సంచరిస్తాడు. పాదుకా సహితుడైన భగవంతుని లీలాగతిని సేవించిన భక్తులకు మళ్ళీ జననమరణాలు కలుగవు.

"జన్మ కర్మచమే దివ్య మేవం యోవేత్తి తత్త్వతః ।
త్యక్త్వాదేహం పునర్జన్మనైతి; మామేతిసోఽర్జున" । (భ.గీత)

"భగవంతుని అవతారాలనూ, చేష్టలనూ తెలుసుకొన్నవాడు చచ్చి పుట్టబోడు" అయితే, శ్రీరంగనాథుని క్రీడాసంచారాన్ని సేవించిన ఆనందానుభూతి నిత్యవిభూతిలో కలుగదు. కాబట్టి, పరమపదానికి పోనిష్టపడనివాడు, ఇక్కడనే 'మాం, ఏతి' నన్ను చేరి సేవిస్తాడు, అని ఉపదిష్టం.

'గతి'ని పరిశీలించిన వారికే 'గతి' ఉండదనడం, వ్యాఘాతాలంకారం. ఉపజాతి వృత్తం.

276. వ్యూహాను పూర్వీ రుచిరాన్ విహారాన్
పదక్రమేణ ప్రతిపద్యమానా ।
బిభర్షినిత్యం మణిపాదుకే ! త్వం
మురద్విషో మూర్తిరివ త్రిలోకీమ్ ॥ –16.

అర్థం :– హే మణిపాదుకే = ఓ రత్నపాదుకా! వ్యూహ + ఆనుపూర్వీ రుచిరాన్ = సామూహికంగానూ, క్రమంగానూ/ వ్యూహక్రమం చేత, అందమైన; విహారాన్ = లీలలను/సంచారక్రీడలను; పదక్రమేణ = పాదన్యాస క్రమంగా/స్థాన క్రమంగా; ప్రతిపద్యమానా = రూపొందుతున్న; త్వం = నీవు; మురద్విషః = భగవంతుని యొక్క; మూర్తిః, ఇవ = విగ్రహంవలె; త్రిలోకీం = మూడు లోకాలను; నిత్యం = ఎల్లప్పుడు; బిభర్షి = పోషిస్తున్నావు.

తా॥ ఓ మణిపాదుకా! వ్యూహానుపూర్వికంగా లీలలను, సంచారాలను చరణాలకనుగుణంగా, స్థానక్రమంగారూపొందుతూ నిర్వహించే నీవు, శ్రీరంగమూర్తివలె ముజ్జగాలను నిత్యం పోషిస్తున్నావు.

వ్యాఖ్య :– భగవదవతారాల సంచార వర్ణనచేస్తూ, మొదట వ్యూహ సంబంధాన్ని కీర్తించే శ్లోకం.

'వ్యూహం' అంటే సమూహం. భగవంతుడు సహస్ర పాదుడుగా మూర్తీభవించినప్పుడు పాదుకాదేవి కూడా ఆ

సహస్రపాదాల కనుగుణంగా రూపొందింది. పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చావతారాలని భగవంతుడు అయిదు మూర్తులుగా వెలసినట్లు ఆగమశాస్త్ర ప్రోక్తం. ఒక్క వ్యూహావతారంలోనే 1. వాసుదేవ 2. సంకర్షణ 3. ప్రద్యుమ్న 4. అనిరుద్ధ అనే నాలుగు రూపాలున్నాయి. వ్యూహావతారానికి విభవాదులు ఆనుపూర్వికాలు. ఒక అవతారం తర్వాత మరొకటి, 'ఆనుపూర్వి' అనబడుతుంది. సమస్త చేతనాచేతన పదార్థాల్లో వ్యాపించియున్న రూపం 'అంతర్యామి'. దివ్యదేశాల్లో వెలసినవి 'అర్చామూర్తులు'.

పరవాసుదేవుడను పేరుతో వైకుంఠంలో నిత్యనివాసంగా ఉండే మూలమూర్తి 'పరస్వరూపం'.

ఈ అవతారాలన్నిటిలో, పాదుకాదేవి ఆయా మూర్తుల పదక్రమానికి తగిన రూపాన్ని దాల్చింది. 'పదం' అంటే పాదం, స్థానం అని అర్థద్వయం. ఒక అడుగుదీసి మరొక అడగు పెడుతూ, సవ్య, దక్షిణ పాదన్యాసక్రమానికి గానీ, ఒక స్థానం తర్వాత మరొక స్థానానికి (మంటపానికి) ప్రవేశించే క్రమానికిగానీ తగినట్లు అమరియుండి భగవల్లీలా సంచారాలను అందంగా నిర్వహించే స్వరూప స్వభావాలు కలది పాదుకాదేవి. వేయి పదహార్గురు స్త్రీలకనుగుణమైన అనేక మూర్తులను దాల్చిరాస క్రీడాపరుడైన శ్రీకృష్ణుని చరణాలకు రుచిర శృంగార విహారాలను కల్పించింది. జల, శిలాది దుర్గాలనెన్నో భేదించి మురాసురుణ్ని సంహరించే సమయాన నందనందనుని చరణారవిందాలకు వీర విక్రమ విహారాలను కల్పించి జగద్రక్షణ చేసింది ఆనాడు. ఈనాడూ, అర్చామూర్తియైన శ్రీరంగనాథుని పాదానుగుణమైన ఆకృతితో అందమైన రచనలను రచిస్తూ, పాదుకాదేవి భగవన్మూర్తివలె చిదచిద్విశిష్టమైన విశ్వాన్ని పోషిస్తున్నది.

శ్లేషానుప్రాణితో సమాలంకారం. ఉపజాతి వృత్తం.

277. పదేషు మందేషు మహత్స్వపి త్వం
నీ రంధ్ర సంశ్లేషవతీ మురారేః ।
ప్రత్యాయనార్థం కిలపాదుకే! నః
స్వాభావికం దర్శయసి ప్రభావమ్ । –17.

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకాదేవీ! మందేషు = చిన్నవైనా; మహత్సు అపి = పెద్దవైనా; మురారేః = భగవంతుని యొక్క; పదేషు = పాదాలయందు; నీ రంధ్ర సంశ్లేషవతీ = నిబిడమైన సంబంధం కలిగి ఉంటూ; త్వం = నీవు; నః = మాకు; ప్రత్యాయనార్థం, కిల = నమ్మకం కలిగించడం కోసమే కదా! స్వాభావికం = నైసర్గికమైన; ప్రభావం = సామర్థ్యాన్ని; దర్శయసి = చూపిస్తున్నావు.

తా। ఓ పాదుకాదేవీ! చిన్నవైనా పెద్దవైనా సర్వేశ్వరుని పాదాలకు భేదమేర్పడకుండా అతికినట్లున్నదానవై నీవు, మాకు విశ్వాసం కలిగించడానికే సహజమైన సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నావు.

వ్యాఖ్య :– ఆశ్రితులను పాదుకాదేవి తారతమ్యరహితంగా రక్షించే వర్ణన.

పాదుకాదేవి వామనావతారంలో పొట్టి బుధుతని చిన్న అడుగులకు తగిన ఆకృతిని దాల్చింది. ఆ వామనుడే బ్రహ్మాండాంత సంవర్ధియై నేలను, నింగిని కొలువదగినంత విస్తారంగా పెరిగిన త్రి విక్రముని పాదాలకూ అతికి యున్నట్లు పాదుకాకృతి బ్రహ్మాండంగా పెరిగింది. భగవత్పాదాలతో నిరంతర సంశ్లేషవతి పాదుకాదేవి.

శఠారిని శిరసా వహించడం సర్వ సామాన్యం. అల్పుడనీ అధికుడనీ భావించక, ఉచ్చనీచములెంచక, అందరి మీద, అన్నిటిమీద త్రి విక్రముడు తన పవిత్ర చరణాలను తాపి, మోపినట్లే పాదుకాదేవి కూడా చిన్న, పెద్ద అనే తర తమ భావం లేకుండా, ఆశ్రితులనందరిని సామాన్యంగా రక్షించే సామర్థ్యాన్ని, మానవులకు విశ్వాసం కలిగించడానికే, ప్రదర్శిస్తున్నది. ఫలోత్ప్రేక్ష. ఉపజాతి వృత్తం.

278. కృపా విశేషాత్ క్షమయా సమేతాం
ప్రవర్త మానాంజగతో విభూత్యై।
అవైమినిత్యం మణిపాదుకే! త్వా
మాకస్మికీం రంగపతేః ప్రసత్తిమ్ ॥ –18.

అర్థం :– హే మణి పాదుకే = ఓ రత్నపాదుకా! కృపా విశేషాత్ = దయా విశేషం వల్ల; క్షమయా = భూ దేవితో/ ఓర్పుతో; సమేతాం = కూడిన; జగతః = లోకం యొక్క; విభూత్యై = సంపదకోసం; నిత్యం = ఎల్లప్పుడు, ప్రవర్త మానాం = పాటుపడుతున్న; త్వాం = నిన్ను; ఆకస్మికీం = నిర్హేతుకమైన; రంగపతేః = శ్రీరంగరాజు యొక్క; ప్రసత్తిం = అనుగ్రహంగా, అవైమి = తెలుసుకుంటున్నాను.

తా॥ ఓ మణిపాదుకా! కృపాతిశయం వల్ల ఓర్పు, నేర్పు (భూదేవి)తో కూడిన, నిత్యం జగద్ధితార్థమై పాటుపడే నిన్ను శ్రీరంగనాథునికి అతర్కితంగా కలిగిన అనుగ్రహంగా భావిస్తున్నాను.

వ్యాఖ్య :– శ్రీ రంగధాముని అనుగ్రహమే పాదుకాదేవి.

పాదుకాదేవి దయామయి, క్షమాసమేత, విశ్వశ్రేయస్కారిణి.

పాదుకాదేవి దయాదేవితోనూ, భూదేవితోనూ నిత్యం కూడి ఉండేది. కాబట్టి, వారిలాగా ప్రపంచాభ్యుదయం కోసం పాటుపడుతుంది. శ్రీరంగేశుని చల్లని అనుగ్రహరూపమే పాదుకాదేవి.

భగీరథునియందు ప్రసరించిన కృపావిశేషం వల్ల, భూలోకానికి వచ్చి సగరపుత్రుల భస్మరూపమైన విభూతి కోసం, పాతాళానికి చేరిన గంగా ప్రసక్తి ప్రతీయమానం. శ్లేషతోకూడిన ఉపమాలంకారం. ఉపజాతివృత్తం.

279. ఉపా గతానాముపతాపశాం త్యై
సుఖావగాహం గతి ముద్వహంతీమ్ ।
పశ్యామిశౌరేః పదవాహినీం త్వాం
నిమ్నేషు తుంగేషు చ నిర్విశేషామ్ । –19.

అర్థం :– ఓ పాదుకా! ఉప + ఆగతానాం = దగ్గరికి వచ్చినవారికి; ఉపతాపశాంత్యై = దుఃఖశమనం కోసం; సుఖ + అవగా హం = సుఖంగా ఆశ్రయణీయమైన; గతిం = సంచారాన్ని; ఉద్వహంతీం = భరిస్తున్న; నిమ్నేషు = నీచుల యందు; తుంగేషు, చ = ఉన్నతుల యందును; నిర్విశేషాం = భేదంలేని; శౌరేః = భగవంతుని యొక్క; పదవాహి నీం = చరణాలను వహించే; త్వాం = నిన్ను;-

ఉప + ఆగతానాం = సమీపించినవారికి; ఉపతాపశాంత్యై = శ్రమ, దాహం పోవడం కోసం; సుఖ + అవగాహం = దిగి స్నానం చేయదగిన; గతిం = సద్గతిని; ఉద్వహంతీం = సంపాదించుతున్న; నిమ్నేషు = పల్లములందు, తుంగేషు, చ = మిట్ట (భూము)లందును; నిర్విశేషాం = భేదరహితమైన, శౌరేః = భగవంతునియొక్క; పదవాహినీం = పాదం నుంచి ప్రవహించే గంగానదిగా; పశ్యామి = చూస్తున్నాను.

తా॥ ఓ పాదుకాదేవీ! నీ సన్నిధికి చేరుకున్నవారికి దుఃఖశమనం కోసం సుఖంగా ఆశ్రయించదగిన; సంచారాన్ని భరిస్తున్న; అల్పుల యందు అధికుల యందును భేదంలేని, భగవదంఘ్రులను వహించే నిన్ను సమీపించిన వారికి తాపంశమించడం కోసం దిగి స్నానం చేయదగిన సద్గతిని సంపాదిస్తున్న, ఎత్తువంతల యందుభేదం పాటించని, విష్ణుమూర్తి పాదం నుంచి ప్రవహించే గంగానదిగా దర్శిస్తున్నాను.

వ్యాఖ్య :– పాదుకాదేవి గంగాదేవిలాగా దర్శనమిస్తుంది.

1. పదవాహిని :– పాదుకాదేవి భగవంతుని చరణాలను వహిస్తుంది. గంగానది భగవత్పాదం నుంచి ఉద్గమించింది.

ఈ రెండింటికీ భగవత్పాద సంబంధం ఉంది.

2. సుఖావగాహ :– పాదుకాదేవి ఆశ్రితుల తాపాన్ని శమింపజేస్తుంది. గంగానది ఆశ్రితులకు స్నానయోగ్యమై దాహాన్ని తీరుస్తుంది.

3. గత్యుద్వాహిని :– పాదుకాదేవి సంచారానికి సహాయపడుతుంది. గంగానది స్వర్గాది సద్గతిని కలిగిస్తుంది.

4. నిమ్నోన్నత నిర్విశేష :– పాదుకాదేవి మాన్యులనూ, సామాన్యులనూ ఒక్కరీతిగా అనుగ్రహిస్తుంది. గంగానది మిట్ట పల్లాలను పాటించక గంభీరంగా ప్రవహిస్తుంది.

గత శ్లోకం సౌలభ్యాన్ని ప్రకటిస్తే, ఈ శ్లోకం సౌశీల్యాన్ని ప్రకటిస్తున్నది. వాస్తవంగా కవిశూరుని పదవాహిని, గభీరమై అల్పానల్పులకు అందరికీ సద్గతిని కలిగిస్తున్నది కదా!

శ్లేషాలంకారం. ఉపజాతి వృత్తం.

280. సహ ప్రయాతా సతతం ప్రయాణే
ప్రాప్తాసనే సంశ్రితపాద పీఠా ।
అలంఘనీయా సహజేన భూమ్నా
ఛాయేవ శౌరే ర్మణి పాదుకే! త్వమ్ । -20.

అర్థం :- హే మణిపాదుకే = ఓ రత్నపాదుకా! (భగవతి = శ్రీరంగేశుడు) ప్రయాణే = పయనించగా; సహప్రయాతా = సహచరిస్తూ; ప్రాప్త + ఆసనే = పీఠం మీద కూర్చుంటే; సంశ్రిత పాదపీఠా = పాదపీఠాన్ని ఆశ్రయిస్తూ; సహజేన = నైసర్గికమైన; భూమ్నా = (బహుదేశాక్రమణ) మహిమచేత; అలంఘనీయా = మీరశక్యంకాని; త్వం = నీవు; సతతం = ఎల్లప్పుడు; శౌరేః = శ్రీరంగనాథుని యొక్క; ఛాయా, ఇవ = నీడవలె; ఉన్నావు.

తా॥ ఓ రత్నపాదుకా! శ్రీరంగధాముడు పయనిస్తుంటే తోడుగా పయనిస్తూ, పీఠమందాసీనుడైతే పాద పీఠమందాసీనవవుతూ, సహజ మహిమచేత అతిక్రమించలేని నీవు, శ్రీరంగనాయకుని నీడలాగా ఉన్నావు.

వ్యాఖ్య :- పాదుకాదేవి శ్రీరంగనాథుని ఛాయలాగా ఉంది.

జనక మహారాజు సీతాదేవి విషయమై "ఛాయేవానుగతా సదా" ఎల్లప్పుడు శ్రీరామచంద్రమూర్తిని నీడలాగా అనుసరిస్తుంది అన్నమాట పాదుకా విషయంలోనూ వాస్తవమే.

శ్రీరంగపతి సంచరిస్తుంటే పాదుకాదేవి సహచరిస్తుంది. ఆయన సింహపీఠంమీద కూర్చుంటే తాను పాదపీఠం మీద ఉంటుంది. స్వాభావిక మహిమచేత బహుదేశాలను ఆక్రమిస్తుంది. ఎవరైనా తమ నీడను అతిక్రమించి సంచరించలేరుకదా! చల్లని హరిచందన తరుచ్ఛాయలో ఉన్నవాడు అవాప్త సమస్తకాముడవుతాడు.

"స్థితః స్థితా ముచ్చలితః ప్రయాతాం, నిషేదుషీ మాసన బంధధీరః ।
జలాభిలాషీ జల మాదదానాం, ఛాయేవ తాంభూపతి రన్వగచ్ఛత్" ।

దిలీప మహారాజు నందినీ ధేనువును నీడలాగాఅనుసరించాడని కాళిదాస మహాకవి సూక్తి. శ్లేషానుప్రాణితోపమాలంకారం. ఉపజాతి వృత్తం.

281. పదస్పృశా రంగపతి ర్భవత్యా
విచక్రమే విశ్వమిదంక్షణేన ।
తదస్య మన్యే మణిపాదరక్షే!
త్వయైవ విఖ్యాత మురుక్రమత్వమ్ । –21.

అర్థం :– హే మణిపాదరక్షే = ఓ మణిపాదుకా! రంగనాథః = శ్రీరంగనాథుడు; పదస్పృశా = పాదాలను స్పృశించే; భవత్యా = నీచేత; ఇదం =ఈ; విశ్వం = జగత్తును; క్షణేన = స్వల్పకాలంలో; విచక్రమే = ఆక్రమించాడు. తత్ = అందువల్ల; అస్య = ఈ విష్ణుమూర్తికి; ఉరుక్రమత్వం = గొప్ప అడుగులు వేయకలవాడు (ఉరుక్రముడు) అనే పేరు; త్వయా, ఏవ = నీ చేతనే; విఖ్యాతం = ప్రసిద్ధమయింది (అని) మన్యే = భావిస్తాను.

తా। ఓ రత్నపాదుకా! శ్రీరంగనాథుడు, చరణస్పర్శచేసే నీ చేత ఈ విశ్వాన్ని స్వల్పకాలంలోనే ఆక్రమించాడు. కాబట్టి, విష్ణుమూర్తికి ఉరుక్రమ నామం నీచేతనే ప్రసిద్ధిని పొందింది, అని భావన.

వ్యాఖ్య :– పాదుకాదేవి చేత ఉరుక్రమత్వం విఖ్యాతమని ఉత్ప్రేక్షితం.

"యస్యోరు షు త్రిషువిక్ర మణేషు, అధిక్షియంతిభువనాని విశ్వా"

"ఉరుక్రమస్య సహి బంధురిత్థా" (విష్ణుసూక్తం) **"త్రివిక్రమ ఉరుక్రమః"** (వైజయన్తి)

మహాబలి నుంచి పొందదగిన మూడడుగుల స్థలాన్ని కొలువ యత్నించిన (విష్ణు) వామనమూర్తి రెండడుగులలోనే, నేల నింగి ఇమిడిపోగా, మూడవ అడుగును బలి చక్రవర్తి తల మీద పెట్టి అనుగ్రహించాడు. చరాచర విశ్వమంతా అడుగున ఇమిడించిన పెద్ద పెద్ద అడుగులు కల త్రివిక్రముణ్ణి ఉరుక్రముడనే అభిధతో ఋగ్వేదం స్తుతించింది. 'ఉలగనేత్తుం' అని తిరుమంగై యాళ్వార్ సూక్తి.

శ్రీమంతుడు ఆక్రమించే స్థలానికి నేరుగా ఆయన అంఘ్రులతో సంబంధముండదు. అడుగుపెట్టదగిన తావుకూ, అడుగుకూ నడుమ పాదరక్షలుంటాయి. ఆక్రమణీయ విశ్వం తన క్రింద సరిగా అణగియుండే రీతిగా పాదుకాదేవి త్రివిక్రముని పాదతలాలను మృదువుగా స్పృశిస్తూ పెరుగడం వల్ల స్వామి పాదద్వయమూ పెరిగింది. 'ఉరుగాయు' డయ్యాడు. **"త్రేధా విదధే పదం"** (శ్రుతి). మూడడుగులతో విశ్వాత్ముడయ్యాడు, కాబట్టి విష్ణుమూర్తికి పాదుకాదేవి మహిమచేతనే, అనల్పకల్పనా చాతుర్యం చేతనే, ఉరుక్రమత్వం ప్రఖ్యాతమయింది.

ఉపేంద్ర వజ్రా వృత్తం.

282. సంచారయంతీ పదమన్వతిష్ఠః
సహాయకృత్యం మణిపాదరక్షే !
మాతస్త్వమేకా మనువంశగోప్తు
ర్గోపాయతో గౌతమధర్మదారాన్ I –22.

అర్థం :– హే మాతః! మణి పాదరక్షే= అమ్మా! ఓ మణిపాదుకా! ఏకా= ముఖ్యమైన; త్వం= నీవు; గౌతమ ధర్మదారాన్ = గౌతముని ధర్మపత్నియైన అహల్యను; గోపాయతః = రక్షింపగోరే; మనువంశగోప్తుః = మను వంశ సంరక్షకుడైన శ్రీరాముని యొక్క; పదం= పాదాన్ని (అను) సంచారయంతీ= సంచరింపచేస్తూ; సహాయకృత్యం= సహాయకార్యాన్ని; అన్వతిష్ఠః = అనుష్ఠించావు.

తా॥ తల్లీ! ఓ రత్నపాదుకా! నీవే ముఖ్యంగా గౌతమ ధర్మపత్నిని రక్షింపగోరే మనువంశ సంరక్షకుడైన శ్రీరాముని చరణాలను సంచరింపజేస్తూ సహాయకార్యాన్ని ఆచరించావు.

వ్యాఖ్య :– పాదుకాదేవి అహల్యను రక్షింపగోరే శ్రీరామునికి సహకరించింది.

విశ్వామిత్రునితో మిథిలానగరానికి పోయే సమయంలో శ్రీరామునికి పాదుకా సాహచర్యం లేకుంటేఅహల్యా రక్షణం జరుగకపోయేది.

"పాషాణ నిర్మిత తపోధన ధర్మదారాన్" (దేవనాయక పంచాశత్)

ఉపేంద్రావతారకాలంలో గౌతమ ముని తన ధర్మపత్నిని శపించడం వల్ల, ఆమె అదృశ్యగా పడియున్నందున, త్రివిక్రమ స్తుత్యనంతరం ఈ పతిత పావనత్వ వృత్తాంతం వర్ణితం.

శ్రీరాముడు తన సంకల్పబలం వల్ల అహల్యను పావనం చేశాడని 'రామాయణం' చెప్పలేదు. **"హంత! తే కథయిష్యామి"** శ్రీరాముడు తాను సంచరిస్తున్న ప్రదేశాన్ని గూర్చి అడిగితే "అయ్యో! నీకు చెబుతాను" - అని విశ్వామిత్రుడు (అయ్యో!) అనడం వల్ల, ఈ ముఖ్య విషయాన్ని విశ్వామిత్రుడు మరచియుండవచ్చు. కానీ, పాదుకాదేవి మాత్రం మరువలేదు. **త్వం, ఏకా :–** పతితయైన అహల్యను పావనం చేసి, ఆమెకు పూర్వరూపాన్ని ప్రసాదించే అనుగ్రహవతి. కాబట్టి శ్రీరాముణ్ణి అక్కడికి తీసుకపోయి, అహల్యా శాపవిమోచనం చేయించిన ఘనత రామునిదీ కాదు, విశ్వామిత్రునిదీకాదు, కేవలం పాదుకాదేవిదే. రజోదుష్టయైన అహల్యను రజస్సు చేతనే శుద్ధిచేసింది పాదుక. సీతాదేవి లేకున్నా, పాదుకామాత రిరక్షిషతో పురుషాకారిణి అయింది.

"ఏకే ముఖ్యాన్యకేవలాః". "భార్యాజాయాఽథ పుంభూమ్నిదారాః" (అమరం). ఉదాత్తాలంకారం. ఉపజాతి.

**283. త్వత్త స్త్రి విష్టపచరా నసపత్నయిష్య
న్నారుహ్య తార్క్ష్య మవరుహ్యచ తత్క్షణేన ।
శుద్ధాంత భూమిషు పున ర్మణిపాదరక్షే!
విశ్రామ్యతి త్వయి విహారవశేనశౌరిః । –23.**

అర్థం :– హే మణి పాదరక్షే = ఓ రత్నపాదుకా! త్రి విష్టప, చరాన్ = స్వర్గసంచారులైన దేవతలను; అసపత్నయిష్యన్ = పగతురులేనివారుగా చేయకోరుతూ; శౌరిః = శ్రీకృష్ణుడు; త్వత్తః = నీనుంచి; తార్క్ష్యం = గరుడనిపైన; ఆరుహ్య = ఎక్కి; తత్క్షణేన = ఆ క్షణకాలాననే; అవరుహ్య, చ = (గరుడుని నుంచి) దిగియు; శుద్ధాంతభూమిషు = అంతఃపుర ప్రదేశాల్లో; పునః = మళ్ళీ; త్వయి = నీ యందు; విహార వశేన = లీలా సంచారాధీనుడవడం చేత; విశ్రామ్యతి = విశ్రమిస్తాడు. మార్గాయాసాన్ని పోగొట్టుకుంటాడు.

తా। ఓ మణిపాదుకా! దేవతలను శత్రువులేని వారినిగా చేయదలచిన శ్రీ కృష్ణుడు, నిన్ను వదలి గరుడునిపైన ఎక్కి స్వల్ప కాలంలోనే దిగి, అంతఃపురసీమల్లో మళ్ళీ నీయందు లీలా సంచారాధీనుడవడంచేత విశ్రమిస్తాడు.

వ్యాఖ్య :– పాదుకా సాహచర్యం లేక పయనిస్తే శౌరి ప్రయాసపడే వర్ణన.

సురలకు సపత్నులు లేకుండా చేయడానికి శ్రీకృష్ణమూర్తి పాదుకలను విడిచి తన అభిమాన వాహనమైన గరుడునిపైన నెక్కి అసురులను వధించాడు.

అసురులను వధించడం శౌరికి పిల్లలాటవంటిదే కాబట్టి ఆయాసం కలుగదు. పక్షిరాజు, పాదుక రెండూ లీలా సంచార హేతువులే. అయినా, పాదుకా విశ్లేషాన్ని క్షణమైనా సహించలేని శౌరికి మార్గాయాసం కలిగింది. కాబట్టి, దిగిన మరుక్షణాన పాదుకలను ధరించి మళ్ళీ శుద్ధాంతసీమల్లో విహారాయత్తుడై విశ్రాంతి పొందుతాడు.

పక్షిరాజుపై పయనిస్తే శ్రమ, పాదుకలతో సంచరిస్తే విశ్రమ వర్ణన వల్ల, వ్యతిరేకాలంకారం. వసంత తిలకా వృత్తం.

**284. విక్రమ్యభూమి మఖిలాంబలినా ప్రదిష్టాం
దేవే పదావని! దివం పరిమాతుకామే।
ఆసీదతో దినకరస్య కరో పతాపాత్
సం రక్షితుం పదసరోజ ముపర్యభూస్త్వమ్ । –24.**

అర్థం :– హే పదావని = ఓ పాదరక్షిణీ! దేవే = త్రివిక్రముడు; బలినా = వైరోచనునిచేత; ప్రదిష్టాం = దత్తమైన, భూమిం, అఖిలాం = భూమినంతటినీ, విక్రమ్య = అడుగుపెట్టికొలిచి; దివం = ఆకాశాన్ని; పరిమాతు కామే = కొలువగోరినప్పుడు; ఆసీదతః = సమీపిస్తున్న; దినకరస్య = సూర్యునియొక్క; కర + ఉపతాపాత్ = కిరణాల వేడిమి నుంచి; పద సరోజం = చరణకమలాన్ని; సంరక్షితుం = కాపాడడానికి; త్వం = నీవు; ఉపరి = ఊర్ధ్వభాగాన; అభూః = ఉన్నావు.

తా॥ ఓ పాదుకా దేవీ! త్రివిక్రముడు బలిచక్రవర్తిచే దత్తమైన నేలనంతటినీ ఒక్క అడుగుచే కొలిచి, ఆకాశాన్ని ఆక్రమింప కోరుతున్నప్పుడు సమీపిస్తున్న సూర్య కిరణాల వేడిమి నుంచి పాద కమలాన్ని కాపాడడానికి పై భాగాన ఉన్నావు.

వ్యాఖ్య :– భగవత్పాదకమల సంరక్షణచేసిన పాదుకా భంగిమ ఉత్ప్రేక్షితం.

విరోచనుని పుత్రుడైన వైరోచనుడు వామనమూర్తికి మూడడుగుల నేలను దానమిచ్చాడు. వామనుడు బ్రహ్మాండమంతా పెరిగి అడుగుతో నేలనంతా ఆక్రమించాడు. ఆకాశాన్ని కొలువడానికి మరొక్క అడుగును అంతరిక్షంలోకి ఎత్తాడు. కుశకంటకాల నుంచి పాదకమల రక్షణ చేసే పాదుకాదేవి కూడా చరణాలకనుగుణంగా తన ఆకృతిని పెంచింది.

"యోఽస్కభాయ దుత్తరగ్ం సదస్థం విచక్రమాణః" – (విష్ణుసూక్తం)

త్రివిక్రముని పాదకమలం ఆకాశాన్ని, అట్టనతికినట్లు అతుకడానికి, సమీపించపోతున్నప్పుడు కమలాప్తుని రశ్మిసోకి కమిలిపోకుండా పాదుకాదేవి పాదకమలానికి పైకప్పుగా ఉండి కాపాడింది.

శారీరక విపరిణామాన్ని దర్శించిన కవి కల్పన అనల్పం. వసన్త తిలక.

285. త్వత్సంగమాన్నను సకృద్విధి సంప్రయుక్తా
శుద్ధిం పరా మధిజగామ శివత్వ హేతుమ్।
రంగాధిరాజ పదరక్షిణి! కీ దృశీ సా
గంగా బభూవ భవదీయ గతాగతేన ॥ –25.

అర్థం :– నను రంగాధిరాజ పదరక్షిణి = ఓయి రంగనాథ పాదుకా! విధి సంప్రయుక్తా = చతుర్ముఖ బ్రహ్మచే ఉపయోగింప బడిన; గంగా = గంగాదేవి; సకృత్ = ఒక్కసారి; త్వత్ + సంగమాత్ = నీ సంబంధంవల్ల; శివత్వ హేతుం = శివుని పరిశుద్ధికి కారణమైన; పరాం = ఉత్కృష్టమైన; శుద్ధిం = శుద్ధిని, అధిజగామ = పొందెను; సా = ఆ గంగానది; భవదీయ గత + ఆగతేన = నీరాకపోకలచేత; కీ దృశీ = ఎటువంటిది; బభూవ = అయింది?

తా॥ ఓయి రంగనాథ పాదుకా! బ్రహ్మ ఉపయోగించిన పాద్యజలం ఒక్కసారి నీ సంబంధం వల్ల కపాలిని పావనం చేయడానికి కారణమైన పరమశుద్ధిని పొందింది. ఆ గంగానది నీ గమనాగమనాల చేత ఇంక ఎంత పరిశుద్ధమయింది?

వ్యాఖ్య:- పాదుకా సంబంధంవల్ల గంగానదికి పావనం చేసే యోగ్యత కలిగింది.

ఉరుక్రముని పాదం నుంచి ఉద్గమించిన జలంతో బ్రహ్మ, పరబ్రహ్మ పాదాన్ని కడిగి కృతార్థుడయ్యాడు. పాదుకాదేవితో ఒక్కసారి సంగమిస్తే గంగకు కపాలిని పరమశివునిగా చేసే పావనత్వం కలిగింది. **"తీర్థేన మూర్ధ్ని విధృతేన శివః శివోఽభూత్"**. గంగను తల ధరించి కపాలహస్తుడు శివుడయ్యాడు. రామావతారంలో చిత్రకూటాద్రికి పోతున్నప్పుడు, తిరిగి వస్తున్నప్పుడు పాదుకతో సంగమించిన గంగకు మళ్ళీ కలిగిన పావనత్వ మహిమ వాఙ్మనస్సులకు గోచరించనిది కదా! **"తీర్థీకుర్వంతి తీర్థాని స్వాంతఃస్థేన గదాభృతా"**. గదాధరుడు అంతరంగమందున్న ఆచార్యులు, యోగులు తీర్థమాడడం వల్ల తీర్థశుద్ధి వర్ణనాతీతం. అనుగుణాలంకారం. వసంత తిలక.

286. వృద్ధిం గవాం జనయితుం భజతా విహారాన్
కృష్ణేన రంగరసికేన కృతాశ్రయా యాః।
సంచారతస్తవ తదా మణిపాదరక్షే!
బృందావనం సపది నందన తుల్యమాసీత్ ॥ -26.

అర్థం :- హే మణిపాదరక్షే = ఓ రత్నపాదుకా! గవాం = గోవుల యొక్క; వృద్ధిం = వృద్ధిని; జనయితుం = కలిగించడానికి; విహారాన్ = లీలా సంచారాలను; భజతా = చేసే; కృష్ణేన = కృష్ణుడుగా అవతీర్ణుడైన; రంగ రసికేన = రసికుడైన రంగనాథునిచేత; కృత + ఆశ్రయాయాః = చేయబడిన ఆశ్రయంకల; తవ = నీయొక్క; సంచారతః = సంచారం వల్ల; తదా = అప్పుడు; బృందావనం = బృందావనం అనే పేరుగల పెద్ద పల్లెరుకాయల అడవి; సపది = అప్పటికప్పుడే; నందన తుల్యం = ఇంద్రుని ఉద్యానవనంతో సమానంగా; ఆసీత్ = ఉండెను.

తా। ఓ మణిపాదుకా! గోవులను వృద్ధిచేయడానికి లీలా సంచారాలను చేసే శ్రీకృష్ణునిగా అవతరించిన శ్రీరంగనాథునిచే ఆశ్రయించబడిన నీ సంచారంవల్ల బృందావనం అప్పటికప్పుడే నందనవనంతో సమానమయింది.

వ్యాఖ్య :- పాదుకా సంచారంవల్ల బృందావనం నందనతుల్యంగా శోభించే వర్ణన.

శ్రీరంగనాథుడు శ్రీకృష్ణునిగా అవతరించినప్పుడు గోవుల అభివృద్ధికోసం నందగోకులం నుంచి బృందావనమనే పెద్ద పల్లెరుకాయలుండే అడవికి ఊరివారందరితో వెళ్ళాడు.

"బృందావనం భగవతా కృష్ణేనా క్లిష్టకర్మణా ।
శుభేన మనసా ధ్యాతం, గవాంవృద్ధి మభీ ప్సతా " ।

పాదుకాధీనమైన రసిక శిఖామణి లీలా సంచారంవల్ల బృందావనం లేత పచ్చిక బయళ్ళతో నిండి, పర్ణ పుష్ప ఫలరసామోద తరుభరితమై, నందనోద్యానవనంలాగ విలసిల్లి, గోవులకూ గోపాలకులకూ ఆనందదాయక మయింది. అప్సరలతో దేవేంద్రునిలాగా, గోపికలతో శ్రీకృష్ణుడు బృందావనంలో రసికుడై రాణించాడు.

ఉత్ప్రేక్షోపమాలంకారాల సంకీర్ణం. వసంత తిలకా వృత్తం.

287. మాత స్త్రయీమయతయా చరణప్రమాణే
ద్వే విక్రమేషు వివిధేషు సహాయభూతే ।
నాథస్య సాధు పరిరక్షణ కర్మణి త్వం
దుష్కృద్వినాశన దశాసు విహంగ రాజః ॥ –27.

అర్థం :– హే మాతః = ఓ తల్లీ! త్రయీమయతయా = వేదమయభావం చేత; చరణ ప్రమాణే = పాదాలంత కొలత/ సంచార కారణం కలిగిన; ద్వే = రెండు వస్తువులు; వివిధేషు = అనేకములైన; విక్రమేషు = అడుగులు వేయడమందు/ వీరకృత్యములందు; నాథస్య = ప్రభువుకు, సహాయభూతే = సహాయపడుతుంటాయి. సాధు పరిరక్షణ కర్మణి = శిష్ట రక్షణకార్య మందు; త్వం = నీవు; దుష్కృత్ + వినాశన దశాసు = దుశ్చరితులను నశింపజేసే సమయాల్లో; విహంగ రాజః = పక్షిరాజైన గరుత్మంతుడు.

తా॥ ఓ తల్లీ! పాదుకా! వేదమయాలవడం చేత చరణప్రమాణం గల రెండు, అనేక విక్రమాలయందు సహాయపడుతాయి. ప్రభువుకు సాధు రక్షణ కార్యమందు నీవు సహాయభూతవు. దుష్కృతులను దునుమాడే వేళల్లో గరుడుడు సహాయ భూతుడు.

వ్యాఖ్య :– పక్షిరాజుకూ, పాదావనికీ సామ్యభేదాల పరిశీలన.

1. '**త్రయీ**' అంటే ఋగ్యజుస్సామ వేదాలు. '**త్రయీమయత**' అంటే వేద ప్రాచుర్యం కల, వేద ప్రతిపాదిత పాదుకాదేవి. గరుత్మంతుడు వేదమూర్తి. "**వేదాత్మా విహగేశ్వరః**" (చతుశ్శ్లోకి). "**సుపర్ణోఽసి గరుత్మాన్ త్రివృత్తే శిరోగాయత్రం**" (శ్రుతి).

2. **చరణ ప్రమాణం.** స్వామిపాదాలెంత ఉన్నవో, పాదుకలు అంతే కొలతగలవి.
   "**ప్రమాణం హేతుమర్యాదా శాస్త్రేయత్తా ప్రమాతృషు**" (అమరం)
   గరుడుడు స్వామి సంచారానికి కారణభూతుడు. వేదమే ఆచరణకు, అనుష్ఠానానికి ప్రమాణం. "**అత్ర దేవః ప్రమాణం**" లాంటి ప్రయోగమిది.

3. **వివిధ విక్రమసహకారిత్వం.** స్వామి ఒయ్యారంగా అడుగులువేస్తూ, సింగారంగా నడవడానికి సహాయపడేది పాదుకాదేవి.
   రణరంగాల్లోకి తీసుకొనిపోయి స్వామి పరాక్రమ ప్రదర్శనకు సహాయపడేవాడు గరుత్మంతుడు.

ఈ మూడు విషయాల్లో రెండింటికి (పక్షిరాజుకు, పాదావనికి) సామ్యమున్నా ఒక్క విషయంలో వైషమ్యం ఉంది. అహల్యలాంటి సజ్జనులను తల్లివలె కాపాడే కార్యానికి, స్వామికి సహకరిస్తుంది పాదుకాదేవి. మాతృపదం సార్థకం. బాణ, నరక, నక్రాది దుష్టులను నాశనంచేసే ప్రక్రియల్లో ఖగరాజు స్వామికి సహకరిస్తాడు. ఒకరు ధర్మరక్షణకు, మరొకరు అధర్మనాశనానికి సహాయులు.

"పరిత్రాణాయసాధూనాం" తర్వాతనే "వినాశాయచదుష్కృతాం" అనే లక్షణంగా, ఉత్తరార్ధ రచన సాగింది. కాబట్టి, రక్షణకే ప్రాథమ్యం.

ఇర్వురిలో ఏకధర్మసామ్యమున్నా పాదుకాదేవి దయామయి అనీ, గరుడుడు క్రోధనుడనీ వర్ణించడం వల్ల, దీపకాలంకారంతో సంకీర్ణమైన వ్యతిరేకాలంకారం. వసంతతిలకా వృత్తం.

288. పాదావని! క్వచన విక్రమణే భుజానాం
పంచాయుధీకరరుహై ర్భజతే వికల్పమ్ ।
నిత్యం త్వమేవ నియతా పదయోర్మురారే
స్తేనాసి నూన మవికల్ప సమాధియోగ్యా ॥ –28.

అర్థం :– హే పాదావని = ఓ పాదుకా! మురారేః = భగవంతునియొక్క; భుజానాం = భుజముల యొక్క; విక్రమణే = వ్యాపార (పరాక్రమ) మందు; పంచ + ఆయుధీ = ఐదు ఆయుధాల సమూహం. క్వచన = ఒకప్పుడు, కరరుహైః = చేతిగ్రోళ్ళతో; వికల్పం = పాక్షికత్వాన్ని; భజతే = పొందును. పదయోః = చరణాలయొక్క; విక్రమణే = వ్యాపార (అడుగులు వేయడ)మందు; త్వమేవ = నీవే; నిత్యం = ఎల్లప్పుడు; నియతా = నియమింపబడినదానవు. తేన = ఆ కారణంచేత; నూనం = నిశ్చయంగా; అవికల్ప సమాధియోగ్యా = పాక్షికత్వం లేదు అనే అంగీకారానికి/నిర్వికల్ప సమాధి అనే ధ్యానయోగానికి, అర్హురాలవై ; అసి = ఉన్నావు.

తా॥ ఓ పాదావనీ! భగవంతుని భుజ విక్రమ మందు పంచాయుధాల సమూహం కరవిఖర నఖాలచే పాక్షికత్వాన్ని పొందుతుంది. పాద విక్రమమందు మాత్రం నీవే ఎల్లప్పుడు నియతంగా ఉంటావు. కాబట్టి, నీవు పాక్షికత్వం లేదనే అంగీకారానికీ, నిర్వికల్ప సమాధి యోగానికీ అర్హురాలవై ఉన్నావు.

వ్యాఖ్య :– పాదుకాదేవి అవికల్ప సమాధి యోగ్య, అని శ్లేషతో ఉత్ప్రేక్షితం.

భగవంతుని సంచార వ్యాపారం 'వికల్ప'మనీ గత శ్లోకభావాన్నిబట్టి పక్షిరాజుపైన గానీ, పాదావనిపైన గానీ ఆధారపడిందనీ, భావించవచ్చు.

"పాతుప్రణతరక్షాయాం విలంబమసహన్నివ। సదాపంచాయుధీం బిభ్రత్ సనః శ్రీరంగనాయకః" – అనే ప్రసక్తిని బట్టి భగవంతుడు సర్వదా ధరించే పంచాయుధాలకంటె, కాదాచిత్కంగా ధరించే పాదుక, అతిశయించదనీ భావించవచ్చు. ఆ భావనను తొలగించడానికే ఈ శ్లోకం విరచితం.

'భుజానాం'. భగవంతడు చతుర్భుజుడు కాబట్టి బహువచనం. 'పదయోః'. పాదాలు రెండే, కావున ద్వివచనం. బాహు విక్రమాన్ని ప్రదర్శించే సమయంలో శంఖచక్రాది పంచాయుధాలనైనా లేదా చేతివ్రేళ్ళ గోళ్ళనైనా ఉపయోగిస్తాడు భగవంతుడు. హిరణ్యకశిపుని వధించడానికి శ్రీనృసింహస్వామి ఏ ఆయుధాన్ని ఉపయోగించలేదు. ఆ నిర్జరవైరిని స్వామి నిజకర ఖరనఖరవిదారితోదరుని చేశాడు. కాబట్టి పంచాయుధాలకు పక్షాంతరం ఉంది. శ్రీకృష్ణావతారంలో, స్వామి సంకల్పబలంతో ఆకాశం నుంచి పంచాయుధాలు అవతరించి సహాయపడినాయి. ప్రతిజ్ఞా నిర్వహణ ధురంధరుడైన పార్థసారధి రథాంగాన్నే లేవనెత్తాడు. కాబట్టి, స్వామి భుజ విక్రమణం వికల్ప సమాధి యోగ్యమే.

పాద విక్రమ విషయంలో పాదుకాదేవికి వికల్పం లేనేలేదు. పక్షిరాజు వాహనంగా ఉండి, స్వామి సంచారానికి ఉపయోగపడునేకాని పాద సంచారానికి పనికిరాడు. మత్స్య కూర్మావతారాల్లాంటిదికాక, కంఠం క్రింది నుంచి నరరూపమే కాబట్టి, నృసింహుడు పాదుకలను ధరించాడు, అని 'కరరుహ' ప్రయోగం సూచిస్తుంది. హయగ్రీవావతారంలోనూ పాదుకాదేవికి 'అవికల్ప' నియమముంది.

పాదుకలను ధరించకుంటే భగవత్పాద సంచారం సింగారంగా ఉండదు. కాబట్టి, 'అవికల్పం' అంగీకరించడానికే యోగ్యురాలు పాదుకాదేవి.

ఇక్కడ 'సమాధి' శబ్దానికి అంగీకారం, ధ్యానం, అని రెండర్థాలు.

"అంగీకారాభ్యుపగమ ప్రతిశ్రవ సమాధయః" – (అమరం)

"సమాధిర్నియమే ధ్యానే" (హలాయుధ నిఘంటువు)

భగవత్పాదాలు పాదుకాదేవిని 'అవికల్పంగా' అంగీకరిస్తాయి. సంచారమందు పాదుకాదేవి యొక్క ఉపాదాన కారణమే, శ్లేషచేత, అస్త్రభూషణ విగ్రహంలేని శుద్ధభావ స్వరూప ధ్యానయోగ్యంగా ఉత్ప్రేక్షితం. వాస్తవంగా, పాదుకాదేవి సవికల్పకధ్యాన విషయీభూతయే కాని నిర్వికల్పకధ్యానానికి విషయీభూతకాదు. అందుకే ఇది నిశ్చయం-నూనం-అనబడింది.

అయితే, అవికల్ప సమాధి ప్రయోగం సమర్థనీయం.

కాసేపు భగవన్ముఖమండలాన్ని, కాసేపు చక్రాద్యాయుధాలనూ ధ్యానిస్తే, ఆ ధ్యానం 'సవికల్ప' మవుతుంది. మనస్సును భగవత్పాదుకల మీదనే ఏకాగ్రతగా నిల్పి, ధ్యానిస్తే, అది 'అవికల్ప సమాధి' అవుతుంది.

శ్రీరాముని విషయంలో సీతాదేవి నిర్వికల్పక సమాధి స్థితిని పొందడానికి ప్రయత్నించినట్లు 'హంస సందేశం'లో దేశికులు (II - 22) రచించారు.

వసంత తిలకా వృత్తం.

289. అక్షేత్ర విద్భి రధిగంతు మశక్య వృత్తి
ర్మాతస్త్వయా నిరవధి ర్నిధిరప్రమేయః ।
రథ్యాంతరేషు చరణావని! రంగ సంగీ
వాత్సల్య నిఘ్న మనసా జనసాత్కృతోఽసా । –29.

అర్థం :– హే మాతః! చరణావని = ఓ తల్లీ! పాదుకాదేవీ! అక్షేత్ర విద్భిః = దేహాత్మ స్వభావం/స్థల మహిమ, తెలియని వారిచేత; అధిగంతుం = పొందడానికి; అశక్యవృత్తిః = శక్యంకాని వర్తన కలిగిన; నిరవధిః = మేరలేని/తరుగని; అప్రమేయః = ఇంత అని కొలువ/తెలియరాని; రంగ సంగీ = రంగ విమానమందున్న; అసౌ = ఈ (పురుషార్థరూపమైన) నిధిః = నిధి; వాత్సల్య నిఘ్న మనసా = దయాధీన హృదయం కలిగిన; త్వయా = నీ చేత; రథ్యా + అంతరేషు = నాలుగుదారుల కూడళ్ళలో; జనసాత్, కృతః = జనాధీనం చేయబడింది.

తా॥ జననీ! చరణావనీ! చిదచిద్వివేకం, స్థల ప్రభావం తెలుసుకునే చాతుర్యం, లేనివారిచే పొంద శక్యంకాని అక్షయమైన, కొలువరాని శ్రీరంగనాథుడనే ఈ పురుషార్థ నిధి, వాత్సల్యంతో నిండిన హృదయంగల నీచేత చతుష్పథ స్థలాల్లో జనుల అధీనం చేయబడింది.

వ్యాఖ్య:– అక్షయ నిధియైన శ్రీరంగధాముణ్ని పాదుకాదేవి, పామరులు సేవించేలాగా చేస్తుంది.

'అ క్షేత్ర విదులు' అంటే, ఆత్మానాత్మ వివేకం లేనివారు. ఆత్మ భగవంతునికి శరీరం, అనే జ్ఞానం లేనివారు. భూమి సారమెరుగని వారు.

"క్షేత్రం శరీరేకేదారే" (విశ్వని) **"చతురస్స్యాత్ క్షేత్రజ్ఞః కృతహస్తః కృతముఖః కృతకర్మా".** (హలాయుధని).

శ్రీరంగధాముడు అక్షయమూ, అప్రమేయమూ, అనపాయమైన మహానిధి. నిధి ఉన్న స్థల మహిమ తెలుసుకునే సామర్థ్యంలేని వారికి అది సులభంగా పొంద శక్యం కానిది. **"మాయానిగూఢ మనపాయ మహానిధిం"** అని స్తుతించింది 'వరదరాజ పంచాశత్'.

'నిఘ్నం' అంటే, అధీనం. **"అధీనో నిఘ్న ఆయత్తః".** (అమరం) 'రథ్య' అంటే నాల్గు త్రోవలు కలిసే నడి వీథి. **'రథ్యాప్రతోళీవిశిఖా".** (అమరం)

'అంతరం' అంటే మధ్యస్థలం. **"అంతర మవకాశావధి పరిధానాంతర్ధి భేదతాదర్థ్యే".** (అమరం). **"జనసాత్ కృతః" "తదధీనవచనే"** వ్యాకరణ (5-4-54) సూత్రాన్నిబట్టి, అధీనార్థకంగా 'సాత్' ప్రత్యయం ప్రయుక్తం.

మాతృప్రేమగల పాదుకాదేవి తన ఒయ్యారపు నడకతో నిధిలాంటి శ్రీరంగనాథస్వామిని నడివీధుల్లోకి తెచ్చి, జనులందరూ అనుభవించి సుఖపడాలని, చూపింది.

"తద్యథా హిరణ్యనిధిం నిహిత మక్షేత్ర జ్ఞా ఉపర్యుపరి సంచరంతో న విందేయు రేవమేవేమాః ప్రజాస్సర్వా అహరహర్గచ్ఛంత్య ఏనం బ్రహ్మలోకం నవిందం త్యనృతేన హిప్రత్యూఢాః". (ఛాం.ఉ. 8 ప్ర పాఠకం)

"క్రింద నిధి ఉన్నదని తెలియని జనులు ఆ నిధి మీదనే సంచరించినా, దాన్ని పొందలేరు.

అలాగే, తమ హృదయంలో పరమాత్ముడున్నాడని తెలియని ప్రజలు, భగవత్సన్నిధిలోనే ప్రతిదినం తిరుగుతున్నా, భగవదనుభవాన్ని పొందలేరు" అని అనధిగమ్యత్వం శ్రుతమవుతుంది.

వేదాంత వాక్యార్థసారం కలిగిన ఈ శ్లోకం, వాత్సల్యంగల పాదుకాదేవి అజ్ఞానులకు సర్వేశ్వరుణ్ని సాక్షాత్కరింప జేసి, జ్ఞానవంతులను చేస్తుందని కీర్తిస్తున్నది. తెలియనివారు పొందలేని నిధిని పొందునట్లు వర్ణించడం, వ్యాఘాతాలంకారం. వసంత తిలకా వృత్తం.

290. సంపద్యతే సముచితం క్రమ మాశ్రయంత్యా
స ద్వర్త్మనా భగవతోఽపిగతి ర్భవత్యా ।
ఈష్టే పదావని! పునః క ఇవే తరేషాం
వ్యావర్తనస్య విషమా దపథ ప్రచారాత్ । –30.

అర్థం :– హే పదావని = ఓ పాదుకా! సముచితం = యోగ్యమైన; క్రమం = చరణ విక్షేపాన్ని/శక్తిని; ఆశ్రయంత్యా = ఆశ్రయించే; భవత్యా = నీచేత; భగవతః అపి = భగవంతునికి కూడా; సత్ + వర్త్మనా = సన్మార్గంతో; గతిః = నడక; సంపద్యతే= పంపన్నమవుతున్నది. ఇతరేషాం, పునః = ఇతరులను (కు) మాత్రం; విషమాత్= అనుగుణంగాలేని; అపథ ప్రచారాత్= పెడదారి నడక నుంచి/ నిషిద్ధాచారం నుంచి; వ్యావర్తనస్య = మరలించడానికి; కః, ఇవ = ఎవడైనా; ఈష్టే = సమర్థుడవునా?

తా॥ ఓ పాదుకా! యోగ్యంగా పాద విక్షేపాన్ని, శక్తిని ఆశ్రయించే నీచేత భగవంతునికి కూడా సన్మార్గ గమనం ప్రాప్య మవుతున్నది. ఇతరులను మాత్రం యోగ్యంగాలేని పెడదారి నడక నుంచి, నిషిద్ధానుష్ఠానం నుంచి మరల్చడానికి ఎవడు సమర్థుడు?

వ్యాఖ్య :– జనులను సత్పథాచారులనుచేసే పాదుకా సామర్థ్యం వర్ణితం.

'క్రమం' అంటే, అడుగు వేయడం, శక్తి అని అర్థద్వయం.

"శక్తౌ చరణ విక్షేపే పరిపాట్యామపిక్రమః" (నానార్థ రత్నమాల)

సముచితంగా అడుగులు వేయించే సామర్థ్యం కలది కాబట్టి పాదుకాదేవి భగవంతుణ్ని కూడా మంచిదారిలో సంచరింపజేస్తున్నది. అదృశ్య మహానిధియైన శ్రీరంగధాముని దర్శనఫలం జనులకు లభింపజేస్తున్నది. ఇక మగువలనూ, మగవారినీ నిషిద్ధానుష్ఠానాలతో పెడదారిలో నడవకుండా సన్మార్గగాములుగా తీర్చిదిద్దడానికి పాదుకాదేవికంటె వేరే సమర్థులు లేనేలేరు. భగవద్దర్శనఫలమందలి రుచిచేత ప్రజలు, వేరే దుష్ఫల ప్రవృత్తికి విముఖులై, జీవించే విధంగా చేసే శక్తి కలది పాదుకాదేవి.

కావ్యార్థాపత్త్యలంకారం. వసంతతిలకా వృత్తం.

291. రంగేశ్వరేణ సహ లాస్యవిశేషభాజో
లీలోచితేషు తవ రత్నశిలాతలేషు ।
మధ్యేస్థితాని కతిచిన్మణి పాదరక్షే!
సభ్యా న్విశేష మనుయోక్తుమితి ప్రతీమః ॥ –31.

అర్థం :– హే మణి పాదరక్షే = ఓ రత్నపాదుకా! లీలా+ఉచితేషు = సంచార క్రీడకు యోగ్యమైన; రత్నశిలాతలేషు = మణిమయప్రదేశాల్లో; రంగేశ్వరేణ, సహ = నట పరివృఢుడైన శ్రీరంగనాయకునితో కూడ; లాస్య విశేష భాజః = శృంగార నాట్య భేదాలుగల; తవ = నీయొక్క; మధ్యే = నడుమ నడుమ; కచితిత్ = కొన్ని; స్థితాని = నిలకడలు; సభ్యాన్ = గోష్ఠిలోనున్నవారిని; విశేషం = (కళా ప్రదర్శన) విశేషాన్ని; అనుయోక్తుం = అడుగడానికే; ఇతి = అని; ప్రతీమః = భావిస్తున్నాం.

తా॥ ఓ మణిపాదుకా! సంచార క్రీడకు యోగ్యమైన రాళ్ళు పరచిన ప్రదేశాల్లో శ్రీరంగనాయకునితో కూడ శృంగార నాట్య భేదాలు కలిగిన నీ యొక్క మధ్య మధ్య కొన్ని నిలకడలు, సామాజికులను నృత్త విశేషతారతమ్యాన్ని ప్రశ్నించడానికే అని భావిస్తున్నాం.

వ్యాఖ్య :– పాదుకాదేవి తన సంచార లాస్య విశేషాన్ని సామాజికుల నుంచి తెలుసుకొనే విధం.

పాదుకాదేవి నటశేఖరుడైన శ్రీరంగనాయకునితో కూడి సింగారంగా నటిస్తూ వీథుల్లో సంచరిస్తుంది. దారిలో మధ్య మధ్యన మణికుట్టిమాల్లో కాసేపు ఆగుతూ మళ్ళీ అనేక నృత్త భంగిమలతో సంచరిస్తుంటుంది. ప్రతి రత్నశిలా తలంలో ఆగినప్పుడు, 'ఈలాస్య విశేషం ఎలా ఉంది? మీరెలా అనుభవిస్తున్నారు? చెప్పండి? అని పాదుకాదేవి కళాభిజ్ఞులైన ప్రేక్షకులను ప్రశ్నించి వారికి కలిగిన రుచినీ, తృప్తినీ తెలుసుకుంటుంది, అని దేశికులకు తెలిసిందట.

కళాకారులు, విరామ సయమంలో, తమ ప్రదర్శనవల్ల ప్రేక్షకులు ఎలా ప్రభావితులవుతున్నారో సాధారణంగా, ఈనాడు (ETV) దూరదర్శినివారు కూడా, అడిగి తెలుసుకోవడం పరిపాటి.

"ఆ పరితోషాద్విదుషాం నసాధుమన్యే" కాళిదాసు అన్నట్లు, రసికుల ఆమోద ప్రశంసలను పొందనంతవరకు ఏ కళాప్రదర్శకుడూ తన కళాపై దుష్యంతో సంతృప్తిచెందడు.

శ్రీరంగనాథుని ఏకాంతసేవాక్రమంలో నిలకడను చమత్కరించి, దేశికులు 'కవనం నాకవనం' అని సహృదయులు స్మరించేలాగా చేశారు.

ఉత్ప్రేక్షాలంకారం. వసంతతిలకావృత్తం.

292. నిత్యం పదావని! నివేశ్యపదం భవత్యాం
నిష్పందకల్ప పరిమేయ పరిచ్ఛదాని ।
శృంగార శీతలతరాణి భవంతికాలే
రంగేశ్వరస్య లలితాని గతాగతాని । –32.

అర్థం :– హే పదావని = ఓ పాదుకా! కాలే = ఏకాంత సేవా సమయంలో; భవత్యాం = నీయందు; పదం = పాదాన్ని; నివేశ్య = ఉంచి; నిస్+స్పందకల్ప, పరిమేయ, పరిచ్ఛదాని = స్పందించనట్లుండే, స్వల్పమైన, పరికరాలు కలిగిన; లలితాని = హృద్యమైన; రంగేశ్వరస్య = శ్రీరంగపతియొక్క; గత + ఆగతాని = గమనాగమనాలు; నిత్యం = ఎల్లప్పుడు (మాటి మాటికి) శృంగార శీతల తరాణి = సింగారంగానూ, కన్నుల చలువగానూ; భవంతి = ఉంటాయి.

తా। ఓ పాదుకా! ఏకాంతసేవా సమయంలో నీయందు పాదాలను ఉంచి, నిశ్చలసదృశమైన స్వల్ప పరికరాలు కలిగిన, హృద్యమైన శ్రీరంగేశ్వరుని గమనాగమనాలు, మిక్కిలి భోగ్యంగానూ, చూడ ముచ్చటగానూ ఉంటాయి.

వ్యాఖ్య :– పాదుకలను ధరించిన శ్రీరంగేశ్వరుని సంచారం మనోజ్ఞంగా ఉంటుంది.

ఏకాంత సేవా సమయాన శ్రీరంగనాథుడు పాదుకలను ధరించడంవల్ల స్వామి నడకలో లాలిత్యం ఏర్పడుతుంది. రాజలాంఛనాలైన ఛత్రచామరాది పరికరాలు చలించి, చలించనట్లు గోచరిస్తాయి. పదే పదే ఈ నడకలను చూస్తుంటే, మిక్కిలి సింగారంగా ఉండి, రంగభక్తుల కన్నులకుచలువనూ, మనస్సుకు ఉల్లాసాన్నీ కలిగిస్తుంటాయి.

పాదుకా సంబంధంవల్ల స్వామి నడకను ఆనందోత్కర్షకంగా వర్ణించడం అనుగుణాలంకార లక్షణం. వసంత తిలకా వృత్తం.

293. భోగార్చనాని కృతిభిః పరికల్పితాని
ప్రీత్యైవ రంగనృపతిః ప్రతిపద్యమానః ।
పశ్యత్సు నిత్యమితరేషు పరిచ్ఛదేషు
ప్రత్యాసనం భజతి కాంచనపాదుకే! త్వామ్ ॥ –33.

అర్థం :– హే కాంచన పాదుకే = ఓ బంగారు పాదుకా! కృతిభిః = సజ్జనులచేత, పరికల్పితాని = కల్పించబడిన; భోగార్చనాని = ఫలాన్ని ఆశించకచేసే పూజలను; ప్రతిపద్యమానః = పొందుతున్న; రంగనృపతిః = శ్రీరంగరాజు; నిత్యం = మాటి మాటికి, ఇతరేషు = వేరే; పరిచ్ఛదేషు = పరికరాలు; పశ్యత్సు = చూస్తుండగా, ప్రత్యాసనం = ఒక్కొక్క పీఠమందు; త్వాం = నిన్ను; ప్రీత్యా, ఏవ = ప్రేమతోనే; భజతి = పొందుతుంటాడు.

తా॥ ఓ కాంచన పాదుకా! సత్పురుషులచే చేయబడిన భోగార్థమైన అర్చనలను స్వీకరిస్తున్న శ్రీరంగరాజు, మాటిమాటికి ఇతర పరికరాలు చూస్తుండగా, ఒక్కొక్క ఆసన మందు నిన్ను ప్రేమతోనే పొందుతుంటాడు.

వ్యాఖ్య :– పరికరాల్లో పాదుకయే ప్రథమశ్రేణికి చెందింది.

భాగ్యవంతులు భగవత్ప్రీత్యర్థం చేసే అర్చనలను స్వీకరిస్తున్న స్వామికి పాదుకా సమర్పణం విధ్యుక్తం. మంత్రాసనం, స్నానాసనం, అలంకారాసనం, భోజ్యాసనం, పర్యంకాసనం, అనేప్రతి ఆసనమందు ఛత్రచామరాది పరికరాలన్నీ బిత్తరపోయి చూస్తుంటే, శ్రీరంగరాజు పాదుకలను ప్రేమతో గ్రహిస్తాడు. కాబట్టి, కవి 'కాంచన పాదుకా' । అని సంబోధించాడు.

శాస్త్ర సిద్ధమైన పాదుకాగ్రహణం ప్రీతిమాత్ర హేతువుగా వర్ణితం. ఉత్ప్రేక్ష. వసంత తిలక.

294. అంతస్తృతీయనయనైః స్వయ ముత్తమాంగై
రావిర్భవిష్య దతిరిక్త ముఖాంబుజైర్వా ।
న్యస్యంతి రంగరసికస్య విహారకాలే
వారక్రమేణ కృతినో మణిపాదుకే! త్వామ్ । –34.

అర్థం :– హే మణిపాదుకే = ఓ రత్నపాదుకా! కృతినః = ధన్యాత్ములు; అంతః + తృతీయనయనైః = (ముఖమందు) లోపల మూడవకన్ను కలిగిన; వా = లేదా; ఆవిర్భవిష్యత్ + అతిరిక్త, ముఖాంబుజైః = కలుగబోయే ఎక్కువ ముఖ పద్మాలుగల; ఉత్తమాంగైః = శిరస్సులచేత; వారక్రమేణ = వంతులరీతిగా; త్వాం = నిన్ను; రంగరసికస్య = రసికుడైన శ్రీరంగనాథునికి; విహారకాలే = సంచార సమయంలో; స్వయం = తామే; న్యస్యంతి = సమర్పిస్తారు.

తా॥ ఓ మణి పాదుకా! ధన్యాత్ములు, ముఖంలోపల మూడవ నేత్రం కలిగిన తలలచేతగానీ, లేదా ఆవిర్భవింపనున్న అధిక ముఖపద్మాలుగల శిరస్సులచేతగానీ, వంతులరీతిగా నిన్ను శ్రీరంగరసికునికి సంచారవేళలో స్వయంగా సమర్పిస్తారు.

వ్యాఖ్య :– శ్రీరంగరసికునికి పాదుకలను సమర్పించిన ఫలం వర్ణితం.

భగవదనుగ్రహ భాగ్యంకల వ్యక్తులు నూతనంగా సువర్ణపాదుకలను చేయించి, తమ తలల మీద ఎత్తుకొని వచ్చి శ్రీరంగనాథునికి విహార సమయంలో సమర్పిస్తారు. తత్ఫలితంగా, ఆ వ్యక్తులకు సద్యస్కాలంలో శివత్వప్రాప్తి, తర్వాత చతుర్ముఖత్వ ప్రాప్తి కలుగుతుంది.

పాదుకలను శిరస్సుపైన ధరించినప్పుడే ఈ లక్షణాలు శిరస్సున సోకినాయి. ఈ లక్షణాలు ఆ వ్యక్తులయందు గోచరించవేమి? అంటే, రెండు కన్నులున్న తలకు ఫాలనేత్రంలోపల ఇమిడి ఉంది కాబట్టి, త్ర్యంబక లక్షణం గోచరించడం లేదు. ఉన్నతలకే మూడుతలలు అధికంగా ఇకముందు ఆవిర్భవింపనున్నాయి. కాబట్టి చతుర్ముఖ లక్షణం కనబడదు.

క్రియకు క్రియాసిద్ధికి మధ్యన కాలప్రభావం ఉంది. విత్తనం విత్తినా, దాని ఫలం ఇలా ఉంటుందని చూడడానికి వేచి ఉండవలసిందే కదా!

వారక్రమేణ :– ఒకరి తర్వాత మరొకరు పాదుకలను సమర్పిస్తారు కాబట్టి, తత్ఫలం కూడా పర్యాయంగా ప్రాప్తించడం పరిపాటి.

ఈ భావం ఇంతకుముందే ప్రకటితమయినా, ఇక్కడ చెప్పిన తీరు వేరు. శ్రియఃపతికి పాదుకలను సమర్పించిన సుకృతాత్ములు ఇప్పుడు శివపదవిని, తర్వాత బ్రహ్మపదవిని పొందుతారు. పర్యాయోక్త్యలంకారం. వసంత తిలకా వృత్తం.

295. రంగేశ్వరే సమధిరూఢ విహంగరాజే
మాతంగరాజ విధృతాం మణిపాదుకే! త్వామ్ ।
అన్వాసతే విధృత చారు సితాతపత్రాః
స్వర్గౌకస స్సుభగ చామర లోలహస్తాః । –35.

అర్థం :– హే మణిపాదుకే = ఓ రత్నపాదుకా! రంగేశ్వరే = శ్రీరంగనాథుడు; సమధిరూఢ విహంగరాజే =ఎక్కబడిన పక్షిరాజు కలవాడుకాగా; స్వర్గ + ఓకసః = నాకవాసులు; మాతంగరాజ విధృతాం = గజరాజుచే ధరింపబడిన; త్వాం = నిన్ను; విధృత చారుసిత + ఆతపత్రాః = ధరింపబడిన అందమైన, తెల్లని గొడుగులుకలవారై ; సుభగ చామర లోలహస్తాః = రమ్యమైన చామరాలతో, చలించే చేతులుకలవారై ; అన్వాసతే = అనుసరిస్తారు.

తా॥ ఓ మణిపాదుకా! శ్రీరంగరాజు గరుడ వాహనుడైనప్పుడు గజరాజ వాహనవైన నిన్ను, అందమైన శ్వేతచ్ఛత్రాలను ధరించి, చేతులతో వింజామరాలను వీచే దేవతలు అనుసరిస్తారు.

వ్యాఖ్య :- ప్రత్యేక వాహనాలపైన రంగనాథుడు, పాదుకాదేవి సంచరించే వైభవం వర్ణితం.

ఉత్సవంలో దేవతాహ్వానం ఒక ప్రక్రియ. నిలింపులు పత్నీపుత్ర సమేతంగా వాహనాల మీద ఇంపుగా వచ్చి భగవత్సేవలో పాల్గొంటారు. ఉత్సవంలో ప్రతిదినం వేర్వేరు వాహనాలపై భగవంతుడు సంచరిస్తాడు. ఈ వేళ గరుడసేవ. శ్రీరంగనాథుణ్ని ఖగరాజు ధరిస్తే, పాదుకాదేవిని గజరాజు - ఐరావతం - ధరించింది. 'అగ్రతస్తే గమిష్యామి' అన్నట్లు పాదుకాదేవి ఐరావతం మీద గరుడవాహనునికి ముందే సంచరిస్తుంది.

మాతంగరాజవాహనయైన పాదుకాదేవికి ఇరువైపుల దేవతలు గౌరవంతో తెల్లని గొడుగులు పట్టారు. దేవాంగనలు భక్తితో వింజామరాలను వీచారు. శ్రీరంగనాథుని ఉత్సవంతో పాటు పాదుకోత్సవం సేవింపబడింది.

నింగిలో సంచరించే వాహనాన్ని అధిరోహించిన శ్రీరంగనాథుని సంచారవైభవం భూలోకవాసులకు రమణీయమైతే, నేలమీద సంచరించే వాహనాన్ని అధిరోహించిన పాదుకాదేవి సంచారవైభవం దివి నుంచి భువికి దిగివచ్చిన దేవతలకు కమనీయమైనదని గమనీయం. ఉదాత్తాలంకారం. వసంత తిలక.

296. విష్ణోఃపదం గతివశా దపరిత్యజంతీం
లోకేషు నిత్య విషమేషు సమప్రచారామ్ ।
అన్వేతు మర్హతి ధృతా మఖిలైఃసురేంద్రై
ర్గంగా కథంను గరుడధ్వజ పాదుకే! త్వామ్ ॥ -36.

అర్థం :- హే గరుడధ్వజ పాదుకే = ఓ గరుడధ్వజుని పాదుకా! విష్ణోః, పదం = విష్ణుపాదాన్ని/ఆకాశాన్ని; గతివశాత్ = గమనకారణంవల్ల; అపరిత్యజంతీం = విడువనట్టి; నిత్య విషమేషు = ఎల్లప్పుడు, తారతమ్యంగల/మిట్టపల్లాలుగల; లోకేషు = జనులపట్ల/భువనాల్లో; సమప్రచారాం = సమాన సంచారం కలిగినట్టి; అఖిలైః = సమస్తమైన; సురేంద్రైః = అమరవరులచే; ధృతాం = ధరించబడిన; త్వాం = నిన్ను; గంగా = గంగాదేవి; కథం, ను = ఎట్లు; అన్వేతుం = అనుసరించడానికి; అర్హతి = తగును?

తా॥ ఓ గరుడధ్వజ పాదుకా! శ్రీ మహావిష్ణుపాదాన్ని/ ఆకాశాన్ని, గమన కారణంవల్ల వదలని, ఎల్లప్పుడు సమంగా లేని లోకులపట్ల/భువనాల్లో, సమాన సంచారం కలిగిన, సకల దేవ నాయకులచే ధరింపబడే నిన్ను గంగాదేవి ఎలా అనుసరింపతగుతుంది?

వ్యాఖ్య :- గంగాదేవి పాదుకా సదృశికాదని వర్ణితం.

1. పాదుకాదేవి భగవంతుడెక్కడ సంచరించినా, ఆయన పాదాలను పరిత్యజించదు, 'గాంగతత్వాత్, 'గంగా'. గంగ విష్ణుపాదం నుంచి జనించి, ఆకాశం నుంచి భ్రష్టయై, నేలమీద పడి, పారి విష్ణుపదాన్ని పరిత్యజించింది.

2. పాదుకాదేవి సుఖదుఃఖ తారతమ్యంగల జనుల పట్ల రాగద్వేషాలు లేక సమానభావంతో సంచరిస్తుంది. గంగ నిమ్నోన్నత స్థలాల్లో, మిట్టలో మెల్లగా, పల్లంలో వేగంగా ప్రవహిస్తూ, కుటిలంగా సంచరిస్తుంది.

3. పాదుకాదేవిని బ్రహ్మాది దేవతలందరు నెత్తినెత్తుకుంటారు. గంగాదేవిని ఒక్క శివుడు మాత్రమే నెత్తినెత్తుకున్నాడు.

'కథం' ఎట్లా! అయ్యో! ఎట్లా? అని దేబరిల్లుతూ అధోగతిపాలైన గంగాదేవి, 'ధ్వజం'లాగా మహోన్నతస్థాయితో ఉండే పాదుకాదేవితో సమానగతి కలది కానే కాదు

శ్లేషాను ప్రాణిత వ్యతిరేకాలంకారం. వసంత తిలకా వృత్తం.

297. భిక్షా మపేక్ష్య దనుజేంద్ర గృహం ప్రయాతు
ర్గుప్త్యై గవాం విహరతో వహతశ్చ దూత్యమ్ ।
తత్తా దృశాని చరణావని! రంగభర్తు
స్త్వ త్సంగమేన సుభగాని విచేష్టితాని ॥ –37.

అర్థం :– హే చరణావని = ఓ పాదుకా! భిక్షాం = భిక్షను; అపేక్ష్య = కోరి; దనుజేంద్ర గృహం = రాక్షసరాజు యొక్క ఇంటికి; ప్రయాతుః = పోవునట్టి; గవాం = గోవుల యొక్క; గుప్త్యై = రక్షణకోసం; విహరతః = సంచరించునట్టి; దూత్యం = దూతకృత్యాన్ని; వహతః, చ = నిర్వహించునట్టి; రంగభర్తుః = శ్రీరంగరాజుయొక్క; తత్ + తాదృశాని = ఆయారకాలైన; విచేష్టితాని = తగని పనులు; త్వత్ + సంగమేన = నీ సంబంధంచేత; సుభగాని = హృదయంగమాలైనాయి.

తా॥ ఓ పాదుకా! భిక్షనపేక్షించి రాక్షసరాజు ఇంటికి పోవునట్టి, ఆలకాపరిగా సంచరించునట్టి, దూతకృత్యాన్ని నిర్వహించునట్టి శ్రీరంగరాజు యొక్క ఆయా రకాల తగని చేష్టలు నీ సంబంధంచేత హృదయంగమాలయ్యాయి.

వ్యాఖ్య :– భగవంతుని అనుచిత కృత్యాలు పాదుకాసంగమంచేత ప్రశంసనీయాలయ్యాయి.

1. శ్రియఃపతి వామనుడై బలి చక్రవర్తి ఇంటికి పోయి బిచ్చమడుక్కోవడం సముచితమా?

'తూలాదపియాచకః' అన్నట్లు గడ్డిపోచకన్న దూదితేలిక. యాచకుడు ఆ దూదికన్న చులుకన కదా! పైగా, పగవాని యింటికిపోయి బిచ్చమెత్తుకోవడం ఎంత అకృత్యం.

2. శ్రీకృష్ణుడు పసుల కాపరియై అడవుల్లో తిరుగడం ఎంత జ్ఞానహీనమైన పని!

'కఱవైగళ్ పిన్‌శెన్రు' – పశువులే గురువై మార్గదర్శకంగా ముందునడుస్తుంటే వెనుక నడిచే వాడు కదా! పసుల కాపరి.

'కృతానుకారావి వ గోభిరార్జవే' – అన్నట్లు పశువులు చక్కగానో, వంకరగానో పోయిన మార్గమే పసుల కాపరికి ఋజుమార్గం కదా! ఇరుగుపొరుగు వారితో కలిసి జీవించడానికి ఊళ్ళో కాలు నిలువక, పసులు పచ్చగడ్డిమేస్తుంటే, కాపరి సద్దికూడు తింటూ దినమంతా అడవిలోనే గడుపడం పశువులకంటె కడుహీనం కాదా!?

3. దిక్కూ, చక్కీలేక అడవులపాలై ఆకులలములు మెసగిబతికి వచ్చిన పాండవులు, **'కాలేదూత్యద్రుతతర గతిం'** –అన్న సమయంలోనే అక్కడుండాలని ఆదేశిస్తే, అంత చక్కనయ్య గుక్కబట్టి, పిక్కబలంచూపి ఒక్కక్షణంలో పక్కణంచేరి, చెప్పిన మాటలను చిలుకపలుకుల్లాగా వినిపిస్తూ, ఉభయపక్షాలకు 'అంబట్లో తెడ్డు' లాగా మెలగుతూ, అందులో పగతుర నడుమ ప్రాణానికి తెగించిచేసే దూతకృత్యం, ఒకరి మోచేతినీళ్ళు తాగి బతికే వాడుచేసే పనికాదా?

శ్రీరంగరాజు నేలమీదనే సంచరిస్తూ చేసిన ఇలాంటి అనుచితకృత్యాలన్నీ సార్వభౌమ లక్షణ లక్షితయైన పాదుకాదేవి సంబంధం వల్ల లోక సంక్షేమ కార్యాలుగా పరిణమించాయి.

"రక్షతే భగవాన్విష్ణుర్భక్తా నాత్మ శరీరవత్" చేతనా చేతన ప్రపంచమంతా భగవంతునికి శరీరమే కాబట్టి, తన శరీరాన్ని తానే విధంగానైనా కాపాడుకోవడం నైసర్గికం. **"ఉపాయోపేయత్వే తదిహతవ తత్త్వమ్"** పొందించేవాడూ పొందదగినవాడూ పరమాత్ముడే కదా! ఆ 'పొందు' పాదాలకూ, పాదుకలకూ అవినాభావంగా ఉంది. కాబట్టి, పాదుకా సంగమం – పొందు – వల్ల అనుచిత కృత్యమైనా హృద్యంగా ఉంటుంది. పదార్థహేతుక కావ్యలింగాలంకారం.

ఆలంకారికవస్తు ధ్వని. వసంత తిలకా వృత్తం.

298. నిర్వ్యాజ్యమాన నవతాళలయప్రథిమ్నా
నిర్యంత్రణేన నిజసంచరణ క్రమేణ ।
మృద్నాసి రంగనృపతే ర్మణిపాదుకే! త్వం
దుఃఖాత్మకాన్ ప్రణమతాం దురిత ప్రరోహాన్ ॥ –38.

అర్థం :– హే రంగనృపతేః, మణిపాదుకే = ఓ రంగరాజు మణిపాదుకా! త్వం = నీవు; నిర్వ్యాజ్య – ప్రథిమ్నా/నిర్వ్యాజ్య మాన = బాగా ప్రకటితమవుతున్న; నవ = క్రొత్త (అద్భుతమైన) తాళ = కాలక్రియా మానం యొక్క; లయ = సామ్యం యొక్క; ప్రథిమ్నా = ఘనత కలిగిన; నిర్యంత్రణేన = ప్రతిబంధకం లేని; నిజ సంచరణ క్రమేణ = స్వీయసంచార పరిపాటిచేత; ప్రణమతాం = నమస్కరించే వారియొక్క; దుఃఖాత్మకాన్ = దుఃఖరూపాలైన; దురిత ప్రరోహాన్ = పాపపు మొక్కలను; మృద్నాసి = మర్దిస్తున్నావు.

తా॥ ఓ రంగరాజు మణిపాదుకా! నీవు, ప్రకటితమవుతున్న అద్భుత తాళలయల ఘనతకలిగిన అడ్డులేని, నీ సంచార క్రమంచేత నమస్కరించే జనుల దుఃఖరూపాలైన పాపాంకురాలను మర్దిస్తున్నావు.

వ్యాఖ్య :– పాదుకా సంచారాధీన ఫలం ఉత్ప్రేక్షితం.

పాదుకా సంచారక్రమం అప్రతిబంధకం. అదితాళ లయబద్ధమైన సంచారం. ఆ నడక నృత్త గీతవాద్యాలకు అనుగుణంగా ఉంటుంది. **"తాళః కాలక్రియామానం". "లయః సామ్యం".** (అమరం)

నృత్తగీతాది కళలు భౌతిక, మానసిక బాధలను తొలగించి వినోదాన్ని కలిగిస్తాయి. త్యాగయ్య, క్షేత్రయ్య లాంటి కళామూర్తులు మోక్షానందాన్నీ పొందారు. ఏపుగా ఎదిగిన తాళవృక్షాలనూ పడగొట్టే వేగం కలది పాదుకా సంచారం.

జనుల బ్రతుకుతెరువులో పాపాల మొక్కలు మొలచి, ఆధివ్యాధుల రూపంలో దుఃఖాన్ని కలిగిస్తాయి. కళా ప్రపూర్ణమైన పాదుకాసంచారక్రమం నమజ్జనుల పాపాంకురాలను నిర్మూలించి బ్రహ్మానందాన్ని కలిగిస్తుంది.

"తేనుకన్ పిలంబన్ కాళియనెన్నుంతీ ప్పవ్వాందు కళడంగవుళక్కి కానకంబడి యులావియులావి కరుంజిరుకన్కు ళలూ దినపోదు" – 'అడవిలో సంచరిస్తూ, శ్రీకృష్ణుడు వేణుగానం చేస్తూ, ఆడుతూ ఉంటే ధేనుకాసురుడు, ప్రలంబుడు, కాళియుడు అనే దుష్టజంతువులు అణచివేయబడినాయి, అన్నారు పెరియాళ్వార్. అంటే, పాదుకాధీనమైన శ్రీకృష్ణుని సంచారంవల్ల దౌష్ట్యం మర్దించబడింది.

వసంత తిలకా వృత్తం.

299. నిత్యం యఏవ జగతో మణిపాదరక్షే!
సత్తా స్థితి ప్రయతనేషు పరం నిదానమ్ ।
సోஉపి స్వతంత్ర చరిత స్త్వదధీన వృత్తిః
కావా కథా తది తరేషు మితం పచేషు । –39.

అర్థం :– హే మణిపాదరక్షే = ఓ రత్నపాదుకా! యః, ఏవ = ఏ ఒక్కడే; నిత్యం = ఎల్లప్పుడు; జగతః = జగత్తు యొక్క; సత్తా, స్థితి, ప్రయతనేషు = ఉత్పత్తి, రక్షణ, ప్రవృత్తి నివృత్తుల విషయమై, పరం = ఉత్కృష్టమైన, నిదానం = మూల కారణమో, స్వతంత్ర చరితః = స్వతంత్ర వర్తనుడైన; సః, అపి = ఆభగవంతుడు కూడా; త్వత్ + అధీన వృత్తిః = నీకు అధీనమైన వ్యాపారం కలవాడు. తత్ + ఇతరేషు = అతని కంటే వేరైన బ్రహ్మాదుల విషయమై ; మితంపచేషు = క్షుద్రుల విషయమై ; కా, వా, కథా = చెప్పేదేమి?

తా॥ ఓ మణిపాదుకా! ఎవడైతే జగత్తు యొక్క సృష్టి స్థితి ప్రవృత్తి నివృత్తుల విషయమై మూలకారణుడో, స్వతంత్ర చరితుడైన ఆ పరమాత్ముడు కూడా నిత్యం నీ అధీనమైన నడవడి కలవాడు. తదితర బ్రహ్మాదుల, క్షుద్రుల విషయమైతే ఇక చెప్పేదేమి?

వ్యాఖ్య :– జగద్వ్యాపారం పాదుకాధీనం.

సర్వేశ్వరుడు జగత్తుకు మూలకారణుడు. అంటే, అఖిల భువన జన్మస్థేమభంగాది లీలలు కలవాడు. 'ప్రయతనం' అంటే ప్రవృత్తి నివృత్తులనూ కల్పిస్తాడు. సర్వశేషి శేషభూతులైనవారిని మోక్షార్హులుగా ప్రవర్తింప చేస్తాడు. భగవంతుని నిరంకుశైశ్వర్యం తెలిసినా, తెలియకున్నా, రావణ దుర్యోధనుల రీతిగా, మదాంధులై వర్తించే వారిని నశింప జేస్తాడు.

"విష్ణో స్సకాశాదుద్భూతం జగత్తత్రైవచస్థితమ్ ।
స్థితి సంయమకర్తాఽసౌ జగతోఽస్య జగచ్చ సః" । (వి.పు)

'విష్ణుమూర్తి నుంచి జనించిన జగత్తు విష్ణుమూర్తియందే ఉంది. జగత్తుకు రక్షకుడూ, నియామకుడూ విష్ణువే. జగత్తుకూడా తానే'.

భగవద్విభూతి అనంతం. **'పాదోఽస్య విశ్వాభూతాని'** శ్రుతిరీత్యా, జగత్తు, పరమాత్ముని ప్రాకృత విరాట్ స్వరూపం. ఒక్క పాదం – అంశం – గా ఉన్న ఈ జగత్తుకు 'లీలా విభూతి' అని పేరు. ఇక 'త్రిపాద్విభూతి'కి 'నిత్య విభూతి' అని పేరు.

పనిచేసే వ్యక్తికి, పనికి తగిన ఫలం ప్రభుత్వమే ఇస్తుంది కదా! అలాగే జీవులకు, చేసుకున్న కర్మకు తగిన ఫలాన్ని ప్రభుత్వం నుంచి పొందే 'హక్కు' ఉంది. కర్మల తారతమ్యాన్నిబట్టి ఫలభోగ తారతమ్యం ఉంటుంది. ప్రకృతి మండలంలో బ్రహ్మాదిస్తంబ – క్రిమి – పర్యంతం కర్మఫలాన్ని అనుభవింపజేసే నియామకుడు భగవంతుడే. కాబట్టి జగద్వ్యాపార విషయమై పరంధాముడు స్వతంత్రచరితుడు.

సంచరించేవాడు స్వతంత్రుడే అయినా, ఆ సంచారం పాదుకలమీదనే ఆధారపడింది కదా! కాబట్టి సర్వేశ్వరుడే పాదుకాధీనవర్తనుడైనప్పుడు, పరతంత్రులైన దేవ తిర్యఙ్మనుష్యాదుల వర్తనం పాదుకాధీనం కాదని ఎలా చెప్పగలం? **"క్షుద్రకింపచాన మితం పచాః"** (అమరం)

'జగ'మంటే జనన గమన వ్యాపారంతో పరిణమించేది. కాబట్టి, సర్వం పాదుకాధీనమని, కావ్యార్థాపత్త్యలంకృత శ్లోకమిది.

వసంత తిలకా వృత్తం.

300. నిర్విష్టనాగశయనేన పరేణ పుంసా
న్యస్తేపదే త్వయి పదావని! లోకహేతోః ।
స్వర్గౌకసాం త్వదనుధావన తత్పరాణాం
సద్యఃపదాని విపదా మపదం భవంతి । –40.

అర్థం :– హే పదావని = ఓ పాదుకా! నిర్విష్టనాగశయనేన = అనుభవించిన శేషతల్పం గల; పరేణ, పుంసా = పరమ పురుషునిచేత; లోకహేతోః = లోకప్రయోజనం కోసం; త్వయి = నీయందు; పదే = పాదం; న్యస్తే ఉంచబడగా, త్వత్ + అనుధావన, తత్పరాణాం = నీవెంట పరుగిడే ఆసక్తిగల; స్వర్గ + ఓకసాం = దేవతలయొక్క; పదాని = స్థానాలు; సద్యః = తత్కాలాననే; విపదాం = ఆపదలకు; అపదం = స్థానం కాకుండా; భవంతి = ఉంటాయి.

తా। ఓ పాదుకా! శేషతల్పాన్ని అనుభవించిన పరమపురుషుడు లోక ప్రయోజనార్థం నీయందు అడుగు(లు) పెట్టగా, నీ వెంట పరుగిడే ఆసక్తిగల దేవతల స్థానాలు తత్కాలాన ఆపదలకాస్పదంకాకుండా ఉంటాయి.

వ్యాఖ్య :– పాదుకా సంచారాన్ని సేవింపవచ్చిన దేవతలకు ఆపదలు కలుగవు.

నాగశయనుడు లేచిన వెంటనే లోక ప్రయోజనార్థం పాదుకలను ధరించి బయల్దేరగా, పాదుకాదేవి గమనంలో వేగం పుంజుకుంటుంది. పాదుకా సంచార వైభవాన్ని సేవించడానికి స్వర్గవాసులు తమ తమ స్థానాలను విడిచివచ్చి, అహమహమికాపేక్షతో ఒండొరులను త్రోసుకుంటూ పాదుకాదేవి వెంట పరుగెత్తుతుంటారు. సాధారణంగా పరుగు పందెం లాంటి దృశ్యమిది. పరుగెత్తే వారు, కాళ్ళు తడబడడం, నొప్పి పెట్టడం, జారిపడడం లాంటి ఆపదలకు గురి అవుతారు. స్వర్గవాసులకైనా పదస్ఖలనం సంభవమే. **"క్షీణే పుణ్యేమర్త్యలోకే విశంతి"** పుణ్యం తరిగి పోగానే స్వర్గం నుంచి భూమి మీద పతనం తప్పదు. ఉన్నత పదవుల మీద ఉన్నవారికైనా, స్థాన చలనం ఉంటుంది కదా!

దేవతలు భగవత్కైంకర్యంకోసం స్వర్గాన్ని విడిచి మర్త్యలోకంలో తన్మయులై పరుగెత్తుతున్న అవకాశాన్ని చూచి, అసురులు స్వర్గాన్ని ఆక్రమించి, ముఖ్యస్థానాలను స్వాధీనపరుచుకోవడం, దేవతలకు భయానకమైన ఆపద. కానీ పాదుకాదేవి కటాక్షం వల్ల అసురులకు చిత్తం చెత్తయ్యై, స్వర్గాన్ని ఆక్రమించే ఆలోచనయే కలుగదు. దేవతల పదవులుగానీ, సదనాలుగానీ ఆపదలపాలు కానేకావు.

'పద' శబ్ద శ్లేషతో కూడిన అసంగత్యలంకారం. వసంత తిలకా వృత్తం.

301. శరదుపగమకాలే సంత్యజన్ యోగనిద్రాం
శరణముపగతానాం త్రాణహేతోఃప్రయాస్యన్ ।
జలధి దుహితురంకా న్మందమాదాయదేవి !
త్వయిఖలు నిదధాతి స్వంపదం రంగనాథః । –41.

అర్థం :– హే దేవి = ఓ పాదుకాదేవీ! రంగనాథః = శ్రీరంగనాథుడు; శరత్ + ఉపగమకాలే = శరదృతువు వచ్చినప్పుడు, యోగనిద్రాం = స్వాత్మానుభవరూపమైన నిద్రను; సంత్యజన్ = వదలుతూ; శరణం = అభయాన్ని (కోరి); ఉపగతానాం = వచ్చినవారియొక్క; త్రాణహేతోః = రక్షణార్థం, ప్రయాస్యన్ = పయనించకోరిన వాడై ; స్వం, పదం = తన పాదాన్ని; జలధి దుహితుః = కడలి కూతురు యొక్క; అంకాత్ = తొడ (మీది) నుంచి; మందం = మెల్లగా; ఆదాయ = తీసి; త్వయి, ఖలు = నీయందేకదా! నిదధాతి = ఉంచుతాడు.

తా॥ ఓ దేవీ! రంగనాథుడు శరదృతువు వచ్చిన సమయంలో యోగనిద్రను వదలుతూ, అభయార్థుల రక్షణార్థం పయనించకోరిన వాడై తన పాదాలను సముద్ర తనయ యొక్క ఉత్సంగం నుంచి మెల్లగా తీసి, నీయందేకదా! నిక్షేపిస్తాడు.

వ్యాఖ్య :– లక్ష్మీదేవి వలె పాదుకాదేవి అచ్యుత వల్లభ.

శ్రీరంగనాథుడు నాలుగు నెలలు యోగనిద్రలో ఉంటాడు అని పురాణ ప్రసిద్ధం. ఆషాఢ శుద్ధ ఏకాదశిని 'శయనైకాదశి' అంటారు. భగవంతుడు (చాతుర్మాస్య) యోగనిద్రకు పూనుకుంటాడు. ఆణి మాసంలో శ్రీరంగనాథుని మూలమూర్తికి తైలం పూసి, కటి నుంచి పాదాల వరకు కనబడకుండా తెరకడుతారు. ఈ సమయంలో స్వామికి ఉత్సవాలు ఉండవు. రెండు మాసాల తర్వాత 'పరివర్తనైకాదశి' అంటే; భాద్రపద శుద్ధ ఏకాదశి నాడు శేషశాయి మరొక ప్రక్కకు తిరిగి నిద్రిస్తాడు. మరొక రెండు మాసాలకు 'ఉత్థానైకాదశి' అనబడే కార్తీకశుద్ధ ఏకాదశి నాడు సెజ్జనుంచి లేస్తాడు. ఆశ్వీజకార్తీక మాసాల్లో శరదృతువు ఉంటుంది. ఈ శరత్కాలంలో ఉత్థానైకాదశినాడు శ్రీరంగనాథుడు లోకహిత చింతామాత్రమైన నిద్రను వదలుతాడు. స్వామి మేలుకోగానే తన పాదాలను సంవాహనంచేస్తున్న లక్ష్మీదేవి అంకసీమ నుంచి నొవ్వకుండా, నొప్పించకుండా, మెల్లగా తీసి పాదుకాదేవియందు ఉంచుతాడు. ఎంత ఘాటు ప్రేమయో! ('లడ'లకు అభేదం)మెత్తదనంతో స్తబ్ధంగా ఉండే జడధికూతురు అంకసీమనుంచి, తన కూజాడ్యం సంక్రమిస్తున్నందున, ప్రభువు మందంగా తన చరణాలను తీసి, విక్రమోపేతంగా చేస్తుందని పాదుకాదేవి యందుంచుతాడు. శరత్కాలంలో దారులేకాక ఏరులు కూడా అనుకూలంగా ఉంటాయి. ఏటిలో నీటి వేగమూ మందగిస్తుంది. జలపూర్ణ సరస్సులు కమలాలతో శోభిస్తాయి. సాత్త్వికజనుల హృదయకమలాలూ వికసిస్తాయి. శ్రియఃపతి నాభీ పద్మమూ తేజరిల్లి శరణాగత రక్షణార్థం సర్వశేషిని ఉల్లాసపరుస్తుంది. కాబట్టి, శ్రీరంగరాజు పాదరక్షలను ధరించి తన భక్తులను రక్షిస్తూ వారి విరోధులను శిక్షిస్తూ, ధర్మసంరక్షణ చేయడానికి లోకసంచారం చేస్తాడు. శరత్కాలంలో దేవీప్రభావ మధికం కాబట్టి, పాదుకాసంచారంవల్ల పాపాపన్నులూ, ప్రపన్నులవుతారు. పర్యాయోక్తి, మాలినీ వృత్తం.

302. స్పృశసి పదసరోజం పాదుకే! నిర్వ్యాఘాతం
ప్రవిశసిచ సమస్తాం దేవి! శుద్ధాంత కక్ష్యామ్ ।
అపరమపి మురారేః పూర్వ మాభీరకన్యా
స్వభిసరణ విధీనా మగ్రిమా సాక్షిణీ త్వమ్ ॥ –42

అర్థం :– దేవి! హే పాదుకే = ఓ పాదుకా దేవీ! మురారేః = భగవంతుని యొక్క; పద సరోజం = పాదకమలాన్ని, నిర్వ్యాఘాతం = నిరాఘాటంగా, స్పృశసి = స్పృశిస్తావు. సమస్తాం = సమస్తమైన; శుద్ధాంత కక్ష్యాం = అంతఃపురాల కక్ష్యను; ప్రవిశసి, చ = ప్రవేశిస్తావుకూడా, అపరం, అపి = ఇంకను; పూర్వం = శ్రీకృష్ణావతారంలో; ఆభీరకన్యాసు = గొల్ల పడుచులయందు; అభిసరణ విధీనాం = కామించి వెళ్ళి చేసిన చేష్టలకు; త్వం = నీవు; అగ్రిమా = మొదటి; సాక్షిణీ = సాక్షిణివి.

తా॥ ఓ పాదుకాదేవీ! మురారి పాద సరోజాలను నిరాటంకంగా స్పృశిస్తావు. అంతఃపురావరణలోని గదులన్నిటిలోనూ ప్రవేశిస్తావు. అంతేకాదు, శ్రీకృష్ణుడు గోపకన్యలున్నచోటికి రతికోసం వెళ్ళిచేసిన చేష్టలన్నిటినీ మొట్టమొదట చూచిన దానవు నీవే.

వ్యాఖ్య :– పాదుకాదేవికి తెలియని భగవంతుని సంచారమే లేదు.

పతికి పాదసేవచేసే ఒక దేవి చూస్తుంటే మరొక దేవి నిశ్శంకంగా, నిరాటంకంగానూ (పతి) పాదసేవ చేయజాలదు. కానీ, పాదుకాదేవికి అంతర్బహిః ప్రదేశాల్లో భగవత్పాదాలను మృదువుగా స్పృశిస్తూ, వహించడానికీ ప్రతిబంధకమే లేదు. ఒక దేవి అంతఃపుర ప్రదేశంలోకి మరొక దేవి ప్రవేశించి సంతోషంగా సంచరించనూ చాలదు. ఒకటేమిటి? అంతఃపురావరణలో పాదుక ప్రవేశించి, సంచరించని గదులుగానీ; ప్రదేశాలుగానీ లేనేలేవు. ఇక బయటి సంగతి పాదుక(ల)కు తెలియనిది ఉంటుందా?

పూర్వం చారుతరమూర్తి గోపాల చక్రవర్తి గోపకన్యలున్న ప్రదేశానికి రత్యర్థం ఎలావెళ్ళాడో, ఏమిచేశాడో, ఆ అభిసరణ విహారచేష్టలన్నింటికీ ప్రథమ ద్రష్టి పాదుకాదేవియే.

"శురుంబార్ మెన్‌కుళల్ కన్నియొరుత్తిక్కు, శూళ్ వలైవెత్తుత్తిరియుమ్" (3–1–6)

తుమ్మెదరెక్కల్లాగా నల్లని ఇంపారు కేశసంపదగల ఒక గోపకన్నియకు దృష్టి అనే వలవేసి తిరిగినవాడు శ్రీకృష్ణుడు.

"మచ్చొడు మాళిగై ఏఱి మాదర్‌గళ్ తమ్మిడం పుక్కు-
కచ్చొడు పట్టైక్కిళిత్తు కాంబు తుగిలవైక్కిఱి" – (పెరియాళ్వార్ తిరుమొళి 2-7-3.)

మేడ క్రిందను, మీదికీ ఎక్కి గొల్లపడుచుల రవికెలు, చీరలూ చింపినవాడు నందనందనుడు, అన్నాడు శ్రీవిష్ణుచిత్తుడు.

"యమునా సాక్షిక యౌవనం యువానం" (గోపాల వింశతి)

తన ఇసుక తిన్నెలమీద, పరిసరాల్లోనూ, గోపకన్యలతో జరిపిన యవ్వనక్రీడలను, యమునానది సాక్షాత్తుగాచూచిందన్నారు దేశికులు. పాదుకాదేవి మాత్రం, నల్లనయ్య నక్కుతూ, చొక్కుతూ, టకటొంకుటాటోటులతో టక్కులాడుతూ, పిసాళియై, గుండెలాగగా గొల్లపడుచు కన్నెలున్నచోటికో, గూటికో అభిసరించిన ప్రక్రియలన్నిటికీ ప్రథమ సాక్షిణి. ప్రత్యక్షంగా చూచిందే అయినా, రహస్యాన్ని సదస్యం చేసేదికాదు. ఎవ్వరినీ నొప్పించకుండా, తా నొవ్వకుండా సంచరించే అంతరంగ సఖీమణి పాదుక.

కారకదీపకాలంకారం. మాలినీ వృత్తం.

303. ప్రతిభవనమనన్యే పాదుకే! త్వత్ప్రభావాత్
వివిధ వపుషి దేవే విభ్రమద్యూతకాలే ।
అభిలషిత సపత్నీగేహ యాత్రా విఘాతం
గ్లహ యతి రహసి త్వాం షోడశస్త్రీ సహస్రమ్ । –43.

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకా! త్వత్ + ప్రభావాత్ = నీ మహిమవల్ల; వివిధ వపుషి = అనేక రూపాలను దాల్చిన; దేవే = శ్రీకృష్ణుడు; ప్రతిభవనం = ఒక్కొక్క ఇంట్లో; అనన్యే = ఒక్కడే (ఆ గృహిణినే తప్ప మరొక గృహిణిని తలచ కుండా) ఉన్నప్పుడు; షోడశ స్త్రీ సహస్రం = పదహారువేల స్త్రీలలో ప్రతి స్త్రీ; విభ్రమద్యూతకాలే = విలాసంగా జూదమాడే వేళలో; అభిలషిత, సపత్నీగేహయాత్రా, విఘాతం = మరొక సవతి ఇంటికి పోవడానికి ప్రతిబంధకాన్ని కోరుతూ; రహసి = ఏకాంతంగా; త్వాం = నిన్ను; గ్లహయతి = పణంగా పెడుతుంది.

తా। ఓ పాదుకా! ఒకే ఒక శ్రీకృష్ణుడు నీ శక్తివల్ల అనేక శరీరాలను ధరించి పదహారువేల స్త్రీల ఇండ్లలో ఉన్నప్పుడు, ప్రతి గృహిణి విలాసంగా జూదమాడే వేళలో తన పతి ఏ సవతి ఇంటికి పోకుండా ప్రతిబంధకాన్ని కోరుతూ, తన ఇంట్లోనే రహస్యంగా నిన్ను పణంగా పెడుతుంది.

వ్యాఖ్య :– ప్రతి గృహిణి పాదుక(ల)ను పణంగా పెడుతుందని, పర్యాయోక్తం.

శ్రియఃపతి శ్రీకృష్ణావతారంలో పదహారువేల స్త్రీలను పెండ్లాడాడని శ్రీమద్భాగవత పురాణ ప్రసిద్ధం. శ్రీకృష్ణుడు లీలాపరుడై ఒక్కొక్క గృహిణికి ఒక్కొక్క శ్రీకృష్ణుడుగా ఒకే సమయంలో ప్రతి గృహంలో దివ్యంగా వెలిశాడు. వీరికి అనన్యుడై – ప్రతి గృహిణి, తక్కిన సవతులను కానక, తననే ఎక్కువ ప్రేమతో చూస్తాడనుకునే రీతిగా ప్రవర్తించాడు.

ప్రతి గృహిణి తనను వదలి శ్రీకృష్ణుడు ఏ సవతి ఇంటికైనా పోతాడేమో అనే భయం వల్ల జూదమాడ గోరుతుంది. పాదుకలు లేకుండా శ్రీకృష్ణుడెక్కడికీ పోలేడు. అవి ఉన్నంతసేపు పతి తన దగ్గరనే ఉంటాడని నమ్ముతుంది. ఏకాంతంగా జూదమాడే సమయంలో పాచికలను పారించే ముందు 'ఏమండీ! పాదుకలను పందెం పెట్టండి. అవి, గెలిచినవారి దగ్గర ఉంటాయి' అని, ఈ యుక్తి మరొకరికి తెలియకుండా, పత్ని పతితో చెప్పుతుంది. పదహారువేల సపత్నుల సంగతి ఇలాగే ఉంది. పదహారువేల జతల కన్న అధిక రూపాలను దాల్చలేని పాదుకా ప్రభావమే, పదహారువేల మగువలకు, మగని మీదనున్న విశ్వాసంకంటె పాదుకల మీదనే అధిక విశ్వాసం కలుగడానికి మూలకారణ మయింది. ప్రతి గృహిణికి ఇష్టసాధనమయింది పాదుక.

"ప్రతి యువతిగృహీతైనైకరూపః, ప్రణయవతీభి రనన్య ఇత్యుపేతః।
అపహృత మణిపాదుకః కయాచిత్, పదమపిగంతుమశక్నువన్నివాసీత్" ॥

'యాదవాభ్యుదయం'(24స. 27)లోనూ, ఒక ప్రణయవతిపాదుకలను దాచిపెట్టడం వల్ల, ప్రతి ప్రణయవతికి తగినట్లు అనేక రూపాలు దాల్చిన శ్రీకృష్ణుడు, పోవడానికి ఒక్క అడుగైనా వేయశక్యంకాని వాడైనట్లు దేశికులు వర్ణించారు.

మాలినీ వృత్తం.

304. తటభువి యమునాయాశ్ఛన్నవృత్తౌ ముకుందే
ముహురధిగమహేతో ర్మృహ్యతాం యౌవతానామ్ ।
శమయితు మలమాసీచ్ఛంఖ చక్రాది చిహ్నా
ప్రతిపద విచికిత్సాం పాదుకే! పద్ధతిస్తే ॥ –44.

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకా! యమునాయాః = యమునా నది యొక్క; తటభువి = తీర ప్రదేశంలో; ముకుందే = ముకుందుడు; ఛన్నవృత్తౌ = దాగియుండగా; శంఖచక్రాది చిహ్నా = శంఖం, చక్రం మొదలైన గుర్తులుకల; తే = నీ యొక్క; పద్ధతిః = మార్గం (ముద్ర); అధిగమహేతోః = చూడడంకోసం; ముహుః = మాటిమాటికి; ముహ్యతాం = అనురాగం కలిగిన; యౌవతానాం = యువతీ సమూహాలకు; ప్రతి పదవిచికిత్సాం = అడుగడుగున సంశయాన్ని; శమయితుం = తొలగించడానికి; అలం, ఆసీత్ = సమర్థమయింది.

తా॥ ఓ పాదుకా! యమునా నదీ తీర భూమిలో ముకుందుడు దాగి ఉన్నప్పుడు శంఖ చక్రాది చిహ్నాలు కలిగిన నీ మార్గం, చూడడానికి అనురాగంగల యువతీ సమూహాలకు అడుగడుగున కలిగిన సంశయాన్ని తొలగింప సమర్థమయింది.

వ్యాఖ్య :– పాదుకా మార్గం. గోపికల సంశయాన్ని నివారించింది.

శ్రీకృష్ణుడు యమునా తీరమందు గోపికలతో దాగుడుమూతలాడాడు.

"ఒరుకాలిల్ శంగొరుకాలిల్శక్కర ముళ్ళడి పాటిత్తమ్మైత్త
ఇరుకాలుం గొం డంగంగు ఎళుతి నాళ్ప్ తిలచ్చినైపడనడందు" (పె.తి.మొ)

ఇసుక తిన్నెలమీద నడిచినప్పుడు శ్రీకృష్ణుని పాదతలాలకున్న శంఖచక్ర చిహ్నాలు ముద్రింపబడినట్లు శ్రీ భట్టనాథులు వర్ణించారు. **"అవిద్యా మూర్ఛయోర్మోహః ప్రీతిభేదేఽపి".** (కవి దర్పణం). గోపికలు, శ్రీకృష్ణుడెక్కడ దాగినాడో అని ప్రేమతో వెదకుతున్నప్పుడు, శంఖచక్రాది లాంఛనాలతో ఉన్న పాదుకా ముద్రలను ఒక్కొక్కటి పరిశీలించగా, వారి సంశయం తీరింది. శ్రీకృష్ణుని జాడ తెలిసి, పడుచులు పరమానందాన్ని అనుభవించారు. అనుమానాలంకారం. మాలినీ వృత్తం.

305. అధిగత బహుశాఖాన్మంజు వాచశ్శుకాదీన్
సరసిజ నిలయాయాః ప్రీతయే సంగ్రహీతుమ్ ।
ప్రకటిత గుణజాలం పాదుకే! రంగ బంధో
రుపనిష దటవీషు క్రీడితం త్వత్సనాథమ్ । –45.

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకాదేవీ! అధిగత బహుశాఖాన్ = నేర్వబడిన అనేక వేదశాఖలుగల/పొందబడిన అనేక చెట్లకొమ్మలుగల; మంజువాచః = మధురాలాపాలుగల; శుక + ఆదీన్ = వ్యాసపుత్రుడైన శుకాది మహర్షులను/చిలుక మొదలైన పక్షులను; సరసిజ నిలయాయాః = లక్ష్మీదేవి యొక్క; ప్రీతయే = సంతోషం కోసం; సంగ్రహీతుం = స్వీకరించడానికి/పట్టుకోవడానికి; ప్రకటిత గుణజాలం = వెల్లడింపబడిన (కల్యాణ) గుణసముదాయంగల/పరచబడిన దారాలవలగల; రంగబంధోః = శ్రీరంగ రాజు యొక్క; ఉపనిషత్ + అటవీషు = వేదాంత వనాలయందలి; క్రీడితం = ఆట (విలాస సంచారం) త్వత్ + సనాథం = నీతో కూడింది.

తా। ఓ పాదుకాదేవీ! అనేక వేదశాఖల నభ్యసించిన మధురంగా ఆలపించిన శుకాది మహర్షులను లక్ష్మీదేవి ప్రీత్యర్థం స్వీకరించడానికి –

పలుచెట్ల కొమ్మలను చేరి కమ్మగా కులికే శుకశారికాది పక్షులను తమ్మి యింటి గరిత సంతోషం కోసం పట్టుకోవడానికి, కల్యాణగుణ సముదాయమనే దారాలవలను పన్నిన శ్రీరంగనాథుని ఉపనిషదరణ్యాల యందలి లీలా సంచారం నీతో కూడిందే.

వ్యాఖ్య :– భగవంతుని వేదాంత వనవిహారం పాదుకా సనాథం.

శ్రియఃపతి బృందావనంలోనే కాక బృహదారణ్యంలోనూ సంచరిస్తుంటాడు. కఠిన విషయాలను ఉపదేశించే ఉపనిషత్తులు అడవులుగా అవధరింపబడుతాయి. శాఖలంటే వేద శాఖలు, చెట్ల కొమ్మలు.

"శాఖాతు పాదే వక్షాంతరేభుజే, వికటే పాదపాంగే చక్రభేదే ఛందసామపి" । గుణమంటే స్వభావం, దారం. **"మౌర్వ్యా సూదవృకోదర తంత్వా వృత్తీంద్రియేషు రూపాదౌ । రాగాదౌ సంధ్యాదౌ త్యాగాదా వ ప్రధానకే చగుణః"** । 'జాలం' అంటే సమూహం, వల.

"జాలం జాలక మిత్యేతౌ గవాక్షానాయయోర్గణే". (నానార్థరత్నమాల)

"జాలంస్యా దానాయేక్షారకే చయే". (కవి దర్పణం)

ఉపనిషత్తులు వేదాల్లోని భేదాలే, శాఖలే. భగవంతుణ్ని ప్రతిపాదించేవి కాబట్టి ఇది బ్రహ్మవిద్య. శ్రీవేద వ్యాస మహర్షి పుత్రుడు శ్రీ శుకమహర్షి, శిష్యులైన పైల, సుమంత, జైమిని, వైశంపాయనాది మహర్షులు బ్రహ్మవిద్యానిష్ఠులై భగవంతుని జ్ఞానశక్త్యాద్యనంత కల్యాణగుణాలను అద్భుతంగా కీర్తించారు. వీరి మధురాలాపాలకు పురుషకారిణియైన లక్ష్మీదేవి చాలా సంతోషిస్తుంది. ఈ విద్యానిష్ఠులను స్వీకరించాలి అంటే భగవద్గుణాలను ప్రకటించడమే. ఇది వేదాంత గ్రాహ్యం.

చెట్లకొమ్మలపైన ఇంపుగా పలికే కీరశారికాది పక్షులను సు(మ) వాసినీ విలాసం కోసం వలపన్ని పట్టుకోవడం వనమందే సాధ్యం.

అస్త్ర భూషణాద్యలంకారాల్లాగా పాదుకాదేవి ధ్యేయ వస్తువే కదా! పాదుకాసాహచర్యం లేకుండా శ్రీరంగనాథుడు సంచరించలేడు. కాబట్టి, పాదుకాదేవి వేదాంత ప్రతిపాదితయే కదా!

మధురంగా ఆలపించే శుకాదులను సు(మ)వాసినీ ప్రీత్యర్థం సంగ్రహించడానికి కల్యాణ గుణజాల విస్తృతమైన ఉపనిషత్కాంతారంలోనూ శ్రీరంగనాథుడు పాదుకాదేవితోపాటు క్రీడించడంవల్ల, వాల్లభ్యాతిశయం అనురణితం.

శ్లేష రూపకానుప్రాణిత సమాసోక్త్యలంకారం. మాలినీ వృత్తం.

306.ముని పరిషదిగీతం గౌతమీ రక్షణం తే
ముహురనుకలయంతో మంజువాచఃశకుంతాః ।
ఉషసి నిజకులాయాదుత్థితా దండకేషు
స్వయమపి పదరక్షే! స్వైరమామ్రేడయంతి ॥ –46.

అర్థం :— హే పదరక్షే = ఓ పాదుకా! మునిపరిషది = మునుల గోష్ఠియందు; గీతం = గానంచేసిన; తే = నీ యొక్క; గౌతమీ రక్షణం = అహల్యారక్షణను; ముహుః = మాటిమాటికి; అనుకలయంతః = విన్న వెంటనే పలికే (అనువదించే) మంజువాచః = ఇంపైన పలుకులుగల; శకుంతాః = పక్షులు; దండకేషు = దండకారణ్యాల్లో; ఉషసి = ప్రాతఃకాల మందు; నిజకులాయాత్ = తమగూటి నుంచి; ఉత్థితాః = లేచినవై; స్వయం, అపి = తమంతతామే; స్వైరం = స్వేచ్ఛగా; ఆమ్రేడయంతి = ఆవర్తిచేస్తాయి.

తా॥ ఓ పాదుకాదేవీ! మునుల పరిషత్తులో పాడిన నీ అహల్యా సంరక్షణ (చరిత్ర)ను పదే పదే అనువదిస్తున్న మధురా లాపాలుగల శుకశారికాది పక్షులు, దండకారణ్య ప్రదేశాల్లో ప్రభాతకాలమందు తమ గూటి నుంచి లేచినవై స్వయంగా స్వేచ్ఛతో ఆవర్తి చేస్తున్నాయి.

వ్యాఖ్య :—పతిత పావన గీతాన్ని పక్షులు ఆమ్రేడితం చేసే వర్ణన.

శ్రియఃపతిని తమ శ్రీసూక్తులచే సంతోషింపచేసే వ్యాస పుత్ర శుక, వాల్మీకి కోకిలనేకాక, హంసను, చాతకాన్ని పోలిన ఆళ్వారు పంపిన దూతలైన ఆచార్యులనే పక్షులను వర్ణించిన తర్వాత, వాస్తవ పక్షుల పలుకులచే అడవిలో పొందే ఆనందాన్ని వర్ణించే శ్లోకమిది.

దండకారణ్య భూముల్లో ఋషుల ఆశ్రమ వాటికలయందు నివసిస్తున్న చిలుక, గోరువంక మొదలైన పక్షులు **"మాతాఽప్యేకా పితాఽప్యేకో మమ తస్యచ పక్షిణః"** అన్నట్లు, ఋషులు అనుసంధించే విషయాలను గ్రహించి ఋషుల సంతానంలాగా, సూక్తులను పదే పదే వల్లెవేస్తుంటాయి. 'అనుకలయంతః' అంటే, చెప్పిన మాటను గానీ, పాడిన పాటను గానీ చక్కగా విన్నవెంటనే ఉచ్చరిస్తుంటాయి. 'ఆమ్రేడిత' మంటే విన్న విషయాన్ని ఆవర్తి చెప్పడం.

అహల్యా శాపవిమోచనార్థం శ్రీరామచంద్రమూర్తిని పతితగా ఉన్న ప్రదేశానికి నడిపించి పావనత్వాన్ని కలిగించిన పాదుకాచరిత్రను ఋషులు పాడగా, చెట్లమీద నివసించిన పక్షులు విన్నాయి. విన్నవెంటనే ఆలపించడమే కాక, ఎన్నడో విన్న ఆ పతిత పావన గీతాన్ని ప్రతిదినం ఉదయాన తమ గూటి నుంచి లేచిన పక్షులు తమంతతామే అనేక పర్యాయాలు ఆవృత్తిచేస్తుంటాయి. శ్రీరామావతార కాలమందలి పాదుకా సంచార శీలాన్ని, పక్షులు వర్తమాన కాలంలో సుప్రభాత గీతంగా ఆలపించడం భావికాలంకార లక్షణం. మాలినీ వృత్తం.

307. యమ నియమ విశుద్ధైర్యం నపశ్యంతిచిత్తైః
శ్రుతిషు చుళకమాత్రం దృశ్యతే యస్యభూమా।
సులభ నిఖిల భావం మాంసదృష్టే ర్జనస్య
స్వయముపహరసిత్వంపాదుకే! తంపుమాంసమ్ । –47.

అర్థం :— హే పాదుకే = ఓ పాదుకా! యమనియమ **విశుద్ధైః** = యమనియమాలచేత పరిశుద్ధమైన; చిత్తైః = మనస్సులచే; యం = ఎవనిని; న, పశ్యంతి = చూడలేరో; యస్య = ఎవని యొక్క; భూమా = మహిమ; శ్రుతిషు = వేదాల్లో; చుళక మాత్రం = పుడిశెడే; (స్వల్పంగా) దృశ్యతే = కనబడుతున్నదో; తం = అట్టి, పుమాసం = పురుషుణ్ని; త్వం = నీవు; స్వయం = స్వయంగా; మాంసదృష్టేః = మాంసపు కన్నులుగల; జనస్య = జనానికి; సులభ నిఖిల భావం = సులభమైన సకల విభూతులను కలిగినవానిగ; ఉపహరసి = దగ్గరికి తెచ్చి చూపిస్తావు.

తా॥ ఓ పాదుకాదేవీ! యోగులు యమనియమాలచే పరిశుద్ధమైన మనస్సులచేత ఎవణ్ని చూడలేరో, ఎవని మహిమ వేదాల్లోనూ పుడిశెడు మాత్రమే కనబడుతున్నదో, అట్టి పరమ పురుషుణ్ని మాంస చక్షువులు కలిగిన జనులకు సులభమైన సకల విభూతులు కలిగినవానిగా దగ్గరకు తెచ్చి కనిపింపచేస్తున్నావు.

వ్యాఖ్య :— యోగులకూ కానరాని శ్రియఃపతిని జనులకు దర్శింపజేసే పాదుకా వర్ణన.

'యమత్వం' పంచవిధం. బ్రహ్మచర్యం, అహింస, సత్యం, అస్తేయం (దొంగిలించకుండడం) అపరిగ్రహం (దానం స్వీకరించకుండడం). నియమమూ అయిదు రకాలు. స్వాధ్యాయం, శౌచం, సంతోషం, తపస్సు, మనో నిగ్రహం.

"బ్రహ్మచర్య మహింసాచ సత్యాస్తేయా పరిగ్రహాన్ ।
సేవేత యోగీనిష్కామో యోగ్యతాం స్వం మనో నయేత్ ।"
"స్వాధ్యాయశౌచ సంతోష తపాంసి నియమాత్మవాన్ ।
కుర్వీతబ్రహ్మణి తథా పరస్మిన్ ప్రవణం మనః ।
ఏతే యమాః సనియమాః పంచ పంచ చకీర్తితాః" । (వి.పు.)

యోగులు యమనియమాలను పాటించడంచేత కలిగిన చిత్తశుద్ధితో ధ్యానంచేసినా పరబ్రహ్మ సాక్షాత్కారాన్ని పొందలేరు.

"యతో వాచో నివర్తంతే, అప్రాప్య మనసాసహ" (శ్రుతి) వేదవాక్కులు భగవన్మహిమ మనస్సుకు పట్టక వచ్చిన దారి పట్టినాయట. **"నాహంవేదైర్నతపసా"** అని భగవంతుని చేతనే ఉపదిష్టం. **"నమాంస చక్షు రభివీక్షతే తం"**. మాంస నేత్రాలు పరమాత్ముణ్ని చూడలేవని శ్రుతి చెబుతుంది.

"తస్య ధీరాః పరిజానంతి యోనిమ్" కొందరు ధీరులైన పరబ్రహ్మోపాసకులకు భగవన్మహిమ అవగింజలో అర్ధభాగమంత గోచరిస్తుంది, అని శ్రుతి బోధిస్తుంది. అదికూడా 'దదామి బుద్ధి యోగం' అని, సర్వేశ్వరుడు అనుగ్రహిస్తే గాని గోచరించదు కదా! అరచేతిలో నిల్చిన నీటి పరిమాణాన్ని 'చుళక' అంటారు.

'భావ' శబ్దానికి అనేకార్థాలున్నాయి.

"భావః స్వభావేఽభిప్రాయే చేష్టా సత్తాత్మజన్మసు । క్రియా లీలా పదార్థేషు బుధజంతు విభూతిషు" । (విశ్వనిఘంటువు)

పాదుకాదేవి వాత్సల్యం అపారం కాబట్టి, సకల విభూతులతోనూ, లీలలతోనూ కూడియున్న శ్రీరంగనాథుణ్ని సకల జనులు సులభంగా దర్శించే రీతిగా వారి దగ్గరకి తెచ్చి కానుకగా సమర్పిస్తుంది.

పరమ యోగులూ చూడలేని, శ్రుతులూ కానలేని భగవల్లీలా విహారాలను భోగలంపటులు చూచి తరించే రీతిగా చేసే పాదుకా సంచార పద్ధతిని ఎంత వర్ణించినా, చులక మాత్రమనక తప్పదు.

కనబడని వాణ్ని కనబడే వానిగా వర్ణించడం, వ్యాఘాతాలంకారం. మాలినీ వృత్తం.

**308. నిధి మివనిరపాయం త్వామనాదృత్యమోహా
దహమివ మమదోషం భావయన్ క్షుద్రమర్థమ్ ।
మయిసతి కరుణాయాః పూర్ణపాత్రే త్వయాకిం
పరముపగమనీయః పాదుకే! రంగనాథః ॥ -48.**

అర్థం :- హే పాదుకే = ఓ పాదుకా! నిరపాయం = అపాయంలేని (అక్షయమైన) నిధిం, ఇవ = నిధివంటి; త్వాం = నిన్ను; అనాదృత్య = అలక్ష్యంచేసి; మోహాత్ = అజ్ఞానంవల్ల; క్షుద్రం = హేయమైన; అర్థం = ప్రయోజనాన్ని; భావయన్ = అనుభవిస్తున్న; అహం, ఇవ = నావలె; కరుణాయాః = దయకు; పూర్ణపాత్రే = అత్యంతయోగ్యుడనైన; మయి, సతి = నేను ఉండగా; మమ = నాయొక్క; దోషం = దోషాన్ని, భావయన్ = తలంచే; రంగనాథః = శ్రీరంగనాథుడు; త్వయా = నీచేత; పరం = మరొక వ్యక్తి దగ్గరికి; కిం, ఉపగమనీయః = కొనిపోదగినవాడా?

తా॥ ఓ పాదుకాదేవీ! అక్షయనిధివలె ఉన్న నిన్ను గౌరవించక, అవివేకం వల్ల క్షుద్ర ప్రయోజనాన్ని అనుభవిస్తున్న నావలె, దయకు అత్యంత పాత్రుడనైన నేను ఉండగా నన్ను ఆదరించక, నా దోషాన్ని చూస్తున్న శ్రీరంగనాథుడు నీచేత వేరొకని దగ్గరికి పొందింపదగినవాడా?

వ్యాఖ్య :- దోషి దయనీయుడు కాని నిర్దోషి దయనీయుడా? అని పాదుకాదేవిని ఆక్షేపించే వర్ణన.

తన ఎదుట కనబడుతున్న తరుగని నిధిని ఆదరంగా అనుభవించకపోవడం వీరిడితనం, వెర్రి వెంగళాయ లక్షణం. భాగవతత్వమూ, ఆచార్యత్వమూ కలిగిన పాదుకాదేవి నిరపాయమైన నిధియేకదా! అక్షయ నిధియైన పాదుకాదేవిని భక్తితో సేవించకపోవడం దోషం. అవివేకం వల్ల సాంసారిక సుఖమే ప్రయోజనకరమని అర్థకామాలనే

ఆశించి అనుభవించడం అత్యంత దోషం. దోషులను భగవంతుడు మన్నించక శిక్షింపదలచి "క్షిపామ్యజస్రం" అని నరకంలోకి త్రోసి వేస్తాడు.

"దుర్గుణాలకు లోబడిన వాణ్ని నేను, ఆ దుర్గుణాలనే లెక్కించేవాడు శ్రీరంగనాథుడు. నాలాంటివాడే స్వామి. ఇద్దరమూ సమానులమే. అయితే స్వామి కీర్తికి కారకురాలవైన నీవు, అపరాధ చక్రవర్తులే భగవద్దయకు అత్యంత యోగ్యులని రంగనాథుణ్ని, నన్ను కరుణించేలాగా కటాక్షించక, ఇక్కడ నేనుండగానే దుర్గుణాలూ, దురాచారాలూ లేని ఇతరులను కరుణించడానికి తీసుకొనిపోతావేమి తల్లీ"? అని పాదుకాదేవిని ప్రశ్నించారు దేశికులు.

"యదిమే నదయిష్యసేతతో దయనీయ స్తవనాథ! దుర్లభః"

'స్వామీ! నన్ను కటాక్షించకపోతే, ఇక నీకు నాకంటె వేరే దయనీయుడు దుర్లభుడు' అని శ్రీ యామునాచార్యుల స్తోత్రరత్నం.

దేవేరులు తమ చాతుర్యంతో, దేవుడు దుష్టుల నేరాలను చూడకుండా, ఒకవేళ చూచిన క్షమించేలాగా, కటాక్షించే భగవత్కరుణామూర్తులు. కాబట్టి, పాదుకాధీన సంచారియైన రంగనాథుణ్ని తానే మిక్కిలి దయనీయుడని, తన దగ్గరికి చేర్చుమని పాదుకాదేవిని దేశికులు ప్రార్థించారు.

ఆళ్వార్ల దివ్యసూక్తులను అనుసంధించే వారి తావులకు, సర్వేశ్వరుణ్నే ఆళ్వార్ల సన్నిధికి చేర్చినట్లు చేర్చుమని విజ్ఞాపన. ఆక్షేపాలంకారం. మాలినీ వృత్తం.

309. కమ పి కనక సింధోః సైకతే సంచరంతం
కలశ జలధికన్యా మేదినీ దత్తహస్తమ్ ।
అనిశ మనుభవేయం పాదుకే! త్వయ్యధీనం
సుచరిత పరిపాకం సూరిభి స్సేవనీయమ్ । –49.

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకా దేవీ ! కనకసింధోః = కావేరీనదియొక్క; సైకతే = ఇసుక తిన్నెయందు; సంచరంతం = విహరించునట్టి, కలశజలధికన్యా, మేదినీ, దత్తహస్తం = లక్ష్మీదేవిచే, భూదేవిచే, ఇవ్వబడిన చేతులుకల; సుచరిత పరిపాకం = పుణ్యఫలమైనట్టి, సూరిభిః = నిత్యసూరులచేత; సేవనీయం = సేవింపదగినట్టి; త్వయి + అధీనం = నీకు వశ్యుడైన; కం, అపి = అనిర్వాచ్యుడైన పురుషోత్తముణ్ని; అనిశం = సర్వదా; అనుభవేయం = సేవిస్తాను.

తా॥ ఓ పాదుకాదేవీ! కావేరీ పులిన ప్రదేశంలో సంచరించునట్టి, శ్రీదేవిని, భూదేవిని ఉభయ పార్శ్వాల్లో చేతులతో పట్టుకున్నట్టి, నిత్యసూరులచే సేవింపదగినట్టి, నీయధీనుడైన, పుణ్యఫలమైన శ్రీరంగనాథుణ్ని ఎల్లప్పుడు సేవిస్తాను.

వ్యాఖ్య :– పాదుకాధీనుడైన శ్రీ రంగనాథుడు సర్వదాసేవ్యుడని, పర్యాయోక్తం.

శ్రీరంగనాథుడు ఉభయ కావేరుల నడుమ సైకత స్థలంలో శ్రీభూ పిరాట్టులతో చేతులు కలిపి సంచరిస్తుంటాడు. అమృత మథన సమయాన క్షీరసాగరం కలశంగా పరిణమించింది కాబట్టి అది కలశజలధిగా ఖ్యాతి పొందింది. **"క్షీరాబ్ధిః కలశోదధిః"** (వైజయంతి) కలశజలధి కన్య చంచల, మేదిని అచల. కాబట్టి రంగనాయకుడు వీరిద్దరిని రెండు పక్కల రెండు చేతులతో పట్టుకొని సంచరించడం ఆవశ్యకం. ఆ సంచారం మాత్రం పాదుకాధీనం. శ్రీరంగేశుడు శ్రీ భూపిరాట్టులకు చేతులను దత్తం చేశాడు. పాదుకాదేవికి చరణాలను దత్తం చేశాడు. ఇలాంటి రమణీయ విహార దృశ్యాన్ని వైకుంఠంలో చూడలేరు కాబట్టి, భూతలానికి దిగి వచ్చిన నిత్యసూరులు, ముముక్షువులు గుమిగూడి కమనీయంగా సేవిస్తుంటారు. పుణ్యం పండిన వారికే ఈ సైకత సంచారం సేవనీయం. దేశికులు కూడా అనిర్వాచ్యమైన ఆ దివ్య మంగళ విగ్రహాన్ని అనిశం సేవించాలని అపేక్షించారు. మాలినీ వృత్తం.

310. పరిసర ముపయాతా పాదుకే! పశ్య మాతః ।
కరణవిలయ ఖేదాత్ కాందిశీకే వివేకే ।
పురుష ముపనయంతీ పుండరీకాక్ష మగ్రే
పునరుదరనివాస క్లేశ విచ్ఛేదనం నః ॥ –50

అర్థం :– హే మాతః = ఓ తల్లీ! పాదుకే = పాదుకా! కరణ విలయఖేదాత్ = ఇంద్రియాల శైథిల్యం వలని దుఃఖం వల్ల; వివేకే = విచక్షణ జ్ఞానం; కాందిశీకే = భయంవల్ల పారిపోగా; పునః + ఉదర నివాస, క్లేశ, విచ్ఛేదనం = మళ్ళీ గర్భమందు ఉండే శ్రమను భంగపరచే; పుండరీకాక్షం = తామరసాక్షుడైన; పురుషం = శ్రీరంగనాథుణ్ని, అగ్రే = ఎదుటికి; ఉపనయంతీ = తీసుకొనివస్తూ; పరిసరం = దగ్గర; ఉపయాతా = సంచరింపజేస్తూ; నః = మమ్ములను, పశ్య = చూడుము.

తా॥ ఓ తల్లీ! పాదుకా! ఇంద్రియాల శైథిల్యం వలని ఖేదంవల్ల వివేకం భయంతో పారిపోతున్నప్పుడు పునర్జనన క్లేశాన్ని నశింపజేసే పుండరీకాక్షుడైన శ్రీరంగనాథుణ్ని మా ముందుకు తెస్తూ, సమీపమందు సంచరింపజేస్తూ మమ్ము చూడుము.

వ్యాఖ్య :– పునర్జన్మ కలుగకుండా చేయుమని విజ్ఞాపన.

ఇంద్రియాలు సడలినప్పుడు పనిచేయవు. వివేకం భ్రష్టమవుతుంది. **"కాందిశీకో భయద్రుతః"**. (అమరం) ఇది చరమ దశను సూచిస్తుంది. వాతపిత్త శ్లేష్మాల వల్ల కంఠం పెకలదు. ఇక **'స్మరణం కుతస్తే?'** అన్నాడు కులశేఖర మహారాజు. స్మరణం తప్పినా మరణం తప్పదు కదా! కాబట్టి, కరణ కళేబరాలు స్వాధీనంలో ఉన్నప్పుడే, పునః గర్భవాస దుఃఖం కలుగకుండా, భగవన్నామాలను కీర్తించాలి. **"పాథేయం పుండరీకాక్ష నామ సంకీర్తనామృతం"**. పుండరీకాక్ష నామ

సంకీర్తనమే ముక్తాత్మకు దారి బత్తెం. ప్రాణావసాన సమయంలో శ్రీరంగనాథుణ్ని తన దగ్గరికి తెచ్చి తనకు దర్శన మిచ్చే రీతిగా అనుగ్రహింపుమని ప్రార్థన. ప్రేయోఽలంకారం.

ఇంతవరకు 10 శ్లోకాలు మాలినీ వృత్తాలు.

311. సామే భూయాత్సపది భవతీ పాదుకే! తాపశాంత్యై
యామారూఢో దివమివ శుభైస్సేవ్యమానో మరుద్భిః ।
సౌదా మన్యా సహకమలయా సహ్యజా వృద్ధిహేతుః
కాలే కాలే చరతి కరుణా వర్షుకః కృష్ణమేఘః ॥ –51.

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకా! యాం = దేనిని; దివం, ఇవ = ఆకాశాన్నివలె; ఆరూఢః = ఎక్కినవాడై ; శుభైః = భవ్యమైన/అనుకూలమైన; మరుద్భిః = దేవతలచేత/గాలులచేత; సేవ్యమానః = సేవింపబడుతూ, సహ్యజా వృద్ధిహేతుః = కావేరీనది వృద్ధికి కారణమైన; కరుణా వర్షుకః = కృపావృష్టిచేసే, కృష్ణ మేఘః = కృష్ణుడనే నల్లని మేఘం, కమలయా = మహాలక్ష్మి అనే; సౌదామన్యా, సహ = మెరుపుతోకూడా; కాలే కాలే = ఆయా సమయాల్లో; (వర్షా కాలాల్లో) చరతి = సంచరిస్తుందో; సా = అట్టి; భవతీ = నీవు; మే = నాకు; సపది = వెంటనే; తాపశాంత్యై = తాప నివారణకోసం; భూయాత్ = ఉందువుగాక.

తా॥ ఓ పాదుకాదేవీ! ఆకాశాన్ని వలె దేన్ని ఎక్కి భవ్యమైన దేవతల/వాయువులచేత సేవింపబడుతూ, కావేరి వృద్ధికి హేతువైన, దయా వర్షం కురిపించే శ్రీకృష్ణుడనే నీలమేఘం అపేక్షిత/వర్షాకాలాల్లో లక్ష్మీదేవి అనే మెరుపుతో కూడా సంచరిస్తుందో, అట్టి నీవు వెంటనే నా తాప శాంతికోసం ఉందువుగాక.

వ్యాఖ్య :– పాదుకాదేవి తాప త్రయాన్ని నివారించాలని, కవి ప్రార్థన.

ఉత్సవంలో శ్రీరంగనాథుని ఉత్సవ విగ్రహాన్ని శ్రీకృష్ణునిగా అలంకారం చేస్తారు అర్చకులు. శ్రీకృష్ణుడు నీల మేఘం, లక్ష్మీదేవి విద్యుల్లత. నీలమేఘం ఆకాశంలో వ్యాపించి సంచరిస్తుంటే గాలులు వీస్తుంటాయి. శ్రీకృష్ణుడు పాదుకలనుధరించి వీధుల్లో సంచరిస్తుంటే దేవతలూ సేవిస్తుంటారు. ప్రతి వర్షాకాలంలో నీలమేఘం మెరుపుతో కూడి వర్షిస్తుంది. అపేక్షిత సమయంలో మేఘశ్యాముడు శ్రీదేవితో కూడి దయను వర్షిస్తాడు. నదులు పొంగి ప్రవహించ డానికి కారణం మేఘం వర్షించిన జలమే. లోకుల యోగక్షేమానికి నిదానం శ్రియఃపతి కరుణయే కదా! ప్రకృతిలో భీష్మించిన గ్రీష్మంవల్ల కలిగిన తాపం, ఆకాశంలో మేఘం సంచరిస్తూ వర్షించడం వల్ల తగ్గుతుంది. లోకంలో ఆధి భౌతిక, ఆధ్యాత్మిక, ఆధి దైవిక తాపత్రయం, పాదుకలను ధరించి మేఘశ్యాముడు సంచరిస్తూ కురిపించే కృపావృష్టివల్ల శాంతిస్తుంది. పాదుక (ల)పైన, ఆకాశానవలె, కృష్ణమేఘం సంచరించిననే గాని ప్రకృతికి, తాపం శమించదు. కాబట్టి, తాప శాంతికి పాదుకా సంచారం అత్యావశ్యకం. శ్లేష రూపకాలతో పాదుకా ప్రశంస చేయడం, ప్రేయోఽలంకారం.

మందాక్రాంతావృత్తం.

312. సత్యా ల్లోకా త్సకల మహితా త్స్థానతో వారఘూణాం
శంకేమాత స్సమధికగుణం సైకతం సహ్యజాయాః।
పూర్వం పూర్వంచిరపరిచితం పాదుకే! యత్త్యజంత్యా
నీతో నాథస్తదిద మితరన్నీయతే న త్వయాఽసా ॥ –52.

అర్థం :– హే మాతః, పాదుకే = ఓ మాతా! పాదుకా! సకల మహితాత్ = సర్వ పూజితమైన; సత్యాత్, లోకాత్ = సత్యలోకం కంటె; రఘూణాం =రఘు వంశీయుల యొక్క; స్థానతః, వా = రాజధానియైన అయోధ్య కంటెనూ; సహ్యజాయాః = కావేరీ నదియొక్క; సైకతం = ఇసుక తిన్నెయైన శ్రీరంగక్షేత్రం; సమధికగుణం = మిక్కిలి శ్రేష్ఠమైనది (అని) శంకే = భావిస్తాను. యత్ = ఎందుకంటే; చిర పరిచతం = చాలాపరిచితమైన; పూర్వం పూర్వం = మొదటి మొదటి స్థానాలను; త్యజంత్యా = వదలిపెట్టిన; త్వయా = నీ చేత; అసా = ఈ; నాథః = శ్రీరంగనాథుడు; నీతః = తీసుకొని రాబడినాడో; తత్ = అది; ఇదం = శ్రీరంగక్షేత్రమే. ఇతరత్ = వేరే చోటికి; న, నీయతే = తీసుకొని పోబడలేదు.

తా॥ ఓ మాతా! పాదుకా! సకల మహితమైన సత్యలోకం కంటె, రఘువంశ రాజధానియైన అయోధ్యా నగరంకంటె కూడా కావేరీ సైకత ప్రదేశమయిన శ్రీరంగక్షేత్రం చాలా శ్రేష్ఠమయింది. ఎందుకంటే, చిరపరిచితమైన, పూర్వ పూర్వ స్థానాలను విడిచిపెట్టిన నీవు ఈ రంగనాథుణ్ని కావేరీ సైకత స్థలానికి తీసుకొనివచ్చావు. వేరే చోటికి కొనిపోలేదు.

వ్యాఖ్య :– పాదుకాదేవి శ్రీరంగనాథుణ్ని కావేరీ సైకత స్థలమందు నెలకొల్పింది.

సకల లోకాలకన్న ఉన్నతమైన సత్యలోకంలో చతుర్ముఖునిచే రంగనాథుడు చిరకాలం ఆరాధింపబడినాడు. తర్వాత ఇక్ష్వాకు మహారాజు తపస్సు చేత ప్రసన్నుడై సత్యలోకం నుంచి అయోధ్యా నగరానికి వేంచేసి ఇక్ష్వాకుల కులధనంగా రంగనాథుడు చాలాకాలం పూజితుడయ్యాడు. **"సహపత్న్యా విశాలాక్ష్యా నారాయణముపాగమత్"** అయోధ్యలో శ్రీరాముడు సీతాదేవితో కూడి శేషశాయిని ఉపాసించాడని వాల్మీకి రామాయణం చెబుతుంది. చరాచర పదార్థాలకు మోక్షఫలాన్ని ప్రసాదించిన అయోధ్య, సత్యలోకం కన్న మిన్న.

కావేరీనదీమ తల్లిక సహ్యాద్రి నుంచి ఉద్గమించింది. శేషశాయి తన పులిన ప్రదేశాన నెలకొని ఉండాలని సహ్యజ తపించి, (తిరుచినాపల్లి మండలంలో) రెండు పాయలై ప్రవహించింది. లింగం కాదు, వయస్సుకాదు, కేవలం గుణమే కదా పూజాస్థానం. చాలాకాలం కాపురమున్న తావును త్యజించాలంటే చిత్తమత్తగిల్లక ఉత్తలపడుతుంది. అయినా, కావేరీ సైకతంలో కాపురం పెట్టడానికి ముందు పాదుకాదేవి అయోధ్యను వదలింది. అంతకు ముందు సత్యలోకాన్నే వదలి వేసింది **"అతి పరిచయాదవజ్ఞా"**. చిరపరిచయంవల్ల చిరాకుపుడుతుంది కదా!

"యస్యా వీక్ష్య ముఖం తదింగితపరాధీనో విధత్తేఽఖిలమ్" అన్నట్లు ఇంతి, తన కిష్టమైన చోటికి పెనిమిటిని తీసుకొనిపోయి కాపురం పెడుతుంది. మగువ మనసును బట్టి మగవాడు నడువడం లోక పరిపాటి. పాదుకాదేవి రంగనాథుణ్ణి, కావేరి రెండు చేతులు సాచి ఆహ్వానిస్తున్న అధిక గుణవతియని, అక్కడికి తెచ్చి నిల్పింది. ఇంకెక్కడికి తీసుకపోలేదు. విభీషణుని మూలకంగా రంగనాథుణ్ణి లంకకు తీసుకొనిపోలేదు. లంకకు వెళ్ళడానికి మంకెందుకు? లెంక లిక్కడ లేరనే శంకెందుకు?

"కలియుం కెడుం కండుకొణ్మినో" (తి.వా.మొ.) 'ఇక్కడ కలిప్రభావం చెల్లదు, చూడండి' అని ప్రపత్త్యనుష్ఠానానికి, శరణాగతి గద్య ఆవిష్కరింపబడడానికి అనుగుణంగా పాదుకాదేవి, నేర్పుతో సికతామయ క్షోణిని శ్రీరంగ క్షేత్రంగా రూపొందించింది.

కావ్యలింగాలంకారాను ప్రాణితో ఉత్ప్రేక్షాలంకారం. మందాక్రాంతా వృత్తం.

313. అగ్రేదేవి! త్వయి సుమనసా మగ్రిమై రంతరఙ్గై
ర్విన్యస్తాయాం వినయగరిమా వర్జితా దుత్తమాంగాత్ ।
దత్తే పాదం దరముకుళితం త్వత్ప్రభావాతిశంకీ
దేవః శ్రీమాన్ దనుజమథనోజైత్ర యాత్రా స్వనన్యః । –53.

అర్థం :– హే దేవి = ఓ పాదుకాదేవీ! సుమనసాం = దేవతల్లో; అగ్రిమైః = ప్రముఖులచేత; అంతరఙ్గైః = ఆప్తులచేత; వినయ గరిమ + ఆవర్జితాత్ = వినయాధిక్యం చేత వంచబడిన; ఉత్తమ + అంగాత్ = తలమీది నుంచి; అగ్రే = (దేవుని) ముందు; జైత్రయాత్రాసు = జయింపబోయే పయనాల్లో, త్వయి = నీవు; విన్యస్తాయాం = ఉంచబడగా; అనన్యః = అసహాయుడైన; దనుజమథనః = అసురఘాతియైన; శ్రీమాన్ = సిరిగల; దేవః = శ్రీరంగనాథుడు; త్వత్, ప్రభావ + అతిశంకీ = నీ మహిమవల్ల కడుసంకోచ పడువాడై పాదం = (అడుగును) పాదాన్ని, దరముకుళితం = కొంచెం ముడుచుకొనబడిన దానిగా; దత్తే = తొడుగుతాడు.

తా। ఓ పాదుకాదేవీ! నీవు దేవశ్రేష్ఠులచేత, ఆప్త పరిజనులచేత వినయాతిశయంతో నమస్కరించిన శిరస్సు నుంచి దేవుని ముందు జైత్రయాత్రా సమయాల్లో సమర్పించబడగా అసహాయుడై రాక్షసులను సంహరించే శ్రీమద్రంగనాథుడు నీ మహిమవల్ల చాలా జంకుతూ, పాదాలను కొంచెం సంకుచితంగా తొడుగుతాడు.

వ్యాఖ్య :– మహిమాన్విత పాదుకలను జిష్ణువు సంకుచితంగా ధరించే వర్ణన.

శ్రీరంగనాథుడు అసహాయ పరాక్రమ సంపన్నుడు. దనుజాంతకుడు, సిరిగల వాడు కూడా. అయితేనేం? చతుర్ముఖ శతమఖాది దేవతా బృందమూ, ఆప్త కింకరగణమూ అధిక వినయంతో శిరసావహించి సమర్పించిన పాదుకల మాహాత్మ్యాన్ని స్వయంగా చూచినాడు కాబట్టి, రంగనాథుడు పాదుకలను పాదాలను ముడుచుకొంటూ ధరిస్తాడు.

పాదుకా సాహచర్యం వల్ల తనకు జయం కలుగుతుంటుంది. దేవప్రకాండులందరు గౌరవంతో తలమీద మాలవలె మృదువుగా ధరించే ప్రభావం గల పాదుకలను తాను తన కాళ్ళక్రింద పడవేసి మధించడమా? తొక్కుతూ మీద నడుస్తున్నప్పటికీ కిక్కుమనక తనను జయశీలునిగా చేస్తున్న పాదుకా వినయగరిమ దేవునికి అతి శంకను జనింప జేసింది. కాబట్టి శ్రీమంతుడే అయినా, పాదుక (ల) మీద ఉండే బొడికను గట్టిగా పట్టుకొని ఉండునట్లుగా, పాదాంగుళాలను కొద్దిగా వంచుతూ, ముడుచుతూ పాదుకలను ధరిస్తాడు. ఉత్ప్రేక్షాలంకారం. మందాక్రాంతా వృత్తం.

314. పౌరోదంతాన్ పరికలయితుం పాదుకే! సంచరిష్ణోః
వ్యక్తా వ్యక్తా వశిక విశిఖా వర్తనీ రంగభర్తుః ।
వేలాతీత శ్రుతిపరిమళైర్వ్యక్తి మభ్యేతికాల్యే
విన్యాసైస్తే విబుధ పరిషన్మౌళి విన్యాస ధృశ్యైః ॥ –54

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకా! పౌర + ఉదంతాన్ = నగరవాసుల వార్తలను, పరికలయితుం = తెలుసుకోవడానికి; సంచరిష్ణోః = సంచరించే శీలంగల; రంగభర్తుః = రంగరాజుయొక్క; వ్యక్త + అవ్యక్తా = తెలిసీ తెలియని; వశిక విశిఖా వర్తనీ = జితేంద్రియుల రాచబాటయనే చిన్నదారి; వేలా + అతీత, శ్రుతిపరిమళైః = మేరమీరిన వేదాల (చే ప్రతిపాద్యమైన) పరిమళంగల; విబుధ పరిషత్ + మౌళి విన్యాస ధృశ్యైః = దేవతా బృందాల కిరీటాల మీద ఉంచడం వల్ల అందమైన; తే = నీయొక్క; విన్యాసైః = అడుగుల (ముద్రల)చేత; కాల్యే = ఉదయాన; వ్యక్తిం = స్పష్టతను; అభ్యేతి = పొందుతున్నది.

తా। ఓ పాదుకాదేవీ! పురజనుల వృత్తాంతాలను తెలుసుకోవడానికి సంచరించే శీలంగల రంగరాజు యొక్క జ్ఞాతా జ్ఞాతమైన; జితేంద్రియుల రాచబాట అనే చిన్నదారి, అనంత వేదాల పరిమళంగల, దేవగణాల కిరీటాలమీద ఉంచడం వల్ల చూడముచ్చటగా ఉండే నీ అడుగుల చేత ప్రాతఃకాలాన స్పష్టంగా కనబడుతుంది.

వ్యాఖ్య :– రంగరాజు రాత్రి సంచరించిన దారి, ఉదయాన పాదుకా చిహ్నాలచే స్పష్టంగా కనబడుతుంది.

యోగుల హృదయాల్లో భగవంతుడు తృప్తిగా వెలసి యుంటాడు. ఆయన సంచార మార్గం వారికి ధ్యానగమ్యం. జితేంద్రియులైన యోగులకు ఏది పగలో, అది సామాన్యులకు రాత్రి. వారికేది ప్రతోళియో అది జనులకు ఏకపది. **"రథ్యా ప్రతోళీ విశిఖా"** (అమరం) నగరంలో పలువురు నడిచే మార్గమే అర్ధరాత్రి శ్రీరంగరాజు ఒక్కడే నడువదగిన మార్గమయింది. ప్రజల ఇష్టకష్టాలను రహస్యంగా తెలుసుకొనదలచి రాత్రి సంచరించిన దారి తెలిసీ తెలియనట్లు అస్పష్టంగా ఉంది. ఉషఃకాలానగాని తెల్యదు.

"ప్రత్యూషోఽహర్ముఖం కాల్యం". (అమరం)

భగవత్పాదాలు, వాటితో సమానాకార రేఖలు గల పాదుకలు శంఖ రథాంగ కల్పక ధ్వజారవిందాంకుశ వజ్రలాంఛితాలు. వేదాలు 'సర్వగంధః, సర్వరసః' అని ప్రతిపాదించే సర్వేశ్వరుని పాదుకలు, దేవతల తలమీద సమర్పించబడినప్పుడెట్లు రేఖాంచితాలై చూడదగినవో అట్లే జనులకు దారిలో ముద్రితాలైన పాదుకారేఖా విన్యాసాలు ఉదయాన స్పష్టంగా కనబడడంవల్ల, శ్రీరంగరాజు రాత్రి ఒక్కడే సంచరించాడనీ జనులు అనుమానిస్తుంటారు.

అనుమానాలంకారం. మందాక్రాంతా వృత్తం.

315. ఆ సంస్కారా ద్ద్విజ పరిషదానిత్యమభ్యస్యమానా
శ్రేయోహేతు శ్శిరసి జగతః స్థాయినీ స్వేనభూమ్నా ।
రంగాధీశే స్వయముదయిని క్షేప్తు మంధం తమిస్రం
గాయత్రీవ త్రిచతురపదా గణ్యసే పాదుకే! త్వమ్ । –55.

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకా! ఆ సంస్కారాత్ = పంచసంస్కారాలు మొదలుకొని/ ఉపనయనం మొదలుకొని; ద్విజపరిషదా = త్రైవర్ణికులచేత; నిత్యం = ప్రతిదినం; అభ్యస్యమానా = భగవత్పాదాల యందు సమర్పింపబడు దానవై / ఆవృత్తి చేయబడుదానవై ; శ్రేయోహేతుః = శ్రేయస్సుకుకారణమై ; స్వేన = స్వీయమైన; భూమ్నా = మహిమ చేత; జగతః = లోకం యొక్క; శిరసి = తలమీద; స్థాయినీ = నిల్చియున్న; త్వం = నీవు, రంగాధీశే = రంగరాజు; అంధం, తమిస్రం = పెనుజీకటిని; క్షేప్తుం = పోగొట్టడానికి = స్వయం = తానే; ఉదయిని = (సూర్యునిలాగా) ఉదయిస్తున్నప్పుడు/ సేవను ప్రసాదిస్తున్నప్పుడు, గాయత్రీ, ఇవ = గాయత్రీ మంత్రంలాగా/గ + ఆయ, త్రీ, ఇవ = పోకడను, రాకడను, కాపాడుతున్నదానివలె; త్రిచతురపదా = మూడో, నాలుగో అడుగులు/పాదాలు, కలదానవై ; గణ్యసే = పరిగణింపబడుతున్నావు.

తా। ఓ పాదుకాదేవీ! పంచ సంస్కారం/ఉపనయన సంస్కారం మొదలుకొని ద్విజ సమూహంచేత ప్రతిదినం (భగవదారాధనయందు) సమర్పింపబడునట్టి/జపింపబడునట్టి శ్రేయస్సుకు కారణమై నిజ మహిమవల్ల ప్రపంచశిరః స్థానంలో వెలసియున్న నీవు, శ్రీరంగేశుడనే సూర్యుడు అవివేకాన్ని/గాఢాంధకారాన్ని నివారించడానికి స్వయంగా ఉదయిస్తుండగా, గాయత్రీ మంత్రం మూడో నాలుగో పాదవిన్యాసాలు కలదానిగా/పాదాలు కలదానిగా పరిగణింప బడుతున్నావు.

వ్యాఖ్య :– పాదుకాదేవి గాయత్రీదేవివలె ఉపాస్య దేవత.

ద్విజాలు త్రైవర్ణికులు. **"జన్మనా జాయతే శూద్రః, కర్మణాజాయతే ద్విజః"** - పుట్టుకచే అందరూ శూద్రులే. పంచసంస్కారాలచే శ్రీవైష్ణవులవుతారు. ఉపనయన సంస్కారం చేత బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు - ద్విజాలవుతారు. **"తాపః పుండ్రస్తథా నామ మంత్రోయాగస్తు పంచమః"**. ఆచార్యులను సమాశ్రయించి, తప్త శంఖ చక్రధారణం, ఊర్ధ్వ పుండ్రధారణం, దాసనామధారణం, మంత్రోపదేశం పొందడం, భగవదారాధన చేయడం - అనే అయిదు సంస్కారాలను పొందిన వ్యక్తులు పాదుకోపాసన చేసే యోగ్యులవుతారు. **"ముక్తయే పాంచజన్యంచ"** శంఖం ముక్తిని, చక్రం రక్షణను కల్పిస్తుంది. కాబట్టి, 'శంఖ చక్రాలు' అని చక్రంకంటె శంఖానికి ప్రాథమ్యం.

పంచసంస్కారాలను ఆచార్య సమాశ్రయణం వల్ల పొందినప్పటినుంచి నిత్యం భగవదారాధనలో ద్విజాలు పాదుకలను సమర్పించి ఉపాసిస్తారు. ఉపనయన సంస్కారంలో గురువు (తండ్రి) చేత, గాయత్రీ మంత్రాన్ని ఉపదేశాన్ని పొందినప్పటి నుంచి, గాయత్రీ మంత్రాన్ని నిత్యం ద్విజాలు జపిస్తారు.

పాదుకాదేవిలాగా గాయత్రీదేవి మానవాభ్యుదయానికి కారకురాలు. **"తద్విష్ణోః పరమం పదం"** (శ్రుతి) **"తుయరఱు శుడరడి"** (తి.వా.మొ. 1-1-1) అనీ, ఉభయ వేదాంతాల్లోనూ పాదుకాదేవి శిరఃస్థాయిని. **"ఉత్తమే శిఖరే దేవి"** అని గాయత్రీదేవి జగచ్ఛిరఃస్థాయిని. భక్తితో లోకులందరు 'శఠారి'ని శిరస్సున ధరిస్తారు. ద్విజాలు యజ్ఞోపవీతాన్ని శరీరంపైన సవ్యంగా ధరిస్తారు.

శ్రీరంగేశుడు ఉదయాన మేల్కొనగానే ఆరాధింప బడి అవివేకాన్ని తొలగిస్తాడు. సూర్యుడు ఉదయించగనే లోకంలో కటిక చీకటిని తొలగిస్తాడు. పాదుక శ్రీరంగేశునితో వ్యవహరిస్తే, గాయత్రి సూర్యునితో వ్యవహరిస్తుంది. పాదుక మూడో, నాలుగో పాద విన్యాసాలు కలదై భక్తులకు సేవనీయ అవుతుంది. గాయత్రి ముఖ్యంగా త్రిపద.

"తత్స వితుర్వరేణ్యం, భర్గోదేవస్య ధీమహి, ధియో యోనః ప్రచోదయాత్" అని మూడు పాదాలు కలదై, ద్విజాలచే జపింపబడుతుంది. **"పరోరజసి సావదోమ్"** అనే వాక్యాన్ని కలిపితే గాయత్రీ మంత్రం 'చతుష్పద' అవుతుంది. సన్యాసాశ్రమస్థులు చతుష్పద గాయత్రిని జపిస్తారు. గ = పోవడం; ఆయ = రావడం; త్ర = కాపాడడం.

పాదుకాదేవి శ్రీరంగేశుని రాకపోకలను - సంచారాలను భద్రంగా జరుపుతుంది. గాయత్రిని, **'గచ్ఛదేవి యథాసుఖం'** అని ఉపాసనానంతరం, **'ఆయాతు వరదాదేవీ'** అని, ఉపాసనారంభంలో అభిమంత్రిస్తూ, సంధ్యావందన మప్పుడు మంత్రజపం చేస్తారు ద్విజాలు. జపించిన వారిని రక్షిస్తుంది గాయత్రి. ఇలా పాదుకను గాయత్రితో పోల్చడం సార్థకమే. రూపకశ్లేషలతో కూడిన ఉపమాలంకారం. (51 నుంచి 55 వరకు) అయిదు శ్లోకాలు మందాక్రాంతా వృత్తాలు.

316. భవతీం పరస్య పరుషస్య రంగిణో
మహిమానమేవ మణిపాదు! మన్మహే ।
కథ మన్యథా స్వ మహిమ ప్రతిష్ఠితః
ప్రతి తిష్ఠతి త్వయి పదాత్పదం ప్రభుః ॥ -56.

అర్థం :— హే మణిపాదు = ఓ మణిపాదుకా! భవతీం = నిన్ను; పరస్య, పురుషస్య = **పరమ పురుషుడైన; రంగిణః** = శ్రీరంగనాథుని యొక్క; మహిమానం, ఏవ = మహిమనుగానే; మన్మహే = **తలుస్తున్నాం, అన్యథా = నీవు ఆయన** మహిమవు కాకపోతే; స్వ మహిమ ప్రతిష్ఠితః = తన మహిమయందే స్థిరపడిన; ప్రభుః = **రంగరాజు; పదాత్, పదం =** ఒక్కొక్క అడుగును; త్వయి = నీయందు; కథం = ఎలా, ప్రతి తిష్ఠతి = ఆధారపడి స్థిరంగా ఉంచుతాడు?

తా॥ ఓ మణిపాదుకా! నిన్ను శ్రీరంగనాథుని మహిమగానే భావిస్తున్నాం. లేకపోతే, తన మాహాత్మ్యం మీద **ఆధారపడిన** రంగరాజు ఒక పాదం తర్వాత ఒక పాదాన్ని నీయందు ఎలా సుఖంగా ఉంచుతాడు?

వ్యాఖ్య :— పాదుకాదేవి శ్రీరంగనాథుని మహిమగా వర్ణితం.

భగవంతుడు **"సభగవః కస్మిన్ ప్రతిష్ఠితః"?** దేనియందు ఆధారపడియున్నాడు? అనే ప్రశ్నకు సమాధానంగా **"స్వే మహిమ్ని ప్రతిష్ఠితః".** తన మహిమ యందే ఆధారపడియున్నాడు అని ఛాందోగ్యోపనిషత్తు చెబుతుంది.

భూమ విద్యలో నారద సనత్కుమారుల సంభాషణవల్ల తెలిసిన ఆ 'భగవంతుని మహిమ' అంటే, 'పాదుకాదేవియే' అని కవి భావన. పాదుకాదేవి భగవన్మహిమయే కాకుంటే, తన మహిమయందు తానాధారపడే రంగరాజు, తన రెండు పాదాలకు పాదుకలను ధరించి వైభవంగా ఎలా సంచరిస్తాడు? పాదుకలను ధరించి సంచరిస్తున్నప్పుడు, ఒక అడుగును నేలమీద ఉంచినప్పుడెట్లో, మరొక అడుగును అంతరాళానికెత్తినప్పుడు కూడా అట్లే పాదుకా సంబంధం స్థిరంగా ఉంటుంది కదా!

'స్వేన భూమ్నా' అని గత శ్లోక విషయాన్ని ఈ శ్లోకం వివరించింది. 'పాదుకా మహిమ' అంటే, పాదుకయే 'భగవంతుని మహిమ' అని కీర్తించింది. అర్థాపత్త్యలంకారం. మంజుభాషిణీ వృత్తం.

317. తిథి రష్టమీ యదవతార వైభవాత్
ప్రథమా తిథిస్త్రిజగతా మజాయత ।
మణి పాదుకే! తముపనీయ వీథికా
స్వతిథీకరోషి తదనన్య చక్షుషామ్ । –57.

అర్థం :— హే మణిపాదుకే = ఓ రత్నపాదుకా! **అష్టమీ = అష్టమి అనే; తిథిః = తిథి; యత్ + అవతార వైభవాత్** = ఎవని ఆవిర్భావ మహిమవల్ల; త్రిజగతాం = మూడు లోకాలకు; ప్రథమా, **తిథిః = ప్రతిపత్తిథి/ముఖ్య పర్వతిథిగా;** అజాయత = అయిందో; తం = ఆ శ్రీకృష్ణుణ్ని; వీథికాసు = శ్రీరంగ వీథుల యందు; **ఉపనీయ = తెచ్చి; తత్ +** అనన్య చక్షుషాం = అతని కంటె వేరే దృష్టిలేని జనులకు; **అతిథీ కరోషి = తిథి లేకుండా/అతిథిగా,** గోచరింపజేస్తున్నావు.

తా। ఓ మణిపాదుకా! అష్టమీతిథి శ్రీకృష్ణుని ఆవిర్భావ మహిమవల్ల ముల్లోకాలకు ప్రతిపత్తిథిగా/ముఖ్యపర్వతిథిగా అయింది. ఆ శ్రీకృష్ణుణ్ని శ్రీరంగ వీథుల్లోకి తెచ్చి తదేక దృష్టి కలిగిన భక్త జనులకు అతిథిగా చేస్తున్నావు.

వ్యాఖ్య :- పాదుకాదేవి శ్రీకృష్ణుణ్ని అతిథిగా చేసే వర్ణన.

సింహరాశిలో సూర్యుడు సంక్రమించే మాసంలో కృష్ణపక్షంలోని రోహిణీ నక్షత్రంతో కూడియున్న అష్టమీ తిథినాడు శ్రీకృష్ణభగవానుడు ఆవిర్భవించాడు. 'శ్రీకృష్ణజయంతి'ని బట్టి అష్టమీ తిథి పర్వదినంగా ప్రాముఖ్యం వహించింది. దినక్రమంగా చీకటి పెరుగడంవల్ల 'బహుళపక్ష'మని పేర్గాంచిన తిథుల్లో ఎనిమిదవదే అయినా, భగవదవతార మాహాత్మ్యం వల్ల అది ప్రతిపత్తిథిగా (మొదటి తిథిగా) ముజ్జగాలచే పరిగణింపబడింది. అర్ధరాత్రి దాకా చీకటి ఉండే అష్టమినాడు శ్రీకృష్ణుడావిర్భవించగానే వెన్నెల ప్రసరించింది. అది ప్రథమ తిథి అయింది, అంటే మునిమాపు రెండు ఘడియల కాలమే చీకటి ఉండి, రాత్రి ఆహ్లాదరకమైన వెన్నెల అధికంగా ప్రసరించే తిథిగా పరిణమించింది.

"అలంకార ప్రియో విష్ణుః" అన్నట్లు శ్రీరంగనాథుణ్ని శ్రీకృష్ణునిగా అలంకారంచేసి లోకులందరు సేవించాలని పాదుకాదేవి శ్రీరంగనగర వీథుల్లోకి తీసికొని వచ్చింది. కాబట్టి భక్తుల దృష్టి శ్రీకృష్ణుని మీదనే లగ్నమయింది.

"ఎన్నముదనై కండ కణ్గళ్ మఱ్ఱొన్ఱినై కాణావే" – 'నా అపర్యాప్తామృతమైన భగవంతుణ్ని సేవించిన కన్నులు వేరొక వస్తువును చూడలేవు' అన్న తిరుప్పాణాళ్వారు లాంటి వారయ్యారు భక్తులు.

శ్రీకృష్ణాలంకార సేవను పాదుకాదేవి భగవదేకాసక్తులకు గోచరింపజేసింది. జయంతి వైభవం వల్ల అష్టమి ప్రతిపత్తైతే, పాదుకా సంబంధ వైభవం వల్ల భక్తుల దృష్టిలో శ్రీకృష్ణుడు 'అతిథి' అయ్యాడు.

అతిథి :- తిథి లేని దినం, పంచాంగంలో ఇది 'శూన్య తిథి'గా సూచింపబడుతుంది. ఎనిమిదవ తిథి మొదటి తిథిగా తగ్గితే, మొదటికి తగ్గిన తిథి కూడా తిథిలేనిదయింది.

చందనగోష్ఠి, పుష్పార్చన, ఉపహార నివేదన, తాంబూలాద్యుపచారాలతో శ్రీకృష్ణజయంతిని వైభవంగా జరుపుతున్న పరమభక్తులకు కాలమే తెలియరాకుండా, అయింది.

"ఉభయోరపి పక్షయో స్థితిర్యా
విషమీభావ నిరా సదాఽష్టమీతి ।
ఉపమానజ సంపదే హి సేందో
ర్వరదా భూత్ భవతో లలాట లక్ష్మ్యాః" । (వరదరాజస్తవం. 32)

శుక్ల పక్ష ద్వితీయాది తిథుల్లో తక్కువ కళలతోనూ, నవమ్యాది తిథుల్లో ఎక్కువ కళలతోనూ, అలాగే కృష్ణపక్ష ప్రతిపదాది తిథుల్లో ఎక్కువ కళలతో, నవమ్యాది తిథుల్లో, తక్కువ కళలతోనూ చంద్రుడు ప్రకాశిస్తుంటాడు.

తిథులన్నీ ఎక్కువ తక్కువ రూపాలున్న చంద్రుడు కలవే. అష్టమీ తిథి మాత్రం ఉభయ పక్షాల్లోనూ, వైషమ్యం లేకుండా, భగవంతుని లలాట శోభతో సమానమైన కళారూప సంపదతో ప్రకాశించే చంద్రబింబం కలిది అన్నారు శ్రీవత్సాంకమిశ్రులు. **"నాణ్ మన్ను వెణ్ తింగళ్‌కొల్ .... పెరుమాన్ తిరునుదలే".** (తి.వా.మొ. 7.7.7.). భగవంతుని నుదురు అష్టమినాటి చంద్రుడన్నారు నమ్మాళ్వార్లు.

తిథి అతిథి అయింది, అనడం విరోధం. శ్రీకృష్ణచంద్రుడు భక్తులకు పూజ్యుడయ్యాడన్న భావంతో విరోధం పరిహారమయింది.

విరోధా భాసాలంకారం. మంజుభాషిణీ వృత్తం.

318. అపారప్రఖ్యాతే రశరణ శరణ్యత్వయశసా
ననుత్వం రంగేందో శ్చరణ కమలస్యాపి శరణమ్ ।
యయా లభ్యః పంగు ప్రభృతిభిరసౌ రంగనగర
ప్రతోళీపర్యంతే నిధి రనఘవాచాం నిరవధిః । –58.

అర్థం :– ఓ పాదుకాదేవీ! అశరణ శరణ్యత్వయశసా = గత్యంతరంలేని వారిని రక్షించడమనే కీర్తిచేత; అపార ప్రఖ్యాతేః = అమిత ప్రసిద్ధిగల; రంగ + ఇందోః = శ్రీరంగచంద్రుని యొక్క; చరణ కమలస్య, అపి = పాదకమలానికి కూడా; త్వం = నీవు; శరణం, ననుశరణంకదా! యయా = ఏ నీచేత; అనఘవాచాం = నిర్దుష్టవాక్కులుగల వేదాల్లో; నిరవధిః = తరుగని; నిధిః = నిధియైన; అసౌ = ఈ రంగనాథుడు; రంగనగర ప్రతోళీ పర్యంతే = శ్రీరంగ నగర చతుష్పథ ప్రాంతమందు; పంగుప్రభృతిభిః = కుంటి, మొదలైన వికలాంగులచేత; లభ్యః = పొందదగినవాడో.

తా॥ ఓ పాదుకా! వేరే రక్షకంలేని వారికి రక్షకంగాఉండే కీర్తిచేత అమిత ప్రసిద్ధుడైన శ్రీరంగచంద్రుని పాదకమలాలకు కూడా నీవు రక్షకంగా ఉన్నావు. నీచేతనేకాదా? వేదాల్లో తరుగని నిధియైన ఈ రంగచంద్రుడు శ్రీరంగనగర వీథుల పరిసర ప్రాంతమందు కుంటి మొదలైన వికలాంగులచేతనూ పొందదగినవాడవుతాడు.

వ్యాఖ్య :– పాదుకాదేవివల్ల భగవంతుని అ శరణ శరణ్యత్వం ప్రఖ్యాతం.

భగవంతుడు దిక్కూచక్కీలేని అనాథులను రక్షించే మహోన్నత స్వభావుడు. జగత్ప్రసిద్ధమైన ఈ కీర్తిని పొందిన శ్రీరంగచంద్రుని పాదకమలాలకు రక్షకంగా ఉండేది పాదుకాదేవి. చంద్ర సంచారంచే పాదాలనే కమలాలు వాడిపోతాయి. బుద్ధిబలంచేత లభించేది కీర్తి. పరాక్రమంచేత పొందబడేది యశస్సు. చంద్రుడు తమ్ముల పగవాడు కదా! సూర్యుడు కమలాప్తుడు.

"లబ్ధ్వా తీక్ష్ణం రవేస్తేజః శాంతం శీతకరోవహన్ ।
సర్వాన్ సంతోషయన్ సోమః, ఓషధీశో విరాజతే "

సూర్యుని తీక్ష్ణమైన తేజస్సును పొంది చంద్రుడు శీతకరుడై ఓషధులను పాలిస్తూ చరాచరజగత్తుకు ఆహ్లాదాన్ని కలిగిస్తాడు.

"సలిలమయే శశిని రవేర్దీధితయో మూర్ఛితాస్తమోనైశమ్ ।
క్షపయంతి దర్పణో దరవిహితా ఇవ మందిరస్యాంతః" ।

ఇంట్లో ఉన్న అద్దం మీద సూర్యకాంతిపడితే ప్రతిఫలించినట్లే జలమయమైన చంద్రునియందు పడిన సూర్యకాంతి ప్రతిఫలించి వెన్నెలగా వ్యాపిస్తుంది' అని వరాహమిహిరుని సూక్తి.

కమలాప్తుని రశ్మి ప్రభావంవల్ల చంద్రుని చంద్రిక ఆహ్లాదినిగా ప్రసిద్ధిచెందినట్లు, శ్రీరంగచంద్రుని చరణ కమలాలకు రక్షకంగా ఉన్న పాదుకా ప్రభావం వల్ల ఆయన అశరణ శరణ్యత్వయశశ్చంద్రిక ప్రఖ్యాతమయింది.

"తద్విప్రాసో విపన్యవో జాగృవాంస స్సమింధతే". శ్రుతిరీత్యా, జ్ఞాన భక్తి వైరాగ్య సంపదగల పరమభక్తులు భగవత్సన్నిధికి వెళ్ళి స్తుతించి తరిస్తుంటే, అంగవైకల్యంతో గతిలేని వారికి నిధిలాంటి పురుషార్థం లభ్యమయ్యేది ఎలా? అందుకే, శ్రీరంగచంద్రుణ్ని వికలాంగులున్నచోటికే తెచ్చి సేవింపచేస్తుంటే, వారు పంగుల దగ్గరికి రంగడు వచ్చాడు కదా! ఆహా! అశరణ శరణ్యా! శ్రీరంగచంద్రా! అని ప్రసన్న మనస్సుతో ప్రస్తుతించి పరమ పురుషార్థపరులవుతారు. వేదాల్లో గోప్యంగా ఉన్న నిధి వీథుల్లో కనబడడం అనురూపం. విషమాలంకారం. శిఖరిణీ వృత్తం.

319. తత్తద్వాస గృహాంగణ ప్రణయినః శ్రీరంగశృంగారిణో
వాల్లభ్యాదవిభక్త మంథరగతి స్త్వంమే గతిః పాదుకే !
లీలా పంకజ హల్లకోత్పల గళన్మాధ్వీకసేకోత్థితా ।
యత్రామోద వికల్పనా వివృణుతే శుద్ధాంత వారక్రమమ్ । –59.

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకాదేవీ! తత్తద్వా - ప్రణయినః/తత్ + తత్ = ఆయా దేవేరులయొక్క; వాసగృహ + అంగణ = కాపురమున్న ఇండ్ల ముంగిళ్ళయందు; ప్రణయినః = ప్రేమతో సంచరిస్తున్న; శ్రీరంగశృంగారిణః = విలాస పురుషుడైన శ్రీరంగపతికి; వాల్లభ్యాత్ = అంతరంగ ప్రియురాలవడం వల్ల; అవిభక్త, మంథర గతిః = మార్పులేని; అలస గమనవైన; త్వం = నీవు; మే = నాకు; గతిః = శరణం, యత్ర = ఏ నీయందు; లీలా -త్థితా/లీలా = విలాసం కోసమున్న; పంకజ = కమలం నుంచి; హల్లక = చెంగలువ నుంచి, ఉత్పల = నల్లకలువ నుంచి; గళత్ = స్రవిస్తున్న; మాధ్వీక సేక = మకరంద సేచనం వల్ల; ఉత్థితా = గుప్పుమని లేచిన; ఆమోద, వికల్పనా = వాసన పర్యాయంగా ప్రసరించడం; శుద్ధాంతవారక్రమం = అంతఃపురాల్లో పర్యాయంగా సంచరించే పరిపాటిని; వివృణుతే = వెల్లడిస్తుందో.

తా|| ఓ పాదుకాదేవీ! ఆయా దేవేరులు నివసించే భవనాల ముంగిళ్ళలో ప్రేమతో సంచరిస్తున్న శ్రీరంగశృంగారికి వాల్లభ్యం వల్ల విడువడని అలస గమనం కలిగిన నీవే నాకు రక్షకురాలవు. నీయందు విలాసార్థం లక్ష్మీదేవి ధరించిన కమలం నుంచి, భూదేవి ధరించిన కల్హారం నుంచి, నీళాదేవి ధరించిన నీలోత్పలం నుంచి స్రవిస్తున్న మకరంద సేచనం వల్ల గుబాళించే సుగంధాల పర్యాయ ప్రసరణం అంతఃపురాల్లో పర్యాయంగా సంచరించిన క్రమాన్ని వివరిస్తున్నది.

వ్యాఖ్య :- పాదుకాదేవియే ప్రాప్యమని వర్ణితం.

శ్రీరంగనాథుడు శృంగార యువకుడు. దేవేరులయందు తన ప్రేమను సమంగా విభజించి, వంతులవారిగా వారి మందిరాల్లో భోగాలను అనుభవిస్తాడు. పాదుకాదేవి యందు అవిభక్తమైన ప్రేమతో సంచరించే విలాస పురుషుడు ఆయన. లక్ష్మీదేవి ఇంటి నుంచి ఈ యువకుడు బయటకు వస్తుంటే, ఆమె ధరించిన లీలాకమలం నుంచి స్రవించిన మకరంద బిందువులు చిందడం వల్ల పాదుకాదేవి పద్మగంధిని అవుతుంది.

పాదుకాదేవియందు చెంగలువ వాసన వస్తే, ఈ భోగ పురుషుడు భూదేవి అంతఃపురం నుంచి వస్తున్నాడని పరిచారకులకు తెలిసిపోతుంది.

"హల్లకం రక్త సంధ్యకమ్" (అమరం)

నల్లకలువతావిని గుభాళింపజేసే పాదుకాదేవిని సేవించగానే ఈవేళ ఉజ్జ్వల పురుషుడు నీళాదేవి శుద్ధాంతం నుంచి వచ్చాడని భక్తులకు తెలుస్తుంది. శ్రీభూనీళలు విలాసంగా తమచేతిలో పంకజహల్లకోత్పలాలను క్రమంగా ధరించడం శాస్త్రసిద్ధం.

శ్రీ దేవ్యాదులకు వారాలనుబట్టి భోగానుభవం కలిగితే, సార్వకాలిక భోగానుభవం కలిగిన కాంత పాదుకాదేవి. కాబట్టి అవిభక్తమంథరగతిగల పాదుకాదేవియే మనకు గతి, యని స్తుతి.

సమాసోక్త్యలంకారం. శార్దూల విక్రీడితం.

320. సంభవతు పాదరక్షే!
సత్య సుపర్ణాది రౌపవాహ్య గణః ।
యాత్రాసు రంగభర్తుః
ప్రథమ పరిస్పంద కారణం భవతీ । -60.

అర్థం :- హే పాదరక్షే = ఓ పాదుకాదేవీ! రంగభర్తుః = శ్రీరంగరాజుకు; యాత్రాసు = ప్రయాణాల్లో, సత్య, సుపర్ణ + ఆదిః = సత్యుడు, సుపర్ణుడు మొదలైన, ఔపవాహ్యగణః = రాజవాహన సమూహం; సంభవతు = ఉండుగాక; భవతీ = నీవు; ప్రథమ పరిస్పంద కారణం = మొదటి చలనానికి కారణం.

తా॥ ఓ పాదుకాదేవీ! శ్రీరంగనాథుని ఉత్సవాల్లో సత్య, సుపర్ణాది రాజవాహన సమూహం ఉండుగాక. నీవే మొదటి చలనానికి కారణభూతవు.

వ్యాఖ్య :– పాదుకా విషయమై భగవంతుని ప్రథమ స్పందన వర్ణితం.

ఉత్సవాల్లో శ్రీరంగనాథుడు అనేక వాహనాల్లో ఊరేగుతాడు. గరుత్మంతుడెన్నో రూపాలను ధరించి భగవంతునికి వాహనంగా ఉపయోగపడుతాడు. సత్యవాహనం, సుపర్ణ వాహనం ఇత్యాది నామరూపాలు గల వాహనాలు వేర్వేరుగా ఉంటాయని మనమనుకున్నా, భగవచ్ఛాస్త్రం అవన్నీ గరుడునికి పర్యాయపదాలని ఉదాహరిస్తుంది.

"సత్యః సువర్ణో గరుడస్తార్క్ష్యశ్చ విహగేశ్వరః" (గరుడదండకం 'సుషమ' నుచూడండి)

సత్య, సుపర్ణాది విష్ణురథాలెన్ని వున్నా, శ్రీరంగరాజు సెజ్జనుంచిగానీ, ఆసనం నుంచిగానీ లేచి, మొట్ట మొదట పాదుకలను ధరిస్తేగానీ చలించలేడు. వాహనం దగ్గరికో, మంటపం మీదికో వెళ్ళాలనుకున్నా, ఆయన హృదయం మొదట పాదుకల పట్లనే స్పందిస్తుంది. ఆసనాసీనుడైనా, పాదుకలను పాదపీఠం మీద భద్రంగా ఉంచుకుంటాడు.

'సంభవతు' – ఉండుగాక. ఇది అనాదర భావాన్ని ప్రకటించే మాట. శ్రీరంగరాజు యాత్రల్లో పాదుకాదేవిదే అగ్రస్థానం.

సంచార సమయంలోనే పుష్పవృష్టి జరుగుతుంది. కాబట్టి ఇక 'పుష్ప పద్ధతి' ఆరంభమవుతుంది.

ఆక్షేపాలంకారం. ఆర్యా వృత్తం.

సంచార పద్ధతి సమాప్తం.

12. పుష్ప పద్ధతి

321. శౌరేః సంచారకాలేషు పుష్పవృష్టిర్దివశ్చ్యుతా ।
పర్య వస్యతి యత్రైవ ప్రపద్యే తాం పదావనీమ్ । –1.

అర్థం :– శౌరేః = భగవంతుని యొక్క; సంచార కాలేషు = సంచార వేళల్లో; దివః = ఆకాశం నుంచి; చ్యుతా = జారిపడిన; పుష్పవృష్టిః = పూలవాన; యత్ర, ఏవ = ఎక్కడైతే, పర్యవస్యతి = చేరి ముగియునో; తాం = ఆ, పదావనీం = పాదుకాదేవిని; ప్రపద్యే = ప్రపత్తి చేస్తాను.

తా॥ భగవంతుని సంచారకాలాల్లో ఆకాశం నుంచి కురిసిన పూలవాన ఎక్కడైతే పర్యవసిస్తుందో, ఆ పాదుకాదేవిని సేవిస్తాను.

వ్యాఖ్య :– పుష్పవృష్టి పర్యవసించే పాదుకాదేవియే శరణ్యం.

దేవగంధర్వాది ఖేచరులు శ్రీరంగనాథుని సంచారమప్పుడు గగనతలం నుంచి పూలవాన కురిపిస్తారు. అది భగవంతుని శిరస్సుమీద పడి, పాదాల మీదికి జారి, క్రమంగాపాదాల క్రింద ఉన్న పాదుకల మీద చేరి ఆగిపోతుంది. కాబట్టి పుష్పవృష్టి పాదుకోద్దేశంగానే జరుగుతుంది. వైశ్వానరవిద్యలో ప్రాణాగ్నిహోత్రమందు వివరింపబడిన రీతిగా, పాదపమూలంలో నీరుపోస్తే, పాదపం శాఖోపశాఖలతో వృద్ధిచెందునట్లు, పాదపారాధనచేస్తే పరమాత్మునికి ఆధారశక్తి పెరుగుతుంది. కాబట్టి దృఢ విశ్వాసంతో పాదుకాదేవిని ఉపాసించడమే పరమ పురుషార్థం.

పాదుకను ఉద్దేశించి పుష్పవృష్టిని వర్ణించడం, ఉత్ప్రేక్షాలంకారం, అది ప్రశంసతో కూడింది కాబట్టి, ప్రేయోఽలంకారం. అనుష్టుప్ ఛందం.

322. దైవతం మమ జగత్త్రయార్చితా
దివ్యదంపతి విహార పాదుకా ।
పాణి పాదకమలార్పణాత్తయో
ర్యా భజత్యనుదినం సభాజనమ్ । –2.

అర్థం :– జగత్ + త్రయ + అర్చితా = మూడు లోకాలచే పూజింపబడే; దివ్య దంపతి విహారపాదుకా = అప్రాకృత దంపతులైన శ్రీ శ్రియఃపతుల సంచారార్థమైన పాదుక; మమ = నాయొక్క; దైవతం = ఉపాస్య దేవత. యా = ఏ పాదుకాదేవి; తయోః = ఆ దివ్య దంపతుల యొక్క; పాణి పాద కమల + అర్పణాత్ = కర చరణాలనే కమలాల సమర్పణవల్ల; అనుదినం = దిన దినం; సభాజనం = పూజను; భజతి = పొందుతుందో.

తా॥ ముజ్జగాలు అర్చించే, అప్రాకృతదంపతులైన లక్ష్మీనారాయణులు విహారం కోసం ఉపయోగించుకునే పాదుకాదేవి నాకు ఉపేయం. దివ్య దంపతులు పాణి పాదకమలాలను అర్పించడంవల్ల పాదుకాదేవి ప్రతిదినం పూజను పొందుతుంది, సభనూ, జనాన్నీ పొందుతుంది.

వ్యాఖ్య :– కమలాలచే అర్చింపబడే పాదుకాదేవియే ఉపాస్య దేవత.

పాదుకయే ఉపాస్యదైవతమా? ఎలా?

1. జగత్త్రయం పాదుకాదేవిని పూజిస్తుంది. విష్ణ్వాలయాల్లో నేటికీ అర్చన శఠారి – పాదుకల –కే చేయడం గమనార్హం.

2. దివ్య దంపతులు ఏకాంతంగా పాదుకాదేవితో విహరిస్తారు.

3. శ్రీ శ్రియఃపతులు కరచరణ కమలాలను ప్రతిదినం సమర్పిస్తారు. శ్రీదేవి పతి పాదాలకు సమర్పించడం కోసం పాదుకలను కమల సదృశ హస్తాలతో స్పృశించి, ఎత్తి పట్టుకుంటుంది. చేతులే కమలాలు. చేతులతో స్పృశించడమే కమలార్చన.

శ్రియఃపతి పాదుకాదేవికి పాదాలనే కమలాలను అర్పిస్తాడు కదా! దివ్యదంపతులే కమలాల నర్పించి పాదుకాదేవిని పూజిస్తుంటే, ఇతరులకు 'పాదుకయే దైవం' అని చెప్పనక్కరలేదు.

భగవత్పాదకమలాలతో పాదుక బయటికి వచ్చి సభా జనాన్ని పొందుతుంది.

ప్రేయోఽలంకారం. కావ్యార్థాపత్త్యలంకారంచేత అలంకార ధ్వని. రథోద్ధతావృత్తం.

323. తవరంగరాజ మణిపాదు! నతో
విహితా ర్ఘణస్సుర సరిత్పయసా ।
అవతంస చంద్రకళయా గిరిశో
నవ కేతకీ దళమివార్పయతి ॥ –3.

అర్థం :– హే రంగరాజ మణిపాదు = ఓ రంగరాజు రత్నపాదుకా! నతః = నమస్కరించిన; గిరిశః = శివుడు; తవ = నీకు; సురసరిత్ పయసా = గంగాజలంచేత; విహిత + అర్ఘణః = ఇచ్చిన అర్ఘ్యం కలవాడై ; అవతంస చంద్రకళయా = శిరోభూషణమైన చంద్రకళ చేత; నవకేతకీ దళం = క్రొత్త మొగిలిరేకును; అర్పయతి, ఇవ = సమర్పిస్తున్నట్లు ఉన్నాడు.

తా॥ ఓ రంగరాజ మణిపాదుకా! పరమశివుడు గంగాజలం చేత నీకు అర్ఘ్యాన్ని సమర్పిస్తూ, శిరోభూషణంగా ఉన్న చంద్రకళ చేత క్రొత్త మొగిలిరేకును అర్పిస్తున్నట్లు ప్రణామం చేస్తాడు.

వ్యాఖ్య :– పాదుకాదేవికి పరమశివుడు నవకేతకీ పుష్పదళార్చన చేసే వర్ణన.

శివుడు తలమీద ధరించిన గంగాజలంతో అర్ఘ్యమిచ్చి పాదుకాదేవికి చంద్రకళతో కొత్త మొగిలిరేకును సమర్పిస్తున్నట్లు నమస్కరిస్తాడు. ఉత్ప్రేక్షాలంకారం. ప్రమితాక్షరా వృత్తం.

324. కుసుమేషు సమర్పితేషు భక్తైః
త్వయి రంగేశపదావని! ప్రతీమః ।
శఠకోపమునే స్త్వదేక నామ్నః
సుభగం య త్సురభిత్త్వమస్యనిత్యమ్ ॥ –4.

అర్థం :– హే రంగేశపదావని = శ్రీరంగనాథ పాదుకా! భక్తైః = భక్తులచేత; కుసుమేషు = పూవులు; సమర్పితేషు = సమర్పింపబడినప్పుడు; త్వత్ + ఏకనామ్నః = నీ పేరే కలిగియున్న; అస్య = ఈ (అర్చామూర్తిగా ఉన్న); శఠకోప మునేః = శఠకోపమునికి; నిత్యం = ఎల్లప్పుడు, సుభగం = మనోజ్ఞమైన; యత్, సురభిత్వం = ఏ సువాసన ఉందో; సురభిత్ + త్వం = దేవతలకంటె శ్రీమన్నారాయణుడు భిన్నుడు అనే భావముందో, (అది) = నీయందు; (ఉన్నదని) ప్రతీమః = భావిస్తున్నాం.

తా॥ ఓ రంగేశ పాదుకా! భక్తులు నీయందు పూవులు సమర్పించగా, సదా వ్యాపించే పరిమళమేదో అది, నీ పేరే కలిగి యున్న ఈ శఠకోప మునికి సంబంధించిన 'దేవతలకన్న శ్రీమన్నారాయణుడు భిన్నుడు' అనే భావంగా భావిస్తున్నాం.

వ్యాఖ్య :– పాదుకాదేవి వకుళ పుష్పార్చితగా వర్ణితం.

మధురకవి లాంటి భక్తులు పాదుకాదేవిని పుష్పాలతో అర్చించినప్పుడు వీచిన పరిమళం, పాదుకాదేవితో సమానమైన నామధేయంగల శఠకోపమునికి సంబంధించినదే, అని భావించడం సమంజసమే. పాదుకాదేవి శఠకోప ముని కంటే వేరుకాదు. 'సమాఖ్యా పద్ధతి'లో ఈ విషయం స్పష్టమైనదే కదా!

'తీర్పారె' (4 – 6) 'ఒన్డుందేవుం' (4 –10) అని 'తిరువాయిమొళి'లో నమ్మాళ్వార్లు 'దేవతలందరు ఒక్కటే, సమానులే అనడం తప్పు. దేవతాది సర్వప్రాణుల కంటె శ్రీమన్నారాయణుడు చాలా ఉత్కృష్టుడు' అన్నారు.

పాదుకాదేవి శఠకోపముని రూపంగా **'పొలిందు విన్దపిరాన్'** పెరుమాళ్ళ సన్నిధిలో వెలసింది. ఆ దివ్యదేశం 'తిరునల్వేలి' మండలంలో 'ఆళ్వార్ తిరునగరి' పేరుతో ప్రసిద్ధమైనది.

శ్రియః పతి కల్యాణ గుణాల అనుభవమే శఠకోపమునియందు నిత్యం పరిమళిస్తుంది. "తాళ్ కమళ్ మగిళ్ మాలే మార్పిననొ అని తామే అనుసంధించారు. శ్రీ యామునాచార్యులు నమ్మాళ్వార్లను 'వకుళాభిరాముడు' అని కీర్తించారు.

"యస్య సారస్వతం స్రోతో వకుళామోదవాసితమ్ ।
శ్రుతీనాం విశ్రమాయాలం శఠారింత ముపాస్మహే" । –4.

'యతిరాజ సప్తతి'లో దేశికులు 'శ్రీ శఠకోపదివ్యసూరి సూక్తులు పొగడపూల వాసనతో నిండినవి' అని స్తుతించారు.

ఈ శ్లోకం వకుళపుష్పమని పేర్కొనకున్నా, భక్తులు ఏ పూలతో అర్చించినా, పాదుకాదేవియందు వకుళ కుసుమ సురభిత్వం సహజం.

పదార్థ వృత్తినిదర్శనాలంకారం శ్లేషతో సంకీర్ణం. ఔపచ్ఛందసికం.

325. పదే పరస్మిన్ భువనే విధాతుః
పుణ్యైః ప్రసూనైః పులినే సరయ్వాః ।
మధ్యే చ పాదావని! సహ్య సింధో
రాసీ చ్చతుః స్థాన మివార్చనం తే । –5.

అర్థం :– హే పాదావని = ఓ పాదుకా! పరస్మిన్, పదే = వైకుంఠంలో; విధాతుః = బ్రహ్మయొక్క; భువనే = (సత్య) లోకమందు; సరయ్వాః = సరయూనది యొక్క; పులినే = సికతామయమైన అయోధ్యయందు; సహ్య సింధోః = కావేరీ నదియొక్క; మధ్యే, చ = మధ్యన, శ్రీరంగంలోనూ, పుణ్యైః = మనోజ్ఞమైన; ప్రసూనైః = పూలచేత; తే = నీయొక్క; అర్చనం = పూజ; చతుఃస్థానం, ఇవ = నాలుగుస్థానాలు కలదిగా; ఆసీత్ = ఉండెను.

తా। ఓ పాదుకాదేవీ! పరమపదంలో, సత్యలోకంలో, అయోధ్యలో, శ్రీరంగంలోనూ, మనోజ్ఞమైన పూలచేత నీ అర్చన, నాలుగు స్థానాలు కల భగవదర్చనలాగా ఉంది.

వ్యాఖ్య :– పాదుకార్చన, చతుఃస్థానాల్లో జరిగే భగవదర్చన సదృశమని వర్ణన.

పవిత్రోత్సవాదుల్లో కుంభపూజ, అగ్నిపూజ, స్థండిలపూజ, బింబపూజ, అని నాలుగు విధాలా జరుగడం భగవచ్ఛాస్త్రసిద్ధం.

శ్రీరంగనాథుడు పరమపదం నుంచి బ్రహ్మలోకానికి, అక్కడి నుంచి సాకేత నగరానికి, తర్వాత కావేరీనది ఇరుపాయల మధ్యకు వేంచేసి పూజింపబడుతున్నాడు. కాబట్టి, శ్రీరంగనాథపాదుకా పూజ పుణ్య పుష్పాలచే నాలుగు

చోట్ల జరుగడం విశేషమనీ, పాదుకార్చన భగవదర్చనలాగా స్థాన చతుష్టయ సంబంధం కలదని విశదీకరిస్తుందీ శ్లోకం.

"పుణ్యం మనోజ్ఞేఽభిహితం తథానుకృత ధర్మయోః" । (వి.ని.)

"పుణ్యంతు చార్వపి". (అమరం) నాలుగు శ్లోకాలచే నాలుగు రకాల పుష్పార్చన ప్రస్తుతింపబడిన విషయం గమనీయం. ఉపమాలంకారం. ఉపజాతి వృత్తం.

326. తవైవ రంగేశ్వర పాదరక్షే!
సౌభాగ్య మవ్యాహత మాప్తుకామాః ।
సురద్రుమాణాం ప్రసవైః సుజాతై
రభ్యర్చయం త్యప్సరసో ముహుస్త్వామ్ । –6.

అర్థం :– హే రంగేశ్వర పాదరక్షే = ఓ రంగరాజ పాదుకా! అప్సరసః = అచ్చరలేమలు, అవ్యాహతం = కొరతలేని; తవ = నీయొక్క; సౌభాగ్యం, ఏవ = మాహాత్మ్యన్నే; ఆప్తుకామాః = పొందగోరినవారై; సుజాతైః = హృద్యమైన; సురద్రుమాణాం = దేవతరువుల యొక్క; ప్రసవైః = పూలతో; ముహుః = మాటిమాటికి; త్వాం = నిన్ను; అభ్యర్చయంతి = పూజిస్తారు.

తా॥ ఓ రంగేశ్వర పాదుకా! అచ్చర లేమలు శాశ్వత సౌభాగ్యాన్నే పొందగోరుతూ, హృద్యంగా పూచిన దేవతరువుల పూలచే మాటికి మాటికి నిన్ను పూజిస్తుంటారు.

వ్యాఖ్య :– అప్సరసలు దివ్య పుష్పాలచే పాదుకార్చన చేసే వర్ణన.

స్వర్గంలోని నందనవనంలో మందార, పారిజాత, సంతాన, కల్ప, హరిచందన ద్రుమాలు సమస్త కోరికలను తీరుస్తాయి, అని ప్రసిద్ధం. సర్వ ఫలప్రదాలైన దేవతరువుల నుంచి కూడా పొందలేని, పాదుకాదేవి యొక్క ఉత్కృష్ట ఈశత్వ మాహాత్మ్యన్ని పొందాలనే కోరికతో దేవవేశ్యలు పదే పదే అన్ని దేవద్రుమాల పూలతో పాదుకాదేవిని అర్చిస్తారు. **"భగః శ్రీకామ మాహాత్మ్య వీర్యయత్నార్క కాంతిషు"** (అమరం)

దేవగణికలు, అనేక పుణ్య పురుషుల సంగమ భోగాలచే విసిగి, పురుషోత్తముని అడుగులకు మడుగులొత్తే పాదుకా సౌభాగ్యాన్ని తమకు అనుగ్రహించాలని పుష్పాలతో పాదుకాదేవిని పూజించడం కమనీయమే కదా!

స్త్రీలకు సౌభాగ్యం సుజాత పుష్పార్చన వల్ల కలుగుతుందనడం హేత్వలంకారం ఉపజాతి వృత్తం.

327. నివేశితాం రంగపతేః పదాబ్జే
మన్యే సపర్యాం, మణిపాదరక్షే !
త్వ దర్పణా దాపతితా మపశ్య
ద్గాండీవ ధన్వా గిరిశోత్తమాంగే I –7.

అర్థం :– హే మణి పాదరక్షే = ఓ రత్నపాదుకా! గాండీవధన్వా = గాండీవమనే ధనుస్సును ధరించిన పార్థుడు; రంగపతేః = శ్రీకృష్ణావతీర్ణుని యొక్క; పద + అబ్జే = పాదకమల మందు; నివేశితాం = సమర్పించబడిన; త్వత్ + అర్పణాత్ = నీకు సమర్పించడంవల్ల/నిన్ను ధరించడంవల్ల; ఆపతితాం = జారిపడిన; సపర్యాం = పూజా పుష్పాన్ని; గిరిశ + ఉత్తమాంగే = శివుని శిరస్సు మీద; అపశ్యత్ = చూచెను (అని) మన్యే = భావిస్తాను.

తా| ఓ మణిపాదుకా! గాండీవధనుర్ధారియైన అర్జునుడు శ్రీకృష్ణుడుగా అవతరించిన శ్రీరంగపతి యొక్క పద్మ సదృశ పాదమందర్పించడిన పూజా పుష్పాన్ని నీకర్పించడం వల్ల, నిన్ను ధరించడం వల్ల శివుని శిరస్సునందు వచ్చి చేరిన దానిగా చూచాడు.

వ్యాఖ్య :– శ్రీకృష్ణపాదార్పిత పుష్పం పరమశివుని శిరస్సుపైన చేరిన వృత్తాంతం వర్ణితం.

శ్రీరంగనాథుడు శ్రీకృష్ణునిగా అవతరించాడు. భారత యుద్ధరంగంలో పుత్రశోకం చేత పాశుపతాస్త్ర మంత్రం జ్ఞాపకం రాకచింతాగ్రస్థుడైన పార్థునికి శ్రీకృష్ణుడు తన పాదపూజ చేయుమని బోధించాడు. పార్థుడు శ్రీకృష్ణుని పాదాలనుపూలతో పూజించి కృతార్థుడయ్యాడు. శివుని దర్శనంకాగానే అతని తలమీద శ్రీకృష్ణ పాదార్పిత పుష్పాలను పార్థుడు చూచి, శ్రీకృష్ణుని పరత్వమహిమకు ఆశ్చర్యపోయాడు.

పూజింపడిన చక్రి పాదాల మీది పూలు జారి తలమీదికెలా చేరాయి? అనే వింతను వివరిస్తున్న ఈ శ్లోకం, అప్సరో విముఖుడైన అర్జునుణ్ని జ్ఞప్తికి తెచ్చింది.

పాదాల మీది పూలు పాదుకల మీద పర్యవసించాయి. పరమశివుడు ఆ పాదుకలను తలమీద ధరించినప్పుడు ఆ పూలు పాదుకల నుంచి జారి శివుని తలమీద పడినాయి. పాదుకా సంబంధంవల్ల పార్థుడు వాటిని చూడగలిగాడు. పరత్వ ప్రతిపాదకమైన ఈ ఉదంతం మహాభారతంలోనిది.

"పార్థో విజేతా మధుసూదనస్య, పాదారవిందార్పిత పత్ర పుష్పమ్ I
దదర్శ గంగాధర మౌళి మధ్యే,బభూవ వీరః కృతనిశ్చయార్థః" I

ఉత్ప్రేక్షాలంకారం, ఉపజాతి వృత్తం.

328. పత్రాణి రంగనృపతే ర్మణి పాదరక్షే !

ద్విత్రాణ్యపి త్వయి సమర్ప్య విభూతికామాః ।

పర్యాయ లబ్ధ పురుహూత పదాః శచీనాం

పత్రాంకురాణి విలిఖంతి పయోధరేషు । –8.

అర్థం :– హే రంగనృపతేః, మణి పాదరక్షే = ఓ రంగప్రభుపాదుకా! విభూతి కామాః = ఐశ్వర్యాన్ని కోరే పురుషులు; ద్విత్రాణి = రెండో మూడో; పత్రాణి, అపి = ఆకులనుగానీ, త్వయి = నీయందు; సమర్ప్య = సమర్పించి; పర్యాయ లబ్ధ పురుహూతపదాః = కాలక్రమంగా పొందిన ఇంద్ర పదవికలవారై ; శచీనాం = ఇంద్రాణుల యొక్క; పయోధరేషు = స్తనాలయందు; పత్ర + అంకురాణి = ఆకులను పోలిన రేఖలను; విలిఖంతి = రచిస్తుంటారు.

తా। ఓ రంగరాజ పాదుకా! ఐశ్వర్యాన్ని కోరే పురుషులు రెండో, మూడో ఆకులను గానీ నీయందు సమర్పించి, కాలక్రమంగా ఇంద్ర పదవిని పొందినవారై ఇంద్రాణుల వక్షోజాలయందు తమాల పత్రాంకురాలను చిత్రిస్తారు.

వ్యాఖ్య :– పాదుకాదేవిని ఆకులతో పూజించిన పురుషులు ఇంద్రపదవిని పొంది విలాసంగా జీవిస్తుంటారని విభావన.

పాదుకాదేవిని పూలతోనే కాదు, రెండు మూడు తులసి ఆకులతోగానీ పూజించిన పురుషుడు భోగ సామ్రాజ్యాధిపతి అవుతాడు. **"విభూతిర్భూతిరైశ్వర్యం" – "గర్హా సముచ్చయ ప్రశ్న శంకాసంభావనా స్వపి, ఉపమాయాం వికల్పేచ"** - (ఉభయత్ర, అమరం) అనేక కల్పాలనుబట్టి 'శచీనాం' అని బహువచనం ప్రయుక్తం.

ఇంద్రుడు మహాభోగి. ప్రతికల్పంలో పదవిని పొందిన ఇంద్రుడు తన పత్నియైన శచీదేవి పయోధరాల (రెండింటి) మీద విలాసంగా తమాల పత్రాలవంటి రేఖాచిత్రాలను రంగులతో రచిస్తాడు. ఆకులతో పూజించినా, ఇంద్రస్థాన ప్రాప్తి.

వసంత తిలకా వృత్తం.

329. నిర్వర్తయంతి తవయేనిచితానిపుష్పైః

వైహారికాణ్యుపవనాని వసుంధరాయామ్ ।

కాలేన తే కమలలోచన పాదరక్షే!

క్రీడంతి నందనవనే కృతినః పుమాంసః । –9.

అర్థం :– హే కమలలోచన పాదరక్షే = ఓ పుండరీకాక్షుని పాదుకా! యే = ఎవరు; తే = నీకు; వసుంధరాయాం =

భూమి యందు; పుష్పైః = పూలచేత; నిచితాని = నిండుగా పరువబడిన; వైహారికాణి = విహారార్థమైన; ఉపవనాని = ఆరామాలను; నిర్వర్తయంతి = ఏర్పరచుతారో; కృతినః = పుణ్యాత్ములైన; తే = ఆ; పుమాంసః = పురుషులు; కాలేన = పుణ్య పరిపాకకాలాన; నందనవనే = నందనవనమందు; క్రీడంతి = క్రీడా విహారం చేస్తారు.

తా॥ ఓ కమలలోచను పాదుకా! ఎవరు నీకు నేలయందు పూలను విస్తరించే విహారోద్యానవనాలను పెంచుతారో, ఆ సుకృతాత్ములు కాలక్రమేణ నందనవనంలో విహారక్రీడ ననుభవిస్తారు.

వ్యాఖ్య :– పాదుకా విహారార్థం పూలతోటలను పెంచినవారికి నందనవన క్రీడ ప్రాప్తిస్తుంది.

పూదోటలను పెంచడం సుకృతం. చెట్లకొమ్మల్లో పూచిన కమ్మని పూలు గాలిచే రాలి, పూలపడకగా నేల రమణీయంగా కనబడుతుంది. పూలనేల మీద పాదుకాదేవి భగవంతుణ్ని విలాసంగా విహరింపజేస్తుంది. అప్పుడు ఆ చెట్లు కూడా భగవంతునిపైన పుష్పవృష్టి జరుపగా, ఆ పూలు క్రమంగా పాదుకలపైన చేరుతాయి. ఉద్యానవనాలు పాదుకార్చన చేసిన ఫలితంగా, ఆ వనాలను నిర్వర్తించిన భాగ్యవంతులకు దేహయాత్రానంతరం స్వర్గంలో నందనవనమందు విహారక్రీడ సలిపే గొప్ప అనుభవం కలుగుతుంది.

హేత్వలంకారం. వసంత తిలకా వృత్తం.

330. అర్చంతి యే మధుభిదో మణి పాదరక్షే!
భావాత్మకై రపిపరం భవతీం ప్రసూనైః ।
మందారదామ సుభగై ర్మకుటై రజస్రం
బృందారకాః సురభయంతి పదం తదీయమ్ । –10.

అర్థం :– హే మధుభిదః, మణి పాదరక్షే = ఓ మధుసూదను పాదుకా! యే = ఎవరు; భావాత్మకైః, అపి, పరం = మనో వ్యాపారంచేత ఉత్కృష్టమైన; ప్రసూనైః = పూలచేత; భవతీం = నిన్ను; అర్చంతి = పూజిస్తారో; తదీయం = వారిదైన; పదం = పాదాన్ని; బృందారకాః = దేవతలు, మందారదామసుభగైః = మందార మాలికలచే మనోజ్ఞమైన; మకుటైః = కిరీటాలచేత; అజస్రం = ఎల్లప్పుడు; సురభయంతి = పరిమళింపజేస్తారు.

తా॥ ఓ మధుభిత్పాదుకా! ఎవరు హార్దికంగా ఉత్కృష్టమైన పూలచేతనూ నిన్ను అర్చిస్తారో, అట్టి నీ భక్తుల చరణాలను దేవతలు మందార మాలికలచే మనోజ్ఞమైన కిరీటాలచే సదా పరిమళింపజేస్తారు.

వ్యాఖ్య :– మానస పుష్పార్చకులకు దేవతలు నమస్కరిస్తారని, విభావన.

భావాత్మక పుష్పాలు ఎనిమిది. 1. అహింస 2. ఇంద్రియ నిగ్రహం 3. సర్వ భూతదయ 4. క్షమ 5. శాంతి 6. తపస్సు 7. ధ్యానం 8. సత్యం.

"అహింసా ప్రథమం పుష్పం, పుష్పమింద్రియ నిగ్రహః।
సర్వభూతదయా పుష్పం, క్షమా పుష్పం విశేషతః।
శాంతిః పుష్పం తపః పుష్పం, ధ్యానం పుష్పం తథైవచ।
సత్య మష్టవిధం పుష్పం, విష్ణోః ప్రీతికరంభవేత్।

ఈ మనస్సుమనస్సులతో పాదుకార్చన చేసిన ముక్త పురుషులు అర్చిరాది మార్గంలో దేవతలచే ఆదరింప బడుతారని శాస్త్రం. వసంత తిలకా వృత్తం.

331. అస్పృష్ట దోష పరిమర్శ మలంఘ్య మన్యైః
హస్తాపచేయ మఖిలం పురుషార్థవర్గమ్।
చిత్రం జనార్దన పదావని! సాధకానాం
త్వయ్యర్పితాస్సుమనసః సహసా ఫలంతి। –11.

అర్థం :– హే జనార్దన పదావని = ఓ జనార్దనుపాదుకా!. త్వయి = నీయందు; అర్పితాః = అర్పింపబడిన; సుమనసః = పూవులు; సాధకానాం = జ్ఞానులకు; అస్పృష్ట దోష పరిమర్శం = అంటని దోష సంబంధంగల; అన్యైః = ఇతర ఫలాలచేత; అలంఘ్యం = లంఘింప శక్యంకాని; హస్త + అపచేయం = చేతులతో తెంపుకోదగిన; అఖిలం = ఖిలంకాని; పురుషార్థవర్గం = పురుషార్థ సముదాయమై ; సహసా = శీఘ్రంగా; ఫలంతి = ఫలిస్తాయి; చిత్రం = వింతయే.

తా। ఓ జనార్దను పాదుకా! నీయందు సమర్పింపబడిన జ్ఞాన పుష్పాలు సాధకులకు, దోష స్పర్శలేని, ఇతర ఫలాలచే లంఘింప శక్యంకాని, చేతికందే అఖిల పురుషార్థ సముదాయమై త్వరగా ఫలిస్తాయి.

వ్యాఖ్య :– అర్పిత జ్ఞాన పుష్పాలు శీఘ్రంగా ఫలప్రదాలు, అని విభావన.

జ్ఞానులు, ఉన్నచోటనే పాదుకాదేవిని పరిమళంగల పుష్పాలతో పూజిస్తున్నట్లు హృదయంలో ధ్యానిస్తారు. అహింసాది గుణాలతో ప్రవర్తిస్తూ సమాజానికి, సర్వేశ్వరునికి ప్రీతిపాత్రులవుతారు. ఇతర దేవతల నారాధిస్తే సమస్త పురుషార్థాలు లభించవు. ధర్మార్థకామమోక్షాలు ఖిలమవుతాయి. అంటే, అర్థమో, కామపురుషార్థమో దొరికినా, వాటికి దోషం తగులుతుంది. ఎంత లంఘించినా, ప్రయత్నించినా, దేవతాంతరార్చకులు మోక్షఫలాన్ని అందుకోలేరు. పూజించిన పూలు అప్పుడే ఫలించడం చిత్రమే.

ప్రకృతిలో చెట్ల పూలు కాయలై, ఫలాలుగా పరిణమిస్తాయి. పూలు పండ్లుగా కావడానికి కాల ప్రభావముంది. పురుగుపట్టని ఆ పండ్లు కూడా ఏదోరకంగా చెడిపోయే, ముర్గిపోయే అవకాశముంది. దేవతాంతర పూజవల్ల కలిగే ఫలాలు అల్పమూ, అస్థిరమూ, అని తెలిసి, మోక్షాభిలాషులు భావాత్మక పుష్పాలతో పాదుకాదేవిని పూజించి, భరన్యాసం

చేస్తారు. తత్ఫలం సుమనస్సులకు హస్తాపచేయమే. పాదుకానుగ్రహంవల్ల, సమర్పిత పుష్పాలు వెంటనే అఖిల పురుషార్థ వర్గంగా - పండ్ల గుత్తిగా - ఫలిస్తాయి. శాశ్వతానందాన్ని అనుభవింపజేస్తాయి. వసంతతిలకా వృత్తం.

332. వందారుభిః సురగణైస్త్వయి సంప్రయుక్తా
మాలా విభాతి మధుసూదన పాదరక్షే!
విక్రాంత విష్ణుపద సంశ్రయ బద్ధసఖ్యా
భాగీరథీవ పరిరంభణ కాంక్షిణీ తే । -12.

అర్థం :- హే మధుసూదన పాదరక్షే = ఓ మధ్వంతక పాదుకా! వందారుభిః = ప్రణామశీలురైన; సురగణైః = దేవతల బృందాలచేత; త్వయి = నీయందు; సంప్రయుక్తా = సమర్పింపబడిన; మాలా = పూలహారం; విక్రాంత - సఖ్యా/ విక్రాంత = విశేషంగా ఆక్రమింపబడిన; విష్ణుపద = ఆకాశంగల విష్ణువు యొక్క చరణం యొక్క; సంశ్రయ = సంబంధం వల్ల; బద్ధసఖ్యా = ఏర్పడినగాఢ స్నేహంగల; తే = నీయొక్క; పరిరంభణ కాంక్షిణీ = ఆలింగనాన్ని కోరే; భాగీరథీ, ఇవ = గంగానదియో అన్నట్లు; విభాతి = ప్రకాశిస్తుంది.

తా॥ ఓ మధుసూదన పాదుకా! నీయందు ప్రణామశీలురైన బృందారకుల బృందాలచే సమర్పింపజడిన పూలమాలిక, ఆకాశానికి చాపబడిన శ్రీమహావిష్ణుపాదం యొక్క సంబంధంవల్ల మిత్రత్వమేర్పడి నీ ఆలింగనాన్ని అపేక్షించే భాగీరథివలె శోభిస్తుంది.

వ్యాఖ్య :- పాదుకాదేవికి దేవగణార్పిత పుష్పమాల భాగీరథిలాగా భాసిస్తుందని ఉత్ప్రేక్షితం.

శ్రీ వామనమూర్తి త్రివిక్రముడై దక్షిణపాదంతో నేలను కొలచి, వ్యోమతలాన్ని కొలువడానికి వామపాదాన్ని పైకి చాచాడు. అప్పుడు దేవనది వామపాదం నుంచి ఉద్గమించింది. విష్ణుపాద సంబంధం కలిగిన పాదుకాదేవికీ, సురనదికీ పరస్పర స్నేహమేర్పడింది.

విష్ణుపాదాన్ని అంతరిక్షంలోకి తెచ్చిన పాదావనిని పూజించడానికి దేవతలందరు గుంపులు గుంపులుగా ఏర్పడి చాలా పొడవైన పూలదండను చక్కగా కూర్చి, పాదుకాదేవికి సమర్పించారు.

భగీరథుని ప్రయత్నంచేత దేవనది భాగీరథి అయింది. భూమికి చేరి గంగ అని పేరు పొందింది. భాగీరథి, బద్ధ సఖ్యంతో పాదుకాదేవి ఆలింగనాన్ని కోరినట్లు దేవగణాలర్పించిన పూలహారం శోభిస్తున్న రీతిని కవి, జ్ఞాననేత్రంతో చూచాడు. **"మనోఽన్య దైవం చక్షుః"**. అన్నది కదా! వేదం.

పాదుకాదేవి యొక్క ఒక అంగం నింగిలో, ఒక అంగం నేల మీద ఉంది. అందుకే, పూర్ణాంగీ పరిరంభణ కాంక్షిణియై భాగీరథి ఆకాశం నుంచి అవనికి ధారగా జారింది. ఈ దేవమాల నాన్యతో దర్శనీయం కదా !

వసంత తిలకా వృత్తం.

333. యేనామ రంగనృపతే ర్మణిపాదుకే! త్వా
మభ్యర్చయంతి కమలై రధికర్తు కామాః ।
ఆరోప యత్యవహితా నియతిః క్రమాత్తాన్
కల్పాంతరీయ కమలాసన పత్రికాసు ।

అర్థం :– హే రంగనృపతేః, మణిపాదుకే = ఓ రంగప్రభు రత్నపాదుకా! యేనామ = ఎవ్వరైతే; అధికర్తు కామాః = అధికారాన్ని కోరినవారై ; త్వాం = నిన్ను; కమలైః = తామరపూలతో; అభ్యర్చయంతి = అర్చిస్తారో; తాన్ = వారిని; నియతిః = భాగ్యం; అవహితా = సావధానయై ; కల్ప + అంతరీయ, కమల + ఆసన, పత్రికాసు = రాబోయే కల్పాల్లో నియమించ వలసిన చతుర్ముఖుల పట్టికలయందు, క్రమాత్ = వరుసగా; ఆరోపయతి = ఎక్కిస్తుంది. (పేర్లను వ్రాసి వేస్తుంది)

తా॥ ఓ రంగరాజ పాదుకా! ఎవ్వరైతే అధికారాన్ని కోరి నిన్ను కమలాలచే అర్చిస్తారో, వారిని (అదృష్టం) భాగ్యం, సావధానంగా కల్పాంతరాల్లో కాబోయే బ్రహ్మల పట్టికను కమ్మలమీద క్రమంగా ఎక్కిస్తుంది.

వ్యాఖ్య :– కమలాలతో అర్చిస్తే, కమలాసన పట్టం ప్రాప్తించే వర్ణన.

కమలాలతో పాదుకాదేవిని అర్చించినందువల్ల కలిగిన భాగ్యం, కమలార్చకుల పేర్లను సావధానంగా, అముక నామధేయుడు అముక కల్పంలో బ్రహ్మ అవుతాడని, పట్టికలయందు (List of seniority) క్రమబద్ధంగా వ్రాసి ఉంచుతుంది.

"భాగ్యం స్త్రీనియతి ర్విధిః". (అమరం)

స్వరూపోత్ప్రేక్షాలంకారం. వసంత తిలకా వృత్తం.

334. త్వయ్యర్పితాని మనుజైర్మణి పాదరక్షే!
దూర్వాంకురాణి సులభా న్యథవా తులస్యః ।
సారాధికాః సపది రంగ నరేంద్ర శక్త్యా
సంసార నాగదమనౌషధయో భవంతి । –14.

అర్థం :- హే మణి పాదరక్షే = ఓ రత్నపాదుకా! మనుజైః = మానవులచేత; త్వయి = నీయందు; అర్పితాని = సమర్పింపబడిన; సులభాని = అప్రయత్నంగా లభించే; దూర్వా + అంకురాణి = గరిక మొక్కలు; అథవా = లేదా; తులస్యః = తులసీదళాలు; రంగనరేంద్ర శక్త్యా = రంగరాజు యొక్క ప్రభావంచేత/రంగనగరమందున్న విషవైద్యుని శక్తిచేత; సపది = తక్షణమే; సార + అధికాః = అధిక వీర్యమున్నవై ; సంసార నాగ దమన + ఓషధయః = సంసారమనే సర్పాన్ని అణచి వేసే ఓషధులుగా; భవంతి = అవుతాయి.

తా॥ ఓ మణిపాదుకా! నీయందు మానవులచే సమర్పించబడిన సులభమైన గరికగెనెలుగానీ, తులసీదళాలుకానీ, శ్రీరంగ విషవైద్యుని శక్తిచేత తత్కాలాననే అధిక సారవంతాలవుతూ, సంసారమనే సర్పాన్ని అణచివేసే ఓషధులవుతాయి.

వ్యాఖ్య :- దూర్వా తులస్యర్చకులకు సంసార నివృత్తి.

ప్రకృతిలో గరిక, తులసి మానవులకు యత్నించకుండా, సుఖంగా లభిస్తాయి. వాటిని భక్తితో పాదుకాదేవికి సమర్పిస్తే శ్రీరంగనాథుని అనుగ్రహం లభిస్తుంది. శ్రీరంగనాథుడు విషవైద్యుడు.

"నరేంద్రో వార్తికే రాజ్ఞి విషవైద్యేచ కథ్యతే" (విశ్వ ని.)

రాజు కాబట్టి, జీవులకు జన్మ రాహిత్యాన్ని కృపజేస్తాడు. సంసారం దారుణమైన సర్పం. సర్పదష్టునికి మరణం తప్పదు. మరణించిన వాడు మళ్ళీ సంసారంలో - సర్పమున్నచోటనే - జన్మిస్తాడు. జనన మరణచక్రంతో పరిభ్రమిస్తుంటాడు. కాబట్టి పాదుకాదేవికి అర్పించిన గరిక, తులసీ పత్రాలు విషవైద్యుని ప్రభావంచేత సర్పాన్నే అణచివేసే ఓషధులవుతాయి. గరికాకులకు, తులసీదళాలకు మోక్షాన్ని కలిగించే శక్తి ఉంది. **"సహస్ర పరమాదేవీ శతమూలాశతాంకురా । సర్వగ్ం హరతు మేపాపం దూర్వా దుస్స్వప్న నాశినీ"** । అని వేదవాణి.

సాదృశ్యవాక్యార్థాలకు ఐక్యాన్ని ఆరోపించడం వల్ల నిదర్శనాలంకారం. వసంత తిలకా వృత్తం.

335. ఆరాధ్యనూన మసురార్దన పాదుకే! త్వా
మాముష్మికాయ విభవాయ సహస్ర పత్రైః ।
మన్వంతరేషు పరివర్తిషుదేవి! మర్త్యాః
పర్యాయతః పరిణమంతి సహస్రనేత్రాః ॥ -15.

అర్థం :- హే అసురార్దన పాదుకే, దేవి = ఓ రాక్షసాంతకుని పాదుకాదేవీ! మర్త్యాః = మానవులు; ఆముష్మికాయ = ఊర్ధ్వ లోకపుదైన; విభవాయ = ఐశ్వర్యం కోసం; త్వాం = నిన్ను; సహస్రపత్రైః = వేయి రేకులున్న కమలాలచేత; ఆరాధ్య = పూజించి; మన్వంతరేషు = మన్వంతరాలు; పరివర్తిషు = మారుతుండగా; పర్యాయతః = పర్యాయంగా; సహస్ర నేత్రాః = వేయి కన్నులు కలిగిన ఇంద్రులుగా; పరిణమంతి = మారుతుంటారు. నూనం = నిస్సంశయం.

తా॥ ఓ రాక్షసాంతక పాదుకా! మర్త్యులు పరలోకంలో అనుభవింపదగిన ఐశ్వర్యం కోసం నిన్ను సహస్ర పత్రాలచేత ఆరాధించి, పరివర్తించే మన్వంతరాల్లో పర్యాయంగా సహస్ర నేత్రులుగా పరిణమిస్తారు. సంశయం లేదు.

వ్యాఖ్య :– పాదుకాదేవిని సహస్ర పత్రాలతో అర్చించే మర్త్యులు సహస్రాక్షులయ్యే వర్ణన.

"సహస్ర పత్రం కమలం, శతపత్రం కుశేశయం" (అమరం). మరణశీలురైన జనులు అమర లోక భోగైశ్వర్యాలను అనుభవించాలనే వాంఛతో అసురార్దను పాదుకలను వేయిరేకులున్న కమలాలతో అర్చిస్తే, కాలక్రమేణ వేయికన్నులున్నవేల్పుదొరలవుతారు. **"ఆఖండలః సహస్రాక్షః"** (అమరం)

"చతుర్యుగసహస్రాణి బ్రహ్మణో దినముచ్యతే"। చతుర్యుగ సహస్రాలైతే బ్రహ్మకు ఒక్క పగలు. బ్రహ్మ యొక్క పగటికాలంలో (14) పదునాల్గు మన్వంతరాలుంటాయి. ఒక్కొక్కమన్వంతర కాలంలో ఒక్కొక్క ఇంద్రుడు స్వర్గలోకాన్ని పాలిస్తాడు.

సహస్ర పత్రార్చన కారణం. సహస్రాక్షుడుగా పరిణమించడం కార్యం. కార్యకారణాలకు సారూప్య నిబంధన వల్ల, సమానాలంకారం. వసంత తిలకా వృత్తం.

336. ధన్యైస్త్వయి త్రిదశ రక్షక పాదరక్షే!

పుష్పాని కాంచన మయాని సమర్పితాని ।

విస్రంసినా వినమతో గిరిశోత్త మాంగా

దార గ్వధేన మిళితా న్యపృథగ్భవంతి । –16.

అర్థం :– హే త్రిదశ రక్షక పాదరక్షే = ఓ దేవరక్షకుని పాదుకా! ధన్యైః = పుణ్యాత్ములచేత; త్వయి = నీయందు; సమర్పితాని = అర్పింపబడిన; కాంచనమయాని = సువర్ణమయమైన; పుష్పాణి = పూవులు; వినమతః = నమస్కరిస్తున్న; గిరిశ + ఉత్తమాంగాత్ = శివుని శిరస్సు నుంచి; విస్రంసినా = జారిపడిన, ఆరగ్వధేన = రాజ వృక్ష పుష్పంతో; మిళితాని = కలిసినవై ; అపృథక్, భవంతి = అభిన్నంగా ఉంటాయి.

తా॥ ఓ దేవరక్షకుని పాదుకా! పుణ్యాత్ములు నీయందు సమర్పించిన బంగారు వన్నె పూలు, నమస్కరించే శివుని శిరస్సు నుంచి జారిపడిన రేల పూవుతో కలిసినవై, భేదరహితంగా ఉంటాయి.

వ్యాఖ్య :– పాదుకాదేవి కర్పించిన పూలు అపృథగ్రూపాలుగా ఉండే వర్ణన.

బంగారు పూవులు ఆకాశగంగలో ఉంటాయని పురాణ వచనం. **'సుకృతీ పుణ్యవాన్ ధన్యః'.** (అమరం). ధన్యాత్ములు పాదుకాదేవిని కాంచన పుష్పాలతో పూజిస్తారు. వలిమలల్లుడు వచ్చి పాదుకాదేవికి ప్రణమిల్లినప్పుడు

వంచిన తలనుంచి ఆ రగ్వధపుష్పం జారిపడింది. **"ఆరగ్వధో రాజవృక్షః"** (అమరం) కాంచన పుష్పాలు ఆరగ్వధ పుష్పంతో కలియడం వల్ల ఇది కాంచనం, ఇది ఆరగ్వధం అని తెలియ శక్యంకానంత రూప, వర్ణ సాదృశ్యంతో శోభిస్తుంటాయి.

విశేష స్ఫూర్తి లేకుండా వర్ణించడం, సామాన్యాలంకార లక్షణం. వసంత తిలకా వృత్తం.

337. విశ్వో ప సర్గశమనం త్వయిమన్యమానై
ర్వైమానికైః ప్రణిహితం మణిపాదరక్షే !
పద్మా సహాయ పద పద్మనఖార్చిష స్తే
పుష్పో పహార విభవం పునరుక్త యంతి I –17.

అర్థం :– హే మణిపాదరక్షే = ఓ రత్నపాదుకా! విశ్వ + ఉపసర్గ, శమనం = సమస్త ఉపద్రవాలను శాంతింపజేయడం; త్వయి = నీ అధీనమని; మన్యమానైః = భావిస్తున్న; వైమానికైః = విమానమందు చరించే దేవతలచేత; ప్రణిహితం = సమర్పించబడిన; తే = నీయొక్క; పుష్ప + ఉపహార విభవం = పూలకానుకల సంపదను; పద్మాసహాయ, పదపద్మ, నఖ + అర్చిషః = శ్రియఃపతి యొక్క పద్మసదృశపాదాల గోళ్ళకాంతులు; పునరుక్తయంతి = ఇనుమడింపచేస్తాయి.

తా॥ ఓ మణిపాదుకా! సకల అరిష్టాలను శమింపజేయడం నీ అధీనమని తలంచే దేవతల చేత సమర్పింపబడిన పుష్పోపహార విభవాన్ని లక్ష్మీకాంతుని పాదపద్మాల నఖరోచిస్సులు రెట్టింపు చేస్తుంటాయి.

వ్యాఖ్య :– పాదుకాదేవి పైన కురిసిన పుష్పవిభవం శ్రీపతి నఖకాంతులచే ద్విగుణీకృతం.

విశ్వోపసర్గకారకుడైన బలిచక్రవర్తిని త్రివిక్రముడు నిగ్రహించాడు.**"ఉపసర్గః స్మృతో రోగే విఘ్నోపప్లవయోరపి"** (విశ్వని) సకలోపద్రవాలను కలిగించే దుష్టులను నష్టపరచే శ్రీకాంతుని సంచారం పాదుకాధీనమని గ్రహించిన వైమానికులు, పాదుకాదేవిని ఉద్దేశించి పూలవాన కురిపించారు. ఆ పూలు భగవంతుని శిరస్సు నుంచి జారి పాదుకాదేవి మీద పర్యవసించాయి. భగవంతుడు పద్మాసహాయుడు. ఆయన పాదాలూ పద్మపుష్ప సదృశాలు. పాదుకాదేవి మణిమయి. మణుల రకరకాలకాంతులచే రంగు రంగుల పూలు హృదయంగమాలు. అయితే పద్మాకాంతుని పాదపద్మ నఖకాంతులు, పాదుకా పుష్పోపహార వైభవాన్ని చిత్ర విచిత్రంగా ఇనుమడింపజేయడం, అనుగుణాలంకారమే. వసంత తిలకా వృత్తం.

338. నాకౌకసాం శమయితుం పరిపంథివర్గా
న్నాథే పదం త్వయినివేశయితుం ప్రవృత్తే ।
త్వ త్సంశ్రితాం విజహతస్తులసీం వమంతి
ప్రస్థాన కాహళరవాన్ ప్రథమం ద్విరేఫాః I –18.

అర్థం :– ఓ పాదుకాదేవీ! నాథే = శ్రీరంగనాథుడు,**నాక** + ఓకసాం = స్వర్గమే నివాసంగల దేవతల యొక్క;

పరిపంథివర్గాన్ = శత్రు సమూహాలను, శమయితుం = శాంతింపజేయ (అణచ) డానికి; త్వయి = నీయందు; పదం = పాదాన్ని; నివేశయితుం = ఉంచడానికి; ప్రవృత్తే = ప్రవర్తిస్తున్నప్పుడు; త్వత్ + సంశ్రితాం = నీయందున్న; తులసీం = తులసిని; విజహతః = వదలివేస్తున్న; ద్విరేఫాః = భ్రమరాలు; ప్రథమం = మొదటనే; ప్రస్థాన కాహళరవాన్ = పయన మప్పుడు ఊదబడే కాహళ వాద్య ధ్వనులను; వమంతి = వెలువరిస్తున్నాయి.

తా॥ ఓ పాదుకాదేవీ! శ్రీరంగనాథుడు దేవతల శత్రు సమూహాలను అణచడానికి నీయందు పాదాలను తొడుగుతుంటే నీ కర్పింపబడిన తులసిని వదలివేస్తూ తుమ్మెదలు మొదటనే పయనించే వేళ చేసే కాహళ వాద్యధ్వనులను చేస్తున్నాయి.

వ్యాఖ్య :– తుమ్మెదల మ్రోత కాహళధ్వనిగా ఉత్ప్రేక్షితం.

పాదుకాదేవిని భక్తులు తులసీదళాలతో అర్చించారు. తులసీ పరిమళానికి బంభరాలు బారులుగావచ్చి మూగి ఉన్నాయి. శ్రీరంగనాథుడు అమర శత్రువుల నణచడానికి బయల్దేరే ముందు పాదుకలను ధరిస్తుంటే, తుమ్మెదలన్నీ తామనుభవిస్తున్న తులసిని విడిచిపెట్టి, జుమ్మని మ్రోగుతు ఎగురుతున్నాయి. స్వామి పయనమయ్యేవేళ మ్రోగవలసిన కాహళరవాల కంటె ముందే, చంచరీకాలే కాహళవాద్యం రీతిగా ఝుంకారనాదాలను ఆలపిస్తున్నాయి.

వాస్తవంగా, తుమ్మెదలు స్వామి ప్రయాణం తమ తులసీ దళానుభవాన్ని ఆటంకపరచిందని భావించక పరోపకార పరాయణలయ్యాయి. శ్రీ శఠకోప దివ్యసూరి స్వామి అనుభవాన్ని, స్వానుభవాన్ని పరులకు ఉపదేశించడమే ప్రధానమని, 'తిరువాయి మొళి'ని అనుగ్రహించారు. 'తులసీం వమంతి' దళం కమనీయం. శ్రీభగవద్రామానుజులు తామనుభవించిన పరమార్థాన్నితమకే లాభమనుకొనలేదు, పరులకు ఉపదేశించడమే ప్రధానమని, పరార్థప్రవణులయ్యారు కదా! గమ్యోత్ప్రేక్షాలంకారం, వసంత తిలకా వృత్తం.

339. రంగేశ పాద పరిభోగ సుజాతగంధాం
సంప్రాప్యదేవి! భవతీం సహదివ్యపుష్పైః ।
ని త్యో పదర్శితరసం నకిలాద్రియంతే
నాభీసరోజ మపి నందన చంచరీకాః ॥ –19.

అర్థం :– హే దేవి = ఓ పాదుకాదేవీ! నందన చంచరీకాః = నందనవనంలోని తుమ్మెదలు; రంగేశ పాద, పరిభోగ, సుజాత గంధాం = పూజ్యుడైన శ్రీరంగనాయకుని పాదాల ఉపభోగంవల్ల శోభనమైన సువాసనగల; భవతీం = నిన్ను; దివ్య పుష్పైః, సహ = దేవతలు కురిపించిన పూలతోకూడా; సంప్రాప్య = పొంది; నిత్య + ఉపదర్శిత, రసం = ఎల్లప్పుడు దగ్గరగా కనబడే పూదేనెగల; నాభీ సరోజం, అపి = పొక్కిలితామర పూవునుకూడా; న, ఆద్రియంతే, కిల = ఆదరిస్తు లేవు కదా!

తా। ఓ పాదుకాదేవీ! నందనవనంలోని తుమ్మెదలు, పూజ్యుడైన శ్రీరంగనాయకుని పాదాల ఉపభోగం వల్ల శోభన సౌరభంగల నిన్ను దివ్య పుష్పాలతో పాటుపొంది ఎల్లప్పుడు తేనెలూరుతూ వికాసంగా కనబడే భగవన్నాభిపద్మాన్ని కూడా ఆదరిస్తు లేవు కదా!

వ్యాఖ్య :- పాదుకలను తప్ప నందనచంచరీకాలు నాభీపద్మాన్ని ఆఘ్రాణించవు.

శ్రీరంగనాథుడు పాదుకలను ధరించి గరుడవాహనుడై అసురులను సంహరించి తిరిగిరాగా, దేవతలు నందనవనంలోని దివ్యపుష్పాలను గౌరవంగా కురిపించారు. ఆ దివ్య పుష్పాలతో పాటు తుమ్మెదలు పాదుకాదేవిని చేరుకున్నాయి. పద్మాల గంధాన్ని పసికట్టి బారులుతీరి వచ్చి మకరందపానం చేయడం మధుపాలకు సహజ గుణం. భగవంతుని నాభీ పద్మం నిత్యవికాసంగా రసనిష్యందియై సమీపంలో కనబడుతున్నా, ఆ చంచరీకాలు పాదుకలను విడిచిపోవడం లేదు. నాభీపద్మ గంధాన్ని ఆఘ్రాణించడమూ లేదు, మకరందాన్ని ఆస్వాదించడమూ లేదు. ఎందుకు?

దేవలోక పుష్పాలకన్నా, దేవదేవుని దివ్యదేహోత్పన్న పద్మం మిన్న. ఆ పద్మంకంటె సర్వగంధ, సర్వరసోపేతమైన దివ్యదేహమందు అంతర్భూతమైన పాదద్వయం మేలు. పూజ్యుడైన శ్రీరంగ శృంగారనాయకుని (పాదాల)చే ఉపభుక్తయైన పాదుకాదేవికి శోభన గంధం అలుముకుంది.

నందన చంచరీకాలు తమకు అబ్బిన పాదుకా సౌరభాన్ని అత్యంతాసక్తితో ఆఘ్రాణిస్తూ పరవశించి ఉన్నప్పుడు, వాటికి నాభీపద్మం మీద ఆదరణ ఎందుకుంటుంది?

"పాదం పర్యంత లేశాంఘ్రి పూజ్య తుర్యాంశకాం శుష" (కవి దర్పణం)

"పెరుకా అళవిలిన్బమ్ శేర్ న్దాలుమ్, మఱుగాల్ిల్లి మాయోన్ ఉనక్కే యాళాగుమ్, శిఱుకాలత్తైయుఱుమో" (తి.వా. మొ.)

వృద్ధిలేని, అవధిలేని కైవల్యానుభవ సుఖం, క్షణకాలమైనా లభించిన భగవత్కైంకర్యరసానుభవ సుఖంతో సమానమవుతుందా? అని ఆళ్వార్ల శ్రీసూక్తి. దేవతాంతర సంబంధమున్న నాభీ పద్మాన్ని ప్రపన్నులు సేవించరు కదా! నిత్యరసోపేతమైన నాభీ కమలానుభవంకంటె పాదుకానుభవం కాసేపు కలిగినా శ్రేయస్కరం.

చంచరీకాలకు సహజంగా సరోజమకరందాన్ని ఆస్వాదించే యోగమున్నా, లేనట్లు వర్ణించడం వల్ల, సంబంధాతిశయోక్త్యలంకారం. శ్లేషార్థ శక్తివల్ల నాయకోప భుక్తనాయికగా పాదుకాదేవి ప్రతీయమానమవడం, సమాసోక్త్యలంకార లక్షణం. వసంత తిలకా వృత్తం.

340. ప్రాగేవ కాంచన పదావని! పుష్పవర్షాత్
సంవర్తితే శమితదైత్యభయైః సురేంద్రైః ।
పద్మేక్షణస్యపదపద్మ నివేశలాభే
పుష్పాభిషేకముచితం ప్రతిపద్యసే త్వమ్ ॥ –20.

అర్థం :– హే కాంచన పదావని = ఓ బంగారు పాదుకా! శమితదైత్యభయైః = శాంతింపబడిన రాక్షసులవలని భయంగల; సురేంద్రైః = అమరశ్రేష్ఠులచేత; పద్మ + ఈక్షణస్య = కమలాక్షుడైన భగవంతునికి; పుష్పవర్షాత్ = పూలవానకంటె; ప్రాక్, ఏవ = ముందే, పదపద్మనివేశలాభే = పాదాలనే పద్మాలను ఉంచే లాభం; సంవర్తితే = జరుగుతున్నప్పుడు; త్వం = నీవు; ఉచితం = యోగ్యమైన; పుష్పాభిషేకం = పుష్పాభిషేకాన్ని; ప్రతిపద్యసే = పొందుతున్నావు.

తా॥ ఓ కాంచన పాదుకా! రాక్షసులవలని భయం తొలగిన దేవేంద్రాదులు భగవంతునికి పూలను కురిపించకముందే భగవత్పాదాలనే పద్మపుష్పాలప్రాప్తి నీకు కలుగుతుంటే, నీవు యోగ్యమైన పుష్పాభిషేకాన్ని పొందుతున్నావు.

వ్యాఖ్య :– పాదుకాదేవికి పద్మేక్షణుని కంటె ముందే పుష్పాభిషేకం వర్ణితం.

దేవతలకు అసురుల భయాన్ని నివారించిన పద్మేక్షణునిపైన పుష్పవర్షం కురిపించారు దేవేంద్రాదులు. కాని పుష్పవృష్టికి ముందే, భగవంతుడు వాహనం నుంచి దిగిన వెంటనే పాదుకలను ధరించాడు. భగవత్పాదాలు పద్మాలే కాబట్టి వాటిని పాదుకల మీద ఉంచడమే పాదుకాదేవికి జరిగిన పుష్పాభిషేకంగా ఉత్ప్రేక్షితం. పాదపద్మాభిషేకం కంటె ముందే, పద్మేక్షణుడు పాదుకలను చూచి ధరించాడు కాబట్టి, నేత్ర పద్మాభిషేకమూ పాదుకాదేవికి జరిగింది కదా! భగవంతునికంటె పూర్వమే పాదుకాభిషేకం జరుగడం చారిత్రకంగా ఉచితమే.

వసంత తిలకా వృత్తం.

341. దిశిదిశి మునిపత్న్యో దండకారణ్యభాగే
నజహతి బహుమానా న్నూనమద్యాపిమూలమ్ ।
రఘుపతి పదరక్షే! త్వత్పరిష్కారహేతో
రపచిత కుసుమానా మాశ్రమానోకహానామ్ ॥ –21.

అర్థం :– హే రఘుపతి పదరక్షే = ఓ శ్రీరామ పాదుకా! దండకారణ్యభాగే = దండకారణ్య ప్రదేశంలో; దిశి దిశి = ప్రతి దిక్కునందున్న; మునిపత్న్యః = ఋషిపత్నులు; త్వత్ + పరిష్కార హేతోః = నిన్ను అలంకరించడం కోసం; అపచిత కుసుమానాం = కోయబడిన పూలుగల; ఆశ్రమ + అనోకహానాం = ఆశ్రమాలలోని వృక్షాల యొక్క; మూలం =

అడుగుభాగాన్ని; బహుమానాత్ = గౌరవంవల్ల; అద్య, అపి = ఈనాటికీ; న, జహతి = వదలుతులేరు. నూనం = నిశ్చయం.

తా॥ ఓ రఘుపతి పాదుకా! దండకారణ్యభాగంలో ఆయా దిక్కుల్లో ఉన్న ఋషుల పత్నులు, నీ అలంకరణకోసం పూలను కోసిన ఆశ్రమతరువుల ఆలవాలాన్ని గౌరవంతో నేటికీ విడుస్తులేరు. సందేహంలేదు.

వ్యాఖ్య :– మునిపత్నులు పూలచెట్ల వద్ద నివసించే వర్ణన.

చిత్రకూటాశ్రమంలో ఉన్నప్పుడు పాదుకాదేవిని మునిపత్నులు దండకారణ్యం నుంచి వచ్చి 'అహల్యా సంరక్షిణి' అని పూలతో అలంకరించారు. భరతుడు పాదుకలను తీసుకపోయిన తర్వాత, 'పాదుకాలంకరణార్థం పూల నిచ్చిన చెట్లుకదా! ఇవి' అని మునిపత్నులు అభిమానంతో చెట్ల పాదుల్లో నీళ్ళుపోసి, వాటిని వదలక అక్కడనే కూర్చున్నారు. పాదుకా సంబంధం వల్ల మునుల పత్నులకు పూలచెట్లపైన కలిగిన గౌరవమిది. **"మూలంబుధ్నోఽంఘ్రి నామకః"** (అమరం)

ఉత్ప్రేక్షాలంకారం. మాలినీ వృత్తం.

342. ఘటయసి పరిపూర్ణాన్ కృష్ణమేఘప్రచారే
కృతిభి రుపహృతై స్త్వం కేతకీ గర్భపత్రైః ।
వరతను పరిణామా ద్వామతః శ్యామలానాం
ప్రణతి సమయలగ్నాన్ పాదుకే! మౌళిచంద్రాన్ । –22.

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకాదేవీ! త్వం = నీవు; కృష్ణమేఘ ప్రచారే = శ్రీకృష్ణుడనే నీలమేఘ సంచారమందు, కృతిభిః = పుణ్య పురుషులచేత; ఉపహృతైః = తెచ్చి సమర్పించబడిన; కేతకీ గర్భపత్రైః = మొగిలిపూల లోపలి రేకుల చేత; వరతను పరిణామాత్ = (శివుని) శుభ్ర శరీరం యొక్క మార్పువల్ల; వామతః = ఎడమ ప్రక్కన (పార్వతివల్ల) శ్యామలానాం = నీలవర్ణం కలిగిన రుద్రులయొక్క; ప్రణతి సమయ లగ్నాన్ = ప్రణామకాలమందు తగిలిన, మౌళిచంద్రాన్ = తలల యందలి చంద్ర ఖండాలను, పరిపూర్ణాన్ = పూర్ణచంద్రులనుగా; ఘటయసి = ఘటింపజేస్తావు.

తా॥ ఓ పాదుకాదేవీ! నీవు నీలమేఘశ్యాముడైన శ్రీకృష్ణుడనే మేఘ సంచారమందు ఋషులు తెచ్చి సమర్పించిన మొగిలిపూల అంతర్దళాల చేత శుభ్ర శరీర పరిణామం వల్ల సవ్యభాగాన శ్యామల వర్ణం కలిగిన రుద్రులు నమస్కరించే వేళలో తగిలే శిరోభూషణంగా ఉన్న చంద్రవంకలను పూర్ణచంద్రులనుగా ఘటింపజేస్తావు.

వ్యాఖ్య :– పాదుకాదేవి, మొగిలిపూలరేకులచే ఖండేందువును పూర్ణేందునిగా చేసే వర్ణన.

వర్షాకాలంలో శ్రీకృష్ణుడావిర్భవించాడు. ఆకాలంలో మొగిలిచెట్లు పూస్తాయి. శ్రీకృష్ణుడు సంచరించినప్పుడు ఋషులు భక్తితో సమర్పించిన మొగిలిపూల లోపలిరేకులు పాదుకాదేవి మీద పర్యవసించాయి.

"ప్రత్యేకాదశమే రుద్రాన్" అన్నట్లు, రుద్రులు పదకొండుగురని ప్రసిద్ధి. **ఏకాదశ రుద్రులు:–** 1. మన్యు 2. మను 3. మహినస్ 4. మహాన్ 5. శివ 6. ఋతధ్వజ 7. ఉగ్రరేత 8. భవ 9. కాల 10. వామదేవ 11. ధృతవ్రత. **రుద్రాణులు :–** 1. ధీ 2. వృత్తి 3. ఉశనా 4. ఉమా 5. నియుత 6. సర్పి 7. ఇలా 8. ఇరావతి 9. సుధా 10. దీక్షా 11. అంబిక లేదా, ఆయా కల్పాలనుబట్టి, రుద్రులని బహువచనం అభివ్యక్తం. పరమశివుడు శుద్ధస్ఫటిక సంకాశుడు. శివుని సామేను చేకొన్న చాన – పార్వతి, వామభాగాన శ్యామల వర్ణంతో ఉంటుంది. శిరోభూషణంగా ఉన్న చంద్రరేఖ, పురుషశిరోభాగాన ఉన్నట్లు స్త్రీ శిరోభాగానలేదు. అర్ధనారీశ్వరులైన రుద్రులు పర్యాయంగా లేదా, కాలక్రమేణ నమస్కరించినప్పుడు పాదుకాదేవికి అర్పించిన తెల్లని మొగిలిపూల రేకులకు బాలచంద్రుడు తగులగానే పూర్ణచంద్రుడుగా, గోచరిస్తాడు. సర్వ రుద్రుల తలలమీద పాదుకాదేవి పూర్ణచంద్రులను ఘటింపచేస్తుంది. చంద్రుడు వర్షాకాలంలో రేఖామాత్రంగా, మేఘాల మీద కనబడి కనబడనట్లుగా ఉంటే, శ్రీకృష్ణుని సంచార సమయంలో పాదుకా ప్రభావంవల్ల ప్రకృతి పులకించి, పూర్ణచంద్రుడు అవుతాడు, అని చమత్కృతి మత్కృతి.

విశేషాలంకారం. మాలినీవృత్తం.

343. పరిచరణ నియుక్తైః పాదుకే! రంగభర్తుః
పవన తనయ ముఖ్యై రర్పితాం త్వత్సమీపే ।
వినత విధి ముఖేభ్యో నిర్విశేషాం ద్విరేఫాః
కథమపి విభజంతే కాంచనీం పద్మపంక్తిమ్ ॥ –23.

అర్థం :– హే రంగభర్తుః, పాదుకే = ఓ రంగరాజు పాదుకా! పరిచరణనియుక్తైః = కైంకర్యమందు నియోగింపబడిన; పవన తనయ ముఖ్యైః = హనుమదాదులచేత, త్వత్ + సమీపే = నీ సన్నిధిలో; అర్పితాం = సమర్పించబడిన; వినత విధి ముఖేభ్యః = నమస్కరించిన హిరణ్యగర్భుని మొగాలకంటే; నిర్విశేషాం = భేదంలేని; కాంచనీం = బంగారువుదైన; పద్మ పంక్తిం = కమలాల శ్రేణిని; ద్విరేఫాః = తుమ్మెదలు; కథం, అపి = ఎలాగో; విభజంతే = వేరుచేస్తాయి.

తా॥ ఓ రంగనాథపాదుకా! సేవచేయడానికి నియోగింపబడిన హనుమదాదులు నీ సన్నిధిలో సమర్పించిన, నమస్కరించిన బ్రహ్మముఖాల కంటె విశేషస్ఫూర్తిలేని బంగారు కమలాల పంక్తిని మధుపాలు వివేచిస్తుంటాయి.

వ్యాఖ్య :– పాదుకలకర్పించిన కాంచన పద్మపంక్తికి ధాతముఖ పంక్తికి భేదం లేకున్నా, ద్విరేఫాలు విభజించే విశేష చమత్కృతి.

భరతుడు శ్రీరాముని పట్టాభిషేకానంతరం 'పాదుకార్చన చేయండి' అని హనుమంతుడు మొదలైన రామదాసులను ఆదేశిస్తాడు. వారు హేమాద్రి నుంచి స్వర్ణ కమలాలను తెచ్చి పాదుకాపూజ చేస్తారు. అప్పుడు హాటక గర్భుడు వచ్చి నాలుగు తలలను వంచి పాదుకాదేవికి వందనం చేస్తాడు. బంగారు కమలాల పోలికలున్న బ్రహ్మముఖ పంక్తిని ప్రేక్షకులు గుర్తింపశక్యం కాదు. మధుపాలు మాత్రం, ఏది పద్మపంక్తియో, ఏది ముఖపంక్తియో, ఆ భేదాన్ని గమనిస్తాయి.

కవోష్ణమైన ఉచ్ఛ్వాస నిశ్వాసలతో ముఖాలు దేహవాసనను ఉప్పతిల్లచేస్తాయి. దివ్య పుష్పాలు శైత్య మార్దవ సౌరభాలతో శోభిస్తాయి. హిరణ్యగర్భుని ముఖాలకన్నా, మకరందం స్రవించే బంగారువన్నె పూలను మధుపాలు గమనించి, వాటిపైన మూగుతాయి. సాదృశ్యస్ఫూర్తి కలిగి ఉన్నా, ఆనన పంక్తి, అబ్జపంక్తి మాత్రంకాదని గ్రహించి, సరస సౌరభ వైలక్షణ్యం వల్ల ద్విరేఫాలు ఆ రెండింటిని విభజిస్తాయి. విశేషాలంకారం. మాలినీ వృత్తం.

344. విధి శివ పురుహూత స్పర్శితైర్దివ్యపుష్పై
స్త్వయి సహ నిపతంత స్తత్తదుద్యాన భృంగాః ।
మధురిపు పదరక్షే! మంజుభిః స్వైర్నినాదై
రవిదిత పరమార్థా న్నూన మధ్యా పయంతి ॥ –24.

అర్థం :– హే మధురిపు పదరక్షే = ఓ మధుసూదను పాదుకా! విధి, శివ, పురుహూత, స్పర్శితైః = బ్రహ్మ రుద్రేంద్రులచే దత్తమైన; దివ్యపుష్పైః, సహ = దేవలోక మందు పూచిన పూలతో కూడ; త్వయి = నీమీద, నిపతంతః = పడుతున్న; తత్ + తత్ + ఉద్యాన భృంగాః = వారి వారి పూదోటల్లోని తుమ్మెదలు; మంజుభిః = మనోజ్ఞమైన; స్వైః = స్వీయ; నినాదైః = నాదాలచేత; అవిదిత పరమార్థాన్ = తెలియని పరమార్థం (భగవద్విషయం) కలవారిని గూర్చి; నూనం = నిశ్చయంగా; అధ్యాపయంతి = బోధిస్తున్నాయి.

తా॥ ఓ మధువైరి పాదుకా! బ్రహ్మరుద్ర పురందరులు సమర్పించిన దేవలోక పుష్పాలతో పాటు నీయందు చేరిన వారి వారి తోటల్లోని షట్పదాలు, తమ మంజు నాదాలచే పరమార్థం తెలియని వారలకు భగవత్పారమ్యాన్ని ఉపదేశిస్తుంటాయి. సందేహం లేదు.

వ్యాఖ్య :– భృంగారవం పరమార్థ ప్రబోధనగా ఉత్ప్రేక్షితం.

బ్రహ్మరుద్రేంద్రాదులు తమ ఉద్యానవనాల నుంచి తెచ్చి పాదుకార్చన చేసిన పూలతో పాటు వచ్చి చేరిన దివ్య భృంగాలు ఝుమ్మంటూ మంజులంగా నినదిస్తుంటాయి. 'స్పర్శ' శబ్దానికి, వితరణం అంటే సమర్పించడమని అర్థం.

"విశ్రాణనం వితరణం స్పర్శనం ప్రతిపాదనమ్" (అమరం).

భృంగాలే, షట్పదరూపమైన ద్వయమంత్రాన్ని అనుసంధించే ఆచార్యులు. వీరు మధ్యస్థులై భగవత్పారమ్యాన్ని ఉపదేశిస్తుంటారు. 'విధి శివ పురుహూతులు పూజించే ఈ మధురిపు పాదుకయే పరమార్థం - సర్వోత్కృష్ట వస్తువు' అని, నిర్దేశోపదేశాలచే, ఆచార ప్రచారాలచే, దృఢ విశ్వాసాన్ని కలిగిస్తుంటాయి షట్పదులు. మాలినీ వృత్తం.

345. ప్రశమయతి జనానాం సంజ్వరం రంగభర్తుః
పరిసర చలితానాం పాదుకే! చామరాణామ్ ।
అనుదిన ముపయాతై రుత్థితందివ్యపుష్పై
ర్నిగమ పరిమళం తే నిర్విశన్గంధవాహః ॥ -25.

అర్థం :- హే పాదుకే = ఓ పాదుకా! అనుదినం = దిన దినం; ఉపయాతైః = (సమర్పించగా) దగ్గరచేరిన; దివ్య పుష్పైః = దేవలోక ప్రసూనాలచే; ఉత్థితం = వ్యాపించిన, తే = నీయొక్క; నిగమ పరిమళం = వేద పరిమళాన్ని; నిర్విశన్ = అనుభవిస్తూ; రంగభర్తుః = శ్రీరంగరాజు యొక్క; పరిసర చలితానాం = సమీపాన వీచబడే; చామరాణాం = చామరాల యొక్క; గంధవాహః = గాలి; జనానాం = జనుల యొక్క; సంజ్వరం = తాపాన్ని; ప్రశమయతి = పోగొట్టుతుంది.

తా॥ ఓ పాదుకా! ప్రతిదినం సమర్పించబడే దివ్య పుష్పాలతో విజృంభించిన నీవేద పరిమళాన్ని అనుభవిస్తూ శ్రీరంగనాయకునికి ఉభయపార్శ్వాల్లో వీచబడే వింజామరాల వాయువు జనుల తీవ్ర తాపాన్ని శమింపజేస్తుంది.

వ్యాఖ్య :- దేవతలర్పించిన పాదుకా పూజా పుష్పాల పరిమళాన్ని అనుభవిస్తూ శ్రీ రంగేశుని సర్వోత్కృష్టత్వాన్ని గమనించిన గంధవహుడు భక్తుల తాపాన్ని శమింపజేసే వర్ణన.

వేద ప్రతిపాదిత పాదుకాదేవి. ప్రతిదినం బ్రహ్మాది దేవతలు దివ్య పుష్పాలతో పాదుకార్చన చేస్తుంటారు. శ్రీరంగేశునికిరువైపుల వీచబడే చామరాలవల్ల జనించిన గంధవహుడు పాదుకా నిగమ పరిమళాన్ని అనుభవించి శ్రీరంగనాథుని పారమ్యాన్ని గ్రహించాడు. కాబట్టి గంధవహుడు తాననుభవించిన దాన్ని సర్వత్ర వ్యాపింపజేస్తూ జనుల తాపత్రయాన్ని శమింపజేస్తున్నాడు. తుమ్మెదలవలె గంధవహుడు కూడా గురుత్వాన్ని పొందాడు.

వాస్తవంగా దివ్య పుష్పాలు నేత్రపర్వంగా ఉన్నాయి. వాటి పరిమళం వల్ల ఘ్రాణేంద్రియ సంతృప్తి కలుగుతుంది. తత్ఫలితంగా, మానసిక ఉల్లాసం కలిగి, సాంసారిక తాపం తీరుతుంది. హేత్వలంకారం. మాలినీ వృత్తం.

346. అఖిలభువనరక్షా నాటికాం దర్శయిష్యన్
అనిమిష తరుపుష్పై రర్చితే రంగమధ్యే ।
అభినయ మనురూపం శిక్షయత్యాత్మనా త్వాం
ప్రథమ విహితలాస్యః పాదుకే! రంగనాథః ॥ -26.

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకా! అనిమిషతరు పుష్పైః = దేవతా వృక్షాల పూలచేత; అర్చితే = పూజింపబడిన; రంగ మధ్యే = రంగవిమానం నడుమ/నాట్య రంగస్థలం నడుమ; అఖిల భువన రక్షా నాటికాం = సమస్త లోకరక్షణార్థమైన నాటికను; దర్శయిష్యన్ = చూపగోరుతున్న; రంగనాథః = శ్రీరంగనాయకుడు/రంగస్థల నటుడు; ఆత్మనా = స్వయంగా; ప్రథమ విహితలాస్యః = మొదట చేయబడిన నాట్యం కలవాడై ; త్వాం = నీకు (నిన్ను); అనురూపం = యోగ్యమైన; అభినయం = భావప్రకటన రూపమైన అవయవ విన్యాసాన్ని; శిక్షయతి = నేర్పుతున్నాడు.

తా॥ ఓ పాదుకా! దేవ తరువుల విరులచే అలంకరింపబడిన రంగస్థలమందు మహానటుడు కళాభివృద్ధికై నటికి నాట్యాభినయాన్ని నేర్పుతున్నట్లు, శ్రీరంగనాథుడు అర్చిత రంగ విమానమందు సకల లోకరక్షణార్థమైన నాటికను ప్రదర్శింపగోరుతూ తానే మొదట నాట్యమాడి, నీకు యోగ్యమైన అభినయాన్ని నేర్పుతున్నాడు.

వ్యాఖ్య :– జగన్నాటక సూత్రధారి పాదుకాదేవికి లోకరక్షణార్థం నర్తనాభినయాన్ని అభ్యసింపజేసే వర్ణన.

రంగస్థలం మధ్య పుష్పాంజలి సమర్పించిన వెంటనే నృత్త మారంభమవుతుంది. నర్తనకళాభ్యుదయాన్ని కాంక్షించే నిపుణులు తమ ఆశ్రితులకూ, అనుయాయులకూ, తాము మొదట ఆడుతూ, ఆటకు తగిన భావాన్ని ప్రకటించే చేష్టనూ నేర్పుతారు. **"రంగంస్యా న్నర్తనస్థానం"** (హలాయుధని)

శ్రీరంగ విమానాంతర్గతుడైన స్వామి లోకరక్షణ తత్పరుడైన నటశేఖరుడు. భక్తులు పూజిస్తూ పుష్పాంజలి సమర్పిస్తే ఆ పూలు స్వామి పాదాలనుంచి పాదుకల మీదికి ప్రసరిస్తాయి. రంగమందు స్వామి పాదుకలను ధరించడానికి రెండు, మూడడుగులు వేస్తాడు. ఇది మొదట తాను నాట్యమాడి చూపడమన్నమాట. పాదుకలను ధరించిన తర్వాత, భగవచ్చరణాలు ఎలా నర్తిస్తుంటే, చరణాలననుసరించి పాదుకలు అలా విన్యాసం చేస్తుంటాయి. హావభావ వినోద విలాస విశ్వాస వ్యంజక చేష్టలను స్వామి జగద్రక్షణార్థం ప్రదర్శిస్తున్నకొలది, స్వామి చరణాసక్తయై తదనుగుణంగా పాదుకాదేవి చలిస్తుండడమే, పాదుకాదేవికి నట పరివృఢుడు అభినయాన్ని నేర్పడం. **"రంగ మధ్యే'. రంగనాథః"** ఇవి శ్లిష్ట పరంపరిత రూపకాలు.

ఉత్ప్రేక్షాలంకారం. మాలినీ వృత్తం.

347. అగళితనిజరాగాం దేవి! విష్ణోః పదంతత్
త్రిభువన మహనీయాం ప్రాప్య సంధ్యామివత్వామ్ ।
భవతి విబుధ ముక్తైః స్పష్టతారానుషంగం
పరిసర పతితైస్తే పారిజాత ప్రసూనైః ॥ –27.

అర్థం :– హే దేవి = ఓ పాదుకాదేవీ! తత్ = ప్రసిద్ధమైన; విష్ణోః, పదం = భగవంతుని పాదం/ఆకాశం; అగలిత నిజరాగాం = తరుగని ఆత్మీయుల ప్రేమగల/వీడని తన అరుణిమగల; త్రిభువన మహనీయాం = ముజ్జగాలకు పూజింపదగిన, త్వాం = నిన్ను; సంధ్యాం, ఇవ = సంధ్యనువలె; ప్రాప్య = పొంది; విబుధముక్తైః = దేవతలచే కురిపించబడిన; తే = నీయొక్క; పరిసర పతితైః = సమీపాన పడిన; పారిజాతప్రసూనైః = పారిజాత పుష్పాలచేత; స్పష్టతారా + అనుషంగం = ప్రకాశించే చుక్కలతో కూడియున్నదై; భవతి = అవుతుంది.

తా॥ ఓ దేవీ! ప్రసిద్ధ విష్ణుపాదం, తన భక్తుల అనురాగం సడలని త్రిభువన పూజనీయమైన నిన్ను; ఆకాశం, తన రక్త వర్ణాన్ని వీడని మూడు లోకాలకు పూజ్యమైన మలిసంజను పొందినట్లే, పొంది దేవతలు కురిపించగా నీ దగ్గర పడిన పారిజాత పుష్పాలచే ప్రకాశించే నక్షత్రాలతో కూడియున్నదవుతుంది.

వ్యాఖ్య :– పారిజాత పుష్పాలు విష్ణుపదమందు నక్షత్రాలవలె ప్రకాశించే వర్ణన.

మలిసంజలో ఆకాశం అరుణవర్ణశోభితం కాగా, చుక్కలు మిలమిలలాడుతాయి. కర్మిష్ఠులు ఆ సమయంలో సంధ్యావందనమాచరిస్తారు.

సంధ్యారాగప్రాప్తిచే నక్షత్రాలతో ఆకాశం శోభించినట్లే, పాదుకాప్రాప్తిచేత దేవతలు వర్షించిన పారిజాత పుష్పాలతో భగవత్పాదం అలంకారాసనం మీద ప్రకాశిస్తుంది. పాదుకాదేవి రాగవతియైన సంధ్యగానూ, పారిజాత సుమాలు నక్షత్రాలుగానూ, భగవత్పాదం ఆకాశంగానూ, రూపరంజనం చేసి, పోల్చడం చమత్కారం. రూపక సంకీర్ణోపమాలంకారం.

మాలినీ వృత్తం.

348. వ్యంజంత్యేతే విభవ మనఘం రంజయంతః శ్రుతీర్నః
ప్రాధ్వం రంగక్షితిపతిపదం పాదుకే! ధారయంత్యాః ।
నాదై రంతర్నిహితనిగమై ర్నందనోద్యానభృంగాః
దివ్యైః పుష్పైః స్నపిత వపుషో దేవి! సౌప్నాలికాస్తే ॥ –28.

అర్థం :– హే దేవి, పాదుకే = ఓ పాదుకాదేవీ! ఏతే = ఈ; నందన + ఉద్యానభృంగాః = నందనమనే దేవోద్యానమందలి బంభరాలు; రంగక్షితిపతి పదం = రంగభూపతి పాదాన్ని/స్థానాన్ని; ప్రాధ్వం = అనుకూలంగా; ధారయంత్యాః = ధరిస్తున్న; దివ్యైః, దేవలోకమందలి; పుష్పైః = పూలచేత; స్నపితవపుషః = పూర్ణంగా అభిషేకింపబడిన స్వరూపం గల; తే = నీకు; అంతః + నిహిత నిగమైః = లోపలనే ఇముడ్చుకొన్న వేదాలుగల/నగరమంతా ఆవరించిన; నాదైః =

ధ్వనులచేత; సౌస్నాతికాః = అభిషేక స్తోత్ర పాఠకులై; నః = మా యొక్క; శ్రుతీః చెవులను; రంజయంతః = రంజింపజేస్తూ; అనఘం = నిర్దుష్టమైన (పుణ్యమైన) విభవం = వైభవాన్ని; వ్యంజంతి = వెల్లడిస్తున్నాయి.

తా॥ ఓ పాదుకాదేవీ! ఈ నందనవన బంభరాలు శ్రీరంగభూపతి పాదమనే స్థానాన్ని అనుకూలంగా అలంకరిస్తున్న, దివ్య పుష్పాలచే అభిషిక్త స్వరూపంగల నీకు, అవ్యక్తంగా వేదాలను ప్రకటిస్తూ నగరమంతా ఆవరించేనాదాలచేత అభిషేక స్తోత్ర పాఠకులై మా చెవులకు చవులు పుట్టిస్తూ నీ హృద్యమైన ఐశ్వర్యాన్ని వెల్లడిస్తున్నాయి.

వ్యాఖ్య :- దివ్య పుష్ప స్నపిత పాదుకా సంపదను భృంగాలే సౌస్నాతికులై ప్రకటించే వర్ణన.

'రంగక్షితి' అనడం వల్ల శ్రీరంగభూమికి రాజ్ఞీభావం సూచితం.

శ్రీరంగరాజును, అలంకారమంటపమందాసీనుడు కాగానే, దేవతా బృందం దివ్యపుష్పాలతో పూజిస్తుంటే, అభిషేకార్చనాద్యలంకారాలన్నీ పాదుకలకు అనుకూలంగా చేరుతాయి. కోరికలతో చేసిన ఫలితాలు అఘసహితాలు. భగవత్ప్రీత్యర్థమై చేసిన ఫలితాలు అనఘవిభవాలు.

"ఆనుకూల్యార్థకం ప్రాధ్వం". (అమరం). భగవత్పాదాలను ఆనుకూల్యంగా ధరించే పాదుకావైభవం అనఘం.

సుస్నాతం? మంగళస్నానమయిందా? అని అడిగేవారిని, లేదా స్తుతించేవారిని 'సౌస్నాతికులు' అంటారు. దివ్య పుష్పాల నుంచి స్రవించిన మకరందధారతో అభిషిక్తయైన పాదుకాదేవి సన్నిధిలో నందనోద్యానవనం నుంచి పూలతో పాటు వచ్చిన తుమ్మెదలు ఝుమ్మని శ్రుతిపేయంగా మ్రోగుతున్నాయి. తుమ్మెదల మ్రోత వేద గర్భితమై నగరమంతా ఆవరిస్తున్నది. ఆదివ్యభృంగాలే సౌస్నాతికులు. ఆ భృంగనాదమే అభిషిక్త పాదుకావైభవస్తుతి. భగవదభిషేక సమయంలో భాగవతోత్తములు వేదమంత్రాలనూ, నీరాట్టపాశురాలనూ అనుసంధించే విషయం వ్యంగ్య విలసితం. రూపకోపమాలంకారం. మందాక్రాంతా వృత్తం.

349. కిం పుష్పైస్తులసీ దళైరపికృతం దూర్వాఽపిదూరే స్థితా

త్వ త్పూజాసు ముకుందపాదు! కృపయా త్వంకామధేనుః సతామ్ ।

ప్రత్యగ్రాహృత దర్భపల్లవ లవగ్రాసాభిలాషోన్ముఖీ

ధేనుస్తిష్ఠతు సావసిష్ఠ భవన ద్వారోపకంఠ స్థలే ॥ -29.

అర్థం :- హే ముకుందపాదు = ఓ ముకుంద పాదుకా! సతాం = సత్పురుషులకు, త్వత్,పూజాసు = నీ పూజల విషయమై; పుష్పైః = పూవులతో; కిం = ఏమి పని? తులసీ దళైః, అపి =తులసీదళాలతో కూడా; కృతం =

చేయబడినది చాలును. దూర్వా, అపి = గరిక కూడా, దూరే = దూరాన; స్థితా (అస్తు) = ఉండుగాక. త్వం = నీవు; కృపయా = దయతో; కామధేనుః = కోరినవెల్ల ప్రసాదించే కామధేనువు; సా = ఆ; ధేనుః = కామధేనువు; ప్రత్యగ్ర - ఉన్ముఖీ/ప్రత్యగ్ర = కొత్తదైన; ఆహృత = తేబడిన, దర్భ పల్లవలవ = కొన్ని దర్భలనూ, లేత, చిగురాకులనూ; గ్రాస = మేయడమందు; అభిలాషా = కోరికతో; ఉత్ + ముఖీ = ఎత్తిన మొగంకలదై ; వసిష్ఠ భవన ద్వార + ఉపకంఠస్థలే = వసిష్ఠ మహర్షి యొక్క పర్ణశాలా ద్వార సమీపస్థలమందే; తిష్ఠతు = ఉండుగాక.

తా॥ ఓ ముకుందపాదుకా! సత్పురుషులకు నీ పూజల విషయమై పూలతో నేమి పని? తులసీదళాలతో కూడా పనిలేదు. గరిక కూడా దూరాననే ఉండుగాక. కృపను కురిపించే నీవే కామధేనువవు. కామధేనువనే ఆ పశువు నవనవలాడే దర్భకర్రలనూ, కొన్ని చిగురాకులను తెచ్చి పెడితే మేయాలనే కోరికతో మొగం ఎత్తుకుంటూ, వసిష్ఠముని భవనద్వార సమీప స్థలమందే ఉండుగాక.

వ్యాఖ్య :- సత్పురుషులకు పాదుకాదేవియే సకలార్థ సాధిక.

రకరకాల పత్ర ప్రసూనాలతో పాదుకార్చన చేసిన ఫలితాలను వర్ణించిన పిమ్మట, పూజాద్రవ్యాలేవీ లేకున్నా పాదుకా దేవ్యనుగ్రహాన్ని పొందవచ్చునంటున్నారు దేశికులు.

అది మోక్షదాతృపాదుక. నేలమీద శ్రమ పడకుండా లభించే పత్రమో, పుష్పమో తెచ్చి సమర్పించకున్నా, సత్పురుషులు భక్తి ప్రపత్తులతో పాదుకాదేవిని శిరసావహించి, సమస్త పురుషార్థాలను పొందుతారు. పాదుకా దేవి అపార కరుణామయి. ఏ పూజా ద్రవ్యాన్ని అపేక్షించక, తనను శిరస్సున ధరించిన వారి కోరికలన్నీ నెరవేర్చే సాధనం. వాస్తవంగా, సజ్జనుల పాలిట కామధేనువే పాదుకాదేవి.

అగ్నిహోత్రారాధనకు పాలు కురిపించి, వసిష్ఠుని ముంగిట్లో గోరక్షణ ధర్మంగా ఉంటూ, అతని ఆశ్రమాన్ని వదలి ఎక్కడికి పోని నాలుగుకాళ్ళ పశువు కామధేనువు. వసిష్ఠ మహర్షి హోమానంతరం తీరికతో కొద్దిగా లేత పచ్చి గరికనూ, కొన్ని చిగురుటాకులనూ తెచ్చి పెడుతాడనే ఆశతో అతని గుమ్మంలో మోర ఎత్తుకొని పడికాపులు కాసే పశువు కామధేనువా? 'నీ చంక సద్ది మూట నాకిస్తే, నీకాకలి కాకుండా వరమిస్తా'నన్నట్లు, ఆశగల పశువు పరుల ఆశలనుఫలింప చేస్తుందా? అయితే ఆ కామధేనువు వసిష్ఠుని వద్దనే ఉండనీయండి. సత్పురుషులు దాని నాదరించరు. కేవలం అవాప్త సమస్త కాముని పాదుకయే సత్పురుషులకు కామధేనువు.

ఆక్షేపాలంకారం. శార్దూల విక్రీడితం.

350. చూడారగ్వధరజసా చూర్ణస్నపనం విధాయ తే పూర్వమ్ ।
రంగేశ పాదుకే! త్వామభిషించతి మౌళిగంగయా శంభుః ॥ –30.

అర్థం :– హే రంగేశ పాదుకే = ఓ రంగనాథ పాదుకా! శంభుః = శంకరుడు; తే = నీకు; పూర్వం = మొదట; చూడా + ఆరగ్వధ, రజసా = తలమీది రేల పూలధూళితో; చూర్ణస్నపనం = చూర్ణాభిషేకాన్ని; విధాయ = చేసి, మౌళి గంగయా = తలమీద ఉన్న గంగచేత; త్వాం = నిన్ను; అభిషించతి = జలాభిషేకం చేస్తాడు.

తా|| ఓ రంగరాజ పాదుకా! శంకరుడు నీకు మొదట తలమీద రాజవృక్ష పుష్ప పరాగంతో చూర్ణోద్వర్తనం చేసి, శిరస్సున ధరించిన గంగాజలంచేత అభిషేకం చేస్తాడు.

వ్యాఖ్య :– పాదుకాదేవికి శంభుడు పుష్పపరాగస్నపనం తర్వాత గంగాజలం చేత అభిషేకించే వర్ణన.

శ్రీరంగనాథునికి అర్చకులు సకలారాధనలను సమర్పించిన తర్వాత రాత్రి దేవతలు వచ్చి ఆరాధన సమర్పిస్తారు అని ఐతిహ్యం.

శంభుడు భగవంతునికి ప్రణామంచేసే వేళలో అతని తలమీద అలంకారంగా ధరించిన ఆరగ్వధ పుష్పధూళి పాదుకాదేవి మీద రాలుతుంది. స్నానానికి ముందు సుగంధ పత్ర పుష్పాలను, మొక్కలను ఎండబెట్టి పొడిగొట్టిన చూర్ణాన్ని శరీరానికి, పట్టిన మురికిని పోగొట్టి కాంతిని కలిగించడానికి విలోమానులోమంగా రాసి తీర్థమాడడం లోక పరిపాటి. కాబట్టి శంకరుడు పుష్పపరాగంతో పాదుకాదేవికి స్నపనం చేసిన తర్వాత తలదాల్చిన గంగాజలంచేత అభిషేకం చేశాడు.

సంచార వేళలో పాదుకాదేవికి పట్టిన ధూళిపోవడానికి; సంచారంచేసి వచ్చిన తర్వాత స్నానం చేయడం శిష్టాచారం. "పరాగపద్ధతి"ని అర్థసూచకానురూపంగా వర్ణిస్తూ; పుష్పపద్ధతిని ముగించారు దేశికులు.

ఉత్ప్రేక్షాలంకారం. ఆర్యావృత్తం.

పుష్పపద్ధతి సమాప్తం.

13. పరాగ పద్ధతి

351. పాంతు వః పద్మనాభస్యపాదుకాకేళిపాంసవః ।
అహల్యాదేహనిర్మాణ పర్యాయ పరమాణవః ॥ –1.

అర్థం :– అహల్యా – పరమాణవః/అహల్యా = గౌతమ పత్నియొక్క; దేహ నిర్మాణ = శరీర నిర్మాణార్థం; పర్యాయ = సాక్షికాలైన; పరమాణవః = పరమాణువులు కలిగిన; పద్మనాభస్య = కమలం నాభియందు కలిగిన, పురుషోత్తముని యొక్క; పాదుకా కేళి పాంసవః = పాదుకల యందు సంచారంవల్ల కలిగిన ధూళికణాలు; వః = మిమ్ము; పాంతు = రక్షించుగాక.

తా॥ అహల్యా శరీర నిర్మాణం కోసం సాక్షిక పరమాణువులు కలిగిన, పద్మనాభుని పాదుకలయందు సంచరించడం వల్ల కలిగిన ధూళికణాలు మిమ్ము కాపాడుగాక.

వ్యాఖ్య :– పాదుకా ధూళికణాలు శరీరధారులకు రక్షకాలు.

సంచార వేళలో పరాగరేణువులు కొద్ది దూరమే వ్యాపిస్తాయి. సంచార వేగంవల్ల కలిగే మణిమయ పాదుకానాదం మాత్రం బహుదూరం ప్రసరిస్తుంది. కాబట్టి 'పరాగ పద్ధతి' 'నాద పద్ధతి' కంటె ముందు చెప్పడమే క్రమం.

సమ వాయికారణభూత పరమాణువుల చేత ప్రపంచ పదార్థాల సృజన జరుగుతుందని తార్కికులంటారు. పద్మనాభుడు పాదుకలను ధరించి విహరిస్తుంటే, నాభీ పద్మపుష్ప రజోరేణువులు రాలి పాదుకలకు అంటుకోవడమే కాక భౌతిక ధూళికణాలు కూడా సోకడం నైసర్గికం. భగవంతుని నాభి యందలి పద్మపరాగం, చతుర్ముఖ బ్రహ్మదేహ నిర్మాణానికి కారణమయింది. అహల్య యొక్క మొదటి రూప నిర్మాణ విధం వేరు. అహల్య శాపగ్రస్తయై శిలా సదృశంగా మారిన తర్వాత మళ్ళీ ఆమె దేహ నిర్మాణానికి కావలసిన పరమాణువులతో సమానంగా పాదుకా పరాగరేణువులు కారణమయ్యాయి. శ్రీరామపాద రజస్సంబంధం వల్ల మళ్ళీ స్త్రీమూర్తిగా వెలసిన ప్రవృత్తి కలది అహల్య. కాబట్టి, శ్రీరంగనాథుని పాదుకాకేళి పాంసువులు దేహధారులను రక్షిస్తాయి, అని దేశికులు వికల్పభావనా చమత్కృతితో పరాగపద్ధతిని ఆరంభించారు. అనుష్టుబ్ఛందస్సు.

352. తవ సంచరణాద్రజో విధూతం
యదిదం రంగనరేంద్ర పాదరక్షే!
అలమేత దనావిలాని కర్తుం
కతక క్షోద ఇవాశు మానసాని ॥ –2.

అర్థం :– హే రంగనరేంద్ర పాదరక్షే = ఓ రంగరాజ పాదుకా! తవ = నీయొక్క; సంచరణాత్ = సంచారంవల్ల; విధూతం = ఎగసిన, ఇదం = ఈ, రజః = పరాగం; యత్ = ఏదైతే కలదో; ఏతత్ = ఇది; మానసాని = మనస్సులను, కతక క్షోదః, ఇవ = చిల్లగింజపొడి (నీటిని) వలె; ఆశు = శీఘ్రంగా; అనావిలాని = కాలుష్యం లేనట్లుగా (ప్రసన్నంగా); కర్తుం = చేయడానికి; అలం = సమర్థమయింది.

తా॥ ఓ రంగరాజ పాదుకా! నీ సంచారంవల్ల ఎగసిన ధూళి ఏదైతే కలదో అది చిల్లగింజపొడివలె మనస్సులను శీఘ్రంగా కాలుష్యం లేకుండా చేయడానికి సమర్థమయింది.

వ్యాఖ్య :– భగవత్పాదుకాసంచార ధూళికి ప్రసన్న మనస్కులను చేసే శక్తి పర్యాప్తం.

రాజు నడుస్తుంటే ధూళి అంటకుండా పాదాలను కాపాడే పాదుకలకు దుమ్ము అంటడమూ రంజకమే. ప్రకృతి రంజకుడైన శ్రీరంగనరేంద్రుడు పాదుకలను ధరించి ఒక అడుగుపెట్టి మరొక అడుగు ఎత్తుతుంటే ధూళి కణాలెగసి వ్యాపిస్తుంటాయి. ధూళి మాలిన్యానికి, కాలుష్యానికి హేతువు కదా! మరి ప్రశంసించడ మెందుకు?

కతకబీజ చూర్ణం – చిల్లగింజ పొడి – నీళ్ళలో పడితే, అది మురికిని అడుగుకు నెట్టి నీళ్ళను తేటపరుస్తుంది. ఇది లోకజ్ఞత.

"రమణీయం ప్రసన్నాంబు సన్మనుష్య మనోయథా" – స్వచ్ఛమైన నీటికీ, సజ్జనుల మనస్సుకూ పోలిక, ఆదికావ్య ప్రసిద్ధం.

శ్రీరంగరాజ పాదుకా పరాగం సోకితే, మానస సరస్సులాంటి జీవులు ప్రసన్న మనస్కులవుతారు. శాఠ్యం తొలగి చిత్తశుద్ధి ఏర్పడుతుంది.

"అలంభూషణ పర్యాప్తి శక్తి వారణ వాచకమ్". (అమరం)

ఉపమాలంకారం. ఔపచ్ఛందసికం.

353. పునరుక్త పితామహానుభావాః
పురుషాఃకేచిదమీ పునంతి విశ్వమ్ ।
మధువైరి పదారవింద బంధో
రపరాగాస్తవ పాదుకే! పరాగైః । –3.

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకా! మధువైరి పదారవిందబంధోః = మధురిపు చరణకమలబంధువైన; తవ = నీయొక్క; పరాగైః = పూలధూళులచేత; పునరుక్తపితామహ + అనుభావాః = ద్విరుక్తమైన చతుర్ముఖ బ్రహ్మ యొక్క

మహిమ కలిగిన; అపరాగాః = పరాగరహితులైన/రాగాది విషయవాంఛలులేని; అమీ = ఈ (దుర్లభులైన); కేచిత్ = కొందరు; పురుషాః = మహాజనులు, విశ్వం = సమస్త ప్రపంచాన్ని, పునంతి = పావనం చేస్తారు.

తా॥ ఓ పాదుకా! మధువైరి పాదకమల బంధువైన నీ పరాగాలచేత పునరుక్తమైన బ్రహ్మానుభవం కలిగిన; అపరాగులైన కొందరు పురుషులు ప్రపంచాన్ని పావనం చేస్తారు.

వ్యాఖ్య :– పాదుకా పరాగసంసర్గులైన మహానుభావులు అపరాగులై జగత్తును పావనం చేసే వర్ణన.

మధువైరి శ్రీరంగనాథుడు. ఆయన పాదాలను కమలాసనుడు కమలాలతో పూజిస్తాడు. ఆ కమలాలు పాదాల నుంచి పాదుకలను చేరుతాయి. కాబట్టి, పాదుకలకు పుష్పపరాగం పుష్కలంగా తగుల్కొంటుంది.

"పరాగః సుమనో రజః". (అమరం) పరాగమంటే పుప్పొడి. చతుర్ముఖుడు భగవత్పాదుకా పరాగ సంసర్గంచేత పొందిన మహిమను, తర్వాత పాదుకార్చన చేసిన వారందరు పొందగలుగుతారు. పితామహుడు మొదట పుట్టినవాడు. అందరికీ, సృష్టికే తాత. ధాత నాభికమల బంధువు. పాదుక పదారవింద బంధువు. పుష్పరజః సంబంధం ఉభయత్ర ఉంది. నాభీకమల పరాగమూలంగా పితామహుడు రజోగుణ భూయిష్ఠుడైనా, అపరాగుడై – రాగద్వేషాదులులేనివాడై – సృష్టి వ్యాపారం చేస్తాడు. పాదుకా పరాగ మూలంగా సత్పురుషులు సపరాగులైనా, అపరాగులై – వీతరాగులై – సమస్త ప్రపంచాన్ని పావనం చేస్తారు.

బ్రహ్మదేవునికి పరమాత్మానుభవమూ, వేద వేదార్థ విజ్ఞతా, పుత్ర పౌత్రాది సంతతి వల్ల పితామహత్వమూ ఉన్నట్లే, సత్పురుషులకూ ఉంటుంది. బ్రహ్మకైనా, సత్పురుషులకైనా పాదుకాపరాగమే అపరాగతను కలిగిస్తుంది. కాబట్టి, పితామహుని అనుభావాలు సత్పురుషులకు పునరుక్తమవుతాయి. మధువైరి రజోవిరోధి. ఆయన పాదాలు అరవిందాల సామ్యంవల్ల సరాగాలే. పాదుకలచే విహరించడంవల్ల అతిశయిత రాగం కూడా అపరాగంగా చేయబడుతుంది. ఆశ్చర్యమేమిటంటే, పాదుకాదేవి స్వయంగా అనపరాగస్వరూప.

సత్పురుషులు, రజస్తమోగుణాలను అణచివేసి సత్త్వగుణం ఉద్బుద్ధమయ్యేరీతిగా ప్రబోధించి, ప్రజలకు రాగాది విషయవాంఛలు లేకుండా చేస్తారు. పరాగమంటిన మహానుభావులు పరాగం లేనివారు, అనడం విరోధం. రాగద్వేషాదులు లేనివారు (మరొక అర్థం) అనేశ్లేషతో విరోధం అభాస అవుతుంది. విరోధాభానతో కూడిన ఉదాత్తాలంకారం.

ఔపచ్ఛందసికం.

354. అభియుక్త జనో నిజార్భకాణాం
బహుశో రంగనరేంద్ర పాదరక్షే!
అవలేప పిశాచమోచనార్థం
రజసా లింపతి తావకేన దేహాన్ I –4.

అర్థం :– హే రంగనరేంద్రపాదరక్షే = ఓ రంగరాజ పాదుకా! అభియుక్తజనః = చలించని విశ్వాస మున్న జనం; నిజ + అర్భకాణాం = తమ పిల్లల యొక్క; దేహాన్ = శరీరాలకు; అవలేప పిశాచ మోచనార్థం = గర్వమనే పెనుభూతాన్ని తొలగించడం కోసం; తావకేన = నీదైన; రజసా = పరాగంచేత; బహుశః = పలుసార్లు; లింపతి = లేపనం చేస్తుంది.

తా॥ ఓ రంగనాథ పాదుకా! దృఢమైన నమ్మకం కలిగిన జనులు తమ పిల్లల దేహాలకు అహంకార పిశాచాన్ని తొలగించడానికి నీ పరాగాన్ని చాలాసార్లు పూస్తారు.

వ్యాఖ్య :– అభియుక్త జనంపాదుకా పరాగాన్ని అనిష్టనివృత్తికై ఉపయోగించే వర్ణన.

విశ్వపావనత్వ ప్రకారాల్లోపరాగంవల్లశోధించడం ఒక విధం. యువకులకు మంచి, చెడు తెలుస్తుంది. కాబట్టి వారు సద్వర్తనతో అనిష్టాన్నితొలగించుకోగలరు. కాని బాలురకేమీ తెలియదు కదా! అందుకై పాదుకాతత్పరులు బాలారిష్టాలను నివారించడానికి పాదుకాధూళిని తమ పిల్లల దేహానికి పూస్తారు. భూతమో, దయ్యమో పట్టిందని దాన్నితొలగించడానికి ఔషధ ప్రక్రియగా అనేక పర్యాయాలు పరాగలేపనం చేస్తారు. ప్రపత్తిని ఒక్కసారే చేయవలసి ఉంటుందే మోకానీ, మందును పలుసార్లు వాడడం సముచితమే. పిశాచమంటే ఇక్కడ గర్వం, అహంకారమనీ దేశికుల ఆశయం. బాలురకు దాస భావం, శేషత్వం అలవడాలనీ, దాసత్వానికి విరోధియైన అహంకార పిశాచం బాల్యంలోనే తొలగిపోవాలనీ ప్రపన్నులు తమ సంతానానికి పాదుకాధూళిని ఉపయోగిస్తారు.

"అభియుక్తవరైరుద్దే తథాస్యాదితి తత్పరే". (విశ్వని.)

హేత్వలంకారం. ఔపచ్ఛందసికం.

355. శిరసా పరిగృహ్య లోకపాలాః
తవ రంగేశ్వర పాదుకే! రజాంసి I
విషమేషు బలేషు దానవానాం
వ్యపనీతా న్యశిరస్త్ర మావిశంతి I –5.

అర్థం :– హే రంగేశ్వర పాదుకే = ఓ రంగనాథ పాదుకా! లోకపాలాః = లోకపాలురైన ఇంద్రాదులు; తవ = నీయొక్క;

రజాంసి = (పూల) ధూళులను; శిరసా = తలచేత; పరిగృహ్య = గ్రహించి (ధరించి); విషమేషు = దుర్భేద్యమైన; దానవానాం = రాక్షసుల యొక్క; బలేషు = సేనలయందు; వ్యపనీత + అన్య, శిరస్త్రం = తొలగింపబడిన ఉష్ణీషమూ, వేరేకవచాలు కలుగునట్లుగా; ఆవిశంతి = ప్రవేశిస్తారు.

తా॥ ఓ రంగపతి పాదుకా! లోకపాలురు నీ పరాగకణాలను తలదాల్చి ప్రవేశింపరాని అసురసేనలయందు శిరస్త్రాణాలనూ, వేరేకవచాలనూ ధరించకుండా ప్రవేశిస్తారు.

వ్యాఖ్య :- పాదుకా రజఃకణాలను తలదాల్చిన ఇంద్రాదులకు అపజయమే లేదు.

గత శ్లోకంలో 'అభియుక్త' పదానికున్న 'శత్రువులెదిరించడ' మనే మరో అర్థాన్ని అనుసరించి ఈ శ్లోకం రచింపబడింది. ఇంద్రాగ్ని యమనిర్‌ఋతివరుణ వాయుకుబేరేశానులు అష్టదిక్పాలురు. వీరు అదిదేవతా ప్రత్యధిదేవతల సహాయంచేత సమస్త లోకాలను పాలిస్తారు. వీరు భగవత్పాదుకలను శిరసావహించినప్పుడు, వాటిధూళి వీరి శిరస్సుల మీద కవచంలాగా తగులుకొంటుంది. పాదుకా పరాగ మహిమవల్ల వీరి తలలు గాయపడకుండా భద్రంగా ఉంటాయి. తమకు హానియే కలుగదుకాబట్టి, ఇంద్రాది లోకపాలురు శిరస్త్రాణ, ఉరస్త్రాణాది కవచాలను ధరించకుండా, తమ శత్రువులైన దానవుల సైన్యం, ఎంత దుర్భేద్యమైనదయినా, పోరాటానికి ఉరకలువేస్తూ, రణరంగంలో ప్రవేశిస్తారు. గౌరవంతో పాదుకాపరాగాన్ని శిరస్త్రాణంగా ధరించినంత మాత్రాన, అది సర్వత్రాణమైనందువల్ల వేరే శిరస్త్రాణాదులను వీరు ఆదరించరు. శత్రుసేనల శిరస్త్రాణాలను తొలగించి విజయులవుతారు.

ఆక్షేపాలంకారం. వృత్తం, ఔపచ్ఛందసికం.

356. కృతినఃశిరసా సముద్వహంతః
కతిచిత్కేశవ పాదుకే! రజస్తే ।
రజస స్తమసోఽపి దూరభూతం
పరి పశ్యంతి విశుద్ధమేవ సత్త్వమ్ ॥ -6.

అర్థం :- హే కేశవ పాదుకే = ఓ కేశవపాదుకా! కతిచిత్ = కొందరు; కృతినః = పుణ్యవంతులు; తే = నీ యొక్క; రజః = పరాగాన్ని; శిరసా = తలచే, సముద్వహంతః = ధరిస్తూ; రజసః = రజోగుణానికి; తమసః, అపి = తమో గుణానికి కూడా; దూరభూతం = దూరంగాఉన్న; విశుద్ధం = హేయ గుణస్పర్శలేని; సత్త్వం, ఏవ = సత్త్వగుణ ప్రధాన వస్తువునే; పరిపశ్యంతి = బాగా చూస్తారు.

తా॥ ఓ కేశవ పాదుకా! కొందరు ధన్యాత్ములు నీ పరాగరేణువులను శిరసా వహిస్తూ, రజస్తమో గుణాలకు దూరంగా ఉండే, హేయగుణమేమాత్రంలేని సత్త్వగుణ ప్రధానమైన వస్తువునే సందర్శిస్తారు.

వ్యాఖ్య :- వైకుంఠ దర్శనానికి పాదుకారజం ఆవశ్యకం.

ఈ లోకంలోని ప్రతి వస్తువు సత్వ రజస్తమస్సులనే మూడు గుణాలతో కూడినదే. శ్రీవైకుంఠంలో ఉండే ఒక్కొక్క వస్తువు రజస్తమస్సులు లేకుండా సత్త్వమనే ఒక్క గుణాన్నే కలిగి ఉంటుంది. పాదుకారజస్సును తలయందు ధరించిన ధన్యాత్ములకు రజోగుణమేకాక తమోగుణం కూడా తొలగిపోతుంది. రజస్సును ధరిస్తే రజోగుణం పోతుంది, అనడం పొసగని మాట. విరోధం భాసిస్తుంది. రజశ్శబ్దానికి పరాగమనే అర్థాన్ని గ్రహిస్తే విరోధం పరిహారమవుతుంది. పాదుకాధూళి సోకిన వ్యక్తులు గుణత్రయ విశిష్టమైన ఈలోకాన్ని వీడి సత్త్వగుణ ప్రధానమైన పరమపదాన్ని చేరి ఆ సత్త్వగుణ ద్రవ్యాన్నే చూస్తూ, అనుభవిస్తూ ఆనందిస్తారు.

రాజస తామస గుణ స్పర్శలేనిది శుద్ధసత్త్వగుణం. సత్త్వగుణం సముద్భూద్ధమైతే సమ్యక్‌జ్ఞానం కలుగుతుంది.

"సత్త్వం గుణే పిశాచాదౌ బలేద్రవ్య స్వభావయోః". (విశ్వని)

పాదుకా పరాగ సంబంధంవల్ల సమ్యక్ జ్ఞాన హేతుభూత సత్త్వగుణం కలిగిన భాగ్యవంతులు పరంధాముణ్ని సందర్శించరనేది లేదు.

విరోధాభాసాలంకారం. ఔపచ్ఛందసికం.

357. అధికం పదమాశ్రితోఽపి వేధాః
ప్రయతో రంగధురీణ పాదరక్షే!
అభివాంఛతి సంగమం పరాగై
రభిజాతైస్తవ దేవి! నాభిజాతః ॥ -7.

అర్థం :- హే దేవి! రంగధురీణ పాదరక్షే = విశ్వంభరాభారాన్ని వహించే భగవంతుని పాదాలను కాపాడే ఓదేవీ! అధికం = ఉన్నతమైన; పదం = స్థానాన్ని ; ఆశ్రితః, అపి = ఆశ్రయించినవాడే అయినా; న + అభిజాతః = మంచికులమందు పుట్టని/నాభిజాతః = నాభి నుంచి ఉద్భవించిన; వేధాః = బ్రహ్మ; ప్రయతః = ప్రయత్నిస్తూ; అభిజాతైః = మంచికుల మందు పుట్టిన వారితో/(ప్రాప్తరూపం కలిగిన) సొబగైన; తవ = నీ యొక్క; పరాగైః = ధూళిరేణువులతో; సంగమం = కలయికను; అభివాంఛతి = కోరుతాడు.

తా॥ ఓ రంగధురీణ పాదుకాదేవీ! కులహీనుడు ఉన్నత స్థానాన్ని పొందినప్పటికీ, ప్రయత్నిస్తూ కులీనులతో చేరడానికి కోరుతాడు. అలాగే, నాభిజాతుడైన బ్రహ్మ అభిజాత పాదుకా ధూళిని పొందకోరుతాడు.

వ్యాఖ్య :– ఉన్నతాధికారం స్థిరంగా ఉండాలనుకునే వ్యక్తి పాదుకాపరాగాన్ని పొందగోరే చమత్కృతి మత్కృతి.

పూర్వ శ్లోకంలో 'కొందరు' అన్నమాటలో బ్రహ్మ ఒకడు. బ్రహ్మ సత్త్వగుణ స్థానమందుకాక ర జోగుణ ప్రధానమైన స్థానమందున్నవాడు. బ్రహ్మాండమందు బ్రహ్మ ఉన్న స్థానంకంటె రుద్రేంద్రాదులవి తక్కువ స్థానాలు. (అధి, కం = శిరః) ప్రకృతి మండలానికి శిరఃస్థానమైన సత్యలోకాధిపత్యం ఉన్నతమైనది. బ్రహ్మ ఉత్తమ వంశమందు జన్మించక, నాభి నుంచి జన్మించినవాడు. అయినా భగవత్పాదసేవ చేసే భాగ్యం బ్రహ్మకు నిత్యం కలుగదు. ఈ భాగ్యాన్ని పొందిన పాదుకాదేవి అభిజాత – ఉత్తమ వంశ సంజాత. పాదుకలయందంతా (అభితః జాతః) పరాగముంటుంది.

"అభిజాతః స్థితే న్యాయే కులీన ప్రాప్తరూపయోః" (విశ్వని.)

పాదం కంటె నాభి ఉత్కృష్టమైనది, కాబట్టి ఉన్నతస్థానమందున్నా 'నాభి జాతుడనైన నాకు కాళ్ళ క్రింద పడియుండే పాదుక(ల) యొక్క ధూళితో ఏమి ప్రయోజనం?' అని బ్రహ్మ భావించడు. ఉన్నత స్థానమందు స్థిరంగా ఉండడం, పాదుకా పరాగాధీనమే, అనుకుంటాడు. కాబట్టి, అభిజాత సంబంధం వల్లనే నాభిజాతుడైన తనకు ఉత్కర్ష కలుగుతున్నదని భావిస్తూ, బ్రహ్మ పాదుకాపరాగాన్ని పొందకోరుతాడు. ఉత్ప్రేక్ష. ఔపచ్ఛందసికం.

358. శుద్ధ సత్త్వ వపుషైవభవత్యా, పాదుకే! విరజసౌ హరిపాదౌ ।
అస్తుకిం పునరిదంరజసాతే, శుద్ధసత్త్వమయతా మనుజానామ్ ॥ –8.

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకా! శుద్ధసత్త్వ వపుషా, ఏవ = శుద్ధ సత్త్వగుణమున్న దేహమే కలదానివైన; భవత్యా = నీచేత; హరిపాదౌ = భగవత్పాదాలు; విరజసౌ = రజోగుణం లేనివి రహితంగా/ధూళిలేనివి; అస్తు = ఉండుగాక, తే= నీ యొక్క, రజసా = రజోగుణంచేత/ధూళిచేత; మనుజానాం = మనుష్యులకు; శుద్ధసత్త్వమయతా = కేవలం సత్త్వగుణ ప్రాచుర్యం; (భవతి = ఉంటున్నది) ఇదం, పునః = ఇది మాత్రం; కిం = ఏమిటి?

తా॥ ఓ పాదుకా! శుద్ధసత్త్వమూర్తివే కాబట్టి నీచేత శ్రీహరిచరణాలు రజోగుణం/ధూళి, లేనివిగా ఉంటున్నాయి. ఉచితమే. ఉండుగాక. మరి నీ రజస్సుతో మనుష్యులకు కేవలంసత్త్వగుణమే ప్రచురంగా ఉంటున్నదన్న ఈ మాటేమిటి?

వ్యాఖ్య :– పాదుకా రజస్సంబంధంవల్ల మానవులు సత్త్వమయులవుతారు.

రజోయుక్త పాదుకల స్పర్శవల్ల శ్రీహరిచరణాలకు విరజస్త్వం ఎలా కలుగుతుంది? అనే ఆక్షేపానికి సమాధానమిది. పాదాలకు క్రింది భాగాన ఉండే పాదుకలు, తమకు ధూళి అంటినా, మీద ఉన్న పాదాలకు దుమ్ము ధూళి అంటకుండా భద్రంగా కాపాడుతాయి.

పాదుకల రూపం కేవలం సత్త్వగుణ ద్రవ్యం. శ్రీవైకుంఠంలో నిత్యసూరుల స్వరూపం భగవంతుని స్వరూపం లాగా అప్రాకృతమే. పాదుకల సాన్నిహిత్యమే లేకపోతే భగవత్పాదాలకు విరజస్త్వం అనుపపన్నమేకదా! సరె! అదియుక్తమే. కానీ, పాదుకలకున్న ధూళి అంటుకుంటే - పాదుకారజస్సు సోకితే - మనుష్యులు కూడా రజస్త మస్సులులేని సత్త్వగుణా ధిక్యులవడం అయుక్తం.

సత్త్వగుణం వల్ల రజోగుణం తొలగుతుంది కానీ, రజోగుణం వల్ల సత్త్వగుణం కలుగడం ఎక్కడా వినని మాట. భగవత్పాదుకా పరాగ సంబంధం వల్ల శుద్ధసత్త్వ పురుషులవుతారని విరోధాభాసాలంకారం. స్వాగతా వృత్తం.

359. తద్రజ స్తవ తనోతి పాదుకే!

మానసా న్యకఠినానిదేహినామ్ ।

ప్రస్తరస్య పదవీ గతస్యయత్

వ్యాచకార మునిధర్మదారతామ్ ॥ –9.

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకా! తవ = నీయొక్క; తత్ = ఆ; రజః = ధూళి; దేహినాం = ప్రాణులయొక్క; మానసాని = మనస్సులను; అకఠినాని = మృదువుగా; తనోతి = చేస్తుంది; యత్ = ఏ ధూళి; పదవీగతస్య = దారిలో ఉన్న; ప్రస్తరస్య = శిలకు; మునిధర్మదారతాం = ఋషియొక్క ధర్మపత్నీ రూపాన్ని; వ్యాచకార = కలిగించిందో

తా॥ ఓ పాదుకా! నీ పరాగం దేహధారుల చిత్తాన్ని మెత్తగా మలచివేస్తుంది. దారిలో ఉన్న ప్రస్తరాన్ని ముని ధర్మపత్నిగా చేసింది నీ పరాగమే.

వ్యాఖ్య :– పాదుకా పరాగం రాతిగుండెలను రసమయం చేసే వర్ణన.

రాయికన్న కఠినమైనదీ, వెన్నకన్న మెత్తనిదీ లేదు. పాదుకా రజస్సంగంవల్ల త్రోవలో ఉన్న ఉపలమే ఉవిదగా మారినప్పుడు, బండబారిన గుండెలు వెన్న ఉండల్లాగా మెత్తబడకుంటాయా? ఇష్టప్రాప్తినీ, అనిష్టనివృత్తినీ కలిగించేది పాదుకా పరాగం. అహల్యా వృత్తాంతాన్ని బట్టి, పాదుకా రజస్సు మనస్సులలో ఋజు గుణాన్ని విస్తరింపజేస్తుంది. కావ్యలింగాలంకారం. రథోద్ధత.

360. రంగేశయస్య పురుషస్య జగద్విభూత్యై

రథ్యా పరిక్రమవిధౌ మణిపాదరక్షే!

సీమంతదేశ మనవద్య సరస్వతీనాం

సిందూరయంతి భవతీచలితాః పరాగాః ॥ –10.

అర్థం :– హే మణిపాదరక్షే = ఓ రత్నపాదుకా! జగత్ + విభూత్యై = లోక సంపత్తు కోసం; రంగే శయస్య = శ్రీరంగ మందు పవళించే; పురుషస్య = పురుషుని యొక్క; రథ్యా పరిక్రమవిధౌ = వీథి సంచారవిధియందు; భవతీ చలితాః = నీచేత ఎగసిన; పరాగాః = ధూళులు; అనవద్య సరస్వతీనాం = నిర్దుష్టవాక్కులనే శ్రుతుల యొక్క; సీమంత దేశం = శిరోమధ్యస్థలాన్ని (పాపటను) సిందూరయంతి = సిందూరం కలదానిగా చేస్తున్నాయి.

తా॥ ఓ రత్నపాదుకా! లోక సంపత్తు కోసం శ్రీరంగనాథుని వీథి సంచార విధి యందు నీచేత పైకి ఎగసిన పరాగరేణువులు నిర్దుష్ట వాక్కులనే శ్రుతుల సీమంత ప్రదేశాన్ని సిందూరంతో అలంకరిస్తున్నాయి.

వ్యాఖ్య :– పాదుకా పరాగం వాగ్దేవీ సీమంత దేశాన్ని అలంకరించే వర్ణన.

పాదుకా ధూళిచేత విలక్షణ కాయప్రాప్తి, మనస్సుకు గుణాధానం, రెండు శ్లోకాలచే వర్ణితం. మనఃకాయ వాక్కులనే త్రికరణాల్లో వాగలంకరణను సుశ్లోకిస్తున్నదీ శ్లోకం.

పాదుకాదేవి జగద్ధితార్థం శ్రీరంగనాథుణ్ని అంతట సంచరింపజేస్తుంది. పడుకొని మరగిన పురుషుణ్ని సంపద కోసం ఉద్యోగింపజేసేది పడతియే కదా! భగవంతుని పదాలను చలింపజేసే సామర్థ్యంగల పాదుకాదేవి, కదలినప్పుడు పైకిలేచిన తనధూళితో, పదాల మార్పును సహించని శ్రుతి సీమంతినుల పాపటను సిందూర చూర్ణంగా అలంకరిస్తుంది.

వీథ్యుత్సవంలో పారాయణానికి అన్వయించే వేదమూర్తుల శిరస్సు మీద శ్రీ శఠారిని సమర్పించి గౌరవించడం మర్యాద.

వేదం శబ్ద పరివృత్తిని సహించదు కాబట్టి వేదభాషా యోష 'అనవద్య సరస్వతి'. పాదుకాపరాగం ఉపనిషన్నిష్ఠ మని కవి హృదయం. సమాసోక్తి సంకీర్ణోత్ప్రేక్ష. వసంత తిలకా వృత్తం.

361. మాన్యేన రంగనృపతే ర్మణిపాదరక్షే!
చూడా పదాని రజసా తవ భూషయంతః ।
కాలక్రమేణ భజతాం కమలాసనత్వం
నాభీసరోజ రజసాం నివసంతి మధ్యే ॥ –11.

అర్థం :– హే రంగనృపతేః, మణిపాదరక్షే = ఓ రంగరాజ రత్నపాదుకా! మాన్యేన = పూజ్యమైన; తవ = నీయొక్క; రజసా = ధూళిచేత; చూడాపదాని = శిరస్సులను; భూషయంతః = అలంకరించుకునే వారు; కాలక్రమేణ = కొంత కాలానికి; కమలాసనత్వం = బ్రహ్మరూపాన్ని; భజతాం = కల్పించే; నాభీ స రోజ రజసాం = పొక్కిలి తామర పుప్పొడి యొక్క; మధ్యే = నడుమ; నివసంతి = నివసిస్తారు.

తా॥ ఓ రంగరాజ పాదుకా! పూజ్యమైన నీ పరాగాన్ని తలమీద అలంకరించుకునే భక్తులు, కాలక్రమంగా బ్రహ్మ శరీర నిర్మాణంచేసే భగవన్నాభీకమల పరాగాల మధ్య నివసిస్తారు.

వ్యాఖ్య :– పాదుకా పరాగభూషణులకు కమలాసనత్వప్రాప్తి.

"విశ్వాయమాన రజసా కమలేన నాభౌ". (గోదాస్తుతి) భగవన్నాభీ పద్మపరాగం విశ్వరచనాధురీణమన్నారు దేశికులు. భగవత్పాదుకా పరాగ సంబంధులకు కాలక్రమేణ భగవన్నాభీ పద్మపరాగ సంబంధం కలుగుతుందని సుశ్లోకితం.

సమాలంకారం. వసంత తిలకా వృత్తం.

362. మాతర్ముకుంద చరణావని! తావకీనా
శ్చింతా వశీకరణ చూర్ణ విశేషకల్పాః ।
సంచారపాంసు కణికాః శిరసా వహంతో
విశ్వంపునంతి పదపద్మపరాగలేశైః । –12.

అర్థం :– హే మాతః = ఓ తల్లీ! ముకుంద చరణావని = ముకుందుని పాదుకా! చింతా–కల్పాః/చింతా = చిత్తవృత్తి యొక్క; వశీకరణ = స్వాధీనీకరణమందు; చూర్ణ విశేషకల్పాః = ఒక విధమైన పొడిని పోలియున్న; తావకీనాః = నీకు సంబంధించిన; సంచార పాంసుకణికాః = సంచారాధీన ధూళికణాలను; శిరసా = తలచేత; వహంతః = ధరిస్తున్న భక్తులు; పదపద్మ పరాగలేశైః = తమ చరణ కమలాల ధూళికణాలచే; విశ్వం = ప్రపంచాన్ని; పునంతి = పరిశుద్ధం చేస్తారు.

తా॥ ఓ జననీ! ముకుందపాదుకా! మనస్సును వశపరచుకునే చూర్ణసదృశమైన నీ సంచారం వల్ల కలిగే ధూళి కణాలను తలదాల్చిన పురుషులు తమపాద పద్మపరాగ రేణువుల చేత ప్రపంచాన్ని పరిశుద్ధం చేస్తారు.

వ్యాఖ్య :– పాదుకా పరాగాన్ని తలదాల్చిన పురుషుల చరణధూళితో ప్రపంచం పావనమవుతుంది.

ప్రపన్నులు చతుర్ముఖ పదవిని కాంక్షించడం హేయమని భావిస్తారు. వారు భగవత్పాదుకా సేవకే అంకితమవుతారు. పాదుకా పరాగానికి చిత్తాన్ని వశపరచుకునే మహిమ వుంది. పాదుకా సంచారాధీనమైన ధూళిని శిరసావహించిన మహాను భావులు ప్రపంచంలో సంచరిస్తున్నప్పుడు, వారి పాదధూళి సోకిన ఆయా ప్రదేశాలు పవిత్రమవుతాయి. వారిని దర్శించిన ప్రజల చిత్తవృత్తి కల్మషరహితమై ధార్మిక జీవనానికి అంకితమవుతుంది.

'సంతః శ్రీరంగపృథ్వీశ' అనే మొదటిశ్లోకంలో పాదుకాధారణ ఫలం 'భువన త్రాణ పద పంకజ రేణుకత్వ' మని కీర్తింపబడింది. ఇక్కడ ఆ విషయమే పాదుకాధూళి ధారణ ఫలమని స్తుతింపబడింది. చింతా వశీకరణత్వం ఈ శ్లోకంలో విశేషంగా ఉంది.

ఉదాత్త పరికరాల సంకరాలంకారం. వసంత తిలకా వృత్తం.

363. ఆయోజితా న్యమలధీభిరనన్య లభ్యే
పాదావని! శ్రుతివధూ పటవాసకృత్యే ।
త్వత్సంచర ప్రచలితాని రజాంసి శౌరేః
ప్రఖ్యాపయంతి పదపద్మ పరాగశోభామ్ । –13.

అర్థం :– హే పాదావని = ఓ పాదుకా! అమలధీభిః = విశుద్ధ బుద్ధిగల సత్పురుషులచేత; అనన్య లభ్యే = వేరే దేనిచేత పొందరాని; శ్రుతివధూ పటవాసకృత్యే = శ్రుతులనే స్త్రీల వస్త్రాలకు వాసనను కల్పించే కార్యమందు; ఆయోజితాని = ఉపయోగింపబడే; త్వత్ + సంచర ప్రచలితాని = నీ సంచార ప్రదేశమందు ఎగసిన; రజాంసి = ధూళులు; శౌరేః = భగవంతుని యొక్క; పదపద్మ పరాగశోభాం = చరణాలనే కమలాలయందు రజఃశ్రీని; ప్రఖ్యాపయంతి = వెల్లడిస్తున్నాయి..

తా॥ ఓ పాదుకాదేవీ! శుద్ధబుద్ధిగల సజ్జనులచేత అనన్య లభ్యమైన శ్రుతికాంతల వస్త్రాలకు వాసనను కల్పించే కృత్యమందు వాడబడే నీ సంచార మార్గమందు రేగిన ధూళికణాలు శ్రీరంగనాథుని పాదాలనే పద్మాలయందలి పరాగ శోభను వెల్లడిస్తున్నాయి.

వ్యాఖ్య :– పాదుకాపరాగం శ్రుతి వధూ పటవాస చూర్ణంగానూ, భగవత్పాద పద్మ రజఃశ్రీగానూ ఉల్లేఖాలంకృతం.

వేదమూర్తులు అనువాకాలను సుస్వరంగా అధ్యయనం చేస్తూ పాదుకా సంచారమార్గమందు పాదుకా పరాగాన్ని గ్రహిస్తారు. ధూళివారి మీద పడుతుంది అని తాత్పర్యం. పాదుకాదేవి వేదనాదా మోదిత. ఇది వేద వాక్కులనే స్త్రీల పటవాస చూర్ణంగా భావ్యం.

"పిష్టాతః పటవాసః". (అమరం). స్త్రీలు చందనం, పచ్చకర్పూరం, పునుగు, జవ్వాజి, లోధ్ర, పద్మపుష్ప చూర్ణం ఇత్యాది పరిమళ ద్రవ్యాలను తమ శరీరాలకు, కోకలకు పులిమి, ఉపయోగిస్తారు. జ్ఞాన వైరాగ్యభూషణులైన శ్రీవేదాంత దేశికులకు మహిళలు ధరించే సువాసన ద్రవ్యాల సంగతి పరిచయముంది. ఈ సువాసన లోధ్ర, పద్మ పుష్పాలతో ఆపాదింపబడేది కాబట్టి, ఇది ఏమి పుష్పమో, అని ఆలోచించి చూడగా, అది శ్రీరంగనాథుని పాద పద్మమే అని గోచరించింది. పాదుకా పరాగం స్వామి పాద పద్మపరాగాన్ని అతిశయింపజేసింది.

పాదుకాపరాగం, శ్రుతి సువాసినీ పటవాసాన్ని, పాదపద్మపరాగాన్ని పోలియున్నదని నైకవిధంగా వర్ణించడం వల్ల, ఉల్లేఖాలంకారం. వసంత తిలకా వృత్తం.

364. మూర్ధాన మంబ! మురభి న్మణి పాదరక్షే!
యేషాం కదాఽపి రజసా భవతీ పునా తి ।
త్వామేవ తేసుకృతినః స్నపయంతి కాలే
మందారదామ రజసా మకుటచ్యుతేన ॥ –14.

అర్థం :– హే అంబ! మురభిన్మణి పాదరక్షే = ఓ తల్లీ! మురారి రత్నపాదుకా! భవతీ = నీవు; యేషాం = ఎవరియొక్క; మూర్ధానం = శిరస్సును; రజసా = పరాగంచేత; కదా, అపి; ఎప్పుడో ఒక్కసారి; పునాతి = పవిత్రం చేస్తావో; తే = ఆ, సుకృతినః = భాగ్యవంతులు; కాలే = ఒకప్పుడు; మకుటచ్యుతేన = కిరీటం నుంచి జారిన; మందారదామ రజసా = దేవతరు పుష్ప మాలా పరాగంచేత; త్వాం, ఏవ = నిన్నే; స్నపయంతి = అభిషేకిస్తారు.

తా॥ ఓ మురహరి పాదుకా! ఓ జననీ! నీవు నీ రజఃకణాలచే ఎవరి శిరస్సును ఎప్పుడో శుద్ధిచేస్తే, వారు దివ్యపురుషులై నమస్కరిస్తూ మందారపుష్పమాలికా పరాగంతో నీకే అభిషేకం చేస్తారు.

వ్యాఖ్య :– పరస్పరోపకార కథనం.

ఒకప్పుడు పాదుకా పరాగాన్ని తలదాల్చిన ధన్యాత్ములు, దేవతాధికారాన్ని పొందుతారు. అప్పుడు వారు కృతజ్ఞులై మందార పుష్పమాలను అలంకరించుకున్న తలను వంచి ప్రణామం చేయగా ఆ పరాగం, పాదుకాదేవి మీద జలజలరాలి అభిషేకమవుతుంది.

కదాఽపి :– వీథ్యుత్సవానంతరం శ్రీరంగనాథుడు మందిరంలో ప్రవేశించి పాదపీఠం మీద పాదుకలను పెట్టగా; అర్చకులు భక్తుల తలమీద పాదుక (ల) ను – శ్రీ శఠారిని – సమర్పిస్తారు. పాదుకాదేవి ఒక్కసారి అల్పాయుష్కులకు ఒక్కటి ఇస్తే, వారు కల్పాయుష్కులైన తర్వాత అది కోటి రెట్లుగా దేవికి మొక్కుబడి చెల్లిస్తారు.

అన్యోన్యాలంకారం. వసంత తిలకా వృత్తం.

365. రథ్యా విహారరజసా పరిధూసరాంగీం
రంగేశ్వరస్య లలితేషు మహోత్సవేషు ।
ప్రస్ఫోటయ త్యవనతో మణిపాదుకే! త్వాం
గౌరీపతిః స్వయ మిభాజిన పల్లవేన ॥ –15.

అర్థం :— హే మణి పాదుకే = ఓ మణిపాదుకా! గౌరీపతిః = పార్వతీశుడు; రంగేశ్వరస్య = శ్రీరంగేశ్వరుని యొక్క; లలితేషు = మనోజ్ఞమైన; మహోత్సవేషు = గొప్ప ఉత్సవాల్లో; రథ్యా విహార రజసా = వీధి సంచారం వల్ల కలిగే ధూళిచేత; పరిధూసర + అంగీం = నునుపైన స్వరూపంగల; త్వాం = నిన్ను; స్వయం = తానే; అవనతః = నమ్రుడై; ఇభ + అజిన; పల్లవేన = పచ్చి ఆకును పోలిన ఏనుగుతోలుచేత; ప్రస్ఫోటయతి = తుడిచివేస్తాడు.

తా॥ ఓ మణిపాదుకా! శ్రీరంగేశుని మనోజ్ఞమైన మహోత్సవాల్లో వీధి సంచారజన్యమైన ధూళిచే మన్నణాంగివైన నిన్ను పార్వతీపతి నమ్రుడై గజచర్మపల్లవంతో తుడిచి శుభ్రంచేస్తాడు.

వ్యాఖ్య :— పాంసుమన్నణాంగియైన పాదుకాదేవిని పార్వతీపతి నిష్పాంసువుగా చేసే వర్ణన.

మనోజ్ఞమైన మహోత్సవాల్లో శ్రీరంగనాథుడు వీథుల్లో సంచరిస్తున్నప్పుడు పాదుకలకు ధూళి చిక్కణంగా అంటుకుంటుంది. పార్వతీపతి భగవంతునికి నమస్కరిస్తాడు. అప్పుడు ఆయన తన కట్టుపుట్టమైన పచ్చి ఆకులాగా ఉన్న గజచర్మంతో దుమ్మును తుడిచివేసి, మణిమయిపాదుకాదేవిని శుభ్రంగా ప్రకాశింపజేస్తాడు.

పాదుకా మాహాత్మ్యానికి అంగంగా పార్వతీపతి చరిత్ర కథనం, ఉదాత్తాలంకారం. వసంత తిలకా వృత్తం.

366. నేదీయసాం నిజపరాగ నివేశపూర్వం
స్పృష్ట్వాశిరాంసి భవతీ భవరోగభాజామ్ ।
గాఢంనిపీడ్య గరుడధ్వజ పాదరక్షే !
మానగ్రహం శమయతీవ పరైరసాధ్యమ్ ॥ –16.

అర్థం :— హే గరుడధ్వజ పాదరక్షే = ఓ గరుడధ్వజుని పాదుకా! భవతీ = నీవు; నేదీయసాం = అతి సమీపంలో ఉన్న; భవరోగభాజాం = సంసార రోగగ్రస్తుల యొక్క; శిరాంసి = తలలను; నిజపరాగ నివేశ పూర్వం = స్వీయధూళి మొదట పడునట్లు, స్పృష్ట్వా = స్పర్శించి; గాఢం = చిక్కగా; నిపీడ్య = పులిమి; పరైః = ఇతరులచేత; అసాధ్యం = సాధింప రాని; మానగ్రహం = అహంకార పిశాచాన్ని; శమయతి, ఇవ = నశింపజేస్తున్నట్లున్నావు.

తా॥ ఓ గరుడధ్వజ పాదుకా! నీవు కడు దగ్గరగా ఉండే సంసార రోగగ్రస్తుల తలలను స్పృశించి మొదట నీధూళిని చల్లుతూ, చిక్కగా పులిమి, ఇతరులచే నిరసింప శక్యంకాని అహంకారపిశాచాన్ని నశింపజేస్తున్నట్లున్నావు.

అర్థాంతరం :— హే గరుడధ్వజ పాదరక్షే = గరుత్మంతుడే టెక్కెంగా గల శ్రీమన్నారాయణుని పాదుకా! నేదీయసాం = చాలా దగ్గరగా ఉన్న; భవ, రోగభాజాం = శివపారమ్యమనే రోగం పట్టిన వారిలో; శిరాంసి = ప్రధానులైన వారిని; భవతీ = నీవు; నిజ పరాగ నివేశ పూర్వం = నీ ధూళిపడునట్లు మొదట; స్పృష్ట్వా = స్పృశించి; గాఢం = గట్టిగా, నిపీడ్య

= మర్దించి, పరైః = ఇతరులచేత; అసాధ్యం = నిరసింపశక్యంకాని; మానగ్రహం = దుష్ప్రమాణమైన ఉపన్యాసాన్ని; శమయతి, ఇవ = చాలించేలాగా చేస్తున్నావు.

తా॥ ఓ గరుడధ్వజ పాదుకా! నీకు చాలా దగ్గర ఉన్న శివుడే పరదేవత అనే రోగం గలవారిలో ముఖ్యులైన జనులను నీవు మొదట దుమ్మును చిమ్మి, పట్టుకొని గట్టిగా అణచివేసి వారి గర్వ పిశాచాన్నీ దుష్ప్రమాణోపన్యాసాన్నీ నివారింప చేస్తున్నట్లున్నావు.

వ్యాఖ్య :– పాదుకా పరాగం వల్ల గర్వ పిశాచం నశించే వర్ణన.

బాలారిష్టాలను పాదుకాదేవి తొలగించే విషయం (354) ఇంతకుముందే చెప్పబడింది. ఇక్కడి విషయం దానికంటె విలక్షణమని గమనీయం.

లోకంలో పిశాచమావేశించడంవల్ల వ్యాధిగ్రస్తులైన వ్యక్తుల తలమీద మాంత్రికుడు భస్మంచల్లి, బాగా రాసి, వ్యాధికి కారణమయిన పిశాచాన్ని తొలగిస్తాడు. అలాగే పాదుకాదేవి భవరోగుల తలమీద తన ధూళిని చల్లి, బాగా పులిమి రోగకారణమైన గర్వ పిశాచాన్ని నశింపజేస్తుంది. **"భవః సంసార సంప్రాప్తి శ్రేయఃశంకర జన్మసు"**. (నానార్థ రత్నమాల)

సంసారులు అనాదివాసనవల్ల దేహమే ఆత్మ, రెండు వేర్వేరు కావు, అని భ్రమించడమే భవరోగం. దేహాభిమానం ముదిరి, పిశాచంగా పట్టుకొనడంవల్ల, మమతాహంకారాలు పెచ్చేగుతాయి. మానగ్రహమంటే గర్వమే పెనుభూతం. **"మానః స్త్రీణాంకోప భేదే గర్వేచిత్తోన్నతావపి"** (నా.ర.మాల) **"గ్రహోఽనుగ్రహనిర్బంధ గ్రహణేషు రణోద్యమే ! సూర్యాదౌ పూతనాదౌ చ సైంహికేయో పరాగయోః"**. (విశ్వని.)

పాదుకా పరాగ మహిమచేత దేహం వేరు, ఆత్మవేరు, ఒక్కటికాదు, అనే సమ్యక్ జ్ఞానం కలుగడం వల్ల **'జ్ఞానాన్ముక్తిః'** అన్నట్లు ముక్తి లభిస్తుంది.

"సన్మంత్ర విత్ క్షిపతి" (యతిరాజ సప్తతి. 23) శ్రీమద్రామానుజులు మాంత్రికుడన్నారక్కడ. ఇక్కడ పాదుక మంత్రకర్త్రి.

శైవ పారమ్యాన్ని ఎదిరించి శ్రీమన్నారాయణుడే పరతత్త్వమని ప్రామాణికంగా నిరూపించి, 'సర్వం శ్రీవైష్ణవం' అనిపించే ప్రవృత్తి, పాదుకాదేవికి తప్ప ఇతరులకు లేదు. దేశికులకాలంలో శ్రీరంగనగర సమీపంలోని జంబుకేశ్వర క్షేత్రవాసులైన శైవుల విషయమూ, శ్రీరంగవైభవమూ విశదీకృతం. ఉత్ప్రేక్షాలంకారం, వసంత తిలకా వృత్తం.

367. ఆపాదవల్లవతనోరకుమారయూనః
పాదావని! ప్రవిశతో యమునా నికుంజాన్ ।
ఆసీ దనంగ సమరా త్త్వరతః ప్రవృత్తః
సేనా పరాగ ఇవతే పదవీ పరాగః ॥ –17.

అర్థం :– హే పాదావని = ఓ పాదుకాదేవీ! తే = నీయొక్క ; పదవీపరాగః = మార్గమందలి ధూళి; ఆపాత వల్లవతనోః = తాత్కాలిక గోపశరీరం కలిగిన; యమునా నికుంజాన్= యమునా తీరమందలి పొదరిండ్లకు; ప్రవిశతః = ప్రవేశించే; అకుమార యూనః = కుమార ప్రాయమనుభవించకయే యువకుడైన శ్రీకృష్ణుని యొక్క; అనంగసమరాత్ = కామయుద్ధం కన్న; పురతః = ముందు; ప్రవృత్తః = రేగిన; సేనా పరాగః, ఇవ = సేనయొక్క ధూళియో అన్నట్లు; ఆసీత్ = ఉండెను.

తా॥ ఓ పాదుకాదేవీ! నీ సంచారమార్గమందలి ధూళి తాత్కాలికంగా గోపాల శరీరం కలిగిన, యమునా తీరమందలి పొదరిండ్లకు ప్రవేశించే కౌమారదశలేకయే యువకుడైన శ్రీకృష్ణుని అనంగయుద్ధంకంటె ముందే విజృంభించిన సేనా పరాగమన్నట్లు ఉండింది.

వ్యాఖ్య :– పాదుకా పరాగం సేనా పరాగంగా ఉత్ప్రేక్షితం.

శ్రీకృష్ణభగవానుని బాహ్యాకారం నందుని పెంపకంలో గొల్లపిల్లవాని శరీరంగా ఉంది. **"ఆపాతవ్లదాత్వే పతనేఽపిచ".** (విశ్వని) శ్రీకృష్ణుడు యుద్ధవీరుడు. ఆయనకు సహాయపడే సేన పాదుక. గోపికలతో భోగమే కామయుద్ధం. గోపికలు ఆయుద్ధానికి ఎదిరించరాగా పాదుక అనే సేనతో వారు ఉన్నచోటికే శీఘ్రంగా పోతుంటే లేచిన ధూళి ఇది.

కుడి, ఎడమ తెలియని పామరుడు గొల్లపిల్లడు. **"గోపాలడింభవపుషా". "మిథ్యాగోపః". "గోపవేషస్య విష్ణోః".** అని, శ్రీకృష్ణుని గొల్లతనం "గోపాల వింశతి"లో విశేషంగా వర్ణితం. పిల్లవాడుగా కనబడుతున్నా చేష్టలు యువకునిలాగా ఉండేవి. **"యువాఽకుమారః"** – అన్నది వేదం.

"కల్పాంతయూనః". శ్రీకృష్ణుడు నిత్య యౌవనుడు : (ద్రవిడోపనిషద్రత్నావళి అవతారిక)

అకుమార యూనః :– కుమారుడూకాడు, యువకుడూకాడు, బాల్యాద్యవస్థలు శ్రీకృష్ణునికి వర్తించవు. లీలా మానుష విగ్రహుడు గోపాల చక్రవర్తి.

"ఉన్నియు మొక్కలైయిల్‌కొండు తమిళ్ మదవి, ఉన్నాడు తంగళ్ కరుత్తాయిన శెయ్‌తు వరుమ్, కన్నియ రుమ్ మగిళ్". (తిరుమొళి) ఏకకాలంలోనే కుమారుడుగానూ, యువకుడుగానూ ఉన్నాడు కృష్ణుడు, అన్నారు పెరియాళ్వార్. ముద్దు పిల్లడు కదా! అని రొండికెక్కించుకున్న గోపకన్యలు వెంటనే యువకునితో యథేచ్ఛగా శృంగార చేష్టలు అనుభవించారట.

"మిన్‌పోల్ నుణ్ణిడైయాళొరుకన్నియై వేఱురువంశెయ్‌తువైత్త". (3-1-2) శకటాసుర సంహారం చేసిన శిశువు అప్పుడు ఉత్తర దిక్కున ఉన్న ఒక గోపిక ఇంట్లోకి దూరి ఆమెతో రమించి వికృతాకారం కలుగచేశాడట.

యమునాతీరంలో ఉన్న పొదరిండ్లలో గోపికలతో శ్రీకృష్ణుడు సురతరూప సమరానికి వెళ్ళుతుంటే, దారిలో కలిగిన పాదుకా పరాగం అతని సేనా పరాగంలాగా చెలరేగింది. అభేదాధ్యవసాయం వల్ల రూపకాతిశయోక్త్యలంకారం. ఆపాద పల్లవ తనువూ, అకుమార యౌవనమూ కలవాడు అనడం వల్ల పర్యాయోక్త్యలంకారం. పాదుకా ధూళిని సేనా ధూళిగా వర్ణించడం ఉత్ప్రేక్షాలంకారం. వసంత తిలకా వృత్తం.

368. గంగాపగా తటలతాగృహ మాశ్రయంత్యాః
పాదావని! ప్రచలితం పదవీ రజస్తే ।
ప్రాయేణ పావనతమం ప్రణతస్య శంభో
రుద్ధూళనం కిమపి నూతన మాతనోతి । –18.

అర్థం :– హే పాదావని = ఓ పాదుకా! గంగా – గృహం । గంగా + ఆపగా = గంగా నదియొక్క; తట = తీరమందలి; లతాగృహం = పొదరిల్లును; ఆశ్రయంత్యాః = ఆశ్రయించే; తే = నీయొక్క; పదవీరజః = దారిలోని ధూళి; ప్రచలితం = లేచినదై; ప్రణతస్య = నమస్కరించిన; శంభోః = శివునికి; పావనతమం = పరిశుద్ధిహేతువైన; కిం, అపి = అనిర్వాచ్యమైన; నూతనం = అపూర్వమైన; ఉత్ + ధూళనం = పైపూతగా; ప్రాయేణ = తరచుగా; ఆతనోతి = చేస్తుంది. (అంతట లేపనం చేస్తుంది)

తా॥ ఓ పాదుకాదేవీ! గంగానదీ తీరాన ఉన్న లతామంటపాన్ని చేరే నీ చలనం వల్ల లేచిన దారిలోని ధూళి, నమస్కరించే శివుని పరిశుద్ధికి హేతువైన, ఇంతకుముందులేని, అనిర్వాచ్యమైన లేపనాన్ని తరచుగా చేస్తుంది.

వ్యాఖ్య :– పాదుకాధూళి పరమశివునికి ఉద్ధూళనంగా ఉత్ప్రేక్షితం.

యమునానది వర్ణితం. గంగానది స్మారితం. శ్రీరామచంద్రస్వామి విశ్వామిత్రయాగ సంరక్షణార్థం వెళ్ళినప్పుడూ, వనవాసగమనమప్పుడు గంగాతీర సంచారం చేశాడు. వనయాత్రలో ఆప్రదేశంలో ఒక రాత్రి గడిపాడు. అక్కడికి దగ్గర ఉన్న కాశీనగరం నుంచి పరమశివుడు వచ్చి శ్రీరాముణ్ని గౌరవించడం సంభవమే.

గంగాతీరాన కాశీనగరముంది. అక్కడ భోగశయనుడనీ, బిందుమాధవుడనీ ప్రసిద్ధి పొందిన భగవన్మందిరముంది. "కాశ్యాంతుభోగశయనం" అని ప్రఖ్యాతం. విశ్వనాథుడని పేరుగాంచిన పరమశివునికి కాణాచి కాశి. రామతారక మంత్రాన్ని సదా శివుడు పఠిస్తుంటే ఆక్షేత్రవాసుల చెవిలో చేరుతుంది కాబట్టి, కాశిలో మరణిస్తే ముక్తి లభిస్తుందని ప్రసిద్ధి. అంతేకాదు,

"గంగా యాశ్చోత్తరే తీరే దేశంద్రష్టుముపాగతః ।
విషసాద తతస్తస్మిన్ ఆశ్రమే పుణ్యవర్ధనః" । (హరివంశం)

శ్రీకృష్ణుడు కైలాసయాత్రా సందర్భంలో మధ్యన బదరికాశ్రమంలో ఉండి, మునుల ఆతిథ్యం స్వీకరించడమూ, తర్వాత శివుని ఉపదేశం వల్ల నిర్మల హృదయుడైన ఘంటాకర్ణుడు తన తమ్మునితో వచ్చి శ్రీకృష్ణుణ్ని స్తుతించగా ఘంటాకర్ణునికి మోక్షఫలాన్ని ప్రదానం చేయడమూ, కైలాసానికి వెళ్ళి శ్రీకృష్ణుడు పండ్రెండేండ్లు తపస్సు చేయడమూ, రుద్రేంద్రాదులు ఆశ్చర్యపడి అక్కడికి రావడమూ, గంగాధరుడు శ్రీకృష్ణ భగవానుని స్తుతించడమూ 'హరివంశ' ప్రోక్తం.

ఏ విధంగానైనా, గంగాతీరాన అతా గృహ ప్రాంతాన సంచరిస్తున్న భగవత్పాదుకాధూళి నమస్కరిస్తున్న శివుని శరీరం మీద పూర్తిగా పూసినట్లు పడడం సుశ్లోకితం. శంభునికి శ్మశాన భస్మోద్ధూళనం ప్రాక్తనం. అనిర్వచనీయమైన పాదుకా పరాగోద్ధూళనం అతనికి నూతనం. విభూతిచే లిప్తమైన శంభుని శరీరమంతటా కర్పూర పరాగంలాగా ఉద్ధూళితమైన పాదుకా పరాగం అతని పరిశుద్ధికి హేతువయింది.

వసంత తిలకా వృత్తం.

369. అంతే తదా త్వమవిలంబిత మానయంతీ
రంగాద్భుజంగశయనం మణిపాదరక్షే ।
కామంనివర్తయితు మర్హసి సంజ్వరం మే
కర్పూర చూర్ణపటలైరివ ధూళిభిస్తే ॥ –19.

అర్థం :– హే మణిపాదరక్షే = ఓ రత్నపాదుకా! అంతే, తదా = మరణ సమయమప్పుడు; త్వం = నీవు; రంగాత్ = శ్రీరంగ విమానం నుంచి; భుజంగ శయనం = శేషశాయిని; అవిలంబితం = శీఘ్రంగా; ఆనయంతీ = తీసికొని వస్తూ; మే = నాయొక్క; సంజ్వరం = సంతాపాన్ని; కర్పూర చూర్ణ పటలైః; ఇవ = కర్పూరపు పొడికుప్పలను పోలిన; తే = నీయొక్క; ధూళిభిః = పరాగాలచేత; కామం = పూర్తిగా; నివర్తయితుం = పోగొట్టడానికి; అర్హసి = యోగ్యవు.

తా॥ ఓ మణి పాదుకా! నీవు అవసాన సమయాన శ్రీరంగ విమానం నుంచి శేషశాయిని శీఘ్రంగా తీసికొనివస్తూ, నా ఆధ్యాత్మిక తాపాన్ని కర్పూరపు పొడిని పోలిన నీ ధూళులచేత పూర్తిగా పోగొట్టే యోగ్యురాలవు.

వ్యాఖ్య :– పాదుకా పరాగం తాపనివృత్తి యోగ్యమని వర్ణితం.

శ్రీరంగమందిరం నుంచి శేషశాయిని తన అవసాన సమయమప్పుడు శీఘ్రంగా తీసుకొని వచ్చి తనకు దర్శనం చేయించాలనీ, అప్పుడు పాదుకా సంచారంవల్ల చలించిన ధూళి కర్పూర చూర్ణంలాగా తన మీద పడితే ఆధ్యాత్మిక తాపం తొలగిపోయి, ఆత్మకు శాంతి ఏర్పడుతుందనీ, కవి ప్రార్థన.

"పటలం ఛదిషి వ్రజే". (విశ్వ.ని.)

"అప్పోదెక్కు ప్పోదే శొల్లివెత్తేన్". అప్పటి కోసం ఇప్పుడే ప్రార్థించి ఉంచుతానన్నారు శ్రీవిష్ణుచిత్తులవారు. ఉపమాలంకారం. వసంత తిలకా వృత్తం.

370. రంగేశ పాద సహధర్మచరి! త్వదీయాన్
మౌళౌనివేశ్య మహితాన్ పదవీ పరాగాన్ ।
సంత స్త్రివర్గ పదవీ మతి లంఘయంతో
మౌళౌ పదం విదధతే విబుధే శ్వరాణామ్ ॥ –20.

అర్థం :– హే రంగేశ పాద సహధర్మచరి = పతిని పత్నివలె అవినాభూతప్రచారవైన ఓ పాదుకా! మహితాన్ = పూజ్యమైన; త్వదీయాన్ = నీసంబంధమైన; పదవీ పరాగాన్ = మార్గమందలి ధూళులను; మౌళౌ = శిరస్సునందు, నివేశ్య = ధరించి; సంతః = సత్పురుషులు; త్రి వర్గ పదవీం = ధర్మార్థకామ సముదాయంతో కూడిన మార్గాన్ని; అతి లంఘయంతః = దాటిపోతూ, విబుధ + ఈశ్వరాణాం = దేవతా ప్రముఖుల యొక్క; మౌళౌ = తలమీద; పదం = చరణాన్ని; విదధతే = మోపుతారు.

తా॥ ఓ రంగేశ పాద సహధర్మచరీ, పాదుకా! మాన్యమైన నీ మార్గమందలి ధూళిని తమ తలమీద దాల్చి, సత్పురుషులు ధర్మార్థకామ సముదాయ మార్గాన్ని అతిక్రమిస్తూ, అమరపరుల తలమీద తమ పాదాలను నిక్షేపిస్తారు.

వ్యాఖ్య :– ముముక్షువులు పాదుకా పరాగాన్ని తలదాల్చి లోకపాలుర ఐశ్వర్యాన్ని లక్ష్యపెట్టరని విచిత్రోక్తి.

రుద్ర ఘంటాకర్ణాదులాశ్రయించడం మోక్షం కోసమే అని ప్రపూర్వ శ్లోకంలో, ఆమోక్షం కోసమే స్థూల శరీరం చేత కవి, తన అంత్యకాలమందు పాదుకా పరాగాన్ని గ్రహించడమని పూర్వ శ్లోకంలో చెప్పబడింది. ఈ శ్లోకం పరాగ ఫలరీతిని వర్ణిస్తున్నది. **"త్రివర్గోధర్మకామార్థైః".** (అమరం) ధర్మార్థకామ సముదాయాన్ని 'త్రివర్గ' మంటారు. మోక్షాన్ని అపవర్గ మంటారు. బ్రహ్మాండమందలి లోకాలన్నీ త్రివర్గమార్గాన్ని అనుసరించేవి. మోక్షానందానికి త్రివర్గ నిరపేక్షత ఆవశ్యకం. లోకరక్షణ ధర్మాన్ని భగవత్పాదాలు అనుష్ఠిస్తే, ఆధర్మానికి సహాయపడి పూరించేది పాదుకాదేవి. కాబట్టి భగవత్పాద సహధర్మచరి, పాదుకాదేవి.

సత్పురుషులకు, పాదుకాధూళిని తలదాల్చినందున, పరావర జ్ఞానం కలుగుతుంది. బ్రహ్మ రుద్రేంద్రాది లోక పాలకులందరు సర్వశేషియైన పరంధామునికంటె అవరులు – తక్కువవారు అనే, జ్ఞానధనులు బ్రహ్మాండాంతర్వర్తి లోకగతిని అపేక్షించరు, ఆదరించరు. శిరస్సుచేధూళిని వహిస్తే, శిరోవాహ్యత్వం విపరీతమే. **"నావలిట్టుళి తరుగిన్హోమ్, నమన్తమర్ తలైకళ్ మీతే".** (తిరుమాలై) అన్నట్లు, ప్రజ్ఞానులు భగవన్నామాన్ని గురుముఖతః నేర్చుకొని కీర్తించడం వల్ల

యమభటుల తలమీద పాదాలు పెట్టి గర్జిస్తూ సంచరిస్తారు. వారు మోక్షోపాయాన్నిమాత్రమే అనుష్ఠించడం వల్ల అతివాహికులూ, అన్య దేవతలూ 'వీరు కేశవభక్తులు' అని గౌరవిస్తూ, అర్చిరాదిమార్గంగా పరమపదానికి చేరబోతున్నప్పుడు, వారి పాదాలను శిరసా వహిస్తారు. ఇట్టి సద్గతి నిశ్చయమని, దృఢాధ్యవసాయంతో అంతిమకాలంలో పాదుకాధూళిని తమ దేహం మీద అనుగ్రహించవలెనని ప్రార్థించిన పూర్వ శ్లోకంతో అన్వయించ తగింది. వసంత తిలకా వృత్తం.

371. మాత స్తదా మాధవ పాదరక్షే !
త్వయి ప్రసక్తం త్వర యోపయాంత్యామ్ ।
పరామృశేయం పదవీపరాగం
ప్రాణైః ప్రయాణాయ సముజ్జిహానైః ॥ –21.

అర్థం :– హే మాతః = ఓతల్లీ! మాధవపాదరక్షే = ఓ మాధవ పాదుకా! తదా = అంతిమ సమయమప్పుడు; త్వరయా = వేగంగా; ఉపయాంత్యాం = దగ్గరికొచ్చే; త్వయి = నీయందు; ప్రసక్తం = తగిలియున్న; పదవీపరాగం = మార్గమందలి ధూళిని; ప్రయాణాయ = ఊర్ధ్వలోక ప్రయాణంకోసం; సముజ్జిహానైః = విడిచివెళ్ళే; ప్రాణైః = ప్రాణవాయువులచేత; పరామృశేయం = పరామర్శిస్తాను (తుడిచివేస్తాను).

తా॥ ఓ జననీ! శ్రియఃపతి పాదుకా! నేను అంతిమదశలో (చచ్చిపోవడం కోసం) దేహాన్ని వదలి బయటకు లేచి వచ్చే ప్రాణవాయువులతో శీఘ్రంగా దగ్గరికి వచ్చే నిన్ను కమ్ముకున్నదారి దుమ్మునుపరామర్శిస్తాను.

వ్యాఖ్య :– పాదుకాధూళిని ప్రాణవాయువులతో పరామర్శించే వర్ణన.

విలంబం చేయక శ్రీరంగనాథుని తన వద్దకు తీసుకొని రమ్మని ప్రపూర్వ శ్లోక కథితం కదా! శీఘ్రంగా ఎందుకు తేవాలో ఇందు వివరించబడుతుంది. మరణసమయంలో ఇంద్రియాలన్ని సడలి మనస్సునందు లీనమవుతాయి. వాటితో కూడిన మనస్సు ప్రాణమందు లయమవుతుంది. ప్రాణం భూత సూక్ష్మాలయందు అణగి ఉంటుంది. ఇలా ఇవన్ని లీనమైన తర్వాత ప్రజ్ఞానం ఉండనేరదు. ఈ స్థితి కలుగకముందు వచ్చిననేగాని ఫలముండదు. ఆలస్యమైతే నిష్ప్రయోజనమేకదా! అవిలంబితంగా సమీపిస్తే "ఓ తల్లీ! నీ మీద ఎంత దుమ్ము పడిందో కంటితో చూస్తాను. చేతితో తుడుస్తాను, ముక్కుతో మూర్కొంటాను. నోటితో 'నమః' అంటాను. మనస్సుతో ధ్యానిస్తాను. సర్వేంద్రియ సంతృప్తిగా సేవించి, అనుభవించి ధన్యుడనవుతాను" అన్నారు ఆచార్యులు.

'ప్రాణైః పరామృశేయం' అనడం వల్ల ఉపచార బుద్ధి గోచరిస్తుంది. 'ప్రాణ'మనే పదం ఇంద్రియాలను, వాయువులను అన్నిటిని గ్రహించిన పదార్థం. ప్రాణం విడువక, దమ్ము అధికమైనప్పుడే వస్తే దుమ్ముదులుపుతా ననడం కవి తార్కికకేసరికే సరి.

ప్రేయోఽలంకారం. ఉపజాతి వృత్తం.

372. తథాగతా రాఘవ పాదరక్షే!

సంపశ్య మానేషు తపోధనేషు ।

ఆసీదహల్యాతవ పాంసులేశై

రపాంసులానాం స్వయమగ్ర గణ్యా । –22.

అర్థం :– హే రాఘవ పాదరక్షే = ఓ రామపాదుకా! తథాగతా = ఆ విధంగా (జార దోషం వల్ల శిలా రూపాన్ని) పొందిన; అహల్యా = గౌతమపత్ని; తపోధనేషు = తపస్సే ధనంగా గల మునులు; సంపశ్యమానేషు = చూస్తుండగా; తవ = నీయొక్క; పాంసులేశైః = కొద్ది ధూళి కణాలచేత; స్వయం = తానే; అపాంసులానాం = పతివ్రతలలో; అగ్రగణ్యా = మొదట లెక్కింప దగినదై ; ఆసీత్ = ఉండెను.

తా। ఓ రాఘవ పాదుకా! అలా శిలారూపాన్ని పొందిన అహల్య మునులు చూస్తుండగా నీధూళిలోని కొన్ని కణాలచే పతివ్రతలలో తానే ప్రథమగణ్య అయింది.

వ్యాఖ్య:– అహల్యాపాదుకా పాంసు లేశంతో అపాంసుల అయిందని విరోధాభాసం.

"మతించకార దుర్మేధాః దేవరాజకుతూహలాత్".

గౌతమి పత్నియైన అహల్య మనఃపూర్వకంగా ఇంద్రుణ్ని పొందింది. జారదోషం వల్ల స్త్రీరూపం పోయింది. శిలగా మారింది. తపోధనులు చూస్తున్నా, తపోబలంచేత నశింపని పాపరూపమది. శ్రీరాముని పాదుకాధూళి సోకినంత మాత్రాన అఘం విరిగింది. శిల శీలవతి అయింది. పతివ్రతలలో కనిష్ఠికాధిష్ఠిత అయింది. పాంసు సంబంధం వల్ల పాంసు సంబంధరహిత అవడం విరోధం. 'పతివ్రత' అనే అర్థంవల్ల విరోధం పరిహృతం.

"పాంసులః పుంశ్చలే శంభోః ఖట్వాంగే, పాంసులాభువి" (విశ్వని)

అహల్య పాదుకా రజస్సంబంధం చేత పతివ్రతా మతల్లిక అయింది.

"అహల్యా ద్రౌపదీ సీతా తారా మండోదరీ తథా ।

పంచకన్యాఃస్మరేన్నిత్యం మహాపాతకనాశినీ" ।.

ఈ పద్ధతిలోనూ, అహల్యా ప్రసక్తియే ప్రథమంగా సుశ్లోకితం.

రజస్సు పడగానే, రజస్సు అంతా తొలగిపోయి సత్త్వగుణస్థితి శీఘ్రంగా కలుగుతుంది అనడానికి ఉదాహరణంగా అహల్యా వృత్తాంతం వర్ణితం. ఉపజాతి వృత్తం.

373. పశ్యామి పద్మేక్షణ పాదరక్షే !
భవాంబుధిం పాతు మివప్రవృత్తాన్ ।
భక్తోపయానత్వరయా భవత్యాః
పర్యస్య మానాన్ పదవీ పరాగాన్ । –23.

అర్థం :– హే పద్మేక్షణ పాదరక్షే = ఓ పుండరీకాక్షుని పాదుకా! భక్త + ఉపయాన, త్వరయా = భక్తుల దగ్గరికి పోయే వేగంచేత; పర్యస్యమానాన్= పైకి లేచి పడుతున్న; భవత్యాః = నీయొక్క; పదవీ పరాగాన్= మార్గమందలి ధూళులను; భవ + అంబుధిం = సంసారమనే సముద్రాన్ని; పాతుం = పీల్చడానికి; ప్రవృత్తాన్, ఇవ = ప్రవర్తించేవాటినిగా; పశ్యామి = చూస్తున్నాను.

తా॥ ఓ కెందామర కన్నులు కలవాని పాదుకా! భక్తుల దగ్గరికి పోయే తొందరతో నీవు నడువగా చెలరేగిన ధూళి సంసార సాగరాన్ని శోషింపజేయడానికి ప్రవర్తించేదిగా నాకు కనబడుతుంది.

వ్యాఖ్య :– పాదుకా పరాగంవల్ల సంసార సాగర శోషణం.

అహల్యలాంటి కొందరి పాపాలనే నివారించడంకాదు, సర్వపాప కుక్షింభరిత్వమే పాదుకాదేవి లక్ష్యంగా కనబడుతుంది. **"నయామి పరమాంగతిం"** అని, వరాహచరమ శ్లోకం. దేహావసాన సమయంలో కాష్ఠ పాషాణ సదృశులైన భక్తులకు ఉత్తమగతిని కలిగించడానికి భగవంతుడు పరుగెత్తి వస్తాడు. పాదుకాధీనమైన సంచార వేగం వల్ల ధూళి బాగా చెలరేగుతుంది. నీటిని మట్టి పీల్చేస్తుంది కదా! సంసారమనే సముద్రాన్ని తన ధూళితో నింపి శోషింపజేయడమే - జీవుల ను జనన మరణ బాధ నుంచి రక్షించడమే - పాదుకోద్దిష్టం. పరిణామ సంకీర్ణోత్ప్రేక్ష. ఉపజాతి వృత్తం.

374. పంచాయుధీ భూషణమేవ శౌరేః
యతస్తవైతే మణిపాదరక్షే !
వితన్వతే వ్యాప్తదిశః పరాగాః
శాంతోదయాన్ శత్రుచమూపరాగాన్ ॥ –24.

అర్థం :– హే మణిపాదరక్షే = ఓ రత్నపాదుకా! పంచ + ఆయుధీ = ఐదు ఆయుధాల సముదాయం; శౌరేః = భగవంతునికి; భూషణం = అలంకారమే, యతః = ఎందు వల్ల? అంటే; వ్యాప్తదిశః = వ్యాపించిన దిక్కులుగల; తవ = నీయొక్క; ఏతే = ఈ; పరాగాః = ధూళులు; శత్రు చమూ పరాగాన్ = పగతుర సేనల ధూళులను; శాంత + ఉదయాన్ = చెలరేగని వాటినిగా; వితన్వతే = చేస్తాయి.

తా॥ ఓ మణిపాదుకా! శౌరికి పంచాయుధాలు భూషణాలే. ఎందుకంటే, దిక్కుల నిండా వ్యాపించిన నీ ధూళి శత్రు సేనల ధూళిని నష్టోదయంగా చేస్తుంది.

వ్యాఖ్య :– పాదుకాపరాగం శత్రుసేనలను మార్కొనకుండా చేస్తుంది.

భక్త రక్షణార్థం పోయే విషయం వర్ణితం. శత్రు వధార్థం వెళ్ళే విషయాన్ని వర్ణిస్తున్నదీ శ్లోకం. భక్తులను బాధించే వారే భగవంతునికి పగవారు. సజ్జనులను రక్షించడానికి, దుర్జనులను శిక్షింప అతివేగంగా భగవంతుడు వెళ్ళుతుంటే పాదుకాధూళి పలుదిక్కుల కమ్ముకుంటుంది. పాదుకా ధూళిని చూచినంతనేశత్రుసైన్యం 'రాక్షసాంతకుడు వస్తున్నాడు' అని గమనించి భయంతో వెనుకకు తిరిగిపోతుంది. ఆయుధాలు చేసే పని హింసాత్మకం. పాదుకా పరాగం అహింసాత్మకం. పాదుకాదేవి శత్రుసేనల కళ్ళల్లో తన దుమ్మును చల్లి ముందడుగు వేయకుండా చేస్తుంది. కాబట్టి, ఆయుధాలను భగవంతుడు ప్రయోగించే అవసరమే లేనందున అవి కేవలం అలంకారాలుగా ఉండే శోభను కలుగజేస్తుంది పాదుకాదేవి. 'ప్రణతరక్ష' కోసం ఆయుధాలను ధరిస్తాడు, అని భట్టరన్నారు. **"స్వరక్షణ మివాభవత్, ప్రణత రక్షణం తావకం".** భగవంతునికి ప్రణత రక్షణ, స్వరక్షణయే, అని మెరుగుపెట్టింది 'అభీతిస్తవం'.

"అత్తిగిరి పత్తర్వినై తొత్తఅవరుక్కు. మణి యత్తిగిరియే".

హస్తిగిరియే – క్షేత్రమే – భక్తుల పాపాలను నశింపజేస్తుంది. ఇక (అత్ + తిగిరి) ఆ చక్రాయుధం శ్రీ వరద రాజస్వామికి అలంకారంగానే, ఉంటుందన్నారు దేశికులు. ఆళ్వార్ల దివ్యసూక్తులేర్పడిన తర్వాత శ్రియఃపతి కల్యాణ గుణానుభవం కనబడగానే, వేద పురాణాల ప్రయోజనం సన్నగిలిందని, వ్యంగ్యం.

వాక్యార్థహేతుక కావ్యలింగాలంకారం. ఉపజాతి వృత్తం.

375. పరిణతి మకఠోరాం ప్రాప్తయా యత్ప్రభావాత్
అలభత శిలయా స్వాన్ గౌతమో ధర్మదారాన్ ।
పున రుపజని శంకా వారకం పాదుకే! తత్
ప్రశమయతి రజస్తే రాగయోగం ప్రజానామ్ ॥ –25.

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకా! గౌతమః = గౌతముడు; యత్ + ప్రభావాత్ = ఏ, నీ ధూళి/రజోగుణ, మహిమ వల్ల; అ కఠోరాం = మృదువైన; పరిణితిం = మార్పును; ప్రాప్తయా = పొందిన; శిలయా = పాషాణం చేత; స్వాన్ = తనదైన; ధర్మధారాన్ = ధర్మపత్నిని; అలభత = పొందినాడో; తత్ = ఆ; తే = నీ యొక్క; రజః = ధూళి/రజో గుణం; ప్రజానాం = ప్రజలకు; పునః + ఉపజని, శంకా, వారకం = మళ్ళీ జన్మకలుగుతుందో అనే సందేహాన్ని తొలగిస్తూ; రాగయోగం = విషయ లోభ సంబంధాన్ని, ప్రశమయతి = శమింపజేస్తుంది. (పోగొట్టుతుంది)

తా॥ ఓ పాదుకా! గౌతముడు ఏరజస్సామర్థ్యం వల్ల మృదుల పరిణామాన్ని పొందిన శిలనుంచి స్త్రీయైన తన ధర్మపత్నిని పొందాడో, ఆనీ రజస్సు ప్రజలకు పునరుత్పత్తి శంకను నివారిస్తూ, విషయ లోభ సంబంధాన్ని శమింపజేస్తుంది.

వ్యాఖ్య :– పాదుకా పరాగం పరస్పర విరుద్ధకార్యాలను చేస్తుంది.

పరాగంచేత పరాగభావ నివృత్తి పూర్వ శ్లోకమందు వర్ణింపబడింది. ఈ శ్లోకం (పర + అగ భావం) అహల్యా రూపమైన జీవాత్మకు స్థావరత్వాన్ని నివారించిన వృత్తాంతం భంగ్యంతరంగా వివరిస్తున్నది.

పాదుకా రజస్సు సోకిన వెంటనే గుండు మెత్తబడి గుండెగా మారింది. ఆ గుండెను తన గుండెతో హత్తుకున్న వాడు గౌతముడు. రజస్సు అంటే రజోగుణం రాగాన్ని కలిగించడం వల్ల పునరుద్భవించిన అహల్యతో గౌతమ మహర్షి పూర్వంవలె అనురక్తుడయ్యాడు. పునర్జీవనానికీ, పునస్సంగమానురాగ యోగానికీ కారణమైన పాదుకా పరాగమే, భక్తులకు పునర్జన్మనూ, సాంసారిక కామవ్యామోహాలనూ లేకుండా చేస్తుంది.

ఒకచోట రాగోత్పత్తినీ, మరొకచోట రాగనివృత్తినీ కలిగించే రజః ప్రభావం చిత్రంగా ఉంది. శిలను స్త్రీగా చేస్తుంది. కఠినాన్ని మృదువుగా చేస్తుంది. విరక్తుణ్ని అనురక్తునిగానూ, రాగిని విరాగినిగానూ చేయడం చిత్రమే కదా! పాపనివర్తకత్వమూ, మోక్షహేతుత్వమూ అవిరుద్ధమనే ఆభాసీకరణం వల్ల, విరోధాభాసాలంకారం, మాలినీ వృత్తం.

376. రజని విగమకాలే రామగాథాం పఠంతః

కుశిక తనయముఖ్యాః పాదుకే! భావయంతే ।

ఉపల శకలసక్తై స్త్వత్పరాగై రకాండే

జనిత మునికళత్రాన్ దండకారణ్యభాగాన్ ॥ –26.

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకా! కుశిక తనయ ముఖ్యాః = విశ్వామిత్రాది తపోధనులు; రజని విగమకాలే = రాత్రి గడచిపోయిన (ప్రాతః) కాలమందు; రామగాథాం = శ్రీరామచరిత్రను; పఠంతః = చదువుతూ, ఉపలశకల సక్తైః = రాతి ముక్కలమీద పడిన; త్వత్, పరాగైః = నీ ధూళి కణాలచేత; అకాండే = అతర్కితంగా; దండకారణ్యభాగాన్ = దండకాటవీ ప్రదేశాలను; జనిత మునికళత్రాన్ = జనించిన మునిపత్నిగల ప్రాంతాలుగా; భావయంతే = స్మరిస్తుంటారు.

తా॥ ఓ పాదుకాదేవీ! విశ్వామిత్రాది మునులు ప్రాతఃకాలమందు శ్రీరామకథను పఠిస్తూ, శిలాఖండాల మీద పడిన నీ పరాగ రేణువులచేత అతర్కితంగా మునిపత్ని (అహల్య) జనించిన దండకారణ్యభాగాలను స్మరిస్తుంటారు.

వ్యాఖ్య :– మునులకు పాదుకా పరాగ మహిమ ప్రాతఃస్మరణీయం.

విశ్వామిత్రుడూ, గౌతముడూ, ఇంకెందరో మునులు శ్రీరామ పాదుకారజః కణాలు సోకి రాయి రమణిగా రూపొందిన దృశ్యాన్ని కళ్ళారా చూశారు. ప్రాతఃకాలంలో మునులు భగవద్గుణాను సంధానం చేస్తారు. కాబట్టి శ్రీరామ చరిత్రను పఠిస్తున్నప్పుడు దండకారణ్య భాగాలను విశేషంగా జ్ఞాపకం చేసుకుంటారు. మునిపత్ని జనించిన దండకాటవీ ప్రదేశాలను విడిచి, హిమాలయ ప్రాంతాల్లో నివసించిన విశ్వామిత్రాది తపోధనులకు ప్రాతఃకాలంలో పూర్వానుభవాలు స్మృతికి వస్తాయి. మహర్షులకెందరికో రాముని మీద, తత్పాదుకలమీదనూ విశేషాభిమానం.

ఆకాండే :– శ్రీరంగ విమానాన్ని విభీషణుడు తీసికొని పోతున్నప్పుడు పాదుకా పరాగం ఎన్నెన్ని ఉపలశకలాలపైన జారిపడి ఎందరు ఉవిదలు ఉదయించారో అనీ, అహల్యోదంతాన్ని ఊహిస్తూ, పాదుకా రజఃప్రభావాన్ని ప్రశంసిస్తుంటారు.

"కోసలాన్ జనపదాను పాస్మహే". అన్నట్లు దండకారణ్య ప్రాంతాలను మునులు సంస్మరిస్తారు.

ప్రేయోఽలంకారం. మాలినీ వృత్తం.

377. శుభసరణిరజోభిః శోభయంతీ ధరిత్రీం
పరిణతి రమణీయాన్ ప్రక్షరంతీ పుమర్థాన్ ।
భవసి భువన వంద్యా పాదుకే! రంగభర్తుః
శరణముపగతానాంశాశ్వతీ కామధేనుః ॥ –27.

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకా! శుభ సరణి రజోభిః = మంగళకరమైన మార్గమందలి పరాగకణాలచే; ధరిత్రీం = భూమిని; శోభయంతీ = శోభింపచేస్తూ; పరిణతి రమణీయాన్ = రాబోయే అవస్థలచే/పెరుగు మొదలైన పరిణామాలచే; హృద్యమైన; పుమర్థాన్ = పురుషులచే కోరదగిన, ధర్మాదులను / పాలను; ప్రక్షరంతీ = ప్రసరింపజేస్తూ; భువనవంద్యా = లోకాలకు సేవింపదగిన నీవు; రంగభర్తుః = శ్రీరంగపతి యొక్క; శరణం = ఆలయానికి; ఉపగతానాం = వచ్చేవారికి; ప్రపన్నులకు; శాశ్వతీ = శాశ్వతమైన; కామధేనుః = కోరికలను తీర్చేగోవుగా; భవసి = ఉన్నావు.

తా॥ ఓ పాదుకా! సంచరించిన మార్గధూళిచే నేలను శోభింపజేస్తూ, ఆగామి అవస్థా భేదాలతో/దధ్యాది పరిణామాలతో హృద్యమైన ధర్మాది పురుషార్థాలను/పురుషులచే కోరదగిన క్షీరాలను ప్రసరింపజేస్తూ, లోకవంద్యవైన నీవు, శ్రీరంగరాజ మందిరానికి వచ్చే ప్రపన్నులకు నిత్యం కోరిక లీడేర్చే కామధేనువుగా ఉన్నావు.

వ్యాఖ్య :– పాదుకాదేవి శాశ్వత కామధేనువు.

అహల్యా శాప విమోచనా నంతరం మిథిలా నగరానికి పోయిన విశ్వామిత్రుని చరిత్రను, అక్కడ తన తల్లి దండ్రుల పునస్సమాగమానికి ఆనందించినశతానందుడు విస్తారంగా చెప్పే సందర్భంలో కామధేను విషయాన్ని ప్రస్తావించాడు.

1. కామధేనువు సంచరించిన నేల పవిత్రమవుతుంది.

2. పెరుగు, వెన్న, నేయి మొదలైన స్వాదిష్ఠ పదార్థాలుగా పరిణమించే క్షీరాలనూ ఇస్తుంది.

3. తనను సేవించే యాచకుల కోరికలనూ నెరవేరుస్తుంది. కాబట్టి కామధేనువు లోకవంద్య. పాదుకాదేవిని కామధేనువుగాదేశికులు శ్లేషతో కూడిన రూపకంతో చమత్కరించారు.

"శరణం గృహ రక్షిత్రోః". (అమరం)

వరాహ, వామన, రామ, కృష్ణాద్యవతారాల్లో సంచరించడం వల్ల భగవత్పాదుకాధూళిచే ధరిత్రి సంపూర్ణంగా పునీతమయింది. శ్రీరంగ మందిరానికి వచ్చిన ప్రపన్నుల ఉపచారాలను – మార్జన, అభ్యుక్షణ, ఉపలేపన, పుష్పాపచయన, దీపాలంకరణ, పూజా ప్రవర్తన, నామ సంకీర్తన, ప్రదక్షిణ, స్తుతి నమస్కారాది భగవత్ప్రీత్యర్థమైన కైంకర్యాలను పురుషార్థాలుగా పరిణమింపజేస్తుంది.

శరణాగతులకు సకలాభీష్ట ప్రదాయిని పాదుకాదేవి.

కామధేనువు విశ్వామిత్రుని ప్రబల వాంఛను నెరవేర్చలేదు, కాబట్టి అది కొందరిచేతనే పూజితయై కొంత ఫలాన్ని ప్రసాదిస్తుందన్న విషయం గమనీయం. కామధేను మహిమ పూర్ణమూ, శాశ్వతమూ కాదుకదా!

పరమైకాంతులకు పాదుకాదేవి మాత్రం శాశ్వతమైన కామధేనువు. ఇహపరలోకాల్లోనూ సేవనీయ పాదుకాదేవి.

మాలినీ వృత్తం.

378. పవన తరళితస్తే పాదుకే! రంగభర్తు
ర్విహరణ సమయేషు వ్యాప్త విశ్వః పరాగః ।
విషమ విషయవర్త్మ వ్యాకులానా మజస్రం
వ్యపనయతి జనానాం వాసనారేణుజాలమ్ । –28.

అర్థం :– హే రంగభర్తుః, పాదుకే = ఓరంగరాజ పాదుకా! విహరణ సమయేషు = సంచారకాలాల్లో; పవన, తరళితః = గాలిచే కదలిన; వ్యాప్త విశ్వః = అంతట వ్యాపించిన; తే = నీయొక్క; పరాగః = ధూళి; అజస్రం = ఎల్లప్పుడు; విషమ విషయ వర్త్మ వ్యాకులానాం; మెరక పల్లాలుగల, శబ్దాది విషయ మార్గాలందు క్షోభపడే, జనానాం = జనుల యొక్క; వాసనారేణుజాలం = అనాది వాసనారూపమైన ధూళికణాల సముదాయాన్ని; వ్యపనయతి = పోగొట్టుతుంది.

తా। ఓ రంగరాజ పాదుకా! సంచారవేళల్లో గాలిచే చలించి అంతటా వ్యాపించిన నీ పరాగం, ఎత్తువంతలు గల శబ్దాది విషయ మార్గాలందు కొట్టుమిట్టాడుతున్న జనుల వాసనారేణు సముదాయాన్ని తొలగిస్తుంది.

వ్యాఖ్య :- **పాదుకా పరాగం ప్రాకృత వాసనా రేణువులను అపనయించే వర్ణన.**

మిట్ట పల్లాలున్న దారిలో నడిచేవారు సాధారణంగా తొట్రుపడుతుంటారు. దుమ్ముమీద దుమ్ము పడితే అధికంగా ఆయాసపడుతారు.

"అనేక జన్మ సాహస్రీం సంసార పదవీం వ్రజన్ ।
మోహశ్రమం ప్రయాతోఽసౌ వాసనా రేణుకుంఠితః । (వి.పు)

శబ్దస్పర్శరూప రసగంధాలు భోగ్య విషయాలు. ప్రతి జన్మలో విషయాలనుసమానంగా అనుభవించే అవకాశ ముండదు. కొన్నింటిని ఎక్కువగా కొన్నింటిని తక్కువగా అనుభవించడం ప్రకృతి సిద్ధం. అనేక వేల జన్మలనెత్తి నప్పుడు అనుభవించిన విషమ విషయ వాసనల కలిమిబలిమిచేత ఈ జన్మలో సంసారులు పరమార్థం తెలుసుకో జాలక, మోహితులై అనేక బాధలను అనుభవిస్తుంటారు.

శ్రీరంగనాథుని సంచార సమయాల్లో పాదుకాధూళిలేచి, గాలిచే అంతటా వ్యాపిస్తుంది. కాబట్టి సంసారంలో తత్త్వహిత పురుషార్థాలు తెలియక క్షోభ పడుతున్న దేహయాత్రాపరులపైన పాదుకాధూళి కమ్ముకొని, వారిలో ఉన్న అనాది విషయ వాసనాధూళిరేణువులను చిమ్మివేస్తుంది. 374వ శ్లోకంలో, పాదుకా పరాగం బాహ్యశత్రుసేనను తరిమి వేసింది. ఈ శ్లోకంలో, అది ఆధ్యాత్మికవికాసం కలుగనీయని అంతః శత్రువులను అణచివేస్తున్నది. తత్ఫలితంగా జనులకు విషయ వ్యామోహం నశిస్తుంది. శుద్ధ సాత్త్వికులై వారు ముక్తిని పొందడానికి యోగ్యులవుతారు.

కథా కథనానుసారంగా, కర్మజ్ఞానానుష్ఠాన తత్పరుడై నిర్లిప్తంగా దేహయాత్రను గడిపిన జనక మహారాజువలె శోభిస్తారని కవి ఆశయం. వ్యాఘాతాలంకారం. మాలినీ వృత్తం.

379. నిష్ప్రత్యూహ ముపాసిషీమహి ముహుర్నిశ్శేషదోషచ్ఛిదో
నిత్యం రంగధురంధరస్యనిగమస్తోమార్చితే పాదుకే ।
ధత్తే మూర్ధభి రాదిపద్మజనితా తత్తాదృశీ సంతతి
ర్యత్సంచార పవిత్రిత క్షితిరజః పంక్తిం చతుష్పంచషైః ॥ -29.

అర్థం :- యత్సం - పంక్తిం! యత్ = ఏ పాదుక(ల) యొక్క; సంచార = సంచరణం చేత; పవిత్రిత = శుద్ధిచేయబడిన; క్షితి = భూమియందలి; రజః పంక్తిం = ధూళి పరంపరను; ఆది పద్మజనితా = మొదటి కమలంనుంచి పుట్టిన; తత్ + తాదృశీ, సంతతిః = ఆ ప్రసిద్ధమైన సంతానం; చతుః + పంచషైః = నాలుగు, ఐదు, ఆరు, మూర్ధభిః = తలలచేత; ధత్తే = ధరిస్తుందో; (తే = అట్టి) నిశ్శేషదోషచ్ఛిదః = సంపూర్ణంగా దోషాలను పోగొట్టే; రంగధురం ధరస్య = శ్రీరంగధాముని యొక్క; నిత్యం = (ఎల్లప్పుడు) ప్రతిదినం; నిగమస్తోమ + అర్చితే = శ్రుతి కదంబంచేత

(పూజింపబడే) ప్రశంసింపబడే; పాదుకే = పాదుకలను; నిష్ప్రత్యూహం = విఘ్నం కలుగకుండడానికి; ముహుః = మాటి మాటికి; ఉపాసిషీమహి = ఉపాసిస్తుంటాం.

తా॥ ఏ పాదుకల సంచారం చేత పవిత్రమైన నేలమీద ధూళి పరంపరను జగత్కారణమైన భగవన్నాభీ పద్మం నుంచి పుట్టిన ప్రసిద్ధి సంతానం (బ్రహ్మ) నాలుగు తలలచేతనూ, (రుద్రుడు) ఐదు తలచేతనూ, (స్కందుడు) ఆరుతలల చేతనూ ధరిస్తుందో; అట్టి సమస్త దోషాలను సంపూర్ణంగా నివారించే శ్రీరంగనాథుని యొక్క దినదినం వేద బృందంచే ప్రశంసింపబడే పాదుకలను ఆటంకం కలుగకుండా మాటికి మాటికి ధ్యానిస్తుంటాం.

వ్యాఖ్య :– భగవత్సేవకు ప్రతిబంధకమైన పాపం తొలగడంకోసం పాదుకోపాసనం ఆవశ్యకం.

భగవన్నాభీ పద్మం సృష్టికి మూలకారణం. ఆది పద్మం నుంచి జన్మించిన చతుర్ముఖునికి పుత్రుడు రుద్రుడు, పౌత్రుడు కుమారస్వామి. రుద్రుడు పంచాననుడు, అతని కుమారుడు షణ్ముఖుడు. వీరు పాదుకాధూళిని వహిస్తారు.

"చతుర్ముఖేశ్వరముఖైః పుత్ర పౌత్రాదిశాలినే ।
నమః సీతాసమేతాయ రామాయ గృహమేధినే" ।

మిథిలా నగరంలో సీతారామ కల్యాణం జరిగింది. ఆ సీతారాములు అనాది దంపతులు, లక్ష్మీ నారాయణులే. వారి పుత్రుడు చతుర్ముఖుడు, పౌత్రుడు పంచాననుడు, ప్రపౌత్రుడు (నప్త) షడాననుడు. పెద్ద కుటుంబియైన సీతా సమేతుడైన శ్రీరామచంద్రస్వామికి నమస్కృతి నొనర్చి శ్రీమద్వేదాంతదేశికులు 'రఘువీర గద్య'ను ముగించారు.

భగవంతునికి కైంకర్యం చేయదలచిన సంసారులకు వారి సంచిత కర్మలలోని దుష్కృతం, ఆధి వ్యాధిరూపంగా బాధ కలిగిస్తూ, ఆటంకపరుస్తుంది. నిర్విఘ్నంగా భగవత్సేవచేయడానికి అనుగ్రహించే శ్రీరంగనాయకుని పాదుకా ద్వయిని సర్వదా ధ్యానిస్తుంటారు పరమైకాంతులు.

భగవద్దివ్యసంతాన పరంపర భగవత్పాదుకా రజఃపంక్తిని తమ శిరః పంక్తిచే ధరించి ధన్య మవుతుంటే, మాన్యులూ సామాన్యులూ పాదుకాధూళిని శిరసావహించడమే కాక నిత్యం పాదుకోపాసన చేయడం అత్యంతావశ్యకం.

"విశ్వేషదోషచ్ఛిదౌ" పాఠాంతరం, పాదుకలకు విశేషణం.

బ్రహ్మరుద్ర స్కందులను "చతుష్పంచష్షై ర్మూర్ధభిః" అని పర్యాయంగా వర్ణిస్తూ, పాదుకా మహిమ పట్ల వక్త ప్రేమను ప్రకటించడం, పర్యాయోక్తి సంకీర్ణమైన ప్రేయోఽలంకార లక్షణం.

శార్దూల విక్రీడితం.

**380. రజసా పరోరజస్తన్నఖలు నలంఘ్యేత భగవతోఽపి పదమ్ ।
కిముత హృదయం మదీయం భవతీయదినామ పాదుకే! నస్యాత్ । –30.**

అర్థం :– హే పాదుకే = ఓ పాదుకాదేవీ! భవతీ = నీవు; యది, నామ, న, స్యాత్ = లేక పోయినచో; పరోరజః = రజోగుణాతీతమైన/రజః స్పర్శలేని; తత్ = ఆ, ప్రసిద్ధమైన; భగవతః = భగవంతునియొక్క; పదం, అపి = పాదం కూడా; రజసా = ధూళిచేత; న, లంఘ్యేత, న, ఖలు = ఆక్రమింపబడకపోయేది కాదు కదా! మదీయం = నా సంబంధమైన; హృదయం = హృదయాన్ని గూర్చి; కిం, ఉత = చెప్పవలసినదేమి?

తా। ఓ పాదుకాదేవీ! నీవు లేకపోతే రజఃస్పర్శలేని అప్రాకృత భగవచ్చరణం కూడా రజస్సుచే అవశ్యంగా ఆక్రమింపబడేది కదా! ఇక నా హృదయం సంగతి చెప్పవలసిందే లేదు.

వ్యాఖ్య :– పాదుకాదేవి వల్ల భగవత్పాదయుగమూ, కవి హృదయమూ సత్త్వ గుణ శోభితం.

పాదుకలనుధరించడం వల్ల రజః పరోవర్తి – శుద్ధ సత్త్వాత్మకం – అయిన భగవంతుని పాదాలకు ధూళి అంటడమే లేదు. పాదుకలే లేకపోతే, పాదాలకు దుమ్ము, ధూళి తగిలేదే కదా!

ఇక పాదుకలను – శ్రీ శఠారిని – శిరస్సున ధరించకుంటే, గుణత్రయాత్మకమై ప్రకృతిమయమైన చేతనుల హృదయం రజస్తమోగుణాలచే అవశ్యంగా ఆక్రమింపబడేది. పాదుకలను పాదాలకు ధరించి దేవుడు, తల ధరించి జీవుడు రజోరహితులవుతారు. రజోరహితమైన శుద్ధ వస్తువుకే రజస్సు అంటుతుండేదని చెబుతుంటే, రజః కలుషిత చిత్తానికి రజస్సంటేదని చెప్పనక్కరలేదు, అని కైముత్యోక్తి.

కావ్యార్థాపత్త్యలంకారం. ఆర్యా వృత్తం.

పరాగ పద్ధతి సమాప్తం.

ఇది శ్రీ మాలోల నృసింహస్వామి కటాక్షపాత్ర, హరితసగోత్ర, శ్రీమాన్ కారంచేటి తిరుమల మనోహరాచార్య ప్రథమ పుత్ర, వేంకట రాఘవాచార్య విరచిత రమణీయాంధ్ర టీకా, తాత్పర్య, వ్యాఖ్యా సమేత శ్రీమాన్ వేదాంత దేశికానుగృహీత 'పాదుకా సహస్రమ్' ద్వితీయ సంపుటమ్.

श्री पादुकासहस्रम्

॥ अधिकारपरिग्रहपद्धतिः षष्ठी ॥

141 अभीष्टे पादुका सा मे यस्याः साकेतवासिभिः ।
अन्वयव्यतिरेकाभ्यामन्वमीयत वैभवम् ॥ 1

142 मोचितस्थिरचरानयत्नतः कोसलान् जनपदानुपास्महे ।
येषु कांश्चन बभूव वत्सरान् दैवतं दनुजवैरिपादुका ॥ 2

143 साम्राज्यसम्पदिव दासजनोचिता त्वं रामेण सत्यवचसा भरताय दत्ता ।
स त्वां निवेश्य चरणावनि! भद्रपीठे पृथ्वीं बुभोज बुभुजे च यशोविभूतिम् 3

144 भोगाननन्यमनसां मणिपादुके! त्वं पुष्णासि हन्त भजतामनुषङ्गसिद्धान् ।
तेनैव नूनमभवद्भरतस्य साधोरप्रर्थितं तदिह राज्यमवर्जनीयम् ॥ 4

145 रामप्रयाणजनितं व्यपनीय शोकं रत्नासने स्थितवती मणिपादरक्षे! ।
पृथ्वीं निजेन यशसा विहितोत्तरीयामेकातपत्रतिलकां भवती वितेने ॥ 5

146 रामाज्ञया परवती परिगृह्य राज्यं रत्नासनं रघुकुलोचितमाश्रयन्ती ।
शुद्धां पदावनि! पुनर्भवती वितेने स्वातन्त्र्यलेशकलुषां भरतस्य कीर्तिम् ॥ 6

147 पौलस्त्यवीरवदनस्तबकावसानात् पुष्पाणि दण्डकवनेष्वपचेतुमिच्छोः ।
रक्षाधुरं धृतवती मणिपादुके! त्वं रामस्य मैथिलसुतासहिते प्रचारे ॥ 7

148 पादावनि! प्रचलचामरबृन्दमध्ये भद्रासनास्तरगता भवती विरेजे ।
आकीर्णदिव्यसलिले कटके सुमेरोरम्भोजिनीव कलहायितहंसयूथा ॥ 8

149 मान्ये रघूद्वहपदे मणिपादुके! त्वां विन्यस्य विग्रहवतीमिव राज्यलक्ष्मीम् ।
आलोलमक्षवलयी भरतो जटावानालम्ब्य चामरमनन्यमनाः सिषेवे ॥ 9

150 प्राप्ते दिवं दशरथे भरते विलक्षे पर्याकुलेषु भृशमुत्तरकोसलेषु ।
त्वं चेदुपेक्षितवती क इवाभविष्यत् गोपायिता गुहसखस्य विभोः पदं तत् ॥ 10

151 भ्रातुर्यदम्ब विरहाद्भरते विषण्णे दाक्षिण्यमाश्रितवती मणिपादुके! त्वम् ।
आसीदशेषजगतां श्रवणामृतं तत् वाचलकाहळसहं बिरुदं तदा ते ॥ 11

152 राज्यं तदा दशरथादनु रामतः प्राक् बिभ्राणया चरणरक्षिणि! वीतखेदम् ।
तुल्याधिकारभजनेन बभूव धन्यो वंशस्त्वयाऽम्ब! मनुवंशमहीपतीनाम् ॥ 12

153 वर्षाणि तानि वृषळो न तपांसि तेपे बालो न कश्चिदपि मृत्युवशं जगाम ।
राज्ये तवाम्ब! रघुपुङ्गवपादरक्षे! नैवापरं प्रतिविधेयमभूत् प्रसक्तम् ॥ 13

154 विश्वं त्वदाश्रितपदाम्बुजसम्भवायां यस्यां प्रतिष्ठितमिदं मणिपादरक्षे! ।
आसीदनन्यशरणा समये यथावत् साऽपि त्वया वसुमती विहितप्रतिष्ठा ॥ 14

155 प्रायेण रामविरहव्यथिता तदानीमुत्सङ्गमाश्रितवती तव राज्यलक्ष्मीः ।
तामेव देवि! ननु जीवयितुं जलार्द्रामङ्गीचकार भवती भरतोपनीताम् ॥ 15

156 वीरव्रतप्रणयिनि प्रथमे रघूणां प्राप्ते चिराय भरते व्रतमासिधारम् ।
त्यक्त्वा पदावनि! तदा विविधान् विहारानेकासिकाव्रतमपूर्वमवर्तयस्त्वम् ॥ 16

157 काकुत्स्थपादविरहप्रतिपन्नमौनां निष्पन्दतामुपगतां मणिपादरक्षे! ।
आश्वासयन्निव मुहुर्भरतस्तदानीं शीतैरवीजयत चामरमारुतैस्त्वाम् ॥ 17

158 यत्र क्वचिद्विहरतोऽपि पदारविन्दं रक्ष्यं मया रघुपतेरिति भावयन्त्या ।
निश्शेषमेव सहसा मणिपादरक्षे! निष्कण्टकं जगदिदं विदधे भवत्या ॥ 18

159 रामं त्वया विरहितं भरतं च तेन त्रातुं पदावनि! तदा यदभूत् प्रतीतम् ।
रामानुजस्य तव चाम्ब! जगत्समस्तं जागर्ति तेन खलु जागरणव्रतेन ॥ 19

160 अन्तःपुरे परिजनैः समयोपयातैरभ्यर्चिता भवसि या विनयोपपन्नैः ।
सा कोसलेश्वरपदावनि! भूपतीनां सङ्घट्टन मकुटपङ्क्तिभिरन्वभूस्त्वम् ॥ 20

161 प्राप्याधिकारमुचितं भुवनस्य गुप्त्यै भद्रासनं भरतवन्दितमाश्रयन्त्या ।
मध्येऽवतीर्णमिव माधवपादरक्षे! मातस्त्वयाऽपि मनुवंशमहीपतीनाम् ॥ 21

162 राजासने रघुकुलोद्वहपादरक्षे! नीराजनं समभवत् समयोचितं ते ।
श्लाघावशेन बहुशः परिघूर्णिताभिः सामन्तमौळिमणिमङ्गळदीपिकाभिः ॥ 22

163 पृथ्वीपतीनां युगपत् किरीटाः प्रत्यर्थिनां प्राणितुमर्थिनां च ।
प्रापुस्तदा राघवपादरक्षे! त्वदीयमास्थानिकपादपीठम् ॥ 23

164 प्रणम्य रङ्गेश्वरपादरक्षे! दूरोपनीतैरुपदाविशेषैः ।
सभाजयन्ति स्म तदा सभायामुच्चैस्तरामुत्तरकोसलास्त्वाम् ॥ 24

165 अपावृतद्वारमयन्त्रिताश्वं रङ्गेशपादावनि! पूर्वमासीत् ।
त्वया यदृच्छासुखसुप्तपान्थं रामे वनस्थेऽपि पदं रघूणाम् ॥ 25

166 अनन्यभक्तिर्मणिपादुके! त्वामभ्यर्चयन् दाशरथिर्द्वितीयः ।
विकल्प्यमानः प्रथमेन कीर्त्या वन्द्यः स्वयं व्योमसदां बभूव ॥ 26

167 अरण्ययोग्यं पदमस्पृशन्ती रामस्य राजार्हपदे निविष्टा ।
आस्थाननित्यासिकया निरास्थः स्वर्गौकसां स्वैरगतेर्विघातम् ॥ 27

168 राजासने चेद्भवती निषण्णा रङ्गेशपादावनि! तन्न चित्रम् ।
यत्राधिरूढाः क्रमशः पुरा त्वामुत्तंसयन्ते रघुसार्वभौमाः ॥ 28

169 भद्रासनं चेत् परिवृत्तमासीत् देवि! क्षणं दक्षिणतोमुखं ते ।
कथं भवेत् काञ्चनपादरक्षे! रामस्य रक्षोमृगयाविहारः ॥ 29

170 यावत्त्वया राघवपादक्षे! जिगीषिता राक्षसराजधानी ।
मालेव तावल्लुळिता मदान्धैरुद्यानशाखामृगयूथपैस्ते ॥ 30

171 महीक्षितां राघवपादरक्षे! भद्रासनस्थां भवतीं स्पृशन्तः ।
पूर्वं तथात्वे नियतेऽपि भूयः कल्याणतामानशिरे किरीटाः ॥ 31

172 अनिच्छतः पाण्डरमातपत्रं पित्रा वितीर्णं मणिपादरक्षे! ।
आसीत् त्वदर्थं विधृतेन तेन छाया समग्रा भरतस्य मौळौ ॥ 32

173 पादुके! रघुपतौ यदृच्छया प्रस्थिते वनविहारकौतुकात् ।
आधिराज्यमधिगम्य ते युवामक्षतं वसुमतीमरक्षतम् ॥ 33

174 रघुवीरपदानुषङ्गमात्रात् परिबर्हेषु निवेशिता यदि त्वम् ।
अधिकारदिने कथं पुनस्ते परिवारास्तव पादुके! बभूवुः ॥ 34

175 पुरुषार्थचतुष्टयार्थिनीनां परिषत् ते महिता वसिष्ठमुख्यैः ।
क्रयविक्रयपट्टणं प्रजानामभवत् काञ्चनपादुके! तदानीम् ॥ 35

176 मनुजत्वतिरोहितेन शक्ये वपुषैकेन विरोधिनां निरासे ।
अभजद्भरतादिभेदमीशः स्वयमाराधयितुं पदावनि! त्वाम् ॥ 36

177 मगधाङ्ककळिङ्गवङ्गमुख्यान् विमतान् रन्ध्रगवेषिणः ससैन्यान् ।
रघुपुङ्गवपादुके! विजिग्ये भरतः शासनमुद्वहन् भवत्याः ॥ 37

178 अनितरवहनीयं मन्त्रिमुख्यैर्यदा तत्
त्वयि विनिहितमासीत् सूर्यवंशाधिराज्यम् ।
रघुपतिपदरक्षे! रत्नपीठे तदानीं
श्रियमिव ददृशुस्त्वां सादरं लोकपालाः ॥ 38

179 परिहृतदण्डकाध्वगमनं पदरक्षिणि! तत् परिणतविश्वसम्पदुदयं युवयोर्द्वितयम्
रघुपतिरत्नपीठमधिरुह्य तदा विदधे व्यपगतवैरिभूपनिलयं वसुधावलयम् ॥ 39

180 प्राप्तोदया तदानीं किमपि तमस्तन्निराकरोद्भवती ।
तनुरिव मनुकुलजनुषां प्रसवित्री रत्नपादुके! सवितुः ॥ 40

॥ इति अधिकारपरिग्रहपद्धतिः षष्ठी ॥
आदितः श्लोकाः 180

॥ अभिषेकपद्धतिः सप्तमी ॥

181 पाहि नः पादुके यस्या विधास्यन्नभिषेचनम् ।
आभिषेचनिकं भाण्डं चक्रे रामः प्रदक्षिणम् ॥ 1

182 राघवस्य चरणौ पदावनि! प्रेक्षितुं त्वदभिषेकमीषतुः ।
आभिषेचनिकभाण्डसन्निधौ यत्प्रदक्षिणगतिः शनैर्ययौ ॥ 2

183 मूर्धाभिषिक्तैर्नियमेन वाह्यौ विचिन्त्य नूनं रघुनाथपादौ ।
रत्नासनस्थां मणिपादुके! त्वां रामानुजन्मा भरतोऽभ्यषिञ्चत् ॥ 3

184 भ्रातुर्नियोगेऽप्यनिवर्तमानं राज्याभिषेकं च परित्यजन्तम् ।
रामानुजौ तौ ननु पारतन्त्र्यादुभावुभाभ्यां भवती जिगाय ॥ 4

185 निवेश्य रङ्गेश्वरपादरक्षे! भद्रासने सादरमभ्यषिञ्चत् ।
वशी वसिष्ठो मनुवंशजानां महीक्षितां वंशपुरोहितस्त्वाम् ॥ 5

186 कृताभिषेका भवती यथावत् रङ्गेशपादावनि! रत्नपीठे
गङ्गानिपातस्नपितां सुमेरोरधित्यकाभूमिमधश्चकार ॥ 6

187 वसिष्ठमुख्यैर्विहिताभिषेकां राज्यासने रामनिवेशयोग्ये ।
तुष्टाव रङ्गेश्वरपादरक्षे! प्राचेतसस्त्वां प्रथमः कवीनाम् ॥ 7

188 रक्षोवधार्थं मणिपादरक्षे! रामात्मनो रङ्गपतेः प्रवासे ।
रक्षोऽपकाराद्धवती वितेने राजन्वतीं कोसलराजधानीम् ॥ 8

189 प्राप्ताभिषेका मणिपादरक्षे! प्रतापमुग्रं प्रतिपद्यमाना ।
शशास पृथ्वीं भवती यथावत् साकेतसिंहासनसार्वभौमी ॥ 9

190 दशाननादीन् मणिपादरक्षे! जिगीषतो दाशरथेर्वियोगात् ।
जातोपतापा त्वयि संप्रयुक्तैस्तीर्थोदकैरुच्छ्वसिता धरित्री ॥ 10

191 अध्यासितं मनुमुखैः क्रमशो नरेन्द्रैरारोप्य देवि! भवतीं तपनीयपीठम् ।
राज्याभिषेकमनघं मणिपादरक्षे! रामोचितं तव वशं भरतो वितेने ॥ 11

192 स्नेहेन देवि! भवतीं विषयेऽभिषिञ्चन् द्विस्सप्तसंख्यभुवनोदरदीपरेखाम् ।
जातं रघूद्वहदिवाकरविप्रयोगादन्धं तमिस्रमहरद्भरतः प्रजानाम् ॥ 12

193 हस्तापचेयपुरुषार्थफलप्रसूतेर्मूलं पदावनि! मुकुन्दमहीरुहस्त्वम् ।
छायाविशेषमदिशद्यदसौ प्रजानामावर्जितैस्त्वयि शुभैरभिषेकतोयैः ॥ 13

194 अह्नाय रामविरहात्परिखिन्नवृत्तेराश्वासनाय भवती मणिपादरक्षे! ।
तीर्थाभिषेकमपदिश्य वसुन्धरायाश्चक्रे तदा समुचितं शिशिरोपचारम् ॥ 14

195 मालिन्यमाश्रितवती मणिपादरक्षे! पङ्केन केकयसुताकलहोत्थितेन ।
शुद्धिं परामधिजगाम वसुन्धरेयं त्वत्तः क्षणान्निपतितैरभिषेकतोयैः ॥ 15

196 आवर्जितं मुनिगणेन जगद्विभूत्यै तोयं पदावनि! तदा त्वयि मन्त्रपूतम् ।
मूलावसेकसलिलं निगमद्रुमाणां शापोदकं च समभूत्क्षणदाचराणाम् ॥ 16

197 विप्रोषिते रघुपतौ भवती यथार्हं मान्ये पदे स्थितिमती मनुवंशजानाम् ।
आत्मन्यथर्वनिपुणैः प्रहितैः प्रजानामश्रूण्यपास्यदभिषेकजलप्रवाहैः ॥ 17

198 प्रायो विशोषितरसा पतिविप्रयोगात् पर्याकुलीकृतसमुद्रपयोधरा गौः ।
अम्ब! त्वदीयमभिषेकजलं (पयः) पिबन्ती धेनुर्बभूव जगतां धनधान्यदोग्ध्री ॥ 18

199 वृत्ते यथावदभिषेकविधौ बभासे पश्चात्तवाम्ब! भरतेन धृतः किरीटः ।
आकस्मिकस्वकुलविप्लवशान्तिहर्षात् प्राप्तस्त्विषामिव पतिर्मणिपादुके! त्वाम् ॥ 19

200 मनुवंशपुरोहितेन मन्त्रैरभिमन्त्र्य त्वयि पादुके! प्रयुक्तम् ।
अभिषेकजलं क्षणेन राज्ञां शमयामास समुत्थितान् प्रतापान् ॥ 20

201 पादपादुपहृता रघूद्वहादालवालमिव पीठमाश्रिता ।
अभ्यषेचि भवती तपोधनैः पारिजातलतिकेव पादुके! ॥ 21

202 अलघुभिरभिषेकव्यापृतैरम्बुभिस्ते दिनकरकुलदैन्यं पादुके! क्षाळयिष्यन् ।
स खलु कमलयोनेः सूनुराधत्त मन्त्रेष्वधिकनियमयोगां शक्तिमाथर्वणेषु ॥ 22

203 दिनकरकुलजानां देवि! पृथ्वीपतीनां निरुपधिमधिकारं प्राप्नुवत्यां भवत्याम् ।
अजनिषत समस्ताः पादुके! तावकीनस्नपनसलिलयोगान्निम्नगास्तुङ्गभद्राः ॥ 23

204 तव विधिवदुपात्ते सार्वभोमाभिषेके भरतसमयविद्भिः पादुके! मन्त्रिमुख्यैः ।
त्वदवधि निजकर्मस्थायिनीनां प्रजानां प्रथमयुगविशेषाः प्रादुरासन् विचित्राः ॥ 24

205 अवसित रिपुशब्दानन्वभू स्त्वं तदानी रघुपतिपदरक्षे! लब्धराज्याभिषेका ।
चलितभुजलतानां चामरग्राहिणीनां मणिवलयनिनादैर्मेदुरान् मन्त्रघोषान् ॥ 25

206 समुचितमाभिषेकं पादुके! प्राप्नुवत्यां
त्वयि विनिपतितानां देवि! तीर्थोदकानाम् ।
ध्वनिरनुगतमन्त्रः सीदतां कोसलानां
शमयितुमलमासीत् सङ्कुलानार्तनादान् ॥ 26

207 दिविषदनुविधेयं देवि! राज्याभिषेकं भरत इव यदि त्वं पादुके! नान्वमंस्थाः ।
कथमिव रघुवीरः कल्पयेदल्पयत्नस्त्रिचतुरशरपातैस्तादृशं देवकार्यम् ॥ 27

208 कतिचन पदपद्मस्पर्शसौख्यं त्यजन्ती व्रतमतुलमधा स्त्वं वत्सरान् सावधाना ।
रघुपतिपदरक्षे! राक्षसैस्त्रासितानां रणरणकविमुक्तं येन राज्यं सुराणाम् ॥ 28

209 अथर्वोपज्ञं ते विधिवदभिषेकं विदधतां,
वसिष्ठादीनामप्युपचितचमत्कारभरया ।
त्वदास्थान्या रङ्गक्षितिरमणपादावनि! तदा
लघीयस्यो जाता रघुपरिषदाहोपुरुषिकाः ॥ 29

210 अभिषेचयतु स रामः पदेन वा स्पृशतु पादुके! भवतीम् ।
अविशेषितमहिमा त्वं क्व वा विशेषः क्षमासमेतानाम् ॥ 30

इति अभिषेकपद्धतिः सप्तमी
आदितः श्लोकाः 210

॥ निर्यातनापद्धतिः अष्टमी ॥

211 अभिषेकोत्सवात् तस्माद्यस्या निर्यातनोत्सवः ।
अत्यरिच्यत तां वन्दे भव्यां भरतदेवताम् ॥ 1

212 उपास्य वर्षाणि चतुर्दश त्वामुत्तारिकामुत्तरकोसलस्थाः ।
सनन्दनाद्यैरपि दुर्विगाहं सान्तानिकं लोकमवापुरग्र्यम् ॥ 2

213 पादावनि! प्रत्ययितो हनूमान् सीतामिव त्वां चिरविप्रयुक्ताम् ।
प्रणम्य पौलस्त्यरिपोरुदन्तं विज्ञापयामास विनीतवेषः ॥ 3

214 तवाभिषेकान्मणिपादरक्षे! मूले निषेकादिव वृद्धियोग्यात् ।
जहुस्तदैव त्रिदशाङ्गनानां प्रम्लानतां पत्रलताङ्कुराणि ॥ 4

215 सर्वतस्त्वदभिषेकवासरे सम्यगुद्धृतसमस्तकण्टके ।
राघवस्य विपिनेषु पादुके! यत्रकामगमता व्यवस्थिता ॥ 5

216 किं चतुर्दशभिरेव वत्सरैर्नित्यमेव मणिपादुके! युवाम् ।
पादयोस्त्रिभुवनाधिराजयोर्यौवराज्यमधिगच्छतं स्वयम् ॥ 6

217 रामस्य राक्षसवधत्वरितस्य काले पादावनि! प्रकटयन्निव पार्ष्णिगुप्तिम् ।
आचित्रकूटमधिगम्य शशंस वार्तामव्याहतत्वदभिषेकमृदङ्गनादः ॥ 7

218 भद्राणि देवि! जगतां प्रतिपादयिष्यन् प्रागेव येन भवतीं भरतोऽभ्यषिञ्चत् ।
मन्ये कपीश्वरविभीषणयोर्यथावत् सन्तन्यते स्म तत एव किलाभिषेकः ॥ 8

219 संभिद्यमानतमसासरयूपनीतैः संवर्धितस्तव शुभैरभिषेकतोयैः ।
मन्ये बभूव जलधिर्मणिपादरक्षे! रामास्त्रपावकशिखाभिरशोषणीयः ॥ 9

220 पादावनि! त्वदभिषेचनमङ्गलार्थं भेरीशतं भृशमताड्यत यत्प्रतीतैः ।
आकर्ण्य तस्य सहसा तुमुलं निनादं लङ्काकवाटनयनानि निमीलितानि ॥ 10

221 तापोद्गमस्त्वदभिषेकजलप्रवाहैः उत्सारितस्त्वरितमुत्तरकोसलेभ्यः ।
लेभे चिराय रघुपुङ्गवपादरक्षे! लङ्कावरोधसुदृशां हृदयेषु वासम् ॥ 11

222 आवर्जितं विधिविदा मणिपादरक्षे! पद्मासनप्रियसुतेन पुरोहितेन ।
आसीन्निदानमभिषेकजलं त्वदीयं नक्तञ्चरप्रणयिनीनयनोदकानाम् ॥ 12

223 देवि! त्वया स्नपनसंपदि संश्रितायां दग्धे पुरे दशमुखस्य वलीमुखेन ।
आसीत् ततः प्रभृति विश्वजनप्रतीतमद्भ्योऽग्निरित्यवितथं वचनं मुनीनाम् ॥ 13

224 आयोध्यकैस्त्वदभिषेकसमिद्धहर्षैराध्मापिताः श्रुतिसुखं ननु ते तदानीम् ।
रामस्य राक्षसशिरोलवनेऽप्यशाम्यन् येषां ध्वनिर्विजयशङ्खरवो बभूव ॥ 14

225 प्रथयितुमभिषेकं पादुके! तावकीनं दुरितशमनदक्षे दुन्दुभौ ताड्यमाने ।
सपदि परिगृहीतं साध्वसं देवि! नूनं दशवदनवधूनां दक्षिणैर्नेत्रकोशैः ॥ 15

226 रघुपतिपदरक्षे! रत्नपीठे यदा त्वामखिलभुवनमान्यामभ्यषिञ्चद्वसिष्ठः
दशमुखमहिषीभिर्देवि! बाष्पायिताभिः स्तनयुगमभिषेक्तुं तत्क्षणादन्वमंस्थाः ॥ 16

227 रामास्त्राणि निमित्तमात्रमिह ते लब्धाभिषेका स्वयं
रक्षस्तत् क्षपयाञ्चकार भवती भद्रासनस्थायिनी ।
यद्दोष्णामतिवेलदर्पदवथुज्वालोष्मळानां तदा
निष्पिष्टैः कलधौतशैलशिखरैः कर्पूरचूर्णायितम् ॥ 17

228 श्रुत्वैवं हनुमन्मुखाद्रघुपतेः प्रत्यागतिं तत्क्षणा-
दासीदद्भरतानुवर्तनवशादारूढकुम्भस्थलाम् ।
कालोन्निद्रकदुष्णदानमदिरामाद्यद्द्विरेफध्वनि-
श्लाघाचाटुभिरस्तुतेव भवतीं शत्रुञ्जयः कुञ्जरः ॥ 18

229 प्रत्यागतस्य भवतीमवलोक्य भर्तुः पादारविन्दसविधे भरतोपनीताम् ।
पूर्वाभिषेकविभवाभ्युचितां सपर्यां मध्ये सतामकृत मैथिलराजकन्या ॥ 19

230 सम्प्रेक्ष्य मैथिलसुता मणिपादरक्षे!
प्रत्युद्गतस्य भवतीं भरतस्य मौळौ ।
निर्दिश्य सा निभृतमञ्जलिना पुरस्तात्
तारादिकाः प्रियसखीरशिषत् प्रणन्तुम् ॥ 20

231 तुल्येऽपि देवि! रघुवीरपदाश्रयत्वे पूर्वाभिषेकमधिगम्य गरीयसी त्वम् ।
तेनैव खल्वभजतां मणिपादरक्षे! रक्षःप्लवङ्गमपती भवतीं स्वमूर्ध्ना ॥ 21

232 निर्वृत्तराक्षसचमूमृगयाविहारो रङ्गेश्वरः स खलु राघववंशगोप्ता ।
वंशक्रमादुपनतं पदमाददानो मान्यं पुनस्त्वयि पदं निदधे स्वकीयम् ॥ 22

233 तत्तादृशोश्चरणयोः प्रणिपत्य भर्तुः पौरास्त्वया विधृतयोः प्रतिपन्नसत्त्वाः ।
प्राप्ताभिषेकविभवामपि पादुके! त्वामानन्दबाष्पसलिलैः पुनरभ्यषिञ्चन् ॥ 23

234 मातः! त्वयैव समये विषमेऽपि सम्यक् राजन्वतीं वसुमतीमवलोक्य रामः ।
सञ्जीवनाय भरतस्य समग्रभक्तेः सत्यप्रतिश्रवतयैव चकार राज्यम् ॥ 24

235 पादावनि! प्रतिगतस्य पुरीमयोध्यां पौलस्त्यहन्तुरभिषेकजलार्द्रमूर्तेः ।
अंसे यथार्हमधिवास्य निजैर्यशोभिः कस्तूरिकेव निहिता वसुधा त्वयैव ॥ 25

236 याऽसौ चतुर्दश समाः पतिविप्रयुक्ता विश्वम्भरा भगवती विधृता भवत्या ।
विन्यस्य तां रघुपतेर्भुजशैलशृङ्गे भूयोऽपि तेन सहितां भवती बभार ॥ 26

237 निस्तीर्णदुःखजलधेरनघस्य देवि! त्वत्सम्प्रयुक्तरघुनाथपदान्वयेन ।
सद्यः सनन्दनमुखैरपि दुर्निरीक्षा साम्राज्यसम्पदपरा भरतस्य जज्ञे ॥ 27

238 निर्गत्य देवि! भरताञ्जलिपद्ममध्याद् भूयः समागतवती पुरुषोत्तमेन ।
पद्मेव भद्रमखिलं मणिपादरक्षे! प्रादुश्चकार भवती जगतां त्रयाणाम् ॥ 28

239 रघुपतिमधिरोप्य स्वोचिते रत्नपीठे
प्रगुणमभजथास्त्वं पादुके! पादपीठम् ।
तदपि बहुमतिस्ते तादृशी नित्यमासीत्
क्व नु खलु महितानां कल्प्यते तारतम्यम् ॥ 29

240 अनुवृत्तरामभावः शङ्के निर्विष्टचक्रवर्तिपदाम् ।
अधुनाऽपि रङ्गनाथः सचमत्कारं पदेन भजति त्वाम् ॥ 30

इति निर्यातनापद्धतिः अष्टमी
आदितः श्लोकाः 240

॥ वैताळिकपद्धतिः नवमी ॥

241 नमस्ते पादुके पुंसां संसारार्णवसेतवे ।
यदारोहस्य वेदान्ता वन्दिवैताळिकाः स्वयम् ॥ 1

242 उचितमुपचरिष्यन् रङ्गनाथ! प्रभाते विधिशिवसनकाद्यान् बाह्यकक्ष्यानिरुद्धान् ।
चरणकमलसेवासौख्यसाम्राज्यभाजां प्रथमविहितभागां पादुकामाद्रियेथाः ॥ 2

243 पद्माजुष्टं भजतु चरणं पादुका लब्धवारा
प्रत्यासन्नास्तव परिजनाः प्रातरास्थानयोग्याः ।
अर्धोन्मेषादधिकसुभगामर्धनिद्रानुषङ्गा
नाभीपद्मे तव नयनयोर्नाथ! पश्यन्तु शोभाम् ॥ 3

244 उपनमति मुहूर्तं शेषसिद्धान्तसिद्धं तदिह चरणरक्षा रङ्गनाथ! त्वयैषा ।
मृदुपदमधिरूढा मञ्जुभिः शिञ्जितैः स्वैरुपदिशतु जनानामुत्सवारम्भवार्ताम् ॥ 4

245 रङ्गाधीश! मरुद्गणस्य मकुटादाम्नायबृन्दस्य वा
प्रत्यानीय समर्पिता विधिमुखैर्वारक्रमादागतैः
वाहारोहणसम्भृतं श्रमभरं सम्यग्विनेतुं क्षमा
लीलासञ्चरणप्रिया स्पृशतु ते पादाम्बुजं पादुका ॥ 5

246 वृत्तं क्रमेण बहुधा नियुतं विधीनामर्धं द्वितीयमिदमङ्कुरितं तवाह्नः ।
नीळासखीभिरुपनीय निवेश्यमाना मङ्क्तुं प्रभो! त्वरयते मणिपादुका त्वाम् ॥ 6

247 दिव्याप्सरोभिरुपदर्शितदीपवर्गे रङ्गाधिराज! सुभगे रजनीमुखेऽस्मिन् ।
संरक्षिणी चरणयोः सविलासवृत्ति नीराजनासनमसौ नयतु स्वयं त्वाम् ॥ 7

248 आसनादुचितमासनान्तरं रङ्गनाथ! यदि गन्तुमीहसे ।
सन्नतेन विधिना समर्पितां सप्रसादमधिरोह पादुकाम् ॥ 8

249 परिजनवनिताभिः प्रेषितः प्राञ्जलिस्त्वां प्रणमति मदनोऽयं देव! शुद्धान्तदासः ।
फणिपतिशयनीयं प्रापयित्री सलीलं पदकमलमियं ते पादुका पर्युपास्ताम् ॥ 9

250 इति निगमवन्दिवचसा समये समये गृहीतसङ्केतः ।
अभिसरति रङ्गनाथः प्रतिपदभोगाय पादुके! भवतीम् ॥ 10

इति वैताळिकपद्धतिः नवमी
आदितः श्लोकाः 250

॥ शृङ्गारपद्धतिः दशमी ॥

251 शौरेः शृङ्गारचेष्टानां प्रसूतिं पादुकां भजे ।
यामेष भुङ्क्ते शुद्धान्तात् पूर्वं पश्चादपि प्रभुः ॥ 1

252 प्रणतत्रिदशेन्द्रमौळिमालामकरन्दार्द्रपरागपङ्किलेन ।
अनुलिम्पति पादुके! स्वयं त्वामनुरूपेण पदेन रङ्गनाथः ॥ 2

253 अवदातहिमांशुकानुषक्तं पदरक्षे! त्वयि रङ्गिणः कदाचित् ।
किमपि स्थितमद्वितीयमाल्यं विरळावस्थितमौक्तिकं स्मरामि ॥ 3

254 असहायगृहीतरङ्गनाथामवरोधाङ्गणसीम्नि पादुके! त्वाम् ।
सुदृशः स्वयमर्चयन्ति दूरादवतंसोत्पलवासितैरपाङ्गैः ॥ 4

255 निर्विश्यमानमपि नूतनसन्निवेशं कैवल्यकल्पितविभूषणकायकान्तिम् ।
कालेषु निर्विशसि रङ्गयुवानमेका शृङ्गारनित्यरसिकं मणिपादरक्षे! ॥ 5

256 निद्रायितस्य कमितुर्मणिपादुके! त्वं पर्यङ्किकापरिसरं प्रतिपद्यमाना ।
श्वासानिलप्रचलितेन भजस्यभीक्ष्णं नाभीसरोजरजसा नवमङ्गरागम् ॥ 6

257 शयितवति रजन्यां पादुके! रङ्गबन्धौ चरणकमलपार्श्वे सादरं वर्तसे त्वम् ।
फणिपतिशयनीयादुत्थितस्य प्रभाते प्रथमनयनपातं पावनं प्राप्तुकामा ॥ 7

258 चरणकमलसङ्गाद्रङ्गनाथस्य नित्यं निगमपरिमळं त्वं पादुके! निर्वमन्ती ।
नियतमतिशयाना वर्तसे सावरोधं हृदयमधिवसन्तीं मालिकां वैजयन्तीम् ॥ 8

259 उपनिषदबलाभिर्नित्यमुत्तंसनीयं किमपि जलधिकन्याहस्तसंवाहनार्हम् ।
तव तु चरणरक्षे! देवि लीलारविन्दं चरणसरसिजं तच्चारु चाणूरहन्तुः ॥ 9

260 अखिलान्तःपुरवारेष्वनेकवारं पदावनि! स्वैरम् ।
अनुभवति रङ्गनाथो विहारविक्रान्तिसहचरीं भवतीम् ॥ 10

इति शृङ्गार पद्धतिः दशमी

आदितः श्लोकाः 260

श्री पादुकासहस्रम्–सञ्चारपद्धतिः

॥ सञ्चारपद्धतिः एकादशी ॥

261 अग्रतस्ते गमिष्यामि मृद्नन्ती कुशकण्टकान् ।
इति सीताऽपि यद्वृत्तिमियेष प्रणमामि ताम् ॥ 1

262 शरदः शतमम्ब! पादुके! स्यां समयाहूतपितामहस्तुतानि ।
मणिमण्टपिकासु रङ्गभर्तुः त्वदधीनानि गतागतानि पश्यन् ॥ 2

263 त्वदधीनपरिक्रमो मुकुन्दः तदधीनस्तव पादुके! विहारः ।
इतरेतरपारतन्त्र्यमित्थं युवयोः सिद्धमनन्यतन्त्रभूम्नोः ॥ 3

264 रजसा तमसा च दुष्टसत्वे गहने चेतसि मामके मुकुन्दः ।
उचितं मृगयाविहारमिच्छन् भवतीमादृत पादुके! पदाभ्याम् ॥ 4

265 क्षमया जगतामपि त्रयाणां अवने देवि! पदावनि! त्वयैव ।
अभिगम्यतमोऽपि संश्रितानामभिगन्ता भवति स्वयं मुकुन्दः ॥ 5

266 शिरसा भवतीं दधाति कश्चित् विधृतः कोऽपि पदस्पृशा भवत्या ।
उभयोर्मधुवैरिपादरक्षे! त्वदधीनां गतिमामनन्ति सन्तः ॥ 6

267 स्पृशतः शिरसा पदेन च त्वां गतिमुद्दिश्य मुकुन्दपादुके! द्वौ ।
अवरोहति पश्चिमः पदात् स्वादधिरोहत्यनघस्तदेव पूर्वः ॥ 7

268 समयेष्वपदिश्य जैत्रयात्रां विविधान्तःपुरवागुराव्यतीतः ।
नियतं मणिपादुके! भवत्या रमते वर्त्मनि रङ्गसार्वभौमः ॥ 8

269 निजसंहननप्रसक्तलास्यं चरति त्वामधिरुह्य रङ्गनाथः ।
पदरक्षिणि! पावनत्वमास्तां रसिकास्वादमतः परं न विद्मः ॥ 9

270 पदयोरनयोः परस्य पुंसः त्वदनुग्राह्यविहारपद्धतेर्वा ।
शिरसो मणिपादुके! श्रुतीनां मनसो वा मम भूषणं त्वमेका ॥ 10

271 कृपया मधुवैरिपादरक्षे! कठिने चेतसि मामके विहर्तुम् ।
मकुटेषु दिवौकसां विधत्ते भवती रत्नविसंस्थुलेषु योग्यम् ॥ 11

272 चरणद्वयमर्भकस्य शौरेः शरदम्भोरुहचातुरीधुरीणम् ।
शकटासुरताडनेऽपि गुप्तं तव शक्त्या किल पादुके! तदासीत् ॥ 12

273 उत्तस्थुषो रङ्गशयस्य शेषादास्थानसिंहासनमारुरुक्षोः ।
मध्येनिशान्तं मणिपादुके! त्वां लीलापदन्याससखीं प्रपद्ये ॥ 13

274 प्राप्ताधिकाराः पतयः प्रजानामुत्तंसितामुत्तमपादुके! त्वाम् ।
रङ्गेशितुः स्वैरविहारकाले संयोजयन्त्यङ्घ्रिसरोजयुग्मे ॥ 14

275 त्वयाऽनुबद्धां मणिपादरक्षे लीलागतिं रङ्गशयस्य पुंसः ।
निशामयन्तो न पुनर्भजन्ते संसारकान्तारगतागतानि ॥ 15

276 व्यूहानुपूर्वीरुचिरान् विहारान् पदक्रमेण प्रतिपद्यमाना ।
बिभर्षि नित्यं मणिपादुके! त्वं मुरद्विषो मूर्तिरिव त्रिलोकीम् ॥ 16

277 पदेषु मन्देषु महत्स्वपि त्वं नीरन्ध्रसंश्लेषवती मुरारेः ।
प्रत्यायनार्थं किल पादुके! नः स्वाभाविकं दर्शयसि प्रभावम् ॥ 17

278 कृपाविशेषात् क्षमया समेतां प्रवर्तमानां जगतो विभूत्यै ।
अवैमि नित्यं मणिपादुके! त्वामाकस्मिकीं रङ्गपतेः प्रसत्तिम् ॥ 18

279 उपागतानामुपतापशान्त्यै सुखावगाहां गतिमुद्वहन्तीम् ।
पश्यन्ति शौरेः पदवाहिनीं त्वां निम्नेषु तुङ्गेषु च निर्विशेषाम् ॥ 19

280 सह प्रयाता सततं प्रयाणे प्राप्तासने संश्रितपादपीठा ।
अलङ्घनीया सहजेन भूम्ना छायेव शौरेर्मणिपादुके! त्वम् ॥ 20

281 पदस्पृशा रङ्गपतिर्भवत्या विचक्रमे विश्वमिदं क्षणेन ।
तदस्य मन्ये मणिपादरक्षे! त्वयैव विख्यातमुरुक्रमत्वम् ॥ 21

282 सञ्चारयन्ती पदमन्वतिष्ठः सहायकृत्यं मणिपादरक्षे! ।
मातस्त्वमेका मनुवंशगोप्तुर्गोपायतो गौतमधर्मदारान् ॥ 22

283 त्वत्तस्त्रिविष्टपचरानसपत्नयिष्यन्नारुह्य तार्क्ष्यमवरुह्य च तत्क्षणेन ।
शुद्धान्तभूमिषु पुनर्मणिपादरक्षे! विश्राम्यति त्वयि विहारवशेन शौरिः ॥ 23

284 विक्रम्य भूमिमखिलां बलिना प्रदिष्टां देवे पदावनि! दिवं परिमातुकामे ।
आसीदतो दिनकरस्य करोपतापात् संरक्षितुं पदसरोजमुपर्यभूस्त्वम् ॥ 24

285 त्वत्सङ्गमान्ननु सकृद्विधिसम्प्रयुक्ता शुद्धिं परामधिजगाम शिवत्वहेतुम् ।
रङ्गाधिराजपदरक्षिणि! कीदृशी सा गङ्गा बभूव भवदीयगतागतेन ॥ 25

286 वृद्धिं गवां जनयितुं भजता विहारान् कृष्णेन रङ्गरसिकेन कृताश्रयायाः ।
सञ्चारतस्तव तदा मणिपादरक्षे! बृन्दावनं सपदि नन्दनतुल्यमासीत् ॥ 26

287 मातः! त्रयीमयतया चरणप्रमाणे द्वे विक्रमेषु विविधेषु सहायभूते ।
नाथस्य साधुपरिरक्षणकर्मणि त्वं दुष्कृद्विनाशनदशासु विहङ्गराजः ॥ 27

288 पादावनि! क्वचन विक्रमणे भुजानां पञ्चायुधी कररुहैर्भजते विकल्पम् ।
नित्यं त्वमेव नियता पदयोर्मुरारेः तेनासि नूनमविकल्पसमाधियोग्या ॥ 28

289 अक्षेत्रविद्भिरधिगन्तुमशक्यवृत्तिर्मातस्त्वया निरवधिर्निधिरप्रमेयः ।
रथ्यान्तरेषु चरणावनि! रङ्गसङ्गी वात्सल्यनिघ्नमनसा जनसात्कृतोऽसौ ॥ 29

290 सम्पद्यते समुचितं क्रममाश्रयन्त्या सद्वर्त्मना भगवतोऽपि गतिर्भवत्या ।
ईष्टे पदावनि! पुनः क इवेतरेषां व्यावर्तनस्य विषमादपथप्रचारात् ॥ 30

291 रङ्गेश्वरेण सह लास्यविशेषभाजो लीलोचितेषु तव रत्नशिलातलेषु ।
मध्ये स्थितानि कतिचिन्मणिपादरक्षे! सभ्यान् विशेषमनुयोक्तुमिति प्रतीमः ॥ 31

292 नित्यं! पदावनि निवेश्य पदं भवत्यां निस्स्पन्दकल्पपरिमेयपरिच्छदानि ।
शृङ्गारशीतळतराणि भवन्ति काले रङ्गेश्वरस्य लळितानि गतागतानि ॥ 32

293 भोगार्चनानि कृतिभिः परिकल्पितानि प्रीत्यैव रङ्गनृपतिः प्रतिपद्यमानः ।
पश्यत्सु नित्यमितरेषु परिच्छदेषु प्रत्यासनं भजति काञ्चनपादुके! त्वाम् ॥ 33

294 अन्तस्तृतीयनयनैः स्वयमुत्तमाङ्गैराविर्भाविष्यदतिरिक्तमुखाम्बुजैर्वा ।
न्यस्यन्ति रङ्गरसिकस्य विहारकाले वारक्रमेण कृतिनो मणिपादुके! त्वाम् ॥ 34

295 रङ्गेश्वरे समधिरूढविहङ्गराजे मातङ्गराजविधृतां मणिपादुके! त्वाम् ।
अन्वासते विधृतचारुसितातपत्राः स्वर्गौकसः सुभगचामरलोलहस्ताः ॥ 35

296 विष्णोः पदं गतिवशादपरित्यजन्तीं लोकेषु नित्यविषमेषु समप्रचाराम् ।
अन्वेतुमर्हति धृतामखिलैः सुरेन्द्रैः गङ्गा कथं नु गरुडध्वजपादुके! त्वाम् ॥ 36

297 भिक्षामपेक्ष्य दनुजेन्द्रगृहं प्रयातुः गुप्त्यै गवां विहरतो वहतश्च दूत्यम् ।
तत्तादृशानि चरणावनि! रङ्गभर्तुः त्वत्सङ्गमेन सुभगानि विचेष्टितानि ॥ 37

298 निर्व्यज्यमाननवताळलयप्रथिम्ना निर्यन्त्रणेन निजसञ्चरणक्रमेण ।
मृद्नासि रङ्गनृपतेर्मणिपादुके! त्वं दुःखात्मकान् प्रणमतां दुरितप्ररोहान् ॥ 38

299 नित्यं य एव जगतो मणिपादरक्षे! सत्तास्थितिप्रयतनेषु परं निदानम् ।
सोऽपिस्वतन्त्रचरितस्त्वदधीनवृत्तिः का वा कथा तदितरेषु मितम्पचेषु ॥ 39

300 निर्विष्टनागशयनेन परेण पुंसा न्यस्ते पदे त्वयि पदावनि! लोकहेतोः ।
स्वर्गौकसां त्वदनुधावनतत्पराणां सद्यः पदानि विपदामपदं भवन्ति ॥ 40

301 शरदुपगमकाले सन्त्यजन् योगनिद्रां
शरणमुपगतानां त्राणहेतोः प्रयास्यन् ।
जलधिदुहितुरङ्कान्मन्दमादाय देवि!
त्वयि खलु निदधाति स्वं पदं रङ्गनाथः ॥ 41

302 स्पृशसि पदसरोजं पादुके! निर्विघातं
प्रविशसि च समस्तां देवि! शुद्धान्तकक्ष्याम् ।
अपरमपि मुरारेः पूर्वमाभीरकन्या-
स्वभिसरणविधीनामग्रिमा साक्षिणी त्वम् ॥ 42

303 प्रतिभवनमनन्ये पादुके! त्वत्प्रभावात् विविधवपुषि देवे विभ्रमद्यूतकाले ।
अभिलषितसपत्नीगेहयात्राविघातं ग्लहयति रहसि त्वां षोडशस्त्रीसहस्रम् ॥ 43

304 तटभुवि यमुनायाश्छन्नवृत्तौ मुकुन्दे मुहुरधिगमहेतोर्मुह्यतां यौवतानाम् ।
शमयितुमलमासीच्छङ्खचक्रादिचिह्ना प्रतिपदविचिकित्सां पादुके! पद्धतिस्ते ॥ 44

305 अधिगतबहुशाखान् मञ्जुवाचः शुकादीन्
सरसिजनिलयायाः प्रीतये सङ्ग्रहीतुम् ।
प्रकटितगुणजालं पादुके! रङ्गबन्धोः
उपनिषदटवीषु क्रीडितं त्वत्सनाथम् ॥ 45

306 मुनिपरिषदि गीतं गौतमीरक्षणं ते मुहुरनुकलयन्तो मञ्जुवाचः शकुन्ताः ।
उषसि निजकुलायादुत्थिता दण्डकेषु स्वयमपि पदरक्षे! स्वैरमाम्रेडयन्ति ॥ 46

307 यमनियमविशुद्धैर्यन्न पश्यन्ति चित्तैः श्रुतिषु चुळकमात्रं दृश्यते यस्य भूमा ।
सुलभनिखिलभाव मांसदृष्टेर्जनस्य स्वयमुपहरसि त्वं पादुके! तं पुमांसम् ॥ 47

308 निधिमिव निरपायं त्वामनादृत्य मोहादहमिव मम दोषं भावयन् क्षुद्रमर्थम् ।
मयि सति करुणायाः पूर्णपात्रे त्वया किं परमुपगमनीयः पादुके! रङ्गनाथः ॥ 48

309 कमपि कनकसिन्धोः सैकते सञ्चरन्तं कलशजलधिकन्यामेदिनीदत्तहस्तम् ।
अनिशमनुभवेयं पादुके! त्वय्यधीनं सुचरितपरिपाकं सूरिभिः सेवनीयम् ॥ 49

310 परिसरमुपयाता पादुके! पश्य मातः!
करणविलयखेदात् कान्दिशीके विवेके ।
पुरुषमुपनयन्ती पुण्डरीकाक्षमग्रे
पुनरुदरनिवासक्लेशविच्छेदनं नः ॥ 50

311 सा मे भूयात् सपदि भवती पादुके! तापशान्त्यै
यामारुढो दिवमिव शुभैः सेव्यमानो मरुद्भिः ।
सौदामिन्या सह कमलया सह्यजावृद्धिहेतुः
काले काले चरति करुणावर्षुकः कृष्णमेघः ॥ 51

312 सत्याल्लोकात् सकलमहितात् स्थानतो वा रघूणां
शङ्के मातः! समधिकगुणं सैकतं सह्यजायाः ।
पूर्वं पूर्वं चिरपरिचितं पादुके! यत् त्यजन्त्या
नीतो नाथस्तदिदमितरन्नीयते न त्वयाऽसौ ॥ 52

313 अग्रे देवि! त्वयि सुमनसामग्रिमैरन्तरङ्गैः
विन्यस्तायां विनयगरिमावर्जितादुत्तमाङ्गात् ।
दत्ते पादं दरमुकुळितं त्वत्प्रभावातिशङ्की
देवः श्रीमान् दनुजमथनो जैत्रयात्रास्वनन्यः ॥ 53

314 पौरोदन्तान् परिकलयितुं पादुके! सञ्चरिष्णोः
व्यक्ताव्यक्ता वशिकविशिखावर्तनी रङ्गभर्तुः ।
वेलातीतश्रुतिपरिमळैर्व्यक्तिमभ्येति काल्ये
विन्यासैस्ते विबुधपरिषन्मौळिविन्यासदृश्यैः ॥ 54

315 आसंस्कारात् द्विजपरिषदा नित्यमभ्यस्यमाना
श्रेयोहेतुः शिरसि जगतः स्थायिनी स्वेन भूम्ना ।
रङ्गाधीशे स्वयमुदयिनि क्षेप्तुमन्धं तमिस्रं
गायत्रीव त्रिचतुरपदा गण्यसे पादुके! त्वम् ॥ 55

316 भवतीं परस्य पुरुषस्य रङ्गिणो महिमानमेव मणिपादु! मन्महे ।
कथमन्यथा स्वमहिमप्रतिष्ठितः प्रतितिष्ठति त्वयि पदात्पदं प्रभुः ॥ 56

317 तिथिरष्टमी यदवतारवैभवात् प्रथमा तिथिस्त्रिजगतामजायत ।
मणिपादुके! तमुपनीय वीथिकास्वतिथीकरोषि तदनन्यचक्षुषाम् ॥ 57

318 अपारप्रख्यातेरशरणशरण्यत्वयशसा
ननु त्वं रङ्गेन्दोश्चरणकमलस्यापि शरणम् ।
यया लभ्यः पङ्गुप्रभृतिभिरसौ रङ्गनगर
प्रतोळीपर्यन्ते निधिरनघवाचां निरवधिः ॥ 58

319 तत्तद्वासगृहाङ्गणप्रणयिनः श्रीरङ्गशृङ्गारिणो
वाल्लभ्यादविभक्तमन्थरगतिस्त्वं मे गतिः पादुके! ।
लीलापङ्कजहल्लकोत्पलगळन्माध्वीकसेकोत्थिता
यत्रामोदविकल्पना विवृणुते शुद्धान्तवारक्रमम् ॥ 59

320 सम्भवतु पादरक्षे! सत्यसुपर्णादिरौपवाह्यगणः ।
यात्रासु रङ्गभर्तुः प्रथमपरिस्पन्दकारणं भवती ॥ 60

इति सञ्चारपद्धतिः एकादशी

आदितःश्लोकाः 320

॥ पुष्पपद्धतिः द्वादशी ॥

321 शौरेः सञ्चारकालेषु पुष्पवृष्टिर्दिवश्च्युता ।
पर्यवस्यति यत्रैव प्रपद्ये तां पदावनीम् ॥ 1

322 दैवतं मम जगत्त्रयार्चिता दिव्यदम्पतिविहारपादुका ।
पाणिपादकमलार्पणात् तयोर्या भजत्यनुदिनं सभाजनम् ॥ 2

323 तव रङ्गराजमणिपादुका! ततो विहितार्हणः सुरसरित्पयसा ।
अवतंसचन्द्रकलया गिरिशो नवकेतकीदळमिवार्पयति ॥ 3

324 कुसुमेषु समर्पितेषु भक्तैः त्वयि रङ्गेशपदावनि! प्रतीमः ।
शठकोपमुनेस्त्वदेकनाम्नः सुभगं यत् सुरभित्वमस्य नित्यम् ॥ 4

325 पदे परस्मिन् भुवने विधातुः पुण्यैः प्रसूनैः पुळिने सरय्वाः ।
मध्ये च पादावनि! सह्यसिन्धोरासीच्चतुः स्थानमिवार्चनं ते ॥ 5

326 तवैव रङ्गेश्वरपादरक्षे! सौभाग्यमव्याहतमाप्तुकामाः ।
सुरद्रुमाणा प्रसवैः सुजातैरभ्यर्चयन्त्यप्सरसो मुहुस्त्वाम् ॥ 6

327 निवेशितां रङ्गपतेः पदाब्जे मन्ये सपर्यां मणिपादरक्षे! ।
त्वदर्पणादापतितामपश्यत् गाण्डीवधन्वा गिरिशोत्तमाङ्गे ॥ 7

328 पत्राणि रङ्गनृपतेर्मणिपादरक्षे! द्वित्राण्यपिं त्वयि समर्प्य विभूतिकामाः ।
पर्यायलब्धपुरुहूतपदाःशचीनां पत्राङ्कुराणि विलिखन्ति पयोधरेषु ॥ 8

329 निर्वर्तयन्ति तव ये निचितानि पुष्पैः वैहारिकाण्युपवनानि वसुन्धरायाम् ।
कालेन ते कमललोचनपादरक्षे! क्रीडन्ति नन्दनवने कृतिनः पुमासः ॥ 9

330 अर्चन्ति ये मधुभिदो मणिपादरक्षे! भावात्मकैरपि परं भवतीं प्रसूनैः ।
मन्दारदामसुभगैर्मकुटैरजस्रं बृन्दारकाः सुरभयन्ति पदं तदीयम् ॥ 10

331 अस्पृष्टदोषपरिमर्शमलङ्घ्यमन्यैः हस्तापचेयमखिलं पुरुषार्थवर्गम् ।
चित्रं जनार्दनपदावनि! साधकानां त्वय्यर्पिताः सुमनसः सहसा फलन्ति ॥ 11

332 वन्दारुभिः सुरगणैस्त्वयि सम्प्रयुक्ता माला विभाति मधुसूदनपादरक्षे! ।
विक्रान्तविष्णुपदसंश्रयबद्धसख्या भागीरथीव परिरम्भणकांक्षिणी ते ॥ 12

333 ये नाम रङ्गनृपतेर्मणिपादुके! त्वां अभ्यर्चयन्ति कमलैरधिकर्तुकामाः ।
आरोपयत्यवहिता नियतिः क्रमात्तान् कल्पान्तरीयकमलासनपत्रिकासु ॥ 13

334 त्वय्यर्पितानि मनुजैर्मणिपादरक्षे! दूर्वाङ्कुराणि सुलभान्यथवा तुळस्यः ।
सारधिकाः सपदि रङ्गनरेन्द्रशक्त्या संसारनागदमनौषधयो भवन्ति ॥ 14

335 आराध्य नून मसुरार्दनपादुके! त्वामामुष्मिकाय विभावाय सहस्रपत्रैः ।
मन्वन्तरेषु परिवर्तिषु देवि! मर्त्याः पर्यायतः परिणमन्ति सहस्रनेत्राः ॥ 15

336 धन्यैस्त्वयि त्रिदशरक्षकपादरक्षे! पुष्पाणि काञ्चनमयानि समर्पितानि ।
विस्रंसिना विनमतो गिरिशोत्तमाङ्गादारग्वधेन मिळितान्यपृथग्भवन्ति ॥ 16

337 विश्वोपसर्गशमनं त्वयि मन्यमानैः वैमानिकैः प्रणिहितं मणिपादरक्षे! ।
पद्मासहायपदपद्मनखार्चिषस्ते पुष्पोपहारविभवं पुनरुक्तयन्ति ॥ 17

338 नाकौकसां शमयितुं परिपन्थिवर्गान् नाथे पदं त्वयि निवेशयितुं प्रवृत्ते ।
त्वत्संश्रिता विजहतस्तुळसीं वमन्ति प्रस्थानकाहळरवान् प्रथमं द्विरेफाः ॥ 18

339 रङ्गेशपादपरिभोगसुजातगन्धां संप्राप्य देवि! भवतीं सह दिव्यपुष्पैः ।
नित्योपदर्शितरसं न किलाद्रियन्ते नाभीसरोजमपि नन्दनचञ्चरीकाः ॥ 19

340 प्रागेव काञ्चनपदावनि! पुष्पवर्षात् संवर्तिते शमितदैत्यभयैः सुरेन्द्रैः ।
पद्मेक्षणस्य पदपद्मनिवेशलाभे पुष्पाभिषेकमुचितं प्रतिपद्यसे त्वम् ॥ 20

341 दिशिदिशि मुनिपत्न्यो दण्डकारण्यभागे न जहति बहुमानान्नूनमद्यापि मूलम् ।
रघुपतिपदरक्षे! त्वत्परिष्कारहेतोरपचितकुसुमानामाश्रमानोकहानाम् ॥ 21

342 घटयसि परिपूर्णान् कृष्णमेघप्रचारे कृतिभिरुपहृतैस्त्वं केतकीगर्भपत्रैः ।
वरतनुपरिणामाद्वामतः श्यामळानां प्रणतिसमयलग्नान् पादुके! मौळिचन्द्रान् ॥ 22

343 परिचरणनियुक्तैः पादुके! रङ्गभर्तुः
पवनतनयमुख्यैरर्पितां त्वत्समीपे ।
विनतविधिमुखेभ्यो निर्विशेषा द्विरेफाः
कथमपि विभजन्ते काञ्चनीं पद्मपङ्क्तिम् ॥ 23

344 विधिशिवपुरुहूतस्पर्शितैर्दिव्यपुष्पैः त्वयि सह निपतन्तस्तत्तदुद्यानभृङ्गाः ।
मधुरिपुपदरक्षे! मञ्जुभिः स्वैर्निनादैरविदितपरमार्थान् नूनमध्यापयन्ति ॥ 24

345 प्रशमयति जनानां सञ्ज्वरं रङ्गभर्तुः परिसरचलितानां पादुके! चामराणाम् ।
अनुदिनमुपयातैरुत्थितं दिव्यपुष्पैः निगमपरिमळं ते निर्विशन् गन्धवाहः ॥ 25

346 अखिलभुवनरक्षानाटिकां दर्शयिष्यन् अनिमिषतरुपुष्पैरर्चिते रङ्गमध्ये ।
अभिनयमनुरूपं शिक्षयत्यात्मना त्वां प्रथमविहितलास्यः पादुके! रङ्गनाथः ॥ 26

347 अगळितनिजरागा देवि! विष्णोः पदं तत्
त्रिभुवनमहनीया प्राप्य सन्ध्यामिव त्वाम् ।
भवति विबुधमुक्तैः स्पष्टतारानुषङ्गा
परिसरपतितैस्ते पारिजातप्रसूनैः ॥ 27

348 व्यञ्जन्त्येते विभवमनघं रञ्जयन्तः श्रुतीर्नः
प्राध्वं रङ्गक्षितिपतिपदं पादुके! धारयन्त्याः ।
नादैरन्तर्निहितनिगमैर्नन्दनोद्यानभृङ्गाः
दिव्यैः पुष्पैः स्नपितवपुषो देवि! सौस्नातिकास्ते ॥ 28

349 किं पुष्पैस्तुळसीदळैरपि कृतं दूर्वाऽपि दूरे स्थिता
त्वत्पूजासु मुकुन्दपादु! कृपया त्वं कामधेनुः सताम् ।
प्रत्यग्राहृतदर्भपल्लवलवग्रासाभिलाषोन्मुखी
धेनुस्तिष्ठतु सा वसिष्ठभवनद्वारोपकण्ठस्थले ॥ 29

350 चूडारग्वधरजसा चूर्णस्नपनं विधाय ते पूर्वम् ।
रङ्गेशपादुके! त्वामभिषिञ्चति मौळिगङ्गया शम्भुः ॥ 30

इति पुष्पपद्धतिः द्वादशी
आदितः श्लोकाः 350

॥ परागपद्धतिः त्रयोदशी ॥

351 पान्तु वः पद्मनाभस्य पादुकाकेळिपांसवः ।
अहल्यादेहनिर्माणपर्यायपरमाणवः ॥ 1

352 तव सञ्चरणाद्रजो विधूतं यदिदं रङ्गनरेन्द्रपादरक्षे! ।
अलमेतदनाविलानि कर्तुं कतकक्षोद इवाशु मानसानि ॥ 2

353 पुनरुक्तपितामहानुभावाः पुरुषाः केचिदमी पुनन्ति विश्वम् ।
मधुवैरिपदारविन्दबन्धोरपरागास्तव पादुके! परागैः ॥ 3

354 अभियुक्तजनो निजार्भकाणां बहुशो रङ्गनरेन्द्रपादरक्षे! ।
अवलेपपिशाचमोचनार्थं रजसा लिम्पति तावकेन देहान् ॥ 4

355 शिरसा परिगृह्य लोकपालास्तव रङ्गेश्वरपादुके! रजांसि ।
विषमेषु बलेषु दानवानां व्यपनीतान्यशिरस्त्रमाविशन्ति ॥ 5

356 कृतिनः शिरसा समुद्वहन्तः कतिचित् केशवपादुके! रजस्ते ।
रजसस्तमसोऽपि दूरभूतं परिपश्यन्ति विशुद्धमेव सत्त्वम् ॥ 6

357 अधिकं पदमाश्रितोऽपि वेधाः प्रयतो रङ्गधुरीणपादरक्षे!
अभिवाञ्छति सङ्गमं परागैरभिजातैस्तव देवि! नाभिजातः ॥ 7

358 शुद्धसत्त्ववपुषैव भवत्या पादुके! विरजसौ हरिपादौ ।
अस्तु किं पुनरिदं रजसा ते शुद्धसत्त्वमयता मनुजानाम् ॥ 8

359 तद्रजस्तव तनोति पादुके! मानसान्यकठिनानि देहिनाम् ।
प्रस्तरस्य पदवीगतस्य यत् व्याचकार 'मुनिधर्मदारताम् ॥ 9

360 रङ्गेशयस्य पुरुषस्य जगद्विभूत्यै रथ्यापरिक्रमविधौ मणिपादरक्षे! ।
सीमन्तदेशमनवद्यसरस्वतीनां सिन्दूरयन्ति भवतीचरिताः परागाः ॥ 10

361 मान्येन रङ्गनृपतेर्मणिपादरक्षे! चूडापदानि रजसा तव भूषयन्तः ।
कालक्रमेण भजतां कमलासनत्वं नाभीसरोजरजसां निवसन्ति मध्ये ॥ 11

362 मातर्मुकुन्दचरणावनि! तावकीनाः चिन्तावशीकरणचूर्णविशेषकल्पाः ।
सञ्चारपांसुकणिकाः शिरसा वहन्तो विश्वं पुनन्ति पदपद्मपरागलेशैः ॥ 12

363 आयोजितान्यमलधीभिरनन्यलभ्ये पादावनि! श्रुतिवधूपटवासकृत्ये ।
त्वत्सञ्चरप्रचलितानि रजांसि शौरेः प्रख्यापयन्ति पदपद्मपरागशोभाम् ॥ 13

364 मूर्धानमम्ब! मुरभिन्मणिपादरक्षे! येषां कदाऽपि रजसा भवती पुनाति ।
त्वामेव ते सुकृतिनः स्नपयन्ति काले मन्दारदामरजसा मकुटच्युतेन ॥ 14

365 रथ्याविहाररजसा परिधूसराङ्गीं रङ्गेश्वरस्य लळितेषु महोत्सवेषु ।
प्रस्फोटयत्यवनते मणिपादुके! त्वां गौरीपतिः स्वयमिभाजिनपल्लवेन ॥ 15

366 नेदीयसा निजपरागनिवेशपूर्वं स्पृष्ट्वा शिरांसि भवतीभवरोगभाजाम् ।
गाढं निपीड्य गरुडध्वजपादरक्षे! मानग्रहं शमयतीव परैरसाध्यम् ॥ 16

367 आपातवल्लवतनोरकुमारयूनः पादावनि! प्रविशतो यमुनानिकुञ्जान् ।
आसीदनङ्गसमरात् पुरतः प्रवृत्तः सेनापराग इव ते पदवीपरागः ॥ 17

368 गङ्गापगातटलतागृहमाश्रयन्त्याः पादावनि! प्रचलितं पदवीरजस्ते ।
प्रायेण पावनतमं प्रणतस्य शम्भोरुद्धूळनं किमपि नूतनमातनोति ॥ 18

369 अन्ते तदा त्वमविळम्बितमानयन्ती रङ्गाद्भुजङ्गशयन मणिपादरक्षे! ।
काम निवर्तयितुमर्हसि सज्वर मे कर्पूरचूर्णपटलैरिव धूलिभिस्ते ॥ 19

370 रङ्गेशपादसहधर्मचरि! त्वदीयान्
मौलौ निवेश्य महितान्पदवी परागान्
सन्तस्त्रिवर्गपदवी मतिलङ्घयन्तो
मौलौ पद विदधते विबुधेश्वराणाम् ॥ 20

371 मातस्तदा माधवपादरक्षे! त्वयि प्रसक्तं त्वरयोपयान्त्याम् ।
परामृशेयं पदवीपरागं प्राणैः प्रयाणाय समुज्जिहानैः ॥ 21

372 तथागता राघवपादरक्षे! संपश्यमानेषु तपोधनेषु ।
आसीदहल्या तवं पांसुलेशैरपांसुलाना स्वयमग्रगण्या ॥ 22

373 पश्यामि पद्मेक्षणपादरक्षे! भवाम्बुधिं पातुमिव प्रवृत्तान् ।
भक्तोपयानत्वरया भवत्याः पर्यस्यमानान् पदवीपरागान् ॥ 23

374 पञ्चायुधी भूषणमेव शौरेर्यतस्तवैते मणिपादरक्षे! ।
वितन्वते व्याप्तदिशः परागाः शान्तोदयांश्छत्रुचमूपरागान् ॥ 24

375 परिणतिमकठोरां प्राप्तया यत्प्रभावादलभत शिलया स्वान् गौतमो धर्मदारान् ।
पुनरुपजनिशङ्कावारकं पादुके! तत् प्रशमयति रजस्ते रागयोगं प्रजानाम् ॥ 25

376 रजनिविगमकाले रामगाथां पठन्तः कुशिकतनयमुख्याः पादुके! भावयन्ते ।
उपलशकलसक्तैस्त्वत्परागैरकाण्डे जनितमुनिकळत्रान् दण्डकारण्यभागान् ॥ 26

377 शुभसरणिरजोभिः शोभयन्ती धरित्रीं परिणतिरमणीयान् प्रक्षरन्ती पुमर्थान् ।
भवसि भुवनवन्द्या पादुके! रङ्गभर्तुः शरणमुपगतानां शाश्वती कामधेनुः ॥ 27

378 पवनतरळितस्ते पादुके! रङ्गभर्तुर्विहरणसमयेषु व्याप्तविश्वः परागः ।
विषमविषयवर्त्मव्याकुलानामजस्रं व्यपनयति जनानां वासनारेणुजालम् ॥ 28

379 निष्प्रत्यूहमुपासिषीमहि मुहु र्निश्शेषदोषच्छिदो
नित्यं रङ्गधुरन्धरस्य निगमस्तोमार्चिते पादुके ।
धत्ते मूर्धभिरादिपद्मजनिता तत्तादृशी सन्ततिः
यत्सञ्चारपवित्रितक्षितिरजःपङ्क्तिं चतुष्पञ्चषैः ॥ 29

380 रजसा परोरजस्तन्न खलु न लङ्घ्येत भगवतोऽपि पदम् ।
किमुत हृदयं मदीयं भवती यदि नाम पादुके! न स्यात् ॥ 30

इति परागपद्धतिः त्रयोदशी

आदितः श्लोकाः 380

॥ नादपद्धतिः चतुर्दशी ॥

श्रुतीनां भूषणानां ते शङ्के रङ्गेन्द्रपागदुके! ।
मिथः सङ्घर्षसञ्जातं रजः किमपि शिञ्जितम् ॥ 1

मुरभिन्मणिपादुके! भवत्याः स्तुतिमाकर्णयता मया निबद्धाम् ।
अवधीरयसीव मञ्जुनादैरचमत्कारवचांसि दुर्जनानाम् ॥ 2

विहितेष्वभिवादनेषु वेदैर्गमनोदीरितगर्भरत्ननादा ।
मधुरं मधुवैरिपादरक्षे! भवती प्रत्यभिवादनं विधत्ते ॥ 3

स्वदते किमिहैव रङ्गनाथो मयि तिष्ठन् यदि वा पदे परस्मिन् ।
इति पृच्छसि देवि! नूनमस्मान् मधुरैस्त्वं मणिपादुके! निनादैः ॥ 4

अवरोधगतस्य रङ्गभर्तुर्गतिषु व्यञ्जितगर्भरत्ननादा ।
प्रतिसँल्लपसीव पादुके! त्वं कमलानूपुरमञ्जुशिञ्जितानाम् ॥ 5

मुरभिच्चरणारविन्दरूपं महितानन्दमवाप्य पूरुषर्थम् ।
अनघैर्मणिपादुके! निनादैरहमन्नाद इतीव गायसि त्वम् ॥ 6

मधुवैरिपदाम्बुजं भजन्ती मणिपादावनि! मञ्जुशिञ्जितेन ।
पठसीव मुहुः स्वयं प्रजानामपरोपप्लमरिष्टशान्तिमन्त्रम् ॥ 7

श्रुतिभिः परमं पदं मुरारेरनिदङ्कारमनेवमित्युपात्तम् ।
इदमित्थमिति ब्रवीषि नूनं मणिपादावनि! मञ्जुभिः प्रणादैः ॥ 8

मुन्नयः प्रणिधानसन्निरुद्धे हृदि रङ्गेश्वररत्नपादुके! त्वाम् ।
विनिवेश्य विभावयन्त्यनन्याः प्रणवस्य प्रणिधिं तव प्रणादम् ॥ 9

6. అధికార పరిగ్రహ పద్ధతి

141. అధిష్టే పాదుకా సామే యస్యా స్సాకేత వాసిభిః ।
అన్వయ వ్యతిరేకాభ్యా మన్వమీయత వైభవమ్ ।

142. మోచితస్థిరచరా నయత్నతః
కోసలాన్ జనపదా నుపాస్మహే ।
యేషు కాంక్షన బభూవ వత్సరాన్
దైవతం దనుజవైరి పాదుకా ।

143. సామ్రాజ్య సంపదివ దాసజనోచితా త్వం
రామేణ సత్యవచసా భరతాయ దత్తా ।
స త్వాం నివేశ్య చరణావవి! భద్ర పీఠే
పృథ్వీం బుభోజ, బుభుజే చ యశో విభూతిమ్ ।

144. భోగా నవన్య మనసాం మణిపాదుకే । త్వం
పుష్ణాసి హంత భజతా మనుషంగసిద్ధాన్ ।
తేనైవ నూన మభవ ద్భరతస్య సాధో
రప్రార్థితం తదిహ రాజ్య మవర్జనీయమ్ ।

145. రామప్రయాణ జనితం వ్యపనీయశోకం
రత్నాసనే స్థితవతీ మణిపాదరక్షే !
పృథ్వీం నిజేన యశసా విహితోత్తరీయా
మేకాత పత్ర తిలకాం భవతీ వితేనే ।

146. రామాజ్ఞయా పరవతీ పరిగృహ్య రాజ్యం
రత్నాసనం రఘుకులోచిత మాశ్రయంతీ ।
శుద్ధాంపదావని! పునర్భవతీ వితేనే
స్వాతంత్ర్య లేశ కలుషాం భరతస్యకీర్తిమ్ ।

147. పౌలస్త్య వీర వదన స్తబకావసానాత్
పుష్పాణి దండకవనేష్వప చేతుమిచ్ఛోః ।
రక్షాధురం ధృతవతీ మణిపాదుకే! త్వం
రామస్య మైథిల సుతా సహితే ప్రచారే ।

148. పాదావని! ప్రచల చామర బృందమధ్యే
భద్రాసనాస్తరగతా భవతీ విరేజే ।
ఆకీర్ణ దివ్యసలిలే కటకే సుమేరో
రంభోజినీవ కలహాయిత హంసయూథా ।

149. మాన్యే రఘూద్వహపదే మణిపాదుకే! త్వాం
విన్యస్య విగ్రహవతీమివ రాజ్యలక్ష్మీమ్ ।
ఆలోల మక్షవలయీా భరతో జటావా
నాలంబ్య చామర మనన్యమనాఃసిషేవే ।

150. ప్రోష్టే దివం దశరథే భరతే విలక్షే
పర్యాకులేషు పరముత్తర కోసలేషు ।
త్వం చే దుపేక్షితవతీ క ఇవా భవిష్య
ద్గోపాయితుం గుహ సఖస్య విభోః పదంతత్ ।

151. భ్రాతుర్య దంబ! విరహాద్భరతే విషణ్ణే
దాక్షిణ్య మాశ్రితవతీ మణిపాదుకే ! త్వమ్ ।
ఆసీ దశేష జగతాంశ్రవణా మృతం త
ద్వాచాలకాహళసహం బిరుదం తదాతే ।

152. రాజ్యం తదా దశరథా దను రామతఃప్రాక్
బిభ్రాణయా చరణరక్షిణి! వీతఖేదమ్ ।
తుల్యాధికార భజనేన బభూవ ధన్యో
వంశ స్త్వయాంబ! మనువంశ మహీపతీనామ్ ।

153. వర్షాణి తాని వృషలో న తపాంసి తేపే
బాలో న కశ్చిదపి మృత్యువశంజగామ ।
రాజ్యే తవాంబ! రఘు పుంగవ పాదరక్షే !
నైవా పరం ప్రతి విధేయ మభూత్ప్ర సక్తమ్ ।

154. విశ్వం త్వ దాశ్రిత పదాంబుజ సంభవాయాం
యస్యాం ప్రతిష్ఠితమిదం మణిపాద రక్షే !
ఆసీదనన్య శరణా సమయే యథావత్
సాఽపి త్వయా వసుమతీ విహిత ప్రతిష్ఠా ।

155. ప్రాయేణ రామవిరహ వ్యథితా తదానీ
ముత్సంగ మాశ్రితవతీ తవ రాజ్యలక్ష్మీః ।
తా మేవ దేవి! నను జీవయితుం జలార్ద్రా
మంగీచకార భవతీ భరతోపనీతామ్ ।

156. వీర వ్రత ప్రణయిని ప్రథమే రఘూణాం
ప్రోష్టే చిరాయ భరతే వ్రత మాసిధారమ్ ।
త్యక్త్వా పదావని! తదా వివిధా న్విహారా
నేకాసికా వ్రత మపూర్వ మవర్తయస్త్వమ్ ।

157. కాకుత్స్థ పాద విరహ ప్రతిపన్న మౌనాం
విష్పందతా ముపగతాం మణిపాదరక్షే !
ఆశ్వాస యన్నివ ముహు ర్భరతస్తదానీం
శీతై రవీజయత చామర మారుతైస్త్వమ్ ।

158. యత్ర క్వచి ద్విహరతోఽపి పదారవిందం
రక్ష్యం మయా రఘుపతే రితిభావయంత్యా ।
నిశ్శేష మేవ సహసా మణిపాదరక్షే!
నిష్కంటకం జగదిదం విదధే భవత్యా ।

159. రామంత్వయా విరహితం భరతం చ తేన
త్రాతుం పదావని ! తదా యదభూత్ ప్రతీతమ్ ।
రామా నుజస్య తవచాంబ! జగత్సమస్తం
జాగర్తి తేన ఖలు జాగరణ వ్రతేన ।

160. అంతః పురే పరిజనైః సమయోపయాతై
రభ్యర్చితా భవసి యా వినయోప పన్నైః ।
సా కోసలేశ్వర పదావని! భూ పతీనాం
సంఘట్టనం మకుట పంక్తిభి రప్యభూస్త్వమ్ ।

161. ప్రాప్యాధికార ముచితం భువనస్య గుప్త్యై
భద్రాసనం భరతవందిత మాశ్రయంత్యా ।
మధ్యేఽవ తీర్ణమివ మాధవ పాదరక్షే!
మాతస్త్వయాఽపి మనువంశ మహీపతీనామ్ ।

162. రాజాసనే రఘుకులో ద్వహ పాదరక్షే!
నీరాజనం సమభవ త్సమయోచితంతే ।
శ్లాఘావశేన బహుశః పరిఘూర్ణితాభిః
సామంత మౌళి మణి మంగళ దీపికాభిః ।

163. పృథ్వీ పతీనాం యుగపత్కిరీటాః
ప్రత్యర్థినాం ప్రాణితు మర్థినాంచ ।
ప్రాపు స్తదా రాఘవ పాదరక్షే!
త్వదీయ మాస్థానిక పాద పీఠమ్ ।

164. ప్రణమ్య రంగేశ్వర పాదరక్షే!
దూరోపనీతై రుపదా విశేషైః ।
సభాజయంతిస్మ తదా సభాయా
ముచ్చైస్తరా ముత్తరకోసలాస్త్వామ్ ।

165. అపావృత ద్వార మయంత్రితాశ్వం
రంగేశ పాదావని! పూర్వ మాసీత్ ।
త్వయా యదృచ్ఛా సుఖసుప్తపాంథం
రామే వనస్థేఽపి పదం రఘూణామ్ ।

166. అనన్య భక్తిర్మణి పాదుకే! త్వా
మభ్యర్చయన్ దాశరథి ర్ ద్వితీయః।
వికల్ప్యమానః ప్రథమేన కీర్త్యా
వంద్యః స్వయం వ్యోమ సదాం బభూవ ॥

167. అరణ్యయోగ్యం పదమ స్పృశం తీ
రామస్య రాజార్హ పదే నివిష్టా।
ఆస్థాన నిత్యాసికయా నిరస్థః
స్వర్గౌకసాంస్త్వైరగతే ర్విఘాతమ్ ॥

168. రాజాసనేచే ద్భవతీ నిషణ్ణా
రంగేశ పాదావని! తన్నచిత్రమ్।
యత్రాధి రూఢాః క్రమశః పురా త్వా
ముత్తంసయంతే రఘు సార్వభౌమాః ॥

169. భద్రాసనంచే త్పరివృత్త మాసీత్
దేవి! క్షణం దక్షిణతో ముఖంతే।
కథం భవేత్కాంచన పాదరక్షే!
రామస్య రక్షో మృగయావిహారః ॥

170. యావత్త్వయా రాఘవపాదరక్షే!
జిగీషితా రాక్షస రాజధానీ।
మాలేవ తావల్లులితా మదాంధై
రుద్యానశాఖా మృగయూథపైస్తే ॥

171. మహీక్షితాం రాఘవ పాదరక్షే!
భద్రాసనస్థాం భవతీం స్పృశంతః ।
పూర్వం తథాత్వే నియతేఽపిభూయః ।
కల్యాణతా మానశిరే కిరీటాః ।

172. అనిచ్ఛతః పాండర మాతపత్రం
పిత్రా వితీర్ణం మణిపాదరక్షే!
ఆసీ త్త్వదర్థం విధృతేన తేన
ఛాయా సమగ్రా భరతస్య మౌళౌ ।

173. పాదుకే! రఘుపతౌ యదృచ్ఛయా
ప్రస్థితే వన విహార కౌతుకాత్ ।
ఆధిరాజ్యమధిగమ్య తే యువా
మక్షతం వసుమతీ మరక్షతమ్ ।

174. రఘువీర పదానుషంగ మాత్రాత్
పరిబర్హేషు నివేశితాయది త్వమ్ ।
అధికారదినే కథం పనస్తే
పరివారాస్తవ పాదుకే! బభూవుః ।

175. పురుషార్థ చతుష్టయార్థినీనాం
పరిషత్తే మహితా వసిష్ఠ ముఖ్యైః ।
క్రయ విక్రయ పత్తనం ప్రజానా
మభవ త్కాంచన పాదుకే! తదానీమ్ ।

176. మనుజత్వ తిరోహితేన శక్త్యే
వపుషైకేన విరోధినాం నిరాసే
అభజత్ భరతాదిభేద మీశ
స్త్వయ మారాధయితుంపదావని! త్వామ్ ।

177. మగధాంగ కళింగ వంగ ముఖ్యాన్
విమతాన్ రంధ్ర గవేషిణః ససైన్యాన్ ।
రఘు పుంగవ పాదుకే! విజిగ్యే
భరతః శాసన ముద్వహన్భవత్యాః ।

178. అనితర వహనీయం మంత్రి ముఖ్యైర్యదాత
త్త్వయి వినిహిత మాసీ త్సూర్య వంశాధిరాజ్యమ్ ।
రఘుపతి పదరక్షే! రత్నపీఠే తదానీం
శ్రియమివదదృశు స్త్వాం సాదరం లోకపాలాః ।

179. పరిహృత దండకాధ్వ గమనం పదరక్షిణీత
త్పరిణత విశ్వసంప దుదయం యువయోర్ద్వితయమ్ ।
రఘుపతి భద్రపీఠ మధిరుహ్య తదా విదధే
వ్యపగతవైరి భూప నిలయం వసుధా వలయమ్ ।

180. ప్రాప్తోదయా తదానీం కిమపితమస్తన్నిరాకరోద్భవతీ ।
తనురివ మనుకులజనుషాం ప్రసవిత్రీరత్నపాదుకే! సవితుః ।

7. అభిషేక పద్ధతి

181. పాహినః పాదుకే! యస్యా విధాస్యన్నభిషేచనమ్ ।
ఆభిషేచనికం భాండం చక్రేరామః ప్రదక్షిణమ్ ।

182. రాఘవస్య చరణౌ పదావని!
ప్రేక్షితుం త్వ దభిషేక మీషతుః!
ఆభిషేచనిక భాండ సన్నిధౌ
యత్రప్రదక్షిణ గతి శ్శనైర్యయౌ।

183. మూర్ధాభిషిక్తైర్ని యమేన వాహ్యా
విచింత్యమానం రఘునాథపాదౌ।
రత్నాసనస్థాం మణిపాదుకే! త్వాం
రామానుజన్మా భరతోఽభ్యషించత్ ।

184. భ్రాతుర్నియోగేఽప్యని వర్తమానం
రాజ్యాభిషేకంచ పరిత్యజంతమ్।
రామానుజౌతౌ ననుపారతంత్ర్యా
దుభావుభాభ్యాం భవతీజిగాయ ।

185. నివేశ్య రంగేశ్వర పాదరక్షే!
భద్రాసనే సాదర మభ్యషించత్।
వశీ వసిష్ఠో మనువంశజానాం
మహీ క్షితాం వంశపురోహితస్త్వామ్।

186. కృతాభిషేకా భవతీ యథావత్ రంగేశపాదావని! రత్నపీఠే।
గంగానిపాతస్నపితాం. సుమేరో రధిత్యకాభూమి మధశ్చకార॥

187. వసిష్ఠ ముఖ్యై ర్విహితాభిషేకాం
రాజ్యాసనే రామనివేశ యోగ్యే।
తుష్టావ రంగేశ్వర పాదరక్షే!
ప్రాచేతసస్త్వాం ప్రథమః కవీనామ్॥

188. రక్షో వధార్థం మణిపాదరక్షే!
రామాత్మనో రంగపతేః ప్రవాసే।
రక్షో పకారాద్భవతీ వితేనే
రాజన్వతీం కోసల రాజధానీమ్॥

189. ప్రాప్తాభిషేకా మణిపాదరక్షే!
ప్రతాపముగ్రం ప్రతిపద్యమానా।
శశాస పృథ్వీం భవతీ యథావత్
సాకేత సింహాసన సార్వభౌమీ॥

190. దశాననాదీన్ మణిపాదరక్షే!
జిగీషతో దాశరథే ర్వియోగాత్ ।
జాతోపతాపా త్వయిసంప్రయుక్తై
స్తీర్థోదకై రుచ్ఛ్వసితాధరిత్రీ ।

191. అధ్యాసితం మనుముఖైః క్రమశోనరేంద్రై
రారోప్యదేవి! భవతీం తపనీయపీఠమ్।
రాజ్యాభిషేక మనఘం మణిపాదరక్షే!
రామోచితం తవ వశం భరతో వితేనే॥

192. స్నేహేనదేవి! భవతీం విషయేఽభిషించన్
ద్విస్సప్త సంఖ్య భువనోదర దీపరేఖామ్।
జాతం రఘూద్వహ దివాకర విప్రయోగా
దంధం తమిస్ర మహరద్భరతః ప్రజానామ్।

193. హస్తాపచేయ పురుషార్థ ఫలప్రసూతే
ర్మూలం పదావని! ముకుంద మహీరుహస్త్వమ్।
ఛాయా విశేషమదిశ ద్యదసౌ ప్రజానా
మావర్జితైస్త్వయి శుభైరభిషేక తోయైః।

194. అహ్నాయ రామ విరహాత్పరిఖిన్న వృత్తే
రాశ్వాసనాయ భవతీ మణిపాదరక్షే।
తీర్థాభిషేక మపదిశ్య వసుంధరాయా
శ్చక్రే తదా సముచితం శిశిరోపచారమ్।

195. మాలిన్యమాశ్రితవతీ మణిపాదరక్షే!
పంకేన కేకయసుతా కలహోత్థితేన।
శుద్ధింపరా మధిజగామ వసుంధరేయం
త్వత్తః క్షణాన్నిపతితైరభిషేకతోయైః।

196. ఆవర్జితం మునిగణేన జగద్విభూత్యై
తోయం పదావని! తదా త్వయి మంత్రపూతమ్।
మూలావసేక సలిలం నిగమద్రుమాణాం
శాపోదకం చసమభూత్ క్షణదాచరాణామ్।

197. విప్రోషితే రఘుపతౌ భవతీ యథార్హం
మాన్యే పదేస్థితి మతీ మనువంశజానామ్ ।
ఆత్మన్య ధర్మనిపుణైః ప్రహితైః ప్రజానా
మశ్రూణ్యపాస్య దభిషేక జలప్రవాహైః ।

198. ప్రాయో విశోషితరసా పతి విప్రయోగాత్
పర్యాకులీకృత సముద్ర పయోధరాగౌః
అంబ! త్వదీయ మభిషేక పయః పిబంతీ
ధేనుర్బ భూవజగతాం ధనధాన్యదోగ్ధ్రీ ।

199. వృత్తే యథావ దభిషేక విధౌ బభాసే
పశ్చాత్తవాంబ! భరతేన ధృతఃకిరీటః ।
ఆకస్మిక స్వకుల విప్లవశాంతిహర్షాత్
ప్రాప్తస్త్విషా మివపతి ర్మణిపాదుకే! త్వామ్ ।

200. మనువంశ పురోహితేన మంత్రై
రభి మంత్ర్య త్వయి పాదుకే! ప్రయుక్తమ్ ।
అభిషేక జలం క్షణేన రాజ్ఞాం
శమయా మాస సముత్థితాన్ ప్రతాపాన్ ।

201. పాదపాదుపహృతా రఘూద్వహా
దాలవాలమివ పీఠ మాశ్రితా ।
అభ్యషేచి భవతీ తపోధనైః
పారిజాత లతికేవ పాదుకే ।

202. అలఘుభి రభిషేక వ్యా ప్పతై రంబుభిస్తే
దిన కరకులదైన్యం పాదుకే! క్షాళయిష్యన్ ।
సఖలు కమలయోనే స్స్వానురాధత్త మంత్రే
ష్వధిక నియమయోగాం శక్తి మాథర్వణేషు ।

203. దినకర కులజానాం దేవి! పృథ్వీపతీనాం
నిరుపధి మధికారం ప్రాప్ను వత్యాం భవత్యామ్ ।
అజనిషత సమస్తాః పాదుకే! తావకీన
స్నపన సలిలయోగాన్నిమ్నగా స్తుంగభద్రాః ।

204. తవ విధివ దుపాత్తే సార్వభౌ మాభిషేకే
భరత సమయవిద్భిః పాదుకే! మంత్రి ముఖ్యైః ।
త్వదవధినిజకర్మస్థాయినీనాం ప్రజానాం
ప్రథమ యుగ విశేషాః ప్రాదురాసన్ విచిత్రాః ।

205. అవసిత రిపుశబ్దా నన్వభూస్త్వం తదానీం
రఘుపతి పదరక్షే! లబ్ధరాజ్యాభిషేకా ।
చలిత భుజలతానాం చామరగ్రాహిణీనాం
మణివలయ నినాదైర్మే దురాన్ మంత్రఘోషాన్ ।

206. సముచిత మభిషేకం పాదుకే! ప్రాప్నువత్యాం
త్వయి వినిపతితానాం దేవి! తీర్థోదకానామ్ ।
ధ్వని రనుగత మంత్ర స్పందతాం కోసలానాం
శమయితు మలమాసీ త్సంకులా నార్తనాదాన్ ।

207. దివిషదనువిధేయం దేవి! రాజ్యాభిషేకం
భరత ఇవ యది త్వం పాదుకే! నాన్వమంస్థాః।
కథమివ రఘువీరః కల్పయే దల్పయత్న
స్త్రి చతుర శరపాతై స్తాదృశం దేవకార్యమ్ ।

208. కతిచన పదపద్మ స్పర్శసౌఖ్యం త్యజంతీ
వ్రతమతుల మధా స్త్వం వత్సరాన్ సావధానా ।
రఘుపతి పదరక్షే ! రాక్షసై స్త్రాసితానాం
రణరణక విముక్తం యేన రాజ్యం సురాణామ్ ।

209. అథర్వోపజ్ఞంతే విధివ దభిషేకం విదధతాం
వసిష్ఠాదీ నామప్యు పచిత చమత్కార భరయా ।
త్వదాస్థాన్యా రంగక్షితిరమణ పాదావని! తదా
లఘీ యస్యోజాతా రఘు పరిషదాహో పురుషికాః ।

210. అభిషేచయతు సరామః పదేన వాస్ప్రశతుపాదుకే! భవతీమ్ ।
అవిశేషితమహిమాత్వం క్వావిశేషః క్షమాసమేతానామ్ ।

8. నిర్యాతనా పద్ధతి

211. అభిషేకో త్సవాత్తస్మాద్యస్యా నిర్యాతనోత్సవః ।
అత్యరిచ్యత తాంవందే భవ్యాంభరత దేవతామ్ ।

212. ఉపాస్య వర్షాణి చతుర్దశ త్వా
ముత్తారికా ముత్తరకోసలస్థాః ।
సనందనాద్యై రపి దుర్విగాహం
సాంతానికం లోక మవాపు రగ్ర్యమ్ ।

213. పాదావని! ప్రత్యయితో హనూమాన్
సీతామివ త్వాం చిరవిప్రయుక్తామ్ ।
ప్రణమ్య పౌలస్త్యరిపో రుదంతం
విజ్ఞాపయామాస వినీతవేషః ।

214. తవాభిషేకాన్మణి పాదరక్షే !
మూలే నిషేకాదివ వృద్ధియోగ్యాత్ ।
జహాస్తదేవ త్రిదశాంగనా నాం
ప్రమ్లానతాం పత్రలతాంకురాణి ।

215. సర్వత త్వ్వదభిషేక వాసరే
సమ్యగుద్ధృత సమస్త.కంటకే ।
రాఘవస్య విపినేషు పాదుకే !
యత్రకామగమతా వ్యవస్థితా ।

216. కిం చతుర్దశభి రేవ వత్సరై
ర్నిత్యమేవ మణిపాదుకే! యువామ్ ।
పాదయో స్త్రిభువనాధిరాజయో
ర్యైవ రాజ్యమధిగచ్ఛతం స్వయమ్ ।

217. రామస్య రాక్షస వధ త్వరితస్య కాలే
పాదావని! ప్రకటయన్నివ పార్ష్ణి గుప్తిమ్ ।
ఆచిత్రకూట మధిగమ్య శశంస వార్తా
మవ్యాహత త్వదభిషేక మృదంగనాదః ।

218. భద్రాణి దేవి! జగతాంప్రతిపాదయిష్యన్
ప్రాగేవ యేన భవతీం భరతోఽభ్యషించత్ ।
మన్యే కపీశ్వర విభీషణయో ర్యథావత్
సంతన్యతేస్మ తత ఏవ కిలాభిషేకః ।

219. సంభిద్యమాన తమసా సరయూపనీతై
స్సంవర్ధిత స్తవ శుభై రభిషేక తోయైః ।
మన్యేబభూవ జలధి ర్మణిపాదరక్షే ।
రామాస్త్ర పావక శిఖాభిరశోషణీయః ।

220. పాదావని! త్వ దభిషేచన మంగళార్థం
భేరీశతం భృశమతాడ్యత యత్ప్రతీతైః ।
ఆకర్ణ్య తస్య సహసా తుములంనినాదం
లంకా కవాటనయనాని నిమీలితాని ।

221. తా పోద్గమ స్త్వదభిషేక జలప్రవాహై
రుత్సారితస్త్వరిత ముత్తరకోసలేభ్యః ।
లేభే చిరాయ రఘు పుంగవ పాదరక్షే !
లంకా వరోధ సుదృశాం హృదయేషు వాసమ్ ।

222. ఆవర్తితం విధి విదా మణి పాదరక్షే !
పద్మాసన ప్రియసుతేన పురోహితేన ।
ఆసీన్నిదాన మభిషేక జలం త్వదీయం
నక్తంచర ప్రణయినీ నయనోదకానామ్ ।

223. దేవి! త్వయా స్నపన సంపది సంశ్రితాయాం
దగ్ధే పురే దశముఖస్య వలీముఖేన ।
ఆసీ త్తతః ప్రభృతి విశ్వజన ప్రతీత
మద్భ్యోఽగ్ని రిత్యవి తథం వచనం మునీనామ్ ।

224. అయోధ్యకై స్త్వదభిషేక సమిద్ధ హర్షై
రా ధ్మాపితాః శ్రుతిసుఖం ననుతే తదానీమ్ ।
రామస్య రాక్షస శిరో లవనేఽప్యశామ్య
న్యే షాం ధ్వని ర్విజయశంఖరవో బభూవ ।

225. ప్రథయితు మభిషేకం పాదుకే! తావకీనం
దురిత శమన దక్షే దుందుభౌ తాడ్యమానే ।
సపది పరిగృహీతం సాధ్వసం దేవి! నూనం
దశ వదన వధూనాం దక్షిణైర్నేత్ర కోణైః ।

226. రఘుపతి పదరక్షే! రత్నపీఠే యదా త్వా
మఖిల భువన మాన్యా మభ్యషించ ద్వసిష్ఠః ।
దశముఖ మహిషీభిర్దేవి! బాష్పాయితాభి
స్సనయుగ మభిషేక్తుం తత్క్షణాదన్వమంస్థాః ।

227. రామాస్త్రాణి నిమిత్తమాత్రమిహతే లబ్ధాభిషేకా స్వయం
రక్షస్థల్ క్షపయాంచకార భవతీ భద్రాసనస్థాయినీ ।
యద్దోష్ణా మతివేల దర్పదవథుజ్వాలోష్మలానాం తదా
నిష్పిష్టైః కలధౌతశైల శిఖరైః కర్పూరచూర్ణాయితమ్ ।

228. శ్రుత్వైవం హనుమన్ముఖాద్రఘుపతేః ప్రత్యాగతిం తత్క్షణా
దాసీద ద్ధృరతానువర్తనవశా దారూఢ కుంభస్థలామ్ ।
కాలోన్నిద్ర కదుష్ణ ధానమదిరా మాద్యద్ద్విరేఫ ధ్వని
శ్లాఘా చాటుభి రస్తుతేవ భవతీం శత్రుం జయఃకుంజరః ।

229. ప్రత్యాగతస్య భవతీ మవలోక్య భర్తుః
పాదారవింద సవిధే భరతోపనీతామ్ ।
పూర్వాభిషేక విభవాభ్యుచితాం సపర్యాం
మధ్యేసతా మకృత మైథిల రాజకన్యా ।

230. సంప్రేక్ష్య మైథిల సుతా మణిపాదరక్షే!
ప్రత్యుద్గతస్య భవతీం భరతస్యమౌళౌ ।
నిర్దిశ్యసానిభృత మంజలినా పురస్తాత్
తారాదికాః ప్రియసఖీ రశివత్ ప్రణంతుమ్ ।

231. తుల్యేఽపి దేవి! రఘువీర పదాశ్రయత్వే
పూర్వాభిషేక మధిగమ్య గరీయసీ త్వమ్ ।
తేనైవ ఖల్వభజతాం మణిపాదరక్షే!
రక్షః ప్లవంగమపతీ భవతీం స్వమూర్ధ్నా ।

232. నిర్వృత్త రాక్షసచమూ మృగయా విహారో
రంగేశ్వరః సఖలు రాఘవ వంశగోప్తా ।
వంశక్రమాదుపనతం పదమాదదానో
మాన్యం పునస్త్వయిపదం నిదధే స్వకీయమ్ ।

233. త త్త్రాదృశో శ్చరణయోః ప్రణిపత్యభర్తుః
పౌరాస్త్వయా విధృతయోః ప్రతి పన్నసత్త్వాః ।
ప్రాప్తాభిషేక విభవామపి పాదుకే! త్వా
మానందబాష్పసలిలైః పునరభ్యషించన్ ।

234. మా తస్త్వయైవ సమయే విషమేఽపి సమ్య
గ్రాజన్వతీం వసుమతీ మవ లోక్య రామః ।
సంజీవనాయ భరతస్య సమగ్రభక్తేః
సత్య ప్రతిశ్రవతయైవ చకార రాజ్యమ్ ।

235. పాదావని! ప్రతిగతస్య పురీ మయోధ్యాం
పౌలస్త్య హంతు రభిషేక జలార్ద్ర మూర్తేః ।
అంసే యథార్థ మధివాస్య నిజైర్యశోభిః
కస్తూరికేవ విహితా వసుధా త్వయైవ ।

236. యాఽసౌచతుర్దశసమాః పతివిప్రయుక్తా
విశ్వంభరా భగవతీ విధృతాభవత్యా ।
విన్యస్యతాం రఘుపతే ర్భుజశైల శృంగే
భూయోఽపి తేన సహితాం భవతీబభార ।

237. నిస్తీర్ణ దుఃఖ జలధే రనఘస్యదేవి!
త్వ త్సంప్రయుక్త రఘునాథపదాన్వయేన ।
సద్యః సనందనముఖైరపి దుర్నిరీక్షా
సామ్రాజ్య సంపదపరా భరతస్యజజ్ఞే ।

238. నిర్గత్య దేవి! భరతాంజలి పద్మమధ్యాత్
భూయః సమాగతవతీ పురుషోత్తమేన ।
పద్మేవ భద్రమఖిలం మణిపాదరక్షే!
ప్రాదుశ్చకార భవతీ జగతాంత్రయాణామ్ ।

239. రఘుపతి మధిరోప్యస్వోచితే రత్నపీఠే
ప్రగుణమభజథా స్త్వం పాదుకే! పాదపీఠమ్ ।
తదపి బహుమతిస్తే తాదృశీ నిత్యమాసీత్
క్వనుఖలు మహితానాం కల్ప్యతే తారతమ్యమ్ ।

240. అనువృత్త రామభావః
శంకే నిర్విష్ట చక్రవర్తి పదామ్ ।
అధునాఽపి రంగనాథః
స చమత్కారం పదేన భజతిత్వామ్ ।

9. వంది వైతాళిక పద్ధతి

241. నమస్తే పాదుకే పుంసాం సంసారార్ణవ సేతవే ।
యదారోహస్య వేదాంతా వంది వైతాళికాః స్వయమ్ ।

242. ఉచిత ముపచరిష్యన్ రంగనాథ! ప్రభాతే
విధి శివసనకాద్యాన్ బాహ్యకక్ష్యానిరుద్ధాన్ ।
చరణకమలసేవా సౌఖ్యసామ్రాజ్య భాజాం
ప్రథమ విహితభాగాం పాదుకా మాద్రియేథాః ।

243. పద్మాజుష్టం భజతుచరణం పాదుకా లబ్ధవారా
ప్రత్యాసన్నాస్తవ పరిజనాః ప్రాతరాస్థానయోగ్యాః।
అర్ధోన్మేషాదధిక సుభగా మర్ధనిద్రా మనుషంగాం
నాభీపద్మే తవనయనయో ర్నాథ! పశ్యంతుశోభామ్ ।

244. ఉప నమతి ముహూర్తంశేష సిద్ధాంత సిద్ధం
తదిహచరణ రక్షా రంగనాథ! త్వయైషా ।
మృదుపద మధిరూఢా మంజుభిః శింజితైస్స్వై
రుపదిశతు జనానా ముత్సవారంభవార్తామ్ ।

245. రంగాధీశ! మరుద్గణస్య మకుటాదామ్నాయబృందస్య వా
ప్రత్యానీయ సమర్పితా విధిముఖై ర్వారక్ర మాదాగతైః।
వాహారోహణ సంభృతం శ్రమభరం సమ్యగ్వినేతుంక్షమా
లీలాసంచరణ ప్రియా స్పృశతుతే పాదాంబుజం పాదుకా ।

246. వృత్తం క్రమేణ బహుధా నియుతం విధీనా
మర్ధం ద్వితీయ మిద మంకురితం తవాహ్నః।
నీళాసఖీభిరుపనీయ నివేశ్యమానా
మంక్తుం ప్రభో! త్వరయతే మణిపాదుకాత్వామ్ ।

247. దివ్యాప్సరోభి రుపదర్శిత దీపవర్గే
రంగాధిరాజ! సుభగే రజనీ ముఖేఽస్మిన్।
సంరక్షిణీ చరణయోస్స్వ విలాస వృత్తి
ర్నీరాజనాసన మసౌ నయతు స్వయం త్వామ్ ।

248. ఆస నాదుచిత మాసనాంతరం
రంగనాథ! యదిగంతు మీహసే!
సంనతేన విధినా సమర్పితాం
స ప్రసాద మధిరోహపాదుకామ్ ।

249. పరిజన వనితాభిః ప్రేషితః ప్రాంజలిస్త్వాం
ప్రణమతి మదనోఽయం దేవ! శుద్ధాంతదాసః ।
ఫణిపతి శయనీయం ప్రాపయిత్రీ సలీలం
పదకమల మియం తే పాదుకా పర్యుపాస్తామ్ ।

250. ఇతి నిగమ వందివచసా సమయేసమయే గృహీత సంకేతః ।
అభిసరతి రంగనాథః ప్రతిపదభోగాయ పాదుకే! భవతీమ్ ।

251. శౌరేః శృంగార చేష్టానాం ప్రసూతిం పాదుకాం భజే ।
యామేషభుంక్తే శుద్ధాంతా త్పూర్వం పశ్చా దపిప్రభుః ।

252. ప్రణత త్రిదశేంద్ర మౌళి మాలా
మకరందార్ద్ర పరాగ పంకిలేన ।
అనులింపతి పాదుకే! స్వయంత్వా
మనురూపేణ పదేన రంగనాథః ।

253. అవదాత హిమాంశుకానుషక్తం
పదరక్షే! త్వయిరంగిణః కదాచిత్ ।
కిమ పి స్థిత మద్వితీయ మాల్యం
విరళావస్థిత మౌక్తికం స్మరామి ।

254. అసహాయ గృహీత రంగనాథా
మవరోధాంగణసీమ్ని పాదుకే! త్వామ్ ।
సుదృశః స్వయ మర్చయంతి దూరా
దవతం సోత్పల వాసితై రపాంగైః ॥

255. ని ర్విశ్య మానమపి నూతన సన్నివేశం
కైవల్య కల్పిత విభూషణ కాయకాంతిమ్।
కాలేషు నిర్విశసి రంగయువానమేకా
శృంగార నిత్యరసికం మణిపాదరక్షే ॥

256. నిద్రాయితస్య కమితు ర్మణిపాదుకే! త్వం
పర్యంకికా పరిసరం ప్రతిపద్యమానా।
శ్వాసానిల ప్రచలితేన భజస్యభీక్ష్ణ
నాభీ సరోజరజసా నవమంగరాగమ్ ॥

257. శయితవతి రజన్యాం పాదుకే! రంగబంధౌ
చరణకమల పార్శ్వే సాదరం వర్తసే త్వమ్ ।
ఫణిపతి శయనీయా దుత్థితస్య ప్రభాతే
ప్రథమ నయనపాతం పావనం ప్రాప్తుకామా ॥

258. చరణకమల సంగా ద్రంగనాథస్య నిత్యం
నిగమ పరిమళం త్వం పాదుకే! నిర్వమంతీ ।
నియత మతిశయానా వర్తసే సావరోధం
హృదయ మధివసంతీం మాలికాం వైజయంతీమ్ ॥

259. ఉపనిషదబలాభి ర్నిత్యముత్తంసనీయం
కి మపి జలధి కన్యా హస్త సంవాహనార్హమ్ ।
తవతు చరణరక్షే! దేవి! లీలారవిందం
చరణ సరసిజం తచ్చారు చాణూరహంతుః ।

260. అఖిలాంతః పురవారేష్వనేకవారం పదావని! స్వైరమ్ ।
అనుభవతి రంగనాథో విహారవిక్రాంతి సహచరీం భవతీమ్ ।

11. సంచార పద్ధతి

261. అగ్రతస్తే గమిష్యామి మృద్నంతీకుశకంటకాన్ ।
ఇతి సీతాఽపి యద్వృత్తిమియేష్రపణమామితామ్ ।

262. శరదశ్శత మంబ! పాదుకే! స్యాం
సమయాహూత పితామహ స్తుతాని ।
మణిమంటపికాసురంగభర్తు
స్త్వదధీనాని గతాగతాని పశ్యన్ ।

263. త్వ దధీన పరిక్రమో ముకుంద
స్తద ధీన స్తవ పాదుకే! విహారః ।
ఇతరేతర పారతంత్ర్య మిత్థం
యువయోస్సిద్ధ మనన్య తంత్రభూమ్నోః ।

264. రజసా తమసాచ దుష్టసత్త్వే
గహనే చేతసి మామకే ముకుందః ।
ఉచితం మృగయా విహారమిచ్ఛన్
భవతీ మాదృత పాదుకే! పదాభ్యామ్ ।

265. క్షమయా జగతామపి త్రయాణా
మవనే దేవి! పదావని! త్వ యైవ ।
అభిగమ్యతమోఽపి సంశ్రితానా
మభిగంతా భవతి స్వయం ముకుందః ।

266. శిరసా భవతీం దధాతి కశ్చిత్
విధృతః కోఽపి పదస్పృశా భవత్యా ।
ఉభయో ర్మధువైరి పాదరక్షే!
త్వదధీనాం గతి మామనంతి సంతః ।

267. స్పృశతః శిరసా పదేనచ త్వాం
గతి ముద్దిశ్య ముకుంద పాదుకే! ద్వౌ ।
అవరోహతి పశ్చిమః పదా త్వా
దధిరోహ త్యనఘస్తదేవ పూర్వః ।

268. సమయేష్వపదిశ్య చైత్రయాత్రాం
వివిధాంతఃపుర వాగురా వ్యతీతః ।
నియతం మణిపాదుకే! భవత్యా
రమతే వర్త్మని రంగసార్వభౌమః ।

269. నిజ సంహనన ప్రసక్త లాస్యం
చరతి త్వా మధిరుహ్య రంగనాథః ।
పదరక్షిణి! పావనత్వ మాస్తాం
రసికా స్వాద మతః పరం నవిద్మః ।

270. పదయో రనయోః పరస్య పుంస
స్త దనుగ్రాహ్య విహార పద్ధతే ర్వా ।
శిరసో మణిపాదుకే! శ్రుతీనాం
మనసోవా మమ భూషణం త్వమేకా ॥

271. కృపయా మధువైరి పాదరక్షే !
కఠినే చేతసి మామకే విహర్తుమ్ ।
మకుటేషు దివౌకసాం విధత్తే
భవతీ రత్నవిసంస్థులేషు యోగ్యామ్ ॥

272. చరణద్వయ మర్భకస్య శౌరేః
శరదంభోరుహ చాతురీధురీణమ్ ।
శకటాసుర తాడనేఽపి గుప్తం
తవ శక్త్యైకిల పాదుకే! తదాసీత్ ॥

273. ఉత్తస్థుషో రంగశయస్య శేషా
దాస్థాన సింహాసన మారురుక్షోః ।
మధ్యేనిశాంతం మణిపాదుకే! త్వాం
లీలా పదన్యాస సఖీం ప్రపద్యే ॥

274. ప్రాప్తాధికారాః పతయః ప్రజానా
ముత్తంసి తా ముత్తమపాదుకే! త్వామ్ ।
రంగేశితుః స్వైర విహార కాలే
సంయోజయం త్యంఘ్రి సరోజయుగ్మే ॥

275. త్వయాఽనుబద్ధాం మణిపాదరక్షే!
లీలాగతిం రంగశయస్యపుంసః ।
నిశామయంతో నపున ర్భజంతే
సంసార కాంతార గతాగతాని ॥

276. వ్యూహాను పూర్వీ రుచిరాన్ విహారాన్
పదక్రమేణ ప్రతిపద్యమానా ।
బిభర్షినిత్యం మణిపాదుకే ! త్వం
మురద్విషో మూర్తిరివ త్రిలోకీమ్ ।

277. పదేషు మందేషు మహత్స్వపి త్వం
నీ రంధ్ర సంశ్లేషవతీ మురారేః ।
ప్రత్యాయనార్థం కిలపాదుకే! నః
స్వాభావికం దర్శయసి ప్రభావమ్ ।

278. కృపా విశేషాత్ క్షమయా సమేతాం
ప్రవర్త మానాంజగతో విభూత్యై ।
అవైమినిత్యం మణిపాదుకే! త్వా
మాకస్మికీం రంగపతేః ప్రసత్తిమ్ ।

279. ఉపా గతానాముపతాపశాం త్యై
సుఖావగాహం గతి ముద్వహంతీమ్ ।
పశ్యామిశౌరేః పదవాహినీం త్వాం
నిమ్నేషు తుంగేషు చ నిర్విశేషామ్ ।

280. సహ ప్రయాతా సతతం ప్రయాణే
ప్రాప్తాసనే సంశ్రితపాద పీఠా ।
అలంఘనీయా సహజేన భూమ్నా
ఛాయేవ శౌరే ర్మణి పాదుకే! త్వమ్ ।

281. పదస్పృశా రంగపతి ర్భవత్యా
విచక్రమే విశ్వమిదంక్షణేన ।
తదస్య మన్యే మణిపాదరక్షే!
త్వయైవ విఖ్యాత మురుక్రమత్వమ్ ।

282. సంచారయంతీ పదమన్వతిష్ఠః
సహాయకృత్యం మణిపాదరక్షే !
మాతస్త్వమేకా మనువంశగోప్తు
ర్గోపాయతో గౌతమధర్మదారాన్ ।

283. త్వత్త స్త్రి విష్టపచరా ననపత్న్యయిష్వ
న్నారుహ్య తార్క్ష్య మవరుహ్యచ తత్క్షణేన ।
శుద్ధాంత భూమిషు పున ర్మణిపాదరక్షే!
విశ్రామ్యతి త్వయి విహారవశేనశౌరిః ।

284. విక్రమ్యభూమి మఖిలాంబలినా ప్రదిష్టాం
దేవే పదావని! దివం పరిమాతుకామే।
ఆసీదతో దినకరస్య కరో పతాపాత్
సం రక్షితుం పదసరోజ ముపర్యభూస్త్వమ్ ।

285. త్వత్సంగమాన్నను సకృద్విధి సంప్రయుక్తా
శుద్ధిం పరా మధిజగామ శివత్వ హేతుమ్।
రంగాధిరాజ పదరక్షిణి! కీ దృశీ సా
గంగా బభూవ భవదీయ గతాగతేన ।

286. వృద్ధిం గవాం జనయితుం భజతా విహారాన్
కృష్ణేన రంగరసికేన కృతాశ్రయా యా।
సంచారతస్తవ తదా మణిపాదరక్షే!
బృందావనం సపది నందన తుల్యమాసీత్ ।

287. మాత స్త్రయీమయతయా చరణప్రమాణే
ద్వే విక్రమేషు వివిధేషు సహాయభూతే ।
నాథస్య సాధు పరిరక్షణ కర్మణి త్వం
దుష్కృ ద్వినాశన దశాసు విహంగ రాజః ।

288. పాదావని! క్వచన విక్రమణే భుజానాం
పంచాయుధీకరరుహై ర్భజతే వికల్పమ్ ।
నిత్యం త్వమేవ నియతా పదయోర్మురారే
స్తేనాసి నూన మవికల్ప సమాధియోగ్యా ।

289. అక్షేత్ర విద్భి రధిగంతు మశక్య వృత్తి
ర్మాతస్త్వయా నిరవధి ర్నిధిరప్రమేయః ।
రథ్యాంతరేషు చరణావని! రంగ సంగీ
వాత్సల్య నిఘ్న మనసా జనసాత్కృతోఽసా ।

290. సంపద్యతే సముచితం క్రమ మాశ్రయంత్యా
స ద్వర్త్మనా భగవతోఽపిగతి ర్భవత్యా ।
ఈష్టే పదావని! పునః క ఇవే తరేషాం
వ్యావర్తనస్య విషమా దపథ ప్రచారాత్ ।

291. రంగేశ్వరేణ సహ లాస్యవిశేషభాజో
లీలోచితేషు తవ రత్నశిలాతలేషు ।
మధ్యేస్థితాని కతిచిన్మణి పాదరక్షే!
సభ్యా న్విశేష మనుయోక్తుమితి ప్రతీమః ।

292. నిత్యం పదావని! నివేశ్యపదం భవత్యాం
ని ష్పందకల్ప పరిమేయ పరిచ్ఛదాని ।
శృంగార శీతలతరాణి భవంతికాలే
రంగేశ్వరస్య లలితాని గతాగతాని ।

293. భోగార్చనాని కృతిభిః పరికల్పితాని
ప్రీత్యైవ రంగనృపతిః ప్రతిపద్యమానః ।
పశ్యత్సు నిత్యమితరేషు పరిచ్ఛదేషు
ప్రత్యాసనం భజతి కాంచనపాదుకే! త్వామ్ ।

294. అంతస్తృతీయనయనైః స్వయ ముత్తమాంగై
రావిర్భవిష్య దతిరిక్త ముఖాంబుజైర్వా ।
న్యస్యంతి రంగరసికస్య విహారకాలే
వారక్రమేణ కృతినో మణిపాదుకే! త్వామ్ ।

295. రంగేశ్వరే సమధిరూఢ విహంగరాజే
మాతంగరాజ విధృతాం మణిపాదుకే! త్వామ్ ।
అన్వాసతే విధృత చారు సితాతపత్రాః
స్వర్గౌకస స్సుభగ చామర లోలహస్తాః ।

296. విష్ణోఃపదం గతివశా దపరిత్యజంతీం
లోకేషు నిత్య విషమేషు సమప్రచారామ్ ।
అన్వేతు మర్హతి ధృతా మఖిలైస్సురేంద్రై
ర్గంగా కథంను గరుడధ్వజ పాదుకే! త్వామ్ ।

297. భిక్షా మపేక్ష్య దనుజేంద్ర గృహం ప్రయాతు
ర్గుప్త్యై గవాం విహరతో వహతశ్చ దూత్యమ్ ।
తత్తా దృశాని చరణావని! రంగభర్తు
స్త్వ త్సంగమేన సుభగాని విచేష్టితాని ।

298. నిర్వ్యాజ్యమాన నవతాళలయప్రథిమ్నా
ని ర్యంత్రణేన నిజసంచరణ క్రమేణ ।
మృద్నాసి రంగనృపతే ర్మణిపాదుకే! త్వం
దుఃఖాత్మకాన్ ప్రణమతాందురిత ప్రరోహాన్ ।

299. నిత్యం యదీవ జగతో మణిపాదరక్షే!
సత్తా స్థితి ప్రయతనేషు పరం నిదానమ్ ।
సోఽపి స్వతంత్ర చరిత స్త్వదధీన వృత్తిః
కావా కథా తది తరేషు మితం పచేషు ।

300. నిర్విష్టనాగశయనేన పరేణ పుంసా
న్యస్తేపదే త్వయి పదావని! లోకహేతోః ।
స్వర్గౌకసాం త్వదనుధావన తత్పరాణాం
సద్యఃపదాని విపదా మపదం భవంతి ।

301. శరదుపగమకాలే సంత్యజన్ యోగనిద్రాం
శరణముపగతానాం త్రాణహేతోఃప్రయాస్యన్ ।
జలధి దుహితురంకా న్మందమాదాయదేవి !
త్వయిఖలు విదధాతి స్వంపదం రంగనాథః ।

302. స్పృశసి పదసరోజం పాదుకే! నిర్విఘాతం
ప్రవిశసిచ సమస్తాం దేవి! శుద్ధాంత కక్ష్యామ్ ।
అపరమపి మురారేః పూర్వ మాభీరకన్యా
స్వభిసరణ విధినా మగ్రిమా సాక్షిణీ త్వమ్ ।

303. ప్రతిభవనమనన్యే పాదుకే! త్వత్ప్రభావాత్
వివిధ వపుషి దేవే విభ్రమద్యూతకాలే ।
అభిలషిత సపత్నీగేహ యాత్రా విఘాతం
గ్లహ యతి రహసి త్వాం షోడశస్త్రీ సహస్రమ్ ।

304. తటభువి యమునాయాశ్ఛన్నవృత్తౌ ముకుందే
ముహురధిగమహేతో ర్మృహ్యతాం యౌవతానామ్ ।
శమయితు మలమాసీచ్ఛంఖ చక్రాది చిహ్న
ప్రతిపద విచికిత్సాం పాదుకే! పద్ధతిస్తే ।

305. అధిగత బహుశాఖాన్మంజు వాచశ్శుకాదీన్
సరసిజ నిలయాయాః ప్రీతయే సంగ్రహీతుమ్ ।
ప్రకటిత గుణజాలం పాదుకే! రంగ బంధో
రుపవిష దటవీషు క్రీడితం త్వత్సనాథమ్ ।

306. ముని పరిషదిగీతం గౌతమీ రక్షణం తే
ముహురనుకలయంతో మంజువాచశ్శుకుంతాః ।
ఉషసి నిజకులాయాదుత్థితా దండకేషు
స్వయమపి పదరక్షే! స్వైరమామ్రేడయంతి ।

307. యమ నియమ విశుద్ధైర్యం నపశ్యంతిచిత్తైః
శ్రుతిషు చుళకమాత్రం దృశ్యతే యస్యభూమా।
సులభ నిఖిల భావం మాంసదృష్టే ర్జనస్య
స్వయముపహరసిత్వంపాదుకే! తంపుమాంసమ్ ।

308. నిధి మివనిరపాయం త్వామనాదృత్యమోహా
దహమివ మమదోషం భావయన్ క్షుద్రమర్థమ్ ।
మయిసతి కరుణాయాః పూర్ణపాత్రే త్వయాకిం
పరముపగమనీయః పాదుకే! రంగనాథః ।

309. కమ పి కనక సింధోః సైకతే సంచరంతం
కలశ జలధికన్యా మేధినీ దత్తహస్తమ్ ।
అనిశ మనుభవేయం పాదుకే! త్వయ్యధీనం
సుచరిత పరిపాకం సూరిభి స్సేవనీయమ్ ।

310. పరిసర ముపయాతా పాదుకే! పశ్య మాతః ।
కరణవిలయ ఖేదాత్ కాందిశీకే వివేకే ।
పురుష ముపనయంతీ పుండరీకాక్ష మగ్రే
పునరుదరనివాస క్లేశ విచ్ఛేదనం నః ।

311. సామే భూయాత్స్వపది భవతీ పాదుకే! తాపశాంత్యై
యామారూఢో దివమివ శుభైస్స్వైర్యమూనో మరుద్భిః ।
సాదా మన్యా సహకమలయా సహ్యజా వృద్ధిహేతుః
కాలే కాలే చరతి కరుణా వర్షుకః కృష్ణమేఘః ।

312. సత్యా ల్లోకా త్సకల మహితా త్స్థానతో వారఘూణాం
శంకేమాత స్సమధికగుణం సైకతం సహ్యజాయాః ।
పూర్వం పూర్వంచిరపరిచితం పాదుకే! యత్త్యజంత్యా
నీతో నాథస్తదిద మితరన్నీయతే న త్వయాఽసౌ ।

313. అగ్రేదేవి! త్వయి సుమనసా మగ్రిమై రంతరంగై
ర్విన్యస్తాయాం వినయగరిమా వర్జితా దుత్తమాంగాత్ ।
దత్తే పాదం దరముకుళితం త్వత్ప్రభావాతిశంకీ
దేవః శ్రీమాన్ దనుజమథనోఽత్ర యాత్రా స్వనన్యః ।

314. పారోదంతాన్ పరికలయితుం పాదుకే! సంచరిష్ణోః
వ్యక్తా వ్యక్తా వశిక విశిఖా వర్తనీ రంగభర్తుః ।
వేలాతీత శ్రుతిపరిమళైర్వ్యక్తి మభ్యేతికాల్యే
విన్యాసైస్తే విబుధ పరిషన్మౌళి విన్యాస ధన్యైః ।

315. ఆ సంస్కారా ద్ద్విజ పరిషదానిత్యమభ్యస్యమానా
శ్రేయోహేతు శ్శిరసి జగతః స్థాయినీ స్వేనభూమ్నా ।
రంగాధీశే స్వయముదయిని క్షేప్తు మంధం తమిస్రం
గాయత్రీవ త్రిచతురపదా గణ్యసే పాదుకే! త్వమ్ ।

316. భవతీం పరస్య పురుషస్య రంగిణో
మహిమానమేవ మణిపాదు! మన్మహే ।
కథ మన్యథా స్వ మహిమ ప్రతిష్ఠితః
ప్రతి తిష్ఠతి త్వయి పదాత్పదం ప్రభుః ।

317. తిథి రష్టమీ యదవతార వైభవాత్
ప్రథమా తిథిస్త్రిజగతా మజాయత ।
మణి పాదుకే! తముపనీయ వీథికా
స్వతిథీకరోషి తదనన్య చక్షుషామ్ ।

318. అపారప్రఖ్యాతే రశరణ శరణ్యాత్వ్యయశసా
ననుత్వం రంగేందో శ్చరణ కమలస్యాపి శరణమ్ ।
యయా లభ్యః పంగు ప్రభృతిభిరసౌ రంగనగర
ప్రతోళీపర్యంతే విధి రనఘవాచాం నిరవధిః ।

319. తత్తద్వాస గృహాంగణ ప్రణయినః శ్రీరంగశృంగారిణో
వాల్లభ్యాదవిభక్త మంథరగతి స్త్వంమే గతిః పాదుకే !
లీలా పంకజ హల్లకోత్పల గళన్మాధ్వీకసేకోత్థితా ।
యత్రామోద వికల్పనా వివృణుతే శుద్ధాంత వారక్రమమ్ ।

320. సంభవతు పాదరక్షే!
సత్య సుపర్ణాది రౌపవాహ్య గణః ।
యాత్రాసు రంగభర్తుః
ప్రథమ పరిస్పంద కారణం భవతీ ।

12. పుష్ప పద్ధతి

321. శౌరేః సంచారకాలేషు పుష్పవృష్టిర్దివశ్చ్యుతా ।
పర్య వస్యతి యత్రైవ ప్రపద్యే తాం పదావనీమ్ ।

322. దైవతం మమ జగత్త్రయార్చితా
దివ్యదంపతి విహార పాదుకా ।
పాణి పాదకమలార్పణాత్తయో
ర్యా భజత్యనుదినం సభాజనమ్ ।

323. తవరంగరాజ మణిపాదు! నతో
విహితా ర్హణస్స్వర సరిత్ప్రయసా ।
అవతంస చంద్రకళయా గిరిశో
నవ కేతకీ దళమివార్పయతి ।

324. కుసుమేషు సమర్పితేషు భక్తైః
త్వయి రంగేశపదావని! ప్రతీమః ।
శఠకోపమునే స్త్వదేక నామ్నః
సుభగం య త్సురభిత్వమస్యనిత్యమ్ ।

325. పదే పరస్మిన్ భువనే విధాతుః
పుణ్యైః ప్రసూనైః పులినే సరయ్వాః ।
మధ్యే చ పాదావని! సహ్య సింధో
రాసీ చ్చతుః స్థాన మివార్చనం తే ।

326. త్వయైవ రంగేశ్వర పాదరక్షే!
సౌభాగ్య మవ్యాహత మాప్తుకామాః ।
సురద్రుమాణాం ప్రసవైః సుజాతై
రభ్యర్చయం త్యప్సరసో ముహుస్త్వామ్ ।

327. నివేశితాం రంగపతేః పదాబ్జే
మన్యే సపర్యాం, మణిపాదరక్షే !
త్వ దర్పణా దాపతితా మపశ్య
ద్గాండీవ ధన్వా గిరిశోత్తమాంగే ।

328. పత్రాణి రంగనృపతే ర్మణి పాదరక్షే !
ద్విత్రాణ్యపి త్వయి సమర్ప్య విభూతికామాః ।
పర్యాయ లబ్ధ పురుహూత పదాః శచీనాం
పత్రాంకురాణి విలిఖంతి పయోధరేషు ।

329. నిర్వర్తయంతి తవయేనిచితానిపుష్పైః
వైహారికాణ్యుపవనాని వసుంధరాయామ్ ।
కాలేన తే కమలలోచన పాదరక్షే!
క్రీడంతి నందనవనే కృతినః పుమాంసః ।

330. అర్చంతి యే మధుభిదో మణి పాదరక్షే!
భావాత్మకై రుపహరం భవతీం ప్రసూనైః ।
మందారదామ సుభగై ర్మకుటై రజస్రం
బృందారకాః సురభయంతి పదం తదీయమ్ ।

331. అస్పృష్ట దోష పరిమర్శ మలంఘ్య మన్యో
హస్తాపచేయ మఖిలం పురుషార్థవర్గమ్ ।
చిత్రం జనార్దన పదావని! సాధకానాం
త్వయ్యర్పితాస్సుమనసః సహసా ఫలంతి ।

332. వందారుభిః సురగణైస్త్వయి సంప్రయుక్తా
మాలా విభాతి మధుసూదన పాదరక్షే!
విక్రాంత విష్ణుపద సంశ్రయ బద్ధసఖ్యా
భాగీరథీవ పరిరంభణ కాంక్షిణీ తే ।

333. యేనామ రంగనృపతే ర్మణిపాదుకే! త్వా
మభ్యర్చయంతి కమలై రధికర్తు కామాః ।
ఆరోప యత్యవహితా నియతిః క్రమాత్తాన్
కల్పాంతరీయ కమలాసన పత్రికాసు ।

334. త్వయ్యర్పితాని మనుజైర్మణి పాదరక్షే!
దూర్వాంకురాణి సులభా న్యథవా తులస్యాః ।
సారాధికాః సపది రంగ నరేంద్ర శక్త్యా
సంసార నాగదమనౌషధయో భవంతి ।

335. ఆరాధ్యనూన మసురార్దన పాదుకే! త్వా
మాముష్మికాయ విభవాయ సహస్ర పత్రైః ।
మన్వంతరేషు పరివర్తిషుదేవి! మర్త్యాః
పర్యాయతః పరిణమంతి సహస్రనేత్రాః ।

336. ధన్యైస్త్వయి త్రిదశ రక్షక పాదరక్షే!
పుష్పాని కాంచన మయాని సమర్పితాని ।
విస్రంసినా వినమతో గిరిశోత్త మాంగా
దార గ్వధేన మిళితా న్యపృథగ్భవంతి ।

337. విశ్వో ప సర్గశమనం త్వయిమన్యమానై

ర్త్రైమానికైః ప్రణిహితం మణిపాదరక్షే !

పద్మా సహాయ పద పద్మనఖార్చిష స్తే

పుష్పో పహార విభవం పునరుక్త యంతి ।

338. నాకౌకసాం శమయితుం పరిపంథివర్గా

న్నాథే పదం త్వయినివేశయితుం ప్రవృత్తే ।

త్వ త్సంశ్రితాం విజహతస్తులసీం వమంతి

ప్రస్థాన కాహళరవాన్ ప్రథమం ద్విరేఫాః ।

339. రంగేశ పాద పరిభోగ సుజాతగంధాం

సంప్రాప్యదేవి! భవతీం సహదివ్యపుష్పైః ।

ని త్యో పదర్శితరసం నకిలాద్రియంతే

నాభీసరోజ మపి నందన చంచరీకాః ।

340. ప్రాగేవ కాంచన పదావని! పుష్పవర్షాత్

సంవర్తితే శమితదైత్యభయైః సురేంద్రైః ।

పద్మేక్షణస్యపదపద్మ నివేశలాభే

పుష్పాభిషేకముచితం ప్రతిపద్యసే త్వమ్ ।

341. దిశిదిశి మునిపత్న్యో దండకారణ్యభాగే

నజహతి బహుమానా న్మానమద్యాపిమూలమ్ ।

రఘుపతి పదరక్షే! త్వత్పరిష్కారహే తో

రపచిత కుసుమానా మాశ్రమానోకహానామ్ ।

342. ఘటయసి పరిపూర్ణాన్ కృష్ణమేఘప్రచారే
కృతిభి రుపహృతైస్త్వం కేతకీ గర్భపత్రైః ।
వరతను పరిణామా ద్వామతః శ్యామలానాం
ప్రణతి సమయలగ్నాన్ పాదుకే! మౌళిచంద్రాన్ ॥

343. పరిచరణ నియుక్తైః పాదుకే! రంగభర్తుః
పవన తనయ ముఖ్యై రర్పితాం త్వత్సమీపే ।
వినత విధి ముఖేభ్యో నిర్విశేషం ద్విరేఫాః
కథమపి విభజంతే కాంచనీం పద్మపంక్తిమ్ ॥

344. విధి శివ పురుహూత స్పర్శితైర్దివ్యపుష్పై
స్త్వయి సహ నిపతంత స్తత్తదుద్యాన భృంగాః ।
మధురిపు పదరక్షే! మంజుభిః స్వైర్నినాదై
రవిదిత పరమార్థా న్మాన మధ్యా పయంతి ॥

345. ప్రశమయతి జనానాం సంజ్వరం రంగభర్తుః
పరిసర చలితానాం పాదుకే! చామరాణామ్ ।
అనుదిన ముపయాతై రుత్థితం దివ్యపుష్పై
ర్నిగమ పరిమళం తే నిర్విశన్గంధవాహః ॥

346. అఖిలభువనరక్షా నాటికాం దర్శయిష్యన్
అనిమిష తరుపుష్పై రర్చితే రంగమధ్యే ।
అభినయ మనురూపం శిక్షయత్యాత్మనా త్వాం
ప్రథమ విహితలాస్యః పాదుకే! రంగనాథః ॥

347. అగళితనిజరాగాం దేవి! విష్ణోః పదంతత్
త్రిభువన మహనీయాం ప్రాప్య సంధ్యామివత్వామ్ ।
భవతి విబుధ ముక్తైః స్పష్టతారానుషంగం
పరిసర పతితైస్తే పారిజాత ప్రసూనైః ॥

348. వ్యంజంత్యేతే విభవ మనఘం రంజయంతః శ్రుతీర్నః
ప్రాధ్వం రంగక్షితిపతిపదం పాదుకే! ధారయంత్యాః ।
నాదై రంతర్నిహితనిగమై ర్నందనోద్యానభృంగాః
దివ్యైః పుష్పైః స్నపిత వపుషోదేవి! సాస్నాతికాస్తే ॥

349. కిం పుష్పైస్తులసీ దళైరపికృతం దూర్వాఽపిదూరే స్థితా
త్వ త్పూజాసు ముకుందపాదు! కృపయా త్వంకామధేనుః సతామ్ ।
ప్రత్యగ్రాహృత దర్భపల్లవ లవగ్రాసాభిలాషోన్ముఖీ
ధేనుస్తిష్ఠతు సావసిష్ఠ భవన ద్వారోపకంఠ స్థలే ॥

350. చూడారగ్వధరజసా చూర్ణస్నపనం విధాయ తే పూర్వమ్ ।
రంగేశ పాదుకే! త్వామభిషించతి మౌళిగంగయా శంభుః ॥

13. పరాగ పద్ధతి

351. పాంతు వః పద్మనాభస్యపాదుకాకేళిపాంసవః ।
అహల్యాదేహనిర్మాణ పర్యాయ పరమాణవః ॥

352. తవ సంచరణాద్రజో విధూతం
యదిదం రంగనరేంద్ర పాదరక్షే!
అలమేత దనావిలాని కర్తుం
కతక క్షోద ఇవాశు మానసాని ॥

353. పునరుక్త పితామహానుభావాః
పురుషాఃకేచిదమీ పునంతి విశ్వమ్ ।
మధువైరి పదారవింద బంధో
రపరాగాస్తవ పాదుకే! పరాగైః ।

354. అభియుక్త జనో నిజార్భకాణాం
బహుశో రంగనరేంద్ర పాదరక్షే!
అవలేప పిశాచమోచనార్థం
రజసా లింపతి తావకేన దేహమ్ ।

355. శిరసా పరిగృహ్య లోకపాలాః
తవ రంగేశ్వర పాదుకే! రజాంసి ।
విషమేషు బలేషు దానవానాం
వ్యపనీతా న్యశిరస్త్ర మావిశంతి ।

356. కృతినఃశిరసా సముద్వహంతః
కతిచిత్కేశవ పాదుకే! రజస్తే ।
రజస స్తమసోఽపి దూరభూతం
పరి పశ్యంతి విశుద్ధమేవ సత్త్వమ్ ।

357. అధికం పదమాశ్రితోఽపి వేధాః
ప్రయతో రంగధురీణ పాదరక్షే!
అభివాంఛతి సంగమం పరాగై
రభిజాతైస్తవ దేవి! నాభిజాతః ।

358. శుద్ధ సత్త్వ వపుషైవభవత్యా, పాదుకే! విరజసా హరిపాదౌ ।
అస్తుకిం పునరిదంరజసాతే, శుద్ధసత్త్వమయతా మనుజానామ్ ।

359. తద్రజ స్తవ తనోతి పాదుకే!
మానసా న్యకఠినానిదేహినామ్ ।
ప్రస్తరస్య పదవీ గతస్యయత్
వ్యాచకార మునిధర్మదారతామ్ ।

360. రంగేశయస్య పురుషస్య జగద్విభూత్యై
రథ్యా పరిక్రమవిధౌ మణిపాదరక్షే!
సీమంతదేశ మనవద్య సరస్వతీనాం
సిందూరయంతి భవతీచలితాః పరాగాః ।

361. మాన్యేన రంగనృపతే ర్మణిపాదరక్షే!
చూడా పదాని రజసా తవ భూషయంతః ।
కాలక్రమేణ భజతాం కమలాసనత్వం
నాభీసరోజ రజసాం నివసంతి మధ్యే ।

362. మాతర్ముకుంద చరణావని! తావకీనా
శ్చింతా వశీకరణ చూర్ణ విశేషకల్పాః ।
సంచారపాంసు కణికాః శిరసా వహంతో
విశ్వంపునంతి పదపద్మపరాగలేశైః ।

363. ఆయోజితా న్యమలధీభిరనన్య లభ్యే
పాదావని! శ్రుతివధూ పటవాసకృత్యే ।
త్వత్సంచర ప్రచలితాని రజాంసి శౌరేః
ప్రఖ్యాపయంతి పదపద్మ పరాగశోభామ్ ।

364. మూర్ధాన మంబ! మురభి న్మణి పాదరక్షే!
యేషాం కదాఽపి రజసా భవతీ పునా తి ।
త్వామేవ తేసుకృతినః స్నపయంతి కాలే
మందారదామ రజసా.మకుటచ్యుతేన ।

365. రథ్యా విహారరజసా పరిధూసరాంగీం
రంగేశ్వరస్య లలితేషు మహోత్సవేషు ।
ప్రస్ఫోటయ త్యవనతో మణిపాదుకే! త్వాం
గౌరీపతిః స్వయ మిభాజిన పల్లవేన ।

366. నేదీయసాం నిజపరాగ నివేశపూర్వం
స్పృష్ట్వాశిరాంసి భవతీ భవరోగభాజామ్ ।
గాఢంనిపీడ్య గరుడధ్వజ పాదరక్షే !
మానగ్రహం శమయతీవ పరై రసాధ్యమ్ ।

367. ఆపాదవల్లవతనో రకుమారయూనః
పాదావని! ప్రవిశతో యమునా నికుంజాన్ ।
ఆసీ దనంగ సమరా త్వరతః ప్రవృత్తః
సేనా పరాగ ఇవతే పదవీ పరాగః ।

368. గంగాపగా తటలతాగృహ మాశ్రయంత్యాః
పాదావని! ప్రచలితం పదవీ రజస్తే ।
ప్రాయేణ పావనతమం ప్రణతస్య శంభో
రుద్ధూళనం కిమపి నూతన మాతనోతి ।

369. అంతే తదా త్వమవిలంబిత మానయంతీ
రంగాద్భుజంగశయనం మణిపాదరక్షే।
కామంనివర్తయితు మర్హసి సంజ్వరం మే
కర్పూర చూర్ణపటలై రివ ధూళిభిస్తే।

370. రంగేశ పాద సహధర్మచరి! త్వదీయాన్
మౌళౌనివేశ్య మహితాన్ పదవీ పరాగాన్।
సంత స్త్రివర్గ పదవీ మతి లంఘయంతో
మౌళౌ పదం విదధతే విబుధే శ్వరాణామ్।

371. మాత స్తదా మాధవ పాదరక్షే!
త్వయి ప్రసక్తం త్వర యోపయాంత్యామ్।
పరామృశేయం పదవీపరాగం
ప్రాణైః ప్రయాణాయ సముజ్జిహానైః।

372. తథాగతా రాఘవ పాదరక్షే!
సంపశ్య మానేషు తపోధనేషు।
ఆసీదహల్యాతవ పాంసులేశై
రపాంసులానాం స్వయమగ్ర గణ్యా।

373. పశ్యామి పద్మేక్షణ పాదరక్షే!
భవాంబుధిం పాతు మివప్రవృత్తాన్।
భక్తోపయానత్వరయా భవత్యాః
పర్యస్య మానాన్ పదవీ పరాగాన్।

374. పంచాయుధీ భూషణమేవ శౌరేః
యతస్త్వమేతే మణిపాదరక్షే !
వితన్వతే వ్యాప్తదిశః పరాగాః
శాంతోదయాన్ శత్రుచమూపరాగాన్ ।

375. పరిణతి మకరోరాం ప్రాప్తయా యత్ప్రభావాత్
అలభత శిలయా స్వాన్ గౌతమో ధర్మదారాన్ ।
పున రుపజని శంకా వారకం పాదుకే! తత్
ప్రశమయతి రజస్తే రాగయోగం ప్రజానామ్ ।

376. రజని విగమకాలే రామగాథాం పఠంతః
కుశిక తనయముఖ్యాః పాదుకే! భావయంతే ।
ఉపల శకలసక్తై స్త్వత్పరాగై రకాండే
జనిత మునికళత్రాన్ దండకారణ్యభాగాన్ ।

377. శుభసరణిరజోభిః శోభయంతీ ధరిత్రీం
పరిణతి రమణీయాన్ ప్రస్తరంతీ పుమర్థాన్ ।
భవసి భువన వంద్యా పాదుకే! రంగభర్తుః
శరణముపగతానాంశాశ్వతీ కామధేనుః ।

378. పవన తరళితస్తే పాదుకే! రంగభర్తు
ర్విహరణ సమయేషు వ్యాప్త విశ్వఃపరాగః ।
విషమ విషయవర్త్మ వ్యాకులానా మజస్రం
వ్యపనయతి జనానాం వాసనారేణుజాలమ్ ।

379. నిష్ప్రత్యూహ ముపాసిషీమహి ముహుర్నిశ్శేషదోషచ్ఛిదో
నిత్యం రంగధురంధరస్యనిగమస్తో మార్చితే పాదుకే।
ధత్తే మూర్ధభి రాదిపద్మజనితా తత్తాదృశీ సంతతి
ర్యత్సంచార పవిత్రిత క్షితిరజః పంక్తిం చతుష్పంచషైః।

380. రజసా పరోరజస్తన్నఖలు నలంఘ్యేత భగవతోఽపి పదమ్ ।
కిముత హృదయం మదీయం భవతీయదినామ పాదుకే! నస్యాత్ ।

REVIEW

By Dr. (Mrs) Prema Nandakumar

SRIMAD VEDANTA DESIKA PRANEETA PADUKA SAHASRAM (Telugu Commentary 'Ramaneeya' by K.V. Raghavacharya) - Volume I (Sri Malola Granthamala, Sri Ahobila Mutt, Durgabai Deshmukh Colony, Hyderabad - 500 013. 1996. - Rs. 50)

When you walk around the Chitrai or Uttara streets of Srirangam, you will often be stopped on your tracks by a mesmerical chanting from some house or other. Drawing near, you will find a group of housewives seriously engaged in reciting the **Paduka Sahasram.** Or, it could be a house or a sannidhi in Nanganallur. Such is the enduring charm of Vedanta Desika's celebrated garland of thousand verses that celebrates the glory and grandeur of the Sandals of Sri Ranganatha. When the **Paduka Sahasram** is recited, the atmosphere automatically gets surcharged with sattwik devotion.

Paduka Sahasram is also the delight of scholars who revel in Sanskrit prosody. The images and similes overwhelm the connoisseur for each sloka is a colour slide that captures a scene in all its dramatic vibrancy. Why, the poem carries drama even in its conneption and execution !

It is said that Pillai Lokacharya's brother, Alagiya Perumal Nayinar, once challenged Vedanta Desika to test the worth of the title, 'Kavi-Tarkika-Simha' that had been awarded to the latter. Each was to compose one thousand verses in praise of Lord Ranganatha in the course of one night. While Nayinar could complete only five hundred for his **Pada Kamala Sahasram,** Desika completed the stipulated one thousand during the night. It must have been a friendly contest indeed, for, both were renowned devotees of the Lord.

Paduka Sahasram turned out to be very popular, for, this well-wrought poem is inspired mainly by Valmiki's **Ramayana.** Again, as the commentators gave an intuitive interpretation of the poem as a homage to Nammalwar (known as Satari, the Feet of the Lord), the poem found a permanent niche in the devotional literature of the Srivaishnavas. It may be pointed out here that both the Tenkalai and Vadakalai sects of the Srivaishnava Sampradaya love and revere the poem as an important **Parayana grantha.**

Though Desika is celebrated for his devotional hymns, it is believed that **Paduka Sahasram** is the very best among them. Discussing its special place in the Desika canon, Dr. Satyavrata Singh says :

"In the Paduka Sahasra, we hear the unmistakable voice of the soul of our poet. All his Srivaisnava religious aspirations, all his Visishtadvaitic spiritual contemplations find a poetic articulation in this hymn. The origin of this hymn on the Paduka lies deep in the life of the poet. The Paduka is the great symbol of Divine Grace."

Sanskrit commentaries have been written on the **Paduka Sahasram** and it is said that apart from that of Bharadhwaja Srinivasa, Appayya Dikshita wrote one as well. There have been Tamil commentaries too, including a detailed one by Sri Ramanuja Vedanta Mahadesikan, known as Terazhundur Andavan. Kannada commentators have dealt with the poem. However, during the last 700 years since the poem came to be written, there has been no Telugu commentary. It is the good fortune of the Srivaishnava world that Sri K.V. Raghavacharya has come forward to gift us with a lucid, scholarly and interesting exegesis of the poem. The present volume deals with the first five cantos that contain one hundred and forty slokas.

A brief foreword tells us that Vedanta Desika was born at Thooppul near Knchipuram seven hundred and twenty eight years ago. He received his training under his maternal uncle, Atreya Ramanuja (Appullar) and lived a long life as a highly respected teacher, poet, scholar, dramatist and philosopher. He has handled Prakrit, Sanskrit, Tamil and Manipravala languages in his works. He was a versatile genius and wrote extensively on Srivaishnava theology as well.

Paduka Sahasram opens with 'Prastava Paddhati', and is led by the sloka, 'Santah Sriranga prithvisa':

"All hail the good people who place on their crown the sandals that guard the feet of Lord Ranganatha. The dust of their lotus feet guards the worlds."

Sri Raghavacharya's commentary 'Ramaneeya' is written in pellucid Telugu. After giving the gist of the sloka, he proceeds to bring out the special properties of the sloka in as dramatic a manner as possible, as if he were speaking to an audience physically present before him. Thus, the above mentioned verse is described as the Mangala Sloka that indicates the subject of the work :

"Sri Ranganatha is the Lord of the **ubhaya vibhuti** (of here and the hereafter). All the incarnations of the Lord are for guarding the good people. Hence Desika hails and prays for the good of the vibhava (incarnation) and archa (idol) forms, for their feet, for the sandals that guard the feet, for the good people who surrender to the sandals and worship them, their lotus-like feet and the dust of those feet. Thus at the very beginning the greatness of the devotees is underlined (bhagavata prasamsa)."

The commentator finds the use of 'Ranga' as leading to the idea of a stage and to the presence of Neela Devi. The importance of Srirangam is pointed out by referring to Ramanujacharya, the Vedas, Ayodhya, Tondar-adippodi Alwar, Nammalwar; the Upanishads, Tirumangai Alwar, the Ramanayana and Acharya Hrudayam help us draw near the important significances of the word 'santah', people who have realised the presence of the Supreme. Indeed it is the 'santah' who have commanded Desika to take up the writing of **Paduka Sahasram** as a challenge. The dust of the feet of these good people purifies the atmosphere constantly.

Reminding the audience of the adage that the Questers after the Divine walk on the earth and the skies and also fly around the atmosphere to purify the spaces, Sri Raghavacharya places supplementary statements on the subject culled from **Naradiyam** and concludes his commentay on the sloka with references to the types from Sanskrit Poetics (Alankara Sastra) used here and alerts us to a comparison with Nammalwar's **Tiruvaimoli** which is also a garland of more than one thousand verses in Tamil.

There is this fullness throughout the volume as the learned commentator draws from his rich granary of scholarship, but never does he use an unseemly (non-auchitya) comparison or untenable proposition. The poem on hand takes precedence and the exegesis is not allowed to snuff it out. The epics of Valmiki and Vyasa and the verses of the Alwars act as the two invincible and inevitable guides to spell out our steps in understanding the sloka on hand. Incidentally, we gain new insights into the contents of these epics of the Nalayira Divya prabhandham. The 3rd verse of 'Prabhava Paddhati' :

"Sandals that guard the feet of Madhusudana ! Valmiki rose out of the ears of Mother Earth, eager to explain the true meaning of the Vedas. The epics indited by Valmiki and Vyasa are like two eyes granted to us to look at the greatness of yourself."

Sri Raghavacharya in his detailed comment says in passing that since Valmiki and Sita were children of Mother Earth, it was natural for the brother to look after the sister when she had been cast

away by Rama. "He guarded his pregnant sister in his own Ashrama, helped her deliver two boys, taught the boys as a beloved uncle and made them recite sweetly the story of the Ramayana and got them back their rich heritage."

Why, even the Bhagavata speaks of the greatness of the sandals through Uddhava who worships them:

"We must have two kinds of eyes to gather in the greatnes of the sandals. After all, our physical eye may suffer loss due to old age. We do speak of "that which cannot be described, but can be visioned." The power of 'seeing' (pratyaksha pramana) is very strong. The Sound is, of course, the 'visionary eye.'

Sri Raghavacharya grows ecstatic as he unveils the inlaid significances of the verse of Desika. In the process, we too lave in the spaces of devotional ecstasy. Desika's poetic imagination leaps down from the reaches above the merely mental level, as revealed by the commentator. The twelfth verse of 'Samarpana Paddhati' places before us one of those unforgettable scenes in Valmiki. Bharata's entreaties have been in vain, but Rama has agreed to his brother's wish. He steps back from his sandals and Bharata takes them up and immediately places them on his head :

"O, gem-encrusted sandals ! Bharata took up yourself who had been released from the lotus-like feet of the great man, Rama, and with love placed you on his matted locks. He looked as beatutiful as shiva whose crown is ornamented with the Ganges."

Indeed, had not Ganges too flown from the feet of the Lord who had incarnated as Trivikrama ! Desika uses the word, 'Girisa' for Shiva to connect Bharata to a like posture, as he is standing on the Chitrakoota hill :

"Seeking to overcome the wrong of being hailed as the Supreme (paradevatvam), Shiva accepted the water that flowed from the feet of the Lord and became Paramashiva. Seeking to overcome the wrong of having tried to secure the crown (rajyapavadam), Bharata accepted the sandals of Sri Rama and became a pure person."

Whether it is a comparison with the waters of the Ganges that are used for similes, or gaining the term Satajit, or Nammalwar re-creating the scriptures in Tamil or a devotee gazing at the form of Lord Ranmagnatha on the banks of golden Kaveri or the poet himself visualising the Sesha-Seshi bhava that relates the Lord with the devotee, the vividly realized settings posited by Vedanta Desika are patiently and expertly explained to us by the commentator. Now we know why the recitaion and worship of Desika's **Paduka Sahasram** has been sustained down the centuries. It is not superstitious veneration but a soul's closeness effected by the rhythms of the poem which is imbedded with ever so many myths, legends and sayings that is dear to the Indian culture and the Indian heart. The verbal force in the poem has made it a highly successful work for group recitation. The Telugu commentary adds to the pleasure of the recitation.

The production-values of the volume are enviable and the thoughful printing of the text of the 140 verses in Sanskrit and Telugu at the end to help while reciting them is commendable. For the absurdly low price of the volume, we even get to have an excellent portrait of Vedanta Desika at Sri Ahobila Mutt Sannidhi facing the temple of Sri Ranganayaki in Srirangam. May the Divya Dampathis grant long life and health to Sri Raghavacharya to complete the 'Ramaneeya' commentary for Paduka Sahasram and also reveal in a like manner the rest of the treasures gifted to us by Vedanta Desika.

Prema Nandakumar

(Courtesy, New Swatantria Times, Hyderabad, January 1998)